# శ్రీ విష్ణు సహస్రనామము

( అష్టమ భాగము ౭౦౨-౮౦౨ నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతీకుమార్

# శ్రీ విష్ణు సహస్రనామము

( అష్టమ భాగము  ౭౦౨-౮౦౨ నామ వివరణ )



## మాస్టర్ కె. పార్వతీకుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, 1993 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Books రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ చతుర్ధ భాగము

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ EK గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణుసహస్రనామములో నామ విభజనను ప్రాతిపదికగా తీసుకునుట జరిగినది.

ఈ ప్రయత్నములో పాల్గొనుచున్నవారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి మాస్టరుగారి ఆశీస్సులు అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ విశ్వావసు నామసంవత్సర బాపట్ల గురుపూజల సందర్భంగా శ్రీ విష్ణు సహస్రనామ వివరణ అష్టమ భాగము - 702 నుండి 802 నామములకు- శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్పారు. మనకి హృదయమునందు సింహాము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ఘ్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు,

బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు

తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేశారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేశాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం

బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకోనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క

ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని 'విశ్వం విష్ణుర్వషట్కారో' అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, 'విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు' అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్ళీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్ళీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం

మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటీ? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ freshగా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే.

వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పుకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పుకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పుకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పుకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పుకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పుకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే

దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లిపోతుంది. మంచిరోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశృతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశృతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము

చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్టానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్టానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్వం గూర్చి రాసామా, భగవత్ తత్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క

నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్ధము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under-current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్ఠానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతీ కుమార్

# విషయ సూచిక


702 మహాక్రతుః ....................................................1

703, 704, 705 మహాయజ్వా, మహాయజ్ఞః, మహాహవిః .................11

706 స్తవ్యః ...................................................... 20

707 స్తవప్రియః .................................................. 24

708, 709, 710 స్తోత్రం, స్తుతః, స్తోతా.................................. 26

711, 712 రణప్రియః, పూర్ణః .......................................... 27

713 పూరయితా ................................................. 32

714, 715 పుణ్యః, పుణ్యకీర్తిః.......................................... 35

716 అనామయః .................................................. 36

717 మనోజవః ....................................................41

718 తీర్థకరః....................................................... 49

719 వసురేతా ................................................... 54

720 వసుప్రదః ................................................... 58

721, 722 వసుప్రదః, వాసుదేవః .................................... 58

723 వసుః.......................................................... 62

724 వసుమనాః ................................................. 66

725 హవిః.......................................................... 69

726 సద్గతిః........................................................ 70

727 సత్కృతిః...................................................... 76

728 సత్తా...........................................................81

729 సద్భూతిః......................................................86

730 సత్పరాయణః.................................................88

731 శూరసేనః.............................................................. 91
732 యదుశ్రేష్ఠః..............................................................93
733 సన్నివాసః ..............................................................94
734 సుయామునః ..............................................................95
735 భూతావాసః..............................................................97
736 వాసుదేవః .............................................................. 105
737 సర్వాసునిలయః..............................................................113
738 అనలః ..............................................................115
739 దర్పహా ..............................................................117
740 దర్పదః.............................................................. 120
741 అదృప్తః.............................................................. 127
742 దుర్ధరః .............................................................. 133
743, 744 అథ, అపరాజితః .............................................................. 135
745, 746 విశ్వమూర్తిః, మహామూర్తిః .............................................................. 140
747 దీప్తమూర్తిః ..............................................................144
748 అమూర్తిమాన్.............................................................. 146
749 అనేకమూర్తిః .............................................................. 146
750 అవ్యక్తః.............................................................. 148
751 శతమూర్తిః.............................................................. 150
752 శతాననః .............................................................. 153
753, 754 ఏకః, అనేకః.............................................................. 154
755, 756, 757, 758, 759 స్తవః, కః, కిం, యత్, తత్పదమ్............ 155
760 అనుత్తమమ్ .............................................................. 157

761 లోకబంధుః....................................................158

762 లోకనాథః....................................................161

763 మాధవః ....................................................161

764 భక్తవత్సలః ....................................................163

765 సువర్ణవర్ణః ....................................................166

766 హేమాంగః....................................................170

767 వరాంగః....................................................171

768 చందనాంగదీ....................................................173

769 వీరహా....................................................179

770 విషమః....................................................181

771, 772, 773, 774 శూన్యః, ఘృతాశీః అచలః, చలః....................190

775 అమానీ ....................................................198

776 మానదో ....................................................205

777 మాన్యః....................................................207

778 లోకస్వామి ....................................................212

779 త్రిలోకధృత్ ....................................................213

780 సుమేధాః ....................................................215

781 మేధజః ....................................................217

782 ధన్యః ....................................................218

783 సత్యమేధః ....................................................220

784 ధరాధరః....................................................222

785 తేజః ....................................................224

786 వృషః ....................................................227

787 ద్యుతిధరః ..........................................................................228

788, 789 సర్వశస్త్రభృతాం, వరః..........................................................230

790, 791, 792 793 ప్రగ్రహః, నిగ్రహః, వ్యగ్రః, నైకశృంగః...............233

794 గదాగ్రజః ..........................................................................241

795 చతుర్మూర్తిః......................................................................246

796 చతుర్బాహుః.................................................................... 251

797 చతుర్వ్యూహః....................................................................252

798 చతుర్గతిః ..........................................................................254

799 చతురాత్మా.........................................................................262

800 చతుర్భావః ........................................................................262

801 చతుర్వేదవిత్ .....................................................................262

802 ఏకపాత్..............................................................................273

## ౭౦౨ మహాక్రతుః

మహా క్రమంలో జరిగేదే మహాక్రతువు. క్రతువు అంటే ఒక పద్ధతి ప్రకారం నిర్మాణం చేయడం. సృష్టి ఒక పద్ధతి ప్రకారం నిర్మాణం చేయబడి ఏర్పడింది. ఈ సృష్టి అంతా మహాక్రతువుగానూ, మహా యజ్ఞంగానూ నడుస్తుంది. ఈ పాదంలోని 4 నామాలూ ఒకే తత్త్వానికి సంబంధించిన వివరాలు. 'యజ్వా' అంటే యజ్ఞాన్ని నడిపించేవాడు. మహాయజ్వా అంటే ఏ క్రతువైతే నిర్వహించాలో ఆ క్రతువుని నిర్వర్తింపచేసేవాడు. 'మహాయజ్ఞః' ఆ యజ్ఞంగా కూడా తానే వున్నాడు. చేస్తున్న క్రతువు, చేయించేవాడు, చేయబడుతున్న యజ్ఞము, దానికి తానే హవిస్సుగా సమర్పణ చేసుకు వాడు 'మహాహవిః' . భగవంతుని ఈ 4 రకాలుగా దర్శనం చేయాలి. ఏ క్రతువు ఎక్కడ జరుగుతున్నా, ఎవరు చేస్తున్నారు, ఏ బట్టలు కట్టుకున్నారూ వగైరాలు చూడడం కాకుండా ఆ మొత్తం క్రతువు స్వరూపాన్ని భగవంతుడిగా భావన చేయాలి. 'మహాయజ్వాః' దాన్ని నిర్వర్తించేవాడి రూపంలో కూడా ఆ భగవంతుడే వున్నాడని భావన చెయ్యాలి. జరుగుతున్న యజ్ఞమంతా ఆయనే అని భావన చేయాలి. అందులో వేసే సమిధలు, నెయ్యి, ఇతర పదార్థాలను హవిస్సులు అంటారు. అది కూడా భగవంతుడని భావన చేయాలి. ఇది మనం చూసే క్రతువులో నుండి మనం నేర్చుకోవలసినది. సాధన పరంగా మనం చేయవలసినది. విష్ణు సహస్రనామం లో ప్రత్యేకత ఏమంటే కనపడే చిన్న విషయం నుండి పెద్ద విషయం వరకు భగవంతుని అస్తిత్వంగా భావన చేయడం. ఇందులోని సాధన 'విశ్వం, విష్ణుః' కదా! కనుక విశ్వరూపం లో విష్ణువే ఉన్నాడనే భావన స్థిరపడడం కోసం వెయ్యి రకాలుగా చెప్పారన్నమాట. అప్పటికీ మనకి తెమలక పోతే, 'ఇప్పటికి నీకు అవసరం లేదు. మళ్లీ కలుసుకుందాం' అని చెప్తారు. ఇప్పటివరకూ నామాలలో భగవంతుణ్ణి ఈ దృశ్యమాన జగత్తులో ఎన్ని రకాలుగా చూపిస్తూ వచ్చారు. దృశ్యమాన జగత్తులో భగవంతుడు ఏ విధంగా అస్తిత్వం చెంది ఉన్నాడో చూపిస్తూంటే, దాన్ని నువ్వు చూడడం మొదలు పెడితే, కనబడే దాంట్లోంచి కనబడని తత్త్వం నీకు అవగాహన అవుతుంది. అనుభూతి అవుతుంది. తద్వారా ఆనందం లభిస్తుంది. అందుకే కనపడే ప్రతి వాటిలోనూ దాన్నే ప్రతిపాదించడం, చూపించడం, అనేది ఈ నామాల్లో చాలా ముఖ్యమైన విషయం. అదీ భాగవత మార్గం. అందుకని క్రతువు తీసుకున్నాడు. మహాక్రతువు! ఈ క్రతువు ఎంతటి క్రతువు అంటే ఏమీ లేని చోటు నుండి 3 పుట్టుకు వస్తాయి. సృష్టి అంతా త్రిగుణాత్మకంగా, త్రిభుజంగా, త్రివిధంగా ఏర్పడుతుంటుంది అని చెప్తారు. అందుకనే త్రయీ విద్య అని ఇచ్చారు. అందుకనే భారతంలో ఒక శ్లోకం ఉన్నది.

త్రయః త్రింశత్ సహస్రాణి, త్రయః త్రింశత్ శతానిచ,
త్రయః త్రింశతి దేవానాం, సృష్టి సంక్షేప లక్షణాః

అని అంటే 3, 33, 333, 3,333, 33,333---- యిలా అన్నీ 3 తోనే. ముప్పై మూడు కోట్ల దేవతలు అని చెప్తారు. అర్థం ఏమంటే అన్నీ మూడు నుండి మూడు మూడుగా గా వస్తుంటాయి అని. అసలు ఏమీ లేని తత్త్వంలో నుండి ముందు మూడు వస్తాయి. ఆ 3 లోంచి మరో మూడు, అలా ప్రతి దాన్లోంచి 3,3 గా దిగి రావడమే త్రిగుణాత్మకంగా సృష్టి ఏర్పడడం. అసలు ఏమీ లేనట్లుగా కనపడే భగవత్తత్త్వం నుండి సంకల్పం ఒకటి వస్తుంది. మనం కూడా ఏ పని లేకుండా కూర్చుంటే మన నుండి కూడా సంకల్పం వస్తుంది. ఎందుకలా వస్తుందంటే అసలు తత్త్వంలోనే ఉన్నది. కనక మనలో కూడా వున్నది. ఆయన లోంచి వచ్చే సంకల్పాన్ని 'అమ్మవారు' అన్నారు. 'ప్రకృతి' అని అన్నారు. అందుకే మన ప్రకృతి కూడా మనలోంచి ఏదో ఒక సంకల్పం తెప్పిస్తుంది. ఊరికే కూర్చుంటే ఏవో ఒకటి వస్తూ ఉంటాయి. ఊరికే కూర్చోక పోతే మంచిది. అప్పుడు ఏదో ఒకటే వస్తుంది. ఏదో ఒక పని చేస్తుంటే ఒక సంకల్పం ఉంటుంది. ఏ పనీ చేయకపోతే వంద సంకల్పాలు. ఏమీ లేని తత్త్వం లోంచి ఒక సంకల్పం వస్తే, సంకల్పం రావడం కారణంగా కాలం పుడుతుంది. అది మొదలు. అక్కడి నుండి సంకల్పాలు రావడం, కాలం రావడం, రెండూ ఒకేసారి జరుగుతుంది. అదే మనకు ఆదిశేషుడు, అనంతుడు, కాల స్వరూపుడు, కాలం ఇలాంటివన్నీ. కాలం, ప్రకృతి, సంకల్పాన్ని నిర్వర్తించే శక్తి, సంకల్పం. సంకల్పం ఒక్కటే వస్తే సరిపోయిందా? ఎక్కడికి కి వెళ్లాలని సంకల్పం వచ్చినా శరీరాన్ని లేపాలా? దానికి శక్తి కావాలి కదా! అందుకనే శక్తి కూడా వస్తుంది. సంకల్పం రాగానే దాన్ని నిర్వర్తించే శక్తి కూడా వస్తుంది. అందుకే కాలము, శక్తి, ప్రకృతి. ఈ మూడు ఒకసారి అందులోంచి బయటకు వస్తాయి. ఈ మూటి లోంచి మళ్లీ వెలుగు వస్తుంది. ఈ వెలుగులోంచి త్రిమూర్తులు, త్రిగుణాలు వస్తాయి. ఇలా మూడుగా అంతా దిగి వస్తుంది. ఆ దిగి వచ్చినది అంతా ఒక క్రతువుగా నిర్వర్తింపబడుతోంది. మూడుగా దిగివచ్చి నాలుగుగా స్థిరపడుతుంది అని పెద్దలు చెప్తారు. అంటే సంకల్పం వస్తుంది. మనం ఉన్నాం, మనలోంచి సంకల్పం వస్తుంది. దాన్ని నిర్వర్తించే జ్ఞానం ఉన్నది. దాంతో నిర్వర్తిస్తాం. ఆ తరువాత అక్కడొకటి ఏర్పడుతుంది. కదా! అది నాలుగవది. మూడు ఆధారం గా ఒకటి ఏర్పడుతుంది. అలా త్రిగుణముల ఆధారముగా సృష్టి ఏర్పడుతుంది. ఇలా ప్రతి చిన్న విషయం నుండి పెద్ద విషయం వరకు క్రతుబద్ధంగా సమస్తము నిర్మాణం జరుగుతుంది. ఎక్కడా పొరపాట్లు ఉండవు. గోళం తయారుచేసినా అట్లాగే చేస్తారు. ఒక మానవుని తయారుచేసినా అలాగే చేస్తారు. 84 లక్షల రకములైన జీవరాశులు ఉన్నాయని చెబుతుంది గరుడ పురాణం. 84 అంకెకు చాలా

ప్రాముఖ్యత ఉన్నది. ఇన్ని రకాలు పుట్టుకురావడం, అందులోంచి పుట్టుకొచ్చింది మళ్లీ అలాగే పుట్టుకు రావడం అనేది ఎంత science? ఎంత క్రతువు? ఆ formula ప్రకారం అంతా అలాగే బయటకు వస్తున్నాయి. మనిషి లోంచి మనిషే రావడం క్రతువు. ఏం వస్తుందో తెలియదు అన్నట్లుగా లేదు కదా! కలియుగంలో మిగతావి ఏవేవో కూడా మనిషి నుండి పుట్టుకొస్తాయని భవిష్య పురాణంలో చెప్పారు. కలియుగం అంతమయ్యే సమయానికి అలా వికృతాలు జరుగుతాయని చెప్తారు. వికృత ఆకారాలు వస్తాయి. మనుషుల నుండి మనుషులు, కుక్క లోంచి కుక్కలు ఇలాగా ఒక చిన్న శుక్రకణం నుండి అదే నమూనాగా రావడం జరుగుతోంది కదా! గుడ్లు పెట్టేవి ఉన్నాయి. మనకి గుడ్లు చూస్తే అన్నీ ఒకే లాగా ఉంటాయి. కానీ కోడి గుడ్డు నుంచి వచ్చేది కోడి, బాతు గుడ్డు నుంచి వచ్చేది బాతు అలా అవుతాయి. అలాగే పక్షుల గుడ్లల్లోంచి ఏ పక్షి అయితే ఆయా పక్షులే వస్తాయి. ఇందులో ఎంత క్రతువు ఉందండీ! విత్తనాలు వేస్తే అంతకుముందు చెట్టు లాగే మరలా వస్తుందండీ. ఎంత క్రతువు ఉందీ? ఒక్క మనిషి తప్ప, వేసింది వేసినట్లు అట్లా వస్తూ ఉంటుంది. మహాత్ములకి మళ్ళా మహాత్ముడే పుట్టాలని లేదు. నిజానికి మహాత్ముల కి పుట్టిన వాళ్ళు మరొక రకంగా తయారైన సన్నివేశాలు చాలా ఉన్నాయి. అట్లాగే అంత మహాత్ములు కానివారికి పుట్టినవారు మహాత్ములు అయిన సన్నివేశాలు చాలా ఉన్నాయి. మామిడి చెట్టు వేస్తే మామిడి చెట్టే వస్తుంది. ఏ రకం టెంక నాటితే ఆ రకం మామిడి చెట్టే వస్తుంది. ఇందులో ఎంత క్రతువు వున్నది? విత్తనాలు అన్నీ ఒకలా ఉండవచ్చు, మందార విత్తనాలు వేశాము అనుకోండి. ఎన్ని రంగుల, ఎన్ని రకాల మందారాలు ఉన్నాయి? ఏ రకం విత్తనం వేస్తే ఆ రంగు, ఆ రకం మందారాలే వస్తాయి. అదీ క్రతువు. నిన్న ఇట్లా ఉన్నాం కాబట్టి ఇవాళ ఇట్లా ఉంటామని చెప్పలేం. అంటే మనం క్రతుబద్ధం కాదు. క్రతుబద్ధంగా జీవించిన వాడికి సృష్టిలో ఉండే సత్యం బాగా స్పష్టంగా గోచరిస్తుంది. ఎందుకంటే సృష్టిలో ఏ ఒక్కటీ క్రతుబద్ధం కాక లేదు. ఆవు నుండి ఆవో, కోడెదూడో పుడుతుంది. గేదె పిల్ల పుట్టదు కదా! ఆవు యీనుతూ వుంటే ఆవో, ఎద్దో ప్రపంచంలోకి రాబోతోందని ఖచ్చితంగా తెలుస్తుంది. అందులో ఎంత క్రతువు ఉన్నదీ? భూమి తన చుట్టూ తాను తిరగడంలో ఎంత క్రతువు ఉన్నదీ? ఈ ఋతువులలో ఎంత క్రతువు ఉన్నదీ? పెరుగుదల, తరుగుదలా ఎంత క్రమబద్ధంగా, క్రతుబద్ధం గా నిర్వర్తించబడుతున్నదీ? స్త్రీల ఋతువులు కూడా మన యొక్క ప్రవర్తన ద్వారా పాడు చేసుకోవడం తప్ప, లేకపోతే పాడవడానికి ఏ అవకాశం లేదు. అలాగే మన వాళ్ళ ఆరోగ్యం. మనకి అనారోగ్యం వచ్చిందంటూ అంటే మన ఆహార వ్యవహారాల్లో తేడా వుందిట అని అర్థం. అది ఎంత లోతులో ఉన్నదో దానిని బట్టి ఉంటుంది. మనకి క్రతుబద్ధం కాని జీవితం నుండి ఘర్షణ, దుఃఖం వచ్చి అనుభూతి, ఆనందం, వైభవం పోతాయి. అందుకని భగవంతుడు

మనకి ఇక్కడ మహాక్రతు అనే నామం ద్వారా ఏం అందిస్తున్నాడు అంటే జీవితాన్ని క్రతుబద్ధం చేసుకో, క్రమబద్ధం చేసుకో. తద్వారా నిన్ను నీవు శక్తివంతుడ్ని చేసుకో. మహా క్రమంలో శని వస్తే మహా క్రతువు లో బృహస్పతి వస్తాడు. ఎంత చక్కని సమన్వయమో చూడండి. ఎవరైతే క్రతుబద్ధంగా జీవితాన్ని నిర్మాణం చేసుకుంటారో, వారి యందు చైతన్యం యొక్క వికాసానికి అవరోధములు ఉండవు. ఆర్యుల విశిష్టత ఏమంటే, అన్నీ క్రతుబద్ధం చేశారు. ఎంత చేశారంటే చివరికి ఒక్కో సన్నివేశంలో స్ఫూర్తి సన్నగిల్లితే విసుగు కలిగేంత చేశారు. ఆర్యుల జీవితంలో నిద్ర లేచినప్పుడు క్రతువు ఉన్నది. నిద్ర లేవగానే ఏ ముక్కు రంధ్రం నుండి గాలి వస్తోందో, యోగికి తప్ప రెండు రంధ్రాల నుండి గాలి వెళ్లడం ఎవరికీ సమానంగా పనిచేయవు. మనం కూడా పరిపూర్ణ ప్రశాంతతతో ఉన్నప్పుడు రెండు రంధ్రాల నుండి సమానంగా గాలి రావడం, పోవడం ఉంటుంది. దేంట్లోంచి కొంచెం తక్కువగా వెళుతోందో అది కొంచెం మందంగా ఉన్నది అని అర్థం. దేంట్లోంచి కొంచెం ఎక్కువగా వెళుతుందో అది కొంచెం బాగా ఉన్నదని అర్థం. కుడి ముక్కులో నుంచి గాలి వెళ్తే పనికి/ activity కి time అని అర్థం. ఎడమ ముక్కు లోంచి గాలి వెళ్తుంటే ప్రస్తుతానికి పని ఆపి పక్కన కూర్చోమని అర్థం. అందుకే బయలుదేరే ముందు శ్వాసని పీల్చుకుని చూసుకుంటూ ఉండేవారు పూర్వకాలం. మారుతూ ఉంటుంది అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటునూ. యల్దేరేముందు ఎడమ ముక్కు బాగా పనిచేస్తోందని అంటే కాసేపు కూర్చుంటారు. అట్లాగే లేచేటప్పుడు ఎడమ ముక్కు పని చేస్తే ఎడమ కాలు కింద పెట్టి ఎడమ పక్కగా పక్కమీద నుండి లేచేవారు. కుడి ముక్కు పని చేస్తే కుడికాలు నేల మీద పెట్టేవారు. అంతేగాని మెలకువ రాగానే మంచం మీద నుండి లేవడం కాదు. అక్కడ నుండి పెట్టాడు క్రతువు. మనం నిద్ర నుండి లేవడం వేరు, మంచం మీద నుండి లేవడం వేరు కదా! మనకి రెండూ ఒకటే. ఆలస్యం గా లేస్తాం కాబట్టి మంచం మీద నుండి లేవడం లేవడం గెంతినట్లు లేవడమే! నిద్ర నుండి లేవగానే ఎక్కడి నుండి లేచాం? అనే ప్రశ్న వేసుకోవడం క్రతువు. ఎక్కడ నుండి లేచామో అది మన పుట్టుక స్థానం. పుట్టుక స్థానం లోంచి బయటికి వచ్చాం. దాని గురించి కాసేపు ఆలోచన చెయ్యి. ఎక్కడ నుండి లేచావు, ఎవరు నువ్వు, ఏం చేయడానికి లేచావు? ఇవే గా మన ప్రశ్నలు. నిద్రలేవగానే వీటి గురించి ఆలోచించావా? మనకు నిద్ర లేవగానే పని గుర్తొస్తుంది తప్ప, ఇవన్నీ ఆలోచించడానికి time ఉండదు. మామూలుగా రాత్రి ఓ నాలుగు గ్లాసుల మంచినీళ్లు పుచ్చుకుని పడుకుంటే, తెల్లారి నాలుగు కల్లా మెలకువ వచ్చేస్తుంది. ఎందుకంటే nature call వస్తుంది కనుక. అప్పడే లేచి చేయాల్సిన పని ఉండదు కాబట్టి పడుకుని ఎక్కడ నుండి నిద్ర లేచాను? కాసేపు ఆలోచించు. అదొక సుళువు. చాలామంది మంచినీళ్ల మోతాదు పెట్టి

పడుకుంటారు. మూడు గంటలకి లేవాలంటే ఎన్ని గ్లాసులు తాగాలి, నాలుగు గంటలకు లేవాలంటే ఎన్ని గ్లాసుల నీళ్లు తాగాలి ఇలా water alarm పెట్టుకుంటారు. ఓ పావు గంట ముందుగా లేస్తే చాలు. మంచం మీద పడుకుని ఆలోచించుకోవచ్చు. ఎక్కడ నుండి లేచాం? మనం అసలు ఎవరు? ఎందుకు లేచాం? 'ఎందుకోయీ తోటమాలీ అంతులేనీ యాతనా, ఇందుకేనా నీవి చేసే పూజలన్నీ' అని పాట ఉంది కదా! ఎందుకు లేస్తున్నాం? రోజూ వండుకోడం. తినడం, తిరగడం, స్నానపానాదులు, బట్టలు, పడుకోవడం. ఇదేనా? ఇంకేమన్నా ఉందా? 'తందనాలతో పొద్దు పోవలెనా' అని త్యాగరాజ అడుగుతాడు. 'జాలమేలరా, జాలమేలరా సాకేత రామా' అన్న ఒక పాటలో. ఎందుకయ్యా బాబూ రోజూ ఇదే కదా? ఇంతకన్నా దివ్యమైన వైభవం చూడగలిగింది ఏమన్నా ఉన్నదా! You have to define your ritual for the day. నీ యొక్క దైనందిన క్రతువుని నిర్ణయం చేసుకోవాలి నువ్వు. ఇవన్నీ మామూలుగా జరిగేవే, మహా ప్రళయంగా రోజూ జరుగుతుంటాయి. వండుకోవడం, తినడం, కట్టుకోవడం, తిరగడం, పడుకోవడం---ఇవే. క్రతువు అక్కడ నుండి మొదలవుతుంది. వాడే చతుర్ముఖబ్రహ్మ గా లేచాడుట. లేవగానే బ్రహ్మ గారు తొందరపడి మనలాగా బజార్లోకి వెళ్లిపోలేదు. అసలు మనం ఎవరూ? మనం ఎక్కడి నుండి లేచాం? మనం యేం చేయాలి? ఇవి కదా బ్రహ్మ ప్రశ్నలు! మనం లేచినప్పుడు, మనం కూడా బ్రహ్మే! శాంతాకారం, భుజగ శయనమూనూ మనం పడుకున్నప్పుడు. నిద్రలో ఎవరిదైనా శాంతమైన ఆకారమే! శాంతం లేకపోతే నిద్ర రాదు. నిద్ర వస్తే శాంతం ఆవరించి ఉన్నట్లు. బ్రహ్మ ఎలా ప్రశ్న వేసుకున్నాడో మనం కూడా ప్రశ్న వేసుకోవాలి. అదీ క్రతువు! లేవగానే తనే బ్రహ్మగానే లేచాడు. మనమే మనంగా లేచాం కదా! ఉన్నవాళ్ళం చైతన్యవంతులం అయ్యాం. అంటే That which becomes awareness. అంటాం. అంటే Being has become awareness, ఉన్న వాళ్ళం చేతన పొందాం. చైతన్యవంతులు అయినప్పుడు ఎక్కడ నుండి చైతన్యవంతులమయ్యాం అని ప్రశ్న వేసుకున్నాడు బ్రహ్మ. అందుకని మనం ప్రశ్న వేసుకోవడం క్రతువు. అక్కడికి వెళ్ళడానికి ప్రయత్నం చేయడం 'ధ్యానం'! ఏం చేయాలి? ఏం చేయాలి? రోజు చేసే ఈ పనులేనా ఇంకా ఏమన్నా ఉందా చెయ్యాల్సిందీ? అని చుట్టూ ఉండే చోటుగా, లోపల ఉండే చోటుగా ఉండే దేవుణ్ణి నిలదీసి అడగాలి. బాగా అడిగితే, లోపలి నుండి ఒక్కోసారి సమాధానం వస్తుంది. తపనతో అడగడమే తపస్సు. అట్లా అడిగాడట బ్రహ్మ. అసలు ముందు ఏమి చేయాలని అడిగినప్పుడు, తపస్సు చేయమన్నారు. తపస్సు చేస్తే సృష్టి చేయాలని తెలిసింది. 'అమ్మో సృష్టా' అన్నాడు. 'నీకేం ఫరవాలేదు, నేను చేస్తాను, నువ్వు అట్లా వుండు' అని చెప్పారు. అట్లాగే మనలో కూడా అంతకు ముందు వున్నదే లేచింది.

అంతకు ముందు లేకపోతే లేవడానికి ఏమీ ఉండదు. లేచిన తర్వాత ఈ శ్వాస ఏ నాసాపుటం లోంచి వస్తోంది, దాని ప్రకారం మంచం దిగడం పెట్టారు. మనం మన మంచాలన్నీ గోడకి ఆనించేస్తాం. రెండో వైపుకి దిగడంమేమిటి యిహ. అందుకే ఏదన్న పని పాడైతే 'I got up from the bed on the the wrong side. అని ఆంగ్లంలో ఓ నానుడి ఉన్నది. That's why it happened like this' అందుకే ఇలా అయిందని అనుకుంటారు. ఇది ఎక్కడ నుండి వచ్చింది? అంటే 'there is a right side to get up and wrong side to get up' అని తెలుస్తున్నది కదా! ఆర్యుల యొక్క క్రతువు. British వాళ్లు కూడా ఆర్యులే! 'ఆర్యోపా' యే యురోపా. తెల్ల జాతి అంతా ఆర్యులే. భారతీయులు ఆర్యులే. ఆర్యసంస్కృతి లో బలమైనది క్రతువు. దంతధావనానికి, మల మూత్ర విసర్జన కి క్రతువు ఉన్నది. చాదస్తం అనుకుంటారు. కానీ అసలు పోతే మిగతాది చాదస్తం గా మిగులుతుంది. చెవికి జంధ్యం పెట్టుకొని విసర్జించాలి మగవాళ్ళు. అలాగే ఆడవారికి క్రతువు ఉన్నది. కాళ్లు, చేతులూ కడుక్కోవాలి అయ్యాక. ఈ నీళ్లు వాడడం క్రతుబద్ధ జీవితంలో చాలా ముఖ్యం. ఎందుకంటే నీరు పవిత్రీకరించినట్లుగా ఏదీ పవిత్రీకరించదు. Aids వ్యాధితో బాధపడుతున్న Spain యువతికి 'కేవలం బాగా మంచి నీళ్లు తాగుతూ ఉండు, రోగం పెరగకుండా ఉంటుంది'. అని చెప్పాను. రోగం పెరగలేదు, ఇప్పటికీ 10 సంవత్సరములు అయింది. ఎందుకంటే పవిత్రీకరించడం నీటికి ఉన్న గుణం. స్నానం చేస్తే తేలికయిపోతాము. నీళ్లు తాగితే లోపల కూడా పవిత్రీకరింపబడతావు. జలం పవిత్రీకరించినట్లుగా ఏదీ పవిత్రీకరించదు. మానవులనే కాదు దేవతలను కూడా జలమే పవిత్రీకరిస్తుందని చెప్తారు. అందుకే ప్రతి పనికీ మధ్య కాళ్ళూ, చేతులూ కడుక్కోవడం పెట్టారు. స్నానం చేయడం ఒక క్రతువు. ఆయన మనకందించిన క్రతువిద్య. ఆయనే క్రతువిద్య. మొత్తం సృష్టి అంతా ప్రతి చిన్న విషయం దగ్గర నుండి ఒక క్రతువు. ఎండాకాలం వస్తోందంటేనే మామిడి చిగురు వస్తుంది. ఇప్పుడు మామిడిని చిగురించమనండి. మనం ఎప్పుడు పడితే అప్పుడు చిగురించగలం, ముడుచుకుపోగలం. చిత్తా నక్షత్రం లో సూర్యుడు ప్రవేశించినపుడే కుక్కలకి లైంగిక ఆసక్తి కలుగుతుంది. దాన్నిబట్టి చిత్తకార్తె వచ్చిందని తెలుసుకుంటారు. మానవుడికి 27 కార్తెలూ మనవే. 27 నక్షత్రాలలో యెప్పుడు పడితే అప్పుడే. క్రతువు లేదు. దానికీ క్రతువు ఇచ్చారు. క్రతుబద్ధంగా జీవిస్తే వాడిలోని చైతన్యానికి అమరిక జరిగి, అయస్కాంతీకరణం చెందుతాడు. బృహస్పతి యొక్క ముఖ్య సందేశం ఏమంటే 'నిన్ను నువ్వు అమర్చుకో. నీవు ఒక చైతన్య స్వరూపంగా ఏర్పడతావు'. అని. మన వద్ద mouthpiece, wires, switchboard ఉన్నాయి. Switch-board బయట Street poleకి connect అయి ఉంది. అది ఇంకో transformer కి connect అయి ఉంది. ఇవన్నీ ఒకదాని

నుండి ఒకటి చక్కగా అమర్చుకుంటే వీటిలో నుంచి విద్యుత్ ప్రవాహం వస్తోంది కదా! ఇవన్నీ సరిగ్గా అమర్చుకోవడం క్రతువు. ఇది ఒకదానికొకటి సరిగ్గా అమర్చుకోక యింకోలా చేస్తే విద్యుత్తు మన దగ్గరకు వస్తుందా? వంట కూడా క్రతువే. ఏది ఎప్పుడు ఎంత మోతాదులో ఎలా వేయాలో వేసి చేస్తేనే కదా వంట బాగుండేది. అలా కాక అడ్డగోలగా చేస్తే వస్తుందా? మనం అనుకున్నది రాదు కానీ యింకోటి యేదో వస్తుంది. మగవాళ్ళ వంటకి ఆడవాళ్ళ వంటకి అదే కదా తేడా. అలాగే చీర నేతలో ఒక క్రతువు ఉన్నది. అసలు సృష్టిలో సమస్తము క్రతువే. దాన్ని నీవు గుర్తిస్తూ ఉంటే నీలో కూడా క్రతువు తత్త్వం వ్యక్తమవుతూ ఉంటుంది. ఇనుప ముక్కలో వున్నదే అయస్కాంతంలో కూడా ఉన్నది. ఏమిటి తేడా అంటే ఇనప ముక్కలో ఉండే కణాలు చిందరవందరగా ఉన్నాయి. అయస్కాంతంలో కణాలు అమరిక చేయబడి ఉన్నాయి. అవే కణాలు. సరుకు అంతా అక్కడే ఉంది. దాని సవ్యంగా అమర్చుకుంటే శక్తి ఆవిర్భవిస్తుంది. అపసవ్యంగా చేస్తే శక్తి అదృశ్యం అయిపోతుంది. Battery కి positive, negative రెండూ ఉంటాయి. దాన్ని tape recorder లో తప్పుగా పెట్టామనుకోండీ, అది battery గా పని చేస్తుందా? ఎందుకు పని చేయదూ? అదీ క్రతువు. క్రతువు సృష్టిలో బాగా ఎక్కువగా ఉంది కాబట్టి మనం కూడా మన జీవితంలో తెచ్చుకోవచ్చు. తెచ్చుకోవాలంటే అసలు ఒకటి యిలాంటిది ఒకటి వుందని తెలిస్తేనే కదా! ఇలాంటిది వుందని తెలిస్తేనే కదా మన జీవితంలోకి తెలుసుకోవాలనే తాపత్రయం ఉంటుంది. అలా తెచ్చుకున్న వాళ్ళని బృహస్పతి అనుగ్రహిస్తాడు. అంటే ఏం చేసినా ఒక పద్ధతిగా, ఒక అమరికగా there is an arrangement, rearrangement. చక్కగా మార్చుకున్న గదిలో పని చేసుకోవడానికి, అడ్డగోలుగా చుట్టూ అంతా చిందరవందరగా ఉండి పని చేసుకునే దానికి చాలా తేడా వుంటుంది. మంచం మీద పడుకుని ఒక సద్గ్రంథ పఠనం చేసినదానికీ, చక్కగా కూర్చుని, శ్రద్ధగా ఒక దీపం పెట్టుకుని, అగరబత్తి పెట్టుకుని, నమ్ముకున్న గురువునో, దైవాన్నో స్మరణ చేసి ఆ పుస్తకం చదువుకున్న దానికీ తేడా ఉంటుంది. ఏనుగుకీ, దోమకీ ఉన్న తేడా వుంటుంది. Madras లో మా అబ్బాయి చదువుకుంటున్న చోట వాళ్ళు చెప్పారుట, 'ఒక కాలు మీద ఒక కాలు వేసుకోక, రెండు కాళ్లు నేలకు ఆనించి, ఈ పుస్తకం చేతిలో పెట్టుకుని straight గా కూర్చొని చదువుకో, ఎంత alert గా ఉంటే అంత బాగా చదువు వస్తుందని'. 'చాలా సత్యం నాన్నా' అని చెప్పాను. It is a Jupitarian Principle. క్రతువులు నిర్వర్తించేవారు అలా నిర్వహిస్తారు. యజ్ఞం చేస్తే వర్షం పడుతుంది అంటే పడుతుంది. ఎందుకంటే అట్లా చేస్తారు కనుక. ఆయన యజ్ఞం చేస్తే ఆశీర్వచనం కలుగుతుందంటే, కలుగుతుంది. శ్రద్ధాత్రయవిభాగంలో కృష్ణుడు చెప్పాడు, 'నువ్వు పూజ చెయ్యి, హోమం చెయ్యి, చేసేది విధానం ప్రకారం చెయ్యి సుమా' అంటాడు.

శ్రద్ధ ఉన్నవాడు విధానాన్ని అనుసరిస్తాడు. శ్రద్ధ లేని వాళ్ళు యెలాగో అలాగా చేసేస్తారు. చేసేసి మంత్రహీనం, క్రియా హీనం, భక్తిహీనం అని చదివేస్తారు. Connections సరిగ్గా యిచ్చుకోవడం ఎలాగో, ఈ క్రతువు నిర్వహించుకోవడం కూడా అలాగే. అలా చేస్తే అదేవిధంగా అక్కడ తప్పక శాస్త్రీయంగా అవతరిస్తుంది. శాంతాదేవి, ఋష్యశృంగుడు కలిసి పుత్రకామేష్ఠి చేయిస్తే, అక్కడ మరి పూర్ణ పురుషుడు ఆవిర్భవించి, పూర్ణకుంభం ఇచ్చి, పాయసం తాగే వరకు వచ్చింది కదా! మనం పుత్రకామేష్ఠి చేస్తే? అశ్వమేధ ఋక్కులు చేస్తారు. షష్ఠిపూర్తి సందర్భంలో, ఆయుర్దాయం పెరగడానికి చేస్తారు. అది చేయించుకున్న మూడు రోజులకే వెళ్ళిపోయిన సందర్భాలు చాలా ఉన్నాయి. వచ్చే వారి నుండీ, క్రతువు చేసే విధానం దగ్గర్నుండీ, అన్నిట్లోనూ యేది యేలా చేయాలో తెలుసుకుని చేయాలి. ఎట్లా పడితే అట్లా చేస్తే వంటే సరిగ్గా రాదు కదా, క్రతువు యెలా ఫలిస్తుందండీ? ఈ రోజుల్లో అంతా fashion. స్ఫూర్తి ఉండడం వేరు, శ్రద్ధ ఉండటం వేరు. హోమం చేద్దామన్న స్ఫూర్తి, షోడశోపచార పూజ చేద్దామని స్ఫూర్తీ చాలామందికి ఉండవచ్చు. అమ్మవారి పూజ చేద్దాం అనిపించవచ్చు, గణపతి పూజ చేద్దామా అనిపించవచ్చు. విష్ణు పూజలు, అభిషేకాలు చేద్దాం అనిపించవచ్చు. ఏ దేవతని ఎలా పూజించాలో దానికి ఒక విధానం ఉన్నది. మనకి రుద్రాభిషేకము వచ్చు కాబట్టి నమకంతో లక్ష్మీదేవికి స్నానం చేయించామనుకోండీ! అదా! లక్ష్మీదేవికి శ్రీ సూక్తం తో స్నానం చేయించాలి. విష్ణుమూర్తి కి స్నానం చేయించినప్పుడు పురుష సూక్తం, విష్ణు సూక్తములు చదవాలి. రుద్రుడికీ, వినాయకుడికి చేసేటప్పుడు నమకం చదువుకోవచ్చు. ఇవన్నీ తెలియాలంటే వాటికి సంబంధించిన పుస్తకాలు చదువుకోవాలి. మనకి వచ్చింది అన్నింటి మీద apply చేయడానికి వీలుండదు. విద్యుత్తుంది కదా అని రేడియో వద్దకి వెళ్ళి యిలా మాట్లాడితే బయటకి వినిపిస్తుందా? వినిపించదు కదా! 'ఏ క్రతువు ఎలా చేయాలో తెలుసుకునీ, శ్రద్ధగా అట్లా చెయ్యి'. అంటాడు శ్రీకృష్ణుడు. అలా చెయ్యకపోతే దాని నుండి దుష్ఫలితాలు వస్తాయి. అశ్రద్ధతో క్రతువు చేస్తే దుష్ఫలితాలు వస్తాయి. కోరిక పెట్టి చేస్తే కోరిక ఫలితంగా వస్తుంది. ఏ కోరిక లేకుండా భగవంతుని అనుగ్రహం కోసం చేస్తే భగవంతుని అనుగ్రహం వస్తుంది. అందుకని మనం సృష్టి క్రతువు బాగా గమనిస్తే క్రతువు ఇంకో రకంగా ఉండదు. ఎప్పుడూ యిటే తిరుగుతున్నాం కదా, కాసేపు అట్నుండి తిరుగుదామని భూమి అనుకుంటే--? ఏమవుతుందీ? మొత్తం మారిపోదూ? కానీ తిరగదు. క్రతువు నిర్వర్తించేవాడి దైనందిన కార్యక్రమం అంతా ఒక క్రతువుగా వెళ్ళిపోతుంది. ఎంత అద్భుతంగా ఉంటుందో! క్రతువు నిర్వర్తించే వాడికీ, అనుసరించే వాడికీ, కాలం చక్కగా సహకరిస్తుంది. ఈ time కి ఈయన ఇక్కడ ఉంటాడని తెలిస్తే, ఆయన్ని అక్కడ ఆ time కి కలవడం సులభం కదూ!

దేవతల దగ్గర నుండి మనుషులతో అలాగే ప్రవర్తిస్తారు. మనుషులలో అలా జీవించడం ఎక్కడ ఉంటుందో అక్కడ గురువు అనుగ్రహం పరిపూర్ణంగా ఉంటుంది. అందుకే మనకి పొద్దున 6, సాయంత్రం 6 యిచ్చారు ప్రార్థనలు. 6, 6 కుదరకపోతే మరొకటి పెట్టుకోండి కానీ మనం అనుకున్న time ని మనం పాటించాలి. అదే విధంగా చేయాలి. ఎన్నాళ్లయినా అదే శ్రద్ధతో చేయాలి. శ్రద్ధ తగ్గకూడదు. అదీ శ్రద్ధ కి తార్కాణం. మనకి ఒక రోజు ఉంటుంది. రెండవ రోజు ఉంటుంది, మూడవరోజు నీరసంగా ఉంటుంది. నాలుగవ రోజు ఇలాగే చేయాలా అనిపిస్తుంది. ఐదవ రోజు చేయకపోతే యేం అనిపిస్తుంది. ఆరవ రోజు మానేస్తాం. పై వారానికి ఇంక ఉండదు. ఇంకో programme వచ్చేస్తుంది. మనలో బృహస్పతి మేల్కొంచాలంటే జీవితాన్ని క్రతువుగా మార్చుకోవాలి. నేను చూసిన విషయం చెప్తాను.  మా అమ్మగారి నాన్నగారు 33 కోట్ల రామనామం వ్రాశారు. 30ఏళ్ళు. 30ఏళ్ళు అదే time కి లేచేవారు. మనం ఏ రోజు ఎన్నింటికి లేస్తామో ఇవాల్టికీ నాకు తెలియదు నా గురించి. ఏ కాలమైనా ఎప్పుడూ చన్నీళ్ళ స్నానం, సబ్బు వాడేవారు కారు. అయినా వాసన వచ్చేది కాదు. ఇప్పుడు సబ్బులు వాడి, సెంట్లు కొట్టుకున్నా వొళ్ళు వాసన కొడుతుంది. నేనడిగాను. ‘ఏం తాతయ్యా, నీవు సబ్బు రుద్దుకోవు వాసన రాదూ’ అంటే ‘ఆలోచనలు బావుంటే శరీరము వాసన రాదు నాన్నా!’ అని చెప్పేవారు. మనిషి ఆలోచనలు బావుంటే శరీరం వాసన రాదుటండీ. శరీరం కంపు కొడుతోందిటా అంటే కంపుకొట్టే ఆలోచనలు చాలా వున్నాయట అని అర్థం. కంపు కొట్టగానే స్నానం చేసేస్తే ఆలోచనల్లోనూ మార్పు వస్తుందీ, శరీరంలోనూ కొంత దుర్గంధం బయట పడుతుంది. కంపు కొడుతోందని అత్తరు రాసుకోవడం ఒక పద్ధతి, స్నానం చేయకుండా! తురక వాళ్ళ దేశంలో వాళ్లకు నీళ్ళు దొరకవు. నీళ్లు దొరికినప్పుడు స్నానం చేస్తారు, దొరకనప్పుడు అత్తరులు పూసుకుని తిరుగుతారు. మనకేం ఖర్మ నీరు ఉండే ప్రదేశంలో? స్నానము కాగానే యోగము ఓ గంట. 24 నిమిషములు, చేద్దామంటే కుదిరి చావదు. 24, 48, 72 నిమిషములని చెప్తూంటాను కదా! ఆయన యోగం చేస్తే గంటన్నరకు తక్కువుండేది కాదు. యోగం అయ్యాక పాలు, ఆ తరువాత 2, 3 గంటలు రామనామం వ్రాసుకునేవారు. 9 గంటలు కొట్టేసరికి శ్రీ సూక్త విధానంగా కనులు మూసుకుని అంతర్ముఖంగా పూజ చేసేవారు భోజనాలు గదిలో తాను భోజనం చేసే చోట. అదీ ఆయన పద్ధతి. (మీరూ అలా చేయమని చెప్పడం లేదు. ఆయన పద్ధతి చెప్తున్నా). ఇంటావిడ వండిన అన్నం పెడితే అదే నైవేద్యంగా సమర్పించి, అదే భోజనంగా చేసేసి, తమలపాకులు వేసుకుని, 5 నిమిషములు easy chair లో కూర్చొని, కండువా పట్టుకుని ఇస్త్రీ బట్టలతో gate బయట అడుగుపెట్టగానే రిక్షా అక్కడ నిలబడి ఉండేది. అయ్యగారు ఆ time బయటికి వస్తారని ఎప్పుడూ తయారుగా ఉండేవారు. వంతులు ప్రకారంగా

వాళ్ళు ఒక్కొక్కరూ నేను తీసుకెళ్తానంటే నేను తీసుకెళ్తానంటూ తయారయ్యే వారు. వారికి ఈయన్ని తీసుకెళ్లడం ఒక గౌరవంగా ఉండేది. అక్కడ నుండి (ఆయనది కలప వ్యాపారం) shop లో కూర్చుని రామనామం రాసుకునేవారు. రాముడే మనిషిని పంపించి కొనుక్కుంటాడు అని ఆయన నమ్మకం. 30 సంవత్సరములలో 3 కోట్లు రామ నామం వ్రాయడం పూర్తి చేశారు. మొత్తం కర్తవ్యాలు నిర్వర్తించారు. 30 సంవత్సరములు చాలనుకుని, కొడుక్కి అప్పగించేశారు. 3 సంవత్సరాలలో ఆ shop కాస్తా మూసేశారు. అంటే ఏం నడిపించింది? క్రతువు. సాయంకాలం ఇంటికి వస్తే మళ్లీ స్నానం, యోగం. అంతే పద్ధతి. మాస్టర్ చెప్తూ ఉంటారు Saturnian training, Jupiterian training అంటే దీనికి ఎంత ఓపికగా, ఓర్పుగా అదే పనిని అంత స్ఫూర్తితో, అలాగే అంత శ్రద్ధతో, భక్తితో చేయగలవా? మరి సృష్టి అలా చేస్తుంది. లక్షలాది, కోట్లాది సంవత్సరాలుగా సృష్టి అలాగే నడుస్తోందంటే-! దాని వెనకాల ఉన్న బలాన్ని మన వాళ్ళు భగవంతుడు గా గుర్తించారు. అందుకే 'మహా క్రతువు' రూపంలో నువ్వే ఉన్నావు, అన్నాడు భీష్ముడు.

## 703, 704, 705 మహాయజ్వా, మహాయజ్ఞః, మహాహవిః

మహాయజ్వా నడిపించే వాడివి నువ్వే. మహాయజ్ఞః యజ్ఞం కూడా నువ్వే. మహాహవిః. సమర్పణ కూడా నువ్వే. మనల్ని సమర్పణ చేసుకుంటే గానీ మన సృష్టి బయటకు రాదండీ. మన ఒళ్లు వంచకుండా, ఒళ్ళు కరక్కుండా, ఒళ్ళు అరక్కుండా మనకన్నీ రావాలి అనుకుంటాం కదా! అలా సృష్టిలో ఏవీ రావు. ఇదివరకు కరగడంవల్ల ఇప్పుడు అదృష్టం గా రావచ్చు. కిందటి జన్మలో బాగా కష్టపడి, తోట వేసి, ఫలాలు అందుకోకుండా శరీరం వదిలితే, ఈ జన్మలో ఫలాలు తింటూ ఉండవచ్చు. అది చూసి అలా తోట వేయని వాడు అట్లాగే అవ్వాలంటే అవ్వదు. సుకృతమండీ అని అంటాం, అంటే ఇదివరకు కృతం మంచిగా చేశాడని అర్థం. చేశాడు కనుక వచ్చింది. చేయకపోతే రాదు. 'కృషితో నాస్తి దుర్భిక్షం' కృషి చేసిన చోట దుర్భిక్షం వుండదు. దుర్భిక్షంలో వున్నామంటే కృషి లేదని అర్థం. అటు నుంచి యిటు తిరగేసుకోవాలి. కష్టపడితే ఇప్పుడు కాకపోయినా తర్వాతన్నా ఫలితం ఉంటుంది. ఏమీ చేయకుండా అవదు. భగవంతుడు సృష్టి చేద్దాం అనుకుంటే యేం చేశాడు? దానికి తన్ను తాను సమర్పణ చేసుకున్నాడు. ఆయన్నే వండేశారు వాళ్లు. ఆయన్ని వండేస్తే సృష్టి వచ్చింది. పురుష మేధం సృష్టి! పిండి వండితే, పూరీ వచ్చింది. పూరీ కావాలంటే ఎక్కడి నుండి వస్తుంది? పిండి అయ్యేకొద్దీ పూరీ వచ్చింది. ఆయనకి అయిపోవడం లేదు. ఆయన్ని ఆయన సమర్పణ చేసుకోవడం వల్ల అట్లా దేవతలు వచ్చారు. అందులోంచి గ్రహాలు, జీవులు, గోళాలు ఇలా అవీ, యివీ అన్నీ వచ్చాయనీ----పురుష సూక్తం అంతా అదే. 'తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః' ఆ మహాయజ్ఞం పేరు 'సర్వ హుతః'! అంటే పూర్తిగా ఆయన్ని వండేయడమే. వండేస్తే ఒకదాని తర్వాత ఒకటి వరుసగా వచ్చాయి. సూర్య చంద్రాదులు, గ్రహాలు, అష్ట దిక్పాలకులు, రుద్రులు, ఆదిత్యులు, వసువులు, ప్రజాపతులు, మనువులు ఇలా అన్ని బయటికి వచ్చాయి. కథలో పాత్రలన్నీ కవి హృదయం నుండి వచ్చాయి. అట్లాగే వీరంతా వచ్చేశారు. ఆయనే అందులో వేసే హవిస్సు! ఆయనే యజ్ఞం! యజ్ఞం చేయించేవాడు కూడా ఆయనే! ఇది మన జీవితంలో కూడా తెచ్చుకోవాలి అనేది ముఖ్య విషయం. ఆయనే సృష్టి చేయాలన్న భావన ఎలా కలిగిందో, మనకి కూడా దైవ పరంగానో, లౌకిక పరంగానో భావన కలిగిందనుకోండి ఏమన్నా చేద్దామని దానికి నువ్వు ఎంత సమర్పణ చెందావన్న దాన్నిబట్టి ఫలం వస్తుంది. లేకపోతే ఫలం రాదు. అందుకే సమర్పణ చెందడం అనేది అత్యుత్తమమైన సూత్రం. జీవితంలో దైవమునకా? దానికి సమర్పణ చెందు. ధనసంపాదనకా? దానికి సమర్పణచెందు. జ్ఞానం సంపాదించడానికా? దానికి సమర్పణ చెందు. నిన్ను సమర్పించుకోకుండా ఏదీ రాదు. నీ బలమే అందులోంచి బయటికి వస్తుంది.

మామిడి పండు మామిడి చెట్టు నుండి వస్తోంది. పిల్లవాడు తల్లి గర్భం నుండి, ఆమెలోని సప్తధాతువులని అన్నం ద్వారా తీసుకుని కదా బయటకు వస్తున్నాడు! కేంద్రం పురుషుడి వద్ద నుండి వస్తే, చుట్టూ అల్లిక, తల్లి వద్ద నుండి వస్తుంది. తల్లి కడుపులో నుండి ఒక పిల్లవాడు ఎలా బయటికి వస్తున్నాడో, ఒక మొక్క నుండి ఒక పుష్పం అలా వస్తుంది. ఓ చెట్టు నుండి పండు అలా వస్తుంది. అలాగే నీలో నుండి ఒక మహత్తరమైన కార్యం జరగాలంటే, నువ్వు అలా ప్రసవ వేదన అనుభవించి, దాన్ని బయటకు తీసుకురావాలి. మాస్టారి కార్యక్రమాలు అద్భుతంగా నడుస్తున్నాయి అంటే, ఆయన తనని తాను సమర్పణ చేసుకోవడం వల్ల అంత చక్కగా జరుగుతున్నాయి. దానికి నువ్వెంత సమర్పణ చెందితే అంతా జయము కలుగుతుంది. యజము వలన జయము అని చెప్పారు. అది 18 అంకెకు మూలమైన భావము. 1 అంకెకు 'య', 8 అంకెకు 'జ'. అంకెలకీ, శబ్దాలకీ, రంగులకీ, గోళాలకీ అన్నిటికీ ఒక రకమైన అనుసంధానం వుంది. ఆ తాళం చెవి తెలియాలి. 'యజ' అంటే 18. 'జయ' అంటే 81. జయమునకే 18 అంకె చెప్తారు. అంకెలు చదివినప్పుడు అటు నుంచి ఇటు చదవమంటారు. అందుకని 81 గా కనిపించేది నిజంగా 18. 18 సూత్రాలు అదృశ్యం గానూ, ఆరు సూత్రాలు దృశ్యం గానూ, 24 సూత్రాలుగా సృష్టి ఏర్పడివున్నది. అందులో అదృశ్యమైన విషయాలు నీకు చెప్తాననే ఉద్దేశ్యంతో 18 అధ్యాయాల భగవద్గీత, 18 పర్వాల భారతం, 18 రోజులు యుద్ధం, 18 అక్షౌహిణులు పాల్గొనడం, 18 మంది మహావీరులు అందులో పాల్గొనడం ఇలా 18, 18 గా చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే సమర్పణ చెందిన వారికి జయం కలుగుతుంది. సమర్పణ చెందడమే యజ్ఞం! దానినే English లో sacrifice అంటారు. నిన్ను నువ్వు ఎంత సమర్పణ చేసుకుంటే అందులోంచి నీకు అంత ఉత్తీర్ణత వస్తుంది. ఏ విషయం లోనైనా సరే. రావణాసురుడు చూడండీ! శివుడు కావాలనుకున్నాడు. రకరకాలుగా పూజలు చేశాడు. చివరకు తలకాయ తీసి ఆయనకు సమర్పించేశాడు. అమ్మో అని శివుడు ప్రతి స్పందించాడు కదా! అలాగే సాధించాలంటే సమర్పణ కావాలి. దేనికీ? బయట దానికి కాదు. నీ భావనకి నీవు సమర్పణ చెందాలి. దైవదర్శనం పొందిన వారందరూ అలా సమర్పణ చెందడం వల్లనే పొందారు. అది దొరికేవరకూ, అన్నీ వదులుకుని దానికోసమే తపస్సు చేస్తేనే కదా దొరికిందీ? దేనికోసం నువ్వెంత తపన చెందుతావో దానికోసం నువ్వంత సమర్పణ చెందితే, అది అందుతుంది. అదీ యజ్ఞం! నిర్వర్తించేవాడు 'యజ్వా'! యజ్ఞాన్ని నిర్వర్తించేవాడు తానే యజ్ఞము, తానే హవిస్సు అవ్వాలి. అయితేనే యజ్ఞానికి పరిపూర్తి. అలా కాకపోతే యజ్ఞానికి పరిపూర్తి లేదు. మన జీవితం కూడా యజ్ఞార్థం జీవించడం అంటే ఒక దివ్యమైనది, సంఘానికి శ్రేయస్సు కలిగించేదీ అయిన ఒక కార్యానికి మన సమస్తమునూ సమర్పణ చేసుకోవడమే.

అది యజ్ఞం! అంతేకానీ మనది మనం గా వుంచుకుని, ఏదో మంచిగా అనిపించుకోవడం కోసం manage చేయడం వేరు. తను నమ్మిన దానికి తాను సమర్పణ చెందడం జరిగితే అది యజ్ఞంగా ఫలిస్తుంది. అందుకనే 'మహాక్రతుః'. మహాయజ్వా, మహాయజ్ఞో, మహాహవిః'. ఈ మొత్తంలో మనం నేర్చుకోవలసినదేమంటే అంతా క్రతుబద్ధంగా జరుగుతోంది కాబట్టి, మన జీవితం కూడా క్రతుబద్ధంగా చేసుకోవడానికి ప్రయత్నం, మొదటిది. క్రతువు నిర్వర్తించేవాడు 'యజ్వా'! ఆయన మహాయజ్వా! నిర్వర్తింపడేది యజ్ఞము! నీవు నిర్వర్తిస్తుంటే నీవే యజ్ఞంగా నిర్వర్తింపబడుతూ వుంటావు. దానికి నీవు సమర్పణ చెందు. సమర్పణ చెందడం వలన అది యజ్ఞం అవుతుంది. ఊళ్ళో మంచి పని చేయమంటే, అందరి నుండి డబ్బులు collect చేసి యజ్ఞం నిర్వర్తిస్తూంటారు. వాళ్లకేమీ ఫలితం వుండదు. నీ జేబులోంచి తీసి, అక్కడ చేస్తే ఫలితం గానీ, నేను మంచి పని చేస్తాను, మీరందరు డబ్బులు ఇవ్వండి అంటే ఒకటి, రెండుసార్లు యిస్తారు. మూడవ సారి ఇంట్లో ఉన్నా లేరనిపిస్తారు. అందుకని మనం చేద్దాం అనుకున్న పనికి మనమే సమర్పణ చెందితే, సంతోషించి ప్రకృతి శక్తులు తోడ్పడి, యితరుల ద్వారా సహకారం అందుతూ వస్తుంది. అదీ మాస్టారుగారు తన జీవితంలో నిర్వర్తించి చూపించింది. మంచి పనికి యెవరినీ యేమీ అడగనక్కర లేదు. మన వద్ద వున్నది మన కాలము, మన శక్తీ, మన వనరులూ మనం దానికి సమర్పణ చేసి, అలా చేసుకుంటూ పోదాం ఉన్నంతలో. చిలువలు, పలవలుగా మిగతా వారంతా వచ్చి చేరుతారు. దానికి వైభవం వస్తుంది. వాళ్లు చేరాక నీ వాటా అందులోంచి తీసేయకూడదు. ముందు నేను పెట్టుబడి పెట్టాను with వడ్డీ collect చేసుకుందాం అనుకుంటే----? నది మొదలైన చోట ఏ మాత్రం వుంటుందండీ? ఏ నదైనా పుట్టుక స్థానం లో మన విశాఖపట్నం పంపు నీళ్ల ధార కన్నా పెద్దగా ఏమీ ఉండదు. అది బయలుదేరి వెళ్తుంటే దారిలో ఉపనదులు వచ్చి చేరుతాయి. అలా ఒక మహాత్ముడు ఒక సత్కార్యాన్ని సంకల్పించి, ప్రపంచానికి చేస్తుంటే దానికి అనుగుణమైన సంస్కారం కలిగిన వాళ్ళంతా వచ్చి చేర్తారు. కొన్ని పెద్ద నదులు, పిల్ల కాలువలు ఎక్కడెక్కడో కొండల్లో పడ్డ నీళ్లు అన్ని చేరి, కొంతదూరం వచ్చేసరికి చాలా పెద్దది గా తయారైపోతోంది. అలా వెళ్తుంటే కొన్ని అందులోంచి చీలి ప్రక్కకు వెళ్ళి పోతూ ఉంటాయి. చీలి ప్రక్కకు వెళ్లిన పాయ పుణ్యనది కాదు. చీలినా సముద్రం చేరుకుంటే ఉత్తమమైన నది. చీలి ఎక్కడో ఆగిపోయిందనుకోండీ, అంటే యేదో పూర్వజన్మ సంస్కారం వల్ల, యేదో మహత్తర కార్యంలో పాల్గొని విడిపోయిందీ అని అర్థం. అంటే గురువు వద్ద చేరి, కొన్నాళ్లు సత్కార్యాలు నిర్వర్తించి, ఆ తర్వాత సొంత కొట్టు పెట్టుకుని, అలా కాకపోతే అది మానేసి, ఇంకో route ఏదో పెట్టుకుని, యిలా యేవో ఉంటాయి. చేరికలూ ఉంటాయి. చీలికలూ

ఉంటాయి. కానీ నది సముద్రంలో చేరేటప్పటికీ యెంతదయ్యిందీ? అలా నీ సంకల్పంలో పవిత్రతను బట్టి వనరులు అన్ని చేరుతూంటాయి. అంటే మహా ప్రవాహం అవుతుంది. అసలు నదికి యోగం ఏమిటయ్యా అంటే సముద్రం చేరడమే. జీవికి యోగం ఏమిటయ్యా అంటే దైవాన్ని చేరడమే. సముద్రం దైవం అయితే, నది జీవుడయితే ఈ ప్రవాహంలో ఆ దైవాన్ని చేరుకోవడం. అందులో భాగంగా సంఘశ్రేయస్సుకు తన్ను తాను సమర్పణ చేసుకుంటూ చేసే కార్యముల ద్వారానే యిది మహానదిగా ప్రవహిస్తుంది. మనది మనం రూపాయి ఖర్చు పెట్టకుండా దేవుడి వద్దకు చేరుదాం అనుకుంటే అవ్వదు. మన ఒళ్ళు అలవకుండా, మన సంపద తరగకుండా, మనం యేదీ యెవరికీ అందించకుండా జరగదు. ఇవన్నీ వదుల్చుకుంటేనే కదా అక్కడకు చేరేది. వదుల్చుకోవడం అంటే భగవత్ కైంకర్యము గా వినియోగించడం. మాస్టర్లందరూ అలా వినియోగించారు. సూది బెజ్జం లోంచి దూరడం లాగా వుంటుందట. రూపాయి నోటు కూడా దూరదు. కేవలం జీవుడు దూరగలడు. మన డబ్బా డోలు, సంపదా, కీర్తి అన్నీ వేసుకుని అందులో నుండి వెళ్దామంటే ఎలా వెళ్తామండీ? నా పేరున వీళ్ళకీ, వాళ్లకీ సమర్పణ చేసి, నీవు ఒక్కడివీ వచ్చేట్లయితే దూర్తావు. రహస్యం ఏమిటో చెప్పనా! అన్నీ వదిలేసి ఇటు నుంచి అటు దూరితే, అటు వెళ్ళాక ఇవన్నీ మళ్లీ అప్పచెప్తారు. నీకా సంసిద్ధత ఉన్నదో లేదో అని తప్ప, వాడేమి చేసుకుంటాడు యివన్నీ. దీనికి 10 రెట్లు చేసి అప్ప చెబుతాడు. దానం చేసిన వాడెవ్వడు నశించడు. ఆ పూటకి అంతా పోయినట్లుగా ఉంటుంది. 'నువ్వు సిద్ధమేనా? మొత్తం అంతా పోతుంది. నువ్వొక్కడవే మిగుల్తావ్' అని అడుగుతారు. సిద్ధమే! అంటే 'అయితే వదిలి వచ్చెయ్. వాళ్లకి, వీళ్ళకి అప్ప చెప్పేసెయ్' అంటారు. అటు వెళ్లగానే మళ్లీ వీళ్లందరినీ తెచ్చి అప్ప చెబుతారు. ఊరికే సంసిద్ధత తెలుసుకోవడం తప్ప వీరు కఠిన హృదయులు కారు. దివ్యలోకానికి సంబంధించిన వారు కానీ, గురువులు కానీ కఠినులు కాదు. నీ సంసిద్ధత కోసం, నీకు ఎంత అనురక్తి ఉన్నదీ, ఎంత విరక్తి ఉన్నదీ అనేది తెలుసుకోవడం కోసం యివన్నీ జరుపుతూ ఉంటారు. బలి చక్రవర్తి దానం చేస్తుంటే 'ఇన్ని సంవత్సరాలుగా దానం చేసిందంతా పోతుంది, వద్దూ' అని గురువు చెప్తున్నా దానం చేశాడు కదా! దానం చేస్తే తక్కువేమైంది? మొత్తమంతా తిరిగి వచ్చేసింది. చిరంజీవిగా మిగిలాడు. రాక్షస రాజులలో చిరంజీవి గా ఉన్నవాళ్లూ, ఎప్పుడూ తలుచుకోబడేవాళ్ళు, స్తోత్రపఠనాదులు అందుకుంటున్న తక్కువ మందిలో బలి ఒకడు. ప్రతి భోగినాడు బలిని తలుచుకోవాల్సిందే. తప్పదు. యజ్ఞార్థం జీవించడం చాలా ముఖ్యం. దానికి మనకి మాస్టర్ గారు మంచి ఉదాహరణ. తన కోసం కాక, ఇతరుల శ్రేయస్సుకోసం, లేచిన దగ్గర నుండి జీవిస్తూ ఉండడం. ఇతరుల కోసం జీవిస్తున్నానని మిగతా వాళ్లందరినీ disturb చేయనక్కరలేదు. నీ యందు యజ్ఞార్థ

బుద్ధి ఉంటే దానికి ఉండే consistency ని బట్టి ప్రకృతి నీ వద్దకు మనుషులను పంపిస్తూ ఉంటుంది. సంసిద్ధత లేని వారి వద్దకు పంపించదు. తన పిల్లల్ని అవమానపరిచే వాడి వద్దకు ఏ తల్లి తన పిల్లల్ని పంపిస్తుంది? దాత అంటే వస్తారు. పిసినారి అంటే వస్తారా? దానం చేస్తూ వుండు, త్యాగం చేస్తూ వుండు. అంటే నిన్ను నీవు కైకర్యం చేస్తూవుండడం. అసలు ఆ బుద్ధి నీలో ప్రతి ఉదయం ఏర్పరచుకోవాలి. శంఖారావంలో మాస్టారు చాలా చక్కగా వ్రాశారు. 'ఇతరులకు ఏమి కావలెనో గుర్తించడం అనేది హృదయం నుండి ఆలోచించడం. ఇతరుల నుండి మనకేమి వస్తుంది అని ఆలోచించడం అనేది బొడ్డు నుంచి ఆలోచించడం'. ఫలానా వాడు మన వద్దకు వస్తే ఏమిస్తాడు? ఫలానా వాడి ఇంటికి మనం వెళ్తున్నాం, ఏమిస్తాడు? 'మా ఇంటికి వస్తే ఏం తెస్తావ్? మీ ఇంటికొస్తే ఏమిస్తావ్?' అనే సామెత అన్నమాట. ఇవి మనిషికి సంబంధించినవి. మనిషి సాధకుడి గా తనను తాను ఉద్ధరించుకోవాలనుకుంటే మనకు అవతల వాడు ఏమిస్తాడో సంబంధం లేకుండా, అవతలి వాడికి మనం ఏం చేసి పెట్టగలం. వాడికి ఏం కావాలని వచ్చాడో చేయగలిగితే చేయడం, చేయలేకపోతే హృదయపూర్వకంగా తన అశక్తతను తెలపడం కూడా మంచిదే. ఆయన చేయకపోయినా ఫర్వాలేదండీ, ఆయన చెయ్యలేదు అనిపించలేదు అంత చక్కగా మాట్లాడాడు, అని అనిపించింది అనే వారు కూడా ఉంటారు. పని కాకపోయినా పర్వాలేదు ఆయన మాటే ఆనందం కలిగించింది అని కొంతమంది వెళ్లిపోతుంటారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు అలా ఉంటారు. ఎప్పుడూ మన చుట్టూ ఉండే వాళ్ళకి మనం ఏం చేయగలం అనేది గుర్తుంటే, హృదయంలోకి ఎదుగుతాం. అది యజ్ఞానికి మొదటి మెట్టు. అంటే ఆ భావన మొదటి మెట్టు. చేయడం రెండవ మెట్టు. ఆ చేయడంలో తన గురించి ఆలోచించకపోవడం మూడవ మెట్టు. ఎందుకంటే భగవంతునికే అన్నీ అప్పజెప్తున్నాం. నిజానికి మనకు వచ్చిన సమస్తమూ ఆయన వద్ద నుండే, ఆయన కొందరి ద్వారా యిప్పిస్తూంటాడు. కొందరి ద్వారా తీసుకుపోతూ ఉంటాడు. అందుకే ఇచ్చేటప్పుడు కూడా 'గోవిందా' అనుకోమన్నారు. వచ్చినప్పుడు కూడా ఆయన యిచ్చాడు. 'మీకు బాగా కలిసి వచ్చిందండీ' అంటే 'అబ్బే ఏం లేదండీ అంతా దైవానుగ్రహం' అంటాం. పోతే వాడి మూలంగా పోయిందీ, వీడి మూలంగా పోయింది, అంటాం. ఇస్తాడు, తీసుకుంటాడు అని తెలిసి వుండి, సమర్పణ బుద్ధితో మనం ఇవ్వడం వల్ల ఆ అనుభూతి మనదవుతుంది. అదీ యజ్ఞం! పోగేసుకోవడం యజ్ఞం కాదు. ఏమిటి తిరిగి ఇస్తున్నావ్? నీకు అప్ప చెప్పబడింది నువ్వు తిరిగి ఇస్తున్నావ్. చాలా చక్కగా పనిచేసి పెట్టారండీ, అని అడక్కుండానే ఈ వేళ ఓ పది వేలు ఇచ్చారనుకోండి, రేపొద్దున్న ఎవరో వచ్చి, 'మా అమ్మాయి పెళ్లండి. చాలా కష్టంగా ఉందండీ, ఎవరన్నా ఓ ఐదు వేలు ఇస్తే బావుణ్ణు' అని అన్నారు అనుకో,

నిన్న 10 ఎందుకు వచ్చిందంటే ఈ వేళ 5 ఇవ్వడానికి అని గుర్తుంచుకో. కానీ అలా ఉండదు. ఈ 5 ఇచ్చావనుకో, రేపు ఇంకో పది ఇస్తారు, అని మాస్టారు అనేవారు. ఇస్తే వస్తుంది అనేది ఒక సూత్రం. మనకేమో భయం రాదేమోనని. ఇచ్చేసేయ్, వస్తుంది. వస్తుందని మాత్రం యివ్వబోక. ఒక రాజు రాజ్యం పోగొట్టుకుని అడవుల్లో పడి పోతున్నాడుట. ఓ కాళికా అమ్మవారి గుడి కనిపించిందట. అక్కడొక కత్తి ఉందిట. ఆ కత్తి పక్కన ఇలా రాసి ఉందట. 'ఈ కత్తితో ఎవరు నరుక్కుంటే, వారికి అమ్మవారు ప్రత్యక్షమై, ఏం కోరితే అది ఇస్తుందని'. రాజ్యం పోగొట్టుకున్న రాజుకు ఎలా ఉంటుందీ? తలకాయ తీసుకుంటే ప్రత్యక్షమయ్యే అమ్మవారు అన్ని యిస్తుంది అంటే తలకాయ కూడా ఇస్తుంది కదా! అని కత్తి ఎత్తుతాడు. ఆ కత్తి కింద ఇంకో వాక్యం ఉంటుంది. 'అమ్మవారి మీద నమ్మకంతో తల నరుక్కోవడమే తప్ప, వస్తుందన్న ఉద్దేశంతో తల నరుక్కుంటే, తల రాకపోవచ్చు' సైకాలజీ... దేవుడి హుండీలో యేదో యిస్తాడనే కదా వేస్తూ ఉంటాం. ఇవ్వకపోతే? వచ్చే time లో వస్తుంటాయి. ఒక్కోసారి నువ్వు ఎంత వేసినా రావు. మంగళగిరి పానకాల స్వామికి వేసినట్లు ఉంటుంది. ఎంత వేసినా మింగేస్తాడు.' అ——అట్లా అంటారు కానీ అమ్మ అంత కఠినురాలు కాదు. ప్రేమపూరితమైనది, కరుణామయి కదా! అన్నీ ఇవ్వకపోతుందా అని కత్తి ఎత్తుకొని నరుక్కోబోతుంటే అక్కడ గోడ మీద ఇంకో వాక్యం వ్రాసి ఉంది. 'అమ్మ కరుణామయి కనక ఇవ్వక పోతుందా అన్న భావంతో తల నరుక్కున్నా మళ్ళీ తల రాకపోవచ్చు' అని ఉంటుంది. మాస్టారు చాలా చక్కగా వ్రాశారు. మనుషుల మనస్సులలో పొరల పొరల్లో రకరకాల భావాలు ఇమిడి ఉంటాయి. అవన్నీ చిత్రీకరించారు. ఇహ వాడు ఏమనుకోకుండా అమ్మవారికి తలకాయ ఇచ్చేస్తే, మళ్ళీ వాడికి తలకాయ, రాజ్యం అన్ని వచ్చేశాయి. అలా సమర్పణ చేసేటప్పుడు, దానం చేసేటప్పుడు, పుణ్యం వస్తుందని చేయకూడదు. పుణ్యం ఏమిటి? వాడికి కావాల్సింది నీ దగ్గర ఉందీ, ఇచ్చావు, అంతే! దేవుడు మెచ్చుకుంటాడని దానం చేయడం కాదు. ఎదుటి సహజీవి కష్టపడుతున్నాడు, నీ దగ్గర ఉందా, యివ్వగలవా యివ్వు అంతే. ఇట్లా యిచ్చిన వాడికి మళ్ళీ తిరిగి వస్తుంది. అందుకని ఈయన యజ్ఞం అలా జరుగుతూంటే ఈయన తరక్కుండా ఉండిపోయాడు. ఎందుకంటే యజ్ఞం చేసేటప్పుడు యిన్ని ఆలోచనలూ లేవు, యింత బెరుకూ లేదు. తనని తాను అందులో సమర్పణ చేసుకుంటూ ఉంటే ఏం జరిగింది అంటే తనూ ఉన్నాడు, సృష్టి జరిగిందీ, మొత్తం అంతా rotational గా move అవుతూ అలా ఉండి పోయింది. అలాగే యిస్తున్న వాడు పూర్ణం గా ఉంటాడు. అలా అలా దానధర్మాలు చేస్తున్న కొద్దీ వస్తున్న వారు చాలా మంది ఉన్నారు. అసలు నిజానికి ఉన్నదంతా పూర్ణమే! యజ్ఞార్థం జరుగుతున్న దాంట్లో తరుగుండదు. ఆవుపాలో, గేదెపాలో ఈరోజు పిండుకుంటే అయిపోయినాయా?

మళ్ళీ సాయంకాలానికి పాలు వచ్చినాయి కదా. అలా పిండుతూనే ఉన్నాం. అలా వస్తూనే ఉన్నాయి కదండీ! అదీ శ్రీకృష్ణుడు చెప్పిన పెద్ద రహస్యం. 'ఇదంతా ఒక చక్రభ్రమణం. వెళ్ళిందల్లా తిరిగి వస్తుంది. ఇచ్చేసేయ్, మళ్లీ వస్తుంది చక్రంలో. నువ్వు దాచావా నీకు కుళ్ళబెట్టేస్తుంది. ఇప్పుడు ఆకాశం నుండి నీళ్ళు వస్తున్నాయి, వర్షఋతువు ద్వారా. అవి నదుల లోంచి పారుతున్నాయి. అందరికీ దాహం తీరుస్తాయి. బావులు తవ్వుకున్న వారికి బావుల ద్వారా వస్తున్నాయి. Bore లు తవ్వుకున్న వారికి bore ల ద్వారా నీళ్లు వస్తున్నాయి. నీళ్లన్నీ సముద్రంలోకి వెళుతున్నాయి. సముద్రంలోంచి ఆకాశంలోకి వెళుతున్నాయి. ఆకాశం 'నేను మీకు నీళ్లు ఇవ్వను' అంటోందా? ఎక్కడ ఆగుతోందీ? అట్లా తిరుగుతూనే ఉంది కదా! మొత్తం నీరు ఎక్కడికి పోలేదు. వచ్చిన నీరంతా కొంత అందరి కడుపులలోనూ, కుండల లోను, reservoirs లోను, కొంత మన ఇంటి overhead tanks లోనూ, Sumps లోనూ, ఇలా మొత్తం అంతా ఎక్కడో అక్కడ ఉంటుంది. ఏమీ కాదు. మళ్లీ వస్తూనే ఉంటుంది. ఇంట్లో బియ్యం బస్తా వండుతూ ఉంటే, తింటుంటే అయిపోతుంది. ఒకటి అయిపోతే ఇంకో బస్తా రాదూ! అదే వ్రాశారు మాస్టారు శంఖారావంలో. బియ్యం అయిపోతే మళ్లీ వస్తాయనే ధైర్యంతోనే ప్రతి స్త్రీ వంట వండేస్తూ ఉంటుంది. ఎక్కడి నుండి వస్తుందీ. యజ్ఞార్థం! ఊళ్ళో వాళ్లకి పని చేస్తుంటే వాళ్లేమో మనకు యిస్తుంటే మనం కొనుక్కొచ్చి ఇంట్లో పడేసుకుంటాం. కొంతమంది శాస్త్రజ్ఞులు చెప్తూ ఉంటారు, ఇంత జనాభా ఇంత తింటే యిహ తరువాత ఏమీ ఉండదని. అది పూర్ణ అజ్ఞానం! భూమిలో ఉండే గనుల్లో ఉన్న metals మనం వాడేస్తే మళ్ళీ ఉండవు. Petrol అయిపోతుంది అంటారు. అయిపోతుంది అనేది నీ బుర్రలో ఉన్న దరిద్రం తప్ప సృష్టిలో లేదు. అయిపోవడం ఏమిటీ? ఒక పక్క అయి పోతూ ఉంటే, యింకొక పక్క తయారవుతూ ఉంటుంది సృష్టిలో. అది యజ్ఞం. ఏది అయిపోదు. ఈ గోళమే అయిపోదు. ఈ గోళము అయిపోయినాక యింకొక గోళం వస్తుంది. ఓ సినిమా అయిపోతే ఇంకో సినిమా రావడం లేదండీ? వస్తోందా, లేదా! ఏదీ అయిపోయిందండీ. నువ్వు వెళ్ళిపోతే నీ పిల్లలు వస్తారు. వాళ్ళ తర్వాత వాళ్ళ పిల్లలు, అలా continuation ఉంటూనే ఉంటుంది. సృష్టిలో ఉన్నది ఎక్కడికీ పోదు. లేనిది రాదు. అదే చక్రభ్రమణంలా తిరుగుతూ ఉంటుంది. ఇది భగవద్గీత మూడవ అధ్యాయంలో చిట్టచివరిలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన రహస్యం. అయిపోతుందని బాధపడేవాడు దరిద్రుడు. నీకిది ఎక్కడి నుండి వచ్చిందో అక్కడి నీవు అడ్డుకట్ట వేయకపోతే అది మళ్ళీ వస్తూనే ఉంటుంది. తరగకుండా జరుగుతూనే వుంటుంది. యజ్ఞార్థం జీవించేవాడు భయపడడు. భక్త తుకారాం, భక్త రామదాసు, భక్త పోతన యిలాంటివారు, ఇంటికి ఎవరైనా వచ్చి ఏదన్నా అడిగితే యిచ్చేస్తూండేవారు. వారికి ఉన్నదనికాదు.

వారికి ఉన్నది ఏముందో అదే! కుచేలుడు ఏం చేశాడు? ఉన్న పిడికెడు అటుకులూ పోయి ఇచ్చేస్తాడు. ఇవ్వడంలో ధీరత ఉన్నది. దాచుకోవడం లో పిరికితనం ఉన్నది. యజ్ఞం తెలిసినవాడు ఆపడు. తనని కూడా అలా యిచ్చేసుకుంటాడు. మనకన్నీ భయాలే. భారతంలో ఒక కథ ఉంది. అన్నదమ్ములు ఇద్దరు ఉన్నారు. ఇద్దరు యోగ నిష్ఠతో అరణ్యం లో చెరో పాక వేసుకుని తపస్సు చేసుకుంటున్నారు. ఆ చుట్టు ప్రక్కల ఉండే ఫలాలు ఇంట్లో తెచ్చి పెట్టుకుని, తపస్సు చేసినంత సేపు చేసుకుని, లోపల బాగా అగ్నీ ప్రజ్వరిల్లితే, దాంట్లోంచి ఆకలి పుడితే ఫలమో, ఆకో తినేస్తూ ఉండేవారు. అలా ఇద్దరూ చేసుకుంటున్నారు. ఆరోజు తమ్ముడికి తపస్సు చేసుకుంటూ ఉంటే బాగా ప్రజ్వలనం జరిగి, శరీరం తాపం చెంది, లోపలిదంతా హరించుకుపోయి విపరీతమైన ఆకలి వేసింది. తన దగ్గర వున్నవి తినేసి కూర్చుంటాడు. ఆరోజు తపస్సు చేశాక మరోసారి మళ్ళీ ఆకలి వేసింది. ఆగలేక పోయాడు. శరీరానికి ఏదైనా పడేసి దాన్ని స్వస్థతలో పెడితే తప్ప యోగం జరగదు. తలకాయ నొప్పి ఉన్నప్పుడు meditation చేయమంటే అవతలి వాడ్ని లెంప పగలగొడదాం అనిపిస్తుంది. ఒంట్లో నొప్పులు ఉంటే meditate చేయమంటే కుదరదు. శరీరానికి ఒక రకమైన స్వస్థత ఏర్పరిచి యేం చేసినా చేసుకోవాలి. పాకలో ఏమీ లేవు. ఇతగాడికి ఎక్కడికో వెళ్ళి తెచ్చుకుని తినేంత ఓపిక లేదు. పక్క పాకలో అన్నయ్య వుంటాడు కదా అని అడిగి తెచ్చుకుందామని వెళ్తే అన్నయ్య లేడు. కానీ అన్నయ్య ఏరుకొచ్చిన పళ్ళు వున్నాయి. ఆకలి ధర్మమెరుగదు. నిద్ర సుఖమెరుగదు. అన్నయ్య వచ్చాక చెప్పచ్చులే అని, ఆ పళ్ళు తిని తిరిగి తన తపస్సు కు వెళ్ళిపోయాడు. సాయంత్రం తపస్సు లోంచి లేచాక అన్నయ్య పాకకి వెళ్ళాడు. అన్నయ్య ఆదరించి 'ఏం నాయనా తపస్సు బాగా జరిగిందా' అడిగాడు. 'ఈరోజు తపస్సు ఎంత బాగా జరిగిందంటే నేను ఒక పొరపాటు చేయాల్సి వచ్చింది'. 'ఏమిటీ?' అంటే 'నీ పాకలో నీవు పెట్టుకున్న పెట్టుకున్న ఫలాలు నీ అనుమతి లేకుండా నేను తిన్నాను. అది నీకు చెప్పడానికి వచ్చాను. నువ్వేదో శిక్ష యిచ్చి నన్ను ఉద్ధరించవలసినది' అని తమ్ముడు అంటాడు. అన్నయ్య యింట్లో వీడు వెళ్ళి తింటే అది దొంగతనంట. అలా ఖచ్చితంగా చూసుకుంటారు వీళ్ళు విషయాన్ని. 'ఏదో శిక్ష వేస్తే తప్ప, ఈ తప్పుకు నిష్కృతి లేదు. లేకపోతే కట్టి కుడుపుతుంది' అంటాడు తమ్ముడు. 'అవును, నీకు శిక్ష వేయకపోతే శ్రేయస్సు కాదు'. అంటాడు అన్నయ్య. 'పోన్లే వదిలేయరా' అనలేదు. 'నువ్వు శిక్ష వెయ్యి' అన్నాడు తమ్ముడు. 'సరే రా' అని చెప్పి రెండు చేతులూ చాచమన్నాడు. చాచితే ఆ రెండు చేతులను గొడ్డలి పెట్టి ఖండించేశాడు. అలా ఉంటుందండీ? తిన్నది రెండు పళ్ళు. అదీ ఆకలి వేస్తే తిన్నాం. దానికి చేతులు నరికేస్తారా! తమ్ముడు చాలా సంతోషించాడుట. అసలు ఇవి మనకు అందే కథలు కావు. 'దణ్ణం పెట్టలేక పోతున్నాను అన్నయ్యా,

నువ్వు నాకు చేసిన ఉపకారానికి నీకు దణ్ణం పెట్టాలి కానీ చేతులు లేవు కనుక నోటితోనే కృతజ్ఞతలు చెప్పుకుని వెళ్ళిపోతాను' అనడం తరువాయి రెండు చేతులూ వచ్చేస్తాయి. అప్పుడు అన్నయ్య సంతోషించి 'నీ చేతులు రాకపోతే నా తలకాయ నరుక్కునే వాడిని' అని చెప్తాడు. 'నీకు చేతులు తప్పక వస్తాయి. కానీ నీకు ముందే ఆ మాట చెప్పకూడదు ఎందుకంటే శిక్ష శిక్షగానే అనుభవించాలి.' అంటాడు. తరువాత చేతులు వస్తాయి, ఇప్పుడు నరికేస్తాను' అంటే? పదివేల రూపాయలు దానం చేస్తే ఓ మిలియన్ రూపాయలు వస్తాయంటే అప్పు చేసి అయినా సరే ఎంతమంది దానం చేయరండీ? భగవంతుడి మీద భారం వేసి తమ్ముడు దుష్కృతి చెందకుండా వుండడం కోసం ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో, భగవంతుని స్ఫూర్తితో ఆ అన్నయ్య చేతులు నరికాడట. ఎందుకంటే ధర్మాన్ని కోరి, తనకి నిష్కృతి చూపమని అడిగిన తమ్ముడికి చేతులు రావాలనే భావనతోనే నరుకుతాడట. వాడి చేతులు వస్తే అన్నయ్య సంతోషించాడట. అలాగ యజ్ఞార్థం చేసినది ఏది పోదు. 'త్యాగేనైకేన అమృతత్త్వ మానసుః', అన్నారు. అమృతత్త్వ సిద్ధి యెప్పుడు వస్తుందయ్యా అంటే మన దగ్గర వున్నది కష్టం లో ఉన్నవారికి, నష్టంలో ఉన్న వారికి అందించడంలోంచి అమృతత్త్వసిద్ధి వస్తుంది. కానీ లేకపోతే రాదు. మరి భగవంతుడు తనే ఒక ఉదాహరణగా నిలిచాడు. He has become Himself an example of sacrifice. అందుకే ఆయనను సర్వహుతః, 'All Sacrificer' అన్నారు. అట్లా తనని తాను సమర్పణ చేసుకున్న ఆయన, శాశ్వతుడై వున్నాడు. అలాగే సమర్పణ చేసుకున్న వాళ్లు కూడా అంత శాశ్వతులై భగవద్భక్తులుగా ఎప్పటికప్పుడు పూర్తిగా కొనియాడబడుతుంటారు. స్తోత్రములు చేయబడుతూంటారు. భగవంతుడితో సమానముగా ఆరాధింపబడుతుంటారు.

## ౭౦౬ స్తవ్యః

స్తవ్యః అంటే కొనియాడ తగిన వాడు, కేవలము కొనియాడబడ తగువాడు, ప్రశంసింపబడు వాడు, ప్రశంస ఎవరికి చేసినా ఆయనకి చెందినట్లే, ఎవరి యందు కళ్యాణ గుణాలు మనం దర్శనం చేసి వారిని మనం పొగిడినా అవి అందేవి కూడా భగవంతునికే! భగవద్భక్తుడు ఎదుటి వ్యక్తిలోనున్న కళ్యాణ గుణాల్ని గుర్తించి కీర్తిస్తాడు. భక్తుని యొక్క ముఖ్యమైన లక్షణాల్లో ఒకటి ఏమిటంటే ఎంత సామాన్యమైన జీవియందు కూడా గుణవిశేషాలను గుర్తించి, శ్లాఘించి, తాను తృప్తి చెంది, ఎదుటి జీవి రూపంలో ఉండే భగవంతుడిని కూడా తృప్తి పరచి, ఆయన యొక్క ఆశీర్వచనాన్ని పొందుతూ ఉంటాడు. ఇది ఈ స్తోత్రాలలో ఉండే ఒక ముఖ్యమైన లక్షణము, ముఖ్యమైన ఉపాయం కూడా! మనల్ని మనం చక్కగా తీర్చిదిద్దుకోడానికి, మనకున్న రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు, మదము, మాత్సర్యము వీటిల్లోంచి మనం బయట పడటానికి కూడా ఇది ఒక చక్కని మార్గము. మనకి ప్రస్తుత కాలంలో అంత పరిపూర్ణముగా ప్రతీ సామాన్యమైన వ్యక్తిలో కూడా కళ్యాణ గుణాలను దర్శించి కీర్తించే ఒక భక్తుడుగా అప్పలాచార్యుల వారు కనిపిస్తారు. ఆయన ఎంతటి వారినైనా వారిలో ఉండే భగవంతుడ్ని దర్శించి, అక్కడ ఉపస్థితి అయివున్న కళ్యాణ గుణాలను హృదయపూర్వకంగా కొనియాడతారు. అలాగని భట్రాజులాగా పొగడరు, మామూలుగా భట్రాజులు తమకి ఎదో లాభించడం కోసం ఇతరులను పొగడటం అనే ఒక వ్యాపార లక్షణం కలిగి ఉంటారు. అది మామూలుగా మానవ సమాజంలో మనకి ఎవరితో పని ఉంటె వాళ్ళని పొగుడుతూ ఉంటాము, పని అయిపోతే తిడుతూ ఉంటాము, పని కాకపోతే తిడుతూ ఉంటాము, ఇట్లా జరుగుతూ ఉంటుంది. అదంతా వ్యాపార లక్షణము. అలా కాకుండా మనస్ఫూర్తిగా త్రికరణశుద్ధిగా ఎదుటి వ్యక్తిలో ఉండే కళ్యాణ గుణాలను వెతికి చూచి, ప్రతీ వ్యక్తిలో ఎదో ఒకటి కనిపిస్తుంది, అది వెతికి చూసుకోవాలి, దాన్నే ఆ వ్యక్తిలో ఆరాధన చేసుకోవాలి, ఇతరములైన విషయములు అతనికి సంబంధించినవి మనం మన మేధస్సులో, మన మనస్సులో, మన భావంలో, వాటి గురించి మనకి అవసరం లేదు, అప్రస్తుతం. కళ్యాణ గుణములు మాత్రమే మనకి ప్రస్తుతం, ఎందుకంటే అక్కడ ఆ విధంగా భగవంతుని యొక్క సాన్నిధ్యం మనకి లభిస్తుంది కాబట్టి దాన్ని మాత్రమే పొందడం. ఇది చాలా ముఖ్యమైన సాధనా ప్రక్రియ. మనలో ఉండేటువంటి చైతన్యమునకు ఒక రకమైన పవిత్రత చేకూరాలంటే ఈ విధమైన స్తుతి చేయటం అనే సాధన ఒకటుంది. భగవంతుడిని స్తుతి చేయటం భగవంతుడు జీవుల రూపంలో మెదులుతూ వున్నపుడు ఆ జీవులలో ఉండే కళ్యాణ గుణాలని త్రికరణశుద్ధిగా

హృదయపూర్వకంగా స్తుతి చేయడం, ముందొక మాట వెనకాల ఒక మాటగా కాకుండా ఎంత చిన్న జీవులైనా సరే గమనించవలసినది ఉంటుంది అని చెప్పడం కోసమే మనకి అవధూత గీత ఇచ్చారు. అక్కడ చీమ దగ్గర నుండి, సాలెపురుగు దగ్గర నుండి, వేశ్య దగ్గర నుండి, దొంగ దగ్గర నుండి నేర్చుకోవలసినవి ఉన్నాయని చూపించారు. బాణం ముళ్ళు తయారు చేసేవాడు గురించి చెప్పి వాడి ఏకాగ్రతను గూర్చి చెప్పారు. ఇట్లా రకరకాలుగా ఇరవైనాలుగు మంది గురువులను చూపిస్తారు మనకి అవధూత గీతలో. ఉద్దేశ్యం ఏమిటంటే ప్రతి వ్యక్తిలో మాత్రమే కాకుండా, ప్రతీ జీవిలో కూడా నేర్చుకోవలసింది ఉంటుంది. చెట్టుని గురువుగా చూపిస్తాడు, పక్షిని గురువుగా చూపిస్తాడు, రకరకములైన మానవులని గురువుగా చూపిస్తాడు, పంచభూతాలని గురువుగా చూపిస్తాడు. ఎందుకంటే ఒకొక్క దాంట్లో ఒకొక్క అద్భుతమైనటువంటి కళ్యాణ గుణం భగవంతుడి యొక్క అస్తిత్వంగా బాగా అక్కడ ఎక్కువ మేల్కొంచి ఉంటుంది, దాన్ని మనం ఆరాధన చేయడం వల్ల మనలో ఆ గుణములు ప్రచోదనం చెంది, మేల్కొంచి మనకి ఉత్తీర్ణత కలిగిస్తాయి. అందుకని భక్తి మార్గంలో సృష్టిలో ఉండే సమస్త జీవులని ఆరాధన చేసుకోవడమే తప్ప ఎద్దేవా చేయడం ఉండదు. మనము మామూలుగా వేళాకోళంగా కానీ, మరొక విధంగా కానీ ఎదుటి వ్యక్తిలో రంధ్రములు అన్వేషిస్తూ ఉంటాము. కలికాలంలో ఎంత మంచి వ్యక్తి యందు కూడా, ఎంతో సంస్కారవంతుడి యందు కూడా, మహాత్ముని యందు కూడా తప్పులు వెతికే లక్షణం మన యందు కనిపిస్తూ ఉంటుంది. దేవుడనో గురువనో, అందరూ దణ్ణం పెట్టుకుంటుంటే, వెనకాల నుండి మనం ఆ-- ఆయన సంగతి మాకు తెలుసులెండి, అన్నట్టు మాట్లాడతాం. అది సాధకుడికి, భక్తుడికి ఉండవలసిన గుణం కాదు. ఎవరు ఎవరికి దణ్ణం పెట్టుకుంటుంటే నీకెందుకు, నీకూ చేతనైతే దణ్ణం పెట్టు, లేకపోతే మౌనంగా ఉండు. భావంలో కూడా అటువంటి వికృతమైన భావాలని పెంపొందనీయకుండా ఉండాలి. స్తవ్యుడు భగవంతుడు అని ఈ నామం చెప్తుంది, స్తవ్యః అంటే పొగడబడతగిన వాడు అని, పొడబడతగిన వారెవరయ్యా అంటే భగవంతుడే, కాబట్టి భగవంతుడ్నే పొగుడుతాను అని అనుకోకూడదు, భగవంతుడే సృష్టి రూపంలో ఉన్నానని అని మొట్టమొదటే చెప్పేసాడు 'విశ్వం విష్ణుః' కదా... కాబట్టి విశ్వ రూపంలో ఉన్న ఈ రూపాలన్నిటిలోను భగవంతుడి యొక్క అస్తిత్వాన్ని చూచి, ఎరిగి, గుర్తించి, శ్లాఘించ గలగడం అనేది వ్యక్తిలో సత్త్వగుణాన్ని పెంచుతుంది. అలా కాకపోతే మనలో రజో గుణం, తమో గుణం ఉండి రంధ్రాన్వేషణ చేస్తుంటాము. రాముడంతటి వాడిలో రావణుడికి ఏం కనపడలేదు. కృష్ణుడంతటి వాడిలో శిశుపాలుడికి ఏం కనపడలేదు. దుర్యోధనాదులకు ఏం కనపడలేదు. కానీ భక్తుడికి ఎట్లా ఉంటుందంటే ఎంత చిన్న సామాన్యమైన జీవిలో కూడా భగవంతుడి

యొక్క అస్తిత్వం కనిపిస్తుంది. రాముడు రావణుడిని చూసి పొందిన ఆనందం, రావణుడు రాముడిని చూసి పొందిన ద్వేషం మనం గమనించినట్లయితే, రావణుడు రాముడిని చూసి ద్వేషం పొందవలసింది ఏమీ లేదు రాముడిలో, తనలో ఉంది కాబట్టి ద్వేషించాడు. రాముడు రావణుడిని చూచినపుడు లౌకికంగా చూచినట్లయితే పొగడవలసింది గాని, ఆనందించ వలసింది గాని ఏమీ లేదు. కానీ ఆయన దైవీ స్వభావం కలిగినవాడు కాబట్టి చూడంగానే ఆనందించాడు. చూడండి ఎంత తేడా ఉందో! మహాత్ములు ఆ విధంగా ఆనందిస్తారు. దురాత్ములు మహాత్ముల యందు కూడా లేని దుర్గుణములు ఆపాదించి మరీ చూచి వాక్కుని వృథా చేసుకుంటూ ఉంటారు. అందుకని స్తవ్యుడు భగవంతుడే, ఏ రూపంలో అయినా సరే మనం ఎవరిని పోగొడుతున్నా వ్యాపారధోరణితో పొగడడం కాకుండా, అతనిలో ఉండే కల్యాణ గుణాలను మనస్ఫూర్తిగా కీర్తించగలిగే సంసిద్ధత ఉండాలి. తప్పులెన్నడానికి ఏముంది, ఎవరైనా ఎన్నుతారు. ఎన్నుతూనే ఉన్నాం మనం, ఈ నామం మనకేవిటి ఎరుకపరుస్తుంది అంటే 'అబ్బాయి తప్పులు చూడకురా... ఒప్పులు చూడు, తప్పులతో నీకేం సంబంధం? ఎలాగూ వాడి తప్పులతో వాడు చిక్కులు పెట్టుకుంటూనే ఉంటాడు, బాధ పడుతూనే ఉంటాడు. వాడి తప్పుల్లో నువు వేళ్ళు, కాళ్ళు పెడితే అవి నీకు కూడా అంటుకుంటాయి, నువ్వు బాధ పడతావు.' అందుకనీ ఎవరిని పొగిడినా మనస్ఫూర్తిగా ఉన్నది చూచి పొగడాలి. మనం పొగడడం ఎట్లా ఉంటుందంటే ఇష్టాఇష్టాల మీద ఆధారపడి ఉంటుంది. కపిలుడు దేవహూతికి ఈ విషయం చాలా చక్కగా చెప్తాడు. మనకి ఇష్టం అయిన వాళ్లలో లేని కల్యాణ గుణాలను చూసి పొగుడ్తాం, మనకి ఇష్టంలేని వాళ్లలో ఉన్న కల్యాణ గుణాలను చూడక తిడతాం. రెండు రకాలుగా తప్పలే చేస్తూ ఉంటాము. ఉన్నదాని కన్నా ఎక్కువ లేనిది ఆపాదించి పొగడటం అసత్యం. ముందు వచ్చిన వ్యక్తిలో సద్గుణం గుర్తించి, దానిని మాత్రమే శ్లాఘించాలి. మిగతా వాటి గురించి మనకి సంబంధం లేదు. ఆ విధంగా మనం గనక చేసినట్లయితే ఎవరిని మనం నిజంగా శ్లాఘించాలో, ఎవరిని మనం స్తుతించాలో వాడిని స్థుతించినట్లు, ఆ జీవుని రూపంలో. అలా కాక చేసిన స్తుతులన్నీ కూడా వాక్కుని వృథా చేసినట్లు అవుతుంది. గుర్తుపెట్టుకోండి, అసలు తత్త్వమే వాక్కుగా దిగి వస్తుంది కాబట్టి దాన్ని దుర్వినియోగం చేయాల్సిన పరిస్థితి భక్తుడికి లేదు, హక్కు లేదు, బాధ్యత ఉన్నది. భక్తునికి వాక్కు యందు బాధ్యత చాలా ఉన్నది, అది పొరపాటుగా వాడినప్పుడల్లా చాలా బాధ పడతారు. కారణం ఏంటంటే వాక్కుని వినియోగించడం అంటే భగవద్ తత్త్వాన్ని వినియోగించడమే! 'వాగేవ ఋగ్వేదః' అని చెప్పారు పెద్దలు. ఋగ్వేదమే, అంటే ఉచ్చారణమే జరుగుతూ ఉంది. అదెక్కడ నుండి జరుగుతుందంటే చేతనలోంచి వస్తుంది. మనం ఉండబట్టి, మనలో చేతన

ఉండడం బట్టి, ఆ చేతన ఆధారంగా ఈ ఉచ్ఛారణ జరుగుతూ ఉంటుంది. జరుగుతున్న ఉచ్ఛారణ వ్యర్థం కాకూడదు కదా. అందుకని పొగడ్త ఎలా ఉండాలంటే సత్యపరంగా ఉండాలి. అప్పుడు సత్యాన్నే పొగిడినట్లు అవుతుంది. మరొక రకమైన పొగడ్తల వల్ల ఉపయోగం లేదు. ఆ విధంగా పొగిడితే జీవుడి రూపంలో ఉండే దేవుడు కూడా సంతోషిస్తాడు. అది 'స్తవ ప్రియః'!

## ౭౦౭ స్తవప్రియః

స్తోత్రములు చేస్తాం, స్తవములు చేస్తాం, భగవంతుడు ప్రీతి చెందుతాడు, అనే భావన మనకి ఉన్నది, సాంప్రదాయం కూడా ఉన్నది, అది సత్యం. అది కాక మన మాటల్లో జీవుల యొక్క కళ్యాణ గుణాలు గుర్తించి దానిని మోతాదు మించక, మోతాదు తగ్గించక శ్లాఘించినట్లైతే కూడా జీవుల రూపంలో ఉండే భగవంతుడు ప్రీతి చెందుతాడు. మహాత్ములు ఆ విధంగా శ్లాఘిస్తారు. మరొక విధంగా శ్లాఘించరు. అహంకార పూరితులని శ్లాఘించరు. వారిలో ఎక్కడ ఏ విషయంలో సత్త్వ గుణం కనిపిస్తుందో దాన్ని మాత్రం ఏరి పొగుడ్తారు, ఒక్కటి ఏరుకుని. మొత్తం మనిషిలో తమో గుణాలు, రజో గుణాలు సత్త్వ గుణాలు అన్నీ ఉంటాయి, సామాన్యుడిలో సత్త్వంకన్నా ఎక్కువ మిగతావి ఉంటాయి. సత్త్వాన్ని మాత్రం, ఆ ఒక్కటి మణిపూస లాగ బైటికి తీసుకుని దాన్ని పొగుడుతూ ఉంటారు. ఎందుకంటే వాడిలో కూడా అది ప్రచోదనం జరుగుతుంది, పొగిడిన వాడిలో కూడా అది ప్రచోదనం జరుగుతుంది, ఈ విధంగా భగవంతుడు ప్రీతి చెందుతాడు. అది స్తవప్రియం. స్తవం చేయడం వల్ల ప్రియం కలగడం అన్నది రెండు ప్రక్కల జరుగుతుంది, భగవంతుడు ప్రీతి చెందడం అంటే నీలో ఆనందం పెరగడమే, నీలో ప్రీతి పెరగడమే! ఆరాధన చేసుకునే వాళ్లకి మనస్సు ప్రశాంతంగా తయారవుతుంది. తర్వాత మళ్ళీ ఏమవుతుంది అనేది ప్రవర్తన బట్టి ఉంటుంది తప్పా, చేసుకున్నంతసేపూ బావుంటుంది. స్తవ ప్రియః అంటే పొగుడుతుంటే నచ్చుతుందనే అవగాహన ఉంది కదా! కాదు! సత్యమే పొగడాలి, సత్యాన్నే కీర్తించాలి. మనలో ఉన్న భగవంతుడి సాన్నిధ్యాన్ని, మనం పొందడానికి అదొక్కటే మార్గం. ఆయన అందరి యందు సన్నిధి ఇచ్చి ఉన్నాడు, భగవంతుడి సన్నిధి కారణంగానే మనం ఉన్నాం కాబట్టి ఉన్న సన్ని,ధిని మనం పొందాలంటే కీర్తనమో, స్తవమో, స్తోత్రమో, పూజా, ప్రార్ధన ఇదొక మార్గం. ఇది కారణం చేత సాన్నిధ్యం మన మనోపొరలలోకి కూడా దిగి వచ్చి మనకి ఆనందాన్ని కలిగిస్తుంది. అది ఎప్పుడూ ఉన్నది. కానీ శ్లాఘించినపుడు, కీర్తించినపుడు మనకి అది సాన్నిధ్యాన్ని ఇస్తుంది. లేకపోయినా ఉన్నది. సాన్నిధ్యం శాశ్వతమైనప్పటికీ కూడా మనకి ఎప్పుడది సత్యం అవుతుందంటే శ్లాఘించడం ద్వారా సత్యమవుతుంది, కాబట్టి స్తవప్రియుడు. స్తవం చేత అతను ప్రీతి చెందడం అంటే, మనం ఆనందం పొందడమే! అంటే అతడి సాన్నిధ్యం చేత మనం ఆనందం పొందడం. అందుకనే స్తోత్రం చేసుకుంటాం. మనం స్తోత్రం చేయకపోతే భగవంతుడికి తరిగేదేం లేదు. స్థోత్రం చేయడం వల్ల మనలో ప్రీతి జనిస్తుంది, ఆనందం జనిస్తుంది, ఆహ్లాదం జనిస్తుంది, హాయిగా ఉందనిపిస్తుంది. హాయిగా ఉందనిపించడం బట్టే మళ్ళీ మళ్ళీ చేస్తున్నాం,

కదా! ఏడుస్తూ అయినా, మరొకరకంగా అయినా ఏదో ఇదే better లే మిగతా వాటి కన్నా అనుకుని, ఎట్లగో అట్లా మొత్తానికి ఆయన్ని శ్లాఘించడం చేస్తున్నాం, ఎందుకంటే లోపల దానికి సంబంధించిన రుచి ఉండడం చేత!

## ౭౦౮, ౭౦౯, ౭10 స్తోత్రం, స్తుతః, స్తోతా

ధ్యానం చేస్తున్నాం, ఎవరు ధ్యానం చేస్తున్నారు? ప్రతి దాంట్లో, అంటే స్తోత్రం చేస్తున్నామనుకోండి స్తోత్రము, స్తోత్రం చేయబడే వాడు, స్తోత్రం చేస్తున్న వాడు, ఇన్ని రూపాల్లోనూ వాడే ఉన్నాడు కదా, అందుకని భగవంతుడ్ని స్తోత్రం చేస్తున్న వాడు భగవద్స్వరూపుడే! భగవంతుడ్ని స్తోత్రం చేస్తున్నపుడు మన గురించి గుర్తుండదు మనకి, కదా! అంటే స్తోత్రం చేయడంలో, ఆయన సాన్నిధ్యంలో మనం నిలబడి ఉండడం వలన మన గురించి గుర్తులేక ఆయన గురించే గుర్తు పెరుగుతూ ఉంటుంది, ఆయన గురించి గుర్తు పెరుగుతున్న కొద్దీ ఆయన సాన్నిధ్యం పెరుగుతుంది. ఆ విధంగా ఇతడు తాత్కాలికంగా భగవద్స్వరూపుడుగా నిలుస్తాడు. అందుకని తన్మయంతో స్తోత్రం చేస్తున్న వారు కూడా అతడే! భగవంతుడిని స్తోత్రం చేస్తున్నవాడు కూడా భగవంతుడే అన్న భావన మనకి విష్ణుసహస్రనామం ఇస్తోంది. కొంత మంది చాలా శ్రద్ధా భక్తులతో ప్రతి రోజూ పూజ చేస్తారు, ప్రతి రోజూ కీర్తనలు చేస్తారు, ప్రతి రోజూ స్తోత్రములు చేస్తారు, ప్రతి రోజూ శ్లాఘిస్తూ ఉంటారు, స్తవములు చేస్తూ ఉంటారు. ఇట్లా చేసే వాళ్ళ రూపంలో అట్లా చేయిస్తున్న ఆ స్ఫూర్తి భగవంతుడి యొక్క అస్తిత్వమే, అని గుర్తించడం ఒక ముఖ్యమైన విషయం.

## 711, 712 రణప్రియః, పూర్ణః

అంటే రెండు అర్థాలు ఉన్నాయి. ఒకటి యుద్ధం అంటే ఇష్టమున్న వాడని. కానీ ఇక్కడున్న సన్నివేశంలో యుద్ధంతో సంబంధం లేదు. వరుసగా వచ్చే నామాలు మనం చూసుకుంటే యుద్ధం దేనికోసం అంటే ధర్మం కోసం యుద్ధం చేసే వారి యందు ప్రీతి చెంది ఉంటాడు అని ఒక అవగాహన ఉన్నది. ఎందుకంటే అర్జునుడిని యుద్ధం చేయమని కదా చెప్పాడు. ధర్మం కోసం పోరాడేవాడు తనకి ఇష్టుడు, ధర్మం కోసం పోరాడే వాడికి భగవంతుడు ఇష్టుడు, రెండు పక్కలుగా ఉంటుంది, రెండు విధాలుగా ఉంటుంది. కానీ ఇక్కడుండే ఈ నామాలు యొక్క వరుస తీసుకున్నపుడు 'రణము' అనే పదానికి ఇంకొక అర్థం కూడా ఉంది 'ఆనందము' అని. 'అంతర్ముఖమైన ఆనందం'. ఈ విధమైన స్తోత్రాదికములు చేస్తూ ఉంటే అంతర్ముఖమైన ఆనందాన్ని ఇచ్చే వాడు భగవంతుడు. కళ్ళు మూసుకుని లోపలే ఆనందం చెందుతూ, అట్లా చదువుకుంటూ ఉంటారు. నామం చేస్తారు, స్తోత్రం చేస్తారు, ఏవో పద్యాలు చదువుకుంటూ ఉంటారు, ఆరాధన చేస్తారు, ఇవన్నీ ఎందుకు చేస్తారంటే 'ప్రియుడు'. ఆనందాన్ని అందించే అత్యంత సన్నిహితుడుగా భగవంతుడు లోపల దర్శనం ఇస్తూ ఉంటాడు. అమ్మవారినో, అయ్యవారినో మనం అనుకున్న రూపంలోకి ఆవాహన చేసుకుని, హృదయంలో ఆరాధన చేస్తూ ఉంటే అందులోంచి మనకి ఆనందం కలుగుతూ ఉంటుంది. విష్ణు సహస్ర నామం చేసినా, లలితా సహస్ర నామం చేసినా, ఏ స్తోత్ర అష్టోత్తరాలు చేసినా అటువంటి ఆనందం లోపలి నుండి అందించి, మనకి శాంతిని, దాంతిని, ఉపశమనాన్ని కలిగిస్తూ ఉంటాడు కాబట్టి రణ ప్రియుడు! ఈ విధంగా మనం స్తోత్రాదికాలు చేసుకోవాలి. ఎవరిని స్తోత్రం చేస్తున్నా సత్యమునే స్తోత్రం చేయాలి, వారిలో ఉండే సత్యమును, వారిలో ఉండే కళ్యాణ గుణములను స్తోత్రం చేయడమే! అప్పుడే అందులో ఉండే భగవంతుడు సంతోషిస్తాడు. లేనిది అక్కడ మనం పొగిడితే ఎదుటి వ్యక్తిలో అహంకారం పెరుగుతుంది. మనం లేని అహంకారాన్ని ఎదుటి వాడికి ఆపాదించినట్లు అవుతుంది. అందుకనే శివుడు దక్షునికి నమస్కారం చేయలేదు, అందరూ పొగిడినా ఆయన పొగడలేదు. ఎందుకంటే అప్పటికే అందరి పొగడ్తలు విని, పొగడ్తలు తను అందుకుని, అవి దైవానికి సంబంధించినవని గుర్తు లేక తనకాపాదించుకుని, అహంకరించిన దక్షుడిని చూచి శివుడు పొగడడు. ఎందుకంటే అక్కడ పొగడడానికేం లేని పరిస్థితిలోకి వచ్చాడు దక్షుడు. అందుకని మనం పొగిడేప్పుడు కళ్యాణ గుణాలు, సత్త్వగుణాలు దర్శించి పొగడాలి. పొగడకపోతే నష్టం ఏం లేదు. అబద్ధాల పొగడ్తలు చేయకూడదు. అప్పుడే మనకి స్తవం నుండి భగవంతుడు ప్రీతి చెందడం అనేది 'స్తవ్యః స్తోత్ర ప్రియః'. స్తుతి అంటే

కీర్తించడం, కీర్తించేవాడు ఈ మొత్తం కారణంగా ఇవి జరిగే కార్యక్రమంలోంచి అంతర్ముఖంగా ఆనందం ఇచ్చేవాడు. 72 వ శ్లోకం లో 'మహాక్రమః' అనే నామానికి శనిగ్రహం అధిదేవతగా, అదే శ్లోకంలో 'మహాక్రతుః' అన్న నామానికి బృహస్పతి అధిపతిగా చెప్పుకున్నాం. అలాగే ఈ స్తోత్రానికి అధిపతి శుక్రగ్రహం లేక శుక్రుడు. ఎందుకంటే స్తోత్రము చేస్తున్న కొద్దీ అంతర్ముఖంగా ఆనందం పెరిగి హృదయంలో వికాసం కలిగి అంతర్దర్శనానికి అవకాశం ఏర్పడుతుంది. ఎందుకంటే బహిర్ముఖంగా మనం చూచిందే, ఆ ప్రతిమనే, అంతర్ముఖంగా లోగొని, హృదయంలో దాన్ని భావన చేసుకోవడం చేత ఆ ప్రతిమకు సంబంధించిన పదార్థం బయట మిగిలిపోతుంది. రూపు రేఖలు, వర్ణములు లోపల మనకి బాగా ఏర్పడి, దాని కాంతి పెరిగి, ఆ కాంతి మనలో ఉండే దివ్య శరీరాన్ని నిర్మాణానికి పనికివచ్చేట్లుగా తయారు చేస్తుంది. ఇది స్తోత్రంలో ఉండే మరొక రహస్యం. అందుకనే మన పెద్దలు దేవాలయాలు అవీ నిర్మాణం చేసి, అందులో దేవతలని ప్రతిష్ఠ చేసి, ఆ దేవతలని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఆ రూపం హృదయంలో హత్తుకునేట్టుగా ఆరాధన చేయించటానికి కారణం ఇది. కనులు మూసుకుంటే అదే దివ్య మంగళ రూపం లోపల గోచరించినపుడు ఆ పదార్థమయమైన ప్రతిమ లోపల పదార్థం లేకుండా, కేవలము రూపం మాత్రమే ఏర్పడి, దాని యొక్క వర్ణములు అంటే రంగులు, కాంతులు మాత్రమే లోపల మిగిలి, ఆ రూపం పెంపొందుతూ ఉంటుంది. అది కారణం చేత మనలో దివ్య శరీర నిర్మాణానికి పునాది ఏర్పడుతుంది. ఇది జరిగి హృదయంలో ఈ విధమైన ఆనందం ఎప్పుడైతే ఉద్భవిస్తుందో అప్పుడు ఇతడు పూర్ణత్వం వైపు ప్రయాణం చేయడానికి అవకాశం ఏర్పడుతుంది, అంతవరకు హృదయం వికాసం చెందకుండా పూర్ణత్వానికి అవకాశం లేదు. అందుకనే ప్రతి గురువు తన యొక్క శిష్యునికి అందించే ముఖ్యమైన విద్యలో, శిష్యుడు హృదయగతుడు కావాలని సంకల్పిస్తాడు. మనోగతుడైన శిష్యుడు, అంటే మనస్సుతో ఆలోచించే శిష్యుడు హృదయంతో ఆలోచించే పద్ధతుల్లో అతడిని ఉద్ధరించడానికి గురువు సంకల్పిస్తాడు. మనస్సు నుండి హృదయంలోకి ప్రవేశించడం అంటే చంద్రుడి నుండి శుక్రుడులోకి రావడం. శుక్రుడు అంతర్ముఖ సాధనకి గురువు. రహస్యవిద్యకి గురువు. అందుకనే మనకి ఈ స్తోత్రాదికములు భారతీయ సంప్రదాయంలో చాలా ఎక్కువ. ఇక్కడున్న స్తోత్రములు ఈ భూప్రపంచంలో మరెక్కడా లేవు. మనకి రకరకాల స్తోత్రాలు ఉన్నాయి. ఎందుకంటే రోజూ అదే చేస్తుంటే అదే కూర తిన్నట్టుగా మనస్సుకి విసుగు కలుగుతుందేమోనని, రకరకాల స్తోత్రాలు పెట్టారు. ఈ అంతర్ముఖంగా భగవంతుడ్ని మనం ఆరాధించుకుంటుంటే లోపల భగవంతుడి యొక్క రూపం కాంతులతో అవతరిస్తూ ఉన్న కొద్దీ, ఆ కాంతుల యొక్క అవతరణ నీలోంచే ఏర్పడి

నీకు దివ్య శరీర నిర్మాణానికి దారి తీసి పూర్ణత్వాన్ని చేకూరుస్తుంది. ఇలా వరుసగా కొన్ని కొన్ని పెద్దలు ఇచ్చిన శ్లోకాలని మనం లోతుల్లో చూస్తే ఈ విధమైన అమరిక కూడా ఉంటుంది. అందుకని ఈ శ్లోకంలో ఉత్తరార్ధంలో పూర్ణః అని వస్తుంది. పూర్ణత్వం ఎవరికయ్యా అంటే రణప్రియులకి! రణ ప్రియులు ఎవరయ్యా అంటే బయట యుద్ధం చేసే వాళ్ళు కాదు, లోపల స్తోత్రం చేయడం వలన పొందిన ఆనందంలో జీవిస్తూ ఉండే వాళ్ళు! చేస్తున్న కొద్దీ ఆనందం వస్తూ ఉంటుంది చాలా మందికి, చేస్తున్న కొద్దీ విసుగనిపిస్తుంది కొంత మందికి, ఆ! ఎన్నాళ్ళు చేస్తాం నా బొంద అన్నట్టుగా ఉంటుంది కొంత మందికి. అదెందుకు అట్లా ఉంటుంది అంటే తమోగుణం బాగా దట్టించి ఉంటె స్తోత్రం చేయబుద్ధి కాదు. ఎలుగెత్తి భగవంతుడిని ప్రార్ధన చేయడానికి కూడా సంసిద్ధత ఉండదు, ఎదో మెట్ట వేదాంతం చెప్పుకుని బతికేస్తూ ఉంటారు. ఆ చేస్తేనే నా! చేస్తేనేనా అంటే చేస్తేనే! ఎవర్నో పొగడడం లేదు కదా! దేని వల్ల మనం జీవిస్తున్నామో, ఏది సమస్తానికి ఆధారభూతమై ఉన్నదో దాన్ని పొగుడుతూ ఉండడం వల్ల లోపల ఆనందం కలుగుతుంది, అందుకనే అట్లా కీర్తించుకుంటూ జీవిస్తూ ఉంటారు భక్తులు. భగవంతుడిని శ్లాఘిస్తూ జన్మంతా గడిపేస్తాడు భక్తుడు. ఇహ మిగతా బాహిరానందాలు అఖ్ఖర్లా, అంతరానందమే! నీకు బహిర్గతమైన ఆనందం కన్నా అంతర్గతమైన ఆనందం కొన్ని వేలరెట్లు ఎక్కువగా ఉంటుంది. అది కాలంతో సంబంధం లేదు, దేశంతో సంబంధం లేదు, పరిస్థితులతో సంబంధం లేదు. ఎక్కడ కూర్చున్నా కళ్ళు మూసుకుంటే లోపల వాడితో కూర్చుని, ఆనందంగా వాడిని కీర్తించుకుంటూ అట్లా ఉంటూ, అట్లా అశ్రుధారలు కార్చే మహాభక్తుల యొక్క జీవితాలు మనం చూడవచ్చు. రఘువరదాస్ అవధూతేంద్ర సరస్వతీ స్వామని ఆంధ్రుల అదృష్టం కొద్దీ ఈ శతాబ్దం మధ్య కాలంలో విజృంభించి భజనలు చేశారాయన. ప్రత్యేకించి హనుమాన్ చాలీసాని మొత్తం ఆంధ్రా ప్రజానీకానికంతా పరిచయం చేసి హనుమంతుడి యొక్క అనుగ్రహం కలిగేట్లుగా కృషి చేశారు. ఆయన కీర్తన మొదలుపెట్టి చేస్తుంటే ఒకే ఒక్క నామం తీసుకుని ఎన్ని రకాలుగా ఆ నామాన్ని పలికేవారో! కలిసంతరణ మంత్రం 'హరే రామ హరే రామ' ఉన్నది కదా, దానిని ఆయన 24 గంటల సేపు గానం చేస్తే, ఒకొక్కసారి ఒకొక్క రాగంలో దాన్ని గానం చేస్తూ తను మైమరచి, అంటే శరీరాన్ని మరచి, అట్లా తాదాత్మ్యం చెందుతూ, కీర్తన చేస్తూ ఉంటె ఆ కీర్తనలో ఇమిడిపోయి అట్లాగే time తెలీకుండా పాల్గొన్న వాళ్ళు బోల్డు మంది ఉన్నారు. అంటే మన చుట్టు ఉన్న పరిసరాలను కూడా మరిపించేంత మాధుర్యంతో ఆయన గానం చేసేవారు. ఆయన చాలా చిన్న పిల్లవాడిగా ఉన్నప్పటి నుండి నేను మరీ చిన్న పిల్లవాడుగా ఉన్నప్పటి నుండి వారిని చూడడం జరిగింది. ఆయన లోపల గోచి పెట్టుకుని, గోనె సంచి ఒకటి చింపేసి అదే లుంగీగా కట్టుకునే వారు. పొద్దున్న లేచిన

దగ్గర నుండి కూర్చుంటే భగవంతుని ఆరాధనే, అంతర్ముఖంగానూ, బహిర్ముఖంగానూ. కళ్ళు మూసుకుని లోపల ఆరాధన, కళ్ళు మూసుకుని బైటికి ఆరాధనా! ఏం చేస్తున్నా కళ్లవెంబడి అట్లా నీరొస్తుండేది మొదట్లో, ఆయన చిన్నతనంలో. ఆయన పెద్ద వారయ్యే సరికి ఆయన చేస్తుంటే మిగతా వారందరికీ అట్లా వచ్చేసింది. ఆయన అసలు ఈ లోకంలోనే ఉండే వాడు కాదు, ఆ హృదయ లోకంలో ఉండేవాడు. అలా కీర్తన చేసే వాడు. అలా కీర్తన చేసే వాడికి పూర్ణత్వం రావడంలో ఆశ్చర్యం ఏముంది? ఆయన అంతర్ముఖుడయ్యాడు, హృదయం వికాసం చెందింది, తద్వారా పూర్ణత్వానికి అవకాశం ఏర్పడింది. ఇది ఆరాధనలో ఉండే ఒక రహస్యం. మీ ఓపిక బట్టి ఆరాధన బహిర్గతంగా చేసుకుని, ఆ తర్వాత అది అంతర్ముఖమవ్వాలి. మనం ఏ మూర్తినైతే బయట ధ్యానం చేస్తున్నామో, దాన్ని లోపల ఆవాహనం చేసి, ఆసనం సమర్పించి, పాదాలు కడిగి, చేతులు కడిగి, తాగడానికి చల్లటి మంచి నీళ్లు యిచ్చి, ఆ తరువాత స్నానం చేయించి, వస్త్రాలు బహూకరించి, గంధం ఇచ్చి, కుంకుమ ఇచ్చి, పసుపు ఇచ్చి, యజ్ఞోపవీత ధారణ చేయించి, పాదాలకు పూజ చేస్తున్నట్టుగా ఒకొక్క పువ్వు వేస్తునట్టుగా స్తోత్రం చేసుకుంటూ అంతా అయిపోయిన తర్వాత ధూప దీపాలు పెట్టి, నైవేద్యం పెట్టి, తాంబూలం ఇచ్చి, నీరాజనం ఇచ్చిన తర్వాత ఆ రూపాన్ని లోపల ఎంత సేపు దర్శనం చేయగలమో చూడు. ఇదంతా లోపల చేసుకో, లోపల చేసుకున్న దానికి అంతః శుద్ధి కలుగుతుంది ఒకటి, ప్రశాంతత కలుగుతుంది రెండు, మన హృదయము నందు భగవంతుడు ప్రతిష్ఠితుడై ఉన్నాడు కాబట్టి మనకి ఇంకే భయం లేదు అనే ధీరత మూడు, ఎక్కడికెళ్లినా మన హృదయంలో ఆయన్ని పట్టుకెళ్తున్నాం. పూర్వం ప్రతి వాళ్ళు పూజ పెట్టి పట్టుకు తిరుగుతుండేవాళ్లు. మనకు పూజ పెట్టి హృదయంలోనే ఉంది కాబట్టి ఎక్కడికి వెళ్లినా కళ్ళు మూసుకుని ఆ విధంగా ధ్యానం చేసుకోవడం అనే ఒక పద్ధతి ఉంది. మానసిక పూజ అని చెపుతూ ఉంటారు, అవకాశాన్ని బట్టి బహిర్గతంగా చేసుకోవాలి. ఎక్కువగా అంతర్గతంగా చేసుకోవాలి, అది కారణం చేత లోపల వికాసం చెందుతూ ఉంటె, అది పూర్ణత్వానికి దారి తీస్తుంది. ఈ ఆరాధన అంతా కూడా శుక్ర విద్య. 'Etheric body' అని ఒక పుస్తకం లో చెప్పి ఉంచాను. అది నేను చెప్పింది కాదు, పెద్దవాళ్ళు చెప్పిందే, మనకి అర్ధమయ్యే భాషలో రాసుకున్నాం. దాన్నే మనకి సూక్ష్మ శరీర నిర్మాణం అని మాస్టర్ CVV గారు చెప్పారు. యోగంలో జరగవలసింది అది. అదీ ఈ పూజాది కార్యక్రమముల ద్వారా కూడా జరిపించుకోవచ్చు, మనం ఇలా లోపల శ్లాఘిస్తూ ఉంటె ఆయన ప్రీతి చెందడం వల్ల రణప్రియుడు కదా! ఆనందాన్ని పెరుగుతుంది. ఆనందం పెరగడం అంటే సాన్నిధ్యం పెరగడమే, అంతరానందం కాబట్టి! బాహిరానందానికి ఉపాధి కావాలి. ఏదో ఉంటె ఆనందం, లేకపోతే

దుఃఖం, ఇట్లా ఉంటాయి. ఇదెప్పుడూ లోపల మనకి ప్రతిష్ఠితం అయ్యే ఉన్నది కాబట్టి దాన్ని ఆరాధన చేసుకుంటూ ఉంటె, ఆనందం పెరుగుతుండడం లోంచి పూర్ణత్వానికి మార్గం ఏర్పడి 'పూరయితా'.

## 713 పూరయితా

అంటే మనల్ని పూర్ణులుగా చేయడానికి ఆయన సంకల్పిస్తాడు. అంటే ఆయన దిగి వస్తాడు. హృదయంలోకి ఆయన దిగి వస్తున్న కొద్దీ మనలో పూర్ణత్వం పెరుగుతూ ఉంటుంది. పూర్ణత్వం పెరుగుతూ ఉండడం అంటే పరిమితత్వం తగ్గుతూ ఉంటుంది, సంకుచితత్వం పోతూ ఉంటుంది. ఈర్ష్య అసూయా, రాగ, ద్వేషాలు, మద, మాత్సర్యాలు, ఇటువంటివన్ని ఒకొక్కటి ఒకొక్కటి బైటికి వెళ్లిపోతాయి. పోవాలనుకుంటే అవి పోవు, ఈయన వస్తే అవి పోతాయి. మంచి కాట్ల కుక్కలలాగా ఉండేవాళ్ళం మహాత్ముని సన్నిధిలోకి రాంగానే, చాలా వినయంగా పిల్లి పిల్లల్లాగా ఉంటాం కదా. వంగి వంగి ఒకటికి పది సార్లు దణ్ణాలు పెట్టడం, ఆర్తితో చూడడం, ఎంత ఒదిగిపోయి ఉంటామో మహాత్ముని సాన్నిధ్యంలో కదా! మరక్కడి నుండి బైటికి వస్తే-- ముళ్ళపందిలాగ విచ్చుకుని ఉంటాం. ఇపుడు లోపల ఆయన యొక్క సాన్నిధ్యం పెరుగుతున్న కొద్దీ ఒక మహాత్ముని సాన్నిధ్యంలో ఉంటె ఎట్లా ఉంటామో అట్లా తయారైపోతాం. తెలీకుండానే గుండ్రాయి వెన్నముద్దలాగా తయారైపోతూ ఉంటుంది. గుండ్రాయిలాంటి తత్త్వం ఉన్నవాడు నెమ్మదిగా వెన్నముద్దగా తయారవుతాడు. అంటే సత్త్వం పెరుగుతూ ఉంటుంది. సమర్ధత తగ్గుతుంది అనుకోకండి. భక్తుల యొక్క సమర్ధత వినయంతో కూడి ఉండడం వల్ల రాజసికులకి తెలీదు. రజోగుణ ప్రవృత్తితో విజృంభించి ప్రంపంచంలో గొడవ చేస్తున్న వాళ్ళకి సత్త్వగుణం యొక్క సమర్ధత తెలీదు. ఎందుకంటే సన్నివేశం వచ్చినప్పుడు రజోగుణం వాడు కింద పడిపోతాడు, మీదపడిపోతాడు, అల్లరి చేసుకుంటాడు, నానా గొడవా చేస్తాడు. సత్త్వగుణ సంపత్తుడు ఆపద వచ్చినపుడు తన యొక్క స్థిరత్వాన్ని చూపిస్తాడు. అంతా అల్లకల్లోలంగా ఉంటె వీడు మాత్రం స్థిరంగా ఉండీ, ఆ అల్లకల్లోలాన్ని సర్దుతాడు. శ్వేతద్వీప వాసులని లోపల వెలుగులో జీవిస్తుండే వాళ్ళు వున్నారు. వాళ్ళు శ్వేతద్వీప నిర్మాణం చేసుకుని, అందులో జీవిస్తున్నారన్నమాట. 'ప్రపంచం తల్లక్రిందులైనా వారి తలలకు క్రింద లేదు' అంటాడు కృష్ణుడు. ఎందుకు లేదంటే ప్రపంచాన్ని దాటి ఉన్నవాళ్ళు కాబట్టి. రజోగుణము, తమోగుణము ఉండే వాళ్ళు సన్నివేశాలను బట్టి ఊసరవెల్లిలాగ మారిపోతూ ఉంటారు. సత్త్వగుణంలో ఉండే వాళ్ళు సన్నివేశాలతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకే రకమైన, స్థిరమైన చేతన కలిగి ఉంటారు. స్థిరచిత్తులై ఉంటారు. అంత మాత్రం చేత అసమర్ధులు కాదు. కానీ తమ సమర్ధతను ఊరికే వెల్లడించుకోరు. అది సత్త్వగుణంలో ఉండే గొప్పతనం. సత్యమందు నిలబడే వారికి సత్త్వగుణం బావుంటుంది. కాబట్టి ఈ సత్త్వగుణం పెరుగుతూ ఉంటె మనలో ఉండే మిగతావన్నీ పారిపోతూ ఉంటాయి. అదీ

పూరయాతాః అన్న నామము. పూరిస్తూ ఉంటాడు. ఆయన సాన్నిధ్యాన్ని మనం కోరడం చేత అది పెరుగుతుంది, కోరకపోతే రాదు. ఆయన సాన్నిధ్యాన్ని స్తోత్ర రూపంలో మనం ఆర్తితో పిలుస్తున్న కొద్దీ వస్తూ ఉంటుంది, వస్తున్న కొద్దీ కాంతులు పెరుగుతున్న కొద్దీ చీకట్లు తగ్గిపోతూ ఉంటాయి. ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు కదా కాంతులొస్తే చీకట్లు పోతాయని, మాస్టరుగారు చాలా బాగా చెప్పారు, ఆ విషయం. 'వెలుగు తెచ్చుకోవడం, చీకటి పారద్రోలడం అని రెండు ఉండవు, వెలుగు తెచ్చుకుంటే చీకటి పోతుంది. ఒకటే పని అది. అలాగే బియ్యం లో బెడ్డలేరుకోవడం, మంచి బియ్యం పోగేసుకోవడం అని రెండు ఉండవు, బెడ్డ లేరేస్తే మంచి బియ్యం మిగులుతుంది. మంచి బియ్యం ఏరేసుకుంటే బెడ్డలు మిగిలిపోతాయి, అది ఒకటే పని అది, రెండుగా చూడకండి' అని. ఇవన్నీ అయిన తర్వాత అదేదో చేద్దాం అనుకోవద్దు. నువ్వెంత అపవిత్రుడవైనా ఎంత పరిమితుడవైనా, ఎంత సంకుచిత స్వభావం కలిగిన వాడివైనా, ఎంత వికృతమైన భావములు కలిగి వున్నవాడివైనా నీ లోపలికి ఒక దివ్య మంగళ స్వరూపాన్ని ఆరాధనా మార్గంలో ఆవాహన చేసి, హృదయములో స్థానం కల్పించుకుంటూ వస్తూ ఉంటె, అపరిమితమైన తత్త్వం నీలోకి ప్రవేశించడం వల్ల నీలో ఉండే పరిమితములన్నీ కూడా ఒక్కోటి ఒక్కోటి ఎండుటాకులు రాలిపోయినట్టు రాలిపోతాయి. అందుకనే మాస్టరుగారు అందరినీ పూజ చేసుకోమని చెప్పడం. ఆయన రకరకాల మార్గాలు ఇచ్చారు. ఎందుకంటే జీవ లక్షణాన్ని బట్టి ఒకొక్కటి ఒకొక్కళ్ళకి నచ్చుతుంది, ఆయన సమన్వయకర్త కాబట్టి సమస్తమైన మార్గాలని మనకి పరిచయం చేశారు. మన జీవ లక్షణం ప్రకారం ఏదో ఒక దాంట్లో మనం చొరబడి అనుస్యూతం పని చేసుకోవాలి. వీటన్నిటి యొక్క లక్ష్యం ఒక్కటే, లోపల స్థిరచిత్తం ఏర్పడాలి. చేతన స్థిరంగా నిలబడాలి. ఆ నిలబడ్డ చేతన దివ్యచైతన్యం తో అనుసంధానం చెంది ఉండాలి. దానికి ఈ శ్లోకంలో ఇచ్చిన మార్గం 'కీర్తనం'! భగవంతుని మనస్ఫూర్తిగా ఆరాధన చేయడం. చాలా ఆనందంగా ఉంటుంది, సులభంగా ఉంటుంది, ఇది అన్నిటికన్నా సులభమైన మార్గం. నీకు తోచినంత అందంగా చిత్రీకరించుకో, నీకు తోచినంత ఆనందంగా చిత్రీకరించుకో, నీకు తోచినంత కాంతులు దానికి ఆపాదించు, పువ్వులు అలంకరణ చేసుకో, లోపల ధ్యానం చేసుకో, ఎంతో సేపు నిలవకపోతే స్తోత్రం చేసుకో, శిరస్సు నుండి పాదాల వరకు ఒకొక్క అంగాన్ని వివరంగా దర్శనం చేసుకో, మళ్ళీ పాదం నుండి శిరస్సు వరకు వివరంగా దర్శనం చేసుకో, మళ్ళీ శిరస్సు నుండి పాదాల వరకు దర్శనం చేసుకో, ఇట్లా చేసుకుంటూ చేసుకుంటూ ఆపేప్పుడు ఎక్కడో మధ్యలో ఆపకుండా మళ్ళీ పాదాల దగ్గరికి వచ్చి అక్కడ ఆపు. ఈ విధంగా చేస్తూ ఉంటె మనం ఆయన చేత పూరింప బడతామండీ. ఆయన పూరించేవాడు, మనం పూరింపబడేవాళ్ళం.

మన పరిమితత్వం పోయి అపరిమితత్వం అయ్యి, మనలో ఉండే పరిమితత్వాన్ని పారద్రోలుతుంది.

# 714, 715 పుణ్యః, పుణ్యకీర్తిః

పుణ్యం అంటే ఏది చేయడం వల్ల పవిత్రీకరింపబడతామో దాన్ని పుణ్యం అన్నారు. పుణ్య కార్యాలంటే నిర్వచనం ఏంటంటే అది చేయడం వల్ల మనం పవిత్రీకరింపబడతాం. అంటే పుణ్యకార్యాలని మనం చేసే వాటిల్లోంచి మనం పవిత్రీకరింపబడట్లేదనుకోండి, చేసే విధానంలో తేడా ఉందని గమనించాలి. విధానంలో తేడా ఉంటె దానికి సంబంధించిన అనుభూతి మనకి దక్కదు. అందుకని చేసే పని ఎప్పుడు పుణ్యమౌతుంది అంటే చేయడం ద్వారా నీలో పవిత్రత పెరుగుతూ ఉంటె! నీలో పవిత్రత పెరగకుండా నువ్వు రకరకాలుగా ఎన్నో పుణ్యకార్యాలని పెద్దలు చెప్పినవి చేస్తూ ఉంటె, దాన్నుండి విసుగు, కోపము, చిరాకు, ఇవి చేయడం వల్ల ఏమీ ఉపయోగం లేదనే ఒక కొత్త సిద్ధాంతం, ఇవన్నీ పుట్టుకొస్తాయి. ఎందుకు పుట్టుకొస్తాయంటే విధానంలో భక్తి, శ్రద్ధ లేకపోవటం వల్ల, రజస్సు, తమస్సు బాగా ఆధిక్యతలో ఉండి ఈ చేస్తున్న దానిలో సత్త్వం తగ్గి ఉండడం చేత, తదనుగుణమైన పుణ్యం ఆపాదింపబడదు. ఈ విధంగా భగవంతుని ఆరాధన చేసుకుంటున్నవాడు ఉన్నాడే, ఏదీ, ఎక్కడ మొదలుపెట్టాం, స్తవ్యః దగ్గర కదా, ఎదుటి వ్యక్తిలో ఉండే కళ్యాణ గుణాల దగ్గర నుండి ఆరాధన కదా, భగవద్ ఆరాధన అంతర్ముఖంగానూ బహిర్ముఖంగానూ జరుగుతున్న సందర్భంలో, తాను పూర్ణవంతుడు అవడానికి మార్గంలో చేరిన సందర్భంలో, తాను భగవంతుడి యొక్క సాన్నిధ్యం చేత పూరింపబడుతున్న సందర్భంలో, అతడి నుండి చేసే కార్యముల వలన కూడా అతను పవిత్రీకరింపబడుతూ ఉంటాడు. బలి చక్రవర్తికి అదే జరిగింది. ఎంత పవిత్రీకరింపబడ్డాడంటే సమస్తము పోతుందని తెలిసినా భగవంతుడి యొక్క సాన్నిధ్యం లభిస్తుంటే ఇంకా మిగతావేవో పోతాయన్న భావమేంటి? అని అందుక్కదా గురువు చెప్పినా సరే ఇంక ఏదీ లక్ష్య పెట్టకుండా ఆ విధంగా సమర్పణ చెందాడు. అంటే ఆసురీ భావంతో మొదలుపెట్టిన కార్యం క్రమశః పవిత్రీకరింప,బడి సత్త్వ గుణంలోకి పెరిగి, భగవంతుడి యొక్క సాన్నిధ్యం తను పొంది, అది కారణం చేత సమస్తాన్ని తన్ను కూడా సమర్పణ చేసుకునే స్థితిలో పుణ్యకార్యంలోకి ప్రవేశిస్తాడు. అట్లా సమర్పణం చేసుకోవడం 'మహాయజ్ఞః', 'మహాయజ్వ' కార్యములు తను నిర్వర్తించేవన్నీ పుణ్యకార్యాలుగానే ఉంటాయి, అందువల్ల చేసే ప్రతి పనిలోంచి తను పవిత్రీకరింపబడుతూ ఉంటాడు. అప్పుడు అతనికి వచ్చే కీర్తి పుణ్యకీర్తి. పుణ్యం పెరుగుతూ ఉంటె అంటే పవిత్రత పెరుగుతూ ఉంటె, పవిత్రత పెరగడం అంటే తనలో ఉండే కాంతులు పెరగడం, తేజస్సు పెరగడం, వెలుగు పెరగడం జరుగుతూ ఉంటె దాంట్లోంచి మళ్ళీ కీర్తి పెరుగుతుంది.

## 716 అనామయః

అనామయుడు అంటే వికృతి లేని వాడు అని అర్థం. మన వరకు మనలో పవిత్రత పెరగడం అంటే, పుణ్యం పెరగడం అంటే, భగవంతుడి యొక్క అస్తిత్వం పెరగడమే. మన నుండి ఆ కార్యాలు అట్లా చేయిస్తున్నది ఆయనే అన్న సంకల్పం ఉంటుంది వాళ్లకి. మంచి పనులు చేస్తున్నాం అనే భావన ఉండదపుడు. మంచి పనులు మన నుండి అతడే చేయిస్తున్నాడనే భావన వస్తుంది. అంతకు ముందు ఏదో వినయానికి చెప్తాము తప్ప, నమ్మం. మంచి పని చేసినప్పుడల్లా ఎవడు పొగిడాడా, ఎవడు  పొగడలేదా, మనల్ని పొగిడే సభకి ఎవరు వచ్చారా, ఎవరు రాలేదా  అని మనం చూసుకుంటూ ఉంటాము. ఇవన్నీ రజస్సుకి సంబంధించి ఉంటాయి. సత్త్వానికి 'వీడు వాడిలో ఉండడమే' వాడికి ముఖ్యం, మిగతావన్నీ ముఖ్యం కాదు. తనలో పుణ్యం పెరగడం, తనలో పుణ్యం యొక్క ప్రభావం పెరగడం, అది ఇతరులను కూడా ప్రచోదనం చేయించడం, ఇవన్నీ భక్తుడు తాను చూస్తూ ఉంటాడు, తన నుండి జరుగుతూ ఉంటె. తాను చేస్తున్నాను అనే భావన ఉండదు. అప్పుడు 'అనామయుడు' అవుతాడు అన్నమాట. భగవంతుడికి అనామయుడు అనే పేరు ఉంది, పూర్ణస్థితి చెందిన భక్తుడు కూడా అనామయుడే. అనామయుడు అంటే వికృతి లేని వాడు అని అర్థం. సొట్టలు లేని వాడు తెలుగు భాషలో చెప్పాలంటే. రంధ్రములు లేని వాడు, తప్పులు లేని వాడు, ధర్మస్వరూపుడు, ఏ విధమైన పొరపాటు లేనివాడుగా తీర్చి దిద్దపడతాడుట, అంటే సాధనపరంగా తీసుకుంటే ఇట్లా వస్తుంది. భగవద్పరంగా తీసుకుంటే భగవంతుడికి వికృతి లేదు, ప్రకృతే! ప్రకృతి జరుగుతూ ఉంటె అందులోంచి వికృతి పుడుతుంది గానీ, వికృతి యందు భగవంతుడు అస్తిత్వం చెంది ఉండడు. సముద్రం ఉంది, అల ఉన్నది, అలలోనూ సముద్రం ఉన్నది, సముద్రంలోనూ సముద్రమే ఉన్నది. అల నుండి వచ్చే నురుగులో ఎంత ఉన్నది సముద్రం? నురుగు వికృతి అన్నమాట, అల ప్రకృతే, సముద్రం ప్రకృతే, ఒకోసారి నురుగు వస్తుంది, ఒకోసారి నురుగు రాదు. వచ్చినా నురుగు చేతులో పట్టుకుంటే ఏ మాత్రం మిగిలింది? ఓ ఉద్ధరిణి నీళ్లు కూడా ఉండవు అందులో. కాబట్టి ఇక వికృతి లేని స్థితిలోకి వస్తాడు. అంటే మనకి సృష్టి జరుగుతున్నపుడు ప్రకృతి సిద్ధంగా కొంత సృష్టి తయారయితే, అందులోంచి కొంత వికృతి కూడా బైటికి వస్తూ ఉంటుంది, అది ప్రణాళికలో భాగంగా కాదు. అగ్ని కార్యంగా సృష్టి జరగడం వల్ల అందులోంచి కొంత వికృతులు పుట్టుకొస్తూ ఉంటాయి. వాటినప్పటికి అపుడు తీసేసుకుంటూ ఉండాలి, ఏరేసుకుంటూ ఉండాలి, శుభ్రపరచుకుంటూ ఉండాలి. రాగి చెంబు నీళ్లు తాగుదామని కిటికీలో పెట్టుకుంటే, వాతావరణ ప్రభావం చేత అది మకిలి పడుతూ ఉంటుంది.

దాన్నప్పటికప్పుడు తోముకుంటూ ఉండాలి. అప్పుడే రాగి యొక్క ప్రభావం మనకి నీటి మీద ఉంటుంది. అలా కాకపోతే కొన్నాళ్ళు పోయిన తర్వాత అది రాగి చెంబని చెప్తే కూడా ఎవరికీ తెలీదు కదా? అట్లా ఉంటుంది. అట్లాగే మనం ఆహారం స్వీకరిస్తూ ఉంటె మన శరీరానికి ఉన్న రంధ్రముల ద్వారా రకరకముల మలినములు వ్యక్తమవుతూ ఉంటాయి. మలినములు వ్యక్తం అవ్వాలని మనం భోంచేయట్లేదుగా! మూత్రం కోసం మంచినీరు తాగట్లేదు. మంచినీళ్లు తాగితే శరీరానికి కావలసినవి అంది, మిగతావి వెళ్ళిపోతూ ఉంటాయి. కాబట్టి ఒక దాని కోసం చేస్తుంటే ఇంకొకటి కూడా అందులోంచి జనిస్తూ ఉంటుంది అది ప్రకృతిలో ఆ విధంగా వికృతి జనిస్తూ ఉంటుంది ఒక పక్కగా. వికృతి లేని స్థితిలో భగవంతుడున్నాడు, వికృతి యందు తాను లేడు, వికృతి యొక్క ప్రభావం తన మీద లేదు అని చెప్తున్నారు ఈ నామం లో. 'అనామయః' అంటే ఎటువంటి పరిస్థితుల్లో కూడా తను వికృతి చెందడు, మనం చెందుతాం. మహా భక్తులు కూడా అప్పడప్పడు వికృతి చెందవచ్చు. సహజత్వం కోల్పోవచ్చు, తాత్కాలికంగా కలత చెందవచ్చు, కానీ భగవంతుడికి అది లేదు. అనామయుడనే నామంతో భీష్ముడు కృష్ణుని పొగిడాడు. అంటే దేనికీ చలించనివాడు. అవస్థితి చెందని వాడు. ఎప్పుడూ ఒకే చేతనలో ఇమిడి ఉన్న వాడు. అదే నవ్వు, అదే తరంగం, అదే ప్రభావం, అదే తేజస్సు, హాని వృద్ధులు లేకుండా ఉన్న స్థితిలో కృష్ణుడి యొక్క దర్శనం చేసిన వాడు. అలాగే కృష్ణ సాన్నిధ్యం పొందిన వాళ్లందరికీ తెలుసు కృష్ణుడు పూరించాడు అందరినీ అని, అతడు పూర్ణుడు. అంటే మనం సాధన పరంగా చెప్పకున్నాం, ఇపుడు దైవ పరంగా అవే నామాలు వెనక నుండి ముందుకు చెప్పకొస్తున్నాను. 'అనామయుడు' ఏ మాత్రం వికృతి లేని వాడు. 'పుణ్యకీర్తి' చేసిన పనుల్లోంచి కీర్తి దిగ్దిగంతాలు వ్యాపించి గోళాలు కూడా వ్యాపించినాయి కదా! యమలోకం నుండి బ్రహ్మలోకం వరకు సమస్త లోకాల్లోను శ్లాఘింపబడ్డాడు, అన్నిచోట్లా తన సాన్నిధ్యం ఇచ్చాడు, ఈ భూమి మీద ఉండి. అంత బాగా expand అయిపోయాడు అన్నమాట. 'పుణ్యము', చేస్తున్న ప్రతి పనిలోంచి పుట్టుకొచ్చేది పుణ్యమే తప్ప ఇంకోటి లేదు. 'పూరయితా' అందరిలో కూడా ఆ స్థితినే నింపాడు. గోపికల విషయంలో కానీ, ఋషుల విషయంలో కానీ, భక్తుల విషయంలో కానీ, వారికి పూర్ణత్వానికి కావలసిన సాన్నిధ్యాన్ని ఇచ్చాడు. 'పూర్ణః' అతడు పూర్ణుడు. శ్లోకంలో మొదటి భాగంలోకి వస్తే 'స్తవ్యః' స్తోత్రం చేయడానికి తగిన వాడు. కేవలం చేస్తే ఇతన్నే చేయాలి స్తోత్రం, అది కదా చెప్పాడు. అసలు ఎవర్ని చేస్తే మనకి ఈ గొడవలు అన్నీ వదిలిపోతాయి, ఇన్ని వద్దు ఒక్కటి చెప్పమని ధర్మరాజు అడుగుతాడు. చెప్పమంటే ఈయన్ని చూపించి కదా చెప్పాడు. స్తవప్రియః, ఆయన్ని పొందాలంటే స్తవం అనేది ఒక వంతెన! భగవంతుని చేరుకోడానికి భగవంతుని స్తుతించడం ఒక వంతెన.

దాని వల్ల ఏమౌతుందంటే మనం భగవత్తత్త్వం వైపు ఉన్ముఖులమౌతాము కాబట్టి అటు నుండి ఆయన మనకి సాన్నిధ్యం ఇవ్వడానికి అవకాశం ఉంది. స్తోత్ర రూపంలో కూడా అతనే ఉన్నాడు. నెమ్మదిగా స్తుతి చేసే వాడు కూడా అతనే అయిపోతాడు. ఇట్లా మనకి శ్లోకానికి అవగాహన ఉన్నది. మనకి ఇవేమిటంటే loose గా వదిలేసినవి ఉంటయ్యే, అవి కొంచెం మళ్ళీ బిగించుకునేందుకు పనికొస్తూ ఉంటాయి. ఎందుకంటే మనకి బోల్డు స్తోత్రాలు మాస్టరుగారి యొక్క కృపచేత అందినవి ఉన్నాయి, కదా! ఆయన ఏమి చెప్పారంటే, 'ఒరేయ్! ఏమి చేసినా చేయకపోయినా కనీసం రోజూ గాయత్రీ, పురుష సూక్తం, శ్రీ సూక్తం చేసుకోండిరా అని చెప్పారు. దానికి ముందు గురు ప్రార్థన, కదా! ఇంత మాత్రం చేయండి అని చెప్పారు. ఇంక అక్కడి నుండి విజృంభించి మనకి లక్ష్మి అష్టోత్తరం ఇచ్చారు, కృష్ణ అష్టోత్తరం ఇచ్చారు, నారాయణ కవచం ఇచ్చారు, రుద్ర మంత్రం ఇచ్చారు, గణపతి మంత్రం ఇచ్చారు, సమస్త దేవతల యొక్క ముఖ్య మంత్రాలన్నీ మాస్టరుగారు అట్లా కొలికి పూసల్లాగ తీసి మనకి ఇచ్చారు. అంటే మీరు ఎన్నో స్తోత్రాలు, మంత్రాలన్నీ పట్టుకోవచ్చు కానీ వాటిల్లో ఉండే కీలకాలాన్నీ మన దగ్గర తెచ్చి పడేశారు మాస్టరుగారు. ఎందుకంటే ఆయన సాధన చేసి అందులో ఉండే మణిపూసలని, కొలికి పూసలని ఏరి, అవన్నీ కలిపి పూజా విధానంగాను, హోమంగానూ మనకిచ్చారు. అట్లాగే రుద్ర నమకం, రుద్రాభిషేకం, ఎన్నో ఇచ్చారు, ఇవన్నీ చేయడం మొదలుపెడితే మనకి నీరసం వస్తుంది. ఒకొక్కసారి ఒకొక్కటి చేసుకోండి. ధనుర్మాసం వస్తే విష్ణు సహస్ర నామం, కార్తీక మాసం వస్తే అభిషేకం, ఏదో ఇట్లా, కానీ daily ఒక minimum programme run అవ్వాలి దీనికి సంబంధించి. పురుష సూక్తం చదువుతుంటే లోపల ఆ చతుర్భుజమైన భగవంతుడు, ఆయన కన్నులు సూర్య చంద్రులు గాను, ఉన్నాయి కదా.

బ్రాహ్మణోస్య ముఖమాసీత్, బాహూ రాజన్యః కృతః, ఊరూ తదస్య యద్వైశ్యః

ఇట్లా మనం భావన చేసుకుంటూ పురుషుడిని ఆవాహనం చేసుకోవచ్చు. ఆ తర్వాత హృదయంలో శ్రీ సూక్తం చదువుకుంటూ అమ్మవారి వెలుగు కాంతులు ఆవాహన చేసుకుంటూ, ఈ విధంగా పవిత్రీకరించుకోచ్చు. కవచం అంటే భగవంతుని లోపల స్థిర పరుచుకుంటూ శాశ్వతుడుగా ఇక్కడ/ నీలో ఉన్నాడనే భావన చేస్తే నీ శరీరం కవచం అయిపోతుంది. అంటే దానికి ఏ ఆపదలు రావు. ఎందుకంటే వాడిని కూర్చోపెట్టావు కాబట్టి, ఇది వాడి వాహనం కాబట్టి వాడు రక్షించుకుంటాడు. నీ వాహనం అనుకుంటే ఇంకో విధంగా ఉంటుంది. అందుకని కవచం ఇచ్చారు, విష్ణు సహస్ర నామం ఇచ్చారు, లలితా సహస్ర నామం ఇచ్చారు, ఏదో ఒకటి. అన్నీ పెట్టుకోకండి, నా అనుభవం ఏంటంటే అన్నీ చేద్దామనుకుంటే మూడు రోజుల్లో ఉసూరుమని అన్నీ మానేస్తారు. ఒక పావుగంట నుండి అరగంట

వరకు మించకుండా చేసుకుంటే శ్రద్ధగా, భక్తిగా చేసుకోవడం ఉంటుంది. ఎక్కువ మనం దాన్ని విస్తారం కలిగిస్తే  పాలల్లో నీళ్లు కలిపినట్టుగా పల్చబడిపోతుంది. చిక్కగా ఉండాలి చేసిన కాస్త ప్రార్థన. చిక్కగా ఒక అరగంట మాస్టరుగారి పూజ విధానం, prayer అయిన తర్వాత చేసుకుంటే సరిగ్గా 35 నిముషాలు కన్నా పట్టదు. అట్లా అన్నీ ఆలోచించే మన యొక్క పరిస్థితులు కూడా గమనించి ఇచ్చారు, ఇంకా ఆసక్తి ఉత్సాహం ఉన్నవాళ్ళ కోసం, ఇహ చేర్చారు, అక్కడే రాశారు కుడా, మీ యొక్క ఉత్సాహాన్ని బట్టి చేసుకుంటే ఇక్కడ విష్ణు సహస్ర నామం చేసుకోమని, లలితా సహస్ర నామం చేసుకోమని. అందుకనే ఈ 73వ శ్లోకం మనకి మధురమైన మార్గం. అస్సలు బొత్తిగా భగవంతుడి మీద రుచి పోతే తప్ప, స్తోత్రం నుండి భగవంతుని రుచి పొందే ఒక సులభత, సరళత ఇంక మిగతా దాంట్లో లేదు. ఇది బావుంది అనిపిస్తే ఇట్లా చేసుకోండి. కొంతమంది పూజ చేసుకుని, తర్వాత ధ్యానం చేసుకుంటారు. అలికి ముగ్గులు పెట్టి, దీపాలు వెలిగించి, దేవుడ్ని కూర్చోపెట్టి ఆయన సాన్నిధ్యంలో ధ్యానం. అదోపద్ధతి. ఏదో చీకటి గదిలో మనం కూర్చుని ఉసూరుమంటూ ధ్యానం అదో పద్ధతి. ఇదంతా భావంలో పెంపొందించుకోవడం వల్ల కళలు పెరుగుతాయి. ఉత్సాహం పెరుగుతుంది. శ్రద్ధ పెరుగుతుంది, ఆసక్తి పెరుగుతుంది, రుచి పెరుగుతుంది, పట్టు పెరుగుతుంది, చిక్కగా ఉంటుంది చేసే సాధన. లేకపోతే అలా ఒకసారి CVV అని, అయోమయంగా కూర్చోవడంగా ఉంటుంది. ఏమిటో చేస్తాడన్నాడాయన ఏవీ జరగట్లేదు అనుకుంటాము. ఆయన ఏం చేస్తున్నాడో మనకి తెలీదు, మనం ఏం చేస్తున్నామో ఆయనకీ తెలీదు. మనం చేస్తున్నామని ఆయన అనుకుంటున్నాడని కూడా మనం అనుకోవడానికి వీలు లేదు. అందుకని దానికివన్నీ కూడా మనకి అనుపానాలుగా పనికొస్తాయి. ఇపుడు మీకు చెప్పిన నామంలో మీరు చూడండి కేవలం స్తోత్రం ద్వారా ఎక్కడి నుండి ఎంత దూరం మనం వెళ్ళవచ్చో ఇవ్వడం ఉన్నది. కాబట్టి ఈ విధంగా భగవంతుని యొక్క ఆరాధన ఈ శ్లోకంలో ఇవ్వబడి ఉన్నది. ఇవన్నీ మీరు కృష్ణుడికి ఆపాదించుకోవచ్చు, అమ్మవారికి ఆపాదించుకోవచ్చు. మీ ఇష్టం, దేవత మీ ఇష్టం. 'దేవత మొత్తం మట్టిలోంచి మనం చేసుకున్న ఒక పిండి బొమ్మ' అన్నారు మాస్టరుగారు. ఉత్త పిండి పెట్టుకుంటే మనకి ఏం బావుండదు కదా! అదేదో కజ్జికాయన్నా చేసుకోవాలి, లేకపోతే  పూరి వేసుకోవాలి, చపాతి వేసుకోవాలి, ఉత్త పిండి ఏం పెద్ద ఉపయోగమేం లేదు కాబట్టి, మన వాళ్ళు మధుర భక్తి కోసం ఆ పిండిని ఒక బొమ్మగా తయారుచేశారు. బొమ్మ ఎంత అందంగా తయారుచేసుకుంటే నీకంత రుచి కలుగుతూ ఉంటుంది. అందుకనే ఆ కృష్ణుడిని, ఆ రాముడిని, ఆ శ్యామలని, ఆ అమ్మవారిని ఆ విధంగా ఆరాధన చేసుకోవడం. మన వాళ్ళు బాగా విజృంభించి చేసుకుని పునీతులయ్యారు. నిరాకారమైన బ్రహ్మమును

ఉపాసన చేద్దామనే పరిస్థితి చిట్టచివర్లో ఎట్లాగూ జరుగుతుంది, ఈ లోపల సాకారంగా భగవంతుని యొక్క ఆరాధన చేసుకుంటూ ఉంటె  ఈ మెట్లన్నీ ఎక్కుతాం. ఎక్కితే ఆ తర్వాత మిగిలేది నిరాకారమైనదే! ఆకారంలో కావాలనుకుంటే వస్తుంది, అక్కర్లేదు అనుకుంటే రాదు. ఆకారంలోకి తెచ్చుకుంటే తప్పేం లేదు. అప్పుడు ఆకారంలోనూ ఉన్నది, ఆకారం లేకుండానూ ఉన్నది, అనేది తెలుస్తుంది. ఆ విధంగా భక్తి నుండి జ్ఞానంలోకి పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. అది అనన్యభక్తిగా మారుతుంది. అనన్యభక్తి ఉన్న చోట జ్ఞానము, భక్తి రెండూ ఉన్నట్టే! కాబట్టి భగవంతుడితో యోగించడం శులభం అవుతుంది.

## 717 మనోజవః

మనోజవం అంటే మనస్సుయందు ఉన్న వేగము అని అర్థం. మన అందరి మనస్సుల్లోను, సృష్టిమనస్సు లోనూ ఉన్న వేగము భగవంతుని అస్తిత్వంగా గుర్తించడం. సమవేగంగా ఉంటే అస్తిత్వం సత్త్వగుణంగా ఉన్నట్టు. వేగం ఎక్కువైతే రజోగుణం గా ఉన్నట్టు. అది కూడా భగవంతుని అస్తిత్వమే! తక్కువ వేగంగా ఉంటే తమో గుణం ఉన్నట్టు. అది కూడా భగవంతుని అస్తిత్వమే! మనయందు ఈ మూడు గుణములూ ఉండాలి. కాకపోతే ఏ గుణం ఎప్పుడు పని చెయ్యాలో అప్పుడు పని చేస్తూ ఉండాలి. సహజంగా సత్త్వం లో ఉండాలి. పని చేసేటప్పుడు రజస్సు లో ఉండాలి, పని అయిన తర్వాత విశ్రాంతి సమయంలో దేహానికి విశ్రాంతి ఇవ్వడానికి తమస్సు కావాలి, నిద్ర కావాలి. మనం సత్త్వం నందు నిలబడి ఉండాలి. సత్త్వం నుండి తమస్సు లోనికి, సత్త్వం నుండి రజస్సు లోనికి, సత్త్వం నుండి సత్త్వాతీతములోనికి ప్రవేశించాలి. సత్త్వగుణం కేంద్రంగా సత్త్వాతీతము అయిన భగవత్తత్త్వం లోనికి ప్రవేశం చేయడం, భగవత్తత్త్వం లో నుండి సత్త్వం లోనికి మళ్ళీ దిగివచ్చి, పని చేయాలన్నప్పుడు రజస్సు లోకి, విశ్రాంతి కావాలన్నప్పుడు తమస్సు లోకి రావాలి. కొంతమంది విశ్రాంతి తీసుకోలేరు. కొంతమంది పని చెయ్యలేరు. ఇద్దరితోనూ తంటాయే కదా. భారత దేశంలో పని చేయడం కష్టం. బయటి దేశాలలో విశ్రాంతి తీసుకోవడం కష్టం. అంటే ఇక్కడ మనకి కొంత తమస్సు ఆవరించి వున్నది. అక్కడ వాళ్ళకు రజస్సు ఆవరించి వున్నది. మనం దేశం లో కూడ పెద్ద పెద్ద పట్టణాలు వెళ్లి, అక్కడ అందరూ పనిచేసే తీరు చూస్తే, మనం కూడ మన ఊరు వచ్చి అట్లా గట్టిగా పనిచేద్దాం అన్నట్లుగా, ఒక రజోగుణ దోషం చేత అనిపిస్తుంది. మన ఊరు రాగానే మన తమస్సు మళ్ళీ మనని ఆవరించేసి, ఆ-- ఏమి చేస్తాంలే అంత వేగముగా పని అని మళ్ళీ సర్దుకుపోతువుంటాం. మహానగరాల్లో రజస్సు బాగా వుంటుంది. విశాఖపట్నం లాంటి నగరంలో సహజంగా సత్త్వం వున్నది. కొన్ని ప్రదేశాలలో సత్త్వమెక్కువ ఉంటుంది. కొన్ని ప్రదేశాల్లో తమస్సు ఎక్కువ వుంటుంది. కొన్ని ప్రదేశాల్లో రజస్సు ఎక్కువ వుంటుంది. ఇవి మనస్సులో ఉండే వేగము యొక్క తేడా! ఈ వేగం సమవేగంగా వున్నట్లైతే భగవత్ అస్తిత్వానికి దగ్గరగా వుంటుంటాం. భగవంతుని సాన్నిధ్యానికి దగ్గరగా వుంటూంటాం. కాబట్టి సృష్టిలో సమస్తము సమవేగంగా నడుస్తు వుంటుంది. భూమి ఎక్కువ వేగంగాను, తక్కువ వేగంగాను తిరగదు. ఎప్పుడు ఒకే వేగంగా తిరుగుతూ వుంటుంది. మిగతా గోళాల యొక్క వేగములు, వాటి చుట్టు అవి తిరగడానికి, సూర్యుడు చుట్టు తిరగడానికి నిర్ణయింపబడిన వేగములలో మార్పులు వుండవు. అలా ఉండబట్టే సృష్టి చాల సక్రమముగా నిర్వర్తింపబడుతు

వున్నది. మనం కూడ దైవీసంపత్తి కలిగి ఉన్నట్లైతే, మనస్సుయందు సమవేగం కలిగి ఉంటుంది. అలా కాకపోతే కొన్నాళ్ళు చాలా ఉధృతంగా పని చేయడం, కొన్నాళ్ళు పడుకోవడం, మళ్ళీ కొన్నాళ్ళు ఉధృతంగా పనిచేయడం, కొన్నాళ్ళు జబ్బు వచ్చి పడుకోవడం, కొన్నాళ్ళు బాగా ఒళ్ళు విరుచుకుని పూజలు చేయడం, కొన్నాళ్ళు మానేయడం, ఇట్లా వుంటుంది. అంటే ఒక సెలయేరు వలె నిర్మలంగా ప్రవహించడం కాకుండ, వరదలు రావడం, ఆ తరువాత ఎండి పోవడంగా వుంటూ వుంటుంది. ఎప్పుడు ఒకే విధంగా పారే నదిని 'జీవనది' అంటారు. వరదలు వచ్చి మనుషుల్ని, ఇళ్ళని పట్టుకుపోయి, ఆ తరువాత ఎండిపోయింది అనుకోండి. పెన్నానది అట్లా చేస్తుంటుంది. అందుకని దాన్ని పీనుగుల పెన్నా అంటారు. అంటే వచ్చిందంటే కొన్ని శవాలను మోసుకు వచ్చేస్తుంటుందన్నమాట. శవాలు అంటే ఆ పక్కన ఒడ్డున ఉన్న వాళ్ళందరిని పట్టుకొచ్చేయడం. ఆ తరువాత ఆరునెలలు, ఏడు నెలలు, ఎనిమిది నెలలు, తొమ్మిదినెలలు ఎండిపోయి వుండడం. మానవజీవితంలో మనకి ఇటువంటివి బాగా కనిపిస్తు వుంటాయి. ఏ పని చేసినా, దానికి ఒకే విధమైన వేగం. అది భగవంతుని అస్తిత్వానికి ఎక్కువ దగ్గరలో వుంటుంది. అందుకని సృష్టిలో వేగాన్ని మనం గమనించినట్లైతే వేటి వేగం వాటికి వున్నది. పిచ్చుక వేగం పిచ్చుకకు వున్నది. గరుడపక్షి వేగం గరుడపక్షికి వున్నది. తాబేలుకున్న వేగం తాబేలుకు వున్నది. కుందేలుకున్న వేగం కుందేలుకు వున్నది. ఒకళ్ళనొకరు అనుకరించరు. కేవలం మానవుడు మాత్రమే ఎవరినో అనుకరించాలి అనుకుని, తను ఇబ్బంది పడతాడు. తనదైన వేగం తనది ప్రతివాడికి ఒకటి వుంటుంది. ఆ వేగానికి మించి ప్రక్కవాడి వేగంతో పాటు అందుకుని చేద్దాం అంటే తిప్పలు పడతాం. మన వేగం కన్నా తక్కువ వేగం వున్నవాళ్ళతో కలసి ప్రవర్తిద్దాం అంటే తిప్పలు పడతాం. అతని వేగం అతనిది, నా వేగం నాది. అతని వేగం ప్రకారం అతన్ని పని చేసుకోనిస్తాను. నా వేగం ప్రకారం నేను పనిచేసుకుంటాను. నా వేగమే సరియైనది, అతని వేగం తప్పు అనకుండా వుంటాను. ఇటువంటివి నేర్చుకోవాలి. కొంతమంది పనులు చాలా వేగంగా చేస్తారు కదా! వాళ్ళకు ఎట్లా వుంటుంది అంటే ఏమిటి మిగతా వాళ్ళు చాలా నెమ్మదిగా చేస్తారు అనిపిస్తుంది. కొంతమంది నిదానంగా చేస్తారు. వాళ్ళకి వేగంగా చేసేవాళ్ళు ఎందుకు ఇంత వేగంగా, హడావిడిగా చేసుకుంటున్నారు అని అనిపిస్తు వుంటుంది. మనం విశాఖపట్నం సముద్రతీరంలో నడిచినప్పుడు కూడా మనుష్యులను చూస్తే ఒకడు వీరావేశంతో నడుస్తుంటాడు, ఒకడేమో ఏదో అట్లా శరీరం వయ్యారంగా ఊపుతు నడుస్తు వుంటాడు. ఒకడు ఈ రెండింటికి మధ్య తరగతిగా నడుస్తు వుంటాడు. ఎవరి నడక వారిది కదా. జీవలక్షణం ప్రకారం. కాబట్టి తనయొక్క వేగాన్ని తను అనుసరించి ఎప్పుడు ఒకే వేగం జీవితంలో

నిర్వర్తించుకుంటు వెళ్తూ వుంటే సాఫీగా జరుగుతు వుంటుంది ప్రయాణం. మీరు కారులో ప్రయాణం చేసేటపుడు కూడ 80కి.మి/ 90కి.మి వేగం తో వెళ్తూ, మళ్ళీ breaks వేసుకుంటు, 20కి. మి/ 30కి. మి కి వచ్చేసి-- ఇట్లా కాకుండా ఒకే వేగంలో వెళ్తే ప్రయాణికులకు చాల హాయిగా వుంటుంది. ఆ రోడ్డు యొక్క పరిస్థితిని బట్టి ఏ వేగమో ఒకటి నిర్ణయం చేసుకుని, ఇంతకన్నా వేగం వెళ్ళడం వలన ఎక్కువ breaks వేసుకోవాలి అనిపించినట్లైతే, తక్కువ వేగముతో ప్రయాణం చేశాం అనుకోండి, హాయిగా వుంటుంది. అట్లాగే గోళానికి ఒక్కొక్క దానికి ఒక్కొక్క వేగం వుంది. ఇవ్వన్ని వాటి మనస్సుల యొక్క వేగం. ఎందుకంటే మనస్సు స్థితికి వచ్చిన తరువాత కదలికలు బాగా ఎక్కువగా వుంటాయి. మనస్సు నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు. వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము. జలము నుండి పృథ్వి. ఈవిధముగా అవతరణ చెందుతూ వుంటే మనస్సు వేగం అన్ని వేగముల కంటే ఎక్కువైనటువంటి వేగం. అంతకన్నా కొంచెం తక్కువ వేగం ఆకాశం. అంతకన్నా తక్కువ వేగం వాయువు, అంతకన్నా తక్కువ వేగం అగ్ని. అంతకన్నా తక్కువ వేగం నీరు. అంతకన్నా తక్కువ వేగం పృథ్వి. ఇట్లా వుంది సృష్టిలో. వేగం తగ్గించడం చేత పదార్థాలు అవతరిస్తు వుంటాయి. వేగం పెంచితే మళ్ళీ అదృశ్యం అవుతాయి. ఇది ఆధ్యాత్మికశాస్త్రంలో చెప్పిన ఒకసత్యం. హనుమంతుడు కూడ 'మనోజవం మారుత తుల్యవేగం' అంటే మనస్సుతో భావన చేయగానే, ఎక్కడ వుండాలో అక్కడ వుండే అంత వేగం కలిగినవాడు అని అర్థం. అట్లా అందరం వుండలేం కదా! అది ఎవరికి వీలు అంటే చైతన్య స్వరూపులకు మాత్రమే వీలు. పృథ్వీతత్త్వం బాగా వుంటే బాగా గుండ్రాయిలా అట్లా పెట్టిన చోటే వుంటాం. కదిలిస్తే ఎవరన్నా కదిలించాలి తప్ప మనంతట మనం కదలం. అక్కడ నుండి జలానికి ఇంకొంచెం వేగం వుంది. అక్కడ నుండి అగ్నికి ఇంకొంచెం వేగం వుంది. అంతకన్నా వాయువు వేగం. మారుతతుల్య వేగం. హనుమంతుడు మారుతతుల్య వేగం అని చెప్పారు, మనోజవం అని కూడా చెప్పారు. అంటే ఏమిటి ? అదేమో Maximum ఇదేమో, Minimum అనుకోవాలి మనం. అన్నిటి కన్నా వేగంగా పరుగేత్తేది ఏది అని ప్రశ్న వేస్తాడు ధర్మరాజుని. వేస్తే 'మనస్సు' అని చెప్తాడు. వేగంలో మనస్సు అత్యంత ప్రతిష్టాత్మకమైనదన్నమాట. కాబట్టి వేగం విషయం వచ్చేటప్పటికి అంత వున్నత స్థితి, దానికి మించిన స్థితి అది భగవంతుని యొక్క అస్తిత్వంగా చెప్పారు వేగము. మనస్సుతో భావన చేసి, ఎక్కడికి భావన చేస్తే అక్కడకి వాళ్ళు తమ్ము తాము ఇక్కడ అదృశ్యులై అక్కడ మళ్ళీ అవతరించే స్థితిలో వుండే ఉత్తమోత్తమమైన మహర్షులు వున్నారు. మహాత్ములు వున్నారు. వారందరు కూడ భగవంతుని యొక్క ప్రతీకలు. తలుచుకుంటే ప్రత్యక్షం అయ్యేవాళ్ళు. అంటే వాళ్లు మొత్తం ఈ భూమి యొక్క ఆకాశ తత్త్వంలో వ్యాపనం

చెంది వుంటారు. అటువంటి వారిలో హనుమంతుడు ఒకడు. అంటే పూర్తిగా దైవీసంపత్తి కలిగిన వాడు అన్నమాట. అంటే దైవం యొక్క ప్రతీక అని అర్థం. కాబట్టి మనోజవలు ఎవరైతే వుంటారో వారందరు కూడ దైవం యొక్క ప్రతీకలుగా భావన చేయాలి. మహర్షులు తలచినంత మాత్రాన ప్రత్యక్షమయ్యే అంత స్థితిలో వుంటారు. కారణం ఏమిటి అంటే మనస్సుకి అవతల వున్న చైతన్యంలో ఉన్నవారు కాబట్టి. అక్కడ నుండి ఎక్కడ తలుచుకుంటె అక్కడ ప్రత్యక్షమవుతూ వుంటారు. ఇక్కడ నుండి ఆ కైలాసగిరి కొండ చూసి అక్కడ వుండాలనుకుంటే, అనుకోడంతో పాటుగా అక్కడ వుంటారు. అలా వున్న వారిలో భగవత్ తత్త్వము సమస్తము వ్యాపించి వున్నప్పటికి ఆ తత్త్వానికి కలిగినట్టి స్థితి బేధాలే మనకి సత్యం, చైతన్యము, బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము ఇట్లా ఏర్పడి వున్నాయి. ఈ ఏర్పడి వున్న తత్త్వము పంచభూతాలకి అవతలగా మనకి మనస్సు వున్నది. మనస్సుకి పైనబుద్ధి బుద్ధికి పైన చైతన్యము, చైతన్యమునకు పైన సత్యము, సత్యమునకు పైన అంటే సృష్టిలో సత్యం, సృష్టిని దాటి వున్న సత్యము, ఇట్లా మనకి గోచరిస్తు వుంటుంది. ఈ శ్లోకంలో మనకు మనస్సు, దానికి సంబంధించిన లోకాల్ని పరిచయం చేస్తు, అందులో భగవత్ తత్త్వాన్ని చూపిస్తున్నాడు. విష్ణు సహస్రనామం యొక్క ప్రత్యేకత ఏమిటయ్యా అంటే, అన్ని లోకములలోను ఆయన నిండి వున్నాడు కాబట్టి, ప్రతి లోకంలోను, ఆయన దర్శనం చేయించాలి మనకి కదా! మనం మామూలుగా సాదా సీదా అవగాహన వున్న వాళ్ళము 'ఈ మనస్సు చాలా చెడ్డది, దీనిని అణిచేయాలి. ఈ మనస్సు వల్లె ఈ బాధలు' అని అనుకుంటూంటాం. సృష్టిలో బాధించేది ఏదీ లేదు దాని యొక్క వినియోగం మనకి తెలిస్తే. లేకుంటే ఏదైనా బాధిస్తుంది. డబ్బు బాధిస్తుంది. సంసారం బాధిస్తుంది. వృత్తి బాధిస్తుంది. సంఘం బాధిస్తుంది. ఎక్కడ నుండి బాధ వస్తుందో, అక్కడ నుండి ఆనందం కూడ వస్తుంది. అది నీవు వినియోగించుకునే పద్ధతిని బట్టి వుంటుంది. అలాగే మనస్సు కూడ. మనస్సు యొక్క వినియోగం బట్టి ఆనందం పరిపూర్ణంగా దక్కుతుంది. వినియోగం తెలియనపుడు అదే మనస్సు వల్ల ఇబ్బందులు పడుతుంటాం. కాబట్టి ఈ శ్లోకంలో ప్రత్యేకించి మనస్సుకి సంబంధించిన లోకంలో వుండే నామాలలో భగవంతుని మనకి దర్శనం చేయించి ఇస్తున్నారన్నమాట. మొదట ఏమి చెప్పారంటే మనస్సు యొక్క వేగమును చెప్పారు. మనస్సు వేగం బట్టే రక్త ప్రసారంలో వేగం కూడా వుంటుంది. అలాగే మనకి నాడి కొట్టుకోవడం కూడ వుంటుంది. దాన్ని కొంచెం చల్లబరుచుకుంటె ఇవి కూడ కొద్దిగా తగుమాత్రంగా వుంటాయి. అందుకనే మనం Doctor గారి దగ్గరకు వెళ్తే కొంచెం ఆలోచనలు తగ్గించాలండి మీరు, BP ఎక్కువగా వున్నదంటారు. ఆలోచనలు తగ్గించాలంటే తగ్గించలేము. అంతకు పైన వున్న స్థితి యందు మనస్సు

నిలపగలిగినట్లైతే, అప్పుడు ఇవి తగ్గుతాయి. అది అలా వుండగా ఈ మనస్సులో వుండే వేగమును గమనించమని ఈ నామం మనకి చెబుతుంది. మనస్సు వేగం ఎలా వుండాలంటే కాలానికి అనుసంధానం చేయబడి వుండాలి, అంటే కాలము వృథా కానట్లుగా మనస్సు పనిచేస్తూ, ఇంద్రియములు, శరీరములచేత పని చేయించాలి. అది ఉత్తమమైన వేగము. మనకి ఆధ్యాత్మిక సాధనలో చాలా ముఖ్యంగా మనస్సును ఏ విధంగా వినియోగించి, శరీరంతోను ఇంద్రియాలతోను, కాలం వృథా కాకుండా నిర్మాణాత్మకమైన పనులు చేయాలో చెప్తారు. ఏ సమయంలో నిద్రపోవాలి, ఎంత నిద్రపోవాలి, మేలుకున్నప్పుడు కాలము ఎంత వినియోగపరచాలి. ఎక్కువ వేగంలో వుండే వాడు చాలా చేయవలసిన విషయాలు మర్చిపోతూ వుంటాడు. తక్కువ వేగంలో వుండే వాళ్ళు కూడ మర్చిపోతూంటారు. సమవేగంలో వుండే వాళ్ళు చక్కగా ఏది, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా చేయాలో అట్లా నిర్వర్తిస్తు వుంటారు. ఇది చూసుకో నువ్వు సాధన చేసేవాడుగా, సాధకుడిగా అని ప్రతి గురువు తన శిష్యుడికి కాలాన్ని ఏ విధంగా వినియోగించావు ఈ రోజు, ఒక్కసారి పునః పరిశీలన చేసుకో, అందుకోసం ఒక Dairy ఒకటి పెట్టుకో అని చెబుతాడు. అంటే ఈ రోజు సాయంత్రం మనం పడుకునే ముందు ప్రొద్దున్నుండి సాయంత్రం వరకు కాలాన్ని ఏ విధంగా వినియోగం చేశావు ? ఇంత కన్నా ఇంకా బాగా వినియోగం చేయడానికి అవకాశం వున్నదా ? అని ఒక ప్రశ్న వేసుకోవాలి. ఉంటే అది చేయడానికి రేపటికి ఒక ప్రణాళిక వేయాలి. సాధన అనుక్షణం ఆత్మపరిశీలన చేసుకుంటూ వుంటే గాని సాగదు. లేకపోతే జారిపోతు వుంటుంది. అప్పుడప్పుడు కొంచెం margins ఇస్తూ వుండండి. మరీ బిగుతుగా పెట్టుకుంటె ఊపిరి ఆడక మనమే సతమతమైపోతాం. ఏదో మధ్య మధ్యలో సినిమాకు వెళ్తూ వుండవచ్చు, మధ్య మధ్యలో కాస్త కులాసాగా కబుర్లు చెప్పవచ్చు. కాని అవి వ్యసనంగా మారిపోకుడదు. అందుకని ప్రతి రాత్రి ఈ రోజు ఏవిధంగా మనం నిర్వర్తించాం. ఇందులో మనకి ఎంత కాలం సద్వినియోగమైంది. ఎంతకాలం వృథాగా వెళ్ళిపోయింది. కాలాన్ని వృథా చేయడం అనేది తగ్గించుకున్నవాడు సంఘ శ్రేయస్సుకి ఎంతో పనిచేస్తాడు. అంటే ఏమి చేసినా సంఘానికోసమే! మనం చేసిన ప్రతిపని మనకోసం చేసుకుంటున్నాం అనుకున్నా, దాని యొక్క ఫలితాలు సంఘానికే లభిస్తాయి కాబట్టి, కాలాన్ని వృథా చేయకుండా పనిచేసే వాడి నుండి వచ్చే వుత్పత్తి వుంటుందే, Turnout, అది చాలా ఎక్కువగా వుంటుంది. Master గారి జీవితం దానికి చక్కటి తార్కాణం. మామూలుగా పది జన్మలలో చేయగలిగిన పని ఆయన 54 సం. లలో చేసి వెళ్ళారు. ఎలా చెయ్యగలిగారంటే ఆయన కాలం ఎక్కడ వృథా చేయలేదు. ఆయన దినచర్య ఉదయం 4 గం. నుండి రాత్రి 12 గం. వరకు వుండేది. మధ్యాహ్నం

ఒక అరగంటో, గంటో అవకాశాన్ని బట్టి విశ్రాంతి వుండేది. అంతేగాని ఇప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాను కాబట్టి ఎవ్వరు వచ్చినా చూడను, phone వచ్చినా ఎత్తను అన్నట్లుగా వుండేది కాదు. అప్పుడు కూడా అప్రమత్తులై వుండేవారు. కాలాన్ని ఎట్లా వినియోగించుకోవాలనే విషయంలో ఆయన మనకు చక్కటి ఆదర్శం. కాలాన్ని సద్వినియోగం చేసే వాడు ఇహంగాను, పరంగాను కూడా ముందుకు వెళతాడు. నీ యొక్క ప్రణాళికను ఈ విధంగా నిర్వర్తించుకుంటాను అని ఉదయం అనుకుని, ఆ విధంగా నీవు నిర్వర్తించుకొనగలిగిన నాడు నీకు జీవితం మీద క్రమశః స్వామిత్వం వస్తుంది. ఈ రోజు సాయంత్రం పడుకునే ముందు ఈ రోజు ఎలా కాలం వినియోగం అయ్యిందీ చూసుకోవడం, అదలా వుంచి అందులో మనకి Idle Time వుంటుంది కదా దానిని ఏమన్నా తగ్గించగలమేమో అని దానికి ఒక సంకల్పం చేసుకోవడం, మరునాడు ఉదయం మళ్ళీ లేవంగానే, లేకపోతే ఈ రోజు సాయంత్రమే రేపటి గురించి, రేపు ఎలా నిర్వర్తించుకుంటాను, అలా నీదైన Programme ఒకటి వుండాలి, నీవు అనుకున్న ప్రణాళికకి అడ్డుగా కొన్ని వస్తాయి. మనం వూహించని సన్నివేశాలు మరునాడు చాలా వస్తాయి కదా, వస్తే వూహించని సన్నివేశాలకి ప్రతిస్పందించడమే కాకుండ, నువ్వు అనుకున్నవన్ని కూడ చేశావా లేదా చూసుకోమని చెబుతాడు జ్వాలాకూల మహర్షి. నీవు అనుకున్నవి నీవు పూర్తి చేస్తూ, కాలం మడతల్లోంచి నీకు అందింది కూడ నువ్వు నిర్వర్తించ గలిగినట్లైతే, నీకు క్రమశః కాలం మీద స్వామిత్వం వస్తుంది చాలా ముఖ్యం, ఆధ్యాత్మిక సాధనలో ముందుకు వెళ్ళాలంటే. రోజూ ఈ గ్రంథం చదువుదాం అని అనుకుంటాం కదా! అదే timeకి ఎవరో వస్తారు, మన దేశంలో చెప్పకుండా రావడం అనేది చాలా ఎక్కువ కదా! అలాగే అనుకోకుండ ఏదో phone వస్తుంది. మన వాళ్ళు phone లో మాట్లాడితే ఒక్కొక్కసారి ఒక పావుగంటో, అరగంటో తినేస్తారు. బంధువులు వస్తారు. అనుకోకుండ ఎక్కడ నుండో పిలుపు వస్తుంది. ఇవన్ని వుంటాయి ప్రతివారి జీవితంలో. వుండకుండా వుండవు. వుంటె, వాటిని నిర్వర్తిస్తూ, నీవనుకున్నవి నిర్వర్తించావా లేదా చూసుకోవాలి. ఈ విధంగా మనం కనుక ముందుకు సాగినట్లైతే ఈ మనోజవః- అనే నామంలో వుండే వేగం, మనస్సుకుండే సహజమైన వేగం, అది మనకి అబ్బి, మనం చాలా దుర్గమమైన కార్యాలను సాధించగలిగే వాళ్ళముగా తయారవుతాం. మాస్టరుగారు అబ్బా! ఇన్ని పనులు చేయవచ్చా ఒక మనిషి అనిపిచ్చేటట్లుగా వుండేవారు. వారి జీవితంలో మనకి అట్లా అనిపిస్తు వుంటుంది. పుస్తకాలకి పుస్తకాలు వ్రాశారు. ఉపన్యాసాలకి ఉపన్యాసాలు చెప్పారు, మందులకి మందులు ఇచ్చారు, ప్రతి కుటుంబంలో తను ఒక సభ్యుడిగా, అంత సన్నిహితంగా మెలిగారు. దూరంగా వుండి ఆశ్వీరదించడం కాదు, మన ఇంటికొస్తే ఆదరించడం కాదు.

ఆయన ప్రతి ఇంట్లోను వుండేవారు. దానికి ఎంత సమయం కావాలి ? ప్రతి ఇంట్లోనే కాదు, ప్రతి వంట ఇంట్లోకి కూడా వెళ్ళేవారు. అంటే ఆ సన్నిహితత్వము మనం వూహించలేనంత సన్నిహితత్వం. ఎలా చేయగలిగారో? ఆయనకి అంత time ఎక్కడ వుండేదో! మీరు మాష్టారుగారితో పరిచయం వున్న ఏ స్త్రీ నన్నా అడగండి, వాళ్ళ ఇంటికి, వాళ్ళ వంటింటిలోకి ఆయన వచ్చారా లేదా కనుక్కోండి. వాళ్ళ ఇంటికి ఆయన ఎన్నిసార్లు వచ్చారో కనుక్కోండి. ఇవన్నీ వేలాది మందికి వైద్యం చేస్తూ, గ్రంథాలు వ్రాస్తూ, ఉపన్యాసాలు ఇస్తూ, యువకులను తీర్చిదిద్దుతూ చేసిన పనులు. ఎట్లా ఆయనకు వీలు పడ్డదంటే వీలుపడుతుంది. అలా మాష్టారు గారి యొక్క దినచర్య మనకు ఒక ఆశయం అవ్వాలి. ఆయన మంచి నిద్రలో వున్నపుడు కూడ phone వస్తే గభాలున ఎత్తేవారు. పక్కనే వుండేది phone. అంతవరకు అలసిపోయి ఏ 12 గం. కి పడుకున్నా, ఒంటి గంటకు phone వస్తే, ఇప్పుడా చేశాడు phone, అని అనుకోకుండ, ఆ phone ఎత్తి వాళ్ళతో మాట్లాడి, వాళ్ళకేదో వైద్య సలహా చెప్పి పడుకునేవారు. ఇదేమిటి మాష్టారు అని అడిగితే ఆయన చెప్పింది ఏమిటంటే 'భగవంతుడి గుడి తలుపులు ఎప్పుడూ తెరిచి వుండాలయ్యా. ఆ విధంగా నేను నమ్మినవాళ్ళు నాకు ఈ నియమం ఇచ్చారు. ఎప్పుడు ఎవరు వచ్చినా సరే నిరాకరించడానికి వీలులేదు. ఎక్కడు నుండి కర్తవ్యమునకు సంబంధించి పిలుపు వస్తే వెళ్ళకుండా వుండడానికి వీలులేదు.' అర్థరాత్రి బయటకు వెళ్ళి మందు వేసి వచ్చి మళ్ళీ తెల్లవారుజామున పడుకున్న సన్నివేశాలు వున్నాయి. తెల్లవారుజామున వచ్చాము కాబట్టి 7 గం. వరకు పడుకునే సన్నివేశాలు వుండవు. ఏ 4 గం. కో, 4.30 కో వచ్చారనుకోండి అపుడే స్నానం చేసేసి మళ్ళీ పనిలోకి వెళ్ళిపోయేవారు. ఇది సాధ్యమా అంటే ఇది సాధ్యము అని ఆయన మనకి నడిచి చూపించారు. మరి ఆయన మనస్సు యొక్క వేగం చాలా అద్భుతమైనది.మనం అందుకోలేనంత వేగంలో వుండేది. ఎప్పుడూ అదే వేగంలో వుండేది. ఇట్లా మనం చేస్తే రెండు, మూడు రోజులు గురుపూజల్లాంటి సమయాల్లో చేయవచ్చు. మనం గురుపూజలైన తరువాత రెండు రోజులు పడుకోవడం వుంటుంది. మాష్టారుగారికి అలా ఉండేది కాదు afresh. మర్నాడు పొద్దుట prayer కి సిద్ధం, dispensary తెరిచి ఉండేది, ఆయన మందులు ఇచ్చేస్తుండేవారు. దేనికోసమూ ఆయన ఆగే వారు కాదు. ఏదీ ఆగింది కాదు. ఇది ఎక్కడ నుండి వచ్చిందీ? కాలము వృథా చేయక జీవించడం నుండి వచ్చింది. అందులో నుండి ఆయనకు వచ్చిన వేగము. సాధనపరంగా మనం చెప్పుకుంటున్నాము కాబట్టి ఆయన మనస్సు యొక్క వేగము ఎంత వున్నది! అది ఆయనలో వుండే దైవము యొక్క అస్తిత్వముగా మనము భావన చేయాలి. అంటే దైవాన్ని మనోజవుడిగా ఎట్లా చూడాలంటే ఇట్లా చూడాలి. ఎన్ని పన్లు, ఎన్ని పన్లు, ఎన్నిపన్లు, ఒక పనా? అలా చెయ్యగలమా? ఏదో మన

సంసారం మనం కొలిక్కి తెచ్చుకునే సరికే వుస్సురుమనేటట్టుగా వుంటుంది కదా ప్రాణం. అటువంటిది ప్రతి కుటుంబములో ఆయన ఒక సభ్యుడు. మాస్టర్ గారిలో ప్రత్యేకత ఏమిటంటే ప్రతికుటుంబంలోను వాళ్ళకి ఎటువంటి భావన కలిగించారంటే మా కుటుంబం అంటేనే ఆయనకు ఎక్కువ ప్రేమ. అది చాలు ప్రతి వాళ్ళకి. లేదండి మేము కొంచెం special అన్నట్లుగా, వాళ్ళకి అంత సన్నిహితత్వాన్ని ఆయన ప్రసాదించారంటె ఎంత వేగంతో ఆయన పనిచేయకపోతే ఇవన్నీ అయినాయి.

## 718 తీర్థకరః

భగవంతుడు తీర్థకరుడంట. అంటే ఏమిటయ్యా అంటే. 'మార్గమును ఏర్పరిచే వాడు' అని అర్థం. తీర్థము అంటే మార్గము అని అర్థము. కరుడు అంటే ఏర్పరిచే వాడు అని అర్థం. అంటే మనకి సమస్యల్లోంచి పరిష్కారాలు చూపించే వాడు, మనస్సులో. అంతా మనోలోకానికి సంబంధించింది ఇందులో ఎక్కువ. మనస్సులో సమస్యకి పరిష్కారము ఒకటి. సమస్య ఎందుకు వస్తుందో తెలుసా? మనకు వున్న పరిమితత్వము నుండి మనల్ని కొంచెం ఉద్ధరించడానికి వస్తుంది. మనం మామూలుగా ఒక పద్ధతిగా జీవిస్తున్నపుడు ఒక సమస్య వస్తుంది. సమస్య నుండి మనిషి ఎదుగుతాడు. సమస్యలు లేకపోతే మనిషి ఎదగడు. అందుకని వచ్చిన సమస్యలో నుండి తను పరిష్కారాన్ని ఇచ్చి, సమస్య నుండి మనల్ని దాటిస్తాడు. సమస్య నుండి దాటించడమే కాకుండా, మనకి ఆ సమస్యను దాటించడంలో మనం పొందే అనుభవం ద్వారా మనలో వుండే మితులను దాటిస్తాడు. పరిమితులను దాటిస్తాడు. ప్రతి విషయంలోను ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క మితి వుంటుంది. దాన్ని దాటిస్తుంటాడు. రోగం గురించి ఒక భయం వుంటుందనుకోండి. ఇంట్లో ఒకళ్ళకి రోగం వస్తుంది. ఎవరికి రాకూడదనుకుంటామో వాళ్ళకే రోగం వస్తుందనుకోండి. వస్తే రోగంలో మనం చేసే సేవలోంచి మనం పెరుగుతాం. అట్లాగే కొంతమందికి ధనం పోతుందేమో అని భయం వుందనుకోండి, అది పోతుంది. పోవడం లోంచి పెరుగుతాం. కొంతమందికి కీర్తిపోతుందేమో అని బాధపడుతు వుంటారనుకోండి. కొంత కీర్తి పోతుంది. పోవడం లో నుండి బాగుపడ్తాం. నలుడు, ధర్మరాజు, హరిశ్చంద్రుడు, రాముడు ఇత్యాదులందరు కూడ కష్టంలో పెరిగినంత సుఖంలో పెరగలేదు. రాముడ్ని ఇందులో మనం చెప్పకూడదనుకోండి. ఇతరుల యొక్క జీవితాలు చూచుకున్నట్లైతే అందరూ కష్టంలోనే పెరిగారు. అదుకనే కుంతీదేవి 'కష్టాలు వుంచు నాయన పెరుగుతూ వుంటాము' అని చెప్పింది. కష్టం లేకపోతే పెరగం. హాయిగా పడుకుంటాం. సుఖంలో మనిషి పెరగడు. కష్టంలోనే పెరుగుతాడు. సంపదలో మనిషి పెరగడు. తుష్టిగా వుంటే పెరగడు. కొంత తక్కువగా వుంటే పెరుగుతాడు. పేదరికంలో మనిషి పెరిగినంత లోతుల్లో, సంపదలో మనిషి పెరగడానికి అవకాశం లేదు. అందుకని ఏమి చేస్తాడంటే ప్రతి జీవి తనని చేరుకోవాలి కదా. దానికి జీవుడికి వుండే పరిమితులు వుంటాయి కదా, ఆ పరిమితుల్లో నుండి వాడు బయట పడడానికి కావలసిన సన్నివేశాలు కలిగినప్పుడు అవి మనమే వాటి నుండి దాటడానికి, పరిష్కారంకి మనం ప్రయత్నం చేస్తాం. అంతవరకు ప్రయత్నం చేయం. ఎందుకంటే కష్టం వచ్చినప్పడే మనిషి ఎదుగుతాడు

దాన్ని పరిష్కరించుకోవడం ద్వారా. ఓష్! ఇదో పెద్ద కష్టం కాదు అని అనిపిస్తుంది. కాకపోవడం వల్ల పక్క వాళ్ళకు వస్తే 'మేము పడ్డామండి ఇది ఫరవాలేదు నెమ్మదిగా మీరు బయటకి వస్తారు' అని చెప్తాం కదా. ఒక నష్టపోయిన వాడు ఇంకొక నష్టపోయిన వాడిని బాగా ఓదార్చగలడు కదా. ఒక జబ్బుపడి బయట పడ్డవాడు, ఇంకొక జబ్బుపడ్డవాడిని బాగా ఓదార్చగలడు. వాడే ఉదాహరణ కనక! ఒక కష్టంలోంచి బయటపడ్డవాడు, ఇంకొక కష్టంలో వున్నవాడికి చెప్పగలడు. ఏ సమస్యలో మనం వున్నామో, ఆ సమస్య నుండి బయటపడడానికి అటువంటి సమస్య నుండి బయటపడ్డవాడు గురువుగా దొరుకుతాడన్నమాట. అతడ్ని ప్రకృతో లేక దైవమో ఆవిధంగా అమరిక చేసుకుంటూంటుంది. ఇట్లా పడ్తుంటాం. ఎంత కష్టం వచ్చినా మనం అనుకున్నవాడు సహాయానికి రాకపోయినా, ఎవరో అనుకోని వాడు సహాయానికి వస్తూంటాడు. వాళ్ళు ఉపశమనం కలిగిస్తు వుంటారు. మనకుండే ఆ భయం తొలగిపోతు వుంటుంది. నెమ్మదిగా ఆ పొర విడిపోతు వుంటుంది. ఇట్లా దారి ఏర్పరుస్తు వుంటాడండి. తీర్థకరుడు అంటే మార్గమును ఏర్పరుచువాడు. ఎవరికి అంటే మనస్సు పొరల్లో నుండి చైతన్యంలోనికి. మనస్సుల్లో ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క పొరల్లో వుంటారు. బొద్దింక అంటే భయం దగ్గిర నుండి వుంటయి మనకి పొరలు కదా! బొద్దింకలు మీద వాలిపోవడం, లేకపోతే బొద్దింకలను కోసి Experiment చేయడం ఇటువంటివన్ని వాడికి జీవితంలో ఎదుర్కోవడం ఉంటుంది. మాస్టారుగారు ఒకటి చెప్పారు 'నువ్వు గనుక సద్గురువుని ఆశ్రయిస్తే మొట్టమొదట జరిగేదేమిటంటే నీకు దేనియందు భయము వుందో దానికి సంబంధించిన సన్నివేశాలు గబగబా నీ దగ్గరకు నడిచివస్తాయి' అని. ఎందుకంటె నీవు పరిమితుడివిగా వుండడం సద్గురువుకి ఇష్టం లేదు. ఒకాయనకి వాళ్ళ ఆవిడ అంటే విపరీతమైన ప్రేమ. ఒక రోజు మాస్టారుగారు పిలిచి చెప్పారు. 'నీవు అంత అతిగా పెట్టుకుంటే, నీ అతి వలన ఆవిడకు ఏదన్నా అపాయము జరగవచ్చును. ఆ అతి తీసేసెయ్' అని. ఎందుకంటే నీవు ఈ మార్గంలో నడుస్తున్నపుడు భార్య మీద ప్రేమ వుండటం కళ్యాణ గుణం. అత్యంత మమకారం వుండడం అనేది పరిమితత్వం. ఇక్కడ నుండి వెళుతున్నపుడు అనకాపల్లిలో దిగి STD చేసి, తునిలో దిగి చేసి, విజయవాడలో ఎక్కడబడితే అక్కడ మాటిమాటికి పెళ్ళానికి phone చేసుకునే తత్త్వం ఒకటి వుంది కదా మనకి ఇప్పుడు. ఊరు దాటి వెళితె చాలు ముందు phone చేసుకోవాలి. ప్రొద్దున చేసి, మధ్యాహ్నం చేసి, రాత్రి చేసి, ఏమైపోరు వాళ్ళు. మనబట్టి వాళ్ళు బ్రతకడం లేదు. కాని ఎందుకనో అట్లా వుంటాం కదా! మనం ఎంత అతిగా వుంటే అక్కడే వాతపెడతారు. 'కీలెరిగి వాత పెట్టడం' అనేది సద్గురువు చేస్తుంటాడు. అందుకని ఆయన చెప్పారు 'నీవు ఇంత అతిగా వుంటే నువ్వే కోరి తెచ్చుకుంటావు మీ ఆవిడకి',

అని. అట్లాగే చేసుకున్నాడు. ఆవిడకి భయంకరమైన గుండెజబ్బు వచ్చింది. చిన్నపిల్ల. ఆవిడకి గుండెజబ్బువస్తే వీడిని పట్టుకుని విపరీతంగా తిట్టారు మాస్టారుగారు. 'ఇంతేనోయ్ ఇట్లాగే కొంత మంది డబ్బుని ఆవరించుకుని కూర్చుని వుంటారు. పోయేంత వరకు తోచదు. వాళ్ళే పోగొట్టుకుంటారు'. డబ్బుని కౌగిలించుకున్న వాడికి డబ్బుపోతుంది. సంతానాన్ని కౌగిలించుకున్న వాడికి, వాళ్ళు వీడి మాట వినకుండ, వీడికి ఎదురు తిరుగుతారు. అందుకనే నీవు ఏది గట్టిగా పట్టుకుంటావో, అది నీ దగ్గర నుండి ఎట్లాగో అట్లా వదిలించుకుని వెళ్ళిపోదాం అనుకుంటుంది. ఈ క్లాసుల పేరున రాత్రి, పగలు మిమ్మలను హింసించాననుకోండి, ఏం చేస్తారు? ఏదో వంక పెట్టుకుని పారిపోతారు, అంతేగా! కొత్తగా కవిత్వం నేర్చుకున్నవాడు, ఎవరు కనపడినా, వాడిని పిలిచి కూర్చోబెట్టి వాడికి కవిత్వం చెప్తూ వుంటాడు. వాడి నుండి ఎట్లా తప్పించుకోవాలా అని మనం చూస్తు వుంటాం. అందుకని పట్టుకుందాం అనుకుంటే, తప్పించుకుందాం అనుకునేది అవతల జీవలక్షణంలో వుంటుంది. అందుకని నీవు ఏది పట్టుకుంటావో అది పోగొట్టుకోవడానికి అవకాశం కల్పిస్తున్నావు. పట్టే లేకపోతే పోనేపోదు. మనకు భాగవతంలో ఒక పద్యం వుంది.

ధనము వీధి పడిన దైవ వశమునుండు, పోవు మూలనున్న నైన
అడవి రక్షలేని యబలుండు వర్ధిల్లు, రక్షితుండు మందిరమున జచ్చు

అని బాగా మనం health గురించి రకరకాలుగా ఈ మధ్య ప్రొద్దున్నే పళ్ళరసాలు తాగి, ఒకసారి BP, Pulse అన్ని చూసుకుని, మళ్ళీ tiffin చేసి మళ్ళీ చూసుకుని, మళ్ళీ మధ్యాహ్నం తిని మళ్ళీ చూసుకుని ఇట్లా చేస్తున్నాం అనుకోండి. ప్రతి మూడు నెలలకి heartbeat ఎట్లా వుందో అని, అంటే ధ్యాస అంతా దీనిమీదే వుండి తెచ్చుకుంటు వుంటాడు. అంటే అదే అసలు రోగం. రోగం గురించి ధ్యానమే పెద్ద రోగం. అదే తెచ్చి ఇస్తుంది రోగాన్ని. దానికి ఏదో చేయాల్సింది చేసి వూరుకోవడం తప్ప, దాన్ని గురించి భావన చేసి, రోగధ్యానం చేయవద్దు అంటుండేవారు. అట్లాగే దేనిమీద ధ్యాస ఎక్కువ వుంటుందో దాన్ని పోగొట్టుకోవడానికి అవకాశం ఎక్కువ వుంటుంది. అది వీధిలో పడిపోయినా మళ్ళీ నీదైతే నీ దగ్గరకు వచ్చేస్తుంది. అడవిలో వున్నా నిన్నెవరు చంపరు. ఇంట్లో వుంటే చచ్చిపోవచ్చు కదా! మొత్తం security ఎక్కువ పెట్టుకున్న వారికే గదా ఎక్కువ danger. Z listలో వున్నవాళ్ళకి gunmen వాళ్ళు వీళ్ళు ఎంతోమంది వున్నారు కదా. మరి అంత రక్షణ వుండేవాడికే చావు భయము ఎక్కువ. మనకు లేదుగా. కొంతమందికి దొంగ భయము వుంటుంది. ఒకటికి పదిసార్లు తలుపులు వేసుకుంటూ వుంటారు . పడుకున్నపుడు కూడా అదే. అంటే దొంగకి ఒక antena పెట్టి invite చెయ్యడం అవుతుంది అది. ఒరే, ఇక్కడకి రా, ఇక్కడకిరా అని పిలుస్తూ

వుంటాం అన్నమాట. వాడు ఊళ్ళో ఎక్కడో తిరుగుతు వుంటాడు. వాడ్ని మనింటికి పిలుచుకొచ్చే అంత వరకు మన మనస్సు పనిచేస్తూ వుంటుంది. ఇవన్నీ భావమయ లోకాల్లో కొన్ని సత్యాలు. అందుకని అవి జరిగితే ఆ గొడవ వదిలిపోతుంది. ఒకసారి అది అనుభవించేస్తే ఇక దొంగ వచ్చినా ఫరవాలేదులే, ఇంకేమి లేదు మన దగ్గర అని హాయిగా పడుకుంటాడు కదా! అది కూడ దారిలో నడిపించడమే! ఇట్లా రకరకాలుగా నడిపిస్తారండి. ఎందుకయ్యా అంటే నీలో పరిమితత్వం వుండడం వాడికి ఇష్టం లేక. సద్గురువుని ఆశ్రయిస్తే ఇవి ఎక్కువ అవుతాయి. గుర్తుపెట్టుకోండి. ఎందుకంటే సద్గురువుని ఆశ్రయించడంలో ఉద్దేశ్యము అతని ఆశ్రయంలో తానెవరో తెలుసుకోవడం కదా! తానెవరో తెలుసుకోవాలంటే ఈ భావాల్లో ఇరుక్కుపోయినవాడిని, ఊబిలోంచి బయటకి లాగడానికి భగవంతుడు తీర్థకరుడుగా పనిచేస్తు వుంటాడు. త్యాగరాజు జీవితములో ఏమి జరిగింది? విగ్రహాలె రాముడనుకున్నాడు కదా! అవి ఎత్తుకుపోయారు. అవి అట్లా అనుకోవడం వల్ల! లేకపోతే విగ్రహాలు ఎత్తుకు పోవలసిన సన్నివేశం, మన భాషలో చెప్పాలంటె అంత scene ఏమి లేదు అక్కడ. విగ్రహాలు ఎత్తుకుపోతే తపన చెందాడు. తపన లోంచి కీర్తనలు వచ్చినాయి. కరిగాడు. కరగడంలోంచి బంగారం బయటపట్టాడు. మేలిమి బంగారం. 'ఎందుకురా ఇట్లా తిరుగుతున్నావు ఇల్లు వాకిలి వదిలేసి. ఇంటావిడ ఏమైపోతుంది బుద్ధిలేదా' అని భగవంతుడే ఒక రూపం తీసుకొచ్చి చెబుతాడు. నిజమే అనుకుని ఇంటికి వస్తాడు. 'విగ్రహాలే రాముడా? నీరాముడు మొత్తం అంత వ్యాపించి వున్నాడు అని చెబుతూ మళ్ళీ విగ్రహాలు పోయినాయి అని ఏడుస్తావేమిటి?' అంటాడు. జ్ఞానోదయం కలిగి, తిరిగి వస్తుంటే విగ్రహాలు దొరుకుతాయి. అది చూడండి. మనకి విగ్రహాలు మీద మోజు పోయిం తరువాత విగ్రహాలు మళ్ళీ దొరికినాయి. అంటే ఇపుడు ఇతడు ఏమి చేస్తాడో చూద్దామని. విగ్రహాలు రాముడు కాదంటాడా. అంటే అది ఒక వెర్రి అవుతుంది. ముందు విగ్రహాలే రాముడు అనుకుంటే అది ఒక వెర్రి. అందులోంచి తత్త్వం తెలుసుకుని విగ్రహాలు కాదు రాముడు, సమస్తం వ్యాపించి వున్నాడు అని తెలిసింది. అప్పుడు విగ్రహాలు దొరికితే ఏమి చేయాలి? ఆ 'విగ్రహాలు రాముడు కాదు కదా' అని అనుకోవడానికి లేదు. విగ్రహాలు కూడ రాముడు అని తెలియడం సమన్వయం. విగ్రహాలే రాముడు అనుకోవడం సమన్వయం కాదు. విగ్రహాలు అవసరంలేదు అనుకోవడం కూడ సమన్వయం కాదు. విగ్రహాల లోనూ వున్నాడు. తదతీతంగా కూడ వున్నాడు కదా! అలా తెలిసేప్పటికి త్యాగరాజుకి కథ పూర్తి అయింది. ధర్మరాజుకి ఏమైంది, భగవంతుడ్ని, ధర్మాన్ని వదులుకుని మయసభను కౌగలించుకు కూర్చున్నాడు. ఇల్లు కట్టింతరువాత మనం ఎట్లా ఇంటికి వచ్చిన వారిని వేధిస్తాం? మన bathroom దగ్గర నుండి వాడికి చూపించేంత వరకు

మనకు తోచదు. ఆ bathroom లో మనం వేసిన tiles వాడు చూడాలి. వీడికేమో bathroom లోకి వెళ్ళడానికి కొంచెం కంపుకొడుతుందని, రా బుద్ధికాదు. అంటే tiles వేస్తాం కాని neat గా వుంచం కదా bathroom. కంపు కొట్టేదే bathroom. నీవు ఎంత tile, marble వేసినా కూడ ఉపయోగం ఏదీ లేదు కదా! చూడండి ఈ tiles Italy నుండి తెప్పించాను అంటాడు. వీడేమో లోపల కాలే పెట్టలేడు. అట్లా ధర్మరాజు వచ్చిన వాళ్ళందరిని మయ సభ గురించి వేధిస్తూ వుంటాడు. వచ్చిన వారందరిని ప్రతిది చూపించటం అంటే ఇంటికి వస్తే గదులు చూపించడమే కాకుండ, తలుపులు, కిటికీలు, ద్వారబంధాలు చూపించి, ఈ గడియ చూశారా, ఇది Jaguar అని చెబుతాడు. ఎందుకంటే TV లో వాడు advertisement చేస్తే చూసి అది కొనుక్కొని వేసుకున్నాడు. మనం అది చూడలేదేమో అని వాడి బాధ. చూపించే అంత వరకు వాడికి తోచదు. అంటే Jaguar ఇంకోటో వేసుకొన్నాడు అవి కూడ ఎక్కడ చూస్తాం. కొంతమంది ఏమి చేస్తారంటె ఇప్పుడు ఆ తలుపుల మధ్య వుండే ఆ బందులు, రాగివి వేయించుకుంటారు. అదే మంచి ఇత్తడివి వేయించుకుంటారు. అవి కూడ చూచేంత వరకు వాడు ఒప్పుకోడు. అలాగ ధర్మరాజు ప్రపంచాన్ని బాధపెడుతు వుంటే నారదుడు వచ్చాడు. నారదుడ్ని కూడ అట్లానే వేధించాడు. నారదుడికి అంతా సరదా కాబట్టి, భగవంతుడి వైభవము అని భావన చేసి, మొత్తం చూసేసి, అంతా అయ్యిం తరువాత drawing room లోకి తీసుకెళ్ళి coffee ఇస్తాం కదా అట్లా ఆయన్ని కూర్చోబెట్టి, ఆయనకు ఏదో ఇస్తూ, ఎలా వుంది ? ఇటువంటిది ఎక్కడన్నా చూచారా ? అంటె, అప్పుడు పెడతాడు వాత. అందులోంచి మొత్తం వెళ్ళి పోతుంది. నారదుడు పెట్టిన బీజమే! ఆయనకి అక్కడ నుండి సరాసరి transfer ఎక్కడకి అయ్యాడంటే from Delhi to దండకారణ్యం అయిపోయిందన్నమాట. అటువంటి transfer! ఎందుకంటె ఇతడ్ని ఉద్ధరించుకోవాలి. అందులో ఇరుక్కు పోతాడేమో అని భయం. భగవంతుడికి భగవద్భక్తుడు ఇరుక్కుపోతాడేమో అని భయం. వీడేమో కనపడ్డ చోటల్లా అట్లా పురంజనుడి లాగా ఇరుక్కుపోతు వుంటాడు. ఒక ప్రక్క దైవస్మరణ, రెండవ ప్రక్క ఇరుక్కుపోవడం. ఈ ఇరుకులోంచి వాడు రక్షించుకుంటు వుంటాడు. అది తీర్థకరుడు అంటే! తీర్థంకరుడు అని మనకి Jain మతంలో వింటాం అంటే మార్గమున నడిచినవాడు, మార్గం ఏర్పరిచిన వాడు. ఆ మార్గంలో మిగతావాళ్ళని కూడ నడవమని మనకి చెప్పకుండ చెప్పినవాడు.

## 719 వసురేతా

వసురేత అంటే పదార్థంలో వున్న అగ్ని అని అర్థం. అది ఒక వసువు. పదార్థం లో ఉండే అగ్ని అది మన యొక్క సమస్తాన్ని మనకి కనపడకుండా మారుస్తు వుంటుంది. నిన్న చూసిన మామిడి చెట్టు వేరు, ఇవ్వాళ చూచిన మామిడి చెట్టు వేరు. నిన్న చూసిన మనిషి శరీరం వేరు, ఈ రోజు శరీరం వేరు. ఎందుకంటే అగ్నికార్యం సృష్టిలో జరుగుతూ వుంటుంది. అది పదార్థమయ లోకంలో ఎప్పుడూ వుంటుంది. మనకి పదార్థంలో ఉన్న పృథ్వీతత్త్వంలో కాని, జలతత్త్వంలో కాని, వాయుతత్త్వంలో కాని అన్ని తత్త్వాల్లోను అగ్ని వున్నది. పంచ భూతాల్లో ఇమిడివున్న అగ్నిని 'వసురేతస్' అంటారు. Frictional Fire! పరమార్థంలో పదార్థం ఏవిధంగా దాగి వున్నదో, అట్లాగే పదార్థంలో పరమార్థం దాగి వున్నదంటు వుంటామే, అలా మన శరీరం లో వేడిమిగా ఈ అగ్ని నిబిడీకృతమై వుంటుంది. అలా ఉండడంచేత ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేస్తున్నపుడు, ఆ వేడిమి అలా నిలబడి శరీరంలో రసాయనిక చర్య జరుగుతు వుంటుంది. ఆ వేడిమి శరీరంలో లేకపోతే ఏ చర్యా వుండదు. ఆగి పోయిందని చెప్తారు. వెళ్ళిపోయాడని చెప్తారు. చల్లబడి పోతుంది. ఇట్లా మనిషి శరీరంలోనే కాకుండ, సమస్త జీవరాశుల శరీరంలోను ఈ వేడిమి వుంటుంది. దీన్ని 'the latent heat' అంటాం. అది వుండి ఆ రూపాన్ని, ఆ విధంగా పరిణామం చేస్తు వుంటుంది. చెట్టు పెరగడానికి అది కారణం. జంతువు పెరగడానికి అది కారణం. మనుషులు పెరగడానికి, తరగడానికి అది కారణం. హాని వృద్ధులన్నిటికి కూడ ఈ పదార్థంలో వుండే అగ్ని స్వరూపుడైన భగవంతుడ్ని మనం 'అగ్నావిష్ణుః' అని చెప్తాము. ఇంద్రావిష్ణువు, అగ్నావిష్ణువు అని ఇద్దరున్నారు. అంటే పదార్థానికి అతీతంగా వుండే అగ్ని, పదార్థంలో అగ్ని. పదార్థానికి అతీతంగా వున్న అగ్నిని 'వెలుగు' అంటాం. పదార్థం లో వున్న అగ్నిని 'వేడిమి' అంటాం. అగ్గిపుల్లలో వుంది కాబట్టి అందులోంచి వ్యక్తమవుతూ వుంటుంది. వ్యక్తమయినదాన్ని జేబులో పెట్టుకుని వెళ్ళలేము కదా. కావలసి వచ్చినపుడు వ్యక్తం చేసుకుంటుండవచ్చు. అది వుండడం వల్ల మార్పులు జరుపుతూ వుంటుంది. ఆ విధంగా భగవంతుడు అన్నిటిలోను మార్పులు చేసేవాడిగా లోపల అగ్ని స్వరూపుడిగా వుండి నిర్వర్తిస్తున్నాడు అనేది మనం ఈ వసురేతా అనే నామం ద్వారా గమనించవచ్చు. రేతస్ అంటే తేజస్సు అని అర్థం. భగవంతుని యొక్క బీజము. అది పంచభూతాల్లో వుండడం వల్ల పంచభూతాలు ఎప్పుడూ మార్పు చెందుతూ వుంటాయి. వాటి యొక్క మిశ్రమం ఎప్పుడూ మార్పు చెందుతు వుంటుంది. ఆ తత్త్వాన్ని ఈ నామంలో మనకి అందించారు. దీన్ని మనం గమనించడం అనేది మనని అంతర్ దృష్టికి తీసుకు వస్తుంది.. కనిపించేదే చూస్తాం

తప్ప, కనిపించే దాంట్లో జరుగుతున్న రసాయనిక చర్యలు మామూలుగా మనం చూడం కదా! చూడాలంటె పూల మొక్కలు పెంచాలి, తోట పెంచాలి. వ్యవసాయం చేయాలి. ఒక వ్యవసాయం చేసేవాడు పొందే తాత్త్విక చింతన, రూపాయినోట్లతో పని చేసేవాళ్ళకు రాదు. మనం రూపాయి నోట్లతో పని చేయడం ఎక్కువ అవుతుంది. ప్రకృతితో పనిచేయడం అనేది తక్కువ అవుతుంది. ఎంత మనకి తాత్త్విక చింతన ఏర్పడుతుందో వ్యవసాయం చేస్తుంటే! నువ్వు ఒక్క గింజ వేస్తే అన్ని గింజలుగా వస్తుందే అది! ఆ రావడంలో ఎన్ని మార్పులు, చేర్పులు! దాన్ని గమనించడం అంటే మనం ఏదో ఒక తులసి మొక్కనన్నా పెంచాలి. అప్పుడు అందులో జరిగే మార్పులు తెలుస్తాయి. ఒక పూల మొక్క అన్నా పెంచాలి. పెంచితే మార్పులు తెలుస్తాయి. లేకపోతే గర్భం ధరించాలి. మార్పులు తెలుస్తాయి. ఒక స్త్రీ కి వున్న అనుభూతి పురుషుడికి వుండదు, ఆ విషయంలో. ఎన్ని లక్షల, కోట్ల మార్పులు శరీరంలో జరుగుతాయో గమనిస్తే అది ఒక పెద్ద వికాసం. జరిగి బయటికి వస్తుంది. ఎక్కడ వుంది ఇది అంతకు ముందు. చెట్టునుండి పండువచ్చినట్టు. పూల మొక్క నుండి పూవు వచ్చినట్టు. మనిషి నుండి మనిషి వచ్చినట్టు, ఇవన్ని నడిపించే వేడిమి ఏదైతే లోపల వున్నదో దాన్ని 'వసురేతః' అంటారు. అది బాగా పెరిగి కనిపించిందే 'విష్ణుమూర్తిగా' పరీక్షిత్తునికి కడుపులో ఉండగా. ప్రతివాళ్ళకి కనిపిస్తుంది, పరీక్షిత్తుకే కాదు. కాకపోతే మనకు గుర్తువుండదు ఆయనకు గుర్తు వుంది అంతే. అది ఒకటే తేడా. చిట్ట చివరిలో నొప్పులు వస్తున్నవి అని అనుకుంటాము కదా. నొప్పులు రావడం అంటే ఏమిటంటే లోపల జీవుడు తన్ను తాను బయటకి రావడానికి ప్రయత్నం చేస్తు వుంటాడు. ఆ బయటకి రావడానికి అతను చేసే ప్రయత్నానికి లోపల నుండి వేడిమి తోడ్పాటు చేస్తు వుంటుంది. అంతవరకు ఎప్పుడు బయట పడతానా దేవుడా, అని ప్రార్థనలు చేసుకుంటూ వుంటాడు. ఎందుకంటే, మనకి reservation ఎక్కడ ఇచ్చారంటే almost toilet పక్కన ఇచ్చారన్న మాట compartmentలో. మరి ప్రయాణం అక్కడ చేయాలి కదా. అక్కడ వుండాలి కదా. ఉన్నప్పుడు రకరకాల బాధలు పడుతూ వుంటాడు జీవుడు. పడ్డప్పుడు ప్రార్థనలు చేసుకుంటుంటాడు. ఎటువంటి ప్రార్థనలు చేస్తాడంటే త్వరగా బయటపడేయ్ అని. ఎందుకు తను ఇంత బాధపడుతున్నాడో అప్పుడు తను చేసిన పనులు తనకి గుర్తు వస్తువుంటాయి. ఇటువంటి పనులు ఇంక చెయ్యను, అని ఒట్టు వేసుకుంటు వుంటాడు. వాగ్దానాలు ఇస్తాడు దేవుడికి. నన్ను ఎట్లాగో అట్లా ఏదో ఒక శక్తి బయట పడేస్తే చాలు, అనుకుంటాడు. ఆ సమయంలో ఈ వసురేతా తత్త్వము వేడిమిని పెంచి వీడిని బయటకి తోస్తు వుంటె, ఆ వెలుగుని చూసి దండం పెట్టుకుంటూ వుంటాడు. అందుకనే చిట్టచివరికి కడుపులో పిల్లవాడు వుండే posture పిండాసనం రూపంలో వుంటుంది. అంటే దండం పెట్టుకుని, కాళ్ళు చేతులు తల

అంతా వొదిగి వుంటాడు, వినయంగా. బయటకి వచ్చింతరువాత ఆ ధ్యాసలోనే వుంటాడు. సంస్కారం బట్టి గుర్తువున్నవాళ్ళకి గుర్తు వుంటుంది. లేనివాళ్ళు మర్చిపోతారు. గుర్తువున్నవాడు పరీక్షిత్తు అయ్యాడు. దాన్నే వెతుక్కుంటు వుంటాడు బయట. పైగా అతని మీద ఒక అస్త్ర ప్రయోగం చెయ్యడం వలన ఒక ఆపద కూడ వచ్చింది. ఆ ఆపద నుండి కూడ ఇది కాపాడింది. ప్రతి జీవుడు కూడ ఇదే స్థితిని అనుభవిస్తారు. అనుభవించినపుడు 'మళ్ళీ ఇందులోకి రాకుండ వుండేందుకు ప్రయత్నం చేస్తాను' అని కొన్ని వందల, వేల సార్లు వాగ్దానం చేస్తాం. మర్చిపోతాం. అది మన ప్రత్యేకత! మరుపు. మర్చిపోయి వుంటే జ్ఞాపకము వున్నవాడు మళ్ళీ గుర్తు చెయ్యడానికి వస్తాడు. 'ఒరేయ్! ఇలా జరిగింది మళ్ళీ ఇట్లా జరగకూడదు అని అనుకున్నావ్ అప్పుడు, అందుకనె నీకు నేను మార్గం చూపించడానికి వచ్చాను' అని గురువు వస్తాడు. అడిగిన వాడికి ఇస్తాడు. అడగకుండ ఇవ్వడు. అందుకనే మన పెద్దలందరు కూడా మళ్ళీ పుట్టకుండా వుండే మార్గం చూచుకోమన్నారు. 'పుట్టని,చావని ద్రోవ వెదకి కొనుట దొడ్డబుద్ధి', అని ప్రహ్లాదుడు అంటాడు. అలాగే మనకి శంకరాచార్యులు వారు,

పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం,
ఇహ సంసారే బహుదుస్తారే, కృపయాపారే, పాహి మురారే

అంటారు. అది చాలా భయంకరం. అంతకన్నా మించిన కష్టం మనం మొత్తం జీవితంలో పడం. కాని అది గుర్తు ఉండదు. కపిలుడు అదే గుర్తు చేస్తాడు దేవహూతికి. అందులోంచి బయట పడడానికి మార్గమే 'యోగమార్గం'! అంటే ఆ తరువాత పుట్టరా అంటే పుడతారు, కాని ఆ పుట్టుక వేరు, ఈ పుట్టుక వేరు. ఆ పుట్టుకనే immaculate conception అంటారు. ఒక సిద్ధపురుషుడు, అంటే జీవితంలో తన్ను తాను తెలుసుకుని, వెలుగు శరీరం నిర్మాణం చేసుకున్నవాడు మళ్ళీ జన్మ ఎత్తితే, అతని యొక్క చంద్రాత్మకమైన ప్రజ్ఞ తల్లి శరీరంలో పెరుగుతువుంటే, సూర్యాత్మకమైన ప్రజ్ఞ తండ్రి శిరస్సుమీద వుంటె, ఆ శరీరం తల్లి కడుపులోంచి బయటకి వచ్చింతరువాత తన్ను తాను ఆపాదించుకుంటాడు. అదీ immaculate conception. అదేమిటో తెలియక 'కన్యకు పుట్టాడు' అని చెప్పుకుంటూ వుంటారు. ఏమిటి immaculate అంటె He did not go through the process అంటే తల్లి గర్భంలోంచి రాలేదు. మనకి భాగవతంలో కృష్ణుడి పుట్టుక కూడా అట్లాగే చెప్తారు. పిల్లవాడు ప్రసవింపబడుతున్న సందర్భంలో అక్కడ పిల్లవాడు వచ్చేశాడు, భగవంతుడు వసుదేవుడికి కనపడి 'నేను ఇప్పుడు వస్తున్నాను', అని ఆ తరువాత తనని ఆ శరీరం మీద ఆపాదించుకుంటాడు. ఆపాదించుకున్నపుడు, పిల్లవాడు కేర్ మని ఏడుస్తాడు. ఆ తరువాత యమునా నది దాటించడం ఉంటుంది. ఇది సిద్దుల విషయం లో సత్యం. సామాన్య

మానవులకు ఏమి జరుగుతుందంటే 6 నెలలు వరకు కడుపులో శరీరం పెరుగుతు వుంటె, తండ్రి శిరస్సుమీద సూర్యాత్మకమైన జీవప్రజ్ఞ నిలచి వుంటుంది. 6 నెలలు పూర్తయి, ఏడో నెల రాగానె తల్లిగర్భంలోకి సూర్యాత్మకమైన ప్రజ్ఞ వెళుతుంది. అందుకే సీమంతం చేస్తారు. అప్పుడు సీమంతం ఎందుకు చేస్తారంటె ఇప్పుడు పూర్ణంగా ఆమె యందు జీవప్రజ్ఞ నిలబడివున్నది. ఏడు, ఎనిమిది, తొమ్మిది, మూడు నెలలు అంటే 90 రోజులు అంటే దాదాపు అక్కడ ప్రతినెల, ప్రతిరోజు ఒక యుగంలాగా బాధపడుతు ఉంటాడు సామాన్య జీవి. ఈ 90 రోజుల్లో ఎంత ప్రార్థన జరుగుతుందంటె ఎంత తొందరగా బయటపడేస్తాడా అన్నట్టుగా! మహాత్ములకి ఈ 90 రోజుల బాధలేదు. సామాన్యులకి ఈ 90 రోజుల బాధవున్నది. అది గుర్తువున్నవాడు ఎవ్వరు కూడ ప్రపంచంలో మళ్ళీ మరో పిచ్చిపని చెయ్యడు. అది గుర్తు లేనివాడె చేస్తాడు. అదే గనుక మనకు మన పరిస్థితి ఒక వీడియో తీసి, మన చేతిలో పెట్టేస్తే, ఎంత ప్రలోభ పెట్టినా మనం మరి వేరే విధంగా ప్రవర్తించమండి. అందుకనే మహాత్ములు ఆ వేదన తెలిసిన వాళ్ళు కాబట్టి, వాళ్ళని ఈ స్థితి నుండి రక్షించడానికి available గా వుంటారు. అందుబాటులో వుంటారు. 'అందుబాటులో వుంటారే తప్ప, అడిగితే గాని అందించరు.' చెరువు వుంటుంది, వాడుకునేవాడికి చెరువు తప్ప, చెరువు వచ్చి వాడబడదు కదా! ఆ చెరువులో రకరకాల పనులు చేస్తు వుంటాం. ఎవరు దేనికి వాడుకున్నాడనేది వాడిని బట్టే. అట్లాగే గురువు కూడ ఒక చెరువు లాగా వుంటాడు. ఎదుటివాడు ఎట్లా వినియోగించుకుంటే అట్లా వినియోగించుకోవచ్చు. ఆయనకి ఏమి అభ్యంతరం వుండదు. చెరువుకి ఏమి అభ్యంతరం ? మంచినీళ్ళు పట్టుకెళ్ళె వాళ్ళు వుంటారు, అదే చెరువులో సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చేవాళ్ళు వుంటారు. ఇంకొకడు ఏదో కడుగుకునేవాడు వుంటాడు అదే చెరువులో కదా! మరి చెరువు వీడికి, వాడికి, అందరికి సమానంగా వినియోగపడుతున్నది కదా! అదేమిటయ్యా, వీడేమో సూర్యుడికి అర్ఘ్యం ఇస్తుంటె నీవెమో ఈ పని చేస్తున్నావిక్కడ అంటే రెండింటికి చెరువు వరకు ఒకటే. 'గురువుగారిని వాడుకోవడం శిష్యుడి యొక్క సంస్కారం బట్టి వుంటుంది, గురువు వాడబడడానికి ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు'. అట్లా అందుబాటులో వుంటాడన్నమాట. అందిస్తూ వుంటాడు. అందుకనే సద్గురువు ఎప్పుడూ కూడ 'నువ్వు చిరంజీవివి కావాలి' అని ఆశీర్వదిస్తాడు. చిరంజీవివి కావడం అంటే మరణమును దాటిన వాడివి కావాలని ఆశీర్వదిస్తాడు. ఇట్లా లోపల నుండి బయటకి తోస్తు వుంటాడండి. ఇంత చెట్టు ఎక్కడ నుండి వచ్చింది ? లోపల నుండి అగ్ని అట్లా పెంచుతూ వుంటుంది. సూర్యరశ్మి లేకపోతే లేదు. పైన సూర్యరశ్మి, లోపల పదార్థంలో వుండే వేడిమి రెండు కలిపి నడిపిస్తు వుంటాయి.

## ౭౨౦ వసుప్రదః

వసు అనే పదానికి అర్థం తేజము అని ఒక అర్థం, శుభము అని ఒక అర్థం, మంచి అని ఒక అర్థం వున్నది. మంచిదైనది, శుభంకరమైనది, తేజోవంతమైన దానిని 'వసు' అంటారు. ఈ మూడింటిని అందించే వాడు వసుప్రదః! శుభమునందిస్తాడు, తేజస్సు నందిస్తాడు. ధర్మాన్ని పెంచుతాడు.

## ౭౨౧, ౭౨౨ వసుప్రదః, వాసుదేవః

ఇక్కడ వసుప్రదః అంటే భూమిని ప్రసాదించినవాడు అని అర్థం. అంటె సృష్టిని ప్రసాదించినవాడు అని అర్థం. లేక నివాసమును ప్రసాదించిన వాడు అని అర్థం. వసించేది ఒకటి తయారు చేశాడు. ఆయన నుండి వ్యక్తమై ఏర్పడినవి వాటిలో జీవులు వుంటున్నారు. శరీరం ఏర్పడితే, శరీరంలో జీవుడు వుంటున్నాడు. గోళం ఏర్పడితె గోళం మీద జీవులు వుంటున్నారు. అందుకని వీటన్నిటిని ప్రసాదించిన వాడు అని అర్థం వసుప్రద! కేవలం ఇవన్నీ ప్రసాదించడమే కాకుండా 'వసుదేవః' వాటిలో తను నివసిస్తున్నాడు. వాసుదేవ నామం అత్యుత్తమ నామం విష్ణు సహస్రనామంలో. అంటే 'సమస్తము నందు తానే నివసించి వున్నాడు' అన్న భావన ఎవరియందు స్థిరపడివున్నదో, వాడే వాసుదేవోపాసన చేస్తున్నవాడు. అందుకని ఆ ఉపాసన చేసేవారు ఎవరు ఎట్లా ప్రవర్తించినా 'వాసుదేవా' అనుకుంటారు.

నర్తకుని భంగి పెక్కగు మూర్తులతో, ఎవ్వడాడు మునులు దివుజులుం
గీర్తింప నేర రెవ్వని వర్తనము నరులెరుగ రట్టివాని నుతింతున్

అంటారు. అంటే గజేంద్రుడు వాసుదేవోపాసనము చేశాడు. నర్తకుని భంగి పెక్కగు మూర్తులంటే ఇప్పుడు చదువుకోవడానికి బాగుంటుంది. ఒకడి ద్వారా తిడతాడు. ఒకడి ద్వారా పొగుడుతాడు. ఇంకొకడి ద్వారా నిర్లక్ష్యం చేస్తాడు. ఇన్నిట్లోను వాసుదేవుడే ప్రవర్తిస్తున్నాడని తెలిసిన వాడు భగవత్ భక్తుడు. అలా కాకుండ పొగిడిన చోట ఉబ్బి, తిట్టిన చోట ఏడ్చి, లేకపోతే మళ్ళీ పగ పెంచి, నిర్లక్ష్యం చేసిన చోట ద్వేషం పెంచి, మనకన్నా గొప్పగా కనిపించి, ఒక్కొక్కసారి వాడిదంతా వాడు ఇల్లు చూపించినట్లు విపరీతంగా చూపిస్తాడు. Show చేస్తాడు. చేస్తే మనలో ఏమి పుడుతుందో తెలుసా కుళ్ళు పుడుతుంది. ఏమిటి వీడి గొప్ప, అంత చూపించాలా, ద్వార బంధాలు కూడ చూపించాలా, బొందులు కూడ చూపించాలా అనుకుంటాం. వాసుదేవోపాసన చేసేవాడు అట్లా అనుకోడు. అది

చాలా ఆశ్చర్యం! ఓహో- ఇక్కడ ఈ ద్వారబంధం రూపంలో ఇంత బాగా వున్నావా అనుకుంటాడు. వాడు ఎటువంటి వాడంటే ఎవ్వరూ ఏమి చేయలేరు వాడిని. ఉమ్మివేసినా సరే ప్రసాదంగా పుచ్చుకునే స్థితిలోకి వెళతారు వారు. విష్ణు భక్తులంటే 'any thing is acceptable as God'! ఇది చాలా కష్టం తెలుసా! ఆ స్థితికి ఇప్పటికిప్పుడు చేరుకోలేము కాని, నమ్ముకుంటె చేరుస్తారు. వాడెవరో గుఙ్లపు పెంట తినమని చెబుతారు వాడికి భారతంలో. తినడం వల్లనే చివరి లో ఆ గుఙ్లం రక్షిస్తుంది. అంటే గుఙ్లపు పెంట అనుకుంటే తినలేము. మొన్న ఈ మధ్యే ఒక మహాసిద్ధుడ్ని ఒకాయనను చూచాను. ఆయన గురువుగారు ఆయనకి రోజూ కాస్త ఆవుపేడ ఏరుకొచ్చి, మరీ తినమని చెప్పేవారట. మనకు అటువంటి సాధనలు అదృష్టవశాత్తు లేవు, కాని అదేంటంటె గుహ్యకులని ఈ సృష్టిలో సమస్తాన్ని మాయగా ఇట్లా నిర్మాణం చేసిస్తారు. మాయాబజారు ఇదంతా. వాళ్ళందరికి నాయకుడు కుబేరుడు. గుహ్యకులు చేసిన మాయ వలన మనకు కొన్ని చాలా విలువైనవన్నీ అసలు తాకకూడదని ఇట్లా ఉంటుంది. ఆ మాయపోతె అన్నీ ఒకటి గానే కనిపిస్తాయి. మనకు ప్రస్తుతం ఎక్కే విషయాలు కాదు. ఇది వూరికే సమాచారం అంతే. వాళ్ళకి ఇంక ఇది ఉత్తమమైన ప్రదేశం. ఇది నీచమైన ప్రదేశం. ఇది అశుద్ధం, ఇది శుద్ధం. final stage లో అటువంటివి వుంటాయి. వాసుదేవోపాసన. వసుదేవ అంటే అందులో కూడ వున్నాడు. నీవు ఏది అశుద్ధమని ముట్టుకోకూడదనుకుంటావో అందులో కూడ వున్నాడు. వాడుంటె లేని అభ్యంతరం నీకు ఎక్కడ నుండి వచ్చింది అనేది ప్రశ్న. వున్నాడు కదా, పందిలో వున్నాడా, మనం పోరా పంది అంటాము కోపం వస్తే. అదే కదా శంకారాచార్యుల వారికి చివరికి పెద్ద ultimate crisis. 'ఇంత చెప్పావు. నాలో లేడా' అని అడిగాడు. చెప్పడం సులభం, అది ఆచరించడం ఎవరికి వారు చూసుకోవలసిందే. మనకు అవన్ని ఏవో Everest శిఖరం అంత ఎత్తులో వున్న విషయాలు. కాకపోతే ఒక పక్కన పడేసుకుని వుంచడానికి పనికొస్తాయి. 'వాసుదేవుడు సమస్తము నందు నివసించి వున్నాడు' మనకు ఇష్టమున్న వాళ్ళయందు, మనకు ఇష్టం లేని వారియందు, మనం పవిత్రం అనుకునే వాటియందు, మనం అపవిత్రం అనుకునే వాటియందు కూడా! ఇక మనయందే వుండగా ఎవరయందైన వుండవచ్చు నిజానికి. ఇక మనబోటి వాళ్ళలో కూడ వున్నాడు కదా. ఎంత compassion! అందుకని వసుప్రదుడై వాసుదేవుడైనాడు. వూరికే కట్టేసి, అందులో మీరు వుండండిరా అని అనకుండా, అందులో తనే వచ్చి వున్నాడన్నమాట. అందుకని ఉన్నదల్లా కూడ వాసుదేవతత్త్వంగా భావన చేయడం అనేది ముఖ్యం. 'నర్తకుని భంగి పెక్కగు మూర్తులంటె' ఏమిటంటె వివిధములుగా మనతో ప్రవర్తిస్తు వుంటాడు. వర్తిస్తు వుంటాడు. గుళ్ళో దేవుడికి దండం పెట్టడం సులభం అండి.

గురువుగారితో ప్రవర్తించడం అంత సులభం కాదు. ఇది మాట్లాడే దేవుడు. One-way traffic అక్కడ. మనకు కావలసినవి చెప్పేసి, ఇవన్నీ చూచుకో అని చెప్పి వచ్చేయచ్చు. గురువుగారు ఏమి చేప్తారంటె ఇవి చెయ్యి, అవి చెయ్యి అని అట్నుండి వస్తాడు. అది మనం చేయలేము, చెయ్యబుద్ధికాదు. 'ఏమిటి ఇట్లా చెప్పారు' అనుకుంటూ వుంటాం. గురువు తిడుతు వుంటాడు, అప్పుడప్పుడు కోప్పడుతూ వుంటాడు కూడా! అంతే కాదు వాడి దగ్గిరకి, వీడి దగ్గరకీ వెళ్ళి సేవ చెయ్యమంటాడు. ఏవేవో చెప్తాడు. చెప్పింది చెయ్యడంలో వాసుదేవుని యొక్క స్వరూపం మనకు అవగాహనమైతే కదా నారాయణ తత్త్వం. ఈ వాసుదేవ అనేది నిజానికి సాధనకి అత్యుత్తమైన నామం. సమస్తమునందు వసించి వున్న భగవంతుని, ప్రవర్తనతో సంబంధం లేకుండ ఆరాధన చేయడం! భక్తి యోగంలో శ్రీకృష్ణుడు 'స్తుతించినా, పొగిడినా, తిట్టినా నిందా స్తుతులయందు ఒకే భావనతో ఎవరు వుంటారో వాడు నా భక్తుడు' అని చెప్తాడు. నమస్కారం సార్, అని చెప్పాలి మనం. మళ్ళీ వస్తాము. చాలా టైము వుంది అని. కానీ ఇప్పుడే చెప్పుకోవాలి మనం. ధృవుడికి నారదుడు ఇచ్చిన మంత్రము 'ఓం నమో భగవతే వాసుదేవాయ'! ఎందుకనంటే సవతి తల్లి అవమానించిందని రోషంతో వెళ్ళిపోతాడు. ఏమందావిడ 'ఆయన తొడమీద కూర్చునే యోగ్యత నీకు గనక వుండి వున్నట్లైతె నా కడుపునే పుట్టే వాడివి కదా. పో' అంటుంది. రోషం వస్తుంది. రోషం వస్తే ఏమి జరుగుతుంది. ఆ అన్నమాటలే గుర్తువస్తూ వుంటాయి. మనని ఏమన్నా పొగిడితే రెండురోజులు గుర్తుంటుంది. తిడితే రెండు నెలలు గుర్తుంటుంది, ఒక్కోసారి జన్మాంతం కూడ గుర్తుంటుంది. మన యొక్క సంస్కారం బట్టి మర్చిపోము కదా. పొగడ్త మర్చిపోతాం. తిట్టో? ధృవుడు క్షత్రియుడు. చాలా లోపల మండిపోతూ వుంటుంది. అందుకని 'వాసుదేవమంత్రం'! 'తిట్టినవాడి రూపంలో వాడున్నాడని'! ముందు తల్లే బోధచేస్తుంది. 'ఆమె చెప్పింది సత్యం. కాబట్టి నీవు ఆవిడ చెప్పినట్లే చెయ్యమంటుంది'. సవతి తల్లి కోప్పడి 'నారాయణుని తపస్సు చేసుకుని కోరుకో నా కడుపులో పుట్టాలని, మీ నాన్న తొడమీద కూర్చోవచ్చు' అని. అంటే అందులో అవమానం ఒకటి వుండగా, ఒక సందేశం కూడ వున్నది. తల్లి సునీతి, వాసుదేవోపాసన చేసే మహత్తరమైన పుణ్యమూర్తి. ఆమె ఏమి చేసిందంటే ఆ తిట్లన్నీ పక్కన పెట్టేసి, అందులో నుండి వచ్చిన సందేశం సత్యం కాబట్టి అదే బోధ చేస్తుంది కొడుక్కి, అదొక్కటే మనకు నిష్కృతి నారాయణుని తపస్సు చేయమన్నది కాబట్టి అది చెయ్యి అంటుంది. అది చేసుకోవడం వలన పెద్దవాడవుతాడు. నారదుడు కూడా వెళ్ళి, దారిలో కనపడి, అదే చెప్తాడు. అంటే దీన్నిబట్టి ఎక్కడ మనకి ఏమి జరిగినా వాటిలో వుండే భగవంతుని యొక్క సందేశాన్ని అందుకోవాలి. మాస్టరుగారు తన జీవితంలో నిర్వర్తించింది ఎక్కువగా అదే,

వాసుదేవోపాసన! అంటే ఎవరు పలికినా వాడి నుండి పలుకుతున్న భగవంతుని వినడం. వాడి ప్రవర్తన యందు భగవంతుని యొక్క నర్తనం చూడడం. చాలా ఓపిక కావాలి. భాగవత సాంప్రదాయంలో ఇది రెండో మెట్టు. ఆ తరువాత నారాయణ స్థితి. కాబట్టి ఇక్కడ వాసుదేవ అనే నామం మనకి సాధనకి చాలా ఉత్తమమైన నామము. ఆచరణకి చాలా కష్టమైన నామము. కష్టము ఎప్పుడయ్యా అంటే మనస్సుయందు సంసిద్ధత లేకపోతె. ఉంటే దారి చూపిస్తారు.

## 723 వసుః

వసువులుగా అతడే వున్నాడు. అంటే అష్ట వసువులుగా వున్నాడు. అష్ట వసువులు ఎట్లా ఉంటారంటె రెండు రకాలుగా చెప్పారు. ఒకటేమో ఒడ్డు, పొడుగు, సాంద్రత, బరువు, పరిణామము, పరిమాణము ఇట్లా కొలతలు. ఇంకొకటి ఎట్లా చెప్పారంటె అష్ట వసువులు ఎవరి ద్వారా పనిచేస్తారని. అష్ట వసువులలో ధృవుడు ఒకడు. విష్ణుపురాణంలో అష్టవసువులను ఈ విధంగా చెప్పారు. ధృవుడు, అతడు వుండడం చేతనే ఈ గోళం ఏర్పడినది. అంటే మొట్టమొదట వసుమతి ఏర్పడాలి అంటే ధృవము ఏర్పడాలి. ధృవము ఏర్పడిన దగ్గర నుండీ మిగతావన్నీ కూడా ఏర్పడినవి. మనకు కూడ అంతే! శరీరంలో ముందు ఉత్తర ధృవం, తలకాయ ఏర్పడుతుంది. అక్కడ నుండి నెమ్మదిగా తోకల్లే వస్తుంది. దాని చుట్టూ శరీరం అల్లుకుంటుంది. సృష్టి గోళం కథ, మన కడుపులో మనకు జరిగే కథ ఒకటే. అందుకని వసువుల్లో మొట్టమొదటి వాడిగా ధృవుడ్ని చెప్తారు.తరువాత చంద్రుడు. ఎందుకంటె పదార్థాన్ని పుట్టింపచెయ్యడం, వికసింపచెయ్యడం, కూర్చోవడం ఇవన్నీ కూడా మనకి సోమతత్త్వం లోంచి వస్తాయి. మూడవ వసువు ప్రభాస అని చెప్తారు. ప్రభాస అంటే ప్రకటింపబడిన వెలుగు అని అర్థం. అంటే పదార్థం లోంచి వెలుగు ప్రకటింపబడుతుంది. పదార్థం లేకపోతే ప్రకటింపబడడానికి ఏమి లేదు. మీకు వెలుగుగా కనిపిస్తున్నది కొంత పదార్థం ఆధారంగా వ్యక్తమవుతుంది తప్ప, అది లేకపోతే వెలుగు కనపడదు. సూక్ష్మమైన పదార్థం వలన వెలుగు వ్యక్తమవుతుంది. అంటే Tubelight లో filment లాగా, bulb లో filment లాగా. అది లేకపోతే రాదు. అట్లా అతి సూక్ష్మమైన పదార్థం ఆకాశం అంతా వ్యాపించి వున్నది కాబట్టి మీకు వెలుగు వస్తుంది. అది ప్రభాస, ప్రకటింపబడిన వెలుగు. ఆ తరువాత ప్రత్యూష. మొట్టమొదటిసారిగా మనకి ప్రొద్దున్నే కనిపించే వెలుగు. అంటే ఇంక పూర్తిగా తెల్లవారలేదు. అలా అని చీకటి కాదు. అది ప్రత్యూష! 'ప్రత్యూష ఈశో సిధరో జనార్ధనః' అని అంటాము కదా నారాయణ కవచంలో ఒక జాము. అది ఒక వసుతత్త్వం. ధృవుడు, చంద్రుడు, ప్రభాస, ప్రత్యూష మిగతా నలుగురు ఎవరయ్యా అంటే ఆకాశం తప్ప మిగతా నాలుగు భూతాలు వాయువు, అగ్ని, నీరు, పదార్థం! ఆకాశం ఎందుకు చెప్పలేదంటె 'ప్రభాస' అంటే అదే. ఇట్లా ఎనిమిది తత్త్వాలుగా ఏమి లేనట్టుగా వున్నది, ఏదో వున్నట్టుగా తయారు అవుతుంది. ఇది వున్నదంటే వున్నది, లేదంటే లేదు అన్నట్టుగా వుంటుందన్నమాట. నీవు ఏ స్థితియందు వున్నావో నీకు ఆ స్థితి సత్యంగా వుంటుంది. బాగా మనో లోకంలో వున్నావనుకో పక్కన పాముపోతున్నా మనకు తెలియదు కదా. ఏవో మన భావాల్లో మనం ఏడుస్తున్నామనుకోండి. ఇంకొక రకంగా మనస్సు లగ్నమై

వున్నదంటె పక్క నుండి పాము పోయినా తెలియదు, తేలు పోయినా తెలియదు. ఎవడన్నా చెప్తే తప్ప. అందుకే మనం వుండే స్థితిని బట్టి మనకు ఆ లోకం సత్యం అవుతువుంటుంది. ఇన్ని లోకాలు వున్నప్పటికి కూడ నువ్వున్న లోకంలో నీవున్నపుడు మిగతా లోకాలు నీకుండవు. మరి వున్నట్టా, లేనట్టా? వున్నాయి, లేవు. రెండు కలిపి సత్యం అన్నారు. నిదురపోయినప్పుడు ఈ లోకాలన్ని ఉన్నాయా, లేవా? ఉన్నాయి. నీకు లేవు! నీకు లేనప్పుడు ఉంటే, నీకు ఏమి ఉపయోగం అది. అట్లా ఒకే ఒక తత్త్వం ఇన్ని రకాలుగా స్థితి బేధం చెందుతు వుంటుంది. ఈ స్థితి బేధం కల్పించడానికి తానే వసువులుగా దిగి వచ్చాడు. దేవతలను మనకి వేద సాంప్రదాయంలో ముఖ్యంగా, మూడుగా వర్గీకరించారు. ఆదిత్యులు, రుద్రులు, వసువులు. ఆదిత్యులు 12 మంది. రుద్రులు, ఏకాదశ రుద్రులు 11 మంది. వసువులు అష్టవసువులు 8 కూడితే 31. మొత్తం దేవతలు 33. మిగతా రెండు ఎవరయ్యా అంటే మిత్రావర్ణులు. మిత్రావర్ణులు అసలు మొదట వస్తారు. మిత్రావర్ణులు ఎవరయ్యా అంటే ఒకటేమో సరుకు, రెండవదేమో సరుకుని పొందుపరిచే ఉపాధి. ఉపాధినే ప్రకృతి అంటాం. సరుకుని పురుషుడు అంటాం. ప్రకృతి, పురుషుడు. అంటే ఒకటి ఏమో Measure and the other is the measured వర్ణుడు పాత్ర. మిత్రుడు పాత్రలో వుండే సరుకు. పాత్రలో వుండే సరుకు అంటే, పాత్రగా ఏర్పడిన సరుకు అని ఉన్నదే! పాత్రలో మళ్ళీ సరుకు వున్నదని కాదు. పాత్రలో కూడ వున్నది. పాత్రలో ఏమి వున్నదో పాత్రగా ఏర్పడినది కూడ పాత్రలో వున్నదే! స్థితి బేధం చెంది ఏర్పడింది. చోటులోంచే అన్నివచ్చాయి  కదా. ఒక్కొక్కటి వచ్చి పాత్రలో అట్లా స్థూలంగా దిగివస్తూ వుంటుంది, సూక్ష్మము  నుండి. అవి ఎనిమిది గుమ్మాలు. ఎనిమిది గుమ్మాలు కాబట్టి, దుర్గకి ఎనిమిది చేతులన్నాం. అందుకని అష్టమి నాడు పుట్టింది అన్నాం. అన్నీ అట్లాగే పట్టుకొచ్చారు. ప్రతీది మనకంతా సమన్వయమే. ఎనిమిది చేతులు, అష్టమి, ఎనిమిది గుమ్మాలు ఇవన్నీ స్థితి బేధాలు. మనకి కూడ ఇంట్లో చూడండి ఇది drawing-room, ఇది bed-room, ఇది kitchen, ఇది bathroom అంటాం కదా! లోపల వున్నది ఒకటే చోటు అయినప్పటికి వాడుక బట్టి దానికి సంబంధించిన భావం అక్కడ వస్తుంది. భోజనాల గదిలోకి రాగానే ఆలోచన భోజనం గురించి వస్తుంది. ఇట్లా దేనికి సంబంధించిన ఆ లోకాల్లో జీవిస్తూ వుంటాం. ఇట్లా ఎనిమిది లోకాలుగా ఏడు లోకాలు + ఎనిమిది అవతల వుండే తత్త్వం. అదే గోలోకం అంటాం. భూః భువః సువః మహః జనః తపః సత్యం ఏడు లోకాలైతే వాటి పైన వుండేది ఎనిమిదోది, గోలోకం అంటాం. కాబట్టి ఒకే ఒక తత్త్వం ఇట్లా స్థితి బేధాలు జరుగుతు వచ్చింది. ఎట్లా వచ్చింది అంటే కనబడని ఆకాశంలో వుండే నీరు, వర్షంగా దిగివచ్చి, ఆవిరై, ఆవిరి నుండి నీరై, నీరు నుండి మంచు గడ్డయ్యింది. అంతా నీరే గదా. కాని స్థితి బేధం చెందింది. స్థితి బేధం

చెందినప్పుడు వేరువేరుగా గోచరిస్తాయి కాని పదార్థం ఒకటే, అని చెప్పడానికి మనకు పరమ గురువులు ఈ ఉదాహరణ చాలా ఎక్కువగా వాడ్తారు. ఆకాశగంగ, అక్కడ నుండి వర్షం, అక్కడ నుండీ మన ఇంట్లోకి, అక్కడ నుండీ మన Fridge లో ice block అయిపోతుంది. అదే ice block మళ్ళీ అదే నీటి మీద తేలుతుంది. అది చూడండి. ఇదీ నీరే, అదీ నీరే. స్థితి భేధం వలన దాంట్లో నుండి ఇది తేలుతుంది. మాస్టర్ గారు చెబుతూ వుండేవారు ఉపన్యాసాల్లో, ఒక గ్లాసు నీళ్ళు ఎదుటివాడి మొహం మీద చల్లిన దానికీ, అంతే నీళ్ళతో తయారు చేయబడిన ఐస్ ముక్కపెట్టి మొహం మీద కొట్టిన దానికి చాలా తేడా వుంటుంది కదా అని. ఏమిటి తేడా అంటే నీటికన్నా ఐస్ ముక్క ఎక్కువ ఘనీభవించింది కదా. ఎక్కువ స్థూలత్వం ధరించింది కదా! స్థూలం అవుతున్న కొలది మొరటుగా వుంటారు మనుషులు. అంటే మొరటు ప్రవర్తన వున్నదనుకోండి స్థూలతత్త్వంలో వున్నాడు అని అనుకుంటాడు పాపం, ఎవరు సాత్త్వికంలో వున్నవాడు. వీడూ స్థూలంలో వుంటే ఆయ్ అంటాడు, వాడితో పాటు వీడు రంకెలు వేస్తాడు, కొడతాడు తిడతాడు. విశ్వామిత్రుడు అరుస్తున్న కొద్ది వసిష్ఠుడు నవ్వుతు వుంటాడు. ఇంకొకడైతే వాడూ అరుస్తాడు. ఏమిటయ్యా అంటే అక్కడ 'ఒహో ఇతడు ప్రస్తుతం కొంచెం ఐస్ ముక్క. ఇంక నీళ్ళు అవ్వాలి. ఆవిరవ్వాలి. ఆకాశానికి వెళ్ళాలి. ఈ లోపల ఇట్లాగే గెంతులు వేస్తు వుంటాడు' అని అవగాహన చేసుకుని వసిష్ఠుడు వూరుకుంటాడు. తెలిసిన వాళ్ళు వూరుకుంటారు. తెలిసీ తెలియని వాళ్ళే వాదిస్తారు. మూర్ఖుడితో వాదిస్తే ఉపయోగం ఏమీ లేదు. ఆ విధంగా స్థితి బేధం చెందుతుండడం వలన మనకి అందరం మానవులుగానే కనిపిస్తు వున్నా, అందరం ఒకే చైతన్యస్థితిలో లేకపోవడం వలన ఈ విబేధాలు వుంటాయి. ఎక్కువ చైతన్యవంతులం అవుతున్న కొద్దీ ఎక్కువ మందిని అంగీకరిస్తూ వుంటాము. 'ఏదో తెలియని వాడులే అట్లాగే వుంటాడులే వాడు పాపం. వాడున్న స్థితిలో వాడు correct. మనకు ఎందుకొచ్చిన గొడవ' అనుకుంటాడు. తక్కువ స్థితిలో వున్న కొద్ది ఎక్కువ నిరాకరిస్తూ వుంటాము. అదే ధర్మరాజుకు, భీమార్జునులకు వుండే తేడా! ధర్మరాజు అంగీకరిస్తూ ఉంటాడు. 'వాడికి తెలియదురా' అంటూ వుంటాడు. 'ఆ వాడికి తెలియదా రోగమా' అంటు వుంటారు వీళ్ళు. ' ఏం చిన్న పిల్లవాడా, పసివాడా, వాడికెంత పొగరు. వాడిని డొక్క చింపివేస్తాను. తొడ విరిచేస్తాను' ఇటువంటివన్ని మరి భీమునకు, అర్జునుడికి ఉంటాయి. ధర్మరాజుకి అట్లా వుండదు, ఎందుకంటె అది మరీ అట్లా ఆకాశంలోకి ఎదిగిపోయిన చైతన్యం. ఇవన్ని ఏమిటయ్యా అంటే స్థితి బేధాలు. ఎక్కడ నివసిస్తున్నావనేది. చూడండి 'బుద్ధి మోకాల్లో వుందా' అంటూ వుంటాం. అంటే ఎక్కడ వుండాల్సింది అక్కడ లేకపోవడం వలన. అట్లా మనకి స్థితి భేదం చెందడం తీసుకొచ్చి, ఇన్ని రకాలుగా తయారు చేసి, ఒకే తత్త్వం ఇన్నిగా

ఏర్పడి, ఈ సృష్టి నిర్మాణం జరిగింది. దానికి తానే వసువులుగా దిగి వచ్చాడని చెప్పడానికి వసుః అన్నారు. అష్టవసువుల్లో ఒకడు భీష్ముడు. ఆయన పొగుడుతున్నాడు ఈయన్ని!

## 724 వసుమనాః

ఈ వసువులకు వుండే మనస్సుగా ఉన్నవాడు. జలానికి జలతత్త్వం వున్నది. అగ్నికి అగ్నితత్త్వం వున్నది. వాయువుకి వాయుతత్త్వం వున్నది. అట్లాగే ఎనిమిది మందికి ఎనిమిది తత్త్వాలు వున్నవి. వీళ్ళల్లో వసువుగా పనిచేస్తునది తనే. ఇన్ని మనస్సులుగా ఒకే మనస్సు పనిచేస్తున్నది. వసుతత్త్వం తో పనిచేస్తున్న మనస్సునే మనం 'మనస్సు' అని పిలుస్తాం. వసుతత్త్వానికి అతీతంగా పనిచేస్తున్న మనస్సుని బుద్ధి అంటాం. వసుతత్త్వానికి, అంటే ఈ ఎనిమిది తత్త్వాలకి అతీతంగా వుండే మనస్సు బుద్ధి! ఆయన మనువు. ఇందులో పనిచేసే తత్త్వానికి, ఈ ఉపాధుల్లో పనిచేసే తత్త్వాన్ని 'మనస్సు' అంటాం. ఆయన్నే 'ఇక్ష్వాకు' అంటారు. భగవత్ గీతలో కృష్ణుడు ( సూర్యుడు, వైవస్వత మనువు, ఇక్ష్వాకు, భూమి). 'నేను సూర్యుడికి చెప్పాను, సూర్యుడు వైవస్వత మనువుకి చెప్పాడు. వైవస్వత మనువు ఇక్ష్వాకుకు చెప్పాడు, అక్కడ నుండి ఇట్లా ఇక భ్రష్టు అయిపోయింది యోగం' అని చెప్తాడు.

ఇమం వివస్వతే యోగం, ప్రోక్తవాన్ అహమవ్యం
వివస్వాన్ మనవే ప్రాహ, మనురిక్ష్వాక వేబ్రవీత్

Four-fold existence కి సంబంధించిన శ్లోకం అది. ఉపదేశపూర్వకమైన శ్లోకం. నేను సూర్యుడికి చెప్పాను. (నేను అనే అంతర్యామితత్త్వం, సూర్యుడు అంటే జీవుడు.) నువ్వు అంటే సూర్యుడు ఏమి చేశాడంటె వైవస్వత మనువుకి చెప్పాడు. అంటే సూర్యుడు ఆయన కొడుక్కి చెప్పాడు. అంటే బుద్ధికి వెళ్ళింది. వైవస్వత మనువు అంటే బుద్ధి. ఆయన ఏమి చేశాడంటె ఇక్ష్వాకుకి చెప్పాడు. అంటే బుద్ధి నుండి మనస్సుకి. అంతర్యామి తత్త్వం నుండి జీవతత్త్వానికి అంటే విశ్వాత్మ నుండి ప్రత్యేగాత్మకి, అక్కడ నుండి మనస్సుకి. అంటే ఒక్కొక్కరం ప్రత్యేకం అనుకుంటున్నాము కదా! మనమే ప్రత్యేగాత్మలు. మీరున్నారు, నేనున్నాను అని కదా మనం ప్రవర్తిస్తుంటాం. ఈ ప్రత్యేగాత్మకి చెప్పడానికి సూర్యుడు. అది బుద్ధి కి అందించడం, బుద్ధి మనస్సుకు అందించడం, మనస్సు శరీరం చేత పని చేయించడం. ఇలా ఉంటుంది యోగం. కానీ అది ఎక్కడో ఒక చోట జారుతూ ఉంటుంది. జారిపోతే ఇట్లా ఉంటాము. అది శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'నీకు గుర్తు లేదు, నాకు గుర్తుంది. దారిలో నువ్వు వదిలేశావ్ చెంబు' అంటాడు. ఆయనకు గుర్తుంది. సూర్యుడికి నేను చెప్పానంటే , నువ్వు సూర్యుడికి చెప్పానంటావేమిటి', అంటాడు అర్జునుడు. అతడు మరచిపోయాడు. ఆయనకి మరుపు లేదు. దిగి వచ్చి మనస్సుకి అందించినప్పుడు, వసు మనస్సు అంటే చంద్రాత్మకమైన సృష్టిలో పనిచేసేది మనస్సు, సూర్యాత్మక సృష్టిలో పనిచేసే

మనస్సు బుద్ధి. చంద్రాత్మకమైన సృష్టిలో పని చేసే మనస్సుని 'వసుమనా' అన్నారు. అది కూడా అతనే అంటున్నారు. అలా అన్నిట్లో ఉండబట్టే దాహం వేస్తే నీళ్ళు తాగాలని తెలుస్తుంది. నిప్పులో వేళ్ళు పెడితే కాల్తాయని తెలుస్తుంది. వసువుల్లో మనస్సుగా పని చేయడం కాక, మనలో కూడా శరీర సంబంధమైన మనస్సుగా పనిచేస్తుంది. శరీరానికి ఏమి కావాలో చెప్పేది మనస్సు! తనకేమి కావాలి చెప్పేది బుద్ధి! శరీరానికి ఏమి కావాలో ఎప్పటికప్పుడు చెప్పకపోతే మనమేమీ తినం, పడుకోము. పనిచెయ్యం. అప్పుడు ఏమైపోతాం? ఆత్మకి ఏమి కావాలో చెప్పే బుద్ధి, అంటే జీవుడికి ఏమి కావాలో చెప్పేది బుద్ధి, శరీరానికి ఏమి కావాలో చెప్పేది మనస్సు. శరీరానికి ఏమి కావాలో మాత్రమే ఎక్కువగా తెలిసిన వాళ్ళం కాబట్టి, ఈ మనస్సు ప్రధానంగా జీవిస్తుంటాం కనకే మానవులం అన్నారు. ఈ మనస్సుకు తండ్రి బుద్ధి అన్నమాట. అందుకని వైవస్వతమనువు కొడుకు ఇక్ష్వాకు అన్నారు పురాణాల్లో. ఇక్ష్వాకు ఎవరయ్యా అంటే భూమికి రాజు. భూమి అంటె శరీరము. భూమిని పరిపాలించేవాడెవడయ్యా అంటే మనస్సు. అంటె శరీరాన్ని పరిపాలించేవాడు. జీవుడికి సలహా ఇచ్చేదెవరయ్యా బుద్ధి. ఆ బుద్ధి ఎవరిదయ్యా భగవంతుడిది. అందుకనె భగవంతుని ఆరాధన చేస్తే బుద్ధి సాక్షాత్కరిస్తుంది. బుద్ధి సాక్షాత్కరిస్తే, బుద్ధి ఆధారం గా జీవుడు పనులు చేసుకుంటాడు. అది బుద్ధియోగం అని భగవంతుడు భగవద్గీతలో చెప్పాడు. 'నీకు బుద్ధి కావాలా' అంటాడు అర్జునుడ్ని. 'అవును' అంటే 'నన్ను తలుచుకో, వస్తుంది' అంటాడు. ఏదన్నా సన్నివేశం లో మనం 'ఏమి చెయ్యాలో' అనిపిస్తే, ఒక్కసారి భగవంతుని ప్రార్థిస్తే బుద్ధి సాక్షాత్కరిస్తుంది. అది మనకిచ్చిన సుకువు. బుద్ధి భగవంతుని వ్యక్తరూపం. దాన్నే ప్రద్యుమ్నతత్త్వం అని చెప్తాం. అహంకారి అయిన జీవుడు బుద్ధిని సంప్రదించి పని చేసుకుంటే నశించకుండా ఉంటాడు. దానికి బుద్ధి రావాలంటే ప్రార్థన చెయ్యాలి. అందుకు గాయత్రి! 'ధియో యోనః ప్రచోదయాత్' ఈ మొత్తానికి ఎవరైతే ఆధారభూతమో వాడిని అడుగుతున్నాము. భర్గో దేవస్య ధీమహి. 'We meditate upon Him'. వాడికి పేరు లేదు, ఊరు లేదు. రూపము అసలే లేదు. వాడి నుండి వెలుగులు వస్తున్నాయి. ఈ వెలుగులన్నిటికీ ఎవడు మొనగాడో, మూలపురుషుడో వాడిని ప్రార్థిస్తున్నాము. ఎందుకయ్యా అంటే వాడి నుండి బుద్ధి మనలో ప్రచోదనం చెందితే ఆ వెలుగులోపల, bulb వెలిగితే పనులు చేసుకుంటాం. ఇది గాయత్రి. చాలా సులభంగా చెప్పకోవాలంటే. శరీరానికి వలసిన మనస్సుండాలి. లేకపోతే నేనెవరో తెలియకపోతే ఎట్లా? పడుకోవాలి, చలి వేస్తే కప్పుకోవాలి, ఆకలికి తినాలి ఇలా అన్నీ తెలియకపోతే ఎట్లా? శరీరాన్ని కాపాడుకోవడానికి కావలసిన సంపత్తి కూడ శరీరంలోనే ఏర్పరిచాడు. అట్లాగే సృష్టి శరీరానికి కావలిసినవి ఏర్పరచుకోవడం కోసం సృష్టి మొత్తానికి కూడ

అటువంటి మనస్సు ఒకటి వున్నది. మనలో ఏమి వున్నదో అది మొత్తంలో కూడ వున్నదండి. మొత్తంలో వుండడంబట్టి మనలో వున్నది. ఇది గుర్తు పెట్టుకోండి. మనలో వున్నది మొత్తంలో వున్నదనుకోకూడదు. మొత్తంలో వున్నది మనలో వున్నదనుకోవాలి.

## 725 హవిః

ప్రతిచోట ఇదొకటి వేస్తు వుంటారు. అంతకు ముందు మనకు మహాహావిః వచ్చాడు, ఇపుడు హవిః. ఏమిటయా హవిః అంటె. ఇంతగా మారిపోయాడు ఆయనే. తన్ని తన్ను హోమంలో వేసుకుంటే వచ్చినయి సర్వహుత అనే యజ్ఞంలో తన్ను వేసుకొన్నాడు. వేసుకుంటే వీళ్ళందరు వచ్చారు. ఎవరెవరు వచ్చారు? మనస్సు వేగం వచ్చింది. మనస్సుకి పరిమితత్త్వం తీసేటి తత్త్వం వచ్చింది. పదార్థంలో వుండే వేడిమి వచ్చింది. పదార్థంతో కూడిన సృష్టి వచ్చింది. అందులో నివసించేవాడిగా తను వచ్చాడు. అష్టవసువులుగా వచ్చాడు. వీటనన్నిటిని నడిపించడానికి తనే మనస్సుగా వచ్చాడు. ఇన్ని రకాలుగా ఆయనే వచ్చేశాడు తన్ను తను వండుకొని. అది హవిః అంటే! తన్ని ఆ విధంగా సమర్పణ చేసుకోవడం వలన ఇన్ని బయటకి వచ్చినాయి. మనలోంచి కూడ అద్భుతమైన విషయాలు బయటకి రావాలంటె మన్ని మనం అట్లా అహుతి చేసుకుని, సమర్పణ చేసుకోవాలి. ఆయన తన్ను తాను మేధము అంటే వండాడు కాబట్టి ఇవన్ని వచ్చాయి. మనం ఆయనలో చేరాలంటె మన్ని వండుకోవాలి. అటు నుండి జరిగింది పురుషమేధమే! ఇటు నుండి జరగాల్సిందీ పురుషమేధమే! పురుషమేధమహాయజ్ఞం అంటే ఏమిటయ్యా అంటే తనను పూర్తిగా ధర్మానికి సమర్పణ చేసుకుని, తనదంటూ ఏమీ లేకుండ, ధర్మం కోసం జీవిస్తూ, ఆహుతి అయిపోవడం. అలా జీవించడాన్ని పురుషమేధము లేకుంటే నరమేధము అంటారు. ఆయన అట్లా తనని సమర్పణ చేసుకుని ఇవన్ని పట్టుకొచ్చాడు సుమా, గుర్తుపెట్టుకో, అని చెప్పడానికి మళ్ళీ హవిః అన్నారు.

## ౭౨౬ సద్గతిః

అంటే సన్మార్గము లేక మహాత్ములు అందరూ నడిచే మార్గము. అనగా యోగ మార్గము. 'సత్' కి దారి చూపించే మార్గము యోగమార్గముగా పెద్దలు చెప్తారు. 'సత్' అంటే వున్నది అని అర్థం. భగవంతుని యొక్క సహజ స్థితి - ఉండడం. అలాగే మనందరి సహజ స్థితి కూడా ఉండడమే. ఉండడం ఆధారంగా చేస్తుంటాము. ఉండడం అనేది సహజమైన స్థితి. సన్నివేశాన్ని బట్టి మారుతూ ఉంటాము. మళ్లీ సహజ స్థితికి వస్తూ వుంటాము. Being and Becoming అని చెప్తూ వుంటాము. Human beings కదా మనం! సన్నివేశాన్ని బట్టి తల్లి అవుతాము, తండ్రి అవుతాము, కూతురు, కొడుకు, తాత, ఉద్యోగి, వ్యాపారస్తుడు ఇలా అవుతుంటాము. ప్రతిరోజు ఏదో ఒకటి అవుతుంటాము. అవుతుండడానికి ఉండడం అనేది ఆధారంగా ఉండడం చేత అది ఆధారంగా ఏదో ఒకటి అవుతూ వుంటాము. వినేవాళ్లుగా అవుతుంటాము, చెప్పేవాళ్ళుగా అవుతుంటాము. తాత్కాలికంగా ఏదో ఒకటి అవ్వడమే తప్ప ఉండడం మాత్రమే శాశ్వతమైనది. ఏదో ఒక మార్పు చెందడము లేక ఆ సహజ స్థితి నుండి అవస్థితి చెందడము అనేది జరుగుతూ ఉంటుంది. అప్పుడప్పుడు జబ్బు పడతాం. మళ్ళీ మామూలుగా అవుతూ ఉంటాం కదా! ఇట్లా ప్రతిసారి మనం నిజస్థితి నుండి అవస్థితి చెందుతూ ఉంటాము, అవస్థితి నుండి మళ్లీ నిజస్థితి చెందుతూ ఉండాలి. ఈ అవస్థితి నుండి నిజస్థితి చెందడానికి ఇవ్వబడిన సాధన మార్గం ఏదైతే ఉన్నదో దాన్ని 'సద్గతి' అని చెప్పకోవచ్చు. అదే సత్యానికి దారి లేక ధర్మాన్ని అనుసరించే వారు నడిచే దారి అని చెప్పవచ్చు. ఏమిటీ దారి? వసువులు, వారు నిర్మించే లోకాలు గురించి తెలుసుకున్నాము. ఇన్ని లోకాల్లో మనం దిగినప్పుడు ఎక్కడి నుండి వచ్చామో మర్చిపోతూ ఉంటాము. అందుకని ఆ సూత్రాన్ని పట్టుకుని మళ్ళీ మన అసలు స్థితిలోకి మనం పెరుగుతూ ఉండాలి. మన అసలు స్థితి 'ఉండడం'! దాన్నే 'సత్యము' అంటారు. అది ఆధారంగా చైతన్యవంతులము అవుతూ వుంటాము. ఇది ప్రతి ఉదయం జరుగుతూ వుంటుంది. మనం తెలివి వచ్చిందంటాము కదా. అక్కడ నుండి భావాల్లోకి దిగుతాం. అక్కడి నుండి కోరికల్లోకి దిగుతాం. అక్కడ నుండి ప్రపంచంలోకి దిగుతాం. అక్కడ నుండి ఏవో దార్లు పట్టుకుని వెళ్లిపోతాం. అలసిపోతే నిద్ర రూపంలో అమ్మవారు తీసుకు వచ్చి, మళ్లీ సహజ స్థితిలో పడేస్తూ వుంటుంది. అంటే దారితప్పిన వారిని అమ్మవారు తీసుకొచ్చి దారిలో పడేస్తుందన్నమాట. మళ్ళీ పొద్దున్నే లేచి మొదలు పెడతాము. మళ్ళీ అదే సంగతి. National-highway నుండి State-highway, State-highway నుండి District-highway, District-highway నుండి పల్లెలు, అక్కడ నుండి

అడవులు. అక్కడ పడిపోతాం. మళ్లీ పొద్దున్నే కేంద్రం నుండి లేస్తాము. ఎటు వెళ్ళామో మళ్లీ అటు నుండి తిరిగి రాగలిగి వుండాలి. అది సద్గతి మార్గము. భగవంతుడు సృష్టి నిర్మాణం చేసి, జీవులను నిర్మాణం చేసి, గ్రహగోళాదులను నిర్మాణం చేసినప్పుడు మళ్ళీ తిరిగి వచ్చే దారి కూడా తెరిచి ఉంచాడు. ఆ దారి మహాత్ములు అప్పటి నుండి ఇప్పటి వరకు కాపాడుతున్నారు. అందుకనే మనకి ఒక పరంపర వున్నది. ఏమిటి ఆ పరంపర అంటే గురు పరంపర. ఈ గురు పరంపరలన్నీ కూడా ఈ భూమి వరకూ మైత్రేయునిలో లేక వ్యాసునిలో సంగమం చెందుతాయి. అక్కడ నుండి శుకుడు, వ్యాసుడు, సప్త ఋషులు, నారదుడు, బ్రహ్మము, సృష్టికర్త అయిన పరబ్రహ్మము ఆయనే శ్రీకృష్ణుడు! అందుకనే మనకి గురుభ్యోనమః, పరమ గురుభ్యోనమః, పరమేష్ఠి గురుభ్యోనమః, సప్తఋషిభ్యో నమః, ధృవాయ నమః సనకాయ నమః, సనందనాయ నమః, సనత్ కుమారాయ నమః, మైత్రేయాయ నమః, శుకాయ నమః, వ్యాసాయ నమః, నారదాయ నమః, పరబ్రహ్మణే నమః అని ఈ మార్గాన్నంతా కూడా ఒకసారి తలుచుకోమని చెప్తారు. ఇది జీవుడి ప్రవర అన్నమాట. మనం కనీసం పౌర్ణమికి పౌర్ణమికి అయినా చెప్పుకోవాలి. ఎందుకంటే పరబ్రహ్మతత్త్వం నుండి బ్రహ్మతత్త్వం, బ్రహ్మతత్త్వం నుండి సప్తర్షితత్త్వం, నారదుడు, సనకసనందనాదులు, (వాళ్ళందరూ మానస పుత్రులు) ఆపైన ధృవుడు, వ్యాసుడు, శుకుడు, మైత్రేయుడు. తర్వాత మన గురుపరంపర. మన గురుపరంపర ద్వారా వీరిని చేరుకుంటూ వుంటాం. అందరికీ ఏదో ఒక గురు పరంపర వుంటుంది. ప్రతి గురుపౌర్ణమికి ఈ గురుపరంపరలన్నీ ఈ భూమిని పాలిస్తున్న తత్త్వంలో కలుస్తాయి. ఆ తత్త్వాన్నే 'జగద్గురువు' అంటాము. అక్కడి నుండి ఊర్ధ్వముఖంగా ఒక మార్గం ఉంటుంది. ఈ మార్గాన్ని వీరే కాపాడుతూ వున్నారు. ధర్మమునందు, సత్యమునందు, దైవమునందు ఆసక్తి ఉన్నవారు ఏదో ఒక విధంగా ఈ మార్గంలోకి చేరుతూ వుంటారు. ఈ గురుపరంపరకి సంబంధించిన సనాతనమైన మార్గమే యోగమార్గము! ఆ యోగమార్గాన్ని రకరకాలుగా, చిలవలు పలువులుగా భూమి మీద విస్తరింప చేస్తూ వుంటారు. సత్యాన్వేషకుడైన ప్రతివాడు అందులోకి ప్రవేశిస్తాడు. ప్రవేశించి చిట్టచివరకు భౌగోళికమైన గురుపరంపరలో తాను కూడా నియుక్తుడౌతాడు. అక్కడి నుండి గోళాతీతమైన మార్గాన్ని పట్టుకుని బ్రహ్మతత్త్వానికి చేరుకుంటాడు. ఇట్లా మనకి పరంపర ఒకటి ఉండగా ఆ పరంపరని కాపాడుకునే మహర్షులున్నారు. పరంపరాగతమైన మార్గం ఏదైతే వున్నదో అది భగవంతుడే! అని చెప్తుందన్నమాట ఈ నామము. భూప్రపంచం మొత్తానికి భారతదేశం ఒక్కటే ఆ మార్గాన్ని అప్పటినుండి ఇప్పటివరకు కాపాడి ఉంచింది. ఇది ఒక సత్యం! ఈ సత్యానికి సంబంధించిన మార్గాన్ని ఇంకెక్కడా ఇంత చక్కగా, శ్రద్ధా భక్తులతో కాపాడబడలేదు. సత్యం

అందరికీ తెలిసి వచ్చినా, ఆ సత్యమార్గంలో నడవడానికి కావలసిన క్రమమైన శిక్షణము, సాధనమార్గము ఇక్కడ ఇలా దాచి ఉంచింది కేవలము భారతదేశంలో మాత్రమే! మిగతా దేశాల్లో ఎవరికి వారుగా సత్యాన్ని తెలుసుకోవడమే తప్ప, తనకు తెలిసిన సత్య మార్గాన్ని ఇతరులకు అందించే పద్ధతి భారతదేశంలోనే ఎక్కువ. అందుకనే భారతదేశంలో గురు శిష్య సంప్రదాయం స్థిరపడి వున్నది. మిగతా దేశాలు ఇక్కడి నుండి అందుకోవలసినదే! తనకన్నా తెలిసిన వాళ్ళ దగ్గర నుండి తాను తెలుసుకోవడం అనేది ఇందులో ఉండే ఒక ముఖ్యమైన లక్షణం. ఈ సద్గతి అనే నామంలో ఈ వివరాలను కూడా భగవత్పరంగా తెలుసుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఎక్కడ మహాత్ముడు వున్నా అతడు భగవంతుని ప్రతీక అని, భగవంతుని వద్దకు దారి చూపే వాడని తెలుసుకోవాలి. మన జీవ లక్షణం ప్రకారం మనకి ఒక గురువు నచ్చవచ్చు. అంటే ఒక గురువు మూర్తి నచ్చవచ్చు. మూర్తులు అనేకం ఉండవచ్చు కానీ గురువు మాత్రం ఒక్కడే. మనకు నచ్చిన మూర్తిని ఆధారంగా చేసుకుని మనం నడుస్తూ ఉంటాము. ఈ జన్మకు, ఈ లక్షణానికి ఈ గురువు నచ్చుతాడు అనేది ఒకటి వుంది. ఎందుకు నచ్చుతాడు, ఇంకోరు ఎందుకు నచ్చలేదు అంటే దానికి ఏమీ తర్కం లేదు. కొంతమందికి కొందరు నచ్చుతారు. ఎందుకు నచ్చుతారు అంటే, వారి జీవ లక్షణంలో వీరి స్వభావం సరిపడి ఉండటం చేత. అంతే మహత్తు కలిగిన, అంతకన్నా వైభవం కలిగిన, ఇంకో గురుమూర్తి కనిపించినప్పటికీ నచ్చకపోవచ్చు. మనకు నచ్చడం, నచ్చకపోవడాన్ని బట్టి వేరొకరి గురించి తక్కువగా మాట్లాడకూడదు. మనకు వంకాయ కూర నచ్చుతుంది, వేరొకరికి కాకరకాయ కూర నచ్చుతుంది. అంత మాత్రాన అదేమిటండీ కాకరకాయ చేదు కదా, ఎట్లా ఇష్టపడతారు? అంటే... కాకరకాయ రుచి తెలిసిన వారు దాని రుచి నీకేమి తెలుసులే అంటారు. అలాగే వారు మనతో వంకాయ గిజరుగా ఉంటుంది కదా, యేం బాగుంటుంది అంటే, మనం నొచ్చుకుంటాము. మనం ఏ దృష్టితో చూస్తామో దాన్నిబట్టి ఉంటాయి రుచులు, ఇష్టాలు. జీవ లక్షణం ప్రకారం ఒక్కొక్కళ్ళకి, ఒక్కో కూర, ఒక్కో పచ్చడి నచ్చినట్లే ఒక్కో గురువు నచ్చడం కూడా వుంటుంది. ఎందుకు నచ్చాడు అన్న దానికి సమాధానం ఉండదు. పరిపూర్ణమైన అనుభూతికి తర్కం లేదు. ఎందుకు నచ్చారూ అంటే ఏమీ చెప్పలేవు. నచ్చారు అంతే! అది pure experience. గురు పౌర్ణమికి సమీపిస్తున్న ఈ ఘడియలలో 'సద్గతి' అనే ఈ నామం గురించి చెప్పకోవడం భగవదనుగ్రహంగా భావించాలి. ఎందుచేతనంటే ముందుగా ప్రణాళిక వేసుకుని మనము చెప్పకొనుట లేదు కనుక. నీకు చేతనయందు నచ్చిన గురువు, మన ప్రక్కన ఉన్న ఆయనకు నచ్చిన గురువు, మనకు నచ్చలేదు అని కానీ, మనకు నచ్చిన గురువు వేరొకరికి నచ్చలేదు అని కానీ బాధపడడంలో అర్థం లేదు. అన్నీ రూపాలే

కదా! రూపాలకి అతీతంగా ఉన్నది తత్త్వం కదా! మరి మనకి నచ్చిన గురువే ఇంకొకరికి కూడా ఎందుకు నచ్చాలి? ఆ గురుమూర్తి అయినా సత్యమునందు ప్రవేశపెట్టడానికే, ఈ గురుమూర్తి అయినా సత్యమునందు ప్రవేశపెట్టడానికే. కేవలం అందుకే వారు భూమి మీద సంచరిస్తూ వుంటారు. వీళ్ళందరినీ 'భూమి సురులు' లేదా 'భూసురులు' అంటారు. అంటే భూమి మీద దేవతలని. దైవం వైపు మనల్ని నడిపించే వాళ్ళని అర్థం. ఆ మార్గం లో నడిచే వారు, సద్గతి చెందే వారి రూపం లో తానే ఉన్నాడు. సద్గతికి చేర్చే వారి రూపం లో తానే ఉన్నాడు. సద్గతిగా తానే ఉన్నాడు. అందుకే ఏసుక్రీస్తు 'నేనే మార్గము' అన్నారు. నేనే మార్గము అంటే ఆయనకు తెలిసింది 'నేను' అనే తత్త్వమే మార్గంగా నిలిచి ఉంది ఇన్ని రూపాల్లోనూ', అని చెప్పారు. అదే విషయం మనకి భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పాడు. 'నేనే సమస్తము, నా యందే సర్వ జీవరాశులు ఉన్నాయి, నేను సర్వ జీవరాశుల్లోనూ ఉన్నాను. నా నుండే ఈ సృష్టి అంతా బయటికి వచ్చింది, మళ్ళీ అంతా నాలోనే కలుస్తుంది' అని చెప్పాడు కదా! అంటే కృష్ణుడిలోకి అనుకుంటే కష్టమే. ఏసుక్రీస్తే మార్గం అనుకుంటే మతం అయిపోతుంది. అలా అవడం వల్లే మనకు రకరకాల బాధలు వస్తాయి. ఏసుక్రీస్తు సత్యాన్ని ఎరిగినవాడు. అంటే ప్రతివాడూ తన పేరు 'నేను' అని తెలుసుకోడము. ఈ 'నేను' 'పెద్ద నేను' లో భాగమని తెలుసుకోవడము. మాష్టారు 'పెద్ద నేను' తాను లాంటిది అయితే, ఆ తానులోని ముక్కల్లాంటి వాళ్ళం మనమంతా' అని చెప్పేవారు. 'ఒక తాను బట్ట లోంచి తలొక మీటరు 25 సెంటీమీటర్ల బట్ట తీసుకున్నారనుకోండి.. ఒక్కొక్కడికి ఒక్కో లాగు వస్తుంది. ఎవడి లాగు వాడిది లాగానే ఉంటుంది కానీ, అన్నీ ఆ తాను లోంచి వచ్చిన లాగులే కదా' అనేవారు మాస్టారు గారు. అట్లా పెద్ద నేను లోంచి ఇన్ని నేనులుగా బయటకు వచ్చిన వాళ్ళం మళ్లీ పెద్ద నేనులోకి ప్రవేశించేటప్పుడు అసలు ఆ 'నేనే' ఈ 'నేను ని' అని తెలుసుకుంటుంది. అలా తెలుసుకోవడాన్నే మంత్రజాలంలో 'నేను నేనైన నేను' అంటారు. ఆ స్థితిలో నీవే మార్గమవుతావు మిగతా వాళ్ళకి. 'నేను' ఒక అంతర్యామి, విశ్వాత్మ చైతన్యము. వాటిలోకి ప్రవేశించడానికి నీవొక ముఖ ద్వారం గా మారిపోతావు. నీ ఆధారంగా ఇతరులు లోనికి వెళుతుంటారు. అంటే ఏమిటి? 'నేను' మార్గముగా అయిపోయాననన్నమాట. అందువలనే యేసుక్రీస్తు 'నేనే మార్గాన్ని' అన్నారు. ఎవరైనా సరే తనలో ఉండే 'నేను' ని తెలుసుకోగలిగితే మార్గంలో ప్రవేశించినట్లు. అందుకనే 'నీవు దైవ కుమారుడినివా?' అని అడిగితే 'నేనే కాదు నీవు కూడా' అని చెప్తారు. అందరిలో 'నేనుంది' కాబట్టి ఆ 'నేను' ని పట్టుకుంటే 'పెద్ద నేను' లోకి ప్రవేశించవచ్చన్నమాట. మనకి బోధ చేయబడిన ఈ మార్గము ఏదైతే వున్నదో దాన్ని పెద్దలు యోగమార్గమన్నారు. వేదంలో ముందు భాగం అంతా

పరబ్రహ్మతత్త్వం గురించి చెప్తారు. రెండో భాగంలో ఉపనిషత్తుల పేరుతో 'వాడి' ని చేరుకునే మార్గాన్ని చెప్తారు. అందుకని ప్రతి ఉపనిషత్తు ఒక విధమైన మార్గాన్ని చూపుతుంది. వీటన్నిటినీ సమీకరించుకుని మనకి ఒక స్థిరమైన యోగమార్గాన్ని అందించినవాడు పతంజలి మహర్షి. ఆయన ఇచ్చిన మార్గము- అంతర్ముఖలమై, మనస్సును ప్రాణ ప్రవృత్తులను ఒక దాంట్లో లయం చేసి, స్పందనలోకి చేరుకుని, అక్కడ నుండి సూక్ష్మ స్పందనలోకి, అక్కడ నుండి మన యొక్క స్వస్థానంలోకి, అక్కడ నుండి మొత్తంలోకి, ఇట్లా అష్టాంగ యోగం ఒకటి ఆయన ప్రతిపాదించి ఇచ్చారు. ఆ మార్గాన్ని అప్పట్నుంచి ఇప్పటివరకు కాపాడుతూ ఉన్న వాళ్లు మహాత్ములు, గురువులు. అందుకని ఏ గురువు అయినా చిట్ట చివరికి తన శిష్యునికి నేర్పేది ఏమిటయ్యా అంటే తపస్సు చేసుకోమని. 'అంతర్ముఖుడవై నిన్ను నీవు దర్శనం చేసుకోవడానికి మార్గాన్ని చూపించి ఈ మార్గంలో నీవు నడిచి వెళ్ళు' అని చెప్తాడు. దానికి బహిర్ముఖమైన అవరోధాలు అన్నీ కూడా నిర్మూలించుకుని, ధర్మాన్ని అవలంబించే పద్ధతి ఇస్తారు. బహిర్ముఖంగా ధర్మ నిర్వహణ లేని చోట అంతర్ముఖంగా సాధన జరగడానికి అవకాశం ఉండదు. అందుకనే అంతర్ముఖులవడం అనేది అందరికీ సులభం అయ్యేంతవరకు బయట ఎట్లా నిర్వహించుకోవాలో చెప్తూ ఉంటారు. ఎన్నిసార్లు వింటాం ఈ morals అని అనిపిస్తుంది. ఎన్నిసార్లు అంటే వాటిని నిర్వర్తించుకునేంతవరకూ. చిక్కులు వేసుకోకుండా బయట జీవితాన్ని నిర్వర్తించుకునేంతవరకూ వినాలి. ఎందుకంటే వింటేనే కానీ ఆచరించాలి అనే స్ఫూర్తి రాదు. స్ఫూర్తి కలిగించడానికి వాళ్ళు రకరకాలుగా దాన్ని చెబుతూ ఉంటారు. కాబట్టి బహిర్ముఖంగా మనకి మూడు రకాల బాధలుంటాయి. వాటినే 'ఈషణ త్రయం' అంటారు. 'దారేషణ, ధనేషణ, పుత్రేషణ' అని అంటారు వాటినే. భార్య, సంతానం, సంపద. సంతానం, భార్య ఈ రెంటిని ఒకటిగా తీసుకుంటే, కుటుంబ పరంగా ఒకటి, సంఘ పరంగా ఒకటి, వృత్తిపరంగా ఒకటి-- మూడు రకాల బంధములు ఉంటాయి. వీటి యందు ధర్మంగా ప్రవర్తించినప్పుడు మాత్రమే మనం అంతర్ముఖలమవడానికి వీలుపడుతుంది. లేకపోతే మనకు పిల్లల వలన, కుటుంబం వలన, లేక సంఘము వలన, వృత్తి వ్యాపారముల వలన అవరోధాలు కలుగుతూ ఉంటాయి. ఇవి కాక సహజంగా ఒంట్లో ఉండే బాధల వల్ల అవరోధాలు కొన్ని. 'యోగానికి అనారోగ్యం చాలా పెద్ద ఆటంకం' అని మొట్టమొదటి చెప్పాడు పతంజలి మహర్షి. యోగమార్గానికి మొత్తం మీద 14 అవరోధాలు ఉన్నాయని చెప్పాడు ఆయన. వీటిలో నిన్ను ఏవి బాధిస్తున్నాయో పుస్తకం తెరచి చూసుకోమన్నాడు ఆయన. తెలుగులో సులువుగా అర్థమయ్యే రీతిలో మాస్టారు గారు యోగ సూత్రములన్నీ వున్నవి వున్నట్టుగా పొందుపరచి ఒక పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకంలో సాధన

పాదంలో యోగానికి ఎదురయ్యే అవరోధాలను సూచించారు. అందులో ఏ అవరోధాలు మనని బంధిస్తున్నాయో చూసుకుంటే మనం ఎక్కడ ఉన్నామో తెలుస్తుంది.

## 727 సత్కృతిః

సత్కృతి కూడా భగవంతుడే! అంటే మంచి చేత ఎక్కడ జరిగినా అది భగవంతుని యొక్క అస్తిత్వంగా గుర్తించాలి. ఎక్కడ మంచి పని జరిగినా ఈర్ష్య పడకుండా 'Any good work is presence of God' అది కూడా భగవంతుని యొక్క అవతరణమే అని గుర్తించాలి. 'ఈర్ష్య దాటితే 50 శాతం బయటపడ్డట్టే' అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఎవరన్నా ఒక మంచి పని చేస్తే అది భగవంతుని యొక్క అవతరణంగా భావన చేయడమే భగవద్భక్తుని యొక్క ముఖ్య లక్షణం. మనం ఎంతో పూజలు, పునస్కారాలు చేస్తాం. ఇంకోళ్ళు ఏదో చేశారట అంటే దాంట్లో వంకలు వెతుకుతూ ఉంటాము. వాడికేం తెలుసని చేశాడు? అని అంటాం. అది కాదు, ఎక్కడ సత్కృతి జరిగినా భగవంతుడే! అని భావన చేయాలి. మహాత్ములు ఎవరినీ హేళన చెయ్యరు. దేనినీ దూషించరు. దేనిని చులకన చెయ్యరు. సత్కృతి అంటే మంచి కార్యము అని అర్థం ఒకటి ఉంది. సత్కృతి అంటే మంచి కావ్యమని కూడా ఉంది కదా! అందుకని మంచి కావ్యములు, మంచి గ్రంథములు సత్కృతి. భగవంతుని గూర్చి తెలిపే గ్రంథములన్నీ కూడా భగవంతుని స్వరూపాలే! కాబట్టి మనం భగవంతుని ఏ విధంగా శ్రద్ధాభక్తులతో ఆరాధిస్తామో, అట్లాగే ఈ గ్రంథాలను కూడా ఆరాధించే మార్గం ఉంది. సిక్కు మతస్తులు గ్రంథానికే పూజ చేస్తారు. గ్రంథమే దేవుడు. భారత, భాగవత, రామాయణాలు, వేదాలు వంటి వాటిని మనం సజీవమైన రూపాలుగా భావన చేసుకోవాలి. అంతేకానీ అవి ఎక్కడపడితే అక్కడ పారేసి, ఎలా పడితే అలా వాడేసి కాకుండా, ఒక మహాత్ముడితో ఎలా ప్రవర్తిస్తామో అలానే వాటితో కూడా వ్యవహరించాలి. అంటే భగవద్గీత చదువుకుంటే శ్రద్ధగా కూర్చుని పుస్తకం తెరచి, అగరవత్తి పెట్టి దీపం పెట్టుకుని చదువుకుంటే, అందులోంచి ఎక్కువ తెలుస్తుంది. మాస్టారు గారు అంటుండేవారు రైలులో తోచదు అని చదివే పుస్తకాలు కావివి, శ్రద్ధా భక్తులతో చదువుకోవలసిన గ్రంథాలు, అని. రైలులో వెళ్తున్నా శ్రద్ధగా చదువుకో. కాకతాళీయముగా చదవకూడదు. నిర్లక్ష్యంగా చదవకూడదు. వాటి యందు నిర్లక్ష్యం ఎటువంటిది అంటే ఒక మహాత్ముని యందు నిర్లక్ష్యం ఎలాంటిదో అలాంటిది. అందుకనే అది చక్కగా తెరవాలి, చక్కగా మూయాలి. దాన్ని మడచకూడదు. చింపకూడదు. దాని మీద కాళ్ళు పెట్టుకోకూడదు. పాశ్చాత్య దేశంలో ఒక మారు సభలో ఆఖరున కూర్చున్న వాళ్ళు క్రింద తడిగా వుంది. వాడిలో ఒకడు కాళ్ళ క్రింద భగవద్గీత పెట్టుకుని కూర్చున్నాడు. ఆ దృశ్యం చూసి భరించలేక అతనిని నిలదీస్తే, పేపరే కదా అన్నాడు. ఎంత తేడా? మనకు కాగితం సరస్వతీదేవి అనే భావన కలిగించారు పెద్దలు. వాళ్ళకి అది కాగితమే కదా అని అనిపిస్తుంది.

ఎంత మామూలు పుస్తకం అయినప్పటికీ, కాళ్ళ క్రింద పెట్టుకోవడం అనేది మహా పాపం అనే భావన కలిగించారు మన పెద్దవాళ్ళు. అదే వారికి భగవద్గీతయినా పేపరే అనిపిస్తుంది. వాడికి వెంటనే నేను కూర్చున్న చోట్లోంచి ఒక దిండును తీసి ఇచ్చాను. ఆ పని చెయ్యకపోతే నేను మహా పాపం చేసిన వాడిని అవుతాను. తెలియక తప్పు చేసిన వాడికీ, తెలిసి తప్పు చేసిన వాడికీ తేడా వుంటుంది కదా! తర్వాత ఏదో క్లాసులో భాగముగా వివరించాను, సర్దుకున్నారు. భక్తి శ్రద్ధ ఉన్నవారికి చెప్పాలి గానీ ఏదో అడిగారు కదాని చెప్పకూడదు. సంస్కృతంలో ఓంకారం నేర్పమంటే ఒక అమ్మాయికి నేర్పాను. ఆ పిల్ల, కాలి బొటన వేలుతో ఇసుకలో ఓంకారం వ్రాసి సరిగ్గానే వ్రాశానా, అని అడిగింది. ఇంకోళ్ళయితే చాచి చెంప మీద కొట్టేవాడిని. కానీ మన సంస్కృతి తెలియని పిల్ల కదా అని, తప్పు నాదేనని అప్పటికి ఊరుకున్నాను. తర్వాత తెలియజేయడము జరిగింది అనుకోండి. సత్కృతి అంటే చక్కని కావ్యము, చక్కటి చేత, చక్కటి నడవడిక అని కూడా అర్థాలు వున్నాయి. రాముని నడవడిక చదువుకుంటూ వున్నాము అనుకోండి, మనలో కూడా ఆయనలోని గుణాలు మేల్కొంచడానికి అవకాశాలున్నాయి. మనము రాముని నడవడిక, భరతుని యొక్క నడవడిక, హనుమంతుని నడవడిక, విభీషణుని యొక్క నడవడిక, శబరి యొక్క నడవడికలను ప్రత్యేకించి చదువుకోవాలి. అదే విధంగా మహాభారతంలోనూ కనిపిస్తారు. సత్పురుషులు ఏ విధంగా ప్రవర్తించారు? అనేది కనక మనం శ్రద్ధ భక్తులతో చదువుకుంటే, మనలో సద్గుణాలు బీజప్రాయంగా ఉంటాయి కాబట్టి మేల్కొంచుతాయి. అలా కాకపోతే ఎందుకు బ్రతుకుతున్నామో తెలియకుండానే బ్రతికేస్తూ ఉంటాము. అందుకనే సత్కృతి మూడు రకాల అవతరణములుగా ఉంది అని చెప్పకుంటున్నాము. మంచి చేత ఎక్కడ జరిగినా ఈర్ష్య పడకుండా మెచ్చుకోగలిగి ఉండాలి. రెండవది, స్ఫూర్తినిచ్చే ఏ గ్రంథమైనా మంచి గ్రంథమే. ఎవరు వ్రాశారు? మన గురువుగారు కాదుకదా! అయితే చూడక్కర్లేదు అనేలా ఉండకూడదు. ఎవరు వ్రాశారని కాదు, ఏమి వ్రాశారు అని చూడాలి అని పెద్దలు చెప్తారు. వ్రాసిన దాన్నిబట్టి వ్రాసినాయన ఎటువంటి వాడో కూడా తెలుస్తుంది. అందుకనే వికాసం కలగడానికి మనం నాలుగు రకాల గ్రంథాలను చదవాలి. స్వాధ్యాయమని ఇచ్చారు. నువ్వు ఎంతో గొప్పవాడివైనావని అంకున్నా రోజూ కాస్తో కూస్తో మహాత్ములచే ఉచ్ఛరింపబడిన వాక్యాలు చదువుకోవాలి. ఒక రమణ మహర్షి చెప్పినవి, ఒక అరవిందుడు చెప్పినవి, ఒక రామకృష్ణుడు చెప్పినవి, ఒక CVV చెప్పినవి, ఒక MN చెప్పినవి ...ఇలా మనకి అదృష్టవశాత్తు, భారత దేశంలో ఎంతో మంది ఎన్నో రకాలుగా చెప్పారు. మనకు రుచికి కొదువ లేదు. పాశ్చాత్య దేశాల్లో వాళ్ళు అందుకనే ప్రక్కన పడేశారు. ఎప్పుడూ అదే

చదువుకోవాలి. ఇంకొకటి లేదు వాళ్ళకి. రాజసిక ప్రవృత్తితో మిగతావి ధ్వంసం చేసుకున్నారు. మనకేమో రామకృష్ణ పరమహంస చెప్పినట్టుగా, రమణ మహర్షి చెప్పరు. ఈయన చెప్పినట్టుగా CVV చెప్పరు. మరి ఈయన చెప్పినట్టుగా ఇంకో గురువుగారు చెప్పరు. కానీ అన్నిటిలోనూ ఒకే సత్యం ఉంటుంది. కాబట్టి మనం రోజూ ఒకే కూర, ఒకే పచ్చడి, ఒకే పులుసు తింటుంటే విసుగు చెందుతాము. వైవిధ్యం కోరుకుంటాము. అదేవిధంగా స్వాధ్యాయంలో కూడా వైవిధ్యం అవసరం, అప్పుడు అందులో రుచి తెలుస్తుంది. అప్పుడప్పుడు పిట్ట కథలు చెప్పడానికి కారణం ఏమిటో చెప్పనా? మనకు బాగుంటాయి అవి విన్నప్పుడు. భారతం నిండా కథలు ఉన్నాయి. రామాయణం నిండా కథలు ఉన్నాయి. ఉదంతాలు ఉన్నాయి. ఇవి కాక మహాత్ములు చెప్పిన మాటలు బోలెడు. రోజూ ఒక అరగంట సేపు చదవడం అభ్యాసం అవ్వాలి. ఈ రోజుల్లో అసలు చదువుకోవడమే లేదు మనుషులు. మానేశారు అందరూ. పుస్తకం చదవడం అనే అభ్యాసమే పోయింది. చిన్నపిల్లలకు అసలు లేనేలేదు. గట్టిగా గడగడా తెలుగు చదవలేరు కదా! అలా అని ఇంగ్లీషూ చదవలేరు. మనం చేస్తుంటే మన పిల్లలకు అలవాటు అవడానికి అవకాశం ఉంది. అందుకని జీవితంలో ఎవరు చక్కగా నడిచారో వారి గురించి గ్రంథాల్లో ఉంటుంది. అవి సత్కృతులు. రామాయణంలో రాముని గురించి భరతుని గురించి వివిధములైన పాత్రల గురించి వుంటుంది. మనమంతా గోచరిస్తాము అక్కడ. ఈ రోజుల్లో ఎక్కువమందికి రావణాసురుడు నచ్చుతున్నాడు. అంటే మనలో చాలా దర్పము, అహంకారము, ఆక్రమణబుద్ధి మొదలైనవి ప్రబలటం చేత రావణాసురుడు నచ్చుతాడు. విభీషణుడు నచ్చడు. రావణాసురుడు, కుంభకర్ణుడు, విభీషణుడు వీళ్ళల్లో విభీషణుడు నచ్చేవాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. 'విభీషణ శరణాగతి' అని అప్పలాచారి వారు వ్రాసిన పుస్తకం ఒకటి ఉంది. చిన్న పుస్తకం, చదవండి. ఎంత అద్భుతంగా ఉంటుందో. అసలు విభీషణ శరణాగతి అని ఎందుకన్నారు? అని తెలుస్తుంది. అది చదివితే ఒళ్ళు పులకరిస్తుంది. అసలు శరణాగతి అంటే ఏమిటి? స్వంత అన్నదమ్ములని కాదనుకుని తనను రక్షిస్తాడో, లేదో తెలియక ఒక శత్రురాజు దగ్గరకు వచ్చి శరణాగతి పొందడం అంటే యేమిటి? అందులోని లోతైన భావాలు ఏమిటి? మనకు సత్త్వగుణం లేకపోతే సత్త్వగుణ సంపన్నులను బాగా అర్థం చేసుకోలేము. అర్థం చేసుకోవాలి అంటే వారి గురించి చక్కగా వ్యాఖ్యానించిన వారి రచనలు చదువుకుంటూ ఉండాలి.

హరునకు నవ్విభీషణునకు అద్రిజకున్ తిరుమంత్రరాజమై
కరికి అహల్యకున్, ద్రుపద పుత్రికకున్, ఆర్తిహరించుచుట్టమై
పరిగిన యట్టి నీ పతిత పావన నామము నాదు జిహ్వ పై నిరం
తరము నటింప జేయగదె భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ!

అంటే వీళ్ళందరూ ఏం చేశారు అని చూడొద్దూ మనం. అట్లాగే...దాసిన చుట్టమా శబరి దాని దయామతి నేలినావు? నీ చుట్టమని దాచుకున్నావా? అంటే నీకు మాకు ఎవరికీ తెలియనటువంటి చుట్టరికం శబరితో ఉందా? అంత దయతో ఆవిడని ఏలుకున్నావు?

దాసిన చుట్టమా శబరి దాని దయామతి నేలినావు? నీ
దాసుని దాసుడా గుహుడు తావక దాస్యమొసంగినావు! నే
చేసిన పాపమా వినుతి చేసిన కావము కావుమయ్యా! నీ
దాసులలోన నేనొకడ భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ!

అంటారు రామదాసు గారు. నువ్వు అనుకుంటే ఎట్లా? ఆయన అనుకోవాలి కదా! గుహుడు ఏం చేశాడు? శబరి ఏం చేసింది? ఆ ఇద్దరినీ ఒక category లో పడేశాడు అక్కడ కదా! మరి సమత్వం సమత్వం అంటారు. రాముని యొక్క సమత్వం కన్నా మించిన సమత్వం కనిపించదు. చక్రవర్తి కుమారుడే అయినా అడవిలో గల ఒక గుంపుల నాయకునితోనూ, ఒక శూద్ర స్త్రీతోనూ, ఒక పక్షితోనూ, కోతులతోనూ అందరితోనూ సమభావం కలిగిన వాడు. శ్రద్ధతో రామాయణం చదువుకుంటే కల్మషాలన్నీ పోతాయి. మారిపోతాము. అలాంటి గ్రంథం అది. కృష్ణుడిది అతి మానుషీ ప్రవృత్తి. మనం ఆయన చేసినవన్నీ చేయలేము. రాముడు పరిపూర్ణ మానవుడిగా ఎట్లా జీవించాలో ఆచరణలో చూపించాడు. కాబట్టి రాముడిని ఆదర్శంగా పెట్టుకుని జీవించడం అనేది ఒక తృప్తినిస్తుంది. అది ధీరత్వాన్ని, ధర్మంతో కూడుకున్న గర్వాన్నిస్తుంది. నేను ధర్మాత్ముడ్ని, ధర్మాత్ముడైన రాముని అనుసరిస్తున్నాను, నాకేమీ భయం లేదు అనే ధైర్యం ఉంటుంది. రామ భక్తుడికి భయం ఉండదు. ఎందుకంటే తాను ధర్మం తప్పడు. తన రాముడు తనను కాపాడుతాడనుకుంటాడు. రామభక్తునికి హనుమంతుని అండ వుంటుంది. లక్ష్మణుని అండ ఉంటుంది. అమ్మవారి ఆశీర్వచనం కూడా వుంటుంది. అదొక పెద్ద complex. రాముని పాదాలకు దణ్ణం పెడితే హనుమంతుడు అష్టసిద్ధులను యిస్తుంటాడట. లక్ష్మణుడు కాలస్వరూపుడు కాబట్టి కాలం యొక్క తిప్పల నుండి మనల్ని రక్షిస్తూ ఉంటాడట. ప్రకృతి యొక్క మాయ నుండి అమ్మవారు రక్షిస్తూ ఉంటుందట. రాముని సాన్నిధ్యంలో ఉండడానికి వీలు కల్పిస్తుందిట. అది మనకి రామపట్టాభిషేకం లాంటిదే. ప్రతి ఇంట్లో ఒక సింహాసనం పెట్టుకుని అందులో హనుమత్ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నములను పెట్టుకుని పూజిస్తుంటాము కదా! సత్కృతి అన్నందుకు ప్రత్యేకించి అన్ని గ్రంథాలు చదవడం కంటే కూడా ఒక్కసారి రామాయణం చదవండి. అది కూడా మీకు భక్తి కలగాలంటే, అప్పలాచారి గారు వ్రాసిన రామాయణం చదవండి. ఎంత అద్భుతంగా ఇచ్చారో! ఎంతో ఆనందం కలుగుతుంది. మీ కళ్ళ వెంబడి తప్పక నీళ్లు వస్తాయి. ప్రతీసారి

యిలా కన్నీళ్లు రావడానికి కారణం ఏమిటయ్యా అంటే మన హృదయం లో ఉన్న కల్మషం కొంత కరిగింది అని అర్థం. అందులోని ప్రతి ఒక్కరి సంభాషణలలోను ఎన్ని విషయాలు మనము గ్రహించగలమో! మరి భారతీయులమై పుట్టి రామాయణం తెలియదా? అంటే ఏదో తెలుసు అనో లేక స్థూలంగా తెలుసు అనో చెబుతాము. లోతుగా తెలియకపోతే ముందు లోతుగా రామాయణం చదువుకుందాము! ఆ తర్వాత భాగవతం, ఆ తర్వాత భారతాన్ని చదువుకుందాం. అలా చదువుకుంటుంటేనే పవిత్రీకరింపబడుతాము. ఎందుకంటే భక్తిలో కరగటానికి వీలు కల్పించుకోవాలి మనమే. భక్తి, జ్ఞాన, యోగ, భక్తి, వైరాగ్యములు ఉన్నచోటే పరిపూర్ణమైన అభివృద్ధి వుంటుంది. ఈ నాలుగూ లేకపోతే అభివృద్ధి సమముగా ఉండదు. అందుకే సత్కృతి రూపంలో భగవంతుడున్నాడని భావన చేయాలి. రామాయణాన్ని పూజ చేసుకునే వాళ్ళున్నారు. ఎందుకని? అది రాముని చరితం గనుక. భాగవతానికి పూజ చేసుకునే వాళ్ళున్నారు. భగవద్గీతకు పూజ చేసి చదువుకునే వాళ్ళున్నారు. ఎందుకంటే, శ్రద్ధ ఉంటే జ్ఞానం వస్తుంది శ్రద్ధ లేని వారికి జ్ఞానం రాదు. దిండు మీద తల పెట్టుకుని, కాలు మీద కాలు వేసుకుని భక్తి యోగం చదివామనుకోండి, ఎక్కదు. అందుకనే భగవద్గీతకు పూజ అంటే అమ్మవారికి పూజ అన్నమాట. మరీ చాదస్తంలోకి పొమ్మని నేను చెప్పను గాని ఇవన్నీ ఎందుకిచ్చారో ఆ మూలం తెలుసుకోవాలి. శ్రద్ధ కలిగి ఉండాలి.

## 728 సత్తా

సత్ నుండి సత్తా. మంచి వాళ్ళలో ఉండేవాడని అర్థం. మంచి వాళ్లలో ఉన్నాడు అంటే మిగతా వాళ్ళలో లేడా అంటే? ఉన్నాడు. వీళ్ళలోంచి ఎక్కువగా కనిపిస్తాడు, వినిపిస్తాడు. అందుకే వాళ్ళ దగ్గరకు వెళుతూ ఉంటాము. ఎందువలన అంటే వాళ్లలో ఎక్కువగా ఆయన గోచరించడం వలన, మన హృదయం వాళ్ళ వద్ద వున్నప్పుడు పొంగడం వలన. అందుకే పుణ్య ప్రదేశాలకు వెళ్లటం. కొన్ని కొన్ని ప్రదేశాలలో మనకు తెలియకుండానే ఆహ్లాదం పొందుతూంటాం. తాత్కాలికంగా ఆహ్లాదాన్నిచ్చేవి కొన్ని వుంటాయి, లోకంలో. సినిమా హాలు తాత్కాలిక ఆనందాన్నిచ్చే వాటిలో ఒకటి. ప్రయత్నం మీద కూడా అక్కడ ఎక్కువ సేపు కూర్చో లేము. మంచి నాటకం, మంచి భోజనం యిలా చాలా వరకు తాత్కాలిక ఆనందాన్నిచ్చేవే. ఎల్లప్పుడూ ఆనందాన్నిచ్చే ప్రదేశాలు వున్నాయి, ఎల్లప్పుడూ ఆనందాన్నిచ్చే మనుషులు ఉన్నారు. అలాంటి చోట్ల మనకు ఆయన ఎక్కువగా గోచరిస్తూ ఉంటాడు. ఎందుకంటే ఆ రూపంలో భగవంతుడే ఉంటాడు. అలాంటి వాళ్ళు ఎలా వుంటారండీ అంటే సత్యమార్గంలో నడుస్తూ వుంటారు, అలా నడవడం చేత వారి నుండి వాడు వ్యక్తమవుతూ వుంటాడు. అలాటి వారి వెనుక కొంతమంది నడుస్తూ ఉంటారు. అలా వెంట నడిచిన కొలది, వీరు ఇంకా ఆ మార్గం లోతుల్లోకి వెళుతూ ఉంటారు. ఆ మార్గం లోతులలోకి వెళ్ళడం వల్ల కదా వీరందరూ వారి వెనుక నడుస్తున్నారూ! వీళ్ళే కనుక ఆ మార్గం నుండి బయటకు వచ్చేస్తే దేన్ని చూసి నీ వెనుక తిరిగారో వాళ్ళందరూ వెళ్లిపోతారు. 'దేన్ని చూసి వాళ్ళు నీ వెంట పడుతున్నారో దాని యందు నీవు ఇంకా ఎక్కువ శ్రద్ధ భక్తులు కలిగి నిర్వర్తించు' అని మాస్టారు గారికి ఆయన గురువుగారు చెప్పారుట. నీవేదో బాగా నిర్వర్తిస్తుంటావని కదా వాళ్లంతా వచ్చి చేరారు. చేరిన వాళ్ళ వెంటే నీవు తిరుగుతున్నావనుకో--. వాళ్ళు పిలుస్తుంటారు, వీళ్ళు పిలుస్తుంటారు, పాద పూజలు చేస్తుంటారు, బట్టలు పెడతారు, మా యింట్లో యివాళ పెళ్ళి, మా యింట్లో యివాళ పుట్టినరోజు అంటూ మీరు వస్తే బాగుంటుంది అని పిలుస్తుంటారు. మా అమ్మాయికి పేరు పెడుతున్నాము, మీరు రావాలి అని పిలుస్తుంటారు. వీటన్నిటికీ వెళ్తుంటే నీవు చేసే పనులు ఏమైనా ఆగిపోతున్నాయేమో చూసుకోవాలి. నీవు ఏ పనులు చేయడం వల్ల వాళ్లకి ముఖ్యుడవయ్యావో ఆ పనులు నువ్వు మానేసి ఇలా అందరిళ్ళూ తిరుగుతున్నావనుకో, నీవు ఏ తపస్సు చేయడం వల్ల నీలో ఈ సత్త్వము పెరిగి ఇతరులకు దర్శనాన్నిచ్చి ఆహ్లాదం కలిగిస్తున్నదో అది మానేశావనుకో, నీవు ఏ స్వాధ్యాయం చేయడం వలన నీలో వికాసం కలిగి ఆ వికాసంలోంచి ఇతరులకు పరిష్కార మార్గాలు చూపగలుగుతున్నావో అది మానేశావనుకో, నువ్వు ఏ

సత్కార్యాలు చేయడం వలన స్ఫూర్తి చెంది నీ చుట్టూ కొంతమంది చేరారో అది నువ్వు మానేశావనుకో అప్పుడు యేం జరుగుతుంది? దేనివలన వీళ్ళందరూ నీ వద్ద చేరారో అది నీ దగ్గర లేనప్పుడు ఏమవుతుంది? అది నీ దగ్గర తక్కువ ఉన్న కొలది, అయస్కాంతానికి ఇనుప రజను, ఇనప ముక్కలు ఎలా అయితే ఆకర్షింపబడవో నీ వద్దకు కూడా మనుషుల రాక తగ్గుతుంది. నీవు సన్మార్గంలో నడుస్తుంటే నీలో వాడు ఉంటుంటాడు. నీవు మానేస్తే వాడు ఉండడు. సన్మార్గంలో ఇన్నాళ్లు నడిచాను కదండీ ఊర్లో అందరూ మన మంచి గురించి తెలుసుకున్నారు, ఇహ ఆపేస్తే ఏం? అంటే దేనికోసం చేస్తున్నావు? నీకోసమా? ఊళ్ళో వాళ్ల కోసమా? మొదలుపెట్టినప్పుడు నీకోసమే. తర్వాత ఊళ్ళో వాళ్ళు పొగుడుతూ ఉంటే, వాళ్ల కోసం ఇంకా ఒళ్ళు విరుచుకుని చేస్తావు. అట్లా చేయకూడదు. తనకు తన గురువు నిర్దేశించినది తన అంతః చేతన నుండి కర్తవ్యంగా తోచినది నిర్వహిస్తూ ఉంటే నెమ్మదిగా లోపల వెలుగు పెరుగుతుంది. పెరుగుతున్న కొలది వాళ్ళూ వీళ్ళూ ఆకర్షితులవుతారు. దానితో మనకు సంబంధం లేదు. మాస్టారంతటి వారు ఎవరైనా 'మీరు కలలో కనిపించారు, ఇలాగ అలాగా' అంటే 'ఆహా' అనేవారు. ఆహా అనడం ఏమిటి మాష్టారు అంటే 'అది వాడికి సంబంధించిన అనుభూతి కదా! నాకు సంబంధించినవయితే కలలో నేను ఎలా participate చేశానో తెలిసి ఉండాలి కదా! వాడి అనుభూతి వాడిది. వాడికది స్ఫూర్తినిస్తుంది. మనం కాదనకూడదు. విని ఊరుకోవాలి' అనేవారు. మహాత్ములు నడవడం అట్లా ఉంటుంది. ప్రతిదీ వారి account లో వేసుకోరు. లేకపోతే మా అమ్మాయి First class లో pass అయ్యిందంటే, 'నేను చెప్పాను కదా' అంటాడు. వాడు 'మీరు చెప్పినట్లుగానే మా అమ్మాయి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయిందండీ' అని అనాలి. కొందరు 'నేను అప్పుడు మీతో అన్నాను గుర్తులేదా?' అంటూ ఉంటారు. ముందు వీళ్ళకే తాపత్రయం. మీరు చెప్పడం వలన అయిందనిపించుకోవాలని. అసలు వీడు చెబితే యేంటి చెప్పకపోతే యేంటి? అయిపోయింది కదా. అంటే నన్ను గుర్తించారా లేదా మీరు అనే పద్ధతిలో వుంటారు. సత్తా అంటే అట్లా వుండదు. తన దారిన తాను పోతూ వుంటాడు. అంటే వాడి వైపు. అతన్ని చూసి వీళ్ళు చేరుతూ ఉంటారు. చేరితే నడవండి నాతో పాటే అని. నేను ఏ దారిలో నడుస్తానో మీరూ ఆ దారిలో నడవండి, కానీ నేను మీకోసం ఆగిపోను. శిష్యుడి రూపంలో వచ్చి గురువుకు గురువైపోతాడు శిష్యుడు. వాడు ఏం చేస్తాడంటే అక్కడ ఒక Factory పెడుతున్నాను, opening చేయడానికి రండి, అని పిలుస్తాడు. లేక ఇక్కడ Guest-house కట్టాను, వచ్చి మూడు రోజులు అక్కడ పడుకోండి, అంటాడు. వాడు పెద్దవాడు, మనకు పలుకుబడి వస్తుంది. నువ్వు పడుకుంటే బాగానే ఉంటుంది. కానీ నీ సాధనో? ఇట్లా రకరకాలుగా మనుషులు పట్టుకుపోతారు. సాధన

ఆగిపోతూ ఉంటుంది. అందుకనే ఒకసారి మాస్టారు గారు అంటూ ఉండేవారు... నేను చెప్పినట్టు మీరు చేస్తారా? మీరు చెప్పినట్టు నన్ను చేయమంటారా? అని. మనం ఏం చేస్తామంటే ఆయన చెప్పినట్టుగా చేస్తున్నాం అనుకుంటూ మనకు కావలసినదంతా ఆయనతో చేయించుకుంటూ ఉంటాం. అది మన మనస్తత్వం. గోదా వైభవంలో ఒక పద్యం వుంది. మనకొక్కడే కానీ ఆయనకు యెంతోమంది అని. మనకైతే ముగ్గురు పిల్లలు. ముగ్గురు పిల్లలకీ పుట్టినరోజులు. ఇట్లా ఆయనకు యెంతమంది ఉంటారు? అందరిళ్లలో పుట్టినరోజులకి వెళ్లి, భోజనాలు చేస్తుంటే ఈయన పని ఏమవుతుంది? నిజంగా భక్తి ఉంటే, గురువుగారి దగ్గరికి వచ్చి దండం పెట్టుకుని వెళ్లిపోవాలి. అంతేగాని గురువుగారిని మన ఇంటికి పిలిచి ఒక రెండు గంటలో, మూడు గంటలో ఆయన్ని మన ఇంట్లో అట్టే పెట్టేసుకుని ఏమి చేస్తారాయన? ఊరికే అట్లా కూర్చుని ఉంటారు. మాస్టారు గారు Diary లోని స్వానుభవం మనకి పనికి వస్తుంది కదా. నీ వెంటబడిన వాడి వెంట నీవు పడకు ఒకటి. నీ వెంట దేన్ని చూసి నీ వెంట పడ్డారో దాన్ని పెంచు రెండు. మనల్ని పొగుడుతున్నారు కదా అని పదిమంది ఇళ్లకు వెళ్లి మనం కూర్చొని వాళ్ల చేత పొగిడించుకుంటే ఏమవుతుంది? అందుకే సత్తా అంటే మంచిగా ఉండడమే, కాకుండా ఆ దారిలో నడుస్తూ ఉండేవాళ్ళ రూపంలో దేవుడు ఉంటాడు. మంచివాడని మాటిమాటికీ ప్రతి చోటా కూర్చీ, బల్ల వేసుకుని సన్మానాలు చేయించుకుంటూ ఉన్నాడనుకోండి, అయిపోతుంది. మీకిది వరకు ఒక కృష్ణుడి కథ చెప్పాను. ఒకాయన భగవంతుని పేరున విపరీతంగా ఎన్నో కార్యాలను కాశీలో చేస్తుండేవాడు. ఇది నారదుడు చూశాడు. ఇంకొక ఆవిడ రోజూ కృష్ణుడి ఇంటికి పళ్ళు అమ్ముకోవడానికి వచ్చి, ఆయనతో ఓ పది నిమిషాలు మాట్లాడుతుంది. పళ్ళు కూడా చాలా తక్కువ ధరకిచ్చి వెళ్ళిపోతూ ఉండేది. నారదుడు గమనించి 'ఈ పండ్ల అమ్మాయికి యింత సమయం ఇస్తున్నావు కదా! నీ భక్తుడక్కడ దశాబ్దాలుగా నీ పేరున ధర్మకార్యాలు చేస్తున్నాడు కదా! ఒకసారి వాడికి దర్శనం ఇవ్వవచ్చు కదా!' అంటాడు. అవసరం లేదు అంటాడు. ఎందుకని అడిగితే 'నా పేరు పెట్టుకుని వాడు కీర్తి ప్రతిష్ఠలు లు సంపాదించుకుంటున్నాడు, సత్కారాలు చేయించుకుంటున్నాడు, దండలు వేయించుకుంటున్నాడు, సభల్లో పొగిడించుకుంటున్నాడు. అన్ని విధాలుగా తృప్తిగా ఉన్నాడు. నాకోసం చేయట్లేదు, తపస్సు. కనుక వాడికి నా అవసరం లేదు' అంటాడు కృష్ణుడు. 'కానీ ఈవిడకు అవన్నీ అక్కర్లేదు. నేనే కావాలి. అందుకే ఏదో వంక పెట్టుకుని నాకు పళ్ళు అమ్మడానికి వస్తూంటుంది. కాబట్టి ఈవిడకే సమయాన్ని ఇవ్వడం అవసరం' అంటాడు. అంటే ఎవరు ప్రపంచంలో కీర్తి గురించి భగవంతుని ఆరాధిస్తారో వాళ్లకి ప్రపంచం యొక్క పొగడ్తలతోనే, మెచ్చుకోళ్లతోనే ఆ account clear

అయిపోతుంది. ఎవరు భగవంతుడు మెచ్చుకునే పనులు చేసి, వాటిని ప్రపంచానికి తెలియకుండా మరుగున ఉంచుతాడో వాడూ భగవంతుని కోసం చేస్తున్నవాడు 'నన్ను గురువుగారు చాలా ప్రేమిస్తున్నారు. నేను గురువుగారి పనులు చాలా బాగా చేస్తున్నాను. గురువుగారి పనుల కోసమున్నూ, మానవజాతి శ్రేయస్సు కోసమున్నూ, నేను జీవిస్తున్నానే మెరమెరలో వుండేవాడుట' ఒక జన్మలో జ్వాలాకూలుడు. తన గురుభక్తి గురించి, తను చేస్తున్న లోకశ్రేయస్కరమైన కార్యక్రమాల గురించి, తన గురించి ఆయనకు విపరీతమైన అంచనా! ఒకరోజు గురువుగారైన దేవాపి మహర్షి కనిపించారుట. ఏదో రెండు ముక్కలు వినయంగా మాట్లాడి, తన గురించి గొప్పలు చెప్పకోవడం మొదలుపెట్టాడుట. చాలా మంది శిష్యులు చేసేది అదే! సరె ఆయన చెప్తుంటే, వింటూ గురువుగారు, 'నీకు నా మీద ప్రేమ లేదు' అన్నారుట. జ్వాలాకూలుడు, ఆశ్చర్యంతో తనకు గురువు గారి మీద ప్రేమ లేక పోవడమేమిటి ? అనుకుంటాడు. 'నీకు నా మీద ప్రేమ లేదు. నీకు నీ మీద ప్రేమ' అంటారు దేవాపి. ఈయనకి ఒప్పకోబుద్ధి కాలేదు. 'నేను ఒప్పకోను', అన్నాడట. అప్పుడు గురువుగారు, 'నాకు తెలుసు నువ్వు ఒప్పకోవని నువ్వు ఒప్పకున్నప్పటికీ, ఒప్పకోనప్పటికీ, నీ మీద నీకు తప్ప మరెవ్వరిమీద ప్రేమ లేదు. కొన్ని సంవత్సరాలు పడుతుంది నీవు ఈ సత్యాన్ని ఒప్పకోవడానికి. నీకన్నా నాకు ఎక్కువ తెలుసని నేనంటేనే ఒప్పకోడం లేదు కదా! అయినా నువ్విప్పడు ఒప్పకోవు. అంత వరకు నేను వేచి వుంటాను. నాకు నీ మీద ఉన్న ప్రేమ కన్నా, నీకు నా మీద ఉన్న ప్రేమ ఎక్కువ కాదు. నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్లు నన్ను నువ్వు ప్రేమించడం లేదు.' అన్నారుట. అలా చెప్పకపోతే బాగుపడడేమో అని ఆయన చెప్పేశారు. లేకపోతే చెప్పరు. అయినా 'నేను ఒప్పకోను' అంటాడు జ్వాలాకూలుడు. 'నాకు తెలుసు నువ్వు ఒప్పకోవని. నువ్వు ఒప్పకొనే రోజు వస్తుంది. అంతవరకు నేను వేచి ఉంటాను' అంటారా గురువుగారు. అంతే! ఆ తర్వాత అన్నీ వైఫల్యాలు రావడం మొదలు పెట్టినాయి, ఒకప్పడు ఆకాశాన పెట్టిన వారే నెమ్మదిగా ఈయనను మరచిపోతారు. ఏవేవో మాటలు అనడం ప్రారంభిస్తారు. అప్పడు తెలుస్తుంది, తనను తాను ఎక్కువ ప్రేమించుకున్నాడు సంఘాని కన్నా, తనని తాను ఎక్కువ ప్రేమించుకున్నాడు తన ధ్యేయం కన్నా, అందువలనే ఇన్నాళ్ళూ తన కీర్తి, ప్రతిష్ఠ, గొప్పదనమూ కోసమే తను తాపత్రయ పడ్డాడని, నిజంగా తనకు గురుభక్తి లేదని సంఘ స్రేయస్సుకన్నా తన కీర్తి కోసమే చేశాడని, తెలుసుకుని, అజ్ఞానపు పొరల లోంచి బయటకు వచ్చి బాధపడతాడు. గురువుగారి వద్దకు వచ్చి మీరు చెప్పిందే సత్యమని ఒప్పకుంటాడు. అప్పడు 'ఈ పని లో నేను కొన్ని వేల సంవత్సరాలుగా ఉన్నవాడిని, నీవు పసిగుడ్డువి. నీవు అప్పడు ఒప్పకోవని, తర్వాత ఒప్పకుంటావని నాకు ముందే తెలుసు. ఏమీ పర్వా లేదు. ఒక జన్మే కదా! Next time better

luck. ఇంక ఈ జన్మలో ఏమీ లేదు' అని చెప్తాడు. జ్వాలాకూలుడు తన స్వగతంలో, 'ఇటువంటి అపాయకరమైన సన్నివేశాల్లోకి సాధకులు వస్తూంటారు సుమా! ఒక జన్మ అంటే తక్కువ కాదు, ఒక మహత్తరమైన కాలం, కనక దాన్ని వృథా పోనీకుండా చూసుకోండి' అన్నాడు. అంటే సత్తా అనే నామంలో భాగంగా చెప్తున్నాను. మనకెంత సేపూ మనని చూసుకోవడం ఎక్కువ ఉంటుంది దేవుడ్ని ప్రార్థించి. మనలో ఏమన్నా పెరిగిందా? మనలో వెలుగు వచ్చిందా? మన గురించి అందరూ ఏమనుకుంటున్నారు? ఎట్లా వుంది నా ఉపన్యాసం? బాగా చెప్పానా? ఆరోజు నేను పూజ చేసినందు వలన మీ అందరికీ మంచి అనుభవం వచ్చింది కదా! ఇలా ఉంటాయి మన ఆలోచనలు. ఈ భూగోళం మీద మనం, సముద్రంలో కాకిరెట్టంత కూడా చెయ్యము. కాని ప్రతివాడు తన లోకం లో తానొక చక్రవర్తిని అనుకుంటాడు. 'మనము సముద్రములో కాకి రెట్టంత' అని మనం గుర్తు పెట్టుకోవాలి. లోపల సరుకు పెరుగుతుంటే బయటకు నెమ్మది, మౌనం వచ్చేస్తాయి. రెండు ఆల్చిప్పలు ఒక దానితో ఒకటి మాట్లాడుకుంటున్నాయట. 'ఏమిటో లోపల విపరీతమైన నొప్పి, బరువు, ఏమిటో తెలియడం లేదు, చాలా బాధపడుతున్నాను' అన్నదిట ఒక ఆల్చిప్ప. 'నాకటువంటి బాధలేమి లేవు, కడుపు నొప్పి అంటే ఏమిటో నాకు తెలియదు, హాయిగా వున్నాను, ఏమిటో నీకు ఎప్పుడూ ఈ బాధలు. ఏదో పాపం చేసి వుంటావు' అన్నదిట రెండవ ఆల్చిప్ప. 'నేనే పాపం ఎరుగను' అన్నదిట మొదటిది. ఇంతలో ఒక పీత వచ్చి రెండు ఆల్చిప్పల్ని తెరచిందిట. బాధ పడుతున్న ఆల్చిప్పలో ముత్యమున్నదిట, ఏ బాధలూ లేని ఆల్చిప్పలో ఏమీ లేదుట. ముత్యమున్న ఆల్చిప్పను చూసి రెండవది సిగ్గుపడ్డదిట. అట్లానే బయటకు ఊరికే దంబాచారాలు చేసేవాడికీ, తన లోపల తను తయారవుతూ భగవంతుని యొక్క అస్తిత్వాన్ని ఏర్పరుచుకుంటూ అణిగి మణిగి వుండేవాడికీ తేడా ఉంటుంది. ఆటువంటి వాడే దెబ్బలు తింటూ ఉంటాడు. బాధపడుతూ ఉంటాడు, కానీ లోపల పెరుగుతూ ఉంటాడు. అదే మొదటి వాడు బయట పెరుగుతూ వుంటాడు కానీ లోపల డొల్లగా వుంటాడు. నిజంగా సత్యాన్ని అనుసరిస్తూ వెళ్తున్న వాళ్ళు మరుగున వుంటారు. సత్యం పేరున హడావిడి చేసుకునే వాళ్ళు బాహాటంగా వుంటారు. ఈ నామంలో మనకు ఏమి చెప్తున్నాడు అంటే సత్యస్వరూపులై సత్యాన్ని అనుసరించి వెళ్తున్న వాళ్ళరూపంలో తానున్నానని చెప్తున్నాడు.

## 729 సద్భూతిః

సద్భూతి అంటే సత్యమార్గంలో నడుస్తూ వుండే వాళ్ళకు కలిగే అనుభూతులు. వాళ్ళకీ అనుభూతులు కలుగుతాయ. కొంచెం emotional గా ఉండే వాళ్ళకీ అనుభూతులు కలుగుతాయి. వాళ్ళ అనుభూతులు చాలా లోతుల్లోకి, సత్యానికి దగ్గరగా ఉంటాయి. స్ఫూర్తినిస్తాయి. ఆ అనుభూతి కారణంగా ఇంకొంచెం చైతన్యంలోకి పెరుగుతూ వుంటారు. మిగతా అనుభూతులు ఉరికే మెరుపుల లాగా వచ్చి, excite చేసి వెళ్ళిపోతుంటాయి. అందుకనే లోతైన అనుభూతి కలిగినప్పుడు దానిని అత్యంత పవిత్రమైన విషయంగా మరుగు పరచుకుని అనుభవిస్తూంటారట. అది కూడా జ్వాలాకూలుడు చెప్పాడు. 'నీకు నిజమైన అనుభూతి కలిగితే నీవు బయటకు వెంటనే చెప్పవు. ఎందుకంటే నీకది ఆంతరంగికమైన విషయమై వుంటుంది. ఆ అనుభూతి ఎంత సత్యమంటే భోజనం చేశావో లేదో నీకెట్లా తెలుసో ఆ జరిగిన అనుభూతి కూడా సత్యమా కాదా అనేది అంత స్పష్టంగా ఉంటుంది' అని కూడా చెప్పాడు. ఆందుకనే ఎవరన్నా మన దగ్గరికి వచ్చి ఇట్లా అనుభూతి కలిగింది నిజమా కాదా? అని అడిగారనుకోండి. అట్లా అడిగితే కాదని చెప్పెయొచ్చు. ఎందుకంటే నేను ప్రొద్దున్నే Breakfast చేసినట్లుంది, చేశానో లేదో నువ్వు చెప్తావా, ఆంటే ఎలా ఉంటుంది? ప్రొద్దున రెండిడ్లీ తిన్నట్లుగా గుర్తుంది. నిజంగా తిన్నానంటావా? అని అడుగుతాడా ఎవరన్నా? తింటే ఖచ్చితంగా రెండిడ్లీ తిన్నాను, ఇంకో రెండు వడలు కూడా తిన్నాను, తర్వాత కాఫీ కూడా తాగాను అని ఖచ్చితంగా చెప్తామా లేదా? అది ఎంత స్పష్టమైన అనుభూతో, ఈ జరిగింది కూడా అంత స్పష్టంగా ఉంటుంది, అని జ్వాలాకూలుడు చెప్పాడు. కాబట్టి నీ అనుభూతి కి వాళ్ళ దగ్గర, వీళ్ళ దగ్గర verification అవసరం లేదు. చెప్పదలచుకుంటే నాకు ఇలాటి అనుభూతి కలిగింది అని చెప్పేసెయ్. అది కూడా ఎవరి దగ్గర చెప్తావంటే విలువ తెలిసిన వాళ్ళ దగ్గర. విలువనివ్వని వాళ్ళ దగ్గర చెప్పద్దు. ఎన్నో విభూతులు వస్తూంటాయి, భాగవతమార్గంలో. సత్యంలో నిలబడి ఉండడం వల్ల కలిగే అనుభూతులు అన్నమాట, విభూతులు. ఎట్లా వుంటాయంటే వాటిని మనం మామూలుగా అంచనా వెయ్యలేం. ఒకాయన సత్యంలో నడుస్తూ ఉంటే ఎవడో వచ్చి ఇల్లు పట్టుకుపోయాట్ట. అది కూడా విభూతి కింద తీసుకున్నాడు. 'ఓహో! ఈ ఇల్లు నాకు బరువు అనుకున్నాను. నీవు దాన్ని పట్టుకుపోయావు, చాలా సంతోషం అనుకున్నాడు.' సత్యంలో ఉంటే సత్యం రుచెక్కువ కదా! అదీ ఇదీ పోయనాయనే బాధ ఉండదు. ఆళ్వారుల చరిత్ర చదువుకోండి. చాలా భక్తి పూర్వకంగా ఉంటాయి. ఆయన, ఆయన భార్య పడుకుని ఉన్నారుట. ఆయనంటే రామానుజాచార్యుల వారికి ఎక్కువ ఇష్టం. ఎంత ఇష్టం

అంటే మిగతా శిష్యులకి ఈర్ష్య పుట్టేదిట. ఏమిటయ్యా వాడి గొప్ప అంటే? ఒక రోజు రామానుజుల వారి ఈ ప్రియశిష్యుని ఇంట్లో దొంగలు పడుతూంటే ఇంట్లో వాళ్ళకి మెలకువ వస్తుంది. అయినప్పటికీ నిద్రపోతున్నట్లుగా నటిస్తారు. ఇంట్లో వస్తువులన్నీ తీసుకున్న తర్వాత వీళ్ళ వంటి మీదవి కూడా వలవటం మొదలు పెట్టారు. దానికి కూడా అడ్డు పడలేదు వాళ్ళు. ఆవిడ మెడలోని గొలుసు తీయడానికి ఆ దొంగకి వీలు కల్పించడానికి ఆవిడ అటు నుండి ఇటు తిరిగిందిట. ఆమ్మో ఈవిడ లేస్తుందేమో అని వాళ్ళు ఆ ఒక్క నగ వదిలేసి పారిపోయారుట. మర్నాడు ఉదయం, దొంగలు పడ్డారు అని శిష్యులందరూ చెప్పుకుంటూ ఉంటే గురువుగారు ఏమి జరిగింది అని అడిగుతారు ఈ జంటని. అడిగితే, 'దురదృష్టవంతులము ఇది ఒక్కటి ఇవ్వలేకపోయాము' అని చెప్తారు. అదేంటి అని అడిగితే 'దొంగ దీన్ని తీసుకోబోవ ప్రయత్నిస్తుంటే, నేను సహకరించాలి అని చూశాను. కానీ వాడు భయపడి పారిపోయాడు. అందువల్ల నేను దీన్ని వాసుదేవునికి అందించలేకపోయాను' అని వివరిస్తుంది ఆవిడ. ఇది మన వరకు అంతుపట్టే విషయం కాదు. దొంగలు పట్టుకుపోయారు అంటే వాళ్ళ అవగాహన ఏమిటంటే, వాళ్ళకి ఎంత అవసరం కాకపోతే ఇంత కష్టపడి దొంగతనం చేసి తీసుకుపోయారో అని. అప్పుడు రామానుజాచార్యులవారు 'చూశారా' అని మిగిలిన శిష్యులతో అంటే వారంతా నమస్కరించేశారు. ఇటువంటివి వున్నాయని అసలు తెలియాలిగా మనకి, ఏవి? విభూతుల్లో! ఆ సంఘటననే వాళ్ళు విభూతిగా తీసుకున్నారు. భగవంతుడే ఈ రూపంలో వచ్చి చేశాడు అని. అంటే విభూతులు రెండు రకాలుగా వుంటాయి, చూసే వాడిని బట్టి. దివ్యానుభూతి ఒకటి. దేవకి అనుభూతులు కృష్ణుణ్ణి గర్భాన ధరించినప్పుడు ఎలా ఉన్నాయి? ఎట్లా ఉన్నా అనుభూతిగా తీసుకుంటాడు భగవద్భక్తుడు, అదీ సద్భూతి! ఏదన్నా ఒకటి పోయిందనుకోండి, దీన్నుండి నన్ను రక్షించావా అంటాడు. అది ఉంటే బెడద, అది పోవడం వల్ల తాను రక్షింపబడ్డాడు అన్నట్టు భావన చేస్తాడు. దైవం తప్ప తనని ఇంకెవరూ ఏమీ చెయ్యరని లెక్క. కొట్టినా, తిట్టినా, ఇచ్చినా, పుచ్చుకున్నా అన్నీ దైవమే చేశాడని భావిస్తాడు. పుచ్చుకుని వెళ్ళిపోతే, దైవమే పుచ్చుకు వెళ్ళాడనే స్థితిలో వుండే వాడు విష్ణు భక్తుడు. వాడ్నింకెవ్వరూ ఏమీ చెయ్యలేరు. అటువంటి వాళ్ళ గురించి చెప్తాడు కృష్ణుడు. వాడు తలక్రిందులవడు ఎప్పుడూ అని. శివపార్వతుల గురించి ఒకాయన హాస్యంగా మాట్లాడితే శపిస్తుంది పార్వతి. శాపాన్నే వరంగా తీసుకుని వెళ్ళిపోతాడా విష్ణుభక్తుడు. అంటే ఏం జరిగినా సమస్తం లో విష్ణువే తప్ప ఇంకొకడు చెయ్యడు కదా! అంటే ద్వంద్వాన్ని దాటి, జరిగిన ప్రతిదీ వాడి అనుభూతిగా తీసుకోవడం అది సద్విభూతి, అదే సద్భూతి.

## 730 సత్పరాయణః

Totally engage with such people! అటువంటి వాళ్ళ యందు పరిపూర్ణంగా అనుగ్రహం కలిగి ఉంటాడు. అనుగ్రహం వాళ్ళపై ఎప్పుడూ వర్షిస్తుందన్నమాట. భక్తులను కాపాడుకోవడం లో భగవంతుడు చూపే ఆత్రుత తల్లి కూడా పిల్లల విషయంలో చూపించదు. అంత preoccupied in the mind. ఎల్లప్పుడూ వాళ్ళ గురించే ఆలోచిస్తూ ఉంటాడు. ఎంత అదృష్టం! ఎందుకట్లా ఆలోచిస్తాడు? వాళ్ళు ఎప్పుడూ ఆయన గురించే ఆలోచిస్తూంటారు కనక. Two-way traffic. వీళ్ళెప్పుడూ ఏ పని చేస్తున్నా, ఎక్కడున్నా అదే ధ్యాసలో ఉంటే ఆయన ఇక వారిని వదల్లేడు. అందుకనే చెప్తాడు భాగవతంలో 'ఈ ప్రపంచంలో నన్నెవ్వరూ కట్టెయ్యలేరు, భక్తులు తప్ప. భక్తులు కట్టేస్తే అట్లాపడి ఉంటాను, మిగతా వాళ్ళకు దొరికే ప్రశ్నేలేదు' అని. దుర్వాసుడికీ విష్ణుమూర్తికీ జరిగిన సంభాషణంతా కందపద్యాలుగా వున్నాయి, చదువుకోండి బాగుంటుంది. దుర్వాసుడ్ని 'పోవయ్యా బ్రాహ్మడా' అంటాడు విష్ణుమూర్తి. 'నీవెంతటి వాడివైతే నాకేం, పొమ్మంటాడు'. కథ చాలా బాగుంటుంది. తనకి అపచారం జరిగినా పెద్ద పట్టించుకోడు కాని, తన భక్తుడికి జరిగితే ఏ మాత్రమూ సహించడు. అది ఆయన యొక్క భక్తపరాయణత్వం. సత్యం ఎక్కడ వుందో, సత్యాన్ని నమ్ముకున్న వాడికి అపకారము జరిగితే, వాడు కనక దాన్ని భగవంతుని యొక్క అనుగ్రహంగా భావిస్తే ఈయన కదలి పోతాడు. Seat లో కూర్చోలేడు. మామూలుగా మనం ఏం చేస్తామంటే మనకెవరన్నా అపకారం చేసినా, ఏదన్నా మాటన్నా మనమే దేవుడి పేరున పది మాటలనేస్తాము. దాంతో చెల్లిపోయింది. వాడే చూసేసుకున్నాడు కదా! మనం వెళ్ళక్కర్లేదనుకుంటాడు దేవుడు. నువ్వొకటన్నావు నన్ను. నేను నిన్ను పది అన్నాను. అంటే సరే వాడే చూసేసుకున్నాడులే account, మనవరకూ పనిలేదనుకుంటాడు. నిష్కారణగా అవతలి వాడు తిడితే, వీడు పడి, భగవంతుని యొక్క శిక్షణగా భావన చేసుకున్నాడనుకోండి, తిట్టిన వాడిలో ధర్మంలేక పోతే భగవంతుడు కదలి వస్తాడు. అదో రహస్యం! వశిష్ఠుడి లాంటి వారికి అదీ ధైర్యం. ధర్మరాజు లాంటి వారికి ఆదీ ధైర్యం. కొట్టినా, తిట్టినా, ఉమ్మేసినా, ఏం చేసినా వాడు తప్ప ఇంకోడు చెయ్యడు అని వారి నమ్మకం. అట్లా ఉండే వారి విషయంలో ఈయనకు responsibility/బాధ్యత ఎక్కువ. ఎందుకంటే ఏం చేసినా నేనే చేశాననుకుంటాడు, complaint లేదు. అన్ని ఒడి పట్టుకు కూర్చుంటాడండీ విష్ణు భక్తుడు. అట్లా కూర్చునే సరికి ఆయనిక కదలి రాక తప్పదు. Injustice జరిగిన చోట, జరుగుతున్న మొత్తం భగవత్ స్వరూపంగా ఎవరు దర్శిస్తారో వాళ్ళయందు వెంటనే ఆయన దిగి పని చెయ్యాల్సి ఉంటుంది. అదే ఆయన పరాయణత్వం.

సత్యవంతుని కథలో ఇదే చూపిస్తారు మనకు. భక్తిలో ఇది పరాకాష్ఠ. మన భక్తి కొంత fashion కోసం, కొంత protection కోసం. ఏదో మనకి రకరకాల భయాలున్నాయి. ఏ భయంతో ఇది పట్టుకున్నా తప్పులేదు. మనకు భయం కొలది భక్తి పెరుగుతుంటుంది. అక్కడ్నుండి ఇక్కడి వరకూ ఉంది కథ! అది నేను చెప్పేది. ఇది తప్పని నేనడం లేదు. ఇది కూడా లేని దాని కన్నా ఇది మంచిదే. ఇక్కడి నుండి పెరిగి వాసుదేవ తత్త్వంలోకి వెళ్ళాలి. వెళ్తే మరింక వాళ్ళని పరిపూర్ణంగా ఆయనే చూసుకుంటాడు. తన్ని తాను రక్షించుకోని వాడ్ని ఆయన రక్షించాలి. తల్లిదండ్రులైనా అంతే కదా! తెలివిగా తన పని చేసుకునే వాడ్ని ఏం పట్టించుకోరు. తెలివి తక్కువ వాడ్నే కొంచెం ఎక్కువ పట్టించుకుంటారు, పాపం వాడు చేసుకోలేడు కదా, ఏదో మనం ఉన్ననాళ్ళు చేసి పెడదామని పిస్తుంది కదా! అలా తల్లిదండ్రులకే వున్నప్పుడు, జగన్మాత, జగత్పితగా positions లో ఉన్నవారికి, వ్యవహరించే వారికి ఎన్ని ఉంటాయి? పైగా వీళ్ళని తలచుకుంటూ మిగిలిన విషయాలు తెలియని వాళ్ళు. 'సబ్ కుఛ్ సీఖా మైనే, న సీఖీ హోషియారీ' అన్నట్లుండే వారిని ఈయన కాయక తప్పదు. అన్నీ తెలుసుగానీ తెలివిగా బతకడం చాతకాదు అన్నాడు. అమాయకుడన్నమాట. అలాంటివారిని చాలా శ్రద్ధాభక్తులతో కాస్తాడు. మాస్టారు గారు తమాషాగా, 'నేను vp నోయ్ అంటూండే వారు. కాబట్టే ఆయన చూసుకుంటున్నాడు నన్ను' అంటూండేవారు భక్తరాజ్ మహారాజుగారు 'మై పాగల్ హూ' పార్వతీ కుమార్ 'మై కుఛ్ నహీ జానతా, ఇస్ లియే ఉస్ కో హి బొల్నా పడెగా మెరే ద్వారా'. నాకేం తెలియదు, నేను పిచ్చివాడ్ని కనక వాడే మాట్లాడుకోవాలి నా నుండి, వాడే చేసుకోవాలి. నాకేమన్నా తెలిస్తే కదా! అనేవారు. అదొకరకమైన పిచ్చి. అదొక రకమైన తెలివిలేనితనం, అంటే లౌకికం లేకపోవడం. ఎంత లౌకికం ఉండేదికాదంటే మాస్టారు ఎదుటి వారు వచ్చి ఏమైనా చెప్తే అది వెంటనే నమ్మివారికి సాయం చేసేవారు. వాడు నిజమే చెప్తున్నాడా, తర్వాత ఇస్తాడా ఇవ్వడా ఈ గొడవేం ఉండేదికాదు. ఆయన తన సహధర్మచారిణి ఒంటి మీది నగలు సైతం తీసి ఇతరుల ఇండ్లలో ఆడపిల్లల పెళ్ళిళ్ళకి సాయం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మాస్టారు మామూలు లౌకిక పరిస్థితులలో ధనవంతులా? కాదు. 'మీకు పనికి వస్తుంది, ఇది మీరు ఉంచుకోండి' అని ఎవరన్నా డబ్బు ఇవ్వబోతే తీసుకునే వారు కారు. ఇలా ఒకసారి ఎవరో ఇవ్వబోతే 'నీకు తెలుసా నేనొక మహాసామ్రాజ్యానికి చక్రవర్తిని, కావాలంటే నీకే పడేస్తానన్నారు'. అలాగని ఎవరో ముసలమ్మ భక్తితో, 'ఈ పది రూపాయలు పెట్టి మీరు ఏమైనా కొనుక్కోండి', అంటే శుభ్రంగా తీసుకునే వారు. ఆయన అంటూండే వారు, 'బడిపంతుల్నోయ్, మనకి ఏమీ తెలియదు. అందుకే వాళ్ళు మన చేత ఇన్ని పనులు చేయించుకుంటున్నారు. మనకే చాలా తెలిసి ఉంటే మన జోలికి వాళ్ళు

వచ్చే వాళ్ళు కాదు' అనేవారు. అంటే తమని తాము కాపాడుకునే వాళ్లని భగవంతుడు కాపాడాల్సిన పని లేదు. ఇందాక కథలాంటిదే. వాడి పని వాడే చూసుకుంటున్నాడు. వాడు మెప్పు పొంది తృప్తిగా ఆనందంగానే ఉన్నాడు, నేను కావాలని వాడను కోవడం లేదు. అట్లాగే ఇక్కడ వాడి సంగతి వాడు చూసుకోలేని వాడి సంగతి, వాడు (భగవంతుడు), చూస్తాడు. నీ మాటేమిట్రా? అని మధ్యమధ్యలో అడుగుతుంటాడు. ఆందరి మాట సరే నీ మాటేంటి అని అడుగుతూంటాడు. వీడెంత సేపూ వాడికి బాగా లేదు, వాడికి చేసిపెట్టు, వీడికి బాగా లేదు, వీడికి చేసిపెట్టు, వాడు కష్టంలో ఉన్నాడు, వాడికి చేసిపెట్టు, ఇలాంటి ప్రార్థన్లే తప్ప తనకోసం అడగడేం అనుకుంటాడు. మరి నీ మాటేమిటి అంటే నువ్వున్నావు కదా! అంటాడు. నాకేం కావాలో నాకు తెలియదు కదా! అంటాడు. ఎందుకంటే కావాలని తెచ్చుకున్న వాటితో తలకాయ నొప్పి అయపోతాయ్ జీవితంలో, కోరి పెళ్ళి చేసుకుని కొరివిని తెచ్చుకున్న సందర్భాలు లేవూ! పట్టు పట్టి తల్లిదండ్రుల్ని కూడా కాదని పెళ్ళి చేసుకుని తర్వాత నానా బాధలు పడ్డటు వంటి చరిత్రలు బోలెడుంటాయ. అట్లాగే సంతానం కలగకపోతే 'భగవంతుడివ్వలేదు, ఈ జన్మకు ఆ కార్యక్రమం లేదు అని అనుకోకుండా, వాళ్ళ చుట్టూ, వీళ్ళచుట్టూ, గుళ్ళ చుట్టూ తిరిగి ఈ మంత్రం, ఆ మంత్రం చేసి చివరికి ఏదో ఒక త్రాష్టాన్ని తెచ్చుకున్నామనుకోండి సంతానంగా. వాడితో ఇంకో 30 ఏళ్ళు కష్టాలు భరించాలి కదా! కానీ, భగవద్మార్గంలో 'జానేదే, వాడిలో వుంటాం, వాడిచ్చింది పుచ్చుకుంటాం. ఒకవేళ ఏదైనా ఒప్పుకుంటామనుకోండి, అటువంటి వాళ్ళంటే ఈయనకుండే ప్రీతి ఇంతా అంతా కాదు. ఆందుకనే ఆ ధర్మరాజు కోసం కృష్ణుడు విపరీతంగా పడాల్సి వచ్చింది. ఎందుకు? అంటే వ్యక్తిగతంగా తనకు cause ఏమీ లేదు ధర్మరాజుకు చేసిపెట్టడానికి. పైగా అర్జునుడు లాగా భజనపరుడు కాదు ధర్మరాజు. అయనప్పటికీ చేశాడు. తప్పలేదు.

## 731 శూరసేనః

మథురానగరంలో శూరసేనములు, మధురములు అని రెండు రకాలైన పట్టణాలున్నాయి. మథుర అంటే ఒక శరీరమని, శూరసేనము అంటే వెలుగుకేంద్రములని అర్థం. సుర అంటే వెలుగు. సూర అంటే తత్సంబంధమైన శూర సేనములు అంటే వెలుగు కేంద్రములు సేనగా ఉన్న వాటన్నిటికీ సేనానాయకుడు ఈయన. అంటే దేవతలకి, వెలుగుకి సమస్తానికి అధిపతి. మనకి శూరసేనలున్నాయి, మధురములని ఉన్నాయి. అంటే మనలో వెలుగుకి దారి చూపించే కేంద్రాలున్నాయి. మనలో భోగములు అనుభవించడానికి కావలసిన కేంద్రాలున్నాయి. శరీరములో ఉండే కొన్ని కేంద్రముల ద్వారా భోగము అనుభవిస్తూంటాము. కొన్ని కేంద్రాల ద్వారా యోగం అనుభవిస్తాము. యోగం అంటే దైవంతో కలయిక. అంటే వెలుగుతో కలయికే యోగము. కాబట్టి యోగానికి సంబంధించినవీ, భోగానికి సంబంధించినవీ రెండూ వున్నాయి. భోగం తప్పు కాదు. ధర్మసమ్మతమైన భోగం యోగానికి అడ్డురాదు. ధర్మసమ్మతము గాని భోగము రోగానికి దారి తీస్తుంది. అందుకని ప్రతి మనిషిని పంపించినప్పుడు యోగిగానో, భోగిగానో వుండవలసిన సమస్తమైన సరంజామా పెట్టి పంపిస్తాడు. అత్తవారింటికి పిల్లని పంపినట్లు సరుకిచ్చి పంపిస్తాడు. అక్కడ వీడు ధర్మసమ్మతము కాని భోగపరమైన కార్యములలో అనుభూతి లోనూ ఉన్నప్పుడు రోగి అవుతాడు. రోగి అయితే ఇక యోగంలోకి మారుతాడు. అందుకనే రోగి, భోగి, యోగి అను 3 స్థితులు వున్నాయి మనకి. ఈ శూరసేనములు అంటే వెలుగు కేంద్రాలున్నాయి కదా, వాటి సమూహానికి ఈయన నాయకుడు అని చెప్తున్నారు. అసుర అంటే ఆ కేంద్రాలు మూసుకు పోయాయని అర్థం. అసురత్వం అంటే వాడు ప్రత్యేకంగా వేరేగా తయారు చేయబడలేదు. అందరూ ఒకే రకంగా చేయబడ్డారు. కొంతమంది వాళ్ళ వెలుగు కేంద్రాలు మూసేసుకుంటారు. అంటే ఇంట్లో electricity లేదనుకోండి, మంచానికి, భోజనానికి దారులు తెలుసు. గుడ్డిగా ఏదో తినేసి వచ్చిపడుకోవడం, మళ్ళీ తినడం, మళ్ళీ పడుకోవడం, మిగతా పనులు చేసుకోవడం, ఇలా ఉంటారు. పూజగది లేదసలు ? ఇంట్లో పూజగది ఉందా అంటే ఎందుకు అంటాడు వాడు. దైవము, దివ్యము, దివి ఇవన్నీ వెలుగుకి సంబంధించిన పదాలు. వెలుగుకి సంబంధించినటువంటి కేంద్రాలున్నాయి. ఏడులోకాల్లోనూ branch offices ఉంటాయి. మనిషి శరీరంలో ఏడులోకాలు కదా! ఏడు లోకాల్లోనూ అద్భుతంగా పని చేసే వెలుగు కేంద్రాలు ఉంటాయి. అన్ని branches తెరచి, అన్నీ active గా ఉంటాయి. వాటన్నిటి head-office లో ఈయన కూర్చుంటాడు. ఒక Eminent managing director అన్నమాట. అది

శూరసేనుడంటే. వీరులందరినీ సేనగా కలిగిన వాడుగా కూడా చెప్పకోవచ్చు. కానీ మనకి తాత్త్విక చింతనంగా, ఆధ్యాత్మిక పరంగా చెప్పకున్నప్పడు మనలో అమోఘమైన వెలుగు కేంద్రాలు, సేనలు ఉన్నాయి. అవి భగవత్ కార్యములు చేసినప్పడు విజృంభించి మనలో పని చేస్తాయి. అవే దేవతా శక్తులు! అలాగే అసురీశక్తులున్నాయి. సుర పనిచేయకపోతే  అసుర శక్తులు బస చేస్తాయి. మూసేస్తాయి అన్నీ. వాళ్ళ office మూసేసి తమ office తెరిచేస్తారు. Building అదే! అందులో అంతకు ముందు police ఉంటే ఇప్పడు naxals ఉన్నారు అన్నట్లుంటుంది. అక్కడ నుండి రోగాలు. ఆ రకం రోగాలు వచ్చి ఏం చేస్తాయంటే buildings పడగొట్టేస్తాయి. అదే శరీరం శిథిలమైపోవడం అంటే. అందుకని ఈయన దేనికి అధిపతి ఇక్కడ? శూరసేనులకు అధిపతి. వెలుగుకేంద్రాల సమూహమునకు అధిపతి. మనలో హృదయమునందుంటాడు. ఆజ్ఞయందు మేల్కాంచి ఉంటాడు. హృదయము నందు ఉపస్థితుడై ఉంటాడు. అందుకని హృదయము, ఆజ్ఞ, ఈ రెండింటి యందు ఎక్కువ ఆరాధన చేసుకుంటూ మేల్కొలుపుకుంటే అక్కడ నుండి మిగతా కేంద్రాలన్నీ కూడా మేల్కాంచుతాయి. అట్లా చేసుకోవాలి. అందుకు ఆరాధన చేసుకోవాలి. అది రోజూ శరీరంలో దీపం పెట్టుకున్నట్టు. బయట దీపాలు, లోపల కూడా దీపాలు వెలగాలనే ఉద్దేశ్యముతో పెడతాము. పాపాలు తొలగిస్తుంది, దీపాలు వెలుగుతాయి. అందుకని దీపాలు పెడతాము. దీపం పెట్టి నప్పడల్లా లోపల కూడా దీపం వెలగాలని భావన చేసుకుంటూ పెట్టాలి. 'ఎన్నో పెట్టానయ్యా ఇంకా వెలగలేదయ్యా. వెలిగించు' అని కోరుతూ ఉండాలి.

## ౭౩౨ యదుశ్రేష్ఠః

యదువీరులలో శ్రేష్ఠుడు. యదువంశంలో ఇంత కన్నా మించిన వాడు లేడు కదా! యదు వంశం ఏమిటీ మొత్తం సృష్టిలోనే లేడు. శ్రీకృష్ణుడి లాంటి వాడు ఇంక పుట్టడని కూడా ఋషులు చెప్తున్నారు. 'ప్రశ్నలేదు. ఒక్కసారి రుచి చూపించడానికి వచ్చాడు. అటువంటి వాడు ఇంతకు ముందులేడు, ఇక ముందురాడు' అని చెప్తున్నారు. మాకు చాలు ఆ స్ఫూర్తి. ఆ స్ఫూర్తి అట్లా భూమి మీద ఇంకా రుచిగానే ఉంటుంది. శాశ్వతంగా ఉంటుంది. కాబట్టి ఇక ఆ స్ఫురణ చాలన్నట్టుగా చెప్పకుంటారు, ఋషులు, గోపికలు. యదుశ్రేష్ఠః అని అనడం లో మరి ఇంత కన్నా ఎవరూ లేరు అని అర్థం. తర్వాత వస్తారేమో? వసుదేవుడు, బలరాముని కన్నా ముందు కదా! వసుదేవుడు ఉత్తమోత్తమమైన భాగవతుడు, ఏమీ సందేహము లేదు. కాబట్టే మరి ఇటువంటి వాడ్ని పట్టుకురాగలిగాడు, అసలు తత్త్వాన్ని. కాబట్టి ఈయన యదుశ్రేష్ఠుడు అని చెప్పడానికి మనం వివరణ ఏమీ చెప్పకోనక్కరలేదు. 'యదు' అన్న శబ్దానికి సంఖ్యాశాస్త్రంలో 11 అంకె. అదొక్కటి గుర్తు పెట్టుకోండి. పనికి వస్తుంది. 11th August మాష్టారు పుట్టారు. 11th August Madam Blavatsky పుట్టారు. Mayan civilisation లో 11th August కి ప్రత్యేకమైన స్థానమున్నది. 11 అంకె ఏకాదశరుద్రుల్ని తెలుపుతుంది. ఎదురుగా ఉండి ఆయన్ని చూసి కదా ఈయన చెప్తున్నాడు నామాలు. కాబట్టి యదుశ్రేష్ఠః.

## ౭౩౩ సన్నివాసః

ఎవరు సన్నివాసులు? సత్యంలో జీవించే వాళ్ళు. వాళ్ళల్లో ఈయన జీవిస్తూ వుంటాడు. వీళ్ళెవరయ్యా అంటే గోపికలు అని అర్థం. గోపగోపీజనాలు. వాళ్ళకన్నా ఎవరూ అనుభవించిందీ లేదు, వాళ్ళకన్నా దర్శించిందీ లేదు, వాళ్ళకన్నా అనుభూతి పొందిందీ లేదు, కృష్ణుడి గురించి. వాళ్ళందరితో చాలా చక్కగా నివసించినవాడు. నిజానికి శ్రీ కృష్ణుడు పూర్ణమైన అనుభవాన్నిచ్చినా, పరిపూర్ణమైన వైభవాన్ని చూపించినా ఆ వ్రజంలో చూపించిందే! మిగతాదంతా తత్త్వం చెప్పాడు, యోగం చెప్పాడు. Serious గా ఉంటాయి తర్వాత నుండి subjects అన్నీ. ఇక్కడ ఈ పిల్లలతో వున్నప్పుడు వున్నదే లెక్క! కృష్ణుని బాలక్రీడలలో ఉండే తత్త్వం, లోతు, ఆనందం, మాధుర్యం, అనుభూతి ఇంక మిగతా సన్నివేశాల్లో లేవు.

# 734 సుయామునః

అంటే యమున మార్గం పట్టి ఉంటాడటండీ ఎప్పుడూ. ఎందుకని? యమునా మార్గంలో వీళ్ళుంటారు. యమున ఒడ్డున కదా వీళ్ళంతా చేరుతూ ఉంటారు! వాళ్ళ కోసం ఈయన చేరుతూ వుంటాడట అక్కడికి. అందుకనే యమున ఒడ్డుకెళ్ళబోకండి, పిచ్చి వాళ్ళయిపోతారు అని కొన్నిచక్కటి పాటలు భక్తులు వ్రాసినవి ఉన్నాయి. అక్కడే గోపికలు వాళ్ళూ వేచి వుంటారు. వాళ్ళకేంటంటే ఆయన తప్ప ఏమీ అక్కరలేదు. ఇంక మిగతావన్నీ అసలు లేకపోయినా లేవని కూడా తెలియదు వాళ్ళకి. వాళ్ళ పరిస్థితి అది. వాళ్ళ వెంబడి ఈయన. సుయామునః అంటే చక్కటి యమున ఒడ్డున అట్లా తిరుగుతూ వుంటాడట. యమున అంటే పింగళ నాడి. మనని ఊర్ధ్వముఖంగా తీసుకుని వెళ్ళేటటువంటిది. 'గంగ' అనే పదానికి అర్థంగా రెండు ప్రవాహాలు మనలో ఉన్నాయి. ఒక ప్రవాహం సూక్ష్మం నుండి స్థూలానికి వస్తూ వుంటుంది. అంటే దైవం నుండి ఈ ప్రకృతిలోకి వస్తూ వుంటుంది. రెండవ ప్రవాహం ప్రకృతి నుండి దైవంలోకి వెళ్తూ ఉంటుంది. ఈ రెండు ప్రవాహాలు మనని ఒకటి అథోముఖంగా, ఒకటి ఊర్ధ్వముఖంగా వెళ్ళేవి వుంటాయి. అందులో అథో ముఖంగా వచ్చేది ఇడానాడి. ఊర్ధ్వముఖంగా వెళ్ళేది పింగళనాడి. కాబట్టి కృష్ణుడు ఎక్కడుంటాడు? పింగళనాడి దగ్గర ఉంటాడు. పింగళనాడి పట్టుకుపోయే వాళ్ళు అంటే ఊర్ధ్వముఖంగా వెళ్ళేది యమున అని. యమున ఎవరి నుండి పుట్టింది? కుడికన్ను గుడ్డు లోపలి నుండి హృదయంలోకి ఒక లోయ వున్నది. అదే కాళింది మడుగు. కుడి కన్ను గుడ్డులోంచి పింగళనాడి యొక్క ప్రసారం అలా హృదయం వరకూ వెళ్తుంది. అక్కడుందిట కాళింది మడుగు. అందులోకి పోయాట్ట కృష్ణుడు. కుడి కన్ను ఏమిటి? సూర్యుడు. ఎడమ కన్ను చంద్రుడు. మూడో కన్ను అగ్ని. అందులోంచే ఈ రెండూ వచ్చినాయి. యమున సూర్యుడిలోంచి పుట్టిందని పురాణాలు చెప్తున్నాయి. సూర్యుడి నుండి సరాసరి దిగి వచ్చిన నది యమున. అంటే అర్థమేమిటీ? ఆత్మ చైతన్యము యొక్క ప్రవాహము అని. దాని ఒడ్డునే పడి వుండే వాళ్ళెవరు? సన్యాసః! భక్తులు! యోగం ద్వారా భగవంతుని చేరుకుందాం అనే తపన చెందే వాళ్ళు, వాళ్ళు. కనుక వాళ్ళ దగ్గరే ఈయన ఉంటాడట. అక్కడే తిరుగుతూ వుంటాడట. యమునానది ఒడ్డున క్రింద నుండి పైకి, పై నుండి క్రిందకు అట్లా సంచారం చేస్తూ ఉంటాడట, శ్రీకృష్ణుడు. యోగపరంగా సత్యం! కృష్ణుడి యొక్క జీవితపరంగా కూడా సత్యమే! అదీ సుయామునః! అక్కడే తచ్చాడుతూ ఉంటాడుట, వీళ్ళకోసం. వాళ్ళేమో ఈయన కోసం తచ్చాడుతూ ఉంటారు. ఇద్దరూ వెతుక్కుంటూ ఉంటారు. వీళ్ళకోసము ఈయన, ఈయన కోసం వాళ్ళూ తిరిగే ప్రదేశం యమున. అక్కడ ఉంటాడు.

సన్నివాసః, సుయామునః. ఇది ఈ శ్లోకానికి ఒక సంగ్రహమైన, క్లుప్తమైన తెలుగు వివరణ.

## 735 భూతావాసః

భూతావాసః అంటే భూతములుకు, అంటే పంచభూతములకు ఆవాసమైనవాడు అంటే నిలయమైన వాడు. పంచభూతములు ఆయన నుండి వ్యక్తమై, అవి ఆధారంగా సమస్తమైన జీవులూ వ్యక్తం అవుతాయి. ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వి ఈ ఐదింటితో మనకు ఆకారములు ఏర్పడుతూంటాయి. ఇందులో ఆకాశ శరీరమైనది శాశ్వతమైన శరీరము. మిగతా శరీరములు వచ్చి పోతూంటాయి. జీవుడు ఈ పంచభూతాలకి అతీతమైన ప్రజ్ఞ. అతనికి దేహదర్పణ, అంటే తనే ఇన్నిగా దిగి రావడానికి, పంచభూతాలనూ ఆధారం చేసుకుని దిగివస్తాడు. పంచభూతాలలో తాను నివసించి ఉంటాడు. తన నుండి వ్యక్తమవుతున్న పంచభూతముల నుండి తాను వ్యక్తమవుతూంటాడు. సృష్టిలో ఈ రహస్యం ఒకటి మనము బాగా గమనించాలి. భగవత్తత్త్వం నుండి ఒక వాహిక ఏర్పడి, ఆ వాహిక నుండి మళ్ళీ తానే వ్యక్తం అవుతూంటాడు. వ్యక్తం అయిన దాని నుండి మళ్ళీ వ్యక్తమవుతూంటాడు. అట్లా గొలుసుకట్టుగా మొత్తం సృష్టి అంతా కూడా నిర్మాణం చేసుకుంటూ ఉంటాడు. తనే ఉపాధి, తనే ఉపాధి యందు నివసించే తత్త్వమూ! రెండూ తానే! అంటే నీరు మంచు గడ్డ అయితే, మంచుగడ్డతో ఒక పాత్ర తయారు చేస్తే, ఆ మంచుగడ్డతో తయారైన పాత్రలో మళ్ళీ నీరే వున్నట్లు అన్నమాట. ఇందులో ఏదీ భగవంతుడు కానిదేది కాదూ, లేదూ. భగవంతుని చూడదలచుకుంటే సమస్తమునందూ ఆ విధంగా దర్శించవచ్చు. 10వ అధ్యాయంలో భగవద్గీత లో చాలా ప్రస్ఫుటంగా శ్రీకృష్ణ భగవానుడు మనకు అందించాడు. దానినే మనం భావన చేయాలి. మనకి ఒక సంకల్పం వచ్చిందనుకోండి, సంకల్పంలోంచి మళ్ళీ మనమే వ్యక్తమవుతాం. మన సంకల్పం మనకు ఉపాధిగా వచ్చి, ఆ సంకల్పం నుండి మనం వ్యక్తమవుతూంటాం. మన నుండి స్పందనము వచ్చి, స్పందనము నుండి మనం వ్యక్తమవుతూంటాం. భగవంతునికి ఋషులు రకరకాలుగా దర్శనం చేసి, భగవంతుని యొక్క తత్త్వాన్ని బట్టి, ఒక్కొక్క రకమైన లక్షణాన్ని బట్టి, ఒక్కొక్క రకమైన వాహనాన్ని కూడా ఇచ్చారు. వాహనము అంటే వాహిక అని అర్థం. మాస్టర్ CVV గారు చెప్పిన మార్గంలో mediums అని అర్థం. మాస్టర్ చైతన్యమునకు వాహికగ నిలబడ్డం కదా? అంటే జీవుడు భగవంతుని యొక్క ఉపాధి లేక వాహిక లేక వాహనము. భగవంతుడు వ్యక్తం కావాలంటే జీవుడి ద్వారా వ్యక్తం కాగలడు. పంచభూతాలలో ఎందులోంచి అయినా వ్యక్తంకాగలడు. ఏ జీవిలో నుంచైనా వ్యక్తం కాగలడు. మానవుని నుండి సులభంగా వ్యక్తంకాగలడు. కాబట్టి ఏమీ లేనట్లుగా కనబడుతున్న తత్త్వంలో నుండి మహత్తు పుట్టి, అందులో నుండి పంచభూతాలు

పుడితే, ఆ పంచభూతాల ఆధారంగా తానే మళ్ళీ దిగివస్తూ ఉంటే, ఇంతమంది జీవులు ఉన్నట్లుగా కనిపిస్తుంది. 'ఇంతమంది జీవులు ఉన్నట్లుగా కనిపించడమే తప్ప వున్నది నేనొక్కడినే' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. ఇది మనకి ముఖ్యమైన భావన! ఇన్ని విధములుగా కనిపిస్తున్న దాంట్లో ఏకత్వం దర్శనం చేయడం ఒకటే సాధన! అది అంతర్ముఖంగా అయినా, బహిర్ముఖంగా అయినా సాధన ఒక్కటే. మనయందు భావన కలిగి, ఆ భావనయందు మనము నిలబడి ఉంటాము. రకరకములైన భావములు వస్తూ ఉంటాయి. ఎన్ని రకములైన భావనలు వస్తే అన్ని రకములైన మాటలు, చేతలు ఉంటాయి. కానీ ఇవన్నీటికీ పుట్టుక స్థానం మనసే కదా? అలాగే ఈ కనబడుతున్న సమస్తమైన జగత్తు దృశ్యమాన జగత్తు అంటారు. అది పంచభూతముల చే నిర్మాణం చేయబడింది. అంటే పంచభూతాలు తన నుండి వ్యక్తం అయితే, వాటి నుండి మళ్లీ తానే వ్యక్తం అవుతూ ఉంటే, అందుకే మనకు ఏమి చెప్పారు అంటే, ఋగ్వేదం నుండి సామవేదం పుడితే, సామవేదం నుండి యజుర్వేదం పుడితే, యజుర్వేదం నుండి అధర్వణవేదం పుట్టింది అంటారు. ఋగ్వేదం నుండి సామవేదం పుట్టిందా? సామవేదం నుండి ఋగ్వేదం పుట్టిందా అనేది ఇంకా తేలలేదు. దాని గురించి భావన చేస్తే, మనం ఉండడం వల్ల సంకల్పం వచ్చిందా? సంకల్పం వచ్చిన తర్వాత మనం ఉన్నామా? మనం ఉండడం వల్లే సంకల్పం వచ్చింది అని మనకు తెలుస్తుంది. మనం లేకపోతే సంకల్పం లేదు. అసలు మనం ఉండడమే ఇంకొక సంకల్పం ఆధారంగా వచ్చాం. అందుకనీ ఉండడం అనేది సామవేదం అయితే, ఉచ్ఛరించపడడం/వ్యక్తం అవడము ఋగ్వేదం. ఎప్పుడు ఉచ్ఛరించినా అంటే వ్యక్తం అవడం అనేది ఋగ్వేదం. మొట్టమొదట ఉండడం ఉండి, అందులోంచి సంకల్పం వ్యక్తమయితే, వ్యక్తమైన సంకల్పం లోనించి మళ్లీ ఉండడంగా మనం అంతా వచ్చాం. అసలు ఉండడం నుండి మొదటి సంకల్పం వస్తుంది. ఆ మొదటి సంకల్పం నుండి మనమంతా వచ్చాం. అందుకని మనకి ఆ మొదటి సంకల్పమే అమ్మవారు, లేక గాయత్రి అంటాం ,లేకపోతే పరాశక్తి అంటాం, మూల ప్రకృతి అంటాం. అందులోంచి మనం దిగి వచ్చాము. కాబట్టి ఋగ్వేదం నుండి సామవేదానికి వెళ్ళడం ఒకటి. అసలు ఋగ్వేదంలోకి వెళ్లాలి అంటే సామవేదం లో ఉండాలి కదా? అంటే మనలో స్పందన ఉండాలి కదా? మనలో స్పందనాత్మక చైతన్యంగా సామవేదం ఉన్నది. మనలో తలంపులు అట్లా నిర్విరామంగా వస్తూనే ఉంటాయి కదా? అది ఋగ్వేదముగా ఉన్నది. ఋగ్వేదం ఏం చెప్తుందంటే వచ్చే తలపులు ఎటుపక్క నుండి వచ్చినా, తూర్పు నుండి వచ్చినా, పడమటి నుండి వచ్చినా, ఉత్తరం నుండి వచ్చినా, దక్షిణం నుండి వచ్చినా, పైనుండి వచ్చినా, కింద నుండి వచ్చినా అన్ని పక్కల నుండి వచ్చే భావములు సద్భావములై ఉండాలని కోరమని చెప్తుంది. ఎందుకంటే

ఎలాగూ రావడం తప్పదు. మనము లేచిన దగ్గర నుండి ఋగ్వేదమే. కానీ, మనము ఋగ్వేదం నిర్వర్తించడానికి కావలసినది సామవేదం అంటే స్పందనము! అది లేకపోతే మనము లేము. ఉండడం ఆధారంగా వ్యక్తం అవ్వడం అనేది ఉంటుంది. అందుకనే భగవంతుడు అయిన విష్ణు మూర్తి కూడా గరుత్మంతుడు ఆధారంగా తిరుగుతూ ఉంటాడని చెప్తారు. గరుత్మంతుడు స్పందనాత్మకమైన చైతన్యం అయితే, విష్ణుమూర్తి సర్వవ్యాపకమైన చైతన్యం గా భావన చేస్తారు. అలాగే మనలో, మనం రెండురకాల తత్త్వాలు జమిలిగా కలిసి ఉన్నటువంటి వాళ్ళం. ఒకటి సంకల్పములు వాటిని నిర్వర్తించుకోవడం, రెండవది అవి నిర్వర్తించబడడానికి మనలో ఉన్న స్పందనం. ఈ ప్రాణస్పందనాన్ని శివ చైతన్యంగా తీసుకుంటే, ప్రణాళిక వ్యక్తం అవడాన్ని విష్ణు చైతన్యంగా తీసుకోవచ్చు. ఏది కారణంగా మనం పరుచుకుంటూ కార్యక్రమాలు చేస్తున్నామో అది విష్ణు చైతన్యం అయితే దానికి ఆధారంగా స్పందనాత్మక చైతన్యం ఉంది. అందుకే మనకి ప్రాణానికి, ఆయుర్దాయానికి, ఆయుష్షుకి శివప్రార్థనలు ఇచ్చారు. జ్ఞానమునకు, వికాసమునకు, వ్యాపనముకు, అనుభూతికి, వైభవమునకు, సమస్తమునకు విష్ణు ప్రార్థనలు ఇచ్చారు. అంటే ఒకటి తేజస్సు, ఇంకొకటి ప్రాణము. ఈరోజు గురుపౌర్ణమి. గురువు అంటే సమస్తమునకు ఆధారభూతమైన వాడు అని అర్థం. సమస్తమునకు ఆధారభూతమైన తత్త్వమును మన పెద్దలు ఉపనిషత్తుల్లో 'బ్రహ్మము' అని చెప్పారు. మరియొక విధంగా ఏం చెప్పారంటే దానికి పేరేమీ పెట్టలేం కాబట్టి 'తత్' అని చెప్పారు, 'అది' అన్నారు. 'అది' నుండి వ్యక్తం అయింది అన్నారు. ఆ 'అది' అన్నమాట కి సంస్కృతం లో పదం 'తత్'. దాని గురించి చెప్పేదంతా తత్త్వం. బ్రహ్మము లేక 'తత్' దాని నుండి మనకి ఒక పురుష ప్రజ్ఞగా, ఒక స్త్రీ ప్రజ్ఞ గా రెండు పాయలుగా వ్యక్తం అవుతూంది అని చెప్పారు. అందులో ఒకటి ప్రాణం అయితే మరి యొకటి చైతన్యం. ప్రాణం ఆధారంగా చైతన్యం అల్లుకుంటూ వెళ్లిపోతుంది. చైతన్యం ఆధారంగా ప్రాణమునకు వైభవం వస్తూ ఉంటుంది. అందుకని ప్రాణం ఏమో శివుడన్నారు. దాని మీద, దానికి జరిగే వైభవం అంతా విష్ణువు అన్నారు. అసలు గురువు ఎవరు? శివుడా, విష్ణువా? శివుడికి, విష్ణువుకి, ఇద్దరికీ మూలమైన వాడు ఎవడైతే ఉన్నాడో వాడు. వాడిని ఏమన్నారు అంటే ఒక భాషలో 'నారాయణుడు' అంటారు, ఇంకొక భాషలు 'పరమశివుడు' అంటారు. వేదాంతులు పరబ్రహ్మమంటారు. శాక్తేయులు 'పరాశక్తి' అంటారు. పరా అంటే beyond అని అంటే మన అవగాహనకు మించి, మన పుట్టుక కు కూడా దాటి ఉన్న స్థితి ఏమైతే ఉందో, దానినే 'సత్యం' అని కూడా అంటారు. అది గురువు! ఎందుకని? ఎక్కడ నుండి అన్నీ పుట్టుకొని వచ్చాయో, దేనికి పైన ఇంక ఏదీ లేదో, ఆ తత్త్వాన్ని గురువు అంటారు. ఆ తత్త్వాన్ని అందించే వ్యక్తిని కూడా గురువు

అంటారు. గురువంటే విష్ణువా? గురువు అంటే శివుడా? గురువు అంటే హనుమంతుడా? మన భారతీయులకు ఉన్న పెద్ద సమస్య ఏమిటి అంటే, ఒకే విషయాన్ని వెయ్యి రకాలు గా చెప్పేసరికి మనకి వెయ్యి ఉన్నట్టుగా అనుకుంటున్నాము. వెయ్యి లేవు. వైష్ణవ సాంప్రదాయంలో ఉన్నవారి దగ్గరికి వెళ్తే వారు 'నారాయణుడు' అని చెప్తారు. శైవ సాంప్రదాయంలో ఉన్న వాళ్ళ దగ్గరికి వెళ్తే వాళ్ళు 'పరమశివుడు' అని చెప్తారు. శివుడు ఒక్కడే గురువు అని చెప్తారు కదా? విష్ణువు ఒక్కడే గురువు అని చెప్తారు కదా? ఇదంతా కాదండి అమ్మవారు అంటారు కదా? ఏదైతే ఏంటి పేర్లే కదా? అసలు ఉన్న విషయం ఏమిటి? సృష్టికి కాకముందు, సృష్టి అయిన తర్వాత ఉన్నది. అంటే మనకు భావములు రాకముందూ ఉన్నాం, భావములు వచ్చిన తరువాతా ఉన్నాం. ఉండబట్టే కదా భావములు. భావములు అనే పొరల్లో ఉండేటప్పుడు ఉన్నామనేది మర్చిపోతాం. నాటకరంగంలో రంగం మర్చిపోతాం కదా, అక్కడ ఉన్న సన్నివేశం జరుగుతూ ఉంటే! కాబట్టి ఇన్ని సన్నివేశాలకి ఏది ఆధారభూతమో దానిని 'గురువు' అన్నారు. అందులోంచే అన్నీ దిగి వచ్చినాయి. దానికి పేరు లేదు, దానికి రూపం లేదు, ఏ పేరైనా పెట్టుకుని పిలవచ్చు, ఏ రూపమైనా పెట్టుకుని పిలవచ్చు. కానీ ఆ రూపం ఒక్కటే కాదు అని గుర్తుండాలి. ఆ నామం ఒక్కటే కాదు అని గుర్తుండాలి. అలా కాకపోతే మనం ఒక వెర్రిలో పడిపోతాం. అటువంటి వెర్రిలో పడకూడదని మాస్టర్ గారు, 'అంతర్యామి .. అంతర్యామి .. అంతర్యామి' అని మాటిమాటికీ గుర్తు చేస్తూ వచ్చారు. అంటే ఎవరు ఆధారంగా, విష్ణువు అన్నాము అనుకోండి విష్ణువు లోపల ఉన్న స్పందనత్మకమైన చైతన్యం గురించి చెప్తారు. శివుడు అన్నాము అనుకోండి, త్రిగుణాత్మకమైన సృష్టిలోకి వచ్చేటప్పుడు వీళ్ళు ఉంటారు. త్రిగుణానికి అతీతముగా సత్యం ఉన్నది. అంటే సంకల్పించడంకన్నా ముందే మనం ఉన్నాం కదా? అది తెలుసుకుంటే సత్యం తెలుసుకున్నట్టు అవుతుంది. అది ఎవరు తెలుసుకుంటారో వాళ్ళు దాని గురించే ఎక్కువ ఇతరులకు అందించడానికి ప్రయత్నం చేస్తారు. సత్యాన్ని అందించడం అంటే, త్రిగుణాత్మకమైన చైతన్యానికి అవతల ఉన్న శుద్ధ చైతన్యం నందు నిలబెట్టడం. ఆ చైతన్యమునకు ఆధారభూతమైన సత్యమందు నిలబెట్టడం, దానికి దారి చూపించడం. ఈ దారి చూపించడానికి ఏవో మాటలు చెప్పాలి కాబట్టి, మాటలు చెప్పినప్పుడు ఒక్కొక్కసారి ఒక్కో రకంగా వస్తాయి. ఆ పదాలు పట్టుకుని వేలాడడం కన్నా, పదములు యొక్క అర్థములు పట్టుకుని వెళ్లినట్లయితే, మనం మార్గంలో ఉండే అవకాశం ఏర్పడుతుంది. ఈ గురుపౌర్ణమి ఒక ప్రత్యేకమైన ఆశీర్వచనం ఇచ్చే గురుపౌర్ణమి. ఎందుకంటే కర్కాటక రాశి లేక ఆషాడమాసంలో సూర్యుడు ఉన్న సందర్భంలో, మనకి మీనరాశిలో బృహస్పతి ఉన్నాడు. మీనరాశిలో బృహస్పతి స్వక్షేత్రంలో ఉంటాడు. బృహస్పతి గ్రహం ద్వారా

గురుతత్త్వం అందుతూ ఉంటుంది. ఆయన శుభకోణ అంటే కోణ దృష్టితో కర్కాటక రాశిని చూస్తూ ఉన్నాడు. 12 సంవత్సరాలకి ఒకసారి ఇటువంటి అవకాశం ఏర్పడుతూ ఉంటుంది. ఎందుకని అంటే  మీనంలో ఉన్న బృహస్పతి తన మిత్ర మరియు ఉచ్ఛ రాశి అయిన కర్కాటక రాశిని చుస్తున్నడు. కాబట్టి గురుడు తన ఉచ్ఛ రాశి అయిన కర్కాటక రాశిలో ఉన్న సూర్యుని ద్వారా, అక్కడ నుండి చంద్రుడు ద్వారా, చంద్రుడు నుండి మనకి, ఈ వెన్నెలద్వారా, తన యొక్క తత్త్వాన్ని అందించే సమయం ఈ రాత్రి 9:30 గంటలకు, పౌర్ణమి ఘడియలు, మనకి అనుగ్రహవసాత్తు అది మనకి ధ్యాన సమయంలో వచ్చింది. దానిని అనుభూతి చెందాలి. అలాగే మొన్న జరిగిన ఏకాదశి ఆదివారం చాలా అత్యంత వైభవముతో కూడిన పర్వదినము. అందుకనే గోచారం చూసుకోవాలి అని పెద్దలు చెబుతారు. జ్యోతిష్యం అంతా తెలియక్కరలేదు లేదు గాని, ఏ రాశిలో ఏ గ్రహం నడుస్తోంది అని అంతవరకు చూసుకోవాలి. చూసుకుంటే ఏం తెలిసిందంటే మనకి, మీనరాశిలో బృహస్పతి వుండగా, కర్కాటక రాశిలో సూర్యుడు ఉండగా, వృశ్చిక రాశిలో చంద్రుడు ఉన్నాడు. అనురాధా నక్షత్రం, జ్యేష్ఠ. ఆ సమయంలో మనకి ఏకాదశి వచ్చింది. అందుకనీ ఈసారి తొలి ఏకాదశినాడు, There is a grand triangle అంటాం. అంటే అద్భుతమైన ఒక త్రికోణము. ఒక త్రిభుజం! ఆ త్రిభుజం, గురువు యొక్క అనుగ్రహం పరిపూర్ణంగా ప్రసరించేటట్లుగా ఏర్పడింది. అలాగే ఈ గురుపౌర్ణమినాడు కూడా మనకి గురువు మీనరాశిలో ఉండడం చేత, కర్కాటక రాశి గురువు యొక్క ఉచ్ఛ స్థానం అవడం చేత, మనకి ఈ పౌర్ణమికి కొంచెం ఎక్కువ లోతు అయిన ప్రభావం ఉన్నది. ఈ గురుపౌర్ణమికి. మళ్ళీ ఇటువంటి గురుపౌర్ణమి కావాలి అంటే 12 సంవత్సరాలకిగానీ రాదు. ఎందుకంటే మళ్ళీ మీనరాశికి గురువు రావాలంటే 12 సంవత్సరాలు పడుతుంది కాబట్టి. వృశ్చికంలో ఉండే గురువు కూడా, కర్కాటక రాశి తో కోణ దృష్టితో ఉన్నప్పటికీ కూడా, వృశ్చిక రాశిలో ఉన్న గురువు కన్నా మీన రాశిలో ఉన్న గురువు ప్రభావం చాలా ఎక్కువ. కాలం మనకు ఏమి అందిస్తోందో దాన్ని బుద్ధిమంతుడు అయిన సాధకుడు, చక్కగా అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకుంటాడు. అందుకోసం మనకీ జ్యోతిష్యంలో పాండిత్యం అక్కర్లేదు కానీ, ప్రవేశం ఉంటే బాగుంటుంది. అందుకని ఈ పౌర్ణమికి అటువంటి మహదావకాశం ఉన్నది. సమస్తానికి ఆధారమైన తత్త్వమే గురువు. గురువంటే అర్థం ఏమిటంటే అన్నిటికన్నా పెద్దవాడు. అంతకన్నా పెద్దది ఏదీ లేదు. ఏమి వచ్చినా అందులోంచి రావాల్సిందే, శక్తి వచ్చినా అందులో నుండే వచ్చింది, కాలము వచ్చినా అందులో నుండే వచ్చింది, ప్రకృతి వచ్చినా అందులో నుండే వచ్చింది. ఒకటి గుర్తు పెట్టుకోండి, ఆ మూలం నుండే మూడు ఒక్కసారి వచ్చినాయి. కాలము, శక్తి, ప్రకృతి!  కాలచక్రములో శక్తి  ప్రకృతి మీద చేసిన

రసాయనిక చర్య వల్ల సృష్టి అంతా వస్తుంది. అందుకనీ మొదటి త్రిభుజం కాలము- శక్తి- ప్రకృతి. ఈ మూడు ఎవరి ఆధారంగా వచ్చినాయి? ఏమి లేకపోతే ఎక్కడి నుండి పుట్టుకు వస్తాయి? పుట్టుకు రావాలంటే ఏదో ఒక మూలం వుండాలి కదా! పుట్టుకు వచ్చిన తర్వాత అది కనబడదు. పుట్టుక రాకముందు అది వున్నప్పటికీ, మనం వుండం కాబట్టి దాన్ని చూడలేం. అందుకని 'అది ఒకటి వుండి వుండాలి' అని తెలుసుకున్నారు. ఎలా తెలిసిందంటే నిద్రలో మనం వుండి వుంటాం, అని అనుకుంటాం కదా? నిద్ర పోయేవాడికి తాను ఎట్లా నిద్రపోయాడో తెలియదు. బాగా నిద్ర పోయాడు అని లేచిన తర్వాత తెలుస్తుంది. నిద్ర పోతున్నప్పుడు తాను బాగా నిద్రపోతున్నాను అని తెలిసి వుంటే నిద్ర కాదది కదా? కానీ తాను లేచిన తర్వాత, నిద్రలో తాను ఉండి ఉండే ఉంటాడు అని మెలకువ వచ్చిన తర్వాత రూఢిగా నమ్ముతున్నాడు కదా? అట్లాగే మొదటి సంకల్పం బయటకు వచ్చిన తర్వాత, ఏం జరుగుతుందంటే అంతవరకూ నిద్ర పోతున్న దేవతలు బయటకు వచ్చారు. బయటకు వచ్చాక ఎందులోంచి వచ్చారో దాన్ని ఆరాధించడం మొదలు పెట్టారు. దాన్నే వినియోగించుకుని సృష్టిగా తయారు చేయడం మొదలు పెట్టారు. కాబట్టి గురువు, అంటే ఆ తత్త్వం అని గుర్తు పెట్టుకోవాలి. మనకి 'మాస్టర్' అని మనకు మాస్టర్ CVV గారు చెప్పింది కూడా ఆ తత్త్వం గురించే! ఆ తత్త్వము ఎవరి యందు ప్రస్ఫుటముగా వ్యక్తమై వున్నదో, ఎవరి నుండి ఆ తత్త్వములోకి మనము ప్రవేశించగలమో ఆ వ్యక్తిని కూడా గురువు అని పిలవడం మొదలుపెట్టాం సాంప్రదాయంలో. ఎందుకంటే ఆ అంతర్యామి తత్త్వంలోకి, ఆ పరతత్త్వం లోకి నీవు చేరగల మార్గాన్ని ఇవ్వగలిగిన జ్ఞాని, యోగి, భక్తుడు ఎవరైతే వుంటారో అతడిని కూడా 'అదే' అన్నారు. ప్రహ్లాదుడు కూడా చెప్పింది అదే. 'కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు', ఈ సమస్తమూ ఉందే సృష్టి, దానికి ఎవరు మూలాధారమో, వాడి గురించి తెలియ చెప్పేవాడు, వాడికి దారి చూపించే వాడు మాత్రమే గురువు సుమా! కాబట్టి అటువంటి గురువును పొందడానికి ఈ గురుపౌర్ణమి. అది మనయందు కూడా ఉన్నది. మనం ఉండడం అంటే అది ఉండడమే! దానినే 'సత్యము' అని అన్నారు. మనం ఉన్నాం, ఉన్నాం అనుకుంటున్నాం కదా? లేమనుకోవట్లేదు కదా? మనం ఉండడం అంటే ఆ తత్త్వం ఉండడమే! అందులో నుండి మనం లేస్తాం మన ఎరుకగా! ఆ లేవడం కూడా ఆయన నుండి వ్యక్తమైన చైతన్యమే! అందులో నుండి భావములు, మన శరీరమునకు ఉన్న తత్త్వములు బట్టి ఏర్పడుతూ ఉంటాయి. అందుకనీ, గురుతత్త్వం అవగాహన చేసుకుని, గురు మార్గంలో నడుద్దాం అనుకున్న వాళ్ళకి గమ్యమేమిటయ్యా? లక్ష్యం ఏమిటయ్యా? అంటే పరతత్త్వము! ఆ పరతత్త్వము, సమస్తమునందు వ్యాపించివున్నది. చెట్టులో వున్నదా? అంటే చెట్టు లో కూడా వున్నది. చెట్టు వ్యాపనం చెందుతోంది అంటే

చైతన్యము వున్నదన్నమాట. ఒక ప్రణాళిక ప్రకారం వ్యాపనం చెందుతూ ఉంటుంది. ఒక్కొక్క చెట్టు కి ఒక్కొక్క ప్రణాళిక ఉంటుంది. ఒక్కొక్క జంతువుకి కి ఒక్కొక్క ప్రణాళిక. ఒక్కొక్క పని నమూనాలన్నమాట ఈ నమూనాలనే మనకు విభూతియోగం లో భగవద్గీతలో ఇచ్చారు. ఇటువంటి నమూనాలు ఉన్నాయి. ఈ నమూనాల ప్రకారం వస్తూ ఉంటుంది ఈ నమూనాల ప్రకారంపోతూ ఉంటుంది అని చెప్పారు. అటువంటి నమూనాల్లో మొత్తం సృష్టి అంతా కూడా పంచీకరణంగా వ్యక్తం అవుతుందని పెద్దలు దర్శించి ఇచ్చారు. పంచభూతములు, పంచతన్మాత్రలు, పంచేద్రియములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు. ఇట్లా అన్ని 5,5,5,5,5 గా ఇచ్చారు. పంచాక్షరీ మంత్రం, అందుకని 5 pointed star దానిని పెట్టుకుని ఆరాధన చేసుకోవడం, అదొక యంత్రం. భగవంతుడు భూతావాసుడు అంటే ఈ 5,5,5,5,5 గా వ్యక్తమవుతున్న సృష్టి అంతటికీ అసలు ఆయన నిలయం. ఆయన నుండి వ్యక్తం అవుతుంది. మనం భగవంతుడు అనగానే రెండవస్థితికి వచ్చినట్లుగా గుర్తు పెట్టుకోవాలి. భగ అంటే వెలుగు. భగవంతుడు అంటే తాను వెలుగుగా మారిన వాడు అని అర్థం. వెలుగుగా మారడం అంటే అంతకు ముందు ఒక స్థితి వుండి, అందు నుండి వెలుగుగా మారాడన్నమాట. వెలుగక ముందు ఎట్లా వున్నాడో ఎవరికీ తెలియదు. వెలిగిన తర్వాత, అందులో నుండి మిగతావన్నీ వచ్చిన తర్వాత ఆ వచ్చినవి, ఆ వెలుగును చూసి ఇదే మనకు మూలం అనుకున్నారు. అప్పుడిదెలా వెలుగుతోందంటే, వెలక్కముందు కూడా వున్నదీ, వెలిగిన తర్వాత మనకి తెలిసింది. ఉదాహరణగా విద్యుత్తు! Bulb వెలిగిన తర్వాత, fan తిరిగిన తర్వాత, mike వినబడుతూ ఉంటే, విద్యుత్తు వున్నదనుకుంటాం లేకపోతే లేదనుకుంటాం. కాబట్టి ఈ కనబడుతున్న వెలుగుకి మరొకటి ఆధారంగా కనబడకుండా వున్నదని ఎట్లా తెలిసిందో, ఋషులు తపస్సు చేసి అదొకటి వున్నది, అందులో నుండి ఇవన్నీ వచ్చాయి, ఈ వచ్చినవి 3 రకాలుగా వచ్చాయని అని ఒక శాస్త్రం చెప్పారు అది త్రయీ విద్య! 5,5,5,5,5 గా వచ్చాయని పంచీకరణం చేస్తూ ఒకటి చెప్పారు. దానికే భారతంలో ఒక శ్లోకం

పాంక్తంవా ఇదగం సర్వం పాంక్తే పాంక్తేనైవ పాంక్తగ్గ్ స్పృణోతీతి

పంక్తి అంటే 5 అని. అంతా 5,5,5,5,5 గా ఉంది అంటారు. అంతా ౭,౭,౭ గా ఉంది అంటారు. అదే అమ్మవారి పరంగా చెప్తూ అంతా తొమ్మిది తొమ్మిదిగా వుందంటారు. అదే సూర్యపరంగా చెప్తే అంతా ౭,౭,౭ గా వుందంటారు. మీ ఓపిక ఎన్ని రకాలుగా చూస్తే అన్ని రకాలుగా కనిపిస్తుంది. కానీ అసలు తత్త్వం నుండే ఇవన్నీ వ్యక్తం అవుతున్నాయి. ఆ వ్యక్తం అయిన వాటిలోకి మళ్ళీ అదే దిగివస్తోంది. ఇప్పుడిది ఓ వెండి గ్లాసు అనుకోండి, ముందు వెండి వుండబట్టే కదా వెండి గ్లాసు వచ్చింది! వెండి glass ఎట్లా వచ్చింది? వెండే glass గ్లాసుగా మారింది కదా!

లేకపోతే, లేదు కదా? ముడి సరుకు లేకుండా వస్తువు రాదు కదా! అందుకనే, ముడి సరుకే సుమా ఈ పంచభూతాలు అని చెప్పడానికి ఈ భూతావాసః.

## 736 వాసుదేవః

అంటే పంచభూతాలు తన నుండి వ్యక్తం అయితే, మళ్ళీ అందులో ఆయనున్నాడని చెప్పడం. మళ్ళీ మనం మర్చిపోతాం కదా! మనలోంచి వచ్చిన దాంట్లో మనం ఉంటామని మరి మనకి తెలియదు కదా! వుంటాం. మనలో నుండి ఓ కొత్త కారో, కొత్త పట్టుచీరో వచ్చిందనుకోండి, పట్టుచీర మరకపడకుండా, నలగకుండా చూస్తాం కదా! అట్లాగే, కొత్త car అయితే అక్కడ road మీద మనము park చేసినా, ఎవరైనా గీత పెట్టేస్తారేమో అనిపిస్తుంది ఇక్కడ కూర్చున్న వాడికి. అంటే వీడి చేతనలో కొంత ఆ car వరకూ వ్యాపించి వుంటుందన్నమాట. కొత్త చెప్పులు, అవి పోతాయేమో అని అంత వరకు వ్యాపించి ఉన్నావన్నమాట! భగవంతుడు తాను నిర్మాణం చేసిన దాంట్లో తాను నిండి వుంటాడు. అందుకే ఆయన 'యజమాని' అయి ఉన్నాడు. 'మాస్టర్ అయి ఉన్నాడు'. మనం వ్యక్తం చేసిన దాంట్లో మనము అంతంత మాత్రంగా ఉంటాము. ఆయన భూగోళం తయారు చేశాడండి, అందులో అంతటా ఆయన నిండి ఉన్నాడండి. అందుకని ఎక్కడ ముట్టుకున్నా ఆయనకి తెలుస్తుంది.

విశ్వమయతలేని వినియూరకుండిరి
అంబుజాసనాదులడ్డపడక, విశ్వమయుడు విభుడు.

అంతర్యామి అయిన భగవత్తత్త్వము ఉందే, అది దేవతలగా కూడా దిగి వస్తుంది. దేవతలకి ఈ విశ్వమయమయిన జ్ఞానం వుండదు. local గా వుంటారు. ఇప్పుడు మనం ఉన్నాం అనుకోండి, కింద కూర్చుంటే పై floor లో ఏమవుతున్నది తెలియదు, పైన కూర్చుంటే క్రింద floor లో ఏమవుతున్నది తెలియదు. దేవతలకు కూడా వాళ్ల వాళ్ల పరిధులు వాళ్లకి వున్నాయి. ఆ పరిధుల్లో వారుంటారు. ఆ పరిధి మేరకే వారికి జ్ఞానం వుంటుంది. అంతర్యామితత్త్వం నకు సమస్తమూ వ్యాపించిన స్థితి వుండడం చేత ఎక్కడ, ఏమి జరుగుతున్నా ఆయనకి తెలుస్తుంది. ఎట్లా తెలుస్తుందంటే, మన ఒంటి మీద ఎక్కడ చీమ ప్రాకినా మనకు తెలీదూ? జుట్టులో ప్రాకినా, చొక్కా లోపల ప్రాకినా, పాదం మీద ప్రాకినా తెలుస్తోందా? ఎందుకనీ? అది మన శరీరానికి కలిగిన భావన. మొత్తం సృష్టే ఆయన శరీరం అంటే, ఒక గోళం కాదు, ఒక వ్యవహారం కాదు, ఒక సూర్యమండలం కాదు. ఎక్కడ జరిగినా తెలుస్తోంది కాబట్టి, ప్రహ్లాదుడు ఒక విసురు విసురుతాడు, వాళ్ళ నాన్న మీద, ఎక్కడు ఉన్నాడు రా నీ దేవుడు? ఎక్కడ పడితే అక్కడే ఉన్నాడు అని గట్టిగా ఒక పద్యం చెప్పేస్తాడు కదా?

ఇందుగల డందులేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు,
ఎందెందు వెదకి చూచిన అందందే గలడు

అనగానే ready గా, ఇంకొంచం alert అయి ఉంటాడట భగవంతుడు. వాడు అవతలవాడు, మూర్ఖుడు కదా? ఎక్కడ పిలిస్తే అక్కడ నుండి భయంకరంగా వ్యక్తం అయిపోవడానికి. మామూలుగా మనల్ని పిలిస్తే, ఇదిగో వస్తున్నాం అని చెప్పి, ఒక పావుగంట ఆలస్యంగా చేరుకుంటాము. కదా? హిరణ్యకశిపుడు ఏం చేశాడు? ఈ స్తంభం లో ఉన్నాడా అని, ఫాట్ మని కొట్టాడు. అంతే వచ్చేశాడు! అది అంతర్యామి అయిన భగవంతుడు అట్లా ఉంటాడు. అంతర్యామిలోనే సమస్తమైన దేవతలు ఉన్నారు. అంతర్యామిలోనే సమస్తమైన శక్తులు వున్నాయి. అంతర్యామిలోనే, కాలము కూడా ఇమిడి వున్నది, అందుకని అంతర్యామికి లోబడే సమస్తమూ వుంటుంది కాబట్టి, commercial గా ఆలోచించినా, మనము అంతర్యామిని పట్టుకోవడం మంచిది. ఇది పోనీ అట్లా చూసుకున్నా తెలివి అదే కదా? అన్య దేవతారాధనలూ వద్దంటాడు కృష్ణుడు. అన్య దేవతారాధన అంటే అనన్యము కానిది అన్యము. కదా? అనన్యము అంటే ఇంకోటి లేనిది. దానికి ఇంకోటి లేదు అదే వుంది. ఇప్పుడు మీ ఒంట్లో ఎడమ కన్ను నేను, కుడి కన్ను నేను, ముక్కు నేను, నేను పై దవడ, నేను కింద దవడ, నేను కుడిచేయి, నేను ఎడమ చేయి, అని అనుకుంటూ ఉండొచ్చు. మీరు ఏం అనుకుంటారు? ఇన్ని ఉన్నాయి అని అనుకుంటారా? మీరు ఒక్కరే ఉన్నారు, అని కదా అనుకుంటారు? ఇన్ని ఉన్నాయి గుడికి వెళ్తుంటే నేను, నా కళ్లు, నా ముక్కు, చేతులు, నా కాళ్లు, నా పొట్ట, నా వీపు, నా నడుమూ, మేము, అంతా కలిసి వెళ్తున్నామనుకోముగా! నేనే వెళ్తున్నాను అని అనుకుంటాం కదా? మరి ఇన్నున్నాయా? మరి ఇవన్నీ దేవతలే! నోరు ఒక దేవత 'ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత' ప్రాణము, వాయువు ఇట్లా వున్నాయి కదా మనకి! మన చెవిలో వినికిడి ఉంది, బృహస్పతి వున్నాడు, శబ్దము ఉంది. కన్నులలో వెలుగున్నది. ఒక కన్నులో సూర్యుడు ఉన్నాడు ఇంకో కన్నులో చంద్రుడు ఉన్నాడు. మరి ఒంటినిండా దేవతలున్నారు, అష్టదిక్పాలకులున్నారు, నవగ్రహాలున్నారు. ముక్కోటి దేవతలున్నారు కదా! మరి, వెళ్తున్నప్పుడు ఒక్కళ్ళమే వెళ్తున్నామని ఎట్లా అనుకుంటారు మీరు? వీరందరితో కలసి వెళ్తున్నాం అని అనుకుంటున్నారా? పోనీ అలా కాదు ఇంకొకటి, కొంచెం చమత్కారం చెప్పారు మాస్టర్ గారు బాగా ఓ సీసాడు మంచి నీళ్ళు తాగి వెళ్తున్నాం అనుకోండి, నేను, సీసాడు మంచి నీళ్ళు వెళ్తున్నాం అనుకుంటామా? అదే, సీసాడు మంచినీళ్లు మన చేతిలోనే ఉన్నాయి అనుకోండి, ఏదో వెధవ బరువు మోస్తున్నామని అనుకుంటాము. కానీ ఆ నీళ్లు లోపలికి వెళ్తే బరువు అనిపించదే! ఏదో పర్వదినాన ఇంటావిడ పిండివంటలు చేసి పొట్లం కట్టి ఇచ్చింది. పట్టుకుని వెళ్తున్నాం. తిన్నాం. తినకముందు, నువ్వు, పొట్లం ఉన్నారు. తిన్న తర్వాత దాని గురించి గుర్తు ఉంటుందా? నువ్వే వెళ్తున్నట్టు, నువ్వే తిరుగుతున్నట్టు ఉంటుంది కదా?

ఏమైపోయింది అది? రెండుగా కనిపిస్తోంది, కానీ ఉన్నదొకటే. ఒకటే ఇన్నిగా వస్తున్నదని చెప్పడానికి 'ముండకోపనిషత్తు' చక్కగా నిర్వచించింది. ఒక్క శుక్ర కణంలోంచి ఇన్ని అంగాలు వస్తే ఇన్ని వచ్చినట్లుగా మనకి అనిపిస్తున్నది తప్ప, అసలు ఒకటేగా వున్నది. జుట్టు నీలో ఎక్కడ నుండి వస్తున్నది? తెచ్చి, అతికించుకుంటున్నావా, Australian method ప్రకారము? ఇప్పుడు ఈమధ్య జుట్టు నారు పోసినట్టు పోస్తున్నారు. వరినారులాగ, అసలు మామూలుగా లోపల నుండి వస్తున్నది కదా? రాకముందు? గుండు గా ఉన్నవాడికి జుట్టు ఎక్కడ నుండి మొలుస్తుంది? అట్లాగే మొత్తం నుండి ఇదంతా మొలిచిందీ అని చెప్తుంది 'ముండకోపనిషత్తు'. మొత్తంలో జుట్టు లోపల జుట్టు గా లేకపోయినా, జుట్టు వచ్చే ఒక బీజంగా వుంటుంది కదా? ఒక ప్రజ్ఞ గా ఉంటుంది కదా? ఇదే జుట్టు లోపల ఉంటే? పని జరగదు. బయటకు జుట్టుగా వచ్చినా, లోపల ప్రజ్ఞగా ఉన్నది కదా! మరి ఇవన్నీ బయటికి వచ్చేటప్పుడు వాటన్నిట్లో ఉంటున్నాం కదా? ఉండబట్టే, ముక్కు మీద ఈగ వాలితే తెలుస్తోంది, లేకపోతే తెలియదు. అదీ వాసుదేవుడు అంటే. వాడు ఇదంతా తనలో నుండి బయటకి తీసుకొచ్చి అందులో మళ్ళీ వాడే వున్నాడండి. ఉంటే, ఎవడికి వాడు 'నేను ఒకడ్ని ఉన్నాను' అనుకుంటున్నాడు. 'నువ్వు అనుకుంటే నాకేం? అనుకో' అన్నాడు. అనుకోవడం వల్ల మనకి అహంకారం వస్తుంది. అహంకారం అంటే.. నేను ఒకడ్ని వేరుగా వున్నానని తెలియడమే! అంతే తప్ప పొగరని కాదు. ఆ అహంకారం వేరు, అది తెలుగు అహంకారం. సంస్కృతం అహంకారం ఏమంటే నేనొకడ్ని వున్నాను, వీరందరూ వున్నారు. అదే ప్రహ్లాదుడు గోల వాళ్ళ నాన్నతో, 'నేను, వీళ్ళు అని అనబోకు నాన్నా తప్పు' అంటాడు. 'అదేమిటిరా ఉన్నాం కదా?' అంటాడు. 'ఉన్నట్లుగా వున్నాం కానీ లేము నాన్న' అని అంటాడు. వీడికి పిచ్చెక్కినట్లుందనుకుంటాడు వాళ్ళ నాన్న. మనలాగే పక్కవాడు ఆలోచించకపోతే, వాడికి పిచ్చి అని మనం అనుకుంటాం కదా. 'వీరు నేనను మతి భ్రమణమమునన్ ప్రవర్తిల్లక' అన్నాడు ప్రహ్లాదుడు సప్తమ స్కంధం భాగవతంలో. స్వేతర భావమని ఓ వెయ్యి సార్లు వస్తుంది. స్వేతర భావమంటే స్వ, ఇతర. నేను, ఇంకోళ్ళు, నేను, ఇంకోళ్ళు. నేను, ఇంకోళ్ళు. మా వాడు కదా? మా అమ్మాయి, మా అన్నయ్య, మా తమ్ముడు, మా అక్క, మా నాన్న--! 'మా, మా,' అని పెట్టుకుంటామే మమకారంతో, ఈ 'మా' ఏమిటీ? పోనీ ఆ 'మా' కి ఇంకొంచెం వ్యాపనం కలిగించు అన్ని 'మా' చెయ్యి. అక్కడ ఉంది. అన్నీ 'మా' చేస్తే భాగవత మార్గం అయిపోతుంది. అది మమకారం కాక విశ్వప్రేమ అయిపోతుంది. కొన్ని 'మా', కొన్ని 'మా' కాకుండా వున్నాయనుకోండి, అప్పుడు ఇబ్బందులు వస్తుంటాయి. వాసుదేవుడంటే ఈ సమస్తమునందు, పంచభూతములు తనయందు వ్యక్తం అయితే, వాటి ద్వారా వ్యక్తం అయిన, సమస్త

జీవకోటి యందు వసించి ఉన్న భగవత్తత్త్వం. అది వుండబట్టే ఆ జీవులలా ప్రవర్తిస్తుంటాయి బొద్దింక దగ్గర నుండి కదా? విశేషించి భక్తుడు వాసుదేవ భక్తుడు కావాలని చెప్తారు. అప్పడే మార్గం సుగమమం అవుతుంది. అంత వరకూ అవ్వదు. సమస్తము నందు వాసుదేవుని దర్శించగలిగిన స్థితికి చేరుకున్నపుడు మాత్రమే హృదయమునందుండే కలుషితములు అన్నీ నిర్మూలనమవుతాయి. అంతవరకూ మనకి ద్వంద్వములుంటాయి. మంచి-చెడు, మనవాడు-ఇంకొకడు, మనకి ఇష్టమైంది ఇష్టం లేనిది, ఇట్లా ఉంటాయి కాబట్టి, మనకిష్టం లేని వాడి లోనూ, మనం చెడ్డవాడు అనుకున్నవాడి లోను, అందరిలోనూ వాడున్నాడు కదా! అదే ఇంద్రుడికి కూడా పాపం బాధ వస్తుంది, గురువుగారు విశ్వరూపుడని గురువుగారిని ఆశ్రయిస్తాడు ఇంద్రుడు. అంతకుముందు వ్యక్తిగతంగా ఓ గురువుంటాడు, అయన దగ్గర కొంత బోధ జరుగుతుంది, ఆయన వద్ద మంచి విషయాలు, చెడు విషయాలు తెలుసుకుని ప్రవర్తిస్తూ ఉంటాడు. మనకి ఉన్నారు కదా మనకి ఇష్టమైన వాళ్లు ఉన్నారు, ఇష్టం లేని వాళ్ళు ఉన్నారు. లేకపోలేదు కదా? వాళ్ళు బాగు పడకూడదు అని కూడా అనిపిస్తుంది లోపల, ఎందుకని మరి వాళ్ళు కూడా బాగు పడితే ఎట్లా అని. వాళ్ళు అలా ఉండిపోగా మనం బాగు పడితే మనకి ఆనందంగా ఉంటుంది కదా? భగవంతుడికి అట్లా ఉండదు. వాడికి అందరూ బాగుపడాలి. కాబట్టి ఇష్టం లేని వాడి రూపంలో కూడా వుంటాడు. ఇష్టం లేని జంతువుల రూపంలో వుంటాడు. ఈ బొద్దింకల్ని ఎందుకు సృష్టించాడు భగవంతుడు అనిపిస్తుంది మన ఒంటి మీద వాలినప్పుడు. ప్రత్యేకించి మనం స్నానాల గదిలోకి వెళ్లినప్పుడు, అవి అటూ ఇటూ తిరుగుతున్నప్పుడు. 'నీ ఇంట్లో బొద్దింకలు వచ్చేటట్టుగా నువ్వు జీవించక, నువ్వు ఇంకో రకంగా జీవించు' అని చెప్పడానికి వస్తున్నాయి. ఇంట్లోకి బొద్దింకలు ఎందుకు వస్తాయి అంటే? స్నానాల గది, సరిగ్గా ఉంచుకోకపోతే వస్తాయి. మురుగు ఎక్కువైపోయి, దాని కంపు లోపలికి వస్తుంటే వస్తాయి. బొద్దింకలు వచ్చాయంటే, ఇంట్లో మురుగు పెరుగుతుంది అని తెలుసుకోవాలి తప్పా, బొద్దింకని తిట్టి లాభం లేదు. శుభమాని మనం బయల్దేరి వెళుతుంటే ఎదురుగుండా పిల్లి వచ్చిందనుకోండి, పిల్లిని తిట్టి లాభం లేదు. పిల్లేం చెప్తోందంటే, 'ఒరేయ్ వెళ్లే పని, అంతంత మాత్రంగా ఉంటుంది, కాసేపు ఆగి వెళ్ళు. దారిలో అపాయము ఉంది, ప్రమాదం ఉంది అని చెప్తుంది' తప్పా, పిల్లి మీద విసుక్కుంటే ఎట్లా? శకునం మనకి ఏం చెబుతుంది అంటే భగవత్తత్త్వం మనకి ఒక సందేశం అందిస్తుంది అని అనుకున్నవాడు బుద్ధిమంతుడు తప్ప, శకునం రాగానే చిరాకు పడి పోయి, కోపగించుకుని, వెళ్లే పని పూర్తిగా తన చేతులతో, తనే పాడు చేసుకునేటట్లుగా చేసుకుని, తర్వాత వచ్చి, పిల్లి కనిపించింది కదా అంతకన్నా ఏం బాగా జరుగుతుంది? ఇంట్లో వాళ్ళ మీద

కోప్పడి---. తెలివితక్కువతనం కదా? అందుకని వాసుదేవుడు అందరి ద్వారా వినిపిస్తూ ఉంటాడు. మనం ఏదైనా పని చేద్దాం అనుకుంటే, అవతలివాడు ఏదో మాట్లాడుతూ, కాదులే అంటాడు. వాడితో మనకి ఏమి సంబంధం లేదు. మనకి పని కాదని అర్థం. కాబట్టి చేయక పోవడం సుఖం. మనం ఏదో మాట్లాడుతూ ఉంటే కొంతమంది మనకి ఎదురుగా వచ్చి, 'కాదు కానీ' అంటారు. అంటే అంత వరకు మనం మాట్లాడేది కాదు అని చెబుతున్నట్టు వాసుదేవుడు. అందుకని, వాసుదేవతత్త్వం అవగాహన చేసుకోవాలి అంటే చెవులు బాగా రిక్కించి ఉండాలి, కన్నులు బాగా తెరుచుకుని వుండాలి. బాగా చూడగలగాలి. బాగా వినగలగాలి. సమస్తమునందు దానినే చూడాలి. సమస్తమూ అంతా అదే నిండి ఉంది అని తెలియాలి. మనయందు కూడా అదే నిండి ఉంది అని తెలియాలి. అప్పుడు, పెద్ద మెట్టు ఎక్కినట్టు. మోకాలి పర్వతం ఎక్కితే తిరుపతిలో వెళ్ళేటప్పుడు, ఇక దాదాపు, దైవ సాన్నిధ్యాన్ని చేరుకున్నట్టే. అట్లాగే భక్తి సాధనలో వాసుదేవ ఉపాసన, ఎవ్వరికి పూర్తవుతుందో వాడు గట్టెక్కిన వాడే. అది ఎక్కడం కొంచెం చికాగ్గానే వుంటుంది. ఎందుకంటే ఎన్నో జన్మల తరబడి, ఎన్నో జన్మల సంస్కారం వల్ల మనం తెరుచుకొని, మనం అనుకున్న మంచిలు, మనం అనుకున్న చెడులు, మనం అనుకున్న మంచి సాంప్రదాయాలు మిగతా వాళ్ళెవరికీ ఇవి లేవు పాపం, వాళ్ళు దుష్టులు, అజ్ఞానులు, పాపులు ఇట్లా అనుకునే పద్ధతి ఒకటి ఉన్నది కదా! అదేం లేనిది వాసుదేవ ఉపాసన! ఎందుకంటే నువ్వు ఎవరిని అజ్ఞాని అని అనుకుంటున్నావో, దుర్మార్గుడు అని అనుకుంటున్నావో, ఎవరు హీనుడు అని అనుకుంటున్నావో, ఎవరు విషపూరితడు అని అనుకుంటున్నావో, వాళ్ళ రూపంలో కూడా వీడే ఉన్నాడని తెలిసి, సమస్తాన్ని అంగీకరించే పెద్ద మనసు నీకు ఏర్పడడం వాసుదేవోపాసన. ఇంకా మనం ఏరుకుంటూనే బతుకుతూ ఉంటాం. వాసుదేవోపాసన చేసేవాడు ఏరుకోవడం మానేస్తాడు. ఏమిటి ఏరుకుంటావు అంతా అదే అయితే! నీ వద్దకు ఏది వస్తే దాన్ని చూస్తూండు. ఇంకేమీ ఏరుకోకు. నలుడు అట్లా ఏరుకోకుండా జీవించాడు. హరిశ్చంద్రుడు అట్లా ఏరుకోకుండా జీవించాడు. ఒకటే కోరుకున్నాడు 'సమస్తము నందు సత్య దర్శనమే' హరిశ్చంద్రుడుకి. సత్యము అంటే ఉన్నది అని చెప్పాను కదా? హరిశ్చంద్రుడు సత్యవంతుడు, సత్యాన్ని పరిపాలించాడు అంటే అర్థం ఏమిటయ్యా అంటే, సమస్తము నందు అది ఒక్కటే చూస్తూ కూర్చున్నాడు. ఏం జరిగినా దానిని వదలలేదు. నలుడు ధర్మ పరిపాలన చేశాడు. సృష్టిలో దైవం ధర్మం రూపంలో ఉంటుంది కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోను దాన్ని వదలకుండా, మంచి-చెడులు బేరీజు వేయకుండా, వాడ్నీ వీడ్నీ తిట్టిపోయకుండా ఉన్నాడు. మనకి వచ్చిన కష్టానికి పదిమందిని తిడతాం మనం, మనకే ఎందుకు వచ్చిందని. తనలో ఉండే

కల్మషాలన్నీ తీసుకుంటూ ముందుకెళ్ళి పోతాడు. అందుకని వాసుదేవోపాసన మార్గంలో ఇహ మిగతా ప్రాథమికమైన వాటన్నిటిని పక్కన బెట్టి నలుడు ముందుకు నడుస్తాడు తెగించి, ధైర్యం చేసి. దానికి భాగవతంలో ఏం చెప్పారంటే, అటువంటి ఉపాసన పూర్తి చేసిన వాళ్ళ సన్నిధిలో అది సులభంగా అవుతుంది సుమా లేకపోతే అవ్వదు అని  నారదుడికి ఆయన గురువులు చెప్తారు. ఈ ఉపాసన ఉందే, వాసుదేవోపాసన ఇది చాలా కష్టమైనది. సమస్తము నందూ, ఏదీ పేరు పోకుండా, అన్నిట్లోనూ దైవాన్ని చూడగలిగే స్ఫూర్తి నీకు కలగాలి అంటే, ఆ విధమైన సాధనలో, సిద్ధి పొందిన వారియొక్క సాన్నిధ్యంలో దొరుకుతుంది. కాబట్టి, మేము ఉండగా చేసుకో అని చెబుతారు. కొండచిలువ, ఒక ఉదాహరణ చెప్పారు. కొండచిలువ చేత చుట్టబడ్డట్లు వుంటుంది జీవుడి యొక్క జీవితం. ప్రతి క్షణం ఏదో ఒక భావం చుట్టేస్తునే ఉంటుంది. అట్లా, మెలికలు పెట్టేస్తాయి భావాలు. అంత సులభంగా ఉండదు. కదా! ఇక్కడ కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నట్టుగా ఏమి ఉండదు జీవితం. మనకు తెలుసు కదా? అందరమూ అనుభవిస్తూనే ఉన్నాము. ఎట్లా ఉంటుంది అది? కొండచిలువ ఊరికే చుట్టుకోవడం అంటే fashion గా చుట్టుకోదు. అది చుట్టుకుని, బిగిస్తూ ఉంటుంది. ఒక్కొక్క భావం మనల్ని ఎట్లా బిగిస్తుంది! రక్తం కళ్లచూస్తాం, కక్కుతాం రక్తం. కొండచిలువ చుట్టేస్తూ ఉంటే, నవరంధ్రాల లోంచి, సమస్తమూ బయటకు వెళ్ళిపోతుంది, పిండేస్తోంది. అట్లా భావాలు, పిండట్లేదు మనల్ని? పిండుతాయా? పిండని వాళ్లు ఉంటే మనం వాళ్ళకి దండం పెట్టాలి. భావములు చేత పిండబడని స్థితిలో చాలాకాలం ఉన్న వాళ్ళు ఎవరైనా ఉన్నట్లయితే, వారి పాదాలు గట్టిగా  పట్టుకోవాలి. ఇట్లా పట్టేస్తూ ఉన్నవాడికి పట్టుకున్న ఉండాలి అంటే, ఇంకొక్క పట్టని వాడి పక్కన ఉంటే సులభం. ఈ ఉదాహరణ, మునులు, నారదుడికి చెప్పారు. ఎందుకు అంటే? ఒకడికి, కొండచిలువ చుట్టుకుంటుంది ఇంకొకడికీ చుట్టుకుంది, ఇద్దరూ భక్తులు అనుకో, ఎవరూ ఎవరికి సాయం చేయలేరు. చచ్చిపోతున్నావా అని వీడు వాడిని అడగాలి. నువ్వు చచ్చిపోతున్నావా? అని వాడు వీడిని అడగాలి. అవును! చచ్చిపోతున్నాం .. చచ్చిపోతున్నాం  అనుకుంటూ చనిపోతారు ఇద్దరూ. అది భక్తులు భక్తులు కలిసి ఉన్నప్పుడు, వీడి మూకుడులో ఉండేవి ఒలకబోస్తాడు. ఇంతేనా నీ దగ్గర? నా దగ్గర ఇంత ఉన్నాయిరా, ఇటు చూడు ఎంతున్నాయో అని వీడు ఒలకబోస్తాడు. ఒలకపోసుకుని నిరసిస్తారు. కదా? అందుకనీ భాగవతంలో 'నువ్వు కొండచిలువ చేత చుట్ట పడుతున్నావు అంటే, నీ భావములు చేత నువ్వు బాధింప పడుతున్నావు.' అని చెప్పారు. భావములే బాధించేవి ఇంకేవి బాధించవు ప్రపంచంలో. నీకు ఆ భావము  ఏదో ఒక  దాని మీదో, ఏదో లేని దాని మీదో, లేకపోతే పోగొట్టుకున్న దాని మీదో, నువ్వు కావాలి అనో లేకపోతే నీకు అసలు ఏ

బాధా లేదు. అది ఎందుకనో తెలిసి కూడా, అట్లానే సులి వేసుకుంటూ ఉంటాం. మనమే తొడపాయసాలు పెట్టేసుకుంటాం. ఎవ్వరూ పెట్టనక్ఖర్లేదు. తొడపాయసాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కూడా పెట్టుకోని వాడు ఒకడు ఉంటాడు. కూర్చుని తొడపాయశాలు పెట్టుకునే వారికి, ఏ తొడపాయశాలు పెట్టుకోని వాడు వచ్చి అడిగితే, ఎందుకురా, అనవసరంగా పెట్టుకుంటున్నావు, అవసరం లేదురా అని చెప్తే పోతుందట! అది, ఉపమానం ఏమి చెప్పారు అంటే? వాళ్ళను కొండచిలువ చుట్టుకోదు కాబట్టి, నీకు కొండచిలువ చుట్టుకుంటూ ఉంటే, వాళ్ళ బాహుబలం చేత, నీ కొండచిలువని తొలగించడానికి చూస్తాడు. వాడికి ఒక పక్క నుండి తీస్తుంటే, ఇంకొక పక్క నుండి చుట్టుకుంటూ ఉంటాయి కదా? అందుకనే వాసుదేవోపాసనము! లోపల ఉన్న వాడిని తలచుకుని, 'వాడే ఈ భావము రూపంలో చుడుతున్నాడు' అని గుర్తుకు వస్తే ఈ భావము విడిపోతుంది. ఈ సన్నివేశం రూపంలో వీడే చుట్టేస్తున్నాడు నన్ను. వాసుదేవుడు అంటే సన్నివేశాలు రూపంలో వస్తాడు. అప్పు పుచ్చుకుని వెళ్ళి అప్పు తీర్చడు. వాడిని చూడగానే, వీడికి వచ్చేస్తూ ఉంటాయి భావాలు. 'వాసుదేవా' అనుకోవాలి. లేకపోతే, అప్పు పుచ్చుకున్నాం, అప్పు తీర్చలేక పోతున్నాం, అప్పు ఇచ్చినవాడు ఎదురు పడతాడు. కష్టంగా ఉంటుంది. మనల్ని అక్కడా, ఇక్కడా బాగా తిట్టిపోసి, మన దగ్గర మాములుగా నవ్వుతూ నిలబడతాడు ఒక్కొక్కసారి. ఊరుకోడు వాసుదేవుడు, అక్కడ నన్ను తిట్టాడు అని, ఇంకోడు చేత చెప్పిస్తాడు మనకి. వీడిని పంపిస్తాడు. మనం ముఖంలో రంగులు ఎట్లా మారుతున్నాయో చూస్తాడు. 'అదేమిట్రా ఇన్ని రంగులు మారిపోయాయి? వాసుదేవ ఉపాసన లో ఉన్నావ్ కదా' అంటాడు అట్లా ఉంటుంది. మాష్టారు వాసుదేవోపాసన అద్భుతంగా నిర్వర్తించారు. నేను ఉండగా ఇది చేసుకున్నవాళ్లు చేసుకోండి అని ఆయన చెప్పారు. ఆ విధంగా వాసుదేవుడు సమస్తము నందు నిండి ఉన్నాడు కాబట్టి, మనకి ఇష్టం లేని జీవుల రూపంలో, జంతువు రూపంలో, చెట్టూ-పుట్టా రూపంలో, ఇష్టం లేని సన్నివేశం రూపంలో కూడా వాడే ఉన్నాడని భావన చేసుకుంటే దగ్గరవుతాడు కనబడతాడు. అలా కానప్పుడు ఇంకా మనం సగమే బతుకుతూ ఉంటాం. ఎందుకంటే ప్రతి జీవికి, ఇష్టమైనవి, ఇష్టం లేనివి, రెండూ కాలం పట్టుకు వస్తూనే ఉంటుంది. పగలు-రాత్రి లాగా అమావాస్య-పౌర్ణమి లాగా! ఎవరూ exception కాదు. కానీ అమావాస్య, పౌర్ణమి భూమి నుండి ఉద్ధరింపబడిన వాళ్లకి ఉండవు. మనం ఈ భూమి పరిధి దాటి వెళ్లిపోతే పౌర్ణమి, అమావాస్యలు లేవు. పగలు రాత్రులు లేవు. అంటే ఏమిటి? పదార్థమైన సృష్టి యందు, నీకు ఆకర్షణ లేకుండా ఉన్నట్లయితే, నీకు అంతా పౌర్ణమే! అమావాస్య లేదు. అంతా పగలే, రాత్రి లేదు. దాన్నే constant vibration, stable vibration, equilibrium, poise అని చెప్తారు. తెలుగు లో

‘శమము’ అంటారు. అతని దగ్గర ‘శమము’ ఉంటుంది. అతని దగ్గర చేరిన వారికి అటువంటి ‘శమము’ ఏర్పడుతుంది. అది వాసుదేవోపాసన ద్వారా జరిగేది. ‘వాసుదేవమితి సర్వం’ అంటుంది భగవద్గీత! ఈ మొత్తం వాసుదేవుడే సుమా అని చెప్తుంది. సమస్తము నందు అదే నిండి ఉన్నది అనే భావన చేసుకోవడం దీనికి ప్రధానం. భావన చేసి, ఎదుటివాడు ఏం చేస్తున్నా వాడిలోని వాసుదేవుడ్ని ఆరాధిస్తూ ఉండడమే! అది అంబరీషుడు అద్భుతంగా చేశాడు. మనల్ని ఎవరైనా ఒక్క మాటంటే గింజుకు పోతాం. కదా? అంబరీషుడ్ని ఎన్ని మాటలు అన్నాడు దుర్వాసుడు? నిష్కారణంగా. వాసుదేవుడే దూర్వాసుని రూపంలో తనకి చివాట్లు పెడుతున్నాడని అనుకున్నాడు. నమస్కరిస్తూ నిలబడ్డాడు అంతే. తనని చంపడానికి మహాకృత్యని పుట్టించాడు, పంపించాడు. వాసుదేవుడే, మహాకృత్య రూపంలో, తన మీదికి వస్తుంది అని తెలుసుకున్నాడు. ఏం చేయాలి మనం ఇప్పుడు? అని ఆలోచించలేదు. అంతా వాసుదేవుడే! అందుకనే భాగవతంలో ఆ తరగతికి చెందిన వారిని మాత్రమే, కొణికపూసలు లాంటి వారిని ఏరి భాగవతంలో వేశారు. చిల్లర భక్తులను వేయలే. అప్పుడు, సుదర్శన చక్రం రావడం, కథ మనకి తెలుసు. కదా? కానీ, ఆ స్థితి ఏమిటి? చెదరని స్థితి, ఏవి వచ్చినా చెదరదు. ఎందుకు? వాసుదేవోపాసన! మనము కాస్త అనుకున్న పని కాకపోతే, విపరీతంగా చెదిరిపోయి చుట్టూ ఉన్న వాళ్ళని చిందరవందర చేసేస్తాం కదా! అందుకనీ, వాసుదేవుని దర్శనం చేసుకుంటూంటే చాలా తెరిపి ఉంటుంది. ఇంత భయంకరమైన జీవితంలో కూడా, కాస్త మెడకాయ పైకి పెట్టుకుని బ్రతకొచ్చు. ఎంత వరద వచ్చినా, మెడకాయపైన ఉంటే చచ్చిపోము. అందుకని వాసుదేవోపాసన!

# 737 సర్వాసునిలయః

సర్వాసునిలయః అంటే, వాసుదేవుడ్నే మళ్ళీ కొంచెం emphatic గా చెప్తున్నారు. నొక్కి వక్కాణించడం! ఒరేయ్ అందరిలోనూ ఉన్నాడు గుర్తుపెట్టుకో, అని చెప్తున్నాడన్నమాట. సర్వాసునిలయః సమస్తమునందు నిండి ఉన్నాడు. ఇది మనము చాలా సార్లు విన్నాం. మర్చిపోతుంటాం. అందుకూ మళ్లీ మళ్లీ వింటూ ఉండాలి, లేకపోతే, మళ్లీ మళ్లీ చదువుకుంటూ ఉండాలి. ఏదైనా పట్టుకుందామనుకుంటే, ఇది ఒక్కటి పట్టుకుంటే ఇంకేమి అక్కర్లేదండి. మనం మంచివారిని రానిద్దాం, చెడు వారిని వద్దు అనేవి వాసుదేవోపాసన కి వచ్చిన వాళ్ళకి ఉండవు. మాస్టర్ గారు దగ్గరికి ఒక భయంకరమైన officer వస్తూ ఉండేవాడు. ప్రపంచం అంతా చాలా దురాత్ముడు అని బిరుదు వహించిన officer ఆయన. చాలా మంది వచ్చి మాస్టరు గారికి చెప్పేవారు. ఏవండి మీకు ఉన్న పేరు, ప్రతిష్ఠ అన్నీ కూడా పోతాయి, అయన్ని మీరు allow చేస్తున్నారేంటి అని. ఎలాగోలా ఆయన్నుండి తప్పించుకోండి, తప్పించేయండి. అని అంటే, నవ్వారు ఆయన. నవ్వి 'ఆయన్ని నేను నిరాకరిస్తే, నేను నమ్ముకున్న సిద్ధాంతాలన్ని పక్కన పెట్టాలి. నేను నమ్మిన విధానం నేను బతుకుతున్న సిద్ధాంతం వదలను. వదిలేస్తే ఆయనే వదిలేయాలి. అంతే తప్ప నాకై నేను నిరాకరించను.' అని చెప్పారు. అదేంటని అడిగితే, ఒకటే చెప్పారు 'అంతటా భగవంతుడు నిండి ఉన్నాడు, అందరియందు భగవంతుడు నిండి ఉన్నాడు, అందరూ భగవంతుని స్వరూపాలే, అని బల్లగుద్ది చెప్పి, ఒక రూపంలో, భగవంతుడు నీ దగ్గరికి వస్తున్నప్పుడు, ఇది మాత్రం, చెడ్డది కాబట్టి నేను నిరాకరిస్తున్నాను అంటే, అందులో ఏమిటి ఉన్నది విజ్ఞానము? అందులో ఏమిటీ ఉన్నది భక్తి? అందులో ఏమిటి ఉన్నది నీ ఉపాసన?' 'వెంకటేశ్వరస్వామి గుడికి అందరూ తిరుపతి వెళ్లినప్పుడు, వీళ్ళు వస్తున్నారు తలుపులు వేసేయండి, వీళ్ళు వస్తున్నారు తలుపులు తెరవండి అని చెప్తున్నారా? ఏ దేవుని గుడిలోకి, పుణ్యాత్ములు, పాపాత్ములు అందరూ వెళ్లడం లేదు? కొంతమందికే తలుపులు తెరిచి, కొంతమందికి తలుపులు మూసేస్తున్నారా? ఇది కూడా అంతే. అతను నా దగ్గరికి రావడం దైవం యొక్క నిర్ణయం, దైవం యొక్క సంకల్పం. అతనికి నాకు తెలిసినది చెప్పడం నా కర్తవ్యం. అతడు ఉన్నంతకాలం ఉంటాడు. తర్వాత శాశ్వతంగా నాతోనే ఉండవచ్చు లేక స్వేచ్ఛగా వెళ్లిపోనూ వచ్చు. ఈ లోపల నేను ఎవడ్ని వాడు రావద్దని నిర్ణయం చేసేవాడిని?' అన్నారు. చాలా గొప్ప విషయం అది. అలా ఉండడానికి చాలా స్థిరత్వం కావాలి. దేనియందు? వాసుదేవుని యొక్క అస్తిత్వము నందు. ఎరుక వాడిలో లేదా? బాగా చెప్తుండేవారు మాస్టర్ గారు, ఎవరైనా, ఎవరి దగ్గరైనా డబ్బులు కొట్టేస్తే, నీ దగ్గరే

ఎందుకు కొట్టేశాడు రా,  చూసుకో అనేవారు. సర్వాసునిలయః సమస్తమునందు నిండి ఉన్నాడు.

## 738 అనలః

అగ్ని! సమస్తాన్ని తాను హరించివేయగలిగిన అగ్ని, ‘అనలం’! పంచభూతములు ద్వారా ఈ మొత్తం అంతా కూడా పట్టుకుని వచ్చారు కదా! ఈ శ్లోకము, వాళ్ళు ఎట్లా రాస్తారు అంటే అక్కడే మొదలు పెట్టేసి, పూర్తి చేసేస్తారు. వండుకుని తినాలి కదా? మళ్ళీ ఖాళీ గిన్నెలు బయటకు తీసుకోవాలి, మళ్ళీ తోముకోవాలి, మళ్ళీ వండుకోవాలి, మళ్ళీ తింటూ ఉండాలి. సృష్టి కథ కూడా అంతే! ‘Fire, our God is all consuming fire.’ అని చెప్పాడు Moses. ‘మొత్తం తినేస్తాడు, జాగ్రత్త. నువ్వు ఇంకేం మిగలవు’ అన్నాడు. అవును ఎందుకు మిగుల్తావ్? వాడు ఇన్నిగా ఏర్పడినపుడు వాడు, వాడిగా ఉందామనుకుంటే, ఎవరికండి అభ్యంతరం? సముద్రం అల గా వచ్చింది, మళ్ళీ సముద్రం గా ఉండాలి అనుకుంటే, ఎవరికండి అభ్యంతరం? ఏమిటో నండీ, ఇదంతా మునిగిపోతుందట అంటారు కదా! పోనీ మునిగిపోతే! నువ్వేమైనా ఆపగలవా? ఉన్నంతకాలం హాయిగా ఉండు. వాడి లో ఉండు, ముంచితే, వాడిలోకి వెళ్లిపో. ఏమిటీ గోల? ఉండిపోవాలని రకరకాల గోలలు పడుతున్నాము కదా? అది ఎంత అజ్ఞానమో చెప్పనా? సముద్రం నుండి అలగా బయల్దేరింది, నేను ఇక్కడే ఉండిపోతాను అలగా అంటే? ఉండిపోతావా? ఎట్లా ఉంటావ్? ఉండిపోవడానికి, నువ్వు ఎవరు? సృష్టి ధర్మంలో లేదు. నువ్వు ఎంత మంత్రం చేసినా! అల సముద్రంలోనికి వెళ్లవలసిందే. ఎప్పుడు సముద్రం నుండి బయటకి రావాలి, ఎప్పుడు సముద్రం లోనికి వెళ్ళాలి అనేది, అల నిర్ణయం చేసుకుంటుందా? సముద్రం నిర్ణయం చేసుకుంటుందా? మనల్ని మనం రక్షించుకుందాం అనేది పెనుమాయ. Self-Protection, Self-Defense, Self-Importance, నిజమైన మార్గములో లేవు, లేవు, లేవు! రక్షించేవాడు వాడే, వాడే తీసుకుని వచ్చాడు, వాడే పట్టుకుపోతాడు, నువ్వు ఉండు. నిన్ను అలగా ఉంచారు ఉండు, ఇక సముద్రంగా, వచ్చేయమంటున్నాడు, ఓకే సార్ అని చెప్పు. మధ్యలో నీ పట్టు ఏమిటి? బోగీలు, engine ఎటు పట్టుకుపోతే, అటు పోయేవే తప్ప, నేను అనకాపల్లిలో ఉండిపోతాను అని మధ్యలో బోగి అంటే, కుదరదు కదా? ఎందుకు అంగీకరించలేము? అసలు విషయం తెలీకా! ఎన్నో సార్లు ఈ భూమికి ప్రళయం వచ్చింది. ఇప్పుడు కొత్త కాదు. వస్తే వస్తుంది, రాకపోతే రాదు, ఏంటిట? ఇప్పుడు ఏమి అనుభవించాలో అది అనుభవించు. ఇంతకాలం ఉన్నావు కదా, ఏమి అనుభవించి ఏడ్చావు? ఏమి లేదు కదా? ఇంకా ఉంటే, ఏదో అనుభవించవచ్చు అని కదా! అంటే ఏడుస్తూ ఉండడమే కదా? నీకు చేతకావడం లేదు రారా .. మళ్ళీ పంపిస్తాను అని అన్నాడు అనుకోండి, అంటున్నాడు అని నేను అనడంలేదు సుమా!

మరి దీనికి, రకరకాల Protections, కవచాలూనూ. అసలు వాడే కవచం. వాడివాళ్ళం మనం, వాడి దగ్గరికి రమ్మన్నాడు అనుకుందాం. అందుకనే జ్ఞానం ఒక్కటే సరి అయిన అవగాహన ఇస్తుంది. ఈ లోపల ఏమిటేమిటో, తన్నుకుంటూ ఉంటాం, కొట్టుకుంటూ ఉంటాం. చిన్న చిన్న సత్యాలు, ముక్కలు, ముక్కలుగా ఉండే సత్యాలలో జీవించవద్దు. మొత్తం సత్యం లో జీవిస్తే, నువ్వెక్కడికి పోవు అని చెప్తున్నారు కదా? మళ్ళీ మనమే అంటూ ఉంటాము, జీవుడు శాశ్వతుడు, సనాతనుడు, ఈ దేహం అశాశ్వతం అని. పోనీ పట్టుకుపోయేది, దేహాన్ని అని అనుకో, కానీ అనుకోలేవు. ఎందుకనీ? పదార్థానికి బాగా అతుక్కుని ఉంటుంది. అందుకని ఏమి చేస్తారంటే, నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా, అల ఏ విధంగా సముద్రంలోకి మళ్ళీ కొనిపో పడిందో, అదేవిధంగా ఈ  జీవులందరిని పట్టుకు వచ్చేస్తూ ఉంటాడు. అదే కదా, అర్జునునికి చూపించాడు? ఎడమ పక్క నుండి దిగి వస్తుంటే, కుడి వైపు జుర్రేస్తూ ఉన్నాడు. అమ్మమ్మ అంటే అమ్మాలేదు, ఏది లేదు రా, నువ్వు కూడా వచ్చేస్తావు ఇందులోకి. ఎవరైనా అందులో నుండి రావాల్సిన వాడే, అందులోకి పోవాల్సిన వాడే, ఇటుప్రక్క నుండి వస్తూ ఉంటాడు అటుప్రక్క నుండి వెళ్ళిపోతూ ఉంటాడు. మరి ఈ సత్యం తెలిసి, ఎందుకు ఊరికే resistance? Resistance వల్ల దుఖం కదా? అందుకనీ ఈ పదం ఇక్కడ వేశారు. అందుకనే భీష్ముడు అప్పటికే ఈయన యొక్క అవతారం, చూసేశాడు కదా మరి భారత యుద్ధంలో.  సర్వాసునిలయోఽనలః, అనలం, అనలం అంటే అర్థం ఏంటో తెలుసా? ఎంత తిన్నా ఆకలి తీరదటండి. అంటే ఏమీ మిగల్చడు. ఇక తినడానికి ఏమీలేదు కాబట్టి ఊరుకోవడం తప్ప, ఆకలి తీరింది అని కాదుట. అది అనలం. అట్లా తినేస్తాడు సుమా ఇంత సుందరంగాను, మనోహరంగాను ఉండేవాడు అని చెబుతున్నాడు భీష్ముడు. కృష్ణుడు లో ఎటువంటివి దర్శించాడో చూడండి భీష్ముడు. ఎక్కడ మొదలుపెట్టాడు? నీ లోంచే పంచభూతాలు పుట్టాయి అన్నాడు. పంచభూతాలలో నువ్వే ఉన్నావు అని అన్నాడు. అందరూ నీలో ఉన్నారు అన్నాడు. అందరూ నీలోకి వచ్చేస్తారు అన్నాడు. ఎట్లా? నీయొక్క యొక్క తేజస్సు కారణంగా, నీ యొక్క అగ్నితత్వం. 'అగ్నే నియతి యితి అగ్నిః.' అసలు పాపం, వీరు అందరినీ బయటికి పట్టుకుని వచ్చింది అగ్ని అండి. ఏమిటి దేవతలతో సహా, మొత్తం అందరిని, పట్టుకుని వచ్చింది అగ్ని. ఒరే అందరిని బయటికి పట్టుకుని పోరా అని చెప్పాడన్నమాట, పట్టుకుపోయాడు. మళ్ళీ, ఒరే అందరిని Queue లో తీసుకుని వచ్చెయమని చెప్పాడనుకోండి, తీసుకుని వచ్చేస్తాడు. కదా? School Teacher, Class Leader కి చెప్పాడనుకోండి. వాళ్ళందరిని నిలబెట్టమంటే నిలబడతాడు. కూర్చోబెట్టు అంటే కూర్చో పెడతాడు. ఎవరైనా వినకపోతే, వారి పేర్లు రాసుకుంటాడు. ఇదీ అంతే!

## 739 దర్పహా

దర్పాన్ని హరించే వాడు అని అర్థం. ఎవరి దర్పమైనా సరే కాలం రూపంలో హరించబడుతుంది. దర్పము రాజసికంగానూ, తామసికంగానూ వుంటుంది. సత్త్వగుణం లో వున్న వాడికి దర్పం వుండదు. తన గురించిన భావన చాలా తక్కువగా వుంటుంది సత్పురుషునికి. తమ గురించి కన్నా దైవం గురించి, ఇతరుల శ్రేయస్సును గురించి ఎక్కువగా భావన చేసుకుంటూ వుంటారు సత్పురుషులు. తన గురించి తలపు ఉండే వాడు దర్పంలో ప్రవేశించడానికి ఎక్కువ అవకాశం ఏర్పడుతుంది. అటువంటి దర్పం కాలక్రమంలో హరించబడుతూంటుంది. భగవంతుడు దర్పాన్ని హరించేవాడిగా చెప్పుకుంటున్నాం. హరించడం వేరు, అణచడం వేరు. అణచి వేస్తే మళ్ళీ లేస్తుంది. హరించడం అంటే ఇంక ఏమీ లేదు. ఎన్నో సంఘటనలు మనకి రామావతారం లోనూ, కృష్ణావతారం లోనూ, వామనావతారం లోనూ భగవంతుడు చూపించిన ఒక గుణం ఏమంటే మదించిన వారు, దర్పించిన వారు, ధర్మాన్ని తద్వారా అతిక్రమించిన వారి యొక్క దర్పాన్ని హరిస్తూంటాడు. అలాగే మనకి కాస్త గర్వం పెరిగినపుడు పొరపాట్లు చేయడం ద్వారా దెబ్బలు తిని గర్వం అణుగుతూంటుంది, మళ్ళీ పెరిగి, మళ్ళీ అణుగుతూంటుంది. మంచి కులంలో పుట్టామనేది ఒక దర్పం. దానితో ఇతర కులాల్లో పుట్టిన వారిని చిన్న చూపు చూస్తూంటాం. ఇది మొదటి దర్పం. కులపరమైన దర్పంతో, నేను మంచి కుటుంబంలో పుట్టాను, నేను మంచి కులములో పుట్టాను, నేను చాలా ధనవంతుల కుటుంబంలో పుట్టాను, నేను కీర్తివంతుల కుటుంబంలో పుట్టాను, నేను ఆధ్యాత్మిక సంపద వున్న కుటుంబంలో పుట్టాను. 'మా తాతలు నేతులు తాగారు' ఈ రకంగా దర్పం వుంటుంది మనకి. తద్వారా మనల్ని మనం నశింప చేసుకుంటాం. అందుకని పుట్టుక చేత ఓ దర్పం వస్తుంది జాగ్రత్తగా చూసుకోమంటారు శంకరాచార్యుల వారు. విద్య చేత దర్పం. ఇది రెండవది దర్పం. నేను బాగా చదువుతాను, నాకు 1st marks వస్తున్నాయి, నాకు Gold medals వచ్చాయి, మిగతా వాళ్ళకి రాలేదు, వాళ్ళు బాగా చదవరు, బద్ధకస్తులు నేను బాగా చదువుకుంటాను ఇట్లా మరి మామూలు చదువులలోనే ఇలా వుంటే, ఇక ఆధ్యాత్మికపరంగా విద్యలు వచ్చాయనుకోండి, Occult Sciences అంటే జ్యోతిష్యం, సాముద్రికం, కళ్ళు మూసుకుని ఇతర వ్యక్తి గురించి చెప్పగలగడం ఇలాంటివి వచ్చాయంటే, ఇంకా చాలా కష్టం. ఎందుకంటే, వానిని ధరించి వుండి దర్పం లేకుండా వుండడం అనేది ఉత్తమోత్తమమైన సాత్వికగుణంలో వుంటే తప్ప రాదు. అందుకని విద్య చేత దర్పం వస్తుంది. విద్య వల్ల దర్పం వచ్చి, గర్వించి, మదించిన వారు కనిపిస్తారు. పుట్టుక చేత గర్వించిన వాళ్ళు, మదించిన

వాళ్ళు కనిపిస్తారు. అలాగే జీవితంలో ధనం చేకూరడం వలన, ముందు లేకపోవచ్చు తర్వాత చేరుతుంది. తర్వాత చేకూరడం వల్ల గర్విస్తారు. గర్వం ఎక్కడి నుండి వస్తుంది అంటే మనలో సత్త్వం పెరగక పోతే వస్తుంది. మనం పెరిగే కొలది మనలో సత్త్వం పెరగాలి. మనం పెరగడం అంటే బహిర్గతంగా, బాహ్యా ప్రపంచంలో సంపాదించుకోవడమే కదా అందరూ ఆలోచించే పెరుగుదల. అంతర్ముఖంగా పెరుగుదల లేకుండా బహిర్ముఖం అయిన పెరుగుదల వుంటే పునాదులు లేకుండా అంతస్థులు కట్టినట్లుంటుంది. ఇట్లా అన్నీ పడిపోతూంటాయి. పడిపోతున్నప్పుడు ఏడుస్తూంటాం. పడిపోవడానికి కారణం మనలోనే ఉంటుంది. పెరిగినవాడు పడిపోయాడంటే అర్థం ఏమిటీ? ఇచ్చిన పెరుగుదల అందుకునే సంస్కారము లోపల లేదు అని అర్థం. ఉంటే పడిపోరు. బయట పెరుగుతుంటే ఇంట్లో సంస్కారం పెంచుకోవాలి. ఇంట్లో అంటే వంట్లో. ఇంట్లో వారికి పెరగాలి. బయట పెరిగే కొలది, లోపల పెరగక పోతే అపాయం. అందుకని సత్సాధకుడ్ని గురువేం చేస్తాడంటే లోపల పెరగని వాడిని బయట పెరగనివ్వడు. లోపల పెరగకుండా బయట పెరిగితే వాడు పాడై పోతాడు కాబట్టి, వాడు ముఖ్యం కాబట్టి, వాడు నిక్కుతూ, నీలుగుతూ, ఏడుస్తూ అట్లాగే వున్నా నశించకుండా వుండాలనే ఉద్దేశ్యంతో పెంచనివ్వడట గురువు. ఎప్పుడు పెంచుతాడంటే, సంస్కారములు పెరిగి ఎంత వచ్చినా సరే, అతడు సత్త్వము నందు నిలబడి వుండగలడు అన్న విశ్వాసం గురువుకి కలిగినప్పుడు, శిష్యుడికి కొంత లాకులు తెరుస్తాడు, నీరు వదులుతాడు, సంపద వచ్చేట్లు చేస్తాడు. లేకపోతే నశిస్తాడు. ఎందుకంటే గురువుకి గానీ, దైవానికి గానీ, తల్లిదండ్రులకు గానీ పిల్లలు పెరగడం అంటే అంతర్ముఖంగా పెరగడం. వాళ్ళు నిజమైన తల్లితండ్రులు. బయట పెరిగిన వారు చాలా అపాయాలకి గురి అయివుంటారు. అటువంటి అపాయము జరగకూడదు. అందుకని జాతి చేత వచ్చే మదం, విద్య చేత వచ్చే మదం (చదువు కోని వాళ్లని చిన్న చూపు చూడడం), ధనం చేత వచ్చే మదం, ఆ తర్వాత అధికారం చేత వచ్చే మదం. అధికారం మనకి ఇస్తే, అది భగవంతుని యొక్క ఆశీర్వచనంగా, బాధ్యతగా భావించి నిర్వర్తించకుండా అధికార మదంతో ప్రవర్తింప చేస్తూండటం. తోటి జీవుడ్ని తోటి జీవుడిగా చూడకపోతే ఎన్ని తెలిసినా ఒకటే. నీకన్నా తెలివిలో, అధికారంలో, విద్యలో, ధనంలో, పుట్టుకలో, అందం లో తక్కువ వాడై వుండవచ్చు. ఇవన్నీ శరీరానికి సంబంధించినవి. జీవుడికి సంబంధించినవి కావు. జీవుడిగా అందరం సమానులమే. జీవుడిగా మనిషిలో, పందిలో అందరిలో వుండేది దైవమే! పుట్టుక చేత ఈ తేడాలు వచ్చినపుడు, ఇవి పుట్టుక చేత వచ్చిన తేడాలు, మనకి భగవంతుడు ఎక్కువ మేధస్సు ఇవ్వడం వల్ల ఎక్కువ విద్య నేర్చుకున్నాం. అంతమాత్రం చేత తక్కువ విద్య నేర్చుకున్న వాడిని అవమానపరచకూడదు.

అలాగే ధనం, అధికారం. అధికారం ఇచ్చే మదం ఇంకేదీ ఇవ్వదుట. ఆంగ్లంలో ఒక నానుడి వున్నది. అధికారం వచ్చిన వాడికి కళ్ళు పూర్తిగా మూసుకుపోతాయని. కన్నుమిన్ను కానకుండా ప్రవర్తిస్తాడు. అధికార మదం. ఇవన్నీ కాకుండా, యౌవ్వన మదం ఇంకో మదం. యవ్వనంలో వున్నాం, మంచి బలం వున్నది, ఒంట్లో పటుత్వం వున్నది. కనుక నా యిష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాను. అందుకని యవ్వనంలో వుండే పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎక్కువ జాగ్రత్త పడాలి. యౌవ్వనంలో వుండి అందంగా వుంటే ఇంకా మదం. ఉత్త యవ్వనమే కాదు, అందం కూడా తోడైంది. అంటే ఆకర్షితుడుగా వున్నాడు, ఆకర్షితురాలిగా వుంది. అపాయం ఎక్కువ. ఇవన్నీ అపాయ హేతువులని చూస్తారు పెద్దలు. అందంగా వుండటం వల్లనే కదా సీతాదేవికి, ద్రౌపదికి, దమయంతికీ ఇబ్బందులు. ఎక్కడ నుండి వచ్చాయి ఆపదలు? అర్జునుడుకి అందంగా వుండటం వల్ల చాలా ఆపదలు వచ్చాయి. అందంగా ఉండడం వల్ల కృష్ణుడికి కూడా వచ్చాయి కానీ ఆయన స్వామి కాబట్టి అన్నిటినీ చక్కగా నిర్వర్తించాడు. పైగా దర్పం లేదు. అర్జునుడికి దర్పం వున్నది. కృష్ణుడికి దర్పం లేదు. అదృష్టః అంటే ఎట్టి పరిస్థితులలోనూ ఎప్పుడూ గర్వం అనేది లేని వాడు భగవంతుడు. గర్వం లేనివాడు కొంతమందికి గర్వం హరిస్తాడు, కొంతమందికి గర్వం ఇస్తాడుట.

## 740 దర్పదః

'ద' అంటే ఇవ్వడం. అనగా దానం. దర్పాన్ని కొంత మందికిస్తాడు, కొంతమంది దగ్గర హరిస్తాడు, కానీ ఆయనకి మాత్రం ఏ మాత్రం దర్పం లేదు. ఎప్పుడూ లేదు, అప్పుడూ లేదట, ఇప్పుడూ లేదట, ఎప్పుడూ వుండదు. Never అని చెప్పడం. అదృప్తః. ఆయన ఇచ్చిన దర్పానికి వైభవం వేరు. మనం మానవ ప్రయత్నంగా పొందాం అనుకున్న దర్పానికి అపాయం పొంచి వుంటుంది. కులం చేత, ధనం చేత, విద్య చేత, అధికారం చేత, యవ్వనం మరియు అందం కారణంగా వచ్చే మదం ఇవన్నీ ఒక్కచోట పోగేస్తే రావణాసురుడొస్తాడు. కులం చేత సరాసరి బ్రహ్మకి మనుమడు. బ్రహ్మ వర్చస్సు పుట్టుకతో వుంది. పిలిస్తే బ్రహ్మ, శివుడు పలుకుతారు. ఎంత గొప్ప విషయం? మనకెన్ని జన్మలు పట్టినా తెమలదు కదా! విద్యో, సమస్తమైన విద్యలు తెలుసు. అధికారం చెప్పనక్కరలేదు. ఇంక అందం అంటారా, విపరీతమైన అందగాడు. ఎందుకంటే రాముడే రావణుడ్ని చూసి ఆహా! ఎంత అందగాడని అనుకున్నాడట. అంటే, రావణాసురుడు ఎంత అందగాడై వుండాలి? అద్భుతమైన అందగాడై వుండాలి. ఏ విషయంలోనైనా సరే ఎటువంటి వాడైనా పడిపోవలసిందే, ఇన్నిటితో రజోగుణం తోడై వుండడం చేత అంతటి వాడూ ఇలాగ అయిపోయాడు. వాలి కూడా అంతే! బలగర్వం వాలికి. పడిపోయిన వాళ్ళందరినీ మనం ఒకసారి చూసుకుంటే, వాళ్ళు ఏ గర్వం వల్ల పడిపోయారో తెలుస్తుంది. వాలి బలగర్వం వల్ల పడిపోయాడు. రావణుడు, కుంభకర్ణుడు పడిపోయారు. కుంభకర్ణుడు బల, అధికార, కుల, ధన, గర్వాల వల్ల పడిపోతాడు. అందం, యవ్వనం గురించి ఎక్కడా ఎక్కువ వివరించలేదు. అంతా వుంది. ఇటు ప్రక్క కథానాయకుడెలా వున్నాడో, అటు ప్రతినాయకుడెలా వున్నాడో చూస్తే ఇద్దరికీ సరకు ఒకటే. అర్జునుడికి, కర్ణుడికి సామర్థ్యం ఒకటే. గుణములలో తేడా. అతని కన్నా ఇతడు కాస్తోకూస్తో మెరుగు. సత్యభామకి రుక్మిణి కన్నా, కృష్ణుని భార్యలందరి కన్నా తనే అందంగా వుంటానని గర్వం. అది తులాభారంతో పోయింది. అలా రకరకాల గర్వాలుండే వారిని రక్షించడం కోసం వాళ్ళ గర్వాలని అణచడం. రక్షింపబడడానికి కూడా అంగీకరింపని వారిని తనలోకి అందుకోవడం. మనలో ఇందులో సంబంధించినవి ఏమేమి వున్నాయో చూసుకోవాలి. అదృష్టవశాత్తు ఏమీ వుండవనుకోండి. వుంటే ఎంత గర్విస్తామో! కర్ణుడ్నీ వాళ్ళని అంటాం గానీ వాళ్ళ వద్ద వున్న సమర్థత మన వద్ద వుంటే మనం ఎలా వుంటామో మనకి తెలియదు. గభాల్న ఓ కోటి రూపాయలిస్తే మనం ఎలా మారిపోతామో, లోపల నుండి ఎన్ని వికారాలు బయటకు వస్తాయో మనకే తెలియదు. ఎందుకంటే మంచిగా వున్నవారు, ఇవి పొందిన తర్వాత పాడైపోయిన

వాళ్ళు 99% వుంటారు. కలియుగంలో తప్పకుండా వున్నారు. ఉన్నా కూడా పడిపోకుండా వుండడానికి భగవంతుని ఆశ్రయం చాలా అవసరం. అందుకనే మనకి భాగవతంలో గానీ, రామాయణంలోగానీ, భారతంలోగానీ కనిపించే దురాత్ములు, దుష్టాత్ములుగా నశించిన వారిలో మనకు కనిపించేది ఈ దర్పమే. అది వుండటం చేత వారావిధంగా నశిస్తూంటారు. ఇలా వుండగా కొంత మందికి భగవంతుడే దర్పం కల్పిస్తూంటాడుట. వాడు కింద వుండటం ఈయనకిష్టం లేక ఎప్పటికప్పుడు పైన పెడ్తూంటాడు. ఎందుకంటే వాడికిగా వాడు పైన వుందాం అనుకోడు. భగవద్భక్తుడినేమో చెయ్యిపెట్టి పైకి లాగుతూంటాడు. అహంకారినేమో నెత్తి మీద చెయ్యిపెట్టి నొక్కి పెడ్తూంటాడు. రెండూ చేస్తుంటాడు. వీడేంటి అన్నీ వుండి ఇట్లా వున్నాడు అంటే వాడికవేమీ అక్కరలేదు కాబట్టి. తనకేమీ అక్కరలేని వాడిని, సమస్తమైన సమర్ధత వున్న వాడిని అక్కడకి పెంచుకుంటాడు. అన్నీ తనకోసం అని సమర్ధత పెంచుకునేవాడి యొక్క సమర్ధతను తగ్గిస్తాడు. మనం కర్ణుడినీ, అర్జునుడినీ తీసుకుంటే, కర్ణుడు అర్జునుడి కంటే చాలా బలశాలి, చాలా పరాక్రమవంతుడు. ఇతడికన్నా విలువిద్యలో ఎంతో పెద్దవాడు, కులం చేత పెద్దవాడు. వాడికి తెలియక పాడైపోయాడు. సూర్యుడు నుండి వచ్చినవాడు. అర్జునుడు ఇంద్రుడు నుండి వచ్చాడు. అంటే మనసుకు పుట్టిన వాడొకడైతే, ఆత్మ తత్త్వానికి పుట్టిన వాడొకడు. ఎవరిది బలం ఎక్కువ? నిజానికి కర్ణుడి బలమే ఎక్కువ. అందరికీ కర్ణుడు బలం ఎక్కువనే భయం. అందుకే కర్ణుడు లేనిదే భారతం లేదన్నారు. కర్ణుడిలో ఎన్ని అద్భుతమైన గుణాలున్నాయో, అవన్నీ సత్త్వగుణం లేని కారణంగా దెబ్బ తిన్నాయి. కర్ణుడ్ని అర్జునుడు గెలవాలని దైవం ఎన్నో ఉపాయాలు పన్నుతుంది. అటుపక్క కర్ణుడు అహంకారం కారణంగా ఆరుగురి వద్ద శాపాలు అందుకుంటాడు. ఇటు పక్క అర్జునిడికేమో వరాలు పెరుగుతూంటాయి. ఎంత జరిగితే, ఎంత దైవబలం తోడుంటే అర్జునుడు కర్ణుడిని గెలిచాడు? ఎందుకంటే ఇతడు ధర్మములో వున్నాడు, అన్నకి లోబడి వున్నాడు. ధర్మరాజుకి సొంత డబ్బాలేదు కానీ అర్జునుడికి సొంత డబ్బా కొంచెం వున్నది. ఈ cinema లో ధర్మరాజు పూర్తి hero. అర్జునుడు ధర్మరాజుకి supporting hero మాత్రమే. అర్జునుడు పరిపూర్ణమైన సత్త్వంలో వుండడు, కొంచెం రజస్సులోకి వస్తూంటాడు. ధర్మరాజు సత్త్వంలోనే వుండిపోతాడు. అందుకని ధర్మరాజుని ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ వుండాలి. అతడి కీర్తి ప్రతిష్ఠలు పెంచుతూవుండాలి. కొంతమంది కీర్తి ప్రతిష్ఠలు పెంచడం దేవుడి కార్యక్రమం. కొంతమంది వారి కీర్తి ప్రతిష్ఠలు వారే పెంచుకుంటూంటారు. దానివల్ల తప్పుడు పనులు చేస్తే, వారి కీర్తిని కాలం ద్వారా తగ్గించేస్తాడు. ఇలా మనం భక్తుల జీవితాల్లో చూడవచ్చు. భక్తులు నశించారుట అంటే ఏదో కొంత గర్వం పెరగడం వల్ల నశిస్తారు. అది తాత్కాలికమే. శాశ్వతంగా

నశించారుట అంటే సత్త్వము లేదు అని అర్థం, కాబట్టి నశించారు. సత్త్వగుణంలో వుండి సత్త్వాతీతుడైన భగవంతుని యందు మాత్రమే ఆశ్రయాన్ని అందుకున్న వీరు పెంచుకుంటారు. అదీ దర్పదః అంటే. కొంతమందికి ఇస్తారు. వాడికి లేదు, వీడు కలిగించి చూస్తాడు. కలిగిస్తే కొంత మంది పడిపోరు, కొంత మంది కలిగిస్తే పడి పోతారు. పడిపోయి మళ్ళీ లేస్తారు. అందుకనే భగవద్భక్తుడికి నశింపులేదంటాడు భగవద్గీతలో. ఎంత దురాచారుడైనా నాయందు భక్తి గలవాడైతే వాడు నశించడు అని అంటాడు. అందుకనే భగవంతుడే కీర్తి ప్రతిష్ఠలు ఇస్తాడు, మనం సంపాయించుకోనక్కరలేదు అనుకునే వాడు తెలివైన వాడు. మన కీర్తి ప్రతిష్ఠలు మనం చూసుకోకపోతే ఎవరు చూసి పెడతారు అనుకునే వాడు లౌకికుడు, వాడలా తంటాలు పడూతూనే వుంటాడు. నిన్న లక్షలు ఖర్చు పెట్టి పెద్ద సన్మానం చేయించు కుంటాడు, ఈ రోజుకి అంతా మరచి పోతారు. వీళ్ళు మరచిపోయారే అని మళ్ళీ వీడు లక్ష ఖర్చు పెట్టాలి. ఇలా సన్మానాలు చేయించుకుంటూ తన పేరలా ఎప్పుడూ వుంచుకోవడానికి ప్రయత్నం చేస్తాడు. కానీ ఎప్పటికప్పుడు లోకం మరచి పోతూనే వుంటుంది. డబ్బు వృథా అయ్యి, బాధ మిగులుతుంది. ఎంత చేసినా వీళ్ళు నన్ను గుర్తించరే అని బాధ పడతాడు. ఎందుకంటే తన గురించి తాను తాపత్రయ పడడం వల్ల. అలా కాని చోట వాడే పెంచుతాడు. పోతనకి అలా పెంచాడు. అంబరీషుడికి అలా పెంచాడు. అందుకని ఇది చూసుకుంటే మనం మన గురించి తాపత్రయ పడడం మానేసిన దగ్గర నుండి మనకి బాగా జరుగుతుంది అని తెలుస్తుంది. ఆధ్యాత్మిక పరంగా కూడా ప్రతివాడు తన గురించి తాను తాపత్రయ పడుతూంటాడు. ఇక్కడ రెండు విధానాలున్నాయి. అవి తనకి తాను మోక్షం కోరడం. అదొక పద్ధతి. అలా కోరిన వాళ్ళు అప్పటి నుండి ఇప్పటి వరకూ అలాగే వుండి పోయారు. ఇక రెండవది తనకి మోక్షం కాక ఇతర జీవుల సమస్యలకి పరిష్కారం కోసం శ్రమించి పనిచేసే వాడిని భగవంతుడే మోక్ష స్థితిలో పెడతాడు. అందుకని భారతీయ సాంప్రదాయంలో రెండు మార్గాలు బాగా కనిపిస్తాయి. తమ కోసం మోక్షం అనే పద్ధతిలో తపస్సులు చేసుకుంటూ నాకెప్పుడిస్తావు, అంటూ బాధపడే మార్గం ఒకటి వున్నది. దొరకవచ్చు. దొరకదు అనడానికి వీలులేదు. ఎందుకంటే భగవంతుడు భక్తవత్సలుడు కాబట్టి అడిగిన వాడికి అడిగినదిస్తాడు కాబట్టి. అంతకన్నా సులభమైన మార్గం భాగవత మార్గం. ఈ మార్గంలో వున్న వాడికి వున్నది మోక్షస్థితే! మోక్షం అంటే భావం మీద పట్టు. ఏ భావం మీద మనకు పట్టు వుంటుందో, అది మనల్ని పట్టి వుంచడం చేత మనకి మోక్షం లేదు. ఏదీ మనల్ని బంధించని స్థితిలో మనం వున్నామనుకోండి. నిశ్చల స్థితి అది. 'నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః' అన్నారు. నిశ్చల చిత్తం ఎవరికి వున్నదంటే, చలించని చిత్తాన్ని ఏర్పరచుకున్న వాడెవరయ్యా అంటే తనకోసం కోరని వాడు చలించే

అవకాశం తక్కువ. భాగవత మార్గంలో అందుకే కోరకుండా ముక్తి వస్తుంది. ఒక సుదర్శన చక్రం నాదగ్గర వుండనీ నీది అని మనం భగవంతుడిని అడగాలంటే ఎంత చేయాలండి? ఎక్కడా వుంచలేదు. 'సుదర్శన చక్రం నీ వద్ద వుండనీ'అని ఒకళ్ళకు అప్పచెప్పిన సన్నివేశం ఎక్కడా మనకి కనిపించదు, ఒక్క అంబరీషుడికి తప్ప. అంబరీషుడు కోరితే ఇచ్చాడా? కోరితే రాదు. కొన్ని చేయడం వల్ల వస్తుంది. అదీ భాగవత మార్గం. భగవంతుడు మెచ్చుకొనే పద్ధతిలో నీవు జీవిస్తూంటే నిన్నెప్పుడూ భగవంతుడు మోక్ష స్థితి లోనే వుంచుతాడు. భగవంతుడు మెచ్చుకొనే స్థితి ఏమంటే జీవులకు సేవ! 'పరహితము పరమ ధర్మము'! ఇంకొకడి కోసం తన స్వార్థం లేకుండా తాపత్రయపడేవాడు వుంటాడే, వాడ్ని మోక్ష స్థితిలో భగవంతుడే పెడతాడు. మోక్షం కోసం మనం ప్రయత్నం చేసుకోవడం కూడా ఒక పద్ధతి. వేదాలు సంస్కరించి, పురాణాలు వ్రాసి, బ్రహ్మసూత్రాలు వ్రాసి మహాభారతం వ్రాశాక, అన్ని అయ్యాక అప్పుడు వ్యాసుడికి నారదుడి వలన పరమోపదేశం కలుగుతుంది. అది కారణంగా భాగవతం వచ్చింది. చిట్ట చివరగా వేదవ్యాసుడు వ్రాసినది భాగవతం. అందులో ఇచ్చిన ధర్మం ఒకటే! సమస్తంలో వుండే భగవంతుడిని దర్శనం చేసుకుంటూ, వారికి సేవ చేసుకుంటూ వుండడమే భగవంతుడికి సేవ చేసుకుంటున్నట్లుగా! తద్వారా లభించే ముక్తి, వైభవము, కీర్తి, సంపద, విద్య కూడా అప్రయత్నముగా వస్తుంది. అదీ అందులోని సులువు. అందుకని వీళ్ళ దర్పం ఆయన పెంచుకుంటూంటాడు. ఎంతవరకూ పెంచుకుంటాడు అంటే తన గురించి తాను ఆలోచించుకోనంత వరకూ. తన గురించి తాను ఆలోచించుకుంటే అక్కడకి ఆపేస్తాడు. అదీ అక్కడి rule. చేసుకోలేని వాడికి అంటే అసమర్థుడని కాదు, చేసుకోగలిగి కూడా తనకు చేసుకోకుండా, ఆ సమర్థతని ఇతరులకు చేస్తున్నాడని అర్థం. ఆ సమర్థతని ఇతరులకోసం వినియోగం చేస్తున్నాడని అర్థం. తాను చేసుకోలేక దేవుడ్ని ప్రార్థిస్తున్నాడనుకోండి, తాను చేసుకోగలిగి తనకు మాత్రమే చేసుకుంటున్నాడనుకోండీ ఇన్ని రకాలుగా వుంటారు.

1. తను చేసుకోలేక సమర్థత లేక దైవాన్ని ప్రార్థించక అరుస్తూ, కరుస్తూ, ఈర్ష్య పడుతూ, ద్వేష పడుతూ బ్రతుకుతూంటారు.

౨. తమకి సమర్థత లేక నాకు సమర్థత లేదు కదా! పోనీ దేవుడ్ని ఆశ్రయిస్తే మనకు ఏదో కలిసి వస్తుంది అనేది ౨వ తరగతికి సంబంధించినది. తద్వారా ఏవో అవి ఇవీ పొందుతూ ఉంటాడు

3. సమర్థత కలిగి వుండి తనకు తాను చేసుకుంటూంటాడు. భగవంతునికి దీనితో ఏమీ సంబంధం లేదు. మనం చేసుకుంటే అవుతుందండీ భగవంతుడేమిటీ అంటాడు.

4. తనకు సమర్థత వుండి, దాన్ని పరిపూర్ణంగా భగవత్ కైంకర్యంగా సమర్పణ చేసి ఇతరుల మంచికోసం పాటుబడతాడు.

ఇందులో 4వ వాడు ఆయనకి చాలా దగ్గర. అదీ పరమ గురువుల మార్గం! అందుకే జ్వాలాకూలుడు ఏమి చెప్తారంటే సమర్థత లేక మా చుట్టూ చేరి భజనలు చేసేవారు మాకొద్దు. ముందు సమర్థతను పెంచుకోండి సమర్థత పెంచుకోవడం వల్ల అహంకారం వస్తుంది, కాబట్టి ఎప్పుడూ ప్రార్థన చేసుకుంటూ దైవంలో మనం పెరుగుతున్నామని గుర్తు పెట్టుకోమంటాడు. సమర్థత పెరగాలి. పెరిగిన సమర్థత భగవంతుడు ఇచ్చినదని గుర్తు పెట్టుకోవాలి. దాన్ని భగవత్పరంగా వినియోగించాలి. ఇలా చేస్తున్న వాళ్ళని ఆయనే చూసుకుంటాడు. ఆయనే నడిపించుకుంటూంటాడు. ఆయనే పెద్దవాడిని చేసుకుంటూంటాడు. చిన్నవాడిగా వాడు ఉందామనుకున్నా కూడా ఉండనీయడు. కుచేలుడ్ని ఎంత పెద్దవాడిని చేశాడు? పోతనని ఎంత పెద్దవాడ్ని చేశాడు ? శ్రీనాధుడు కాలక్రమంలో పోతన ముందు ఎంత చిన్నవాడయిపోయాడు ? ఇట్లా కొంతమంది వీళ్ళు ఎటువంటి వాళ్ళంటే, నా ముక్తి, నా సంగతేమి చేశారు అని భగవంతుడ్నిగానీ, గురువునిగానీ ఎప్పుడూ అడగరు. తన సంగతి అడగని వాడి సంగతి చూడవలసిన బాధ్యత గురువుకుగాని, దైవానికి గాని వుంటుంది. తన సంగతే ఆలోచించుకునే వాడి సంగతి గురువుగాని, దైవం గాని చూడడు. ఎందుకంటే వాడి సంగతి వాడు చూసుకుంటూంటాడు కదా మనం ఎందుకు చూడడం అని. తన సంగతి తాను చూసుకోలేనివాడు వస్తే, వాడ్ని ఆ పై category లోకి వేయడు. చేతనయి వుండీ, సమర్పణ చెంది వుండాలి. చేతకాక సమర్పణ చెందడం అదో class. నలుగురూ ఆయన పిల్లలే. ఈ నలుగురు పిల్లల్లో చేతయివుండి, అందరి కోసం పనిచేసేవాడి కీర్తి ప్రతిష్ఠలు ఆయన పెంచుకుంటాడు. ఏసుక్రీస్తు కీర్తి ప్రపంచంలో ఆయనలా పెంచేశాడు. ఆయనేమీ కీర్తి కోసం చేయలేదు. షిర్డి సాయి కీర్తి అలా పెంచేశాడు. కాలం పెంచేస్తుంది. సత్కీర్తి అలా విపరీతంగా పెంచేస్తారు. వాళ్ళ కోసం అని వాళ్ళు ఏమీ చేసుకోరు, మీరెంత దాచినా సువాసన కాలం రూపంలో అలా వ్యక్తం అవుతుంది. అలా మహాత్ములంతా కూడా వారిని వ్యక్తం చేయించి, వారి యొక్క పరిమళాన్ని ప్రపంచానికి ఇవ్వడం, అనేది కాలం రూపంలో భగవంతుడు చేసే ఒక లీల. అది చెప్పడానికి 'దర్పదః' అనే నామం. లేకపోతే గర్వం పెంచడమేమిటి ? అంటే వాడ్ని పెద్దవాడిగా చేసి, చూసుకుంటూ తాను ఆనందించడం. ధర్మరాజుకు మయసభ ఇవ్వమంటాడు. మయుడు నీకేమన్నా చేస్తానంటే నాక్కాదు, ధర్మరాజుకి చేసి పెట్టమంటాడు. ధర్మరాజుకు మయసభ కట్టించి ఇస్తాడు కృష్ణుడు. అదీ మయసభ. 'నాకు నీ వేమీ చేయనక్కర్లేదు, మావాడొకడున్నాడు, తనకుగా ఏమీ చేసుకోని

వాడున్నాడు, వాడికి ఈ మధ్య రాజ్యం ఇచ్చారు, కానీ అక్కడ పొలాలు తప్ప ఒక చిన్న building కూడా లేదు. రాజనే పేరు, ఏమీ లేదు. పైగా పెళ్ళి కూడా చేసుకొచ్చారు. అప్పుడే ద్రౌపదిని వివాహం చేసుకుని, ఏకచక్రపురం నుండి బయటపడ్డారు. అందరూ తిట్టిపోస్తారు నిన్ను, బావుండదని పెద్దలు చెప్తే భయపడి, ధృతరాష్ట్రుడు ఇంద్రప్రస్థం అనే ఒక చిన్న ముక్క ఏలుకోమని ధర్మరాజుకి ఇస్తాడు అక్కడికి వెళ్ళి ఉండమని. అదెలా వుంటుందీ? ఇంకా layout వేయని ఒక చోటు లాగా వున్నది. మనం ఇల్లు కట్టుకోవడానికి place చూడ్డానికి వెళ్తే, ఎక్కడో ఓ పొలం లాంటి దాన్లో తీసుకెళ్ళి చూపిస్తుంటారు ఇదే sir మీ site అంటాడు. అక్కడ రాళ్ళు వుండవు, road వుండదు. మన site దగ్గరే ఇది drawing room, ఇది bedroom అని మనమేదో ఊహించుకుంటాము. అట్లా అనుకుంటాము కానీ ఇంకా అక్కడ roads రావాలి electricity రావాలి, నీళ్ళు రావాలి, చుట్టుప్రక్కల market ఏర్పడాలి. అప్పుడు కదా అది నివాసయోగ్యం. అలా ధర్మరాజుకి ఒక God forsaken place ఒకటి ఇచ్చారు. అదే నీ రాజధాని అన్నారు. మిగతా రాజులు వస్తే నీకు స్థోమత గతి, స్థితి, హుందా వుండాలా ఏమీ లేదు. పైగా మామగారు ద్రుపదుడు చాలా పెద్ద రాజు. మరి అల్లుళ్ళు చూడబోతే ఇలా వున్నారు. అందుకని కృష్ణుడు మయుడికి చెప్తాడు ధర్మరాజుకి ఒక బ్రహ్మాండమైన భవంతి కట్టమని. 24 గంటల్లో అంతా వచ్చేస్తుంది. Over-night! ఎంత అద్భుతం అంటే భూమి మీద అలాంటిది లేదు. అంత కాస్తాడు. మాస్టారు 'నేను బడి పంతుల్ని, ఏం తెలియని తెలుగు మాస్టారుని నన్నింతటి వాడిని చేశారు మాస్టారు గారు'అంటూండేవారు. ఏమీ తెలియదని ఆయనంటే, ఆయనకేమీ తెలియదని మనం అనుకోకూడదు. ఎందుకంటే ఆయనకి చాలా తెలిసీ, ఏమీ తెలియని పద్ధతులలో, ఏమీ తెలియని వారితో కలిసున్నారు. తెలిసిన వాడు మూర్ఖుల మధ్య వుండడం సామాన్యం కాదు, ఎంతో కష్టం. కాస్త తెలిస్తేనే మిగతా వారంతా పాపులుగాను, మూర్ఖులుగాను, మూఢులుగాను కనిపిస్తారే, అటువంటిది ఆయనకు ఎంత తెలుసో మనకేమీ తెలియదు. అంత తెలిసీ, ఆయన తన గురించి ఆలోచించకుండా, ఇతరులకోసం అహర్నిశలు కృషి చేసి, భగవంతుని కృపకు పాత్రులై, పౌర్ణమి ఘడియలలో దేహత్యాగం చేశారు. కానీ ఆయనెప్పుడూ తనగురించి ఆలోచించుకోలేదు. తన గురించి చెప్పడం అంటే 'ఏదో తెలుగు మాస్టార్ని'అంటూండేవారు. ఆయనెప్పుడూ మనకి తన గురించి చెప్పింది లేదు. నేనింతటి వాడ్ని, నే నంతటి వాడ్ని, నాకీ అనుభూతులున్నాయి అని ఏమీ లేదు. ఆయనెవరో, ఆయనకెంత తెలుసునో మనకి తెలియదు. మనకెంత తెలియాలో అంత మాత్రమే చెప్పి, ఇది మాత్రం చేసుకోండంటూ ఆయన మొత్తం భూగోళం అంతా తిప్పేశారు. గూడకట్టు తోనే ప్రపంచం అంతా తిరిగేశారు. మాస్టరు గారి

శిష్యుడు కృష్ణస్వామి 'ఈ గూడకట్టు లోకాలను కూడగట్టు'అని అన్నాడు. అలా మాస్టరు గారి చైతన్యం ఈ రోజుకీ పాశ్చాత్యదేశాలలో ఎన్నో అద్భుతాలను సృష్టిస్తున్నది. వారందరూ ఆయన వద్ద పొందిన అనుభూతి గానీ, అనురాగం గానీ, ఒక్కొక్కరికి కనబడి అర్జెంటీనాలో Astrology లో notes dictate చేస్తున్నారు. అదేమిటి మీ వూళ్ళో ఎవరూ దొరకలేదా అని వాళ్ళు అడగలేదు, అడిగితే చెప్పేవారేమో, 'మావూళ్ళో అంతా వారి కీర్తి ప్రతిష్ఠలు పెంచుకొనే పద్ధతిలో వున్నారు. నేనక్కర్లేదు. వాళ్ళే చాలా పెద్దవాళ్ళు. అందుకనే నీకు చెప్పకుంటున్నాను' అన్నట్లుగా వుంటుంది. మాస్టరుగారి కార్యక్రమం అక్కడకు వెళ్ళి చూస్తే, మనం ఎంత చిన్న వాళ్ళమో తెలుస్తుంది. దేహం వదిలేసినంత మాత్రాన లేరనే అదొక భావన. నేనున్నాను అని వుండేట్లు కాదు, నీకు బుద్ధి వచ్చేట్లుగా నేను పని చేస్తున్నాను అన్నట్లుగా మాటి మాటికీ కనిపిస్తుంటారు, మనకి చెప్పకుండానే, మనకి చెప్తూంటారు. నువ్వు చేయకపోతే నాపని ఆగదు అంటూండేవారు. నువ్వు చేయకపోతే నీ కన్నా బాగా చేసే వాళ్ళు వస్తారు, నేను చేయకపోతే నాకన్నా బాగా చేసేవాళ్ళు వస్తారు అని చెప్తూండేవారు. ఆయన దైవాన్ని పరిపూర్ణంగా ఆశ్రయిస్తూ అందులో జీవిస్తూండేవారు, అలా అని అదొక మాదిరి వినయం కాదు. ఆయన లోపల ఎంత వినయమో బయట అంత దురుసు. ఆధ్యాత్మిక సామ్రాజ్యంలో మాస్టరు గారు చిరుతపులి వంటి వారు. మనం ఎందుకు కిందపడి వుండాలోయ్? మనం వాడితో వున్నాం కదా, అనేవారు. వాడి వద్ద వినయం, ప్రపంచంలో తన వద్దకు వినయవంతుడు వస్తే వినయం. వ్యాపారస్థుడు వస్తే వ్యాపారం. మదం కలిగినవాడు వస్తే వాడి కన్నా మదం. ఇలా ఎవడొస్తే వాడికుండే తత్త్వం మీద తన గురుత్వం చూపించేవారు. మామూలుగా ఏమీ లేని వాడొచ్చాడనుకోండీ వాడితో సమానం. అవతల వాడు ఎంత అయితే మనం అంత. అవతలవాడు బుల్లి వాడయిపోతే మనం కూడా బుల్లి వాళ్ళమయిపోతాం. అవతలి వాడు అమాయకుడు అయితే అంత అమాయకంగాను వాడితో ప్రేమగా, అవతలివాడు లౌకికుడు అయితే వాడితో లౌకికంగా, అవతలివాడు ఆధ్యాత్మిక సంపత్తి అయితే వాడితో ఆధ్యాత్మికంగా ఉండేవారు. ఏమిటిదంతా? తన గురించి అనేది లేకపోవడం చేత, దైవమే ఆయన్ని పెంచుకుంటూ వెళ్ళాడు. అదీ దర్పదః.

## 741 అదృష్టః

తనకంటూ అసలు గర్వం వుండదదండీ. ఇదంతా వాడికి పెంచడం, వీడికి తగ్గించడం కార్యక్రమం. అసలాయన సంగతేంటంటే అసలేమీ లేదట. రాముడి చరిత్ర తీసుకున్నా, కృష్ణుడి చరిత్ర తీసుకున్నా, మహాత్ముల చరిత్ర తీసుకున్నా, అంటే పరమ యోగుల చరిత్ర తీసుకున్నా వారిలో అసలు దర్పమే వుండదు. ప్రస్తుతం అసలు ఏ దర్పం లేకుండా వున్నవారిని చూద్దాం అనుకుంటే అటు భీమిలి లోనూ, ఇటు షిలా నగరిలో వెళ్లి చూడవచ్చు. వారిద్దరూ ఆ రెండింటినీ పక్కన ఎప్పుడో పారేశారన్నట్లుగా గోచరిస్తుంది. ఇద్దరి మాటలో గాని, చేతలో గానీ యేమీ వుండదు. మనకి ఎప్పుడూ ఒకటి living example ఉంటే కొంచెం inspiration బాగుంటుంది. మనకి కాస్త వస్తే గర్విస్తాం, పోతే ఏడుస్తూంటాం. కొంచెం ఆరోగ్యం బాగుందంటే ఆవకాయ తినేద్దాం అనుకుంటాం మనం. నాకేంటి నేను ఆవకాయ తింటాను అంటాడు. మర్నాడు బి.పి. 180/120 అంటే భయపడిపోయి ఆవకాయ జాడీలన్నీ కట్టేసి పైన పడేసి, లేకపోతే విరక్తి. స్మశాన వైరాగ్యం లాగా ఒక నాలుగు రోజులు. మళ్లీ బాగుందంటే మళ్ళీ మామూలే. అంటే ఆవకాయ దగ్గరే మనం యిలా వుంటే మిగతా విషయాల్లో ఎట్లా ఉంటామో చూడండి. బొత్తిగా బాలేదుట అంటే ప్రకృతి వైద్యం చేసేస్తామండీ, అక్కడ నుండి కొంచెం బాగానే ఉందంటే నెమ్మదిగా ఒక్కోటి ముట్టుకోవడం మొదలుపెడతాం. అది ముట్టుకుంటుంటే ఏమవుతుంది అంటే అది అంటుకుంటుంది. అది తరువాత పెద్దదైన తర్వాత అసలు ఎందుకు మానేశాం మనం ప్రకృతి వైద్యం, అని మళ్ళీ అనుకుంటూ ఉంటాం కదా. ఇట్లా ఉంటుంది మనదంతా మనం అంతా ఉయ్యాల. అన్నమాచార్యుల వారు బాగా చెప్పారు. ఈ జీవులు కాసేపు యిటు వెళుతుంటారు, కాసేపటు వెళుతుంటారు. కాసేపేమో సినిమా టాకీసులు చుట్టూ తిరుగుతుంటారు, కాసేపేమో ఆశ్రమాల చుట్టూ తిరుగుతుంటారు. ఇదేమిట్రా అటు ఆశ్రమం, ఇటు సినిమా రెండు ఇట్లా ఊపుతూ ఉంటారు జీవులలో వాడున్నాడు కదా హృదయంలో. అందుకని వాళ్ళు ఇట్లా ఊగుతూ ఉంటే ఆయనకు ఉయ్యాల ఊగడం అలవాటయింది అని వ్రాశారు అన్నమాచార్యులు వారు. 'అలర చంచలమైన ఆత్మలందుండ నీ కలవాటు చేసె నీ ఉయ్యాల' అని. అట్లా మనకి ఊపుతూ ఉంటాం. ఎట్టి పరిస్థితులలోనూ గర్వం లేని వాళ్ళు అదృష్టః! కాస్త పొగిడితే మనకు వచ్చేస్తుంది. పైకేదో అంటాం గానీ అబ్బే అంతా దేవుడి దయండీ, అదనీ ఇదనీ. కానీ లోపల మాత్రం నమ్మం. మనమే. ఖచ్చితంగా లోపల కుర్చీలో మనమే కూర్చుంటాం. పైకంటూ వుంటాం. అబ్బే యిదంతా దేవుడి దయండీ, ఆయన కృపండీ, అదండీ ఇదండీ అని. అందుకని నిజంగా సత్త్వం మనలో పెరగాలంటే అంత పరిపూర్ణమైన సత్త్వం లో ఉండే వాళ్ళ

యొక్క సాంగత్యం మనకు అవసరం. వెళ్లి కలుస్తూండాలి. వాళ్లు మనకేం చేశారు అక్కడికి వెళితే మర్యాదలు అని చూసుకుంటాం. అది కదా. నా అంతటివాడు వెళ్తే వాళ్ళు నాకేం మర్యాద చేశారు అని చూసేవాడు రావణాసురుడు. నువ్వు మర్యాద కోసం వెళ్ళావా? ఆయన యొక్క సాన్నిధ్యం కోసం వెళ్ళావా? ఆయన సంభాషణ కోసం వెళ్ళావా? ఆయన దర్శనం కోసం వెళ్ళావా? ఆయన స్పర్శనం కోసం వెళ్ళావా? దేనికి వెళ్లావు? వెళ్లిన దగ్గర నుండి మనకు లోపల నుండి మన రజస్సు మనల్ని పొడుస్తూ వుంటుంది. చూడలేదు, మాట్లాడలేదు. మనమే చూశాం, ఆయన మాట్లాడుతూ వుంటే విన్నాం. చాలామంది వున్నారు కాబట్టి దండం దగ్గరకెళ్ళి పెట్టుకోవడానికి వీలుపడలేదు. ఎట్లా ఉంటుందీ తిరిగి వచ్చేటప్పుడు? అసలు లోపలే మనము పుండు నాక్కుంటూ ఉంటే పక్క నుండి ఏంటి మిమ్మల్ని ఇవాళ ఆయన పలకరించలేదు అని ఎవరో అంటారు. అంటే ఇంకొంచెం వస్తుందప్పుడు. ఆ వాళ్లంతా పెద్దవాళ్ళయిపోయారు, మనం ఇప్పుడు వాళ్లకు కనబడంలే-- ఇట్లా వచ్చేస్తుంది. ఏమిటి? అదొక ధోరణి. అసలు ఎందుకు పలకరించాలి? అసలు మన గురించి ఏమిటి భావన? మన గురించి వున్నంత సేపూ దైవం వుండడక్కడ. ఇదొక తమాషా. ఒకటే కుర్చీ ఉంటుందండీ police station లాగా. Police station నిజంగా ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే అద్భుతమైన ప్రదేశం. ఒకటే కూర్చీ ఉంటుంది police station లో. ఎవరూ లేకపోతే Head constable కూర్చుంటాడు. SI రాగానే Head constable నిల్చుంటాడు, SI కూర్చుంటాడు. CI, SI నిల్చుంటాడు. DySP వస్తే CI కూడా నిల్చోవలసిందే. SP వస్తే ఇక మిగతావాళ్లంతా నిల్చుంటారు. అట్లా కుర్చీ అక్కడ ఒకటే ఉంటుంది. నువ్వు కూర్చుంటావా, వాడిని కూర్చో పెడతావా? వాడిని కూర్చోబెడితే నువ్వు నీ గురించి ఆలోచన రాదు. ఆవాహయామి అంటాం తప్ప ఏదిరా వచ్చాను, ఒక కుర్చీ లేదు, ఏం లేదు ఎక్కడ కూర్చోమంటావు? అని అడుగుతాడు. ఎందుకంటే మనం పిలిచి ఒకటే కుర్చీ ఉంటుంది. పిలిచి ఏం చేస్తామంటే కూర్చోండి సార్ అంటాం దేవుడ్ని. ఎక్కడరా నువ్వు ఖాళీ చేస్తే కదా, వాడు కూర్చుంటాడు. ఇంత దైవభక్తి కూడా ఒక రకమైన loop లో పడుతుంది. నేనది బాగా గమనించా. స్వగతమే. దైవంతో పాటు మనల్ని link వేసుకొని ఆలోచించుకుంటూ ఉంటాం వాడికి మనం యెంత దగ్గర? వాడికి మనమెంత యిష్టం? మనల్ని యెప్పుడు కరుణిస్తాడు? ఇట్లా అసలు నువ్వెందుకు? వాడిని పెట్టు. ఇదీ రావాలి. అందుకే వైష్ణవ సాంప్రదాయంలో దాసత్వం అని పెట్టారు హనుమంతుడు ఎంతటి వాడండీ? గట్టిగా మాట్లాడితే రాముడంతటివాడు తెలుసా! అంతేకాదు రాముడికి హనుమంతుడు సహాయపడ్డాడు తప్ప, హనుమంతుడికి రాముడు సహాయపడిన సన్నివేశాలు ఏమైనా చెప్పండి రామాయణంలో. ఎక్కడ కూర్చుంటాడు? ఏమంటాడు? నేను

దాసుడినంటాడు రాముడికి. ఏంటండీ. మనకు అర్థం కాలేదు. మొదట్లో కొంచెం బాధగా ఉండేది. ఏమిటీ హనుమంతుడు గారు. నాకేమో చాలా ఇష్టం హనుమంతుడు అంటే. అన్నీ చేసి పెట్టి, పైగా దాసుడ్నంటాడేమిటీ? సంజీవని తెచ్చాడు. భుజాల మీద ఎక్కించుకున్నాడు. అటు నుంచి ఇటు వెళ్ళాడు రెండుసార్లు. అన్నీ దూకాడు. సముద్రం దాటాడు. ఎంత చేశాడు? ఇంత చేస్తే రాముడి పాదాల వద్ద ఉంటానంటాడేమిటీ? అనిపించేది. మరి 'దాసోహం' అంటే అది అర్థం. రాముడికి దాసుడ్ని నేను, అని చెప్పాడు. రాముడికి దూతగా వెళుతున్నాను, రామ బాణంగా వెళుతున్నాను, అంటాడు. అంతా రాముడే, అంటాడు. ఎక్కడ నుండి వచ్చిందిది? పూర్ణమైన జ్ఞానంలో నుండి ఆ వినయం వచ్చింది. అందుకని పాపం హనుమంతుడిని 'కోతికి శక్యమా అసురకోటి గెల్వ' అని రామదాసు రాశాడు అనుకోండి, నాకు మండేది. హనుమంతుడికి మండదు. ఏంటిట్లా కోతి అంటాడని. కావాలనే అందరికీ తెలియకూడదు అని కోతి రూపంలో వచ్చాడు తప్ప అతడు కోతి కాదు. వాయువు నుండి పుట్టాడు హనుమంతుడు. అగ్ని నుండి పుట్టిన వాడు నలుడు. నలుడు, నీలుడు, అంగదుడు వీళ్లంతా ఎంతటి వాళ్లో తెలుసా. వీరంతా మనం ఇంతటి వాళ్ళమని మనకెందుకులే అని మరిచిపోవడానికి, కోతుల రుపంలో ఉన్నారు. అందుకనే హనుమంతుడు పూర్ణ భక్తుడన్నారు. కారణం ఏమంటే తన గురించి తనకు తెలియదు. మరిచిపోయాడు. రాముడే ఉంటాడు, తనుండడు. 'నువ్వింతటి వాడవయ్యా' అని ఎవరైనా గుర్తు చేస్తే అప్పుడు కాస్త గుర్తొస్తుందన్నమాట. ఓహో అవును కదూ, అని. జాంబవంతుడు అంతటివాడు హనుమంతుడికి చెప్తే గుర్తొస్తుంది. ఎందుకని? తన కుర్చీలో దేవుడే ఉంటాడు. ఇంకెవరూ ఉండరు. మనమో? పేరు ఆయనది. మొత్తం అంతా మనదిగా ఉంటాం కదా! ఎప్పుడు ఆయన పక్కన మన photo పెట్టుకుని పూజ చేస్తారా అందరూ, అని చూసే type. ఎక్కడ తెములుతాయి? హనుమంతుడు పరిపూర్ణ జ్ఞాని అయిన తర్వాత భగవంతుడు భూమి మీద దిగి నడిచి వస్తాడట, నేను ఆయన్ని చూద్దామనుకుంటున్నాను, అని అంటే! ఎలా తెలుస్తుంది భగవంతుడు వస్తే? మనకు పరిపూర్ణ జ్ఞానం ఉన్నంత మాత్రాన తెలియనక్కరలేదు. వాడి అనుగ్రహం ఉండాలి. ఎంతోమంది జ్ఞానులు చివరకు తుప్పు పట్టిన సన్నివేశాలున్నాయి. ఇంత జ్ఞానం కూడా, సమర్పణం లేకపోతే దానికి పూర్తి రాణింపు రాదు. అందుకని హనుమంతుడు అడిగాడట, 'నాకు ఎట్లా తెలుస్తుంది ఆయన వస్తే' అని. 'ఏం లేదు నువ్వు ఏ రూపంలో ఉన్నా సరే నిన్ను గుర్తిస్తాడు. ఏ రూపంలో ఉన్న సరే నిన్ను గుర్తించి నీ యొక్క పరిపూర్ణమైన తత్త్వాన్ని వివరిస్తాడు' అని చెప్తారు. శిష్యుడు jeans వేసుకువచ్చాడా, లేకపోతే పట్టుపంచె కట్టుకొచ్చాడా, దీన్నిబట్టి అవతలివాడు సంస్కారవంతుడా కాదా నిర్ణయం చేసేవాడు గురువవడు. వాడు

jeans లో రావచ్చు, మంచి hairstyle పెట్టుకోవచ్చు, పిలక పెట్టుకుని పంచె కట్టుకుని, అది కూడా లుంగీలాగా కాకుండా ధోవతి లాగా కట్టుకుని-- ఇవన్నీ peripherals కదా! లోపల ఉన్నది ఏమిటో చూడగలగాలి కదా నిజమైన గురువు. చూసినప్పుడు వాడని చూసినవాడు బయటేముందనేది చూడడు కదా! కపి రూపంలో ఉండే హనుమంతుడు, normal state ఏమిటయ్యా అంటే monkey form. అటువంటిది రాముడు దగ్గరకు వెళ్ళినప్పుడు బ్రాహ్మణ వేషంలో వెళ్ళాడు. ఎందుకని? బ్రాహ్మణుడిగా వెళ్తే కొంచెం గుర్తిస్తాడు, బాగా పట్టీలవి పెట్టుకెళ్తే అని కాదు. అంతకు ముందు సన్నివేశం రాముడికి ఏమిటయ్యా అంటే మతంగ మహర్షి ఆశ్రమంలో 'ఋష్యమూక పర్వతం మీద వానరులున్నారు, వారి యొక్క సహాయం చేత నువ్వు సీతజాడ తెలుసుకోగలవు' అని తెలుసుకుని వానరుల కోసం వెతుక్కుంటూ వస్తాడు రాముడు. వానరులంటే విశిష్ఠమైన నరులని. కోతులని ఆ పదానికి అర్థం ఉండగా ఇది ఇంకొక అర్థం. అందుకని వానరుల కోసం వెతుక్కుంటూ వస్తున్నప్పుడు వానరుడిగా వెళితే అంత బాగుండదని ఈయన వేషం మార్చుకుని వెళ్ళాడు. వెళ్లి రామలక్ష్మణులతో నాలుగు మాటలు మాట్లాడాడు. 'మీరెవరు? మీరు చూడబోతే ఇట్లా ఉన్నారు, అట్లా ఉన్నారు, చాలా అద్భుతమైన తేజస్సు కనిపిస్తోంది' అని వర్ణిస్తాడు వారిద్దరి రూపాలని. అతడు మాట్లాడగానే రాముడంటాడు లక్ష్మణుడితో 'ఇతడు పూర్ణజ్ఞాని, సమస్తము తెలిసినవాడు. అన్ని వేదములు కాచి వడపోసినవాడు. ఇతడి కోసమే మనం వెతుకుతున్నాం' అన్నట్లుగా! అట్లా హనుమంతుడ్ని రాముడు గుర్తిస్తాడు. అప్పుడు హనుమంతుడు రాముణ్ణి గుర్తిస్తాడు. గుర్తించి 'దైవమే రూపం కట్టుకు వచ్చింది. కాబట్టి ఆయన కార్యానికి మనం సమర్పణ చెందాలి' అని, సమర్పణ చెంది పనిచేశాడు. ఏ గర్వం లేదు. రావణుడిలాంటి వాడిని చూసినప్పుడు చూపిస్తాడు తనేమిటో. పరిపూర్ణంగా శివుడే హనుమంతుడు. శివుడు దిగివస్తే వైష్ణవ తేజానికి శిష్యుడిగా చేరి ప్రపంచానికి గురువుగా ఉంటాడుట! శివతేజం హనుమంతుడి లాగా వచ్చి వైష్ణవతేజానికి శిష్యుడుగా ఉంటూ ప్రపంచానికి గురువయ్యాడు. హనుమంతుడే గురువు, రాముడు ప్రభువు. అలాగే మశ్చీంద్రుడిగా వైష్ణవ తేజం దిగివస్తే ఆయన శిష్యుడిగా గోరకనాథ్ గా శివతేజం దిగి వచ్చింది. ఆ గోరకనాథ అనే శివతేజం యోగవిద్యను ప్రపంచానికి ఇస్తే, ఆ విద్యనే సంస్కరించి పతంజలి మహర్షి మనకి అష్టాంగ యోగంగా ఇచ్చారు. ఇట్లా వైష్ణవ తేజం, శివతేజం రెండూ జడలో పాయల్లాగా ఒకదానికొకటి అల్లుకుంటూ వస్తుంటాయిట. అందుకనే రాముడు శివుడికి ప్రార్థన చేస్తే శివుడు రామనామం చేశాడట అని ఉంటుంది రామాయణంలో. రాముడు రామేశ్వరంలో శివుడికి ప్రార్థన చేశాడు శివుడు విష్ణు సహస్రనామం యింత ఓపికగా చేసుకోలేకపోతే 'శ్రీరామ రామ రామేతి' అనండి

అని చెప్పాడు. అదే వెయ్యి నామాలకు సమానమైనది అని. భగవంతుడు నిగర్వి. ఏ గుణములూ లేని వాడికి గర్వం మాత్రం ఎక్కడుంటుంది? దిగి వచ్చినప్పుడు కూడా వుండదు. రాముడి చుట్టూ వుండే వారి గర్వం చూడండి, రాముడ్ని చూడండి. కృష్ణుడి చుట్టూ వుండే వారి గర్వం చూడండి, కృష్ణుడ్ని చూడండి. ఆయన్ని చూసి వీళ్లు విర్రవీగుతూంటారు. గురువుగారిని చూసి శిష్యులు బాగా రెచ్చిపోతూంటారు. గురువుగారు గొప్పవాడైన కొద్దీ, మహాత్ములయ్యే కొద్దీ శిష్యులు బాగా రెచ్చిపోతారెక్కడైనా, మరేమనుకుంటున్నావని. మామూలుగా గుడిలో విగ్రహానికి ఆకర్షణ పెరిగి భక్తులు పెరిగే కొద్దీ హడావుడి అంతా పూజారిదే. విగ్రహం ప్రసిద్ధిగాంచక ముందు, ప్రసిద్ధిగాంచిన తర్వాత కూడా అట్లాగే వున్నది. తిరుపతిలో మన ఓపిక పెరిగి దానికి మోపేస్తూన్నాం. వజ్ర కిరీటాలు అవీ. అదెప్పటి నుండో అలాగే వున్నది కదా! పూజారులు, దాని చుట్టూ వుండేవాళ్ళు, అజమాయిషీ చేసే వాళ్ళు ఎంత వాళ్ళయిపోతుంటారు? అట్లాగే దైవం చుట్టూ వుండే వాళ్ళకి కొంచెం అపాయం ఎక్కువ. గురువు చుట్టూ వుండే వాళ్ళకి కొంత అపాయం ఎక్కువ. మనం తిరుపతి వెళితే అక్కడ జరిగే అన్యాయాలన్నీ చూస్తూ, అదిగో వాడిని ఎవడినో మనకన్నా ముందు line లో పెట్టేశారు, అంతేనమ్మా ఇక్కడ పలుకుబడి ఉంటే అన్నీ జరుగుతాయి ఇందాకటి నుండి line లో పడి ఉన్నాం. ఇదే discussion తప్ప దేవుడు ఉండడు కదా! నీకెందుకు? నీ గోల నువ్వు చూసుకోవచ్చు కదా! ఎవరి గోల వారిది ఈ ప్రపంచంలో. అట్లాగే ఒక గురువుగారి దగ్గరికి వెళ్ళామనుకోండి ఆయన చుట్టూ ప్రమథ గణాలు. ఎంతసేపూ మన దృష్టి వాళ్ళ మీద పనిచేస్తూ ఉంటుంది. చూశావా అతన్ని, ఏం లాభం గురువుగారి దగ్గర ఉన్నాడనే పేరే తప్ప అతనికి ఏమీ రాలేదు, అనుకుంటాం. అంతేగా మామూలుగా మనకు జరిగేది. మన మనస్సు ఏం చూపిస్తుంది మనకు? నువ్వు ఎవరిని చూడడానికి వెళ్ళావు? ఎవరిని చూస్తున్నావు? ఎందుకో మనకు side issues మీద interest ఎక్కువ, main issue మీద కన్నా. అందుకని రామాయణంలో రాముడ్ని కేంద్రంగా పెట్టుకుని, భాగవతంలో కృష్ణుడ్ని కేంద్రంగా పెట్టుకుని, భారతంలో ధర్మరాజును కేంద్రంగా పెట్టుకుని ఇట్లా చదువుకుంటూ ఉంటే అసలు నిగర్వత్వం అంటే యెట్లా ఉంటుందో తెలుస్తుంది. అదొక్కటే మనం భగవంతుడికి దగ్గరగా ఉండే చోటు. చాలాసార్లు చెప్పాను. రజస్సు నుండి గాని, తమస్సు నుండి గాని దైవాన్ని పొందలేము. కొన్ని దేవతల యొక్క అనుగ్రహం కొంతకాలం పాటు పొందవచ్చు. అది కూడా నువ్వు చేస్తున్నంతసేపు వుంటుంది. ఈ దేవతలందరూ ఎక్కడ నుండి పుట్టుకు వచ్చారో వాడి యొక్క అనుగ్రహం నీకు కావాలంటే నువ్వు సత్త్వం లోకి ప్రవేశించాలి. సత్త్వం అంటే ఏమిటండి అని మీరు అడిగితే గుణత్రయవిభాగ యోగంలో శ్రీకృష్ణుడు వరుసగా చెప్పాడు సత్త్వగుణం అంటే ఏమిటి అని. ఒక్కసారి చదువుకోండి.

చదువుకుంటే అందులో మనకు ఏమున్నాయి, ఏమి లేవు, ఏం సంపాదించుకుంటే బాగుంటుందో తెలుస్తుంది. అంతేకాదు మనలో రజోగుణం ఎంత వుంది, తమోగుణం ఎంత వుంది తెలియాలంటే అవి కూడా పట్టిచ్చాడు. రజోగుణం వాళ్ళు యిట్లా ఉంటారు, అవి మనలో చాలా కనిపిస్తాయి మనకు. తమోగుణం వాళ్ళు యిట్లా ఉంటారు, అవి చాలా కనిపిస్తాయి. మొట్టమొదట చదువుకుంటే ఎట్లా ఉంటుందంటే అదేంటి తమస్సు, రజస్సు యొక్క కళ్యాణ గుణాలు అన్నీ పూర్తిగా మనలో వున్నాయి, సత్త్వం లేదే అనిపిస్తుంది. ఎక్కడ ఉన్నామో మనకుగా మనకు తెలుపుతుంది భగవద్గీత. సత్త్వగుణంలోకి ప్రవేశిస్తే అక్కడ నుండి గుణాతీతంలోకి దారి. ఎందుకంటే భగవంతుడు గుణాతీతుడు కాబట్టి ఇంక దర్పం ఉండే ప్రశ్నే లేదు.

# 742 దుర్ధరః

అంటే ఎవరూ ధరించ లేరు ఆయనని. ఆయనే అంతా ధరించి ఉన్నాడు కదా! ఆయన్నెవరు ధరిస్తారు? భరించలేరు ఆయనని. ఆయన భరించాలి తప్ప, ఆయనను మనం భరించ లేము. అందుకని దీపం పెట్టి నువ్వే చూసుకోవాలి నాయనా, అని చెప్పాలి. సత్యభామ ఒక మాదిరిగా example భరించడానికి. మా ఆయన బరువు నాకు తెలియదా అంది. తూకం వేసింది, అవ్వలేదు కదా! అప్పుడు చూసి అమ్మో! ఇది మనం అనుకున్న విషయం కాదు అని తెలుస్తుంది. దుర్ధరుడు. ధరింప శక్యం కానివాడు. తలచుకుంటే దూది పింజె అయిపోతాడు, లేకపోతే పెద్ద కొండంతయిపోతాడు. కొండేముంది? కొండ భూమిలో చిన్న భాగం. భూములు, గోళాలు ఇన్ని ధరించి ఉన్నాడు. మనకు అవగాహన లేదు. భగవంతుడు యేమి ధరించాడో తెలుసుకుని ఆలోచిస్తే మన గుండె పగిలిపోతుంది. ఇటువంటి గోళాలను యెన్నో మనకు తెలియనివి, తెలిసినవి ధరించి వున్నాడు. ఆయన్ని యెవరు ధరిస్తారు? అందుకనే తన లాగా మోసే వాళ్లంటే ఆయనకు ఇష్టమట. వీడు మోస్తున్నాడు పాపం మనలాగా. పైగా ఆయన మార్గంలో నడవడం అంటే మోయటమే. ఎక్కడం కాదు. మోయబడుతున్న వాడు పిల్లవాడు, మోసేవాడు తనవాడు. పెరిగినవాడు, పెద్దవాడు, తెలిసినవాడు. అందుకనే 'అమ్మ బాబోయ్ యెంత మోస్తున్నారు మాస్టారూ మీరు' అంటే 'అవును అట్లా మోయమన్నారు' అని చెప్పారు. ఏమీ మోయని వాడు, అప్పుడప్పుడు వచ్చి కబుర్లు చెప్పే వాళ్ళు కూడా ఉంటారుగా. అలాంటి ఒకడడిగాడు 'ఏం మాస్టారు మీరు ఇంతింత మోస్తున్నారు' అంటే 'నేను మోసే దానికి ఒక ఉదాహరణ చెప్పనటరా' అంటే 'చెప్పండి మాస్టారు' అంటే 'ఒక నున్నటి కొండట. అది తిరుపతి మొదటి కొండంత ఎత్తు ఉంటుందిట. దానిపై నుండి అట్లా నూనె పోసి ఇటుపక్క నుండి ఎక్కమంటున్నారుట, మెట్లు లేవు. గుండ్రాయిలాంటి కొండ ఊహించుకోండి, దానిపై నుండి నూనె పోసేస్తున్నారట. నూనె పోసేస్తూ ఇటు నుండి ఎక్కమంటున్నారట. పోనీ ఎక్కుతుంటే ఒరేయ్ వీడు ఎక్కుతున్నాడని పైన అటు, ఇటు ఒక పదిమందిని పెట్టారుట వీళ్ళందర్నీ కూడా మోసుకురా పైకి, అని'. మనకి ఎక్కడమే అంతంత మాత్రం. తిరుపతి కొండ ఎక్కేటప్పుడు బూట్లు వేసుకుంటే, మనకు బరువవుతాయని బూట్లు వదిలేసి నడుస్తూ ఉంటాము కదా. ఏదైనా సంచి పట్టుకోవాలంటే 'ఆ ...బరువు' అంటాం. శరీరమే బరువు మనకు కదా. 'అటువంటిది ఇంతమందిని మోస్తున్నాను రా. నన్ను రమ్మనటమే కాదు నేనెక్కుతుంటే ఎక్కుతున్నానని తెలిసి ఇంకొక పదిమందిని భుజాల మీద ఎక్కించారు రా'. 'మరి ఎట్లా మాస్టారు' అంటే ఎక్కేస్తానన్నారాయన. 'ఎట్లా ఎక్కేస్తారు మాస్టారు'? అంటే 'వాడున్నాడు కదా?' అది. మన

ఎక్కగలమంటే ఎక్కలేము. వాడున్నాడనుకుంటే ఎక్కగలం. అసలు పెద్ద పెద్ద ఉపన్యాసాలలో మనకు ఉపదేశాలుండవండీ. మహాత్ములు మాట్లాడే చిన్న చిన్న మాటలలో పెద్ద పెద్ద ఉపదేశాలుంటాయి. దుర్ధరుడు: అట్లాగే మరి వాళ్ళ అమ్మ కట్టేద్దామనుకుంది బాలకృష్ణుడ్ని. మా అబ్బాయి నడుము నాకు తెలియదా అని, తాడు తెచ్చి కడదామనుకుంటే, ఎంత తాడూ సరిపోదు. ఊళ్లో అంత తాడు తెచ్చినా కూడా అవ్వలేదు. భయమేసి మూర్ఛ వచ్చినంత పనైతే మామూలుగా అయిపోయాడు. తర్వాత ఆవిడకు గుర్తు కూడా లేదు. యిదివరకు ఇట్లా అయ్యింది కట్టేటప్పుడు, యిట్లా అయిపోయాను అని చెప్పి. అట్లాగే సుడిగాలిలా ఒకడు వస్తుంటే ఒళ్లో పడుకున్న వాడు బరువైపోతుంటాడు. అంతవరకు బాగానే వున్నవాడు అంతకంతకీ అంతకంతకీ అంతకంతకీ యెంత బరువైపోతాడంటే ఒళ్ళు పచ్చడయిపోతుంది. నేల మీద పెట్టేస్తుంది. అలాగే మరి గోవర్ధన పర్వతం ఎత్తడం. ఆయనే సమస్తాన్ని ధరించాడు కాబట్టి ఆయన్ని ధరించేది ఇంకొకటి లేదు అని చెప్పడానికి. అలాగే మత్స్యావతార కథ. కదా! తనకేదో దొరికిందట. తీసుకొచ్చి చిన్న కుండీలో వేశారట. అందులోంచి పెరిగితే ఇంకొంచెం పెద్ద కుండీలో వేశారట. అక్కడ నుండి దాకలో వేశారుట. అక్కడ నుండి చెరువులో వేశారుట. అక్కడ నుండి నదిలో వేశారుట. ఎక్కడ పెడితే అక్కడ ఆయన పెరిగిపోతున్నాడట. లాభం లేదని సముద్రంలో వేశారుట. ఇవన్నీ ఎందుకు చెప్తారంటే 'He is beyond and He is the one who is holding everybody'. నిన్ను మోసే వాడిని నువ్వు మోయగలవా? నువ్వు మోయ లేవు. అందుకని దేవుడికి నేనేదో చేసి పెడుతున్నానని అనుకోక వాడే చేసి పెడుతున్నాడు. వాడే నిన్ను ధరించి వున్నాడు. మనం చొక్కా వేసుకున్నట్లు ఆయన మనల్ని వేసుకున్నాడండీ. అది. చొక్కా విప్పేసినట్లు ఆయన మనల్ని విప్పేయచ్చు కూడా. దుర్ధరుడు, అపరాజితుడు.

## 743, 744 అథ, అపరాజితః

అపరాజితుడు. ఎప్పుడూ ఆయనదే జయం. ఆయన్ని జయించే వారు ఎవరూ లేరు. భక్తుల్ని ఎవరూ జయించలేరు. దేవుడ్ని ఎవరూ జయించలేరు అనేది పెద్ద విషయం కాదు. ఈ నామాలలో గొప్పవిషయం ఏమంటే తత్త్వం, అవతారములు, అంశలు. అంశలు అంటే భగవద్భక్తులు. హరి కళలు అంటారు భాగవతంలో. భగవతత్త్వాని మొత్తం 21 అవతారాలలో వివరిస్తారు భాగవతంలో. ఇవి కాక, హరికళలు వున్నాయి. అదేమిటి అంటే భగవంతుడు భక్తుడి రూపంలో ప్రపంచంలో మెలిగినవారు. దానికి లెఖ్ఖ లేదు. వారికి అపజయం లేదు. ఓడిపోకూడదనుకుంటే చేయవలసిన తెలివైన పని ఏమంటే, వాడిలో పోయి కూర్చోవడమే! సార్, ఇంక మీరు చూసుకోండి ఇదంతా. నేను చేయగలిగినంత పాడుచేశాను. మరింక దాన్ని పాడుచేయలేను, బాగు చేయలేను. 'ఇప్పడేం చేయాలి మాస్టారు?' అంటే, 'ఇంక ఇప్పుడేం చేయక. ఏదో చేశావుగా. ఆగు, మాస్టారు చూసుకుంటారు' అనేవారాయన. భగవద్భక్తుడు ఇంక అయిపోయింది, ఇహ ఏమీ లేదు అనే స్థితి నుండి పుంజుకుని పైకి వచ్చి విజయాన్ని సాధిస్తాడు. అది భగవంతుడి విజయం, వాడిది కాదా విజయం. తనని పరిపూర్ణంగా నమ్మినవాడు అయినపుడు, ఆయన చూసుకుంటాడు, ఆ తర్వాత ఎలా వున్నా. చూడండి పరీక్షా భక్తి అని వుంటుంది మనకి. అంటే జీవితంలో పరీక్షలు వస్తున్నపుడు ఉధృతంగా వుంటుంది భక్తి. ఆయనకి తెలుసు పరీక్షల కోసం గాను ఈ భక్తి అని, ఈ విధంగా అయినా తలుచుకుంటున్నారులే, అని కరుణామయుడు గనక చేసి పెడ్తాడు. కొంచెం comfort రాగానే చేస్తేనేనా అనే తత్త్వం వస్తుంది. మానవ మేధస్సు చాలా తమాషా అయినది. జయం కలుగుతున్నంత సేపూ మనం కొంచెం కులాసా అయిపోతూంటాం. కులాసా అయిపోయి ఏదో చేసేసి, మళ్ళీ ఆయన వద్దకు వెళ్ళి మళ్ళీ 'బాబ్బాబు'అని పట్టుకుంటాం. మంగళవారాలు హనుమంతుడికి గుళ్ళో గారెల దండలు ఎందుకని పడ్తాయి? ఇన్ని గారెలు ఏం చేసుకుంటాడనుకుంటాం. ఎందుకో హనుమంతుడ్ని అడగండి చెప్తాడు కథలు. ఈ గారె కథ ఇది, ఈ గారె కథ ఇదీ అంటూ ప్రతి గారెకీ వెనుక ఓ కథ వుంటుంది. 108 గారెలదండ వేశామంటే, ఎంత జరిగితే చేశాం? లేకపోతే ఏం చెయ్యాలని ముందు reminder కి వేశాం? అంతకు ముందు promise కోసం, అయ్యాక అయ్యిందని వేస్తాం. ఇవన్నీ మనం చూసి 'చూశావా' అనుకుంటాం. వాళ్ళలా అనుకోరట. అదీ వాళ్ళ గొప్పదనం. పోనీలే వేశాడు కదా! నేను చూసుకుంటాను, అదీ వాళ్ళ వాత్సల్యం, కరుణ. 'కరుణాసింధు' అలా వాటేసుకోగానే పాపం అనుకుని చేసి పెడ్తూంటాడు. భగవద్భక్తుడికి కూడ

అపజయం లేదండి. మరిన్ని ఎందుకు చెప్పాలనీ ఆయన చెప్పేశాడు కృష్ణుడు. వాడు ఎంత శుంఠ అయినా, పాపి అయినా, ఎలాంటి వాడయినా I don’t care, I will protect him ‘అపిచేత్సుదురాచారో’ విపరీతమైన దురాచారాలు ఆచరించాడయ్యా, అయితే ఏమిటీ? నన్ను కొలుసుస్తున్నాడు కదా! I will ensure that he is protected. దీని పట్ల మనకు బాగా confidence రావాలి. మనం ఒక్కళ్ళమే వుంటే ఆ confidence పోతూంటుంది. కష్టాలలో వున్నపుడు ఎప్పడూ ఒక్కళ్ళే వుండకూడదు. 10 మందితో కలసి వుండాలి. ఏడ్చేవాళ్ళనూ, నాస్తికులతోనూ కాదు. భగవద్భక్తిలో పూర్ణంగా జీవించే వారి వద్ద పడి వుండాలి. వాళ్ళు, వాళ్ళకి జరిగినవి చెప్తూంటే, ‘అమ్మో అలాగా మనమే కాదు అనిపిస్తుంది, ధైర్యం వస్తుంది. అందుకే మనం కొన్ని అశ్రమాలకి వెళ్ళినపుడు భక్తులని చూసి, అయ్యో మన గురువు మీద మనకింత లేకపోయెనే అనిపిస్తుంది. గురువే అలా చెప్పిస్తాడు తమాషాగా. చాలా సామాన్యుడైన భక్తుడికి ఎంతో అప్రయత్నంగా పెద్ద కష్టం తీరిపోయిందని, వాడి సంతోషం కొద్దీ మనకి చెప్తాడు గురువుగారిలా చేసిపెట్టారని. అప్పుడు మనకి లోపల చీమలు కుట్టేస్తూంటాయి. ఏమిటా చీమలు? ‘వాడికున్నదానిలో నీకు వెయ్యోవంతు  లేదు. నీ దుంపతెగ ఇన్నాళ్ళూ దండం పెడుతున్నావు, ఏం నేర్చుకున్నావురా’ అనిపిస్తుంది. అంత సులభంగా వాడికయ్యిందీ, మనకవ్వడంలేదేంటి? వాడు simple, మనం complicated అన్న భావాలు వస్తాయి. నారదుడంతటి వాడ్ని కృష్ణుడలా పంపేశాడు, ఇతడికి మరీ intellectualism ఎక్కువయిపోతోందని. అక్కడ మనవాళ్ళు పల్లెటూర్లో మనవాళ్ళున్నరూ చూసిరా అని, చూసి వచ్చేసరికి మనవాడు కరిగి వచ్చేశాడు, అందుకే సామాన్యమైన భక్తులుంటారే వాళ్ళతో వుండాలి మనం. వాళ్ళని కలుస్తూండాలి. వాళ్ళకోసం ఎట్లా వెళ్ళచ్చంటే, ఏదో గురువుగారు ఏదో పర్వదినం అంతా అక్కడకి చేరారు కదా! ఎంతసేపూ గురువుగారు చుట్టూ చేరి వేళ్ళాడనక్కర్లేదు. ‘ఏమండి, మీరు వారి భక్తులు కదా, మీరు వారిని గురించి ఏమన్నా చెప్తారా, మేము విందాం అనుకుంటున్నాం అంటే ఒక్కోటి విప్పుతారు. మనకి డొక్క చినిగిపోతుంది. అసలు భగవంతుడి గురించి భగవద్భక్తుడి వద్ద తెలుసుకున్నంత బాగా. ఒక చక్కటి శిష్యుడి వద్ద గురువు గురించి తెలిసినంత బాగా మనంతట మనం తెలుసుకోవడం కష్టం. నేను, మా ఆవిడా ఎక్కడో ఒక గురువుగారి ఆశ్రమానికి వెళ్ళాం. మాకేమో ఒక పూట గురువుగారు అంత తెలిసినవారు కాదనిపించింది. ఒక పూటేమో తెలిసినవారేమో అనిపించింది. మళ్ళీ మర్నాడు కాదేమో అనిపించింది. మన mind లోనే. అక్కడకి ఆ గురువుగారి భక్తుడు ఒకాయన Bangalore నుండి వచ్చాడు. ఏమిటయ్యా అంత విలవిలలాడి పోతున్నావు, ఏంటి విశేషం అని అడిగితే, 3 సార్లు భయంకరమైన accidentలో

చిక్కుకొని చనిపోయాడు అనుకున్నవాడు బ్రతికి బయటకు వచ్చాడు. 3 సార్లూ తన గురువు తనని రక్షించినట్లే అతని అనుభూతి. అలా భక్తులను తరచి చూస్తే గురువు గురించి తెలుస్తుంది. భగవంతుడి మీద వున్న విశ్వాసం మనకి పోతూంటే భగవద్భక్తుల వద్దకు వెళ్తూండాలి. మాస్టరుగారి భాషలో 'వచ్చే తెలివీ, పోయే తెలివి'లా విశ్వాసం పోతుంటూందిట. మాస్టరు గారు చాలా చక్కని భాషని వాడేవారు, ఇప్పుడుండే తెలివి తర్వాత వుంటుందో లేదో తెలియదు అనేవారు. అలా మనకి పోతూన్నప్పుడు, పోకుండా వుండే వారి వద్దకు పోవాలి. అదే పాపం శంకరాచార్యుల వారు చెప్పింది, 'సత్సంగత్వం చేయరా అని అదే 'నిశ్చల తత్త్వానికి దారి' మనలో సందేహాత్మకుడొకడుంటాడు. వాడు అసలు వుండాలిట. జడ భరతుడు 'సందేహాత్ముని చంపక, వాడ్ని ప్రశ్నలు వేయనీ, నువ్వు సమాధానాలు చెప్పకుంటూండు. నీ ప్రశ్నకు నువ్వు సమాధానం చెప్పలేకపోతే వెతుక్కో. సరి పెట్టుకోవద్దు. నిన్ను నువ్వు మోసం చేసుకోక. అంతమాత్రం చేత ప్రతి దానినీ నువ్వేం నిర్ణయం చేసెయ్యద్దు' అంటాడు. అక్కడేం లేదు, ఇక్కడేం లేదు; వారికేం తెలియదు, వీరికేం తెలియదు అని అనుకోకుండా, అక్కడ ఆశ్రయించి వున్నవాళ్ళ తో మనం సత్సంగం చేయాలి. అదీ సత్సంగం విలువ. పుట్టపర్తి వెళ్తే ఎంత సేపు దొరుకుతుంది దర్శనం? ఏదో పొద్దున 10 నిలు, సాయంత్రం 10 నిలు. అదీ ఎక్కడ్నుంచో చూడాలి. పుణ్యం పుచ్చితే బాగా ఏదో front row. రోజంతా నువ్వేం చేస్తావు? మహా సముద్రంలా వున్నారుగా! ఎవరిని పలకరించినా బోలెడు చెప్తారు. ఆ విధంగా స్వామి వైభవం విను. ఒక గురువో దైవమో వాడి యొక్క వైభవం వింటూంటే, నువ్వు వాడిలో జీవిస్తూంటావు. అప్పుడూ నువ్వు పుట్టపర్తిలో వుంటే సార్థకత. లేకపోతే ఎంత సేపూ canteen కి ఎప్పుడు వెళ్ళాలి, ticket ఎక్కడ కొనుక్కోవాలి, room సంగతి, ఇవి కావు. పుట్టపర్తి వెళ్ళినా, తిరుపతి వెళ్ళినా ఇదే గోల. ఇది కదా మన బాధ. సులువు ఏంటయ్యా అంటే వాడి వాడ్ని పట్టుకోవాలి. అందుకని, శతృఘ్నుడు మహాసులువు అని చెప్తారు. ఆయన్ని జయించలేరు. ఏమిట్రా అంటే, రాముడి భక్తుడికి భక్తుడటండి! నీకు direct link లేదు అని అడగడానికి వీలు లేదు. EK మాస్టరుగారి విషయంలో, CVV గారి వద్ద direct గా ఉపదేశం పొందిన వారు, 'ఈయన CVV గారి వద్ద direct గా ఉపదేశం పొందలేదు కదండీ' అన్నారు. Direct కాని వాడు direct అయినవాడి కన్న కొన్ని కోట్ల కొలది direct లను ఎక్కువ చేశాడే ఇదేమిటి? భూగోళానికి లౌకికంగా CVV గారు తెలియడం, CVV గారి సంకల్పం అనుకోండీ, కాదనం. ఎవరి ద్వారా? కుంభకోణంలో ఇటుకలు తలకింద పెట్టుకు పడుకున్నవారి ద్వారా జరిగిందా? ఏంటి direct? అందుకే శతృఘ్నుడ్ని నువ్వు ఆశ్రయించినా, నీకు రాముడి గురించి తెలుస్తుంది. అదీ శతృఘ్నుడు గొప్పతనం. రాముడ్నే పట్టుకు

వేలాడనక్కర లేదు, రాముడి భక్తుడ్ని పట్టుకుని వేలాడండి. రామ భక్తుడిలో రాముడ్ని చూడడం గొప్పకదండి? రాముడిలో రాముడ్ని ఏమి చూస్తారు? గురువు గారిలో గురువుగార్ని చూడ్డం గొప్ప కాదు. గురువుగారి భక్తుడిలో గురువుగార్ని చూశారండి. 'నేను ఉపన్యాసం చెప్పినపుడు వచ్చినవారు, నేను లేనప్పుడు ఇంకోడ్ని చెప్పమని పెట్టి వెడితే అప్పుడు కూడా వచ్చినట్లయితే మీరు నాకు లెక్క' అని చెప్పేవారు. మాస్టారు మరీ ఏడిపించేవారు 'ఒరేయ్ నువ్వు చెప్పరా అని, ఆయన 4వ కొడుకు సుదర్శనం, అని వాడు మరీ గొట్టిగాయంతటి వాడు అప్పటికి. వాడు చెప్తాడు. వినే వాడికెలా వుంటుంది? కేవలం వినేవాడ్ని ఏమనుకుంటారో చూద్దాం, అవీ మాస్టారు చేసేపనులు. ఏం మాస్టారు ఉపన్యాసానికి సుదర్శనాన్ని పెట్టారు అంటే ఏరా ఎందుకు పెట్టకూడదు? ఏం నన్ను చూడవా వాడిలో? వాడిలో నేను లేనా. వింటే వాడిలో కూడా వినబడుతుంది. మనలో భక్తి, శ్రద్ధ వుంటే బొద్దింకలో కూడా చూడవచ్చండి. అవధూత గీతంతా అదే! ఇందులోంచి మాత్రమే అనుకోవద్దు. ఎందులో నుంచైనా వాడు కనబడతాడు, ఎందులో నుంచైనా వినిపిస్తాడు. ఎప్పుడూ అప్రమత్తుడిగా వుండు. నీ గురువు అంతటా వున్నాడు, గనక ఎక్కడ నుండైనా పలకగలడు. ఎక్కడ నుండయినా నీ దైవం పలకగలడు ఇట్లా వున్నవాడు అపరాజితుడు. మనందరికీ జీవితంలో జయం పొందాలని వుంటుంది కదా! జీవుడికి అదే ఆశ. మాస్టారు జీవి అంటే ఒక నిర్వచనం ఇచ్చారు. 'ఆనందము కొరకు అన్వేషించువాడు.' అని. అందరి గమ్యం అదే! ఏమి చేస్తున్నా ఆనందం కోసమే! అది అవడం లేదుగానీ, మిగతావేవో వస్తున్నాయి. భగవంతుని సాన్నిధ్యంలో వుండడం ద్వారా ముక్త జీవుడయి వుండడం, తద్వారా సమస్తమైన దివ్యానుభూతిని పొందుతూండడం అది కదా జయం. అది దొరకాలంటే ముందు మనం అనుకున్నవారిలోంచి, నెమ్మదిగా అలా నిచ్చెనలు దిగి అందరిలోనూ చూడడం. అప్పుడు వాడు అపరాజితుడవుతాడు. అందరికన్నా అపరాజితుడు భాగవతోత్తములలో ప్రహ్లాదుడు. నారదుడు కూడా కాదు. మంత్రం ఇచ్చింది నారదుడే, కాని the best among all bhagavathas భాగవతోత్తములు, ప్రహ్లాదుడు. అతనిని ఎవ్వరూ ఏమి చేయలేక పోయారు కదండి? ఏమి చేసినా అతడు పిడి రాయల్లే వున్నాడే! మిగిలి వున్నాడు. ఏంటయ్యా అంటే, ఎప్పుడూ భగవత్ చింతలో పడి చాలా ప్రస్ఫుటమైన ఆహ్లాదంలో వుండేవాడట. అదీ ప్రహ్లాదుడంటే అర్థం. 'ప్రకటించిన ప్రస్ఫుటమైన ఆహ్లాదం'. ఏమిటి ఆహ్లాదం? I am in Him, He is in me. నేను అతని యందున్నాను, అతడు నాయందున్నాడు. నాయందు మాత్రమే కాదు సమస్త జీవరాశుల యందు కూడా అలాగే నిండి వున్నాడు ఇంకోటి లేదు. కాబట్టే ఎవ్వరూ ప్రహ్లాదుడ్ని ఏమీ చేయలేకపోయారు. అందుకే ముందు భాగవతోత్తములని చెప్పినపుడు, ప్రహ్లాద, నారద, అంబరీష...

ఇలా వస్తుంది. వాళ్ళ నాన్న మొత్తం సృష్టినే ఇంకో రకంగా జయించాడు. తనను తాను జయించుకోలేకపోయాడు. ఇతడు తనను తాను జయించుకున్నాడు కనకే ప్రహ్లాదుడు నిజమైన అపరాజితుడు. ఈ అపరాజిత తత్త్వం ఎక్కడ నుండి వచ్చింది? ఆయన నుండే! అందుకని ఆయన్ని నమ్ముకున్నవాడు, ఆయన యందే జీవించే వాడు, ఆయన యందు జీవించే వాళ్ళని ఆదరించి, పూజించి, ఆరాధించేవాడు వాడు కూడా అపరాజితుడు అవుతాడు.

## 745, 746 విశ్వమూర్తిః, మహామూర్తిః

విశ్వమే తన మూర్తిగా కలిగినవాడు. విశ్వరూపుడు. విశ్వము తన రూపంగా వున్నవాడు. భగవంతుడ్ని చూడ్డం అంటె విశ్వంలో వున్న ఏదో ఒక రూపంలో చూడడమే! మొత్తం విశ్వరూపుడిగా చూడ్డం. అవ్యక్తమైన తత్త్వం చూడ్డానికి ఏమీ వుండదు. అందులో కలిసిపోవడమే వుంటుంది. అందుకని కలిసి పోయినప్పుడు చూచేవాడు, చూడబడే దానిలో కలిసి వుంటాడు కాబట్టి, చూడడానికి ఏది వుండదు కాబట్టి అది 'భగవంతుడిలో లయం అవ్వడం' అని చెప్పారు, అదికాక చూచేవాడొకడుండి, సమస్తాన్ని భగవంతుని యొక్క రూపంగా చూడ్డం అనే ఒక అద్భుతమైన దివ్యానుభూతి వున్నది. దానిని 'విశ్వరూపదర్శనం' అంటారు. విశ్వరూపదర్శనం గురించి పదకొండో అధ్యాయం భగవద్గీతలో చక్కగా వివరింపబడి వున్నది. విశ్వాన్నంతా ఒక్కసారిగా భగవంతుని రూపంగా దర్శనం చేయడం అనేది అందరికీ జరగదు. అది కేవలం భగవంతుడు అనుగ్రహించడం వలన కొందరికి జరుగుతుంది. ఆ మూర్తి చాలా 'మహామూర్తి'గా వుంటుంది. చాలా భయంకరమైన మూర్తిగా వుంటుంది. మనం ఎప్పుడూ చూసే మూర్తిగా వుండదు. అటువంటి మూర్తి గురించి భీష్ముడు స్తుతి చేస్తున్నాడు, కారణం ఏమంటే, ఆయన ఆ మూర్తిని దర్శనం చేశాడు. రాయబారానికి శ్రీ కృష్ణుడు వెళ్ళిన సందర్భంలో, దర్శించిన వారిలో భీష్ముడొక్కడు. భగవత్తత్త్వాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకున్న వాడు. విశ్వమూర్తి ఎలా వుంటుందంటే ఏక కాలంలో పుట్టుక, పెరుగుదలా, చావు, ఈ మూడు చూడగలగడం, ఏక కాలంలో సప్తలోకాలు చూడగలగడం, ఏకకాలంలో భూత,భవిష్యత్, వర్తమానాలు, ఏక కాలంలో సృష్టి,స్థితి,లయములు చూడగలగడమూ, ఇలా వుంటుంది. మనం చూడలేము, మనకి చూపిస్తే మూర్ఛవచ్చి పడి పోతాం. అర్జునుడంతటివాడు చూడలేక పోయాడు. కనులతో మనం ఎదురుగా వున్నవి చూడగలమే కానీ, పక్కనే ఉన్నవి, పైన వున్నవి, క్రింద వున్నవి, వెనకాలవి చూడలేం కదా! అన్ని పక్కలా కనిపించిందనుకోండీ, ఏం చేస్తారూ? ఎట్లా వుంటుందీ? ఎప్పుడైనా వూహించారా? మొత్తం ఒక చోట కేంద్రీకృతం కాకుండా దృష్టి, మొత్తం అంతా కనిపిస్తుంటుంది, పైన, క్రిందా, వెనకాలా అంతా కనిపిస్తుంది. చుట్టు ప్రక్కలా అంతా కనిపిస్తుంది, అప్పుడేం చేస్తారు మీరు? అది దర్శించడం మొదట మనకి అలవాటు లేదు. రెండోది దర్శిస్తే భరించలేం. ఒకే సమయంలో పుట్టడం, పెరగడం, చచ్చిపోవడం, ఇవన్నీ చూసి, ఈ భయంకర మూర్తిని చూసి, అర్జునుడు భగవంతుని వేడుకున్నాడు 'ఇది నాకొద్దూ, నీ సుందరమైన మూర్తిని మాత్రమే దర్శనం ఇవ్వు, అది చూసి ఆనందిస్తాను. ఈ మూర్తిని చూడలేను' అన్నాడు.

పిల్లవాడు పుట్టాడంటే సంతోషంగా వుంటుంది. పెరుగుతున్నప్పుడు సంతోషంగా ఉంటుంది. పుట్టినప్పడే  చావు కూడా చూపించేస్తే సినిమాలో.  ఇంక ఏముంది కథ ? అప్పటికప్పడే వైరాగ్యం వస్తుంది. ఇహ మోహం ఉండదు. మాయ అంతకన్నా ఉండదు. పుట్టడం, వాడు పెరగడం, చచ్చిపోవడం అంతా ఒకేసారి screen మీద చూపించేశారనుకోండి! గోళాలు పుట్టడాలు, మళ్ళీ వెళ్ళిపోవడాలు, మనుషులు పుట్టడాలు వెళ్ళిపోవడాలు. అసలు లోకాలన్నీ ఒక్కసారి కనిపిస్తే అలవాటు లేక చాలా అంతా గజిబిజిగా ఉంటుంది. ఇది భౌతికంగా చూస్తున్నాం. దీనికన్నా ఇంకా సూక్ష్మలోకాలు ఆరు ఉన్నాయి. సత్య లోకం నుండి భూలోకం వరకు, అన్నీ ఒక్కసారి కనిపిస్తే ఎలా ఉంటుంది ? అది చూడగలగాలి అంటే ఆయన అనుగ్రహం కావాలి. చూడగలగడానికి కావలసిన బలం కూడా ఆయనే ఇవ్వాలి. అప్పడు దాన్ని దర్శనం చేస్తే, దాని అద్భుతం తెలిసినప్పడు భగవంతుని యొక్క  పరిపూర్ణ రూపం తెలిసి, ఇంక అక్కడ నుండి మామూలుగా అయితే పూర్ణమైన భక్తిలో ఉండాలి. కానీ భగవంతుని మాయ, అనుగ్రహమూ ఆయనదే, మాయ కూడా  ఆయనదే.  ఈ కారణం చేత ఇంత చూసినవారూ కూడా మళ్ళీ మాయలో పడిపోతారు. కౌరవుల మీద శ్రీకృష్ణుడు తన విశ్వరూపసందర్శనం చివర పాచికగా వేసి చూశాడు. ఎందుకంటే అందరూ తన నుండే దిగి వచ్చిన వారే కాబట్టి, చూస్తూ చూస్తూ వీరందరినీ నశింపచేయకూడదనే ఉద్దేశ్యంతోనూ, వారందరికీ తాను భగవంతుడ్ని, భగవత్తత్త్వం తన నుండి పూర్ణంగా వ్యక్తమై ఉందని తెలియచెప్తే, వారిలో మార్పు వస్తుందేమో అన్న భావనతో చూపించడం ఉంటుంది. కాని ఏం జరిగింది ? ఆ క్షణంలో కౌరవులు భయపడ్డారు తప్ప, గుర్తించిన వాళ్ళు గుర్తించారు కానీ యుద్ధానికే సంసిద్ధులైనారు. శ్రీకృష్ణుని మీద యుద్ధం చేయించాడన్న ఒక అపవాదు ఉన్నది. ఎప్పడు చేయించాడంటే, అన్ని రకముల ఉపాయములనూ ప్రయత్నము చేసి, తద్వారా ఫలితములేక పోవడం వలన యుద్ధం చేయించవలసి వచ్చిందని చెప్పడానికి, మనకి కురు సభలో విశ్వరూపదర్శనం ఒక తార్కాణం. అప్పడు ఆ మహత్తర మూర్తిని భీష్ముడు చూశాడు. అంతకుముందే రాజసూయయాగంలో శ్రీకృష్ణుని మించినవాడు ఈ సృష్టిలో లేడని తెలిపిన వాడు భీష్ముడు. విశ్వరూపదర్శనం, విశ్వమంతా ఏకకాలంలో మనకి గోచరమైతే ఎలా ఉంటుందో ఊరికే ఆలోచించండి.  మరి అలాంటి మహత్తర మూర్తిని దర్శనం చేయడం దుర్లభమైన విషయం. అదీ ఆయన అనుగ్రహిస్తేనే మనం చూడగలం. అది ఎప్పడో ఎక్కడో యుగంలో ఒకరికి చొప్పన దర్శనం అవుతుంటుంది. కాకపోతే విశ్వంలో ఉన్న మూర్తులన్నీ కూడా భగవంతుని మూర్తులే అని భావన చేసుకునేంతవరకు మానవ మేధస్సుకి సులభంగా ఉంటుంది. సమస్త మూర్తులూ భగవంతునివే! ఏడు లోకములూ, బ్రహ్మ, బ్రహ్మమానసపుత్రులూ, ఆదిత్యులూ,

రుద్రులూ, వసువులూ, మనువులూ, అష్టదిక్పాలురూ, నవగ్రహములూ, వీరంతాకాక 84 లక్షల తరగతులుగా వున్న జీవరాశులూ, అన్ని లోకాలలో. వీరంతా కలిపి ఆయనే! అనే భావన మన యందు స్థిరబడడం చాలా కష్టం. అందుకనే మనకు కనబడ్డ మూర్తి, ఆయనయొక్క మూర్తి అనుకోవాలి. 'వచ్చినవాడే నారాయణుడు' అనుకునే సాంప్రదాయము మనకు వున్నది. అలా వచ్చిన వాడిలో నారాయణుడ్ని చూస్తే మనలో స్థిర చిత్తానికి తేడా రాదు. అలాకాకపోతే తేడా వస్తుంది. మనబోటి సాధకులకి విశ్వంలో ఉన్న మూర్తులను భగవంతుని మూర్తులుగా దర్శనం చేయడం వరకు యోగసాధన. మొత్తం విశ్వం భగవంతుని అస్తిత్వమే అని తెలిసి ఉండడం తెలివి. దాన్ని దర్శించడం అనేది మనం అప్పుడే ఆలోచించవలసిన విషయం కాదని నా ఉద్దేశ్యం. మన వరకు ఈ నామాన్ని సమస్త రూపములలో వాడే ఉన్నాడని భావన చేసుకోవడమే! మనకి తెలియని రూపాలు చాలా ఉన్నాయి, మనకి తెలిసిన రూపాలు చాలా కొద్ది. ఈ భూగోళమే మనం సరిగ్గా చూడలేం. ఈ భూగోళం మీద ఎన్ని రకాల జీవరాశులున్నాయో మనకి పూర్తిగా తెలియదు. ఇవికాక ఇంకా గోళాలున్నాయి. ప్రతి గోళానికి ఏడు స్థితులున్నాయి. ఏడువ స్థితిలో మనం దాన్ని చూస్తున్నాం. దీనికింకా అరు స్థితులున్నాయి. ఆరు స్థితులలోను మనం దీన్ని చూడలేదు.ఇంకా మిగతా గోళాలు వున్నాయి, వాటిని మనం చూడలేదు. వాటికి మళ్ళా ఆరు స్థితులు వున్నాయి, వున్న స్థితి కాక. ఎంతుందో మనకి తెలియదు. మనకి తెలిసింది తక్కువ. అందుకనే మొట్టమొదట మన సూర్యమండలమే ఉన్నదనుకున్నవారు, ఇప్పుడు మిగతా మండలాలు కూడా ఉన్నాయని అనుకుంటున్నారు. అలా ఎన్నోఉన్నాయని మన పెద్దలు చెప్పి ఉంచారు. మన బ్రహ్మ కాదు ఇటువంటి బ్రహ్మగార్లు చాలామంది ఉన్నారు అని చెప్పారు. ఇటువంటి విష్ణువులు చాలామంది వున్నారు. ప్రతి సృష్టికి ఒక బ్రహ్మ, ఒక విష్ణువు, ఒక మహేశ్వరుడు వున్నారని చెప్పారు. ఇవన్నీ మనం చూసుకుంటే 'సహస్రకోటి యుగధారిణే నమః' అని చివరలో పూర్తిచేసుకుంటాం కదా! సహస్ర కోట్లు అంటే ఇహ చెప్పడానికి అంకెలు చాలక అలా చెప్పారు. వెయ్యి కోట్ల యుగములు ధరించి ఉన్నాడట. యుగములు అంటే 'కలయిక' అని కూడా అర్థము. అంతటి మహత్తరమైన మూర్తి నీదీ, నేనేమని పొగడగలనూ, నీ గురించి అని చెప్పడం. భగవంతుని పూర్తిగా పొగిడేశాము అని అనుకోకూడదు మనం. విష్ణుసహస్రనామం చదివేసి ఈ పూటకు అయిపోయింది అనుకోగూడదు. ఎంత పొగిడినా చాలదు, అది ఎంతుందో మనకి తెలీయదు. అందులో మనం కొంత. కాబట్టి విశ్వమూర్తి, మహామూర్తి. అంతటివాడు మనకి అందుబాటులో ఉన్నాడు అదే చాలు. వాడ్ని ఆరాధన చేసుకోవడంవల్ల మనకి సమస్తమైన విషయములందు క్రమశః పరిష్కారం లభిస్తుంది. ఓపిక కావాలి. మనకంతా ఇప్పుడు వేగం ఎక్కువ

అవడంతో మూడు రోజులు చదవంగానే నాల్గవరోజు నుండే విష్ణుమూర్తి ఏంచేస్తున్నాడూ, ఏం చెయ్యట్లేదు అనిపిస్తుంది. ఓపిక, శ్రద్ధ ఈ రెండూ పట్టుకుని వాని యందు ఆ విధంగా మనం లగ్నం చేస్తే సమస్తమైన పరిష్కారములూ ఇస్తారు.

# 747 దీప్తమూర్తిః

అసలు ఇదంతా ఏర్పడడానికి ముందు తాను వెలుగుగా ఏర్పడ్డాడు. Let there be light, అని వాళ్ళు చెప్తారు. అంతకు ముందు చాలా కథ ఉన్నది. 'అదితి' అని మన వేదాలు చెప్తాయి. మూలతత్త్వం మనకి నిర్వచనానికి అందుబాటులో లేనిది, మనం ఊహించలేనిది, మనం మాట్లాడలేనిది, చెప్పలేనిది, నిర్వచించలేనిది, ఏ లక్షణములూ లేనిది, తెలుసుకోబడలేనిది అనే ఒక తత్త్వం. అది వెలుగుగా మారుతుంది. అంటే అంతకుముందు ఏ అవతరణమూ, ఏ రూపమూ, లేనిది ఇప్పుడు మొట్టమొదటి రూపంగా, వెలుగుగా ఏర్పడినదన్నమాట. ఆ వెలుగు రూపంలో మిగతావి ఏర్పడి మళ్ళీ వెలుగు అయిపోతుంటాయి. కోటానుకోట్ల దేవతలు వస్తూంటారు, పోతూంటారు. కోటానుకోట్ల గోళాలు వస్తూంటాయి, పోతూంటాయి. జీవులు వస్తూంటారు, పోతూంటారు. ఆ మూర్తిని మనకి ఒక పద్ధతిలో అమ్మవారంటారు, ఇంకో పద్ధతిలో భగవంతుని యొక్క వ్యక్త రూపము అంటారు. అందుకని భగవంతుడు వ్యక్తం అయితే అమ్మవారిలా కనిపిస్తాడంటారు. ఇవన్నీ ఒకే విషయాన్ని రకరకాలుగా చెప్పడానికి తంటాలుపడ్డారు. ఎలా చెప్తే అర్థం అవుతుందో అని వారికి తాపత్రయం. ఎప్పుడూ ఉపాధ్యాయుడికి విద్యార్థికి పది రకాలుగా చెప్పి వాడికవగాహన చేయించాలని తపన ఉన్నట్లు, ఇలా చెప్పుకుంటూ వచ్చారు. వేదంలో ఆ మొట్టమొదట తనను తాను వ్యక్తం చేసుకున్న స్థితిలో ఏర్పడిన వెలుగును 'అదితి' అన్నారు. అదీ దీప్తమూర్తి. అందులోంచి ఆదిత్యులు వచ్చారు. తరవాత మిగతావాళ్ళంతా వచ్చారు. ఆ మొదటి వెలుగునే మనం గాయత్రిగా ధ్యానం చేస్తుంటాం. ఆ మూర్తి లోనే సమస్త మూర్తులు ఇమిడి వున్నాయి. అందుకనే గాయత్రిని మించిన మంత్రం లేదు. గాయత్రిని మించిన దేవత లేదు అనడంలో ఉద్దేశ్యం ఏమంటే అక్కడ నుండే కథ మొదలు. పుట్టుకొచ్చేవారంతా అక్కడ నుండే పుట్టుకొస్తారు. ఆ పైన అవ్యక్తం. అది వ్యక్తం అయితే వెలుగు. ఆ వెలుగు రూపం మొట్టమొదటి రూపం. ఆ రూపం ఉంటే అందులో కోటానుకోట్ల రూపాలు వస్తూపోతూ ఉంటాయి. ఎలా అంటే, వెండి తెరమీద బొమ్మలు వచ్చి వెళ్ళిపోయినట్లు. వెండి తెరమీద రెండున్నర గంటల కాలంలో ఎన్ని బొమ్మలు వచ్చిపోతూంటాయో? ఎన్ని దృశ్యాలు వచ్చి వెళ్ళిపోతుంటాయి వెండి తెర మీద? అలా ఆ దీప్తమూర్తి అనే భగవంతుని రూపం అన్నిటికన్నా మొదటి రూపం అని చెప్తారు. అదే 'కేన ఉపనిషత్తు' లో మనకి వస్తుంది. 'ఆయన' లేక 'అది' 'తత్' అంటాం కదా! అది వ్యక్తం అయ్యీ, ఒక స్త్రీ రూపంగా కనబడితే, దేవతలకు అర్థంకాక కొంత తంటాలు పడుతారు. ఆ తర్వాత తెలుస్తుంది ఆ తత్త్వమే ఇలా

వ్యక్తం అయ్యిందని. భగవంతుని మొట్టమొదటి రూపము ఏమిటి అంటే 'దీప్తరూపము' లేక 'వెలుగురూపము'. అందుకనే వెలుగుని ధ్యానం చేయడం అంటే భగవంతుని మొట్టమొదటి రూపాన్ని ధ్యానం చేయడం. మనం పిండిలోంచి రొట్టెలు చేసుకున్నట్లు, మట్టి నుండి బొమ్మలు చేసుకున్నట్లు, ఇంక ఎంత మందినయినా తయారు చేసుకొనవచ్చు. దేవతలు వచ్చారూ, ఉన్నారూ, నడిపిస్తున్నారు. వీరందరూ కూడా అందులో భాగంగా వచ్చారు కాబట్టి, ఆ వెలుగుని ఆరాధన చేస్తే ఆ వెలుగులోంచి వచ్చినవారంతా అనుకూలురై ఉంటారన్న ఉద్దేశ్యంతో, మన ఋషులు, సాంప్రదాయబద్ధంగా వేదము నెరిగినవారూ గాయత్రీ ధ్యానాన్ని భారతీయులకి అందించారు, వెలుగు నందు ఆసక్తి ఉన్నవారికి. అది చేసుకుంటే సమస్త దేవతలూ అనుకూలిస్తారు. ఎందుకంటే అది మొట్టమొదట వ్యక్తరూపమూ, దీప్తరూపమూ, వెలుగుతో నిండిన రూపమూ, కాంతులు చిందే రూపము.

ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండలవాన్ కిరీటీ హారీ హిరణ్మయ వపుర్ధృత శంఖ చక్రః

అని ఒకటి చెప్పారు. అలాగే 'ముక్తావిద్రుమ' అని కూడా చెప్పారు. ధ్యానం చేసుకునే ముందు గురువుని ధ్యానం చేసుకుని, ఆయన యొక్క అనుగ్రహం చేత ఆ వెలుగుని పొందాడానికి ప్రయత్నం చేయాలి. గురువు యొక్క ఆశీర్వచనం అందుకుని, గాయత్రి మంత్రం చేసుకోవడం మన సాంప్రదాయము. అది పొందితే, అది మనలో కూడా ఉన్నది ఆ శరీరం. భగవంతుడు మనలో ఉన్నాడంటే ఆ శరీరంతోనే ఉన్నాడు. ఆ వెలుగు శరీరాన్ని మనం కూడా పొందవచ్చు. మనం కూడా అందులోని భాగంగానే ఉన్నాం. ఎందుకంటే జీవుడు కూడా భగవంతుని వ్యక్తరూపం కాబట్టి అతనికి కూడా ఈ వెలుగు శరీరం ఉన్నదని తెలుస్తుంది. అందుకనే దీప్తమూర్తిని ఆరాధన చేయడం ద్వారా మనలో ఉండే కల్మషములన్నీ పోగొట్టుకుని మనం కూడా వెలుగురూపంగా తయారౌతాం. వెలుగురూపంగా తయారైన వారికి ఇంకెవరితో సంబంధం ?

## 748 అమూర్తిమాన్

దేనిచేత వెలిగింపబడి ఉన్నదో దాని యందు వారు లగ్నమై ఉంటారు, అంతే! దేనిచేత వెలుగుతున్నదో దాని యందు వారు లగ్నమై ఉంటారు. ఇహ దానికి పేరు, రూపము ఏమీ ఉండవు. అందుకనే శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'నా రూప ధ్యానం ద్వారా రూపాతీత తత్త్వాన్ని పొందవచ్చు' అంటాడు. అవగాహన చేసుకొనవచ్చు. అందులో ఉండవచ్చు. అందులో ఉన్నప్పుడు అందులో ఉన్నాం అని తెలియదు. బయటకు వచ్చినప్పుడు దాని అవగాహన ఉంటుంది. ఎలా? అంటే, నిద్రలోంచి బయటికి వచ్చినప్పుడు బాగా నిద్రపోయాం అని తెలిసినట్లు.

## 749 అనేకమూర్తిః

ఈ ఒక్కనామం ఈ భూగోళము మీద భగవంతుని ఆరాధించేవారికి బాగా తెలిస్తే, మనకి మతముల పేర బేధములుండవు. అనేకమూర్తి. ఏ మూర్తి ఆయనా? నువ్వేమూర్తి అనుకుంటే ఆ మూర్తి. భూగోళం వరకు అక్కర్లేదు, మనకే తెమలదు లోపల, ఎవర్ని కొలవాలా అని. ఈయన్ని కొలుస్తుంటే, ఆయన్ని కొలిస్తే బావుండేదేమో అనిపిస్తుంది. ఆయన్ని కొలిస్తే, ఈయన్ని కొలిస్తే బావుండేదనిపిస్తుంది. అసలు దేవతల విషయంలోనే కాదు గురువుల విషయంలో కూడా మనకి ఇలాంటి సందిగ్ధతే. Master EK నా, MN లేదా, CVV లేదా, షిర్డీనా, పుట్టపర్తా, ఇంకొకటా. ఇలా రకరకాల బాధలున్నాయి కదా! రూపంలో అనేకమూర్తి అన్నప్పుడు ఏ మూర్తి అయితే నీకేం? నీకేదో మూర్తి దొరికింది కదా! ఈ దీపం దగ్గర చదువు కోవాలా, ఆ దీపం వద్ద చదువుకోవాలా అనే మీమాంసతో చచ్చిపోయేవారు అక్కడా చదవరు, ఇక్కడా చదవరు. అలా కానివారు ఈ దీపం కిందయినా చదువుకోవచ్చు, ఆ దీపం కిందయినా చదువుకోవచ్చు, రెండూ పోతే ఇంకో దీపం కిందయినా చదువుకోవచ్చు. ఏ దీపం అయితే ఏమిటి? ఆ దీపం ఈ దీపం కన్నా పెద్దది అంటాం. అది లాభం లేదు, దాని క్రింద పురుగులు ఉన్నాయి, అంటాం. ఏకం, అనేకం! 'ఏకోహం బహుస్యాం' అంటుంది ఉపనిషత్తు. నేను అనే తత్త్వం అనేకం అయిపోయింది, విపరీతంగా పెరిగిపోయింది. ఇవన్నీ మనకి తెలుసు. కానీ ఎందుకనో దేనియందూ లగ్నం కాదు. మనవాళ్ళు ఏంచేశారంటే ఒక దానియందు పూర్తిగా మూర్ఖుడై పరిమితత్త్వంలో ఇమిడిపోతాడేమో, పరిమితుణ్ణి చేసుకుంటాడేమో అని వేయి ఇచ్చారు. దాంతో మనకి ఇంకో సమస్య వచ్చింది. వెయ్యిలో ఏది అని? వీడికి చేస్తే వాడికి చెయ్యలేదే అని, వాడికి చేస్తే వీడికి

చెయ్యలేదే అని. విష్ణుసహస్రం చేస్తూంటే రుద్రాభిషేకం చెయ్యలేదే అనిపిస్తుంది. కొన్నాళ్ళు రుద్రాభిషేకం చేస్తే ఎంత హాయిగా ఉందనిపిస్తుంది విష్ణుసహస్రనామం కన్నా, కొన్నాళ్ళయ్యాక ఇది కాదు  హనుమంతుడు అనిపిస్తుంది. అక్కడ నుండి వినాయకుడు అనిపిస్తుంది. మనం కూడా మన పరిణామ దశలో చాలామంది దేవతలని ఇలా దాటుకుంటూ వస్తాము. వీరందరి రూపంలో నేనే ఉన్నానురా, అనేది మనకి అవగాహనే అయితే, అసలు ఇందరిలోనూ ఉన్న ఒకే తత్త్వాన్ని ఆరాధిస్తుంటె, ఇంతమందీ సుముఖులౌతారు. అందుకనే గాయత్రి అన్నారు, రకరకాలుగా చెప్పారు. ఇన్ని రకాలుగా ఉన్నది ఒక్కటే! ఇది తెలిస్తే ఎంత బాగుంటుంది. మనకి ఐదు సిద్ధాంతాలు ఉన్నాయి. ఈ  ఐదుగురు ఇవాళ్టికి కూడా కలుసుకోరు.

1) సూర్య సిద్ధాంతం, 2) గణపతి సిద్ధాంతం, 3) శక్తి సిద్ధాంతం,4) వైష్ణవ సిద్ధాంతం 5)శైవ సిద్ధాంతం.

ఈ ఐదు గురికి ఎంత చెప్పినా, ఇంకా చేతనలో కాస్తోకూస్తో కొన్ని preferences మిగిలిపోతాయి. యోగులు  అలా ఉండడానికి వీలులేదు. యోగి అంతర్యామి అయిన భగవంతుని ఆరాధన చేస్తూ, అన్ని మూర్తుల యందు సమదృష్టి కలిగి ఉంటాడు.  సమస్త దేవతలు అంతర్యామి నుండి దిగి వచ్చిన వారు కాబట్టి ఆరాధనీయులే. కొంతమందికి దణ్ణం పెట్టకూడదని కానీ,  కొంతమందికి కొంతమందికన్నా ఎక్కువగా దణ్ణం పెట్టాలని గానీ ఉండదు. దేవతలే కాదు, సృష్టి జీవులందరికీ అలాగే దణ్ణం పెట్టేటట్లుగా ఉంటారు వారు. ఎందుకంటే అనేక మూర్తి కదా! విశ్వమూర్తి కదా! మహామూర్తి! ఎందులోనైనా వాడున్నాడు కాబట్టి, అన్నిటినీ దర్శనం చేయడం యోగమార్గం! తత్త్వమార్గం. అది భగవంతునికి మనల్ని చేరువ చేసే మార్గం.

## 750 అవ్యక్తః

ఇన్ని మూర్తులలో పడి కొట్టుకుపోకు. అసలు వాడు ఇందులో ఏ మూర్తీ కాడు. అంటే వెలుగు కూడా కాదు అని గుర్తుపెట్టుకోవాలి. మరి దీప్తమూర్తి కదండీ అంటె, వెలిగిన చోటు ఒక గోళంగా ఏర్పడిందండి. దాన్ని 'అదితి' అన్నాం. అది కూడా ఆయన యొక్క మొదటి అవతరణే కదా! అసలు ఆయన అదికాదు. అందులోంచి రకరకాలుగా వచ్చేశారు. శతమూర్తులు, శతాననులు వచ్చేశాయి. అంతమాత్రంచేత ఈ మూర్తులే అనుకోబోక. మూర్తులలో ఉన్నవాడు, మూర్తులకు అతీతంగా కూడా ఉన్నాడు. అవతరణము చెందినవాడు, అవతరణ చెందక కూడా చాలా భాగం ఉన్నాడు. అవతరణము చెందిన భాగము భగవంతుడే, అయినా అవతరణ చెందని భాగము చాలా ఉన్నది. ఇప్పుడు మనం ఉన్నాం. మనలోంచి ఒక ఆలోచన వచ్చింది. మనకీ, మన ఆలోచనకి పోల్చి చూస్తే మన ఆలోచన మనకన్నా చాలా చిన్నది. ఎందుకనీ? మనకి రోజుకి లక్ష ఆలోచనలు వస్తాయి. సంవత్సరానికి ఎన్ని అయ్యాయీ? జన్మకి ఎన్ని అయినాయీ? ఎన్ని జన్మలైనాయి? ఎన్ని పుడుతున్నాయీ మనలోంచి? పుట్టలుపుట్టలుగా పుట్టే ఆలోచనలకి నువ్వు కదా ఆధారం! నువ్వెంతటి వాడివి? ఇది చెప్పడానికే 'విజితాత్మా' అనే నామం చెప్తారు. లక్షలాది సంకల్పాలు నీలోంచి పుడుతుంటే వాటిని నిర్వర్తిస్తూ నువ్వు స్వామిగా ఉన్నావు. అలాగే సృష్టి తనలో నుండి వ్యక్తం అయివస్తుంటే అతడింకా మిగిలే ఉంటాడు. మన ఆలోచనతో మనం ఖర్చయిపోయామా! లేదు. కొంతభాగం ఆలోచనలో బతుకుతుంటాం. ఆలోచన లేకపోయినా మనం ఉంటాం. ఆలోచన ఉన్నా కూడా దాన్ని మించి మనం ఉంటాం. బావుండకపోతే వదిలేస్తాం. అలాగే భగవంతుడు అనేకమూర్తి అయినా కూడా, అవ్యక్తుడు కూడా! అది చెప్పడానికే పురుషసూక్తంలో ఈ ఏర్పడినదంతా ఆయనలో ఓ పావలా వాటా ఆయనలో, ముప్పావలా అసలు ఇంకా దిగలేదు. దిగిందే ఇంత ఉంటే దిగంది ఇంకా ఎంతుందని చెప్పడానికి అనేకమూర్తి, తర్వాత 'అవ్యక్తః' అని చెప్పడం జరిగింది. అవ్యక్త అనేసరికి మనకి వీటన్నిటినీ పక్కన పెట్టేసే బుద్ధి వస్తుంది. ఏదో ఒక వెర్రి ఉండాలి. మధ్యమధ్యలో చెట్టెక్కించి, మళ్ళీ దింపుతాడన్నమాట. జ్ఞానులు దేవతారాధనలూ, విగ్రహారాధనలూ చేయరు. మాస్టరుగారి మార్గంలో అది రోగం. 'ఏమీ రోగమా, ఎందుకు చేయగూడదూ' అంటారు. మొత్తం అంతా వ్యాపించిన వాడు విగ్రహాలలో లేడా? మొత్తం అంతా వ్యాపించిన వాడు దేవతలలో లేడా? తత్త్వం తెలిసినంత మాత్రాన రూపాన్ని అశ్రద్ధ చేస్తావా? రూపం కూడా ఆయనదే కదా! దాని యందు శ్రద్ధా, భక్తి, గౌరవము ఉండవద్దా? సృష్టి యందు శ్రద్ధ ఉండవద్దా? సృష్టిని నిరాకరిస్తావా? నిర్లక్ష్యం

చేస్తావా? అవ్యక్తం అండీ, దాన్ని గురించి ఏం చెప్పలేం అండీ, అదండీ ఇదండీ అంటూ ఏం చేయకుండా, ప్రపంచానికి పనికిరాకుండా బతుకుతుంటాడు. జ్ఞానం నలుగురికి శ్రేయస్సు కలగడానికి ఉపయోగపడాలి. అప్పుడు జ్ఞానానికి విలువ. లేకపోతే నువ్వు జ్ఞానివి అయితే నాకేమిటీ? ఊళ్ళో కోటీశ్వరుడున్నాడండి. అయితే మనకేమిటి? ఆయన సంపదను సద్వినియోగం చేస్తూ, లక్షలాది మందికి ఉపయోగపడితే, వారి ఆదరణ ఉంటుంది. అలాగే జ్ఞాని యొక్క సంపద ప్రపంచానికి వినియోగపడితే దానికి విలువ ఉన్నది. అలా కాని జ్ఞాని వల్ల ఏమీ ఉపయోగం లేదు. భగవంతుడికి కూడా వాడి యందు శ్రద్ధ లేదు. వాత్సల్యం వాడి యందుండదు. నువ్వు కోటీశ్వరుడివి అయితే ఏమిటి? నువ్వేం చేస్తున్నావో దాన్నిబట్టి తప్ప నువ్వు జ్ఞానవంతుడివైనా, కోటీశ్వరుడివైనా అది నలుగురికీ పంచినప్పుడు కదా! అవ్యక్తం అనే పిచ్చిలో కొంతమంది దారి తప్పుతూంటారు. దేవుడికి రూపం ఇవ్వకూడదని, తప్పని చెప్పే మతాలు కొన్ని ఉన్నాయి. అందుకని వారికి అవతరించిన భగవంతుని చూసే అదృష్టం లేదు. కొంత మందికి మూర్తులే తప్ప దాన్ని మించి అసలు వాడుంటాడు, అసలు తత్త్వమే మూర్తులుగా వచ్చిందని తెలియదు. మూర్తి ఆరాధన తప్ప తత్త్వం ఉండదు. ఈ రెండింటినీ చక్కగా సమన్వయం చేసుకోవడమే అనన్య భక్తియోగము. అన్యము కానిదీ, ఒకటే అయినదీ, ఇన్నిరకాలుగా ఉన్నది అని గుర్తుపెట్టుకుని, అన్ని సిద్ధాంతాలనీ అంగీకరించాలి. ఒక్కొ సిద్ధాంతంలో కొంతకొంత సత్యం ఉంటుంది. మొత్తం సత్యం సమన్వయంలో ఉంటుంది. అందుకని కొంతకొంత సత్యాలు ఎవరైనా పలుకుతుంటే దాన్ని అంగీకరిస్తారు. అంగీకరించి ఇంత మాత్రమే కాదు సుమా, ఇంతకు మించి కూడా ఉన్నది, అని చెప్తూంటారు.

## 751 శతమూర్తిః

అంటే వంద మూర్తులున్నాయని అర్థం. వందేనా అంటే సహస్రం అని అర్థం. అనేక మూర్తికదా! ఇవన్నీ ఎందుకు తీసుకొస్తారంటే మనం ఒక భావనలో కరుడుగట్టుకొని ఇమిడిపోకుండా తద్వారా మనల్ని మనం పరిమితం చేసుకోకుండా ఉండడం కోసం, రెండు seemingly opposing concepts అక్కడ పడేస్తాడు. 'అదృశ్యో వ్యక్త రూపశ్చ' అంటాడు. అదృశ్యుడూ, వ్యక్త రూపశ్చుడూ రెండూ కలిపి చెప్తాడన్నమాట. 'సుదర్శనః కృష్ణో' అని చెప్తాడు. సుదర్శనః, అంటే బాగా కనిపిస్తాడుట. కృష్ణో, అంటే అసలు కనిపించడట. రెండూ ఒక చోటే. నువ్వు ఎటు పక్కన మొగ్గినా మొత్తం సత్యంలోంచి కింద పడిపోతావ్. అందుకని ఒకటి చూసినప్పుడు దానికి రెండోది కూడా ఉంటుందని తెలిసి, రెంటినీ కలిపి సత్యంగా గ్రహించాలి. జీవితం అంటే సుఖమేనా, కాదు దుఃఖం కూడా. లాభమేనా, నష్టం కూడా. సౌకర్యమేనా, అసౌకర్యము కూడా. ఆనందమేనా, దుఃఖం కూడా. రాత్రేనా పగలు కూడా. పౌర్ణమేనా అమావాస్య కూడా. ఉత్తరాయణమేనా దక్షిణాయణము కూడా. యవ్వనమేనా వృధ్ధాప్యము కూడా. అందుకే మాస్టారు అంటూండేవారు, రెండూ కలిపి సత్యమని. రెండూ అంటే ఏమిటి? మనం ఓ ధృక్పథంలో చూస్తాము, ఇంకోడు ఇంకో ధృక్పథంలో చూస్తాడు. ఇద్దరూ తలోపక్క నుండి ఒకే రూపాయి బిళ్ళని చూస్తున్నట్లు. ఒకళ్ళు బొరుసే రూపాయి బిళ్ళ అంటే, ఇంకొకరు బొమ్మే రూపయి బిళ్ళ అంటారు అని మాస్టారు అన్నట్లుగా వుంటుంది. రెండు పక్కలా చూసినవాడు మాత్రమే రెండూ నిజం అంటాడు. పరమార్ధమా, పదార్ధమా అని కొట్టుకుని చచ్చిపోతున్నారు. పదార్థం ఏముందండి అంతా పరమార్థమే కదా! అని భక్తులు అని వాళ్ళళ్ళో వాళ్ళు ముద్ర వేసుకుని, అలా నమ్మి ఆ మోహంలో జీవిస్తారు కొంతమంది. పరమార్ధమే లేదు అంతా పదార్ధమే అని చెప్పే వాళ్ళు కొంతమంది. ఇద్దరి దగ్గర రూపాయి నోటు చెరి సగం ఉంది. చింపుకు కూర్చున్నారు. ఎవరి రూపాయీ చెల్లదు కదా! రూపాయి నోటు సగం చింపుకుని మీదగ్గర ఒకటి, నా దగ్గర ముక్క ఒకటి పెట్టుకుంటే మీ సగం ముక్కతో మీకేం రాదు, దాన్ని అమ్ముకుని ఏం చేసుకోలేరు. నా సగం ముక్కతో నేనేం చేయలేను. ఎందుకంటే ఇద్దరి దగ్గర ఉండేది చెరిసగం ముక్క. అందుకని యోగులు ఏం చెప్తారంటే ఊర్కే అవగాహన కోసం పదార్ధమూ, పరమార్ధమూ అంటాం తప్ప అలా విడదీయడానికి ఏమీ లేదు అని చెప్తారు భగవంతుడు అయ్యవారా, అమ్మవారా? ఊర్కే అవగాహనకి విడదీశాం తప్ప, అయ్యవారు అమ్మవారు కలిపి. భగవంతుడు. పదార్ధములో పరమార్ధమూ, పరమార్ధములో పదార్ధమూ ఇమిడి ఉన్నది. స్థూలమైన స్థితిలో అవ్యక్తం సూక్ష్మం

గా ఇమిడి ఉన్నది. అవ్యక్తమైన స్థితిలో ఈ స్థూలమైనది సూక్ష్మంగా ఇమిడి ఉన్నది. అదీ పెద్దలు మనకిచ్చిన సమగ్ర అవగాహన. అలా ఉండడం కోసం మనకి ఇటూ, అటూ రెండు ప్రక్కల వేస్తారు. చపాతి కాల్చాలంటే మరి తిప్పాలి కదా! ఒకప్రక్క కాల్చి పడేస్తే, రెండో పక్క కాల్చలేదమ్మా అని చెప్తాం. దోశె అంటిది అటూ ఇటూ వేస్తేనే కదా! ఒక ప్రక్క వేసుకుని చూసుకుంటే అవదు. అంత బాగా రాదు. ప్రతి విషయంలోనూ రెండూ ఉన్నాయని తెలుసుకోవాలి. మొత్తం సృష్టి ద్వంద్వమే! సృష్టిలో ఉన్నావంటె ద్వంద్వంలో ఉన్నావనే. ఒక్కటి పట్టుకుంటే అవ్వదు. ద్వంద్వానికి అతీతంగా నువ్వు ఉంటే రెంటినీ చూడగలవు. నువ్వు ఎప్పుడైతే గట్టిగా బల్ల గుద్ది ఇదే సత్యం అన్నావో, సరిగ్గా ఇదే అసత్యం అనేవాడు ఇంకోచోట పుడతాడు. నువ్వు ఏది సత్యం అని గట్టిగా వక్కాణిస్తున్నావో, అదే అసత్యం అని చెప్తాడు. కృష్ణుడు దేవుడని చెప్తే, అంతకు పూర్తి వ్యతిరేకంగా దేవుడు కాదని చెప్పినవారున్నారు. కృష్ణుడ్ని నమ్మిన వాళ్ళు ఎంతమంది ఉన్నారో, నమ్మనివాళ్ళు అంతమందీ ఉంటారు. ఎంత చంద్రుడైనా అందులో మచ్చ చూస్తారు కదా! సృష్టిలో రెండు భావాలు ఎప్పుడూ ఉంటాయి. ఏ మనిషి గురించయినా రెండు భావాలు వుంటాయి. మంచిగాను, చెడుగాను కూడా చెప్పకుపోయే వారుంటారు. ఇంతకీ నేనెవరంటే ఆ మంచీ కాదూ, ఆ చెడూ కాదు. 'నేను నేనే' అనుకోవాలి. ఎవరెవరికి ఏ అనుభవాలుంటాయో వాటిని బట్టి లెక్కవేసుకుంటారు. కృష్ణుడికే గతి లేకపోతే మీరు నేను ఏమిటండీ! మనల్ని మనం మంచిగా establish చేసుకుందాం అనే ప్రయత్నం ఓ మూర్ఖత్వం. మనకి ధర్మం అని తోచింది ఆచరించుకుంటూ పోతుంటే, కొంతమంది అంగీకరిస్తారు, కొంతమంది అంగీకరించరు. అందరూ అంగీకరించాలని అనుకోకూడదు. ఇట్లాగే ఒక శిష్యుడు ఒకసారి అరవింద మహర్షి వద్దకు వెళ్ళి 'పెద్దలు చెప్పిన మార్గంలో నడుస్తుంటే కష్టాలు వస్తున్నాయి సార్' అన్నాడు. 'ఏమిటి నీ కష్టం?' అంటే 'నా సుఖం కోసం నేను బతుకుతుంటే చాలా మంది కష్టపడ్డారు. అప్పుడు పెద్దవాళ్ళు నీ సుఖంకోసం కాదు, ఇతరుల సుఖం కోసం, ఆనందం కోసం బతుకు, నీ ఆనందం కోసం బ్రతకకు, అని చెప్పారు. వాళ్ళ ఆనందం కోసం, సుఖం కోసం నేను బతుకుతుంటే నా బతుకు దుర్భరం అయిపోతోందీ, నేనిప్పుడు సమస్యలో పడ్డాను, నేనిప్పుడు నా ఆనందం కోసం బ్రతకాలా? వాళ్ళ ఆనందం కోసం బ్రతకాలా? ఎవరి ఆనందం కోసం బతకాలీ? మీరు చెప్తే దాన్ని బట్టి ఒక పద్ధతి తీసుకుంటాను forever' అన్నాడు. అప్పుడు అరవిందులన్నారూ 'నువ్వు వాళ్ళ ఆనందం కోసం బతకద్దూ, నీ ఆనందం కోసం బతకద్దూ, భగవంతుని ఆనందం కోసం బతుకు' అని. 'అదేమిటి భగవంతుని ఆనందం కోసం బ్రతికితే భగవంతుడు ఆనందిస్తున్నాడో లేదో మన తెలీదు కదా' అన్నాడు. 'భగవంతుడు ఆనందించడానికి ఓ మార్గమున్నది. నేను దాన్ని

ఆచరిస్తున్నాను. ఇంక మిగతవాళ్ళు ఎవరు మనల్ని చూసి ఆనందించిందీ, లేనిదీ మనకి అనవసరం. ఎప్పుడూ మన గురించి బాధపడేవారు, సంతోషించే వాళ్ళూ ఉంటారు. భగవంతుని ఆనందం నీకుగా ఎలా తెలుస్తుంది అంటే, నువ్వు ధర్మం యందు నిలబడితే తెలుస్తుంది. ధర్మాన్ని ఆచరిస్తూ ఉండు. సృష్టి ఏర్పరిచినప్పుడు, సృష్టిలో ధర్మాన్ని కూడా ఏర్పరిచినాడు భగవంతుడు. సృష్టి ధర్మాలని నువ్వు అనుసరిస్తున్నంత కాలం నీకు చేతన యందు ఆనందం, స్థిరత్వం, దృఢవిశ్వాసం, ఆత్మవిశ్వాసం, తృప్తీ ఉంటుంది. ప్రపంచం అంటావా? వదిలెసేయ్యి. నా గురించి కూడా చెప్పకుంటున్నారు. కానీ లోపల నాకు తృప్తి ఏర్పడిపోయింది ఇది కారణం చేత. నీకు వీలుంటే ఇలా చేసుకో' అని చెప్పారు. ఆయన కూడా పెద్దవాడైపోయాడు ఇప్పుడు. పుస్తకంలో వ్రాసుకున్నాడు నా గురువు ఇలా చెప్పారని. ఎంత బాగుంది. మనకి ప్రతిదానికి రెండు వుంటాయి. పరీక్ష pass అవంగానే సరిగాదు. పరిక్ష pass అయ్యేవరకు అదే పెద్ద విషయం. పరీక్ష pass అయ్యాక మరొకటి. ప్రతి విషయానికి ఇలాగే ఉంటుంది. పుట్టంగానే సరిగాదు. చదువుకొనగానే సరికాదు. సంపాయిస్తే మాత్రం అయిపోయిందా? దాన్ని నిలబెట్టుకోవడానికి ఎన్ని తంటాలు పడాలీ? దాన్ని వినియోగం చేయడానికి ఎన్ని తంటాలు పడాలీ? గులాబీ పువ్వందుకోవాలీ అంటె ముల్లు కూడా ఉంటుంది. సృష్టి అలా ద్వంద్వంలో ఉంటుంది. అది తెలియడానికి ఋషులు ఏం చేశారంటె రెండు ప్రక్కలది తెచ్చి ఒకేసారి పడేశారు. అదే మిధునరాశి తత్త్వం. అబ్బాయ్ రెండుగా కనిపిస్తాయి. రెండూ అందుకుని, రెండింటిని కనుక నువ్వు సమన్వయం చేశావంటే నీకు అసలు సత్యం తెలుస్తుంది, అని చెప్పారు. నువ్వెరిగిన సత్యమూ, నువ్వెరిగిన అసత్యమూ రెండూ కలిపి సత్యము అని వేదంలో వాక్యము.

## 752 శతాననః

అంటే వంద రూపాలే కాదు. వంద అంటే చాలా రూపాలు. అన్ని రకాల ముఖాలూ కూడా అంటున్నారు. ముఖాలు అంటే అక్కడ అర్థం ఏమిటంటే ప్రవర్తనలూ అని. మనమే ఒక్కొక్కళ్ళు వస్తే ఒక్కొక్క రకంగా ముఖం పెడతాము కదా! మనకు కూడా వంద ముఖాలున్నాయి. అలాగే ప్రతి జీవీ రకరకాల ముఖాలతో వస్తూంటుంది, పోతుంటుంది. ఇన్ని ముఖాలూ వాడివే. Shakespeare ఒక drama రాశాడు. ఆయన ఒక మంచి సత్యదర్శి! భారతదేశంలో పుట్టకపోయినా సత్యాన్ని దర్శించినవాడు. 'ఇక్కడ పుడితేనే' అనే తెగులు మనకుందికదా మరి! దేవుడికది ఉందని నేను అనుకోను. ఎందుకంటే భగవత్తత్త్వం లోంచి పుట్టుకొచ్చిన వాటిలో ఇక్కడే అని ఏమీ ఉండదు. ఇక్కడ కొన్నాళ్ళు వెలిగింది. ఈ school ల్లోనే బాగా చదువు చెప్తారుటా అంటే, ఏదో కొన్నాళ్ళు. ఇప్పుడు ఇంకో school అంతకన్నా బాగా చదువుచెప్పేది రాకూడదా? ఇంకేదో school ల్లో ఇంత కన్నా బాగా చెప్పేవారు వుండకూడదా?. ఇక్కడ వచ్చిన వాళ్ళకు వచ్చినంత marks ఇంకొక schoolలో రాకూడదా? ఎందుకో మనం అట్లా 'ఇది పుణ్యభూమి. ఇక్కడ తప్పితే ఏం లేదు, మిగతా అంతా ఏమీలేదు' అనుకుంటాం. నువ్వు లేదూ అంటే లేదు, ఉందనుకుంటే ఉంది. సత్యాన్ని దర్శించిన వారు భూగోళంలో చాలా చోట్ల ఉన్నారు. అలా ఆయన ఒక చక్కని నాటకం రాశారు. ఆ నాటకంలో అందరూ కూడా అసలు ముఖం చూపించకుండా వేరే పెట్టుకు వస్తుంటారు. మన కథే! మన అసలు ముఖం చూపించం. ఎదుటి వ్యక్తితో మనకి ఎటువంటి అవసరాలుంటే దాన్నిబట్టి ముఖాలు మారుస్తుంటాం. మనతో పనున్నవాడు వస్తే ఒక రకంగా ముఖం పెడతాం. మనకి పనున్నవాడు వస్తే ఇంకోరకంగా ఉంటుంది ముఖం. మనవాడు అనుకున్నవాడు వస్తే ఒక రకంగా వుంటుంది ముఖం, మనవాడు కాదు అనుకుంటే మరొక రకంగా వుంటుంది ముఖం. అలసిపోతే ఒకలాగ, పొద్దుట నిద్రలేస్తే ఒకలాగ వుంటాయి మన ముఖాలు. ఎన్ని వున్నాయి చూడండి. మనకే ఇలా ఉంటె సృష్టిలో ఎన్నుంటాయి? ఇవన్నీ ముఖాలే తప్ప దాని లోపలుండే వాడొకడే! అదే కదా కావాలి.

## 753, 754 ఏకః, అనేకః

ఏకో అంటే ఒకడే! అనేకః అంటే అనేకము! సత్యదర్శి ఎప్పుడూ ఏదైనా సిద్ధాంతాన్ని వివరించేటపుడు దాని పూర్వాపరాలు, దాని వ్యతిరేక భావాలూ అన్నీ కలిపి అక్కడ చెప్తాడు. అదీ పూర్ణజ్ఞానం. బత్తాయి పండుని మధ్యకి కోసి, రెండు సగాలు చేశామనుకోండి అందులో ఏ సగం బత్తాయి పండు? రెండూనూ! బత్తాయేది కాదు? అలాగే, ఒక ముక్క వుంచుకుని, మరో ముక్క పెంచాడు. ఒకడే అనేకం అయ్యాడు. అందుకని రెండూ కలిపి అక్కడ పడేశాడు. మన సాధనలో మనం చేసేది right అనుకోండి, అలాగే మరో right కూడా వుంటుందని తెలుసుకోండి. 'మనకి తెలిసిందే కాక మనకి తెలియని right కూడా వుండవచ్చు' అని తెలిసి వుండడం మంచిది. ఇప్పటికిది సత్యం అనేది ఒక పెద్ద జ్ఞానం. ఇంతకన్నా పెంపొందవచ్చు, వికాసం చెందవచ్చు. పెద్ద సత్యం రాగానే చిన్న సత్యం అందులో ఇమిడి పోతుంది, కలిగిపోతుంది. ఏమిటో అప్పుడట్లా అనుకునేవాడ్ని, అనుకుంటాం. మరప్పుడు అలా అనుకున్నారు కదండీ, మరిప్పుడిలా చేప్తున్నారేంటండీ అంటే, అవునా అప్పుడట్లా అనిపించింది కానీ ఇప్పుడింకా కొంచెం ఎక్కువ తెలిసింది, పూర్తిగా తెలిసిందా అంటే, ఏమో? అనాలి. అందుకే భాగవతంలో అంతా తెలిసింది అనరట, ఎవరూ కూడా. ఎందుకంటే పూర్తిగా తెలిసిందనడానికి ఏమీ లేదు. ఇప్పటికింత తెలిసింది. శౌనకాది మహామునులు సూతుని వద్దకు వచ్చి, 'అయ్యా, భగవంతుని గురించీ, లీలావతారాల గురించి చెప్పవయ్యా' అంటే మనకి భాగవతం వచ్చింది. సూతుడు ఒకటే మాట చెప్పాడు 'ఆకాశం గురించి ఎంతని చెప్పనూ? నువ్వెంత పైకి వెళ్ళినా పైన ఆకాశం వుంటుంది. నేను ఎరిగినంత వరకూ, చూచినంత వరకూ మీకు చెప్తాను తప్ప, అంతా చెప్తానని నేను అనుకోలేను, అలా చెప్పగలనని మీరూ అనుకోవద్దు, నాకు అందినంత, మీకు ప్రాప్తమున్నంత చెప్తాను' అంటాడు. అట్లా వుంటుంది. ఇదొక్కటే అనవద్దు, అలా అంటే మూఢత్వంలోకి వెళ్తున్నట్లు అర్థం, సమన్వయాత్మక పరంగా చూస్తే!

## 755, 756, 757, 758, 759 స్తవః, కః, కిం, యత్, తత్పదమ్

కః ఎవరిని చూపిస్తావో, ఎవరిని చూపించినా వాడేటండి. కిం ఏమిటికై, ఎందులకై సృష్టించడానికి కారణాలుంటాయి కదా! అవి కూడా వాడేనట. యత్ ఎవరినైతే, 'తత్' అది. ఈ నాలుగింటినీ కలిపి ఈ స్తవాన్ని మనం అనుసంధానంగా వేసుకుంటే ఎవరూ, ఏమిటీ, ఎవరికొరకై, ఎందుకొరకై, దాన్ని స్తవం చేస్తామో, ఆ మొత్తాని కంతటికీ వాడే స్తవః, కః, కిం,యత్. తత్. తత్ అంటే అది అని చెపుకున్నాం. యత్ అంటే ఎవరివల్లనైతే, కిం అని చైనీస్ పెట్టుకునే పేరు. కిమ్ అంటే by what? దేని వలన? కః ఎవరి వలన? by whom? ఈ స్తోత్రంలో ఇలా వస్తూంటాయి. ఎవరివలన ఇదంతా జరుగుతుందో, దేని వలన ఇదంతా జరుగుతుందో దాన్ని నేను ప్రార్ధన చేస్తున్నాను. 'తత్ సవితుర్ వరేణ్యం' అంటే అదే కదా మరి! దేని వల్లనైతే ఇదంతా వెలిగింపబడుతున్నదో ఆ దేవుడ్ని ప్రార్ధన చేస్తున్నానని చెప్తున్నది. మగరూపం కాదూ, ఆడ రూపం కాదూ. గాయత్రి, ఆడదని ఎందుకన్నారంటే అంతకు ముందు ఇంకోటి వుండి, దానికి రూపంగా వెలుగు ఏర్పడిందని చెప్పాం కాబట్టి, 'ఆడ' అన్నారు. అందులోంచి మిగతావన్నీ దిగి వచ్చినపుడు అది 'మగ' అవుతుంది. ఆడ మగ, మగ ఆడ అవుతుంది. పుచ్చుకున్నపుడల్లా ఆడవాళ్ళం అవుతాం. ఇచ్చినప్పడల్లా మగవాళ్ళం అవుతాం. కనుక తత్త్వానికి ఆడా లేదు, మగా లేదు. సన్నివేశాన్ని బట్టి ఆడా మగానూ. పదమ్ అంటే శబ్దము, వాక్కు, అక్షరము, మొదటి అక్షరము, నాదము, ఓంకారము ఇవన్నీ వస్తాయి. In the beginning there was the word, and the word was God అన్నారు కదా! మనలో సంకల్ప శక్తిగా వున్నదాన్ని 'పదము' అంటాం. భగవంతునికి చేరువైంది అది. సంకల్పానికి ముందు మనం వున్నాం. తర్వాత అది సంకల్పం అయ్యింది. దాన్ని బట్టి మనం తయారవుతుంటాం. అట్లాగే సృష్టిలో మొదటి సంకల్పాన్ని 'the word that is uttered forth' 'పదము' అని చెప్తారు. అందుకనే మొట్టమొదట వ్యక్తమైన దాన్ని 'ఇచ్ఛాశక్తి' అంటారు. అదీ పదం! అది పట్టుకుని మిగతావన్నీ ఏర్పడినాయి. ఆ ఇచ్ఛయే లేకపోతే ఏముందీ? మనకి కూడా జీవితంలో ఇచ్ఛ లేకపోతే సారం లేదు. ఇచ్ఛాశక్తి తర్వాత జ్ఞానశక్తి, క్రియాశక్తి. అందుకని తన నుండి వ్యక్తమయ్యే మొట్టమొదటి సంకల్పాన్ని 'పదము' అంటాడు. మళ్ళీ పదం నుండి తానే వ్యక్తమవుతాడు. తాను వ్యక్తమై మళ్ళీ తన నుండి పదం వ్యక్తం అవుతూంటుంది. ఇట్లా సృష్టి వెళ్తూంటుంది ఓ పద్ధతిలో ఉండ్రాళ్ళ దొర్లినట్లు. దీన్నే బ్రహ్మ సరస్వతిని సృష్టించి ఆమె వెనకాల పడ్డాడు,

అంటారు. మనం కూడా అంతే ఒక సంకల్పం వస్తే దాని వెంట పడతాం. ఈ సంకల్పాల ప్రవాహం ఒక దాని తర్వాత ఒకటి వస్తూనే వుంటాయి. అట్లా ఆయన నుండి ఆమె వచ్చి అట్లా పరిగెట్టుకుంటూ పోతూంటే, ఆయన వెంట బడి పోతూంటే, ఈ సృష్టి అంతా వచ్చిందని చాలా poetic గా చెప్తారు. బ్రహ్మ నుండి పుట్టిన సరస్వతి వెంట, అంటే కూతురు వెంట బ్రహ్మ పడ్డాడని వ్యంగ్యంగా చెప్తారు. మనం అంతా కూడా సంకల్పాలనే కూతురి వెంట పడుతున్న వాళ్ళమే. ఎందుకంటే మన నుండి పుట్టిందే గదా మన సంకల్పం! మనలోంచి పుట్టింది కాబట్టి, దానికి ఆధారం మనం కాబట్టి దాన్ని స్త్రీ అన్నారు. మనం పురుషులం. మగయినా ఆడయినా! దాని వెంట పడిపోతున్నపుడు మళ్ళీ మనం ఆడ అయిపోతాం. అది పురుషుడైపోతుంది. దేని వెంట పడుతున్నామో అది పురుషుడు, వెంట పడేవాళ్ళు స్త్రీ అవుతారు. అందుకే మనం పెట్టుకున్న పనులు మనకి పెద్దవి అయిపోతాయి.

## 760 అనుత్తమమ్

అంటే ఎప్పుడూ ఉత్తమమే! అనుస్యూతం లాగా అన్న మాట. 'అను' అంటే సదా అని అర్థం. Ever అన్నమాట. అప్పుడప్పుడు bestగా వుండడం తెలుస్తుంది కానీ, ఎప్పుడూ best గా వుండడం కష్టం కదా! ఎంతటి వాడైనా, వాడికీ కొన్ని పల్లాలుంటాయి. ఇక్కడ అసలు దిగం. తత్త్వం నుండి సమస్తం ఏర్పడుతుంది. అది ఆధారంగా వుంది. అన్నిటి కన్నా అదే పెద్దది. అదొక అవగాహన. ఇంకోటి ఏమంటే అవతారాల్లో శ్రీకృష్ణుడు బొత్తిగా దిగని వాడు. రాముడు దిగాడు. పరశురాముడు విపరీతంగా దిగుతూ వచ్చేవాడు. ఇక బలరాముడు చెప్పనక్కర్లేదు. ఇంతమందీ, బ్రహ్మ నుండి దేవతలతో సహా అందరితో పోల్చి చూసినా కృష్ణుడు దిగలేదు. ఈయన ముందు బ్రహ్మ, ఇంద్రుడు, వరుణుడు, యముడు అంతా దిగారు. దిగిరాని వాడు లేడు. ఈయన మాత్రం ఎక్కడాదిగలేదు. దిగడం అంటే He has never come down from his state of poise, ever best అన్నమాట. అలా మామూలుగా సాధ్యపడే విషయం కాదు. ఇక్కడొక్కచోటే సాధ్యపడే విషయం. అందుకే ఋషులు 'ఇలాంటి పూర్ణపురుషుడు ఇలా దిగిరావడం వెనుక కాలేదు. ఇకముందు కూడా దిగి రాడని మేము నమ్ముతున్నాం' అని చెప్పారు. అంత అవసరం లేదు కనుక, అంటే ఎంత అవసరం వుంటే అంత దిగి వచ్చిందో మనకి తెలియదు. కనుక అనుత్తముడు అంటే Ever great, the greatest at all times, in all aspects. బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణుడు. 64 కళలకీ పూర్ణమైన అస్తిత్వం ఆయన యందు లభించింది. 64 విద్యలు నేర్చుకున్నట్లుగా మనం దశమస్కంధంలో చూస్తాం. సంగీతం, నాట్యం, వీర్యం, అదీ ఇదీ అని లేదు. చివరకు భర్తగా అంతమంది భార్యలని అంత తృప్తి పరచిన వాడెవడూ వుండడు. మొత్తం ప్రపంచంలో ఏవిధంగా చూసినా యోధుడా, ఇంతటి యోధుడు మరొకడు లేడు అందగాడా, ఇంతటి అందగాడు లేడు. జ్ఞానా, ఇంతకన్నా మహాజ్ఞాని మరొకడు లేడు. యోగా, ఇంతకన్న యోగి ఇంకెవరూ లేరు. విరాగా, ఇంతకన్న వైరాగ్యం ఇంకెవరకీ మరెవరికీ లేదు. మీరు ఏ దివ్యగుణం చెప్పినా అందులో తలమానికం. అందుకనే పరబ్రహ్మతత్త్వమే రూపు కట్టుకుంటే ఇలా వుంటుంది, అని చెప్పడానికి వచ్చిన స్థితి కాబట్టి, కృష్ణుడ్ని ఈ విధంగా భీష్ముడు స్తుతించాడు.

# 761 లోకబంధుః

బంధు ఎవరికి కాదు? సమస్తమూ తన నుండి దిగి వచ్చినదే కదా! మరి సమస్తానికీ తనతో బంధుత్వమే కదా. బంధుత్వం అంటే వాడికీ, వీడికీ ఒక ముడి వున్నదని అర్థం. అది చిక్కుముడి అవనక్కర లేదు. దూముడి అవ్వచ్చు. ప్రతి వారితోనూ భగవంతుడికి బంధుత్వం వున్నది. లోకములన్నిటితోనూ బంధుత్వం వున్నది. అన్ని లోకాలలోనూ తనకు ప్రమేయం వున్నది. ఆ లోకాలలో వుండే జీవులకు తనతో ప్రమేయం వున్నది. ఈయనది కానిదేదీ లేదు. ఈయనకి సంబంధించనిది ఏమీ జరగదు. సమస్తమూ తనతో ముడిపడి వున్నది అని చెప్పడానికి లోకబంధువు. బంధుప్రేమ అలా చూపిస్తాడట. తనయందు ప్రీతి కలిగిన వాడికీ, తనూ అటువంటి ప్రీతిని ప్రదర్శిస్తూంటాడు. ఆ తత్త్వం చాలా నిర్వికారమైన తత్త్వం. నువ్వెట్లా ప్రతిబింబిస్తే అవతల అది అలా ప్రతిబింబిస్తుంది. అదే దేవతల యొక్క తత్త్వం కూడా. నువ్వెంత శ్రద్ధాభక్తులతో ప్రార్థిస్తావో అక్కడ దానికి దర్పణం లాగా మళ్ళీ అంత ఫలితమూ నీకే అందిస్తారు. వాళ్ళకేమీ అక్కరలేదు. దేవతల తత్త్వమే అది అంటే, మరి వారు వచ్చినది ఆ భగవత్తత్త్వము నుండే కదా! నువ్వు బంధువు అనుకుంటే నేను బంధువు. కాదనుకుంటే కాదు. ఆయన బంధువులు కొంతమంది ఆయనను బంధువు కాదనుకున్నారు అదీ తమాషా. ఆయన బంధువులు కానివారు ఆయన్ను బంధువనుకున్నారు. అలా అని తనకు సమస్తముతోనూ బంధుత్వం వున్నది. ఎవరూ నా వాడు కాదు? అన్నట్లుగా వుంటాడు. మంచివాడితోనూ, మంచివాడు కాదనుకునే వాడితోనూ కూడా బంధుత్వమే. కొంతమందితో బంధుత్వము, కొంతమందితో లేదు అనిలేదు. కానీ తన యొక్క ప్రతిస్పందన అవతల వ్యక్తిని బట్టి వుంటుంది. అర్జునుడు, దుర్యోధనుడు వచ్చారనుకోండి, అర్జునుని బట్టి అర్జునుని యందు ప్రతిస్పందన, దుర్యోధనుని బట్టి దుర్యోధనుని యందు ప్రతిస్పందన. ఇక్కడ ఏమీ ఉండదు, తత్త్వమే వుండేది. అలా వుండేవాడు. భీష్ముని మిత్రునిగా చూశాడా, శత్రువుగా చూశాడా, భక్తుడిగా చూశాడా, యోగిగా చూశాడా? భీష్ముడు ఎలా చూస్తే అలా చూశాడు. భీష్ముడు కృష్ణుడు సమస్తమూ అని చూశాడు. అందుకనే, తన గురించి సమగ్ర అవగాహన భీష్మునికిచ్చాడు. అంత గౌరవమూ భీష్మునికి అందజేశాడు. అర్జునుడికి కావాలనుకున్నపుడు ఉన్నాడు. అక్కర్లేదు నేను చూసుకుంటాలే, అంటే తప్పకుండా, అని చెప్పాడు. దానికే సింహరాశి తత్త్వం అని చెప్తారు. ఆ తత్త్వం ఏమంటే నేను స్వతంత్రుడిగా జీవిస్తాను, ఇతరులను స్వతంత్రులుగా జీవించనిస్తాను. 'I rule myself, I let others rule themselves'. 'I also try to rule you' అన్నది లేదక్కడ. అది పశుత్వం. ఇంకొకడి జీవితాన్ని

వాడడక్కుండానే నిర్ణయాలు చేయడం, వాడిని నొక్కి పెట్టి వుంచడం, తొక్కి పెట్టి వుంచడం మనం చెప్పినట్లే వాళ్లు వినాలని చూడడం ఇవన్నీ కూడా పశుప్రవృత్తులు. సింహరాశి తత్త్వం ఎలా వుంటుందంటే, ఎంత అత్యంత ప్రియుడూ, ఆత్మీయుడైనా అతని సంకల్పం మేరకే ఇతడు ప్రతిస్పందించడం వుంటుంది తప్ప, మరొకటి వుండదు. అర్జునుని విషయంలో కూడా కృష్ణుడలానే వున్నాడు. ఎవరైనా అంతే! నీ బట్టి నేను. మరి నువ్వేమిటి ? నేను వెండి తెరలాంటి వాడిని. నువ్వు ప్రేమిస్తావు, నీకు నా నుండి ప్రేమ అందుతుంది. నువ్వు పూజిస్తావు, నా నుండి నీ పూజకు ఫలితంగా నువ్వు కోరినది అందుతుంది. నువ్వు కామిస్తావు, నీకు కామం అందుతుంది. కృష్ణుడిలో వుండే గొప్పతనం అది. మనం కొన్ని కొన్ని దేవుడు చేయకూడదనుకుంటాం కదా! అదంతా మన పరిమి తత్త్వం! అవేవీ లేవు ఆయనకి. ఎవరేం కోరితే, అదిచ్చాడు. తనని కోరిన వాళ్ళకి తనని ఇచ్చుకున్నాడు. అది అవగాహన కావాలంటే చాలా చాలా ఎత్తులకి ఎదగాలి. అందుకని ఉద్ధవుడికి చివర వరకూ తెలలేదని చెప్తాడు. 'ఆ రోజు నేను కుబ్జ ఇంటికి వెళ్ళాను, అని నీ mindలో ఇంకా వుండి పోయింది కదా' అని కృష్ణుడు ఉద్ధవుడ్ని అడుగుతాడు. అప్పటికి ఆయనకి 126 సం//లు. జరిగింది ఆయన 11 ఏళ్ళ వయసులో. ఈయన వాళ్ళింటికి వెళ్ళివచ్చాడని మిగిలిపోయింది. ఇంత శిష్యుడికి గురువుగారి గురించి అప్పుడప్పుడు గుర్తొస్తుంటుంది. 'ఏం వెళ్తే!?' అన్నాడు. మనకి తెమలదు అంతే. అసలు మంచీ, చెడూ అనేవి మనం గీసుకున్న గీతలే. కృష్ణుడికి ఆ గీతలు లేవు. అందుకనే, ఓ బ్రాహ్మణుడు బస్సులో కృష్ణ జపం చేసుకుంటూ వెళ్తున్నాడు. ఆయన పక్కన ఒక తురకాయన కూర్చున్నాడు. అతను అడిగాడు 'ఏం బాపనయ్యా, నువ్వు కృష్ణ జపం చేస్తున్నావూ, మీ కృష్ణుడేమో అంతమంది భార్యలని పెట్టుకున్నాడని తెలిసినా' అని ఎగతాళిగా మాట్లాడాడు. ఈయన అడిగాడు 'నీకెంతమంది రా పెళ్ళాలూ' అని, దానికతను ఇద్దరు అని చెప్పాడు. మరి నీ జీవితం ఎలా వుంది అనడిగితే, చాలా కష్టంగా వుందన్నాడు. 'ఒరేయ్ నీ కిద్దరితోనే ఇంత కష్టంగా వుంటే, మరి మావాడు అంతమందిని పెట్టుకున్నాడు, ఏ కష్టమూ పడలేదు, మరి నీకన్నా గొప్పవాడే కదా! అన్నాడట. ఇది సత్యం అని కాదు గానీ, తెలివుండాలండీ, ఏ విషయంలోనైనా సరే నెగ్గుకు వచ్చినవాడు లోకబంధువు. నువ్వెలా పూజిస్తే అలా వచ్చాడు. శిశుపాలుడు ద్వేషిస్తే ద్వేషం అందుకున్నాడు. కంసుడెంత భయపడ్డాడంటే కృష్ణుడు కనబడగానే పంచ ప్రాణాలూ పోయాయి. అందుకే నారదుడు చెప్తాడు 'కామోత్కంఠత గోపికల్, భయమునన్ కంసుండు, వైరక్రియా సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్, ప్రేమన్ మీరలు, భక్తి మేము.' మాబోటి వారంతా భక్తితో ఆయన్ని ముడి వేసుకున్నాము. మీ బోటి వారలు (అంటే పాండవులు) ప్రేమతో ముడి వేసుకున్నారు. గోపికలు కామ ఉత్కంఠంతో ముడి

వేసుకున్నారు. కంసుడు భయంతో ముడి వేసుకున్నాడు. శిశుపాలుడు మొదలైన రాజులు ద్వేషంతో ముడి వేసుకున్నారు. ఏదైనా వాడితో ముడే. చూడండి ఎన్ని రకాల dimensions ఇచ్చారో. మనం అనుకుంటామూ భజన చేసేవాడొక్కడే దేవుడికిష్టమని. అందుకే నారదుడు

వైరానుబంధంబున హరి చేరు చందంబు చిరుతర భక్తిన్ చేరగరాదని తోచును, నారాయణుని భక్తి యుక్తి నా చిత్తమునన్

అని అంటాడు. ద్వేషించిన వాడు తలచుకున్నంత తీవ్రంగా ప్రేమించేవాడు తలచుకోడు. భగవంతుడినే కాదు, మనం కూడా అంతే. మనం ఎవరంటే ఇష్టం లేదో వార్ని గురించి ఎక్కువగా ఆలోచిస్తాం. ఎవర్ని ద్వేషిస్తామో వారిని గురించి అనుస్యూతంగా ఆలోచిస్తూంటాం. ఎవర్ని ప్రేమోస్తామో, వారిని గురించి కూడా వుంటుంది కానీ అంతుండదు. ద్వేషించేవాడు ఎక్కువ గుర్తుకు వస్తాడు. ఇవాళ రాత్రి మిమ్మల్ని ఎవరన్నా 'శుంఠా' అన్నారనుకోండి, మరొకరు 'మీరు సాధన చాలా చక్కగా చేస్తున్నారు' అన్నారనుకోండి, మీకు రాత్రంతా శుంఠ అన్నవాడే గుర్తుంటాడు. పొద్దుట లేవగానే కూడా వాడు శుంఠ అన్నాడు కదా, అనే గుర్తుకు వస్తుంది. మంచి అన్నవాడు గుర్తుకురాడు. ఎంచేతా? ద్వేషంచేత! అందుకే నారదుడంటాడు 'ద్వేషించడం చేత దేవుడ్ని చేరుకునే పద్ధతి నాకు shortest route అనిపిస్తోంది అని. అట్లా నువ్వుండు అని చెప్పలేదు. ఎందుకంటే వుండలేడు కాబట్టి. ఎవరి తత్త్వం వారిది గనుక. అందుకే జయ, విజయులను 'భగవద్భక్తులుగా ఏడు జన్మలు కావాలా లేక తీవ్రంగా ఆయన్ని దూషించే వారిగా మూడు జన్మలు కావాలా' అని అడిగితే వారు 'ఈ మూడు జన్మలే బావుంది ఇచ్చెయ్యండి' అని అంటారు. అందుకని ఈ పద్ధతిలో ఎవరు బంధువులాయనకి? అందరూ బంధువులే! మనం ఎటువంటి బంధం పెట్టుకుంటే అట్నుంచి అలాంటి బంధం వుంటుంది. ఓ రోలుకో, గుంజకో తాడేసి మనల్ని కట్టుకుంటే అది మనల్ని కట్టేసిందా, లేక మనం దాన్ని కట్టుకున్నామా? రెండు పక్కలా గోచరిస్తుంది ఈ సత్యం. గులాబీని మనం పట్టుకుంటే గులాబీ కూడా మన చేతిని పట్టుకుంది. మనం దాన్ని పట్టుకున్నంత కాలం ఆ చేత్తో మనమే పనీ చేయలేం. ఎందుకంటే అది కూడా మనలను పట్టుకోవడం చేత. అలా భగవంతుడు అందర్నీ పట్టి వుంచాడు. కనుక అందరితో బంధం కలిగి వున్నాడు. తెలిసీ వుండచ్చు, తెలియక వుండవచ్చు. నేను పట్టుకున్నానని గులాబీ పువ్వు, గులాబీ పువ్వును పట్టుకున్నానని నేను అనుకోవచ్చు. మరి ఈ చేతికి freedom వదిలేస్తేనే వస్తుంది. అలా ఆయన పట్టి వుంచడం వలన సమస్త లోకములూ ఆయనతో బంధుత్వం కలిగి వున్నాయి. బంధుత్వం లేదని ఏ జీవి అనుకున్నా, అది అనుకోవడమేగానీ అందులో సత్యం లేదు.

## ౭౬౨ లోకనాథః

కేవలం అందరితో బంధుత్వమే కలిగి ఉండడం కాదు, అందరిపై స్వామిత్వం కలిగి వున్నాడు. అందరికీ, లోకాలన్నిటికీ కూడా నాథుడు. అందరి లోపల తానుండీ అందరినీ ఆ విధంగా నియమిస్తూంటాడు. అన్నమాచార్యుల వారు అన్నట్లు, 'అందరిలో పుట్టి, అందరిలో చేరి, అందరి రూపములు అటుతానై.

## ౭౬౩ మాధవః

'మా' అంటే లక్ష్మీదేవి, 'ధవుడు' అంటే భర్త. లక్ష్మిని ధరించిన వాడు. హృదయంలో ధరించాడు కదా! లక్ష్మి అంటే వైభవం. సృష్టి వైభవానికి కూడా ఆయనే అధిపతి. 'మాధవా' అని పిలుచుకోవడం లో మీరు అమ్మవారినీ, అయ్యవారినీ కలిపి పిలిచినట్లు. అందుకే ఈ నామానికి చాలా ప్రాముఖ్యం వున్నది. అందుకే కేశవ నామాల్లో వస్తుంది. కేశవ నామాల్లో వుండే ౨౪ నామాలూ భగవంతునికున్న సహస్ర నామాల్లో కొలికి పూసలు. అందుకని 'మాధవ' అనే నామం, అమ్మవారితో కలిపి అయ్యవారిని పూజించినట్లన్నమాట. మనం అమ్మవారిని విడిగా పూజించ లేదే అన్నబాధ అక్కర్లేదు. అబ్బాయి పుట్టి అమ్మాయి పుట్టకపోతే 'మాధవా' అని పెట్టుకుంటే సరి. అమ్మాయి అబ్బాయి కలిసి వచ్చినట్లుంటుంది. అద్భుతమైన నామాల్లో మాధవ నామం ఒకటి. సమస్త సంపదలకీ భర్త. సృష్టి వైభవానికి భర్త. లక్ష్మి అంటే చిహ్నం అని కూడా అర్థం. చిహ్నంగా ఆమె వుంటే, తత్త్వంగా ఆయన వుంటాడు. That which is called the lid, That which is called the glass, That which is called the rose అంటారు పెద్దలు. అంటే దేన్నయితే మూత అని పిలుస్తున్నామో, దేన్నయితే గ్లాసు, గులాబీ అని పిలుస్తున్నామో, అంటే అసలు తత్త్వం ఇక్కడ గులాబీగా, గ్లాసుగా, మూతగా వ్యక్తమయ్యింది అని చెప్పడం. అసలు తత్త్వం ఇక్కడ కుర్రవాడిగా, అక్కడ ముసిలివాడిగా వ్యక్తమయ్యింది. అక్కడ చెట్టుగా వ్యక్తం అయ్యింది అని చెప్పడానికి That which is called the tree అని పెద్దలు చెప్తారు. ఈ కనిపించేదంతా లక్ష్మి. కానీ అందులో వున్నది వాడు! అది చెప్పడానికి లక్ష్మి అని పేరు పెట్టారు. రూపంగా కనిపించేది అమ్మవారు, అసలు దానిలో వుండేది ఆయన. ఆయన లేకపోతే ఆవిడ లేదు అసలు. అదీ మాధవుడంటే అర్థం. మీకు ఏది కనబడ్డా 'మాధవా' అనుకోవచ్చు. పాము కనబడ్డా 'మాధవా' అని పిలవగలిగితే వాడుంటాడుగా, ప్రతికూల సన్నివేశం అనుకూలమయిపోతుంది కానీ, అప్పుడు అనబుద్ధి అవ్వదుగా!

ఓ ఓ అని గోల పెడతాం. దానికి కంగారు పుడ్తుంది, వీడేదో నన్ను చేసేస్తాడని. అందుకే భక్తుడికి ఏది కనబడ్డా 'మాధవా' అనే తత్త్వంలో వుంటాడు. ఏ రూపం వచ్చినా రూపం అమ్మవారిదీ, అందులో వున్న తత్త్వం అయ్యవారిది. అదీ మాధవ నామంలోని వెసులుబాటు. రూపాన్నీ, రూపంలో వున్నదాన్ని మనం ఒకేసారి ఆరాధన చేయడం చేత అది అనుకూలమవుతుంది. అందుకే మాధవనామం చాలా అద్భుతనామంగా పెద్దలు చెప్తారు. అలా ఈ నామం స్ఫూర్తినిస్తుంది. మిత్రా వరుణుల్ని కలిపి చెప్తుంది. పాత్రా, పాత్ర గా వున్న పదార్థమూ; కుండ, మట్టి; ఉంగరం, బంగారం కలిపి చూసినట్లు, జీవుడూ, దైవం కలిపి చూసినట్లు వ్యక్తమూ, అవ్యక్తమూ ఒకేసారి దర్శించినట్లు. అదీ ఈ నామం యొక్క విశిష్టత.

## 764 భక్తవత్సలః

ఎన్ని రకాలుగానో భక్తులయందు వాత్సల్యం చూపిస్తాడు. చాలా రకాలుగా, చాలా వాత్సల్యం చూపిస్తాడు. ఆయన వాత్సల్యం వర్ణించడానికి అలవి కాదు. అది మనకెలా, ఎక్కడ్నుంచి కురుస్తుందో తెలియదు. మనం ఎదురు చూసిన చోటు నుండి మాత్రం కురియదు. అనూహ్యమైన రీతిలో ఆయన వాత్సల్యం మన మీద కురుస్తూంటుంది. కానీ ఆయన వత్సలుడు! మన తప్పులెన్ని మనకి శిక్ష నిచ్చేవాడు కాదు. మన తప్పుల్ని మన్నించి, మనల్ని ఆదుకునేవాడు. అదీ వాత్సల్యం! వాత్సల్యం వున్నచోట తప్పులు చూడరు. నువ్విలా చేశావు కదా, అప్పుడిలా అన్నావు కదా! అలా ఉండదు. అదంతా తర్క సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం. వీడేం చేయలేకా, వాడెందుకలా వున్నాడో చెప్తూంటాడు. వాడెందుకలా వున్నాడో వాడికి చెప్తే ఏమిటి ఉపయోగం. వాడి కేమన్నా చేస్తే వుంటుంది కానీ! వాత్సల్యం వున్నచోట తప్పులు గుర్తించం కదా! మన అమ్మాయి, మన అబ్బాయి అనుకుంటే, వాడెంత పిచ్చిపని చేసి వచ్చినా తప్పులు గుర్తించం కదా! ఏదో తెలియక చేశాడండీ, అంటారు. అవతలవాడి గొంతు పిసికివచ్చినా సరే! ఎందుకిలా అనిపిస్తుందీ, మనవాడని. అదే మనకి జరిగితే, అవతల వాడలా చెప్తే మనకెలా వుంటుంది? అలా భగవంతుడికి చాలా మంది మనవాళ్ళున్నారు. భక్తులయందు అలాంటి వాత్సల్యం చూపిస్తాడు. పొరపాటు చేస్తే, పొరపాటు వలన ఓ జగత్కళ్యాణమైన కార్యం చేసేటట్టు చేస్తాడండీ, అదీ ఆయన వాత్సల్యం! వీడేమో అప్పుతచ్చయిపోయింది మహానుభావా, అని ఏడుస్తుంటాడు. అయితే అయ్యిందిలే అని, ఆ పొరపాటులోంచి ఆయనొక జగత్కళ్యాణ కార్యం చేసేస్తాడు. ఎన్నో ఉదాహరణలున్నాయి. వశిష్ఠుడ్ని రామ పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టమన్నారు. ఆయనకన్నా అంత తెలిసినవాడు లేడుకదా! ముహూర్తం పెడితే ఏమయ్యింది? అవ్వలేదుగా! ఆయనేం అనుకోవాలి. ఆయనకెంత తెలిసినా తర్వాత ఏమయిందీ అదే correct, ఆయన అడవులకి వెళ్ళడమే correct అనీ, ధర్మ రక్షణ చేయాలి, దుష్టశిక్షణ చేయాలని తర్వాత తెలుస్తుంది. కైకేయికి రాముని మీద ఎంత వాత్సల్యమో! కౌసల్య కన్నా ఎక్కువ. అట్లాంటి కైకేయి ద్వారా అలా జరిగిందే! అది జగత్కళ్యాణానికి దారి తీసింది. అందుకని భక్తుల వల్ల పొరపాటు ఏమన్నా జరిగితే, అందులోంచీ దాన్ని సరిదిద్దీ, అలా చేయడం వల్ల ఇంత మంచిగా జరిగింది కదా అనిపిస్తాడు. అదీ వాత్సల్యమంటే! ఒకదానికొకటి చేస్తే ఏదో అయిపోకుండా, correct గా వస్తుంది. విశ్వామిత్రుడి నుండి, దూర్వాసుడి నుండి, నారదుడి నుండీ అలా బోలెడు జరిగినాయి. అమ్మవారంతటి ఆవిడకి బంగారు లేడి మీద మోజు ఏమిటి? అంత మాత్రం చేత మనతో సమానంగా ఆమెని మనం లెక్క

వేసుకొనవచ్చా? ఎందుకంటే మిగతావిచూస్తే మనం లెక్క వేసుకోలేం. అంత తెలిసినవారికీ ఎలా జరిగిందీ? జరగవచ్చు. కానీ జరిగితే, దానివల్ల చాలా శ్రేయోదాయకమైన ఒక కార్యానికి ఒక పునాదిగా తయారవుతుంది. అమ్మవారి చేత, (పార్వతీ దేవిచేత) నారదుడు విష్ణువుకు ఒక శాపం ఇప్పిస్తాడు. ఆవిడ శాపం ఇచ్చి వెళ్ళాక, రాముడి అవతారానికి పునాది పడి పోయిందని బ్రహ్మాండంగా ఆనందించేస్తాడు. రావణాసురుడి తల్లి, శివజ్యోతినిక్కడ తెచ్చి ఇక్కడ పాతేద్దాం అనీ, ఈ లంకలో దాన్ని పాతేస్తే శివుడెప్పుడూ ఇక్కడే వుంటాడనీ చెప్తుంది రాజసగుణంతో. రావణాసురుడు అద్భుతం గా పూజ చేస్తాడు. చివరకు తలకాయ కూడా నరుక్కుంటాడు. సరే పరమ శివుడు వస్తాడు సతీ సమేతంగా వస్తాడు. కొంపలంటుకు పోతాయని, విష్ణువు ఆవిడలోంచి బాగా తొంగి చూస్తాడు రావణుడ్ని. ఇంత రావణుడూ శివజ్యోతి సంగతి మర్చిపోయి, ఆవిడ్ని నాకు ఇచ్చివేయమని అడుగుతాడు. వెంటనే 'పట్టుకుపో' అంటాడు శివుడు. ఆయనకన్నీ ఒకటే. మన పరిస్థితి ఇలా అయిపోయిందేమిటాని ఈవిడకర్థం కాలేదు. దారిలో నారదుడు కనిపించి రావణుడ్ని, ఏంట్రా నువ్వసలు ఎందుకు వెళ్ళావ్ ? ఏం తెస్తున్నావ్? అంటాడు. అప్పుడు రావణుడికి గుర్తుకు వస్తుంది. అంత మాయ చేస్తాడు. అసలు నేను ఎవర్ని కోరాను? ఆవిడ సాక్షాత్తు మాతృ స్వరూపిణి. శక్తి స్వరూపిణి. ఆవిడ్ని తనతో వచ్చేయమని తనతో వుండమని కోరాడు, శివుడ్ని మరచిపోయాడు. కించపడి బాధపడుతూంటాడు. ఆమె ఇదసలు ఎలా జరిగిందని నారదుడిని అడుగుతుంది. అప్పుడు నారదుడు 'ఇదంతా విష్ణుమాయ, జగన్మోహనుడు కదమ్మా! ఈ రావణుడ్ని చూసేసరికే వాడి అంతరార్థం గ్రహించి మోహినీ అవతారంగా నీలోంచి చూశాడు. లేకపోతే వాడింత పని చేశాడు, వాడు జ్యోతిర్లింగం అడిగితే మనకంతా తంటా. ఈయనేమో ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చొనే రకం. దానివల్ల చాలా ఇబ్బందులు వస్తాయని సృష్టి సంక్షేమం కోరి విష్ణువు ఈవిధంగా చేశాడు' అని చెప్తాడు. అది విని ఆమెకు చాలా కోపం వస్తుంది. దుర్గ కదా! ఇలాగే చేయాలా, ఇంకోలా చేయవచ్చు కదా! నాకు ఇంత తంటాలు పెట్టి, ఇంత వియోగం తెచ్చి పెడ్తాడా? ఈయనక్కూడా ఇలాగే జరగాలి అని శాపమిస్తే, నారదుడు చంకలు గుద్దుకుని, గంతులేస్తాడు. ఏంట్రా గంతులూ అంటే, నువ్విల అనాలనే నేనింతా చేశాను. ఆయన పుట్టాలి. ఇటువంటి వెధవకి, ఏ తేడా తెలియని వాడికి పాఠం చెప్పాలంటే ఆయన రావాలి కదా అని, ఆనందం పొందుతాడట. పురాణాల్లో వున్నదిది. అలా సత్త్వగుణం, దైవీగుణం వున్నవారి నుండి పొరపాట్లు జరిగినా, దాన్నుండి జరిగేది జగత్కళ్యాణమే! అలా కథంతా మార్చేస్తాడు. అదీ భగవద్భక్తుల విషయంలో ఆయనకున్న వాత్సల్యం. ఆ వాత్సల్యం గురించి ఇంతా, అంతా అని చెప్పకోలేం. దాని గురించి తెలుసుకోవాలంటే

‘భక్తవిజయం’ చదువుకోవాలి. భగవద్భక్తులకు జరిగిన అన్ని విషయాలూ చూడండి, వారి నుండి జరిగిన ఒక పొరపాటు వల్ల ఎన్ని జగత్కళ్యాణ కార్యాలు జరిగాయో మనకే తెలుస్తుంది. అదీ భక్తవత్సలత. ఆయన భక్తవత్సలుడు.

# 765 సువర్ణవర్ణః

అనగా బంగారు రంగు. భగవంతుని యొక్క రంగు బంగారం అనే నామం ఇది. వర్ణము అంటే రంగు అని, అక్షరము అని, శబ్దము అని అర్థములున్నవి. సువర్ణ వర్ణములు అంటే మంచి అక్షరములతో స్తుతింపబడేవాడు అని వస్తుంది. మంచి నామములుగా స్తుతింపబడేవాడు. ఇక్కడ వెలుగు భావనగా మనం తీసుకున్నట్లయితే, బంగారు రంగులో భగవంతుని యొక్క దర్శనమొకటి అనుభూతి చేసుకోవచ్చు అని మనకి గోచరిస్తుంది. భగవంతుడు కనపడితే మొట్టమొదట, అంటే అటునుండి ఇటు, నాద స్వరూపుడిగా గోచరించడం, ఆ పైన కోటి సూర్యుల కాంతితో వెలుగుతున్న కాంతి రూపంగా కనిపించడం, నీలివర్ణంగా కనిపించడం, నలుపు నీలంగా కనిపించడం, బంగారు వర్ణంగా కనిపించడం, బంగారు వర్ణంలో ఎరుపు మెరుగు, పచ్చ మెరుగుగా కనిపించడం ఇన్ని రకాలుగా ఇన్ని రంగులలో కనిపిస్తాడు. మనలో ఉండే స్థితిని బట్టి, ఈ వర్ణముల యొక్క, అనుభూతి, దర్శనము మనకు జరుగుతూ ఉంటాయి. సువర్ణము అంటే, బంగారము అనే అర్థం ఒకటి ఉండగా, మంచి వర్ణము, మంచి రంగు. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క రంగు చాలా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. కొంతమందికి కాషాయం చూస్తే చాలా ఆనందం కలుగుతుంది. తెల్లవారుఝామున సూర్యుడు ఉదయిస్తూ ఉంటే సింధూర వర్ణం ఆకాశంలో కొంతమందికి నచ్చితే, బంగారు వర్ణం కొంతమందికి నచ్చితే, నీలివర్ణం కొంతమందికి నచ్చితే, తెలుపు వర్ణం కొంతమందికి నచ్చితే, కొంతమందికి ఆకుపచ్చరంగు, కొంతమందికి సూర్యుని వెలుగు, మరి కొంతమందికి చంద్రుని వెలుగు నచ్చుతుంది. ఇలా రకరకాలుగా రకరకాలుగా ఒకే ఒక వెలుగు, రకరకములైన వర్ణములుగా, రంగులుగా గోచరిస్తూ ఉంటుంది. సువర్ణము అంటే మంచి రంగు, ఎవరికి ? అంటే చూసేవాడికి! ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క రంగు ఎక్కువ ప్రీతికరంగా ఉంటుంది. అమ్మవారు అన్ని రంగులూ ప్రీతి ఉన్నట్లుగా మనకి లలితాసహస్రనామంలో గోచరిస్తూ ఉంటుంది. ఎరుపు రంగుతో సహా. కాబట్టి ఈ వర్ణములన్నీ కూడా, అవ్యక్తమైన తత్త్వానికి, తొడుగులుగా భావన చేసుకోవాలి. అంటే చక్కటి వెలుగు దర్శనం ఏదో ఒక రంగులో జరిగితే, అది భగవంతుని యొక్క సాన్నిధ్యానికి మనం కొంత చేరువైనట్లుగా భావనచేయాలి. దీపానికో రంగు ఉంటుంది, బంగారానికి ఓ రంగు ఉంటుంది, వెండికో రంగు ఉంటుంది, మెరుగు పెట్టుకున్న వస్తువులలోనుంచి కూడా మనకి, కళ్ళు మూసుకుంటే ఆ మెరుగు లోపల, కాంతిగా దర్శనం ఇస్తూ ఉంటుంది. ఈ విధంగా భగవంతుని సప్త వర్ణములుగా

ఆరాధన చేస్తూ ఉంటే, ఈ స్థూలమైన సృష్టిలో సూక్ష్మమైన, అతి వైభవముతో కూడిన సృష్టి మనకి, గోచరిస్తూ ఉంటుంది. అది ఆనందాన్ని కలిగిస్తూ ఉంటుంది. ఇక్కడే వైకుంఠం ఉందని చెప్తారు. వైకుంఠము అంటే వికుంఠము లేనిది. అంటే, అవస్థితి చెందని, పూర్ణ చైతన్య స్థితిలో, వైకుంఠం ఉంటుంది. వైకుంఠ వర్ణనం మనకి భాగవతంలో చక్కగా ఇచ్చారు. అంతా పాల వెన్నెల రంగులో భవనాలు, అక్కడే మళ్ళీ బంగారు వర్ణంతో కూడిన సౌధాలు, వాటి గోపురాలు, వీధుల్లో మణిమయ కాంతులతో పచ్చ, నీలము, ఇటువంటి కాంతులతో కూడిన మొక్కలు కనిపించినట్లు, బాటలన్నీ కూడా చక్కని, వెన్నెల బాటలుగా కనిపించడం, జీవులందరూ కూడా నడచి వెళ్తూ ఉంటే, వారందరూ కూడా చాలా, transparentగా/ పారదర్శకంగా, ఉండి చుట్టూ ఆకారం కనిపిస్తుంది. అలా నడిచి వెళ్తూ ఉంటే ఆ వెనకాల కిటికీ కూడా కనిపిస్తుంది మధ్య దేహం లోంచి. మన దేహం దేనికైనా అడ్డంగా వెళ్తే, దాన్ని కప్పేస్తుంది. ఆ దేహాలు, అట్లా తిరుగుతూంటాయి. ఇటువంటి వర్ణన ఒకటి ఉంటుంది వైకుంఠం గురించి, భాగవతంలో. తప్పక చదువుకోవాలి. ఎందుకంటే ఇటువంటివి చదువుకుంటూ ఉంటే మన లోపల నిద్రాణమై ఉన్న ఆ స్థితులన్నీ కూడా మేల్కొంచడానికి అవకాశం ఏర్పడుతుంది. పవిత్ర గ్రంథములన్నీ కూడా, మన గురించే చెప్తూ ఉంటాయి, అవి మేల్కొంచడానికి అవకాశముంటుంది. అందుకని వివిధ వర్ణములు కలిగిన సృష్టిలో ఈ స్థూలముగా కనిపిస్తున్నది, దానికి పై తొడుగు. అంతకన్నా ఒక తొడుగు తీసేస్తే, ఇంకా పలుచని సృష్టి, ఆ పలుచని సృష్టిలో పలుచనైన రంగులు. కాంతివంతమైన రంగులు. పదార్థం పలుచన అయిన కొద్దీ, రంగుల యొక్క కాంతి ఎక్కువవుతూ ఉంటుంది. మనలో కూడా శరీరము లోని అణువుల యొక్క సాంద్రత తగ్గుతూ వస్తున్న కొద్దీ వర్ణం పెరుగుతూంటుంది. కాంతి పెరుగుతూ ఉంటుంది, కళ పెరుగుతూ ఉంటుంది. లేకపోతే కళాయి ముఖాలు వేసుకుని తిరుగుతూ ఉంటాం. అందుకని, కాంతి ఆరాధన మనకి చాలా ఎక్కువగా ఇచ్చారు. భగవంతుని బాగా వెలుగుగా, అమరిక చేసుకుని, ఆరాధన చేయడం, అమ్మవారిని ఆ విధంగా ఆరాధన చేయడం, మనలో కాంతులు నింపేట్లుగా చేయడం. మొత్తం శ్రీసూక్తం అంతా కూడా మనలో వుండే జడ్డి వ్యవహారమంతా తీసేసి, మలినం అంతా తీసేసి, చక్కగా స్ఫటికంలాగా మనని తయారు చేయడానికి కావలసిన సమస్తమైన నామములూ ఇమిడి వున్నాయి. అందుకని, దురదృష్టం వెన్నాడుతుండే వాళ్ళకి, రోజూ శ్రీసూక్తం చదువుకుంటే, అదృష్టం కలసి రావడానికి అవకాశం ఏర్పడుతుంది. కారణం ఏమిటంటే, మనలో కాంతి పెరుగుతూ ఉంటే మన చుట్టూ వుండే సృష్టిలో నుండి దివ్య సంపద

మన వద్దకు ఆకర్షింపబడుతూ ఉంటుంది. మనలో కాంతి లేకపోతే, ఈ సృష్టి లో ఎంత సంపద వున్నా కూడా అది ఆకర్షింపబడదు. అందుకని, శ్రీసూక్తం చదువుకోవడం వలన, ఎన్నో కష్టాలు పడుతున్న ఒక సోదరుడు, మన బృందంలో వాడే, ఒకరోజు వచ్చి ఇక్కడ, వెక్కి వెక్కి ఏడ్చాడు. '12 సంవత్సరాలు అయ్యింది, దారిద్ర్య బాధ ఇంతా అంతా కాదు. ఎంత బాధపడుతున్నానో నీకొక్కడికే తెలుసు, నాకింకేం గతి లేదా, ఇలాగే ఉంటే నేనింక ఆత్మహత్య చేసుకుంటాను' అని చెప్తే, నేనన్నానూ 'మనలో lucky vibrations/అదృష్టరేఖ, ఉద్భవించాలంటే, 40 రోజులపాటు నీవు శ్రీసూక్తం చెయ్. కొంత మలినం తగ్గుతుంది. అట్లా 9 సార్లు, 40 రోజుల పాటు చెయ్. అంటే ఒక సంవత్సరం చెయ్, ఇది చివరి ప్రయత్నం. ఈ ప్రయత్నం ద్వారా నీలో వుండే మలినాలు పోవాలి. ఎందుకంటే, మనలో మలినాలు ఎంత ఉంటే అంత మనకి లక్ష్మీ ప్రసన్నత కలగదు, వైభవము కలుగదు. వైభవము పెరగాలంటే, శుచి, శుభ్రత అన్ని కోశములయందు ఉండాలి' అని. వెలుగు పెంచుకున్న కొద్దీ, శుచి, శుభ్రతగా ఉండాలనే భావం పెరుగుతూ ఉంటుంది. లేకపోతే బద్ధకంగాను, మలినంగాను, తలపులూ, శరీరం, అన్నీ వాసన కొట్టేట్టుగాను జీవించడం వుంటుంది. అందుకనే 'క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామలక్ష్మీ-ర్నాశయామ్యహమ్' నాయందున్న ఆకలి, మాటి మాటికీ వేసే ఆకలి, ఏం కనపడితే అది తిందామనిపిస్తూ ఉంటుంది. దప్పిక, దాహం, ప్రతీదీ కావాలనే దాహం. రకరకాల మలినాలు, భావాలలో గాని, ఒంట్లో గాని ఇవన్నీ పోవాలంటే, ఆ జ్యేష్ఠ, అంటే పెద్దమ్మవారు, నాశనం అయిపోవాలంటే, అమ్మవారిని ఆవాహన చేసుకోవాలి. ఆ అమ్మవారిని, నువ్వే నాయందు ప్రతిష్ఠితం చెయ్ అని అడుగుతున్నాము, ఎవరినీ ? పరతత్త్వాన్ని. జాతవేదుడ్ని! ఈవిడ మామూలుగా వుండదు, చైతన్యము, స్థితి తో compare/పోల్చి చూస్తే, చాలా చంచలమైనది. అట్లా గలగలగలగలా వెలుగు, చాలా ఎక్కువ వేగంతో ప్రవహిస్తుంటుంది. Velocity of light అంటారు. చాలా ఎక్కువగా ఉంటుంది. మనం ఊహించలేం. సూర్యుడి దగ్గర నుండి కిరణం ఎంత వేగంగా వస్తోంది? కొన్ని కోట్ల మైళ్ళ వేగంలో వస్తుంది. అటువంటి ఆవిడ నాలో స్థిరపడేటట్లు చూడవయ్యా అని జాతవేదుడ్ని కోరడమే శ్రీసూక్తము. ఈ విధంగా ఆ సోదరునికి చెబితే అతడు తు.చ. తప్పకుండా చేశాడు. ఎందుకంటే ఇంక గతి లేదు. చేస్తే, వెంటనే అద్భుతమైన అవకాశాలు వచ్చినాయి. పెరిగాడు. విదేశాలకు వెళ్ళాడు. కుటుంబములో ఉండే అవకరాలు అన్నీ సరిదిద్దబడ్డాయి. సంపద చేరింది. అప్పులు తీరిపోయాయి. ఇల్లు కట్టుకునే ప్రయత్నంలో ఉన్నాడు. సుఖంగా తనకుగా తను ఇక భగవత్సాధన చేసుకోవడానికి కావలసిన

సమస్త సౌకర్యములూ మూడు సంవత్సరములలో ఏర్పడిపోయినాయి. ఎందుకిది చెప్తున్నానంటే, సువర్ణ వర్ణము అనే భగవంతుని నామము మనం చెప్పకునేప్పడు, మనలో కాంతులు నిండాలి. మనలో కాంతులు నిండాలంటే, మూడు లోకాలకి సంబంధించిన కార్యక్రమము ఒకటి చేసుకుంటూ ఉండాలి. మనోమయము, కామమయము, భౌతికము అయిన లోకాల్లో; అంటే మన తలపులు, మన కోరికలు, మన యొక్క భౌతిక స్థితి యందుండే పరిశుభ్రత. ఈ మూడు మనకి బాగా ఏర్పడడానికి స్ఫూర్తి మనకి శ్రీసూక్తంలో ఉన్నది, అన్ని నామాలూ అవే. హిరణ్యవర్ణాం, హరిణీం, సువర్ణం, రజతస్రజాం, హిరణ్మయీాం, లక్ష్మీం; జాతవేదుడు అంటే వేదంలోంచి పుట్టిన అగ్ని. అగ్నిలో నుండి పుట్టినది ఆవిడ, అగ్నిస్వరూపిణి, ఈ విధంగా మనకి ఇచ్చారు. అందుకని చక్కగా భగవంతుని లోపల కాంతులతో నిండినట్లుగా భావన చేసుకుని, దానిని బాగా ధ్యానం చేయడం అనేది, చాలా అవసరం. ఇలా చేస్తే, మనకి లోపల ముందు బంగారు కాంతి కనిపిస్తుంది. అందుకనే బంగారానికి ఇంత ప్రాముఖ్యత. శ్రావణ మాసంలో మనకి బంగారు కాంతి అంతర్ముఖంగా అనుభూతి చెందడానికి ఎక్కువ అవకాశం ఉన్నది. అదే బంగారం కొనుక్కోవడంగా ఒక సంప్రదాయం వచ్చింది. శ్రావణమాసంలో, ఏదో ఒక నవర్సు బంగారం అన్నా కొనుక్కోవాలి. అంతర్ముఖంగా కొనుక్కోవాలి. బహిర్ముఖంగా దాన్ని దర్శనం చేస్తున్నా కూడా, దాని కాంతులు కన్నులు మూసుకున్నపుడు కాసేపు లోపల నిలబడతాయి. బాగా కాంతివంతంగా మీరు ప్రార్థన చేస్తున్న భగవన్మూర్తి ఏదైతే ఉంటుందో, దాన్ని తయారు చేసికుని, ఆ కన్నులు మూసుకున్నపుడు ఆ కాంతిని దర్శనం చేస్తూ ఉంటే, మనకి దురదృష్టమైన తరంగములు అన్నీ పారద్రోలబడతాయి.

## 766 హేమాంగః

బంగారు వర్ణముతో కూడిన అంగములు కలిగినవాడుగా మనకి గోచరిస్తాడు. మహాత్ముల యొక్క కాంతి కూడా ఆ విధంగా వుంటుంది. మాస్టరు CVV అనే గ్రంథంలో మాస్టరు CVV గారి మేనిఛాయ గురించి, మాస్టరుగారు అలా వ్రాశారు. బంగారు వర్ణం, ఆయన శరీరఛాయగా వుండేదట. మాస్టరుగారు దర్శించింది అది. భౌతికమైన శరీరం కన్నా, దివ్యమైన శరీరం యొక్క దర్శనము, స్పర్శనము, సంభాషణము కలిగినవారు కాబట్టి, మాస్టారుగారు, మాస్టరు CVV అనే పుస్తకంలో, మాస్టరు CVV గారి గురించి వ్రాస్తూ, 'బంగారు మేనిఛాయ' అన్నారు. అలాగే మాస్టరు EK గారి శరీరమును మనం దర్శనం చేసినప్పుడు, చాలా అద్భుతమైన కాంతి. ఆయన చొక్కా విప్పుకు కూర్చున్న సన్నివేశాలు చాలా తక్కువ. ఆయన, స్నానం చేసి, చొక్కాయో బనీనో వేసుకునే లోపల, ఆయన శరీరాన్ని కనక చూసినట్లయితే, ఆయనది ఎంత కాంతివంతమైన శరీరమో! అంటే ఆ కాంతి ఊరికే చర్మం కాంతి కాదు. అందులో నుండి ఆ విధంగా వెదజల్లబడుతూ ఉంటుంది. అలాగే ఆయన చక్కగా తలంటి పోసుకుని కూర్చుంటే చాలా జగన్మోహనంగా ఉండేవారు. అంటే కాంతి బయటకి వెదజల్లుతూ ఉండేది. ఈ లోపల ఉండే ఈ కాంతి, మనలో కూడా పెరగాలి అంటే తలపులలోను, కోరికలలోను; తలపులు అంటే కోరికలతో సంబంధం లేని తలపులు కూడా ఉంటాయి. అవి, వాటి మీదా, వీటిమీదా, వారిమీదా, వీరిమీదా, సన్నివేశాల మీదా మనకుండే అభిప్రాయాలుగా ఉంటాయి. అందులో మలినం. కోరికలలో మలినం, కారణంగా శరీరంలో మలినం. ఈ మలినాలన్నీ పోవాలంటే, హేమాంగుడయిన భగవంతుని ధ్యానం చేయాలి.ఈ కాంతులన్ని కూడా శ్రీకృష్ణునిలో భీష్ముడు దర్శనం చేసి స్తోత్రం చేస్తున్నాడు. ఇవన్నీ భగవత్తత్త్వంలో ఉండే విభూతులు, వైభవములు.

## 767 వరాంగః

ప్రతి అంగంకూడా, విపరీతమైన ఆకర్షణ శక్తి కలిగి, సమ్మోహనం చేస్తుందిట మనుష్యులని. అది కదా శ్రీకృష్ణుడు! జగన్మోహినీ అవతారం ఒకటి ఉండగా, శ్రీకృష్ణుని యొక్క మూర్తి, శ్రీరాముని యొక్క మూర్తి కూడా, ఎంత సౌందర్యవంతమైన మూర్తి అంటే, ఋషులకు, మునులకు, తపస్సు చేసుకునే జనులకు, అందరికీ కూడా వారిని చూడగానే చాలా వ్యామోహం పుట్టేది. అంత ఆకర్షణ! ఎందుకంటే, అంగములన్నీ కూడా అంత అందంగా వుంటాయి. మనం ఈ రోజుల్లో ముఖం ఒక్కటీ అందంగా ఉంటే చాలు అనుకుంటాం. వాళ్ళకి నఖశిఖపర్యంతమూ అందమే! చెవి, ముక్కు, కన్నులు, చుబుకములు ఎలా ఉండాలో అలా ఉంటాయి. నుదురు ఎలా ఉండాలో అలా ఉంటుంది. దానికొక శాస్త్రం ఉన్నది. సాముద్రికము! చెయ్యి చూసి చెప్పడమే కాదు మొత్తం శరీరం అంతా కూడా Phrenology అంటారు. మొత్తం అవయవములన్నీ చూసి, వాటి యొక్క పొందికను బట్టి, మనిషి యొక్క తత్త్వం తెలుస్తుంది. అందుకని ఆ విధమైన ఆరాధన ఉన్నది. భగవంతుని వరాంగుడిగా ఆరాధన చేసుకుంటే మనలో కూడా కాస్తో కూస్తో ఆ తత్త్వం వ్యక్తం అవడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకని, అత్యంత సుందరమైన ఆకారుడిగా భగవంతుని ధ్యానం చేసుకోవడంటి ఇందులో వున్నది. అంటే ఇవన్నీ కూడా సాధనలో శుక్రవిద్యగా చెప్తారు. శుక్రవిద్యకు సంబంధించిన సాధన, వర్ణములూ, తద్వారా భౌతికమైన సృష్టి నుండి, సూక్ష్మమైన సృష్టిలోనికి ప్రవేశం చేసి, అనుభూతి చెందడం. Madam Blavatsky కి ఈ కనపడే స్థూల సృష్టిలోనే దివ్యమైన సూక్ష్మ జీవుల యొక్క సంచారం బాగా కనిపిస్తుండేది. ఇట్లా కూర్చుంటే, మన మధ్యే ఎవరో అద్భుతమైన వ్యక్తులు, అత్యంత కాంతివంతమైనవారు, అందమైన వారు నడిచి వెళ్తూంటే ఆమె చూసి ఆనందించి, ఆశ్చర్యపోతుండేది. అట్లా ఏ సముద్ర తీరానికో వెళ్ళి కూర్చుంటే, అక్కడ కూడా అట్లా సముద్రం మీద ఎంతోమంది ఇటు నుండి అటు, అటు నుండి ఇటు, ఏదో పెళ్ళి సందడిగా నడచి వెళ్తున్నట్లుగా కనబడుతుంటే చెల్లెలికి చెప్తుంది. 'చూడు ఎంతమంది అద్భుతంగా వెళ్తున్నారో' అంటే చెల్లెలు 'నాకేమీ కనపడదు. నువ్విట్లా చాలా సార్లు చెప్తూ ఉంటావు, మరి అది నీవు చేసుకున్న అదృష్టం అయి ఉండాలి, మరి నీకది ఎంతో అనుభూతినిస్తోంది, నాకది కనబడనే కనపడట్లేదు' అంటుంది. అట్లాగే మనకి భాగవతుల కథలలో కూడా దివ్యమైన మూర్తులు కనబడడం, మాట్లాడడం ఇటువంటివి అన్నీ జరుగుతూంటాయి. అవన్నీ కూడా, ఈ స్థూలమైన సృష్టిలో సూక్ష్మమైన సృష్టి ఇమిడి ఉన్నది అని తెలిసినవాళ్ళకి, దాని అనుభూతి

పొందిన వాళ్ళకి సత్యం. మనం ఇందులో నుండి అందులోకి గనక మేలుకున్నట్లయితే, ఈ భౌతికమైన  జీవితం చాలా చిన్నదని తెలుస్తుంది, చాలా అల్పమైనదని తెలుస్తుంది, ఇది ఎలా ఉన్నా పర్వాలేదని తెలుస్తుంది. అందులో జీవించడం ఎక్కువగా ఉండి, ఇందులో జీవనానికి అంత ప్రాధాన్యత ఇవ్వని స్థితి కూడా కలుగుతుంది. కాని యోగి అన్ని లోకముల యందు ఒకే విధమైన పరిపూర్ణత కలిగి ఉంటాడు. ఒక లోకం కోసం ఇంకో లోకాన్ని నిర్లక్ష్యం చేయక ఉంటాడు. కృష్ణుని మూర్తి దర్శనం మనకి తెలుసు, దశమ స్కంధం చదువుకుంటే, ఏ విధంగా జనులు పిచ్చెక్కిపోయారో; మిత్రులు, భక్తులు, ఆరాధకులే గాక, శత్రువులు కూడా ఆ విధంగా మోహం పొందిన సన్నివేశాలు మనకి బోలెడు కనిపిస్తాయి. ఎందుకయ్యా అంటే ఆయన శరీరమే అటువంటిది! అంత అద్భుతమైన సుందరమైన, ఆకర్షణీయమైన, అంగములతో కూడిన శరీరము కలవాడు కాబట్టి, 'వరాంగః' అన్నారు.

## 768 చందనాంగదీ

చందనం పూసుకుని ఉంటాడుట. చందనం పూసుకోవడం అంటే? భూమి యొక్క గుణం వాసన. భూమి నుండి ఉద్భవించే వాటన్నిట్లోకల్లా చందనానికి ఉన్న సువాసన మిగతా వాటికి లేదు. భూమి గుణము వాసన, నీటి గుణము రుచి. అగ్ని గుణము వెలుగు, వాయువు గుణము స్పర్శ, ఆకాశం యొక్క గుణము శబ్దము, వినికిడి. ఇలా వున్నాయి. భూమి యొక్క దివ్యగుణం ఏమిటంటే, సుగంధం. సుగంధం ఎక్కడ అయితే ఉన్నదో, అక్కడ భూలోక స్థితి, దివ్యత్వం యొక్క సాన్నిధ్యాన్ని ఎక్కువ కలిగి ఉన్నది అని అర్థం. అందుకనే ఈ అగరువత్తులు, ఈ కర్పూరములు, సువాసన కలిగిన వస్తువులు, పువ్వులు. ఇవన్నీ మనం ఏర్పరుచుకుంటూ ఉంటాం. కారణం ఏమిటంటే, పరిసరాలని అది ప్రభావితం చేస్తుంది. దివ్యత్వాన్ని బాగా ఆకర్షిస్తుంది. అసురత్వాన్ని పారద్రోలుతుంది. అందుకని, ఇల్లూ, ఒళ్ళూ సమస్తమూ, వీలున్నంత సువాసన ఉండేటట్లుగా చూసుకోవడం సాధనలో భాగం. మలినాలు లేని శరీరానికి సువాసనే ఉంటుంది. మలినాలతో కూడిన శరీరానికి ఇవన్నీ చుట్టూ పెట్టుకుని చేసుకుంటూ ఉండాలి. వాటి యందు ఆసక్తి ఉండాలి. ఆ- అగరువత్తి వెలిగించుకుంటే ఏం? వెలిగించుకోకపోతే ఏం? అన్నట్లుగా ఉండకూడదు. అగరువత్తి ఉండాలి, ఎంతవరకు అయ్యా అంటే, అంత శుభ్రత నీ శరీరానికి ఏర్పడినప్పుడు. కొంతమంది మహాత్ములు, శరీరం వదిలితే, శరీరం నుండి చాలా చక్కని గంధపు వాసన వస్తుంది. మరి కొంతమంది శరీరం వదిలితే మూడు గంటల నుండి కంపు కొడుతూ ఉంటుంది. ఏమిటి తేడా? ఆ శరీరమునందు దివ్యత్వము ఎంత ఎక్కువగా వసించిందో దాన్ని బట్టి వివిధమైన వాసనలు. కొన్ని శరీరాలకి వాసన ఉండదు. కొన్ని కొన్ని శరీరాలు చాలా వాసనగా ఉంటాయి. వాసనగా ఉన్నాయి కాబట్టి సెంట్లు కొట్టుకోవడం ఒక పద్ధతి. ఎందుకంటే పోదు ప్రస్తుతం వెంటనే. ఇంకో పద్ధతి ఏంటంటే, తలపులయందు, కోరికల యందు వాసన ఉన్నదని గమనించి, అవి నెమ్మదిగా తగ్గించుకుంటూ రావాలి. చందనం పూసుకున్నంత సువాసనగా ఉంటుందిట, మహాత్ముల శరీరం. భగవంతుడు పూర్తిగా చందనంతో అద్దబడి ఉన్నట్టుగా ఉంటాడన్న మాట! 'చందన చర్చిత నీలకళేబర' అని ఉంది కదా! అటువంటి సువాసన. ద్రౌపదీదేవి సువాసన అట్లా ఉండేదిట. ఆవిడ అగ్ని నుండి ఉద్భవించింది. ఆవిడ ఎక్కడ ఉంటే అక్కడ నుండి ఒక రెండు ఆమడల దూరం వరకు సుగంధం వ్యాపించి ఉండేదట. మరి ఇంక కర్పూరం, అగరొత్తులు అక్కరలేదు. అది ఒక దివ్యవిభూతి ఆమెతో. అది అందరికీ ఆశ్చర్యం

కలిగించేది. మరి అటువంటి ఆవిడ కావాలని అందరూ కోరుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఎంత పవిత్రమైన మూర్తి కాకపోతే, అంత సువాసన వెదజల్లుతూ ఉంటుంది? అట్లాగే యోగుల శరీరం కూడా ఆ విధంగా చక్కని సువాసన వెదజల్లుతూ ఉంటుంది. భగవంతుని యొక్క శరీరం ఇంక చెప్పనే అక్కరలేదు. అందుకని భగవంతుని శరీరం నుండి సువాసనలు మనకు అందుతున్నట్లుగా కూడా భావం చేసుకోవచ్చు, ధ్యానం చేసేటప్పుడు, ఆరాధన చేసేటప్పుడు. నిజానికి ఒక్కొక్కసారి మంచి పూజ జరిగిన సందర్భంలో, ఒక్కొక్క సమయంలో మనకి అంతర్ముఖంగా ఒక చక్కటి సువాసన అనుభూతి చెందుతూ ఉంటాం. ఈ బయట మనం చేసిన వాటివల్ల ఏర్పడిన వాసన కాదది. నిష్కారణంగా ఒక సువాసన వస్తూంటుంది. శుక్రవారం పూట అమ్మవారి భక్తులకి ఆ విధంగా మామూలు చోటులో కూర్చుని, అమ్మవారి జడలోని మల్లెపూల వాసన తాము అనుభూతి చెందుతున్నట్లుగా ఎన్నో అనుభూతులుంటాయి. ఇంట్లో మల్లెపూల వాసన వస్తూంటుంది. ఇంట్లో వెతికితే ఎక్కడా మల్లెలుండవు. కానీ మల్లెపూల వాసన వస్తుంది. మల్లెపూల వాసన వచ్చిందిట అంటే అర్థం ఏమంటే దివ్యమైన మూర్తులు, అదృశ్యమైన మూర్తులు అక్కడ సంచారం చేస్తున్నారని అర్థం. అమ్మవారు వచ్చి వెళ్ళింది, అమ్మవారు మనని అనుగ్రహించింది. కనపడకపోయినా ఫర్వాలేదు. మనకి ఇంద్రియ స్పర్శ అన్నమాట వాసన వచ్చింది అంటే. వెలుగు దర్శనం అంటే కూడా ఇంద్రియములకు గోచరమే కదా వెలుగు! అలాగే సుశబ్దములు, సువర్ణములు, సుగంధములు; అందుకనే,

గంధద్వారాం, దురాధర్షాం నిత్యపుష్టాం కరీషిణీమ్,
ఈశ్వరీగ్ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియం

అనే మరో శ్లోకం కూడా శ్రీసూక్తంలో వస్తుంది. ఏమిటి ఈ గంధం యొక్క విశిష్టత అంటే, 'నిత్యపుష్టాం కరీషిణీమ్' ఎప్పుడూ తుష్టి పుష్టి ఇస్తుందిట. అందుకని మన పెద్దలు ఏమి చెప్పారంటే నీవు వాడే వస్తువులతో పాటు ఎప్పుడూ గంధం ఉంచుకో అని. ఓ గంధం చెక్క office పెట్టెలో ఒకటి, ఆడవాళ్ళ handbag లో ఒకటి. బట్టల బీరువాలో ఒకటి, ఎక్కడ పడితే అక్కడ పడేస్తే ఏమవుతుందంటే, తెరవంగానే మనకి గుప్పున ఆ వాసన వస్తుంది. చాలు దాని అనుభూతి చాలా ప్రశాంతతనిస్తుంది. కావాలంటే ప్రయత్నం చేసి చూడవచ్చు. వేంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళినా, సింహాచల దేవస్థానం వెళ్ళినా, వాళ్ళు గంధం ఇస్తారు. ఆ గంధం, అక్కడా ఇక్కడా పారెయ్యకుండా, పెట్టెలో పడేసుకోండి. ఇంత కర్పూరం పెట్టెలో పడేసుకోండి. పెట్టె తెరచినప్పుడల్లా, bag తెరచినప్పుడెల్లా, చక్కని వాసనలు అందులోంచి బయటికి వస్తాయి. దానివల్ల కొంత మనలో అపవిత్రత

నిర్మూలింపబడుతూ ఉంటుంది. ఈ విధంగా ప్రతిలోకంలోనూ, అంటే భూలోకం, భువర్లోకం, సువర్లోకం ఉన్నాయి కదా అన్ని లోకాలలోను భగవంతుని యొక్క విభూతి, కొన్ని కొన్ని వస్తువులయందు ఎక్కువగా ఉన్నది. అదే మనకి విభూతి యోగంలో చెప్తాడు కృష్ణుడు. గుర్రాలలో ఉచ్చైశ్రవమును అంటాడు, ఏనుగుల్లో ఐరావతాన్ని అంటాడు. రుద్రుల్లో శంకరుడిని అంటాడు, పాండవుల్లో అర్జునుడిని అంటాడు. ఇలా రకరకాలుగా తన గురించి చెప్తాడు. అంటే అక్కడ తను ఎక్కువ అస్తిత్వము చెంది ఉన్నాను అని, అంటే ప్రస్ఫుటంగా కనిపిస్తాడు. అంతటా ఉన్నప్పటికీ కొన్ని చోట్ల ఎక్కువగా వ్యక్తమై ఉంటాడు, కొన్ని చోట్ల తక్కువగా వ్యక్తమై ఉంటాడు. కొన్ని గుళ్ళకి ఎక్కువ పోతూ ఉంటాం, కొన్ని గుళ్ళకి తక్కువ పోతూ ఉంటాం. కదా! ఏమిటంటే అక్కడ ఎక్కువ ప్రస్ఫుటంగా మనకి అనుభూతినిస్తున్నాడు. అందుకనే కష్టమైనా, నష్టమైనా అక్కడికే పరిగెడతాం. అలాగే మహాత్ముల దగ్గరకి కూడా పరిగెడుతూ ఉంటాం ! కారణం ఏమిటయ్యా అంటే అక్కడ బాగా అవతరించి ఉన్నాడు. అట్లాగే చందనమునందు విపరీతంగా అవతరించియున్నాడు భగవంతుడు. వస్తువులలో చందనం. అందుకని చందనం మనం ఒంటికి పూసుకోవడం, చందనం పూజలో భాగంగా పెట్టుకోవడం, చందనం యొక్క వాసన చూడడం, చందనం అన్నిట్లోనూ కాస్తో కూస్తో ప్రతి వస్తువులోనూ పడేస్తే ఆ వస్తువులకి కూడా తన పరిమళాన్ని అందిస్తుంది. లేకపోతే బీరువా తెరవగానే కంపుకొడుతూంటుంది. ఏవో చాలా పెట్టేస్తాం వాటి నిండా. ఏమున్నాయో మనకే గుర్తుండనంత పెడతాం వాటిలో. రామలక్ష్మణులని హనుమంతుడు తన భుజాల మీద మోసుకుని సుగ్రీవుని దగ్గరకు తీసుకొచ్చినప్పుడు, హనుమంతుడు ఎంతటివాడో మనందరికీ కాస్తో కూస్తో తెలుసు. సుగ్రీవునికన్నా చాలా తెలిసినవాడు. అందుకని రాగానే రాముడికి, లక్ష్మణుడికి, వారిద్దరిని పరిచయం చేస్తాడు హనుమంతుడు, 'భయమేంలేదు, మనకు పనికి వచ్చే వాళ్ళే' అని. పరిచయం చేయగానే, సుగ్రీవుడు గభాలున వెళ్ళి ఒక సాల వృక్షం ఒకటి కొట్టి, అట్లా వేస్తాడు, రాముడు కూర్చోవడానికి. వెంటనే హనుమంతుడు వెళ్ళి, ఇంకో చందన వృక్షం కొట్టి తీసుకొచ్చి, కొట్టడం అంటే ఏమీ లేదు, ఇట్లా పీక్కు రావటమే. గొడ్డలితో కొట్టేది ఏమీ లేదు. ఇట్లా పట్టుకుని మనం పూచిక పుల్ల తీసేసినట్టు తీసేస్తాడు. తీసి లక్ష్మణుడికి వేస్తాడు. మహాత్ములకి మనం ఉపచారం చేయడం అంటే అట్లా చేయాలి. ఏదో ఒకటి వేయడం కాదు, పూర్తి శ్రద్ధతో చేయాలి. సుగ్రీవుడు రాముడికి ఏమి వేశాడు? లక్ష్మణుడికి హనుమంతుడు ఏమి వేశాడో మనం చుసుకుంటే రామాయణంలో, ఈయన చందనం వృక్షం తెచ్చి అక్కడ వేస్తాడు కూర్చోవడానికి, లక్ష్మణుడు ఆసీనుడు అవడానికి. రాముడికి వేస్తే లక్ష్మణుడు కూర్చోడు. కూర్చోకపోతే అప్పుడు, లక్ష్మణుడికి హనుమంతుడు వేస్తాడు.

ఎందుకంటే హనుమంతుడి యొక్క గొప్పతనం ఏమిటంటే, భగవంతుని యందు భగవంతుడ్ని ఎంత దర్శనం చేస్తాడో, భగవద్భక్తుని యందు కూడా భగవంతుని అంత దర్శనం చేస్తాడు. అది భక్తుని యొక్క, చాలా ఉన్నతమైన, సహజమైన ఒక గుణం. రామాయణంలో శతృఘ్నుడు కూడా చాలా గొప్పవాడు అని చెప్తారు. ఎందుకు గొప్పవాడు శత్రుఘ్నుడు అంటే, లక్ష్మణుడు గొప్పవాడని అందరికీ తెలుసు. రామునితో పాటు ఉన్నాడు కదా, అన్నీ వదులుకుని. రామభక్తునితో పాటు ఉన్నాడు శత్రుఘ్నుడు. రాముడు అరణ్యంలో పద్నాలుగు ఏళ్ళు ఎట్లా ఉన్నాడో, అయోధ్య బయట నందిగ్రామములో భరతుడు కూడా రాముని వలెనే జీవిస్తాడు. నార చీరలు కట్టుకుంటాడు, నేలమీద పడుకుంటాడు, జుట్టు ముడి పైకి వేస్తాడు, రాముడక్కడ అరణ్యంలో ఏవేవి తింటాడో, అవే ఇక్కడ ఆయన తింటాడు. చుట్టూ అన్నీ వుంచుకుని. అక్కడ ఆయన లేక తింటున్నాడు, ఈయన అన్నీ ఉండి ఇవి తింటాడు. రాముడికి సౌకర్యాలు లేక అలా పడుకుంటే ఈయనకి సౌకర్యము ఉండి కూడా అలాగే పడుకుంటాడు. ఈయన ఎట్లా ఉంటాడో శత్రుఘ్నుడు అట్లా ఉంటాడు. ఏమిటయ్యా అంటే, రామభక్తుని యొక్క భక్తుడు అన్నమాట. ఇక్కడే ఉన్నాడు నాకు రాముడు అంటాడు. అంటే శత్రుఘ్నుడుకి రాముడి మీద భక్తి లేదని కాదు. శత్రుఘ్నుడికి రాముడు భరతుడిలో కనిపిస్తూనే ఉంటాడు ఎప్పుడూ. అందుకని ఇంక మరి ప్రత్యేకంగా రాముడి దగ్గరకి వెళ్ళక్కరలేదు. కొంతమంది గురువుల యందు గురి కుదిరినపుడు అన్నీ ఇక్కడే ఉన్నాయి ఇంక మరి ఎక్కడికి వెళ్లాలి అంటూ ఉంటారు కదా కొంతమంది. కాశీ ఇదే, రామేశ్వరం ఇదే అనుకుంటూ గురువుల దగ్గర ఉండిపోరూ? ఇది కాదు అనుకున్నప్పుడు వెళుతూ ఉంటారు.అనుకున్నప్పుడు ఉండిపోతూ ఉంటారు. వీళ్ళకి ఇది సత్యం, వాళ్ళకి అది సత్యం. ఎవరికి ఎక్కువ సత్యం అనేమీ లేదు, ఇద్దరికీ సత్యం అది. వెళ్ళినవాడికి రామేశ్వరం, కాశీ ఉన్నది, వెళ్ళనివాడికి గురుచరణాల్లోనే ఉన్నది. అందుకనే కదా పండరీపురం వెళ్తానంటే పండరీపురం దర్శనం ఇచ్చేశాడు, షిరిడి సాయి. గంగానదికెళ్ళి స్నానం చేస్తానంటే, గంగ కావాలా అన్నాడు, తన పాదాల నుండి పుట్టుకొచ్చింది. విష్ణుపదీ జలమే కదా. ఈ విధంగా, గురుతత్త్వమే సమస్తమూ అనుకున్నవాడికి అట్లా వస్తుంది. కాబట్టి భరతుని యందు భగవంతుని దర్శనం చేయ గలిగిన వాడు శతృఘ్నుడు. ఎందుకు చెప్తున్నాను, భగవంతుడితో అహర్నిశలూ ఉండగలిగిన స్థితిలో ఉన్నవాడంటే లక్ష్మణుడు ఎంతటి వాడై ఉండాలి? కాబట్టి ఆయనకి హనుమంతుడు ఏమి చేశాడు అని చూస్తే, ఏవో బోలెడు చెట్లు ఉన్నాయి. ఇంకో చెట్టు కొట్టి వేయొచ్చు కదా అక్కడ, పెకలించి, చందనం వృక్షం వేస్తాడు. అందుకనే భగవద్భక్తులు ఏమి చేశారనేది చాలా ముఖ్యం. అందులో చాలా రహస్యం ఉంటుంది, వాళ్ళు వివరణలు ఇవ్వరు.

రహస్య ప్రకాశాలు ఏమీ ఉండవు. హనుమంతుడు చందనం చెట్టు వేసి వివరణ ఇవ్వడు. నీకు చందనం చెట్టు ఎందుకు వేశానంటే అంటూ--. ఈయన వేస్తాడు, ఆయన కూర్చుంటాడు, ఆనందం పొందుతాడు అంతే. ఇప్పుడు ఈయనకి చందనం తెగ రాస్తాం కదా మనం. మన ఊళ్ళో సింహాచలం దేవుడికి. 'చందనాంగదీ' అంటే వరాహ లక్ష్మీ నరసింహ స్వామే! ఇంత చందనం మనకి భారత దేశ సాంప్రదాయంలో ఏ భగవత్ మూర్తికీ  కూడా ఎక్కడా వ్రాయబడి ఉండదు. మరి దాని వలన భగవత్ విభూతి అంత ఉంటుంది. మనం కూడా ఆ విధంగా చందనం వాడుకోవడం నేర్చుకోవాలి. నిజంగా చందనం దొరుకుతుంది. ఎన్నో ఖర్చులు, పిచ్చి ఖర్చులు పెడతాం కాబట్టి, నిజమైన ఒక నాలుగు చందనం ముక్కలు కొనుక్కుని, తలోక ముక్క  మనం మామూలుగా ఎక్కువగా వాడే Godrej safe, briefcases, handbags, మన పూజా మందిరాలు, అందులో పడేసి ఉంచండి. చందనంతో తయారు చేసిన మూర్తిని ధ్యానం చేసుకున్నా బాగానే ఉంటుంది. చందనం స్పర్శ కావాలి. చందనం వాసన చూడడం, దాని యొక్క పరిమళం మనకి అంటేటట్లుగా చూసుకోవాలి. అలాంటిదే కర్పూరం కూడా. అలాంటివే సుగంధ ద్రవ్యాలన్నీ కూడా. వాటన్నిటిలోకి చందనం మకుటాయమానమైనది. అందుకని భగవంతుని యొక్క అంగములు చందనం పూసినట్లుగా సువాసనలు వస్తున్నాయి అని చెప్పడానికి 'చందనాంగదీ'. అట్లాగే పూసేవారు కూడా ఆయనకి. ఏముంది భక్తులకి? ఆయన దొరికితే వీడికి కావలసినవి అన్నీ ఆయన మీద చేసేస్తూ ఉంటారు. కాబట్టి సువర్ణ వర్ణము కలిగిన వాడు, హేమాంగుడు, వరాంగుడు, చందనంచే అలంకరింపబడిన అంగములు కలిగినవాడు. భావములో కూడా/ మానసిక పూజ చేసుకున్నప్పుడు చందనం బాగా పూయండి. పూస్తున్నప్పుడు మనకి కూడా దాని వాసన  అంటుతుందేమో చూడండి. అక్కడ ఉండక్కర్లా వస్తువు, భావన చేత కూడా పొందవచ్చు. కాబట్టి ఆ విధంగా, ఈ చందనం యొక్క ఉపయోగాన్ని మన జీవితంలో కొంచెం తెచ్చుకుంటూండాలి. ఇవన్నీ పవిత్రీకరణానికి పనికొచ్చేవి, కర్పూరం, చందనం పసుపు, కుంకుమ. పసుపు ఏదో విధంగా కాస్తో కూస్తో ఆహారంలోకి వెళ్తూ ఉంటే, ఆయుర్దాయం పెరుగుతుంది. లోపలుండే infections తగ్గుతాయి. కాస్త ఒక చిటికెడు పసుపు ఎక్కువ వేసుకుంటే, అబ్బే పచ్చగా ఉంటుంది, బావుండదు అనుకుంటారు కానీ, పులిహోర అదే కదా! అలాగే పాదాలకు పూసుకోవడం. కుంకుమ కూడా అందులోంచి వచ్చింది. దాంట్లో కలిపే కదా, పెట్టుకుంటూంటాం. ఇవన్నీ కూడా పవిత్రమైన వస్తువులు. భగవత్ సంబంధమైనవి. అంటే  భగవంతుని అస్తిత్వము ఎక్కువగా వున్నవి.  పసుపు కొమ్ము ఎందుకు వాడతాం? శొంఠి కొమ్ము వాడచ్చు

కదా! పసుపు కొమ్ములో దానికి సంబంధించిన తరంగములు ఉన్నాయి. గౌరీ ప్రదమైనది పసుపు కొమ్ము. గౌరి అంటే మూడు శక్తుల యొక్క మూలం. కాబట్టి దాని వాసన చూడడం, దాన్ని పూజలో వాడుకోవడం ఒకటి. ఇవన్నీ మనం వేసుకోవచ్చు. Handbag లో చెయ్యి పెడితే చిల్లరతోపాటు ఇవి కూడా వస్తున్నప్పుడు కాస్త కనిపిస్తూ ఉంటాయి. అలాగే తెల్లజిల్లేడు వేరు పడేసుకుంటే గురుసాన్నిధ్యం బావుంటుంది. అలాగే రావివేరు. ఏదో ఒకటి ఉంచుకోవాలి. అంటే వీటిలో వుండే పవిత్రత నిన్ను పవిత్రీకరిస్తూంటుంది.

## 769 వీరహా

వీరుల దర్పాన్ని అణచే వాడు. కృష్ణాష్టోత్తరం చేస్తే మొదట్నుండి చివరివరకూ కనిపించేది అదే! ఎంతమంది వీరుల దర్పాన్ని శ్రీకృష్ణుడు నేలమట్టం చేశాడో! ఏ అవతారాల్లోనూ అంత కనిపించదు. రజోగుణ ప్రవృత్తిని శుభ్రంగా తీసేసే తత్త్వం భగవతత్త్వం. ఎందుకంటే రజోగుణం వున్న వాడొక్కడే బాగా విర్ర వీగుతూంటాడు. విర్రవీగే వాడికి కాలం రూపంలో మొట్టికాయలు పడుతూంటాయి. మళ్ళీ తగ్గుతూంటాడు. పూర్తిగా తగ్గే వరకూ మొట్టికాయలు తప్పవు. సత్త్వగుణంలోకి పూర్ణంగా వచ్చేవరకూ మనిషికి మొట్టికాయలు తప్పవు. ఎందుకంటే పైకి తల లేపినపుడెల్లా పైన మండిగం కొట్టుకుంటూ వుంటుందన్నమాట. అందుకే గుళ్ళోకి వెళ్ళేప్పుడు కొంచెం తలవంచి వెళ్ళేట్లు పెడతారు. వాడి దగ్గరకు వెళ్ళాలంటే నువ్వు కొంచెం తల వంచాలని దాని అర్థం. అందుకే ఎవరైనా కొంచెం గర్విస్తే, చేయవలసింది మౌనంగా చేసేస్తాడు. గురువు కూడా అదే చేస్తాడు. గర్వించే శిష్యునికి మౌనంగానే వాతలు పెట్టేస్తాడు గురువు శ్రద్ధాభక్తులు కలిగిన వాని యందు ఉన్ముఖంగా వుంటాడు. అహంకరించే వానియందు మౌనంగా వుంటాడు, కోప్పడడు. ఎదుటి వ్యక్తిలో అహంకారం ఎక్కువుంటే గురువు మౌనంలోకి వెళ్ళిపోతాడు. ఎందుకంటే వీడూ కాస్త బయట దెబ్బలు తిని వచ్చి నేర్చుకుంటాడులే అని, అలా వుంటాడు. అలాగే ఆశ్రితులలో దర్పం పెరిగినా కృష్ణుడలాగే చేశాడు. అసురులని అంటే (వెలుగును తగ్గించేవారు, వెలుగుకి అడ్డు పడేవారు, వెలుగు పనిని ఆటంక పరచే వారు) ఆ విధంగానే అణిచాడు. మనకి కూడా అహంకారం పెరిగితే అవస్థ తప్పదు. ఏ విషయంలోనైనా సరే 'మాకురు ధన జన యౌవన గర్వం' అంటారు శంకరాచార్యుల వారు. ధనం చేతగాని, పుట్టుక చేతగాని, ఆధ్యాత్మిక సంపద వున్నదనో, విద్య వున్నదనో, అధికారం వున్నదనో అహంకారం రావచ్చు మనకి. వచ్చినపుడెల్లా కాలం రూపంలో కొడతాడు. 'హరతి నిమేషా కాలా సర్వం' అంటారు. అందుకని మదం పెంచకోకూడదు. అది మనకు భగవంతుని దూరం చేస్తుంది. మనం ఇబ్బందుల పాలవుతాం. మళ్ళీ అందులో నేర్చుకుంటూంటాం. అందుకని వీలున్నంత వరకు సత్త్వగుణాన్నే ఆశ్రయించాలి. మిగతా గుణములను సహజంగా ప్రకృతి నిర్దేశించిన పద్ధతిలో వాడుకోవాలి. మహాత్ములు రజోగుణాన్ని పనికి వాడతారు. తమోగుణాన్ని కూడా వాడతారు. అంతేగానీ వాటిలో జీవించరు. జీవించేది సత్త్వగుణము, వాడేది పని చేసుకునేది రజస్సు, తమస్సు! మనము జీవించేది తమోగుణమో రజోగుణమో అయితే జ్ఞానం నుండి అజ్ఞానంలోకి

ప్రవేశిస్తాం. అందువల్ల రకరకాల తప్పులు చేస్తాం. అందువల్ల రకరకాల కర్మలు పుడతాయి. ఆ కర్మలు మనలను బంధిస్తుంటాయి. వీటన్నిటిలో నుండి బయట పడాలంటే మళ్ళీ సత్త్వగుణమే ఆధారం! గుణాతీతుడైన భగవంతుడు కూడా మళ్ళీ సత్త్వగుణము ద్వారానే దర్శనాన్ని అనుభూతిని ఇస్తాడు. అందుకని మనలో వీరత్వం వుంటే అది వాడిదని తెలియాలి. మనవద్ద సంపద చేకూరితే అది వాడిదని తెలియాలి. అలాగే విద్య, వైద్యం, మంచి భాష ఏర్పడినా వాడిదని తెలియాలి. మనవద్ద వున్న సమస్త సంపదా వాడిదే! మనల్ని కూడా వాడుకోనిస్తున్నాడు. 'నీదే నాదగ్గరుంచి నన్ను వాడుకోవడానికి అనుమతిచ్చావు. నేను చాలా కృతజ్ఞుడను దీనికి' అని బ్రతకాలి. ఇచ్చిన దానికి కృతజ్ఞుడవై ఉండాలి. లేనిదానికి complaint వుండకూడదు. ఉన్నవాటిని నువ్వు బాగా వినియోగం చేస్తేనే కదా ఇంకా నీకిచ్చేది! దర్పము చెందక వున్నది భగవంతుడిదే అనే భావనతో దానిని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్తూంటే, దర్పము పెరగదు. పెరిగితే నెత్తిమీద మొట్టికాయ పడుతుంది. అలా శ్రీకృష్ణుడు ఎంత మందో వీరుల గర్వాన్ని అణచివేశాడు. ఇంకా పోకపోతే శరీరాల నుండి కూడా వేరు చేసేశాడు.

## 770 విషమః

'అర్థం కాడు' అని అర్థం. పరిస్థితి విషమించింది అంటే అర్థం కావడం లేదని చెప్పడం. మనవల్ల పరిష్కారం కాదని చెప్పడం. ఆయన చాలా విషముడు. మనం అనుకున్నట్లుగా జరగదు. ఆయన అనుకున్నట్లుగా మనం అనుకోగలిగితే అదృష్టం. అందుకే భగవంతుడితో పరస్పరత్వం లో ఎంత సేపూ గోడకు తలకాయ పగులకొట్టుకున్నట్లు వుంటుంది. మనభాష ఆయనకి అందదు, ఆయన భాష మనం వినం. ఇద్దరు భాష తెలియని వాళ్ళు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటే ఎలా వుంటుందో అలా వుంటుంది. ఒకరు సంస్కృతం మాట్లాడుతుంటే ఇంకోరు Spanish మాట్లాడుతున్నారనుకోండి, ఎట్లా వుంటుంది? భీష్ముడికే విషమః అనే నామం వచ్చిందంటే ఎంతకష్టం? అర్థం చేసుకుందామంటే అర్థం అయ్యేది కాదు భగవత్తత్త్వం. సమర్పణ చెందితే మాత్రమే అర్థం అయ్యేది. బాగా ఉన్నత జ్ఞానస్థితిలో, Masonry లో దీన్ని '30th degree' అంటారు, ఇంక ఇక్కడ అర్థం చేసుకోవడం ఆపేయమని అంటారు. ఇంకా ఏదో అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తే అపార్థమే మిగులుతుందని చెప్తారు. భగవంతుడ్ని అర్థం చేసుకోవడం ఏమీ వుండదు. అనుభవించడం వుంటుంది. అనుభవించడం నుండి కొంత అర్థం రావచ్చు, అది కూడా పూర్తిగా చెప్పగలిగినది కాదు. అందుకని శ్రీకృష్ణుడు విషయం లో చాలా విషమం అయ్యింది శకునికి, దుర్యోధనునికి, కర్ణుడికి, చివరికి భీష్ముడికి, ద్రోణుడికి గాని, ఆయన ఎప్పుడు ఏమి చేస్తాడో ఎవరికీ ఎన్నడూ అవగాహన కాలేదు. ఏమి జరుగుతుందో ఎవ్వరికీ ఏమీ తెలియదు. అందుకే శకుని అంటాడు, 'ఈయన యొక్క ప్రణాళిక తెలిస్తే నేను సులభంగా విజయం చేకూర్చి పెట్టగలను, అని దుర్యోధనునిడితో అంటాడు. దివ్యాయుధాలుండడం పెద్ద విషయం కాదు. ఎవరు, ఎందులో weak అయితే ఆ point మీద ఆడితే వాడు ఓడిపోతాడు. శకునికి ఎవరిలో ఏది ఎక్కువ బలహీనమో తెలుసు. అవతల వాళ్ళ బలహీనతల మీద తన పాచికలు వేస్తూంటాడు. అందుకని యుద్ధం అంటే labour కాదు, intellectual game అంటాడు. వాడి వద్ద కండ బలం వున్నది గెలుస్తాడని, ఆయుధాలున్నాయి గెలుస్తాడని కాదు. వాడి యొక్క ఆలోచనలని బట్టి గెలుపోటములుంటాయి. ఈ మొత్తంలో ధర్మరాజు ఎలా ఆలోచిస్తాడో నాకు తెలుసు అంటాడు. అలాగే భీముడు, అర్జునుడు, ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రోణుడు, విదురుడు, దుర్యోధనుడు, కర్ణుడు, ఇలా అందరి ఆలోచనల ఒరవడి తెలుసు. ఇలా ప్రతి వాడినీ, వాడి వంకని పట్టుకుని నులిమేస్తుంటాడు. అందుకే దుర్యోధనుడితో శకుని వుండి బోధ చేస్తున్నపుడు భీష్ముడు గాని, విదురుడు గాని, ధృతరాష్ట్రుడు

గాని, పట్టడానికి వీలుండదు. అలా ఆడిస్తాడు. ఆటంతా శకునిదే. అలాంటి వాడంటాడు, 'నాకీ మొత్తంలో వాడొక్కడి ఆటే అర్థం కావడం లేదు. వాడు కృష్ణుడు! మిగిలిన వాళ్ళని తీసిపారెయ్య' మంటాడు. ధర్మరాజు వద్ద బోలెడు ధర్మం వుండవచ్చు, కానీ బోలెడు బలహీనతలు కూడా వున్నాయి. అందుకే కదా పాచికలతో గెలిచాడు. వాడికది బలహీనత. అలా అందరి బలహీనతలూ చూసుకుంటాడు శకుని. కానీ కృష్ణుడి వద్ద కొచ్చేసరికి ఆయన ఆలోచనా ఒరవడి తెలియడం లేదు ఒకటి, కృష్ణుడి weak point ఏదో తెలియడం లేదు రెండు, ఎంతకీ అర్థం కాడు. కృష్ణుడు అర్థం అయితే నువ్వు గెలిచినట్లు, అర్థం కాక పోతే నువ్వు ఓడినట్లు అని శకుని, దుర్యోధనుడికి చెప్తాడు. మిగిలిన వాళ్ళది ఏమీ లేదు. వాళ్ళంతా labour. వాడు ఏమిటో, వాడి ఆలోచన ఏమిటో మనకి తెలిస్తే మాత్రం మనదే జయం, అంటాడు. అంత విషమమైన వాడు కృష్ణుడు. బ్రహ్మాకీ, ఇంద్రుడికీ, భార్యలకీ, బలరాముడికీ, ఎవరికీ అర్థం కాలేదు కృష్ణుడు. ఎవరు ఏ దృష్టితో చూస్తే వారికి అలా కనిపించాడు తప్ప, మొత్తం తెలియడం అనేదే లేదు. మనమైనా అంతే దేవుండంటే ఒక్కొక్కళ్ళకి ఒక్కో అవగాహన వుంటుంది. అది మొత్తం ఏనుగు బొమ్మలో ఓ చిన్న చుక్కంత. మొత్తం దేవుడి అవగాహన ఒక చుక్కంత మనకి. అందుకే తెలిసిన వాళ్ళు అమ్మో ఆయన గురించి మాకేమీ తెలియదండి, పూర్తిగా చెప్పలేం అంటారు. పూర్తిగా అవగాహన అవ్వడానికి వీలు లేదు. నారదుడంతటి వాడికి అవగాహన కాడు. ఇంక నువ్వెంత? నేనెంత? మహర్షులెంత? అందరూ అందుకే ఆయన ఆజ్ఞలకి అణిగి మణిగి వుంటారుట. 'నువ్వు సంకల్పిస్తేనే కదా నాకు తెలిసేదీ' అంటాడు మైత్రేయుడు. ఒక కొత్త మార్గం ఏర్పరచాం, ఏమిటో చెప్పమని మైత్రేయుడ్ని కృష్ణుడు అడుగుతాడు. కృష్ణుడికీ మైత్రేయుడికీ ఒక అవినాభావ సంబంధం వున్నది. అంతటి సారూప్యం, సాయుజ్యం పొందారు, సాలోక్యం పొందారు విడదీయలేం. అయినా కూడా కృష్ణుడి నుండి సంకల్పం వస్తే గానీ మైత్రేయుడికి తెలియదు. అందుకని కృష్ణుడు మైత్రేయుడ్ని 'కుశాగ్రబుద్ధివి గదా! ఆలోచించి చూడు' అంటాడు మంద్రజాలంలో మాస్టారు చాలా బాగా రాశారు. కృష్ణుడికీ మైత్రేయుడికీ జరిగిన సంభాషణలలోని లోతుల గురించి ఆయన రాసింది ఒక వారం రోజులు చెప్పకోవచ్చు. మాస్టారు అంత లోతులలో జీవించగలిగారు కనుకనే అలా వ్రాయగలిగారు. ఇంకొకళ్ళు వ్రాయలేరు. నువ్వు సంకల్పిస్తేనే కదా నాకు ఆలోచన వస్తుంది, అని అంటాడు మైత్రేయుడు. భగవంతునికి సంకల్పం వస్తే అవగాహన చేసుకున్నవారు 1st grade. భీష్ముడంతటి వాడు కృష్ణుడెలా గెలిపిస్తాడో చూడాలని ఉత్సాహపడ్డాడు. ధర్మం వున్నా, team weak. సంధి చేయడానికి కృష్ణుడు సభకి వస్తున్నాడుట అంటే ఎలా

చేస్తాడో చూద్దామని భీష్మునికి ఉత్సాహం. భీష్మునికీ, విదురునికి అందనంత లోతుల్లోకి వెళ్ళిపోయింది సమస్య. పరిష్కారం కృష్ణుడొక్కడేనని గాంధారికీ, ధృతరాష్ట్రునికి, భీష్ముడికీ, విదురునికీ తెలుసు కానీ వీరందరికీ పరిష్కారం వీళ్ళు అనుకున్నట్లుగా రావాలి. మనం గురువు వద్దకి వెళ్ళి మనం అనుకున్నట్లు ఆయన చెప్పే వరకూ ఏదో ఒకటి అందిస్తాం. అందిస్తే మనం అందించింది, మనకందించి పంపేస్తారు. పంపిస్తే గురువుగారు చెప్పారని చేస్తాం. అట్లా ఎన్నో అయినాయి. 'మీరు చెప్పినట్లే చేశానంటున్నాడు వాడికేం జరగలేదేం మాస్టారూ' అంటే, 'వాడికి నేనేమీ చెప్పలేదు' అనే వారు. 'అదేంటండీ మీరు చెప్పారుట' అంటే 'నేను చెప్పాను గానీ చెప్పలేదు' అదేమంటే 'వాడికి కావలసినది నా చేత చెప్పించుకున్నాడు తప్ప నేను చెప్పేది వినడానికి రాలేదు' అనేవారు. అలాగే సంధి ప్రయత్నంలో అందరూ ఎవరి ఆలోచనల ప్రకారం వారి వారి పరిష్కారలు ఏర్పరచుకున్నారు తప్ప కృష్ణుడు ఏమి చేస్తాడో ఎవరూ ఊహించలేదు. చివరకు విదురుడంతటి వాడు కూడా 'కోరి యుద్ధం చేయిస్తాడా! కృష్ణుడు భగవంతుడైనప్పుడు అందరియందు సముడే కదా, ప్రేమ వుంటుంది కదా, జననష్టం చేయించడు కదా', ఇలా అన్నీ పెట్టేసుకుంటాడు. తరవాత యుద్ధములో అటు ప్రక్కన చేరాడని తెలిసి, అంతటి వాడూ కృష్ణుడి మీద కోపంతో అలుగుతాడు. భీష్ముడు open minded. మొదట్లోనే మనం పొరపాటు చేసాం. ఇక ఈ జన్మంతా మనం ఈ paralysis తో బ్రతకాలని నిర్ణయించేసుకున్నాడు. తండ్రి కారణంగా ఒక చిన్న ఆవేశపు ప్రతిజ్ఞ ద్వారా మొత్తం అంతా పడి పోయింది. ఒక కాలు పడి పోయినట్లే అనుకుని కుంటి కాలితోనే బతకాలని నిర్ణయించుకున్నాడు, అదే ధర్మం అనుకున్నాడు, అలా వుండి పోయాడాయన. కృష్ణుడ్ని చూడగానే ఆనందం కలిగింది. 'ఎందుకంటే ఆయన పూర్ణ పురుషుడని తెలిసిన వాడు ఆయనొక్కడే కాబట్టే వేచి చూచాడు. అయినా ఎప్పటికీ అర్థం కాలేదు. అర్థం అయినట్లుంటాడు, కాడు. ముందు చెప్పడు, ఏమి చేస్తాడో తెలియదు. ఒక్క విషయం కూడా కృష్ణుడు ముందు చెప్పడు, 'చూద్దాం', అంటాడు. పాండవులకైనా అంటే 'ఏమవుతుందో చెప్పు' అని ద్రౌపది అర్జునుడు అంతా అడుగుతారు. 'చూడు చూస్తేనే మజా కానీ ముందే తెలుసుకుంటే ఏం మజా?' అంటాడు. యుద్ధం యుద్ధం అని భీముడు, ద్రౌపది ఉరుకుతూంటే, వాళ్ళని కోప్పడతాడు 'మీ ప్రతిజ్ఞ ముఖ్యమా? లక్షలాది జీవుల ప్రాణాలు ముఖ్యమా?' అని. 'అయితే నా ప్రతిజ్ఞ ఏమయిపోతుంది? నేను ధర్మాత్ముడ్ని కదా! మరి నా నోట్లోంచి వచ్చిన ప్రతిజ్ఞ జరగాలి కదా! అంటాడు భీముడు. 'అలా జరగాలని లేదు, జరగనక్కరలేదు కూడా' అని చెప్తాడు కృష్ణుడు. For a higher cause lower things can be sacrificed. ద్రౌపదిని కూడా కోప్పడతాడు. అందర్నీ

కోప్పడతాడు ఎందుకనీ? యుద్ధం కావాలని వీరెవ్వరూ అనుకోకూడదు, అది ఆయనకి కావాలి. కౌరవులు అనుకోవాలి యుద్ధం కావాలని. వీళ్ళు యుద్ధం కావాలనుకుంటే అది అధర్మం. రాయబారానికి వెళ్ళబోయే ముందు ద్రౌపది ప్రక్కకి పిలచి, తన జుట్టు చూపించి ఏడుస్తుంది దీని సంగతేమిటని? ద్రౌపదంటే తనలో భాగం. మరి ఆమె పేరు కూడా కృష్ణ కదా! 'అవుతుంది కానీ మనం అనుకోకూడదు' అంటాడు. కృష్ణుడికి ద్రౌపదంటే చాలా ప్రియం. 'కౌరవులు కూడా యుద్ధం కావాలని అనుకోకూడదనే ప్రయత్నం చేద్దాం. కానీ వాళ్ళు అనుకుంటారు. అది వాళ్ళ స్వభావంలో గడ్డ కట్టేసింది. యుద్ధం తప్పదు. కానీ మీరు యుద్ధం కావాలని అనవద్దు' అంటాడు. ఇంత కృష్ణుడూ మనకి ఆపద్భాంధవుడై వుండీ, యుద్ధం వద్దని అరణ్యాల్లో ఇలాగే బ్రతకమంటాడా అని భయం వేస్తుంది. వీళ్ళకి అర్థం కాదు. 'నాకు వదిలెయ్యండి. పంపిస్తే నాకు తోచింది చేసుకు వస్తాను' అంటాడు. 'ఏం చేస్తావు' అంటే 'నాకు తెలియదు, నీకు చెప్పను, అప్పుడు పరిస్థితిని బట్టి జరుగుతుంది' అంటాడు. అటు వాళ్ళకీ అర్థం కాదు, వాళ్ళ చేతే యుద్ధం అనిపిస్తాడు. ధర్మ ప్రకారం యుద్ధం జరగాలి. జ్ఞానులందరూ యుద్ధం జరగకూడదని అనుకుంటారు. ఒక మంచి వాడిని చెడ్డవాడు అలా రాపాడిస్తుంటాడండీ. దేవుడికి ఇద్దరూ సమానమే అయినా కాపాడడము అనేది ఒకడికి జరుగుతుంటే ఎట్లా? ధర్మ పక్షపాతి కదా! అందుకే జ్ఞానులకి కృష్ణుడు నచ్చలేదు. కృష్ణుడి failure అని మన అవగాహన. ఎంత తెలిసినవాడికీ అవగాహన కాని తత్త్వం అది. భీష్ముడికే అర్థం కాలేదంటే!? నారదుడెన్ని తిప్పలు పడతాడు? తిప్పలు పెట్టడం కృష్ణుడిలో వుండవు, దానికి తగ్గ వంకరలు నారదుడిలో వుండటం వల్ల తిప్పలు పడతాడు. 'భక్తులలో శ్రేష్ఠుడెవరంటావ్' అని కృష్ణుడిని అడుగుతాడు నారదుడు. ఎక్కడో మట్టి పిసుక్కుంటున్నవాడ్ని చూపించి 'వాడు 'అని అంటాడు. నారదుడికి చిర్రెత్తి పోతుంది. ఈ నారదుడికి intellectualism అప్పుడప్పుడు వస్తూంటుంది. అలా వచ్చినప్పుడల్లా ఈయనకి ఏదో ఒకటి పెడుతుంటాడు. తిప్పలు పడ్డాక గానీ తెలియదు మహానుభావా అని. అట్లాగే పారిజాతం తెచ్చి, కొంత కథ నడుపుతాడు. ఎక్కడికక్కడ అంతా విషముడే. ఎవరికి విషముడు కాదంటే సమర్పణ చెందిన వారికి తెలియడు, గానీ ఫర్వాలేదు. అమ్మో ఈయనేంటసలు చేస్తాడా, చేయడా అన్న సంశయం వుంటుంది కదా! ఇన్నాళ్ళూ గురువుగారి వెంటపడ్డాం మనకి అవుతుందా అవ్వదా అనిపిస్తుంది కదా! అవుతుందో అవదో మనకెందుకూ? మనం నమ్మాం, అక్కడ పడుందాం అని పడుంటే చేస్తాడు. లేదా నీ ఆలోచనలు నీకుంటే promote చేస్తాడు. అదీ కృష్ణుడిలో వున్నది. మాస్టారు కూడా అలాగే

చేసేవారు. మన ఆలోచన ఏదో తెలుసుకుందామని వచ్చి, వాళ్ళ ఆలోచన వాళ్ళు పట్టుకుపోతూండేవారు మనమంతా అలాగే చేస్తాం. 'నువ్వే సమస్తం. నువ్వేమి చేస్తే అది చెయ్యి' అంటే కృష్ణుడే చూసుకుంటాడు. కొంత నేను చేస్తా, కొంత నువ్వు చెయ్ అంటే చేయడు. అప్పటికే నువ్వు పాడు చేసేసి, పాయసానికి పాలు మాడ్చి పారేసి, పాయసం నువ్వు చెయ్ అంటే ఎలా? అందుకని విషముడు ఎవ్వరికీ అర్థం కాడు. అసలు నల్లని వాడు అన్నా అర్థం అదే. ఏమీ తెలియదు. జరిగిన తర్వాత చూసుకుంటే తెలుస్తుంది. జరిగేంతవరకూ తెలియదు. అట్టిది విషమః అంటే. అసలు భగవత్తత్త్వమే అలాగ వుంటుంది. అందుకని అవగాహన కన్నా సమర్పణ ముఖ్యమన్న మార్గం వచ్చింది. తెలిస్తే చేస్తాం అనేవారికి కొంత వరకే దారి. ఇక తెలిస్తే చేయడం వుండదు. పడి వుండడమే వుంటుంది. ముందుకు వెళ్ళాలంటే ఇహ తెలియకుండా పోవడమే. అట్లా ధర్మరాజు కృష్ణుడికి అప్పజెప్పేసుకున్నాడు. ఒక మరచెంబులో నీళ్ళు తీసుకుని ఆయన చేతిలో పోసేసి బాబూ చూసుకో అన్నాడు. ద్రౌపది అలా చేసింది. అర్జునుడు అప్పుడప్పుడు పోస్తుంటాడు. అప్పుడప్పుడు మరచెంబు తనదగ్గర పెట్టేసుకుంటాడు. అందుకని అవగాహనకి రాడు. భీష్ముడికి చివర వరకూ కృష్ణుడెలా నడిపిస్తాడో చూద్దామనే ఉద్దేశ్యంతో 9 రోజులు యుద్ధం చాలా గట్టిగా చేస్తాడు. 18 రోజుల యుద్ధంలో 10 రోజులు భీష్ముడివి. ధర్మరాజుకి మొట్టమొదటి రోజే కృష్ణుడు చెప్తాడు భీష్ముడుండగా నీకేమీ అవదని. యుద్ధం కూడా ఏమి చేయిస్తాడూ? మనవాడు శంఖం వూదడానికి రెడీగా వుంటే వాడ్ని వూదనీ నువ్వుండరా, అని చెప్తాడు. బాణాలు వేయనా అంటే, వాడ్ని వేయనీ, తర్వాత మనం వేద్దాం అంటాడు. ఎప్పుడూ గెలవాలంటే అవతల వాడ్ని బంతి ముందు ఆడనీయాలి. అదీ కృష్ణుడి పద్ధతి. 'Let not the action be initiated from you'. నీ నుండి ఏదీ మొదలు పెట్టకయ్యా, అంటాడు కృష్ణుడు. నువ్వు మొదలు పెట్టకుండానే బోలెడు చేయవలసినవి వస్తాయి. ఇక నువ్వు కూడా మొదలు పెడ్తే అవి ఇవి అన్నీ కలిపి గంపెడయ్యి చస్తావు' అని చెప్తాడు. 'అన్ని ఆరంభములు పరిత్యాగం చేసిన భక్తుడు నాకు చాలా ప్రియుడు' అని చెప్తాడు భక్తియోగంలో 'సర్వారంభ పరిత్యాగీ' అంటూ. ఆరంభ పరిత్యాగం చాలా ముఖ్యం. వాడూ వీడూ పనులు మనకి అప్ప చెప్తూనే వుంటారు. ఇవి కాక నువ్వు కూడా కొన్ని పెట్టుకుంటే...? ఎవరో వచ్చి మీరు విష్ణుసహస్రనామం చెప్తే బాగుంటుందన్నాడు, నన్ను ఇరకి పెట్టాడు. వెళ్ళిపోయాడు. మీరు భాగవతం చెప్తే బాగుంటుంది. కృష్ణుడు కథలు బాగా చెప్తారని, ఒక తమిళాయన నన్నిరికించి విదేశాలకు వెళ్ళిపోయాడు. నా వరకు అది భగవంతుని ఆజ్ఞగా చెప్పకోవడమే! ఇవన్నీ మనం పెట్టుకున్నట్లుగా తయారవుతాయి. కానీ మనం పెట్టుకునేవి

ఏమీ వుండవు. ఎవరో మనకు పెడతారు. రేపు జ్యోతిషం పెట్టమని అంటున్నారు. ఆ తర్వాత అన్నవాళ్ళు వెళ్ళిపోతారు. వచ్చే వాళ్ళుండరు. చెప్పేవాడు మాత్రం ఇక్కడే వుండి పోతాడు. 'ఆరంభ పరిత్యాగం చేసుకో' అంటాడు కృష్ణుడు. కృష్ణుడు తనకు తానుగా మొదలు పెట్టిందేమీ లేదు. వూళ్ళ వాళ్ళు మొదలు పెట్టిందే చేయడంలో అయిపోయింది 126 ఏళ్ళూనూ. పుట్టాడు. పాలిస్తానని విషం ఇస్తుంటే ఆవిడెవర్నో చంపాల్సి వచ్చింది. బండిచక్రంగా వచ్చినవాడిని చంపాల్సి వచ్చింది. గాడిదిలాగ, కొంగలాగ ... ఇలా వచ్చిన వాడితో పని చేసుకున్నాడు. ఎక్కడా ఆరాట పడి తిరగలేదు. అమ్మా నాన్న అక్కడున్నారని తెలిసినా వెళ్ళలేదు. కంసుడు రథం ఇచ్చి రమ్మనమని పిలుస్తాడు. మనం అయితే నడచి వెళ్ళాలి లేదా మన బండిలో వెళ్ళాలి. సరే! అట్నుండి రథం వచ్చింది. రథంలో మహాజ్ఞాని వచ్చాడు. అలా నడచి వస్తాయి ఆయనకి. కూర్చునే ఓపికున్న వాడికి అవే నడచి వస్తాయి. పరుగెట్టే వాడికి వాడే ఏరుకోవాలి. ఏరుకున్నా అందులో పుచ్చులు, చచ్చులూను. అసలువి వుండవు. అవన్నీ మళ్ళీ విదిలించుకుంటూండాలి. ఎవరో ఒకాయన వచ్చాడు. స్థలం చూపించాడు మీరేం చెప్తే అది చేస్తాన్నన్నాడు. చెప్పాను, చేయించుకున్నాడు. మరచిపోయాడు. మనకి పని అయిపోయిందనుకోవాలి. ఎక్కడికక్కడ వస్తూంటారు, పనులు చేయించుకుంటారు, వెళ్ళిపోతూంటారు. మన వద్దకు వచ్చినపుడు అన్నీ చేయనక్కరలేదు. అందులో నలుగురికి పనికి వచ్చేదేమన్నా వుంటే దానికి ప్రతిస్పందించాలి. అదీ మాస్టరుగారి వద్ద నేర్చుకోవాలి. రామకృష్ణ చెట్టిగారు వచ్చి 'మీరు భాగవతం వ్రాస్తే బావుణ్ణు మాస్టారూ' అన్నారు. రెండు ఏళ్ళల్లో ఆయన వెళ్లిపోయాడు. ఈయనకిది life long work అయిపోయింది. వాడు నిమిత్తమాత్రుడు. భగవత్కార్యం కదా మనం చేయాలి. కృష్ణుడు ఏమీ మొదలుపెట్ట లేదు. నేనేమీ మొదలు పెట్టానుర, మీరంతా రజస్సుతో మాటి మాటికీ మొదలు పెడుతూంటారు అన్నాడు. కృష్ణుడేమీ మాట్లాడడు. ఇట్లా చేస్తానని చెప్పడు. ఏదీ మొదలు పెట్టడు. అయినా ఆయన జీవితం సాగలేదూ? నువ్వేమీ మొదలు పెట్టక పోయినా, అప్పుడే ఒక ప్రయాణంలో వున్నావు కనక ఆ ప్రయాణానికి సంబంధించినవి వస్తూంటాయి. అది కాక నువ్వొకటి మొదలు పెడితే ప్రయాణంలో ఇంకా ఒక కొట్టు తయారవుతుంది. దాన్ని మళ్ళీ మూసుకుంటూండాలి. ప్రయాణం ఆగిపోతుంది. అందుకే భగవద్గీతలో చెప్తాడు 'నీనుండి మొదలైన వన్నీ నువ్వే పూర్తి చేసుకున్న తర్వాత గానీ నా వద్దకు రాలేవ'ని. అందుకని ఆరంభ పరిత్యాగం చేయాలి అంటాడు భక్తియోగంలో. ఇంకోచోట సంకల్ప సన్యాసం లేని వాడు యోగంలోకి రాలేడని చెప్తాడు. అది ఆరో అధ్యాయంలో వుంది. 'న హ్యసంన్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన'. సంకల్ప

సన్యాసం చేయని వాడు యోగి కాలేడు అంటాడు. మనకి రోజూ ఇక్కడకి వెళ్దాం, ఇది చేద్దాం అది చేద్దాం అని వస్తున్నాయనుకోండీ, జీవితం అంతా పిలవని పేరంటం అయిపోతుంది. నువ్వూరికే కూర్చుంటేనే నీ వద్దకు కాలం రూపంలో బోలెడు కర్తవ్యాలు నీ వద్దకు వస్తాయి. దాని మీద నీ బుద్ధితో విచక్షణ చేసి కర్తవ్యమో కాదో చూసుకుని నిర్వర్తిస్తూండు. సత్త్వగుణంలో వున్నప్పడే అది నిర్వర్తించవలసినదో, కాదో తెలుస్తుంది. అట్నుంచి వచ్చినదెల్లా నిర్వర్తించనక్కరలేదు. అట్నుంచి మేనక వచ్చిందని, ఆమెతో వెళ్ళిపోతాడు విశ్వామిత్రుడు. తపస్సు కొన్నాళ్ళు ఆగిపోతుంది. ఇవన్నీ కృష్ణుని విషయంలో తెలియడం కష్టం. మాస్టరు గారి చలవ వల్ల మనకి కొంత అవగాహన ఇచ్చారు. ఆయన జీవితంలో నుండి కొంత కృష్ణుని యోగం ఏమిటో మనకి తెలుస్తుంది. పూర్తిగా తెలిసిన వారందరూ అలాగే వుంటారు. వారి వద్ద నుండి కూడా ఏమీ మొదలు అవదు అంటే మాస్టరు కూడా కృష్ణుడే అనకూడదు మనం. అట్లా ఉండేవాళ్ళు కూడా చాలా మంది వున్నారు. వాళ్ళేం మొదలు పెట్టరు. ఎవరైనా వీళ్ళని involve చేస్తే, వారి ఓపిక కొద్దీ మంచి విషయం అయితే దానికి సాగుతూంటారు, కాకపోతే తెలివిగా తప్పించుకుంటారు. కృష్ణుడు రాయబారానికి వెళ్తే దుర్యోధనుడు భోజనానికి పిలిచాడు. అప్పుడెప్పుడో ఇది వరకు విదురుని భార్య పిలిచింది. అచ్చం మాస్టారు అదే వ్యవహారం. 'మీ ఇంటి కొద్దామని వుంది, కానీ ఆమె పాపం బాధ పడుతుంది. ఎప్పుడో పిలిచింది. పైగా ఈ వూరొచ్చి' అని మాస్టారు చెప్తుండేవారు. అక్కరలేని విషయం తప్పించడం అంటే ఆయనే! అద్భుతంగా తప్పించే వారు. పూరిపాక లోకి వెళ్లి కూలివాడి నోట్లో మందు వేస్తారు గానీ, ధనవంతుడొచ్చి కబుర్లు చెప్తుంటే, వస్తాను చెట్టిగారు అని చెప్పి ఏదో పనున్నట్లు హడావుడిగా వెళ్ళి పోయేవారు. ఏమీ వుండేది కాదు. అట్లా కృష్ణుడు అర్థం కాక విషముడైపోయాడు. ఈ తత్త్వం కూడా అంతే!భగవద్భక్తులు కూడా చాలా మందికి అర్థం కారు, ఎందుకంటే వీళ్లేమీ విప్పి చెప్పకోరు. 'మేమింతా' అని చెప్పకోరు కదా! భగవద్భక్తులు భగవంతుని యందు వుంటారు తప్ప, తామెంతో చెప్పకునే కార్యక్రమాలు వుండవు. ఉండక పోవడం వలన తెలియదు. ఎవరికి తెలుస్తుంది? తెలుసుకుందాం అన్న ఆర్తి వున్నవాడికి తెలుస్తుంది. కనుక కృష్ణుడు దుర్యోధనుడి ఇంటికి వెళ్ళకుండా విదురుని ఇంటికి వెళ్తాడు. అలాగే యుద్ధంలో కూడా 'ముందు యుద్ధం మొదలు పెట్టడం కాదు, వెళ్ళి ఆయన ఆశీర్వచనం తీసుకో. మీ తాతయ్య ఆశీర్వచన ప్రకారమే ఈ యుద్ధం వుంటుంది' అని చెప్తాడు. అదేమిటంటే, అదంతే అంటాడు. సరే కదా అని వెళితే 'విజయీభవ' అని భీష్ముడు ఆశీర్వదిస్తాడు. అదీ ఈయనకి కావలసింది. వీళ్ళు గెలవాలంటే మరి ఆయన చావాలి కదా! ధర్మరాజు 'విజయీభవ' అనిపించుకునేట్లుగా చేస్తాడు కృష్ణుడు.

భీష్ముడు 9వ రోజు విపరీతంగా యుద్ధం చేసి బాధ పెట్టేస్తాడు. ఆరోజు ధర్మరాజుని పంపుతాడు 'తాతయ్యా 'విజయీభవ' అని ఆశీర్వదించి ఈ రోజిలా చావగొడ్తున్నావేమిటీ' అని అడగమని. 'అమానీ' అంటే భక్తుడికి సిగ్గు తీసేస్తాడు. కృష్ణుడి వద్ద సిగ్గు, అభిమానం వుండరాదు. అన్నీ విప్పించేస్తాడు. అదీ ఆయన style. 'నీదగ్గర నీ గురించిన భావం ఏమున్నా నావద్దకు రాలేవని చెప్పడమే' గోపికా వస్త్రాపహరణము. దగ్గరకు వెడితే చాలా ఇబ్బందులు. దూరం నుండి దండం పెడితేనే సుఖం. మాటిమాటికీ అలా పంపిస్తాడు ధర్మరాజుని. దానికి ధర్మరాజు రెడీ, అదీ తమాషా! అర్జునుడ్నో, భీముడ్నో వెళ్ళమంటే వాళ్ళు ఆ జన్మకి కాదు కదా వెయ్యి జన్మలకైనా వెళ్లలేరు. అది వారి జీవ సంస్కారం. ధర్మరాజు దేనికన్నా రెడీ. ధర్మరాజు భీష్ముడి వద్దకు వెళ్తాడు వెళ్ళి దండం పెడితే 'విజయీభవ' అంటాడు. 'విజయీభవ అని పొద్దుట నుండీ సింహం వలె మమ్మల్ని చావగొడ్తున్నావు,' అని గోల చేస్తాడు. 'రేపటితో నాపని అయిపోయింది. నిన్ను కృష్ణుడు పంపాడు కదా' అంటాడు. 'ఆయనకీ విషయం తెలుసు, అందుకని పంపాడు. రేపు నేనిక అవతారం చాలిస్తాను'. అని తను చావడానికి clue ఇస్తాడు. లేకపోతే భీష్ముడెలా మరణిస్తాడు? చాలా విషమం కదా అది! ఆయన్ని ఎవరూ యుద్ధం లో జయించలేరు, చంపలేరు. ఆయన ఎప్పుడో అనుకున్నాడు మగా ఆడా కాని వాళ్ళతో పోట్లాడనని. శిఖండి మగా కాదు, ఆడా కాదు. మగగా పుట్టి ఆడగా తయారైంది. సరే వాడితో యుద్ధం చేయనన్నాడు. అందుకని శిఖండి వుండటంతో యుద్ధం చేయడు. చేయకపోవడంతో వెనక నుండి అర్జునుడు వచ్చి బాణాలు వేసేస్తాడు. మరి ద్రోణాచార్యుడు, ఆయన చేతిలో విల్లున్నంత వరకూ ఆయన్ని ఎవరూ గెలవలేరు. మరి వీటన్నిటికీ ఆయన వద్ద పరిష్కారం వున్నది కానీ ఆయన గురించి మాత్రం ఎవరూ ఆలోచించలేరు. విషమః గురించి ఇలా ఎంతైనా చెప్పకోవచ్చు. కాలయవనుడి లాంటి వాడ్ని యుద్ధానికి పిలిచి, పారిపోతుంటే, ఇదేంట్రా అనుకుంటాడు. కాలయవనుడ్ని అలా అలా తీసుకుపోయి చంపేస్తాడు. అసలు ఈ కృష్ణుడి dimension మన వూహకి కూడా అందనిది. మన ఆలోచనా సరళి అస్సలు పనికిరాదక్కడ. ఈ పదం గురించి చెప్పాలంటే కృష్ణుడొక్కడే చెప్పాలి. తర్వాత పరతత్త్వం చెప్పాలి. పరతత్త్వం కూడా కాలం రూపంలో అలా చేస్తుంటుంది. అది పూర్తిగా విచ్చుకునేంత వరకూ మనకేమీ తెలియదు. రేపేం జరుగుతుందో తెలియదు. ఈ రోజు రాత్రి ఏం జరుగుతుందో తెలియదు. అందుకే 'అనంతదర్శనం' అన్నారు. ఒక మడతలోంచి అలా బయటకి వస్తే మొత్తం పేలిపోవచ్చు. పరతత్త్వం కాలం రూపంలో అలా వస్తుంటుంది. 'నిన్న బాగున్న మనిషి ఇవాళ వెళ్ళిపోయారని అంటే ఈ రోజు వెళ్ళిపోతే నిన్న

బావుండడానికేం?' అనేవారు మాస్టారు. వాళ్ళు వెళ్ళే వరకు బాగుండచ్చు. మాట్లాడుతూ మాట్లాడుతూ వెళ్ళిపోయిన వాళ్ళు లేరూ? కాలం మడతలో టక్కున బయటకి వస్తే అయిపోయింది. ఏదన్నా కాలం మడతల్లోంచి రావాల్సిందే! పరీక్ష results దగ్గర్నుండీ ప్రతీదీ కాలం మడతల్లోంచి వచ్చే వరకూ suspense. ఏదిస్తే అది పుచ్చుకోవడమే, వేరేగతి లేదు. పరతత్త్వం కాలంలోంచి అలా వ్యక్తం అవుతూంటుంది. 'విచిత్రము, దుస్తరము ఎట్టివారికిన్ ' అన్నాడు. 'ఎవ్వరూ ఏమీ చెప్పలేరు ఏది బయటకు వస్తుందో' అని భీష్ముడంటాడు. ఆయన తండ్రి గురించి ఈయన చేసిన ప్రతిజ్ఞ ముందు ఆలోచించుకుని చేసిందా! బయటకి ఒక్క క్షణంలో వచ్చేసింది కదా! ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో తెలియదు. అయ్యాక, అవక ముందు ఎన్నన్నా theories చెప్పుకోవచ్చు. ఏం చేసినా సరి పెట్టుకోవడమే! అనంతదర్శనం పుస్తకం చదివితే తెలుస్తుంది. కాలం ముందు అంతా అంతే! పరతత్త్వం కాలం నుండి వ్యక్తమవడం ఎవరికీ ఎలాగ తెలియదో, అలాగే పురాణపురుషుడు శ్రీకృష్ణుడు దిగివచ్చినపుడు ఆయన చేసే పనులు కూడా తెలియలేదు. కాస్తో కూస్తో రాముడు చేసిన పనులు చెప్పవచ్చు. స్నేహితుడైతే రాముడిట్లా వుంటాడని చెప్పవచ్చు. కృష్ణుడికి ఏమీ చెప్పడానికి వీలు లేదు.Second-to-second క్షణ క్షణానికి ఏ చేస్తాడో తెలియదు. అందుకే చక్రం తిప్పేవాడంటారు కృష్ణుడ్ని.

## 771, 772, 773, 774 శూన్యః, ఘ్రితాశీః అచలః, చలః

( ఘ్రితాశీః వివరణ సేకరించే ప్రయత్నం. జరుగుతున్నది.)

పూర్ణానికి అర్థం శూన్యం. శూన్యంలో నుండి బయటకు వస్తే పూర్ణం వస్తుంది. అంతా శూన్యంలోంచి వచ్చేదే! శూన్యం ఎవరికీ? మనకి. అది పూర్ణమే! తెలియక పోవడం వలన మనకి శూన్యం. కానీ సమస్తమూ లేనట్లుగా వున్నదాంట్లోంచే వస్తాయి. 'ఏమిలేనట్టి గగనాన ఇమిడి వుండి అన్ని వున్నట్టి భూమికి అవతరించు'. రెండూ 'నట్లే'. అది ఏమీ లేనట్లుగా, ఇది అన్నీ వున్నట్లుగా వుంటుంది. లేనట్లుగా వుంటే లేకపోవడం కాదు, వున్నట్లుగా వుంటే వుండకపోవడం కాదు. లేకపోతే రాదు కదా! ఏమీ లేని దాంట్లోంచి ఎట్లా వస్తాయి? మొత్తం సృష్టి అంతా దేన్లో నుండి వచ్చిందో దానికి పేరూ, వూరూ లేదు. ఎట్లా వుంటుందో ఎవరికీ తెలియదు. దాని గురించి మనకేమీ తెలియదు కాబట్టి. దానికి మనం శూన్యం అని పేరు పెట్టుకున్నాం. శూన్యమే పూర్ణము, పూర్ణమే శూన్యము. శూన్యం నుండి పూర్ణం వస్తూంటుంది. మళ్ళీ పూర్ణంలోంచి శూన్యంలోకి వెళ్తుంటాం. అంతవరకూ శూన్యమే అప్పటికప్పుడు పుడుతుంది. ఉన్నపళంగా కాశీకి వెళ్దాం అన్న భావన వచ్చింది. అంతకు ముందు అది ఏదీ? లేదు కాదు, మనకి తెలియదు. మనకి తెలిసినపుడు మనకి అది వున్నది, తప్ప అంతకు ముందు కూడా వున్నది అది మనకి తెలియదు. అదీ శూన్యం గొప్పతనం Mr.శూన్యం! కాశీకి వెళ్ళే programme వుంది, అది నీకు తెలియదు. నీకు తెలియకపోవడం వలన నీకది శూన్యం. అది నీ బుర్రలో ఓ రోజు పుడుతుంది. ఎందుకూ? ఎవరో పక్కింటి వాడు వెళ్ళి వచ్చాడు, చెప్పాడు. మనం కూడా వెళ్ళాలనిపించవచ్చు. లేదా సినిమా చూస్తే వెళ్ళాలనిపించవచ్చు. హరిశ్చంద్రుడంతటివాడు కాశీ వెళ్ళాడు, మనం వెళ్ళడానికేం రోగమా, అనిపిస్తుంది. పుట్టక ముందు కూడా వున్నదని తెలియడం తెలివి. నువ్వు పుట్టావు, పెళ్ళి చేసుకున్నావు. నీకు, నీభార్యకీ 7 ఏళ్ళు తేడానుకో, నువ్వు పుట్టిన 7 ఏళ్ళకి ఆమె పుట్టింది. నువ్వు పుట్టిన 3 ఏళ్ళకి ఆమె వున్నదా? వున్నది. నీకెప్పుడుందీ? పెళ్ళి ఖాయం చేసుకున్నప్పటినుండీ. అంతకు ముందు నీకు లేదు. మనం అనుకునే వుండడం, లేకపోవడం అనేది చాలా పిల్లి బుర్ర తెలివి. పిల్లి అలా అంటే ఒప్పుకుంటుందో లేదో గానీ, Madam Blavatsky వ్రాస్తుంది 'పిల్లి బుర్ర తెలివనీ, గాడిద కొడుకని అనబోకండి. మనకి తెలియదు కదా వాటి తెలివేమిటో!' అని. అందుకని మనకో joke వున్నది, ఓ తండ్రి తన కొడుకుని గాడిద కొడకా అని తిడితే, గాడిద 'నీకేం పోయేకాలం నీ కొడుక్కన్నా నేను చాలా better గా వున్నానని object చేసిందట. చాలా తక్కువ తెలివి వుండడం వలన ఇలా వుందనీ

లేదనీ అనుకోవడం. లేనిది రాదూ వున్నది పోదూ ఇది 'సాంఖ్య యోగం'! లేనట్లుగా వున్నపుడేమో శూన్యం లో వున్నది, వున్నట్లుగా వున్నపుడేమో పూర్ణంగా వున్నది. శూన్యం, పూర్ణం నీకు గానీ తత్త్వానికి కాదు. అన్నీ అందులో వున్నాయి. అందుకే బ్రహ్మ అద్భుతమైన అనుభూతిని పొందుతాడు. సృష్టి చేయాలని చెప్పినపుడు 'హమ్మో' అనుకుంటాడు. విష్ణువుకీ అప్పుడే పుట్టిన చతుర్ముఖ బ్రహ్మకి మధ్య నడిచే సంభాషణ. చాలా జాగ్రత్తగా చదువుకోవలసింది. ఇదంతా మన పుట్టుకే. ప్రొద్దుటే లేచాక 'అబ్బ మళ్ళీ లేచాంరా' అనిపించదూ? లేచిన దగ్గరనుండి ఎన్ని కబుర్లు చెప్పాలో, ఎన్ని సత్యాలు మరుగున పరచాలో, ఎన్ని అసత్యాలు పెంపొందించాలో, మనిషికి లేస్తే ఎన్ని బాధలు? అలాగే బ్రహ్మకి గుర్తుకు వచ్చి భయం వేసింది. తపస్సు చేయమంటే, తపస్సు చేస్తే అంతా రెడీగా వున్న సృష్టి బయట పడడానికి ఈయన డబ్బా ఒక్కటి తెరవడమే అని తెలుస్తుంది. 'కీర్తి నీకు, నేను అంతా చేస్తాను' అంటాడు భగవంతుడు. అదే తమాషా! మనం వూరికే అలా నిలబడితే అన్నీ ఆయనే చేసుకుపోతుంటాడు. మనం చేస్తూంటే ఆయన వదిలేస్తాడు. అదే కృష్ణుడు అర్జునుడికి చేసిన initation. నువ్వయినా చేయాలి, నేనన్నా చేయాలి. సగం సగం వ్యవహారాలుండవు. శూన్యంలోంచే సమస్తమూ వస్తోంది. శూన్యంలోకే సమస్తమూ వెళ్ళిపోతూంది. అదే అర్జునుడికి చూపిస్తాడు. కృష్ణుడు అలాగే నిర్వికారంగా వుంటాడు. మామూలుగా ఏ orientation వున్నట్లు కనిపించడు. He is not changed in any situation. ఏదన్నా సన్నివేశం వుంటే, మనం దాన్లో ఓ position తీసుకుంటాం. కృష్ణుడు ఏ పక్కా తీసుకోడు. పక్కగా వుంటాడు అన్నమాట. అక్కడేమీ వుండదు శూన్యం తప్ప. ఆయనకి refer చేస్తే వుంటుంది. ఆయనకు refer చేసినప్పుడు అందులోకి దిగుతాడు. ఆయనకి refer చేయకపోతే ఆయనక్కడే వున్నా మనకేమీ తెలియదు, దీనితో సంబంధం లేదు. అక్కడుంటే సన్నివేశంతో సంబంధం లేదు. అలా వుండవచ్చు. అక్కడ వాళ్ళేదో చర్చించుకుంటున్నారు, నిన్నేమీ పిలవలేదు. నీ కున్న కండూతి కొద్దీ నువ్వు కూడా అందులో పాల్గొంటావు. అది అక్కర లేదు. అదీ శూన్యత్వం. మొత్తం వ్యాపించి వుండి సన్నివేశంలోకి వస్తూంటాడు. అందుకే ఎక్కడేం జరుగుతున్నా దాన్ని అందుకుంటాడు. ఎవరితోనో భయంకరమైన యుద్ధం చేస్తుంటే ద్రౌపదికి వస్త్రాపహరణం జరిగిపోతూంటుంది. అవతల అంత యుద్ధం చేస్తున్నా, ఇవతల ఇది తెలియడం అనే స్థితిలో ఉండడం సామాన్యమైన విషయం కాదు కదా! He permeates to the whole. గదిలో సామాను లేకపోతే ఏమీ లేదిక్కడ అంటాం. లేకపోవడం ఏమిటీ? ఎందులోనుండి అన్నీ వస్తున్నాయో అది అక్కడే వున్నది. మనకది లేనట్లుంటుంది. అందుకే ఈ భగవత్తత్త్వం శూన్యంగా వుంటుంది, శూన్యం కాదు. మాస్టరుగారు చాలా విపరీతంగా కోప్పడుతూండేవారు.

Vacuum, vacuum అంటుంటారు శాస్త్రజ్ఞులు, వారి బుర్రల్లో వుందసలు vacuum. సృష్టిలో లేదే అనేవారు. మనవాళ్ళ అవగాహన 'అన్నిటికీ పుట్టుక స్థానము నిద్రాణమైవున్నది'. అప్రతర్క్యం, అవిజ్ఞేయం, అలక్షణం, ప్రసుప్తం ఇట్లా వుంటుంది. ప్రసుప్తః అంటే నిద్రపోతుంది. 'అప్రతర్క్యం' అంటే అట్లా వుంది అనే discussion కి కూడా అతీతంగా వుందన్నమాట. 'అవిజ్ఞేయం' అంటే తెలుసుకోవడానికి వీల్లేదు. 'అలక్షణం' ఏ లక్షణమూ లేదు. కానీ అదే మొత్తం! అదే పరతత్త్వం! దాని నుండి సమస్తమూ దిగి వచ్చింది అని చెప్పడానికి శూన్యం అని చెప్పారు. వేదమంతా శూన్యం గురించే ఘోషిస్తుంది. ఉపనిషత్తులు చెప్పే పరతత్త్వం అంతా కూడా శూన్యం గురించే. 'తత్' అని చెప్పేదంతా శూన్యం గురించే చెప్తుంది. బ్రహ్మము గురించి చెప్పబడినదంతా శూన్యం గురించి చెప్పిందే! సృష్టిలోకి దిగి వచ్చినవాడ్ని భగవంతుడు అంటారు. సృష్టికి అతీతంగా వుండే భగవంతుడ్ని 'తత్' అంటారు. అదీ! దాని గురించి చెప్పడానికేమీ లేదని బోలెడు చెప్పకున్నారు. అందుకని ఏది చెప్పినా అది కాదు అని చెప్తూంటారు. నేతి సిద్ధాంతం. అంటే న, ఇతి అని. ఇదిగా మారితే అది కాదుగా అని. కానీ, అదే ఇదిగా వుందని ఇదే అదిగా ఉందని చెప్తాడా? అదిగా వున్నపుడు నీకు తెలియదు. అదిగా వున్నపుడు ఎట్లా వుందీ అని ఒక ప్రశ్న వేసికుని ఇది కాదు, ఇది కాదు... ఇంతే కదా! అదిగా వున్నప్పడు అదిగానే వుంటుంది ఇది కాదుగా! వాళ్ళదీ intellectualism అంటే! మనది కాదు. ఎంత బాగా చెప్పకుంటారో? మనలో కూడా దాని గురించి భావం నశించి పోయి ఏ ఆలోచనా లేకుండా వుంటుందే, అప్పడూ అది మిగుల్తుంది. ఇన్ని ఆలోచనలు పుట్టే platform అది. అది లేకపోతే ఇవన్నీ పుట్టవు. పుట్టినవి అదికాదు. పుట్టిన దాంట్లో అది కాస్త వుంటుంది. అందుకని ఎక్కడ్నుండి ఇవన్ని పుడుతున్నాయో, ఆ మూల స్థానాన్ని, సృష్టిలో 'అది'గా వున్నదాన్ని 'వెలుగు' అన్నారు. దాని వెనకాల దాన్ని 'చీకటి' అన్నారు. నీలో నిన్ను నిద్ర లేపేది అది. అది ఎట్లా వుందో నీకు తెలియదు. నీకు మెలకువ తెప్పించి, నిన్ను చైతన్యవంతుడ్ని చేస్తుంది. నీకు నువ్వుగా చైతన్యవంతుడివి కాలేదు. అది చేసింది. అది లేపితే లేచిన దగ్గర్నుండీ మనం లేచాం అనుకుంటాం. మనం లేచేసరికి అది పడుకుంటుంది. మనల్ని లేపి, అది పడుకుంటుంది. ఇక అప్పడు మనం road మీద జగత్కళ్యాణ కార్యక్రమాలన్నీ పూర్తి చేసి, అలసి పోతే 'చాల్లేరా ఇక పడుకో' అంటుంది. అందులోకి వెళ్ళిపోతాం. మళ్ళీ వుత్సాహంగా మళ్ళీ లేపుతుంది. మనం ఎందుకొచ్చామో అది చేస్తామేమోనని అది లేపుతుంది. లేచినదగ్గర్నుండీ ఏవో మనం అనుకున్నవి కొన్ని చేస్తాం. కొన్ని చేద్దాం అనుకుంటూనే కాలం గడిపేస్తాం time లేదని. అదీ మన తిరగలి. మన వాళ్ళేంచేశారంటే అంత పెద్ద విషయాన్ని మనం ఇంట్లో వాడుకునే విషయాలతో పోల్చి ఇచ్చేశారు. తిరగలిలో కొంత భాగం

తిరుగుతుంది, కొంత భాగం తిరగదు, నీలో కొంత చలమైనది, కొంత భాగం అచలమైనది. మారంది కొంత ఉన్నది నీలో. మారేది కొంత ఉన్నది. మనస్సు, ఇంద్రియములు, శరీరము మారుతూ ఉంటుంది. బుద్ధి అనే వెలుగు, జీవుడు, పరతత్వము ఉంటాయి. సినిమాలో తెర మారదు. సినిమాలు మారుతూ ఉంటాయి. అట్లా ప్రతిదాంట్లో కూడా మారనిది, మారేది రెండూ కలిసి సృష్టిగా ఉంటుంది. రెండూ ఆయనే అని చెప్తారు. మారేది ఆయన కాదండీ! మారనిదే ఆయన అంటే మరి మారేది ఎక్కడి నుండి ఉంది ఆయన కాకపోతే? అది విశిష్టాద్వైతం! Actual గా దాన్ని ఇప్పుడు synthesis అని పిలుస్తున్నారు. ఏమిటయ్యా అంటే దేంట్లోనూ అది లేదనుకోవద్దు, అని చెప్పడం. మనకి చాలాసార్లు ద్వంద్వములు, రెండూ ఒకదానికొకటి వ్యతిరేకించే భావములు అక్కడే పడేస్తూ వచ్చాడు మనకి విష్ణు సహస్రనామంలో. స్థిరముగా ఉన్నదీ ఆయనే. అస్థిరముగా ఉన్నదీ ఆయనే. స్థిరముగా ఒకటుంచి, దాని చుట్టూ అస్థిరముగా ఉన్నది ఆడుతూ ఉంటుంది. Playground ఉంటుంది. Play ఉంటుంది. మళ్ళీ play లో players మారుతూ ఉండచ్చు, బంతి మారుతూ ఉండచ్చు, play స్థిరంగా ఉంటుంది. Cricket ఎప్పటి నుండి ఆడుతున్నారూ? Cricket ఆట స్థిరంగా ఉంది, ఆటగాళ్ళు మారుతున్నారు, ఆడే ప్రదేశాలు మారుతున్నాయి, బంతులు మారుతున్నాయి, batలు మారుతున్నాయి, wicketలు మారుతున్నాయి, అందులో umpireలు మారుతున్నారు. కానీ Umpire అనే principle, batsman అనే principle, bowler అనే principle, fielder అనే principle, ground అనే principle ఎప్పుడూ ఉన్నాయిగా! చూడండి principles శాశ్వతంగా ఉండి, దానికి రూపాలు కొన్ని వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. వాటినే శాశ్వత సత్యములు అన్నారు. శాశ్వత ధర్మములు అన్నారు. ఇల్లు అనేది ఒక శాశ్వతమైన principle. అది ఏర్పడుతూ ఉంటుంది, పోతూ ఉంటుంది. కానీ ఇల్లు అనే principle ఎప్పుడూ ఉంటుంది సృష్టిలో కదా! మామిడిచెట్టు, ఈ చెట్టు ఉండక పోవచ్చు. కానీ మామిడిచెట్టు అనే principle ఎప్పుడూ ఉంటుంది. అట్లా ఈ మారుతున్న దాంట్లో మారని వాడిగా, మనలో జీవుడుగా మనం శాశ్వతులం. కాలము, దేశములో మన ప్రవర్తన అశాశ్వతం. ప్రవర్తనలో ఉండే ధర్మములు, సూత్రములు మళ్ళీ శాశ్వతములు. ఆట శాశ్వతం కాదనలేం కదా! ఆటగాళ్ళు శాశ్వతం కాదు, జీవులుగా మళ్ళీ శాశ్వతులు. ఏదీ శాశ్వతం కాదండీ అంటామే తప్ప. సూత్రం శాశ్వతము. సూత్రం ప్రకారం అల్లబడింది వచ్చిపోతూ ఉంటుంది. భూమి సూత్రంగా శాశ్వతం. ఈ భూమి వెళ్ళిపోయే లోపల ఇంకో భూమి వస్తుంది. ఎట్లా? నువ్వు వెళ్ళిపోయే లోపల నీ కొడుకు నీ bedroom లోకి వచ్చినట్టు. Master bedroom లో నువ్వు ఉన్నావు, నువ్వు రాకముందు మీ అమ్మానాన్న

ఉన్నారు, నువ్వు వెళ్ళంగానే నీ కొడుకు కోడలు వస్తారు కదా! ఎప్పుడూ ఆ slots అట్లా fillup అయిపోతూ ఉంటాయి. అందుకని సూత్రములు శాశ్వతంగా ఉంటాయి, దాని మీద జరిగే అల్లిక శాశ్వతంగా ఉండదు, చీర శాశ్వతం, చీరలు శాశ్వతం కాదు. ఎన్ని చీరలైనా చిరిగిపోవచ్చు. కానీ చీర అని principle ఉంటుంది. ఎప్పటికీ ఉంటుంది. లడ్డు అనే principle శాశ్వతం, లడ్డూలు శాశ్వతం కాదండీ! ఇంకా అట్లా అర్థం చేసుకోండి ప్రతిదీనూ. నీ బుర్రలోకి రాంగానే పుడుతుంది. అంతకుముందు ఎక్కడ ఉంది అది? ఉంది. లడ్డుగా నీ బుర్రలోకి వచ్చినప్పుడు నీకు ఉంది. రాంగానే గబగబా బూందీలూ, పాకాలూ కలిపేస్తాం, అప్పుడు ఉంటాయి అవి, తినంగానే అయిపోతాయి. అయిపోయినాయా? అందుకని సత్యం తెలిసినవాడు మాట్లాడడానికే భయపడతాడు. తెలియని వాడే ఇంతసేపు మాట్లాడగలడు. లడ్డూలు అయిపోయాయి అనడానికి వీల్లేదు. తెలిసినవాడు అనలేడు. అయిపోవడమేమిటి? ఉన్నాయి, ఈ రూపంలో ప్రస్తుతానికి అయిపోయినాయి. మళ్ళీ వస్తాయి. అంతవరకు ఎక్కడుంటాయి? అంతకుముందు నామంలో ఉంటాయి. అది. శూన్యంలోంచి వస్తూంటాయి అండీ principle గా. Principle గా అచలం అండీ! అవి ఆకారాలుగా చలంగా ఏర్పడతాయండీ! అదే సాంఖ్యయోగంలో మొట్టమొదట శ్రీకృష్ణుడు చెప్పిన మొదటి తాళంచెవి. ఒరేయ్ మొత్తంలో శాశ్వతమైంది ఉంది, అశాశ్వతమైంది ఉంది, అశాశ్వతమైనది నువ్వు ఎంత ఏడ్చినా పోతూనే ఉంటుంది, నువ్వు తీసేయ్యకపోయినా ఇంకోళ్ళు తీసేస్తారు వాడిని. కాబట్టి శాశ్వతమైన దాంట్లో నువ్వు ఉండు. అశాశ్వతమైన వాటిని గురించి బాధపడక. మనకి శాశ్వతం భగవంతుడు, మిగతాదంతా అశాశ్వతం అనకూడదు. భగవంతుడు, భగవంతుని నుండి ఏర్పడిన ధర్మసూత్రములు అన్నీ కూడా ఉంటాయి శాశ్వతంగా. జీవులు కూడా ఉంటారు. వీళ్ళే మాటిమాటికీ వస్తూ ఉంటారు. వాళ్ళందరికీ numbers వేసి పంపిచారు వాళ్ళు. మనం పేర్లు పెట్టుకున్నాం కానీ వాళ్ళు numbers ఇచ్చుకున్నారు. అవేవో computers పెట్టుకున్నారు. వీడేంట్రా వందజన్మల క్రితం? అంటే తీసేస్తాడు చిత్రగుప్తుడు. చాలా sophisticated software ఉంది వాళ్ళ దగ్గర. ఏదైనా తీసెయ్యగలడు. ఎందుకని? వీడు, వాడెంత శాశ్వతుడో, సనాతనుడో వీడూ అంత సనాతనుడు. జీవుడుగా సనాతనులం. మనం ఏర్పరచుకున్న జీవితాలు మాత్రం సినిమా బొమ్మలాగా వస్తూపోతూ ఉంటాయి. అందుకని ఈ మొత్తంలో నువ్వు గనక స్థిరంలో నిలబడితే, అస్థిరాన్ని చూసి వైభవంగా భావించవచ్చు. గోదావరి ఒడ్డున కూర్చుని గోదావరి అద్భుతంగా అనుభూతి చెందవచ్చు, పిల్లగాలులు కూడా వచ్చి నీకు తగులుతూ ఉంటాయి, గోదావరిని వర్ణన చేయవచ్చు, ఎంత బావుందో చెప్పచ్చు, ఏమిటేమిటో చెప్పచ్చు.

గోదావరిలో కొట్టుకుపోతుంటే చెప్పగలవా? గోదావరిలో కొట్టుకుపోవడం అంటే చలమైన విషయాల్లో ఉండడం. వెంకటాచలం అని పేరు పెట్టుకుని చలం అని పిలుచుకుంటారు ఎంత దురదృష్టమో. అచలంగా ఉండాలని పేరు, పిలుచుకునేది చలం అని. వాడు మరీ చపలమతి అయిపోతాడు. అచలపతి అని పేరు పెట్టుకుని చలపతి అని పిలుస్తారు. అంటే వీడు master of fickle mindedness అన్నమాట చలపతి అని పిలిస్తే. వాడు అచలపతి, వాడిని చలపతి చేసేసి, వాడిని చలం అని పిలిచి, వాడిని చలపతి అని పిలిచి ఎంత కరుడుగట్టిన అజ్ఞానమో! మార్చలేము. చెప్పినా వినరు. అదేంటో పెట్టుకున్నది అది. వీడు చేస్తున్నది ఏదో? అందుకని ఈ పేరే సార్ధకనామధేయం అయిపోతుంది. అందుకని ఈ జరిగే వాటిలో శాశ్వత సూత్రములు ఉన్నాయి, వాటిని పట్టుకుని జీవిస్తూ ఉండు. అశాశ్వతమైన వాటియందు లగ్నమవక. మనస్సుతో లంకె వేసుకోక. కొన్ని పోతూనే ఉంటాయి కాలగతిలో. కొన్ని పోవు. పోనివాటిలో నువ్వుండి, పోయేవాటిని చూసి ఆనందించమన్నారు. సినిమా తెర మీద జరుగుతుంటే మనకి ఆనందంగానే ఉంటుందిగదా! మనకి జరిగితే అంత ఆనందంగా ఉండకపోవచ్చు. ఎందుకని? మనం ఇక్కడ అలా గుండ్రాయిలా కూర్చుని అక్కడ చూస్తున్నాం. మనకి జరుగుతోంది కూడా సినిమా అనుకునేవాడు, వాడి పాదాలకి మనం మొక్కాలి. అంతే కదా! ఇంకోడికి జరుగుతుంటే మనం సినిమా చూడగలం. పక్కవాడి పేదరికం మనకి సినిమా అండీ! ఆ పేదరికం మనకొస్తే? భరించలేం కదా! ఆలోచించాలి. ఆలోచించి వాడితో పాటు పేదరికం భావమయంగా మనం అనుభవించాం అనుకోండి, నీకేదన్నా కర్మలో పేదరికం ఉంటే అది పోతుంది. అటువంటి కొన్ని వైచిత్రాలు ఉన్నాయి. పక్కవాడి పేదరికం, సహవేదన అంటాం మనం, అది నువ్వు బాధ పడ్డావనుకో, అదే ప్రేమ! వాడి కష్టం నీ కష్టంగా బాధపడుతూ ఉంటే ఏం జరుగుతుందంటే, అది పంచుకున్నవాడివవుతావు, నీకు అటువంటివి రాకుండా అయిపోతుంది. ఇదో technique ఉంది. పెద్దలు ఇచ్చిన technique. ఇంకో technique ఏంటంటే సినిమాల్లో వేషాలు వెయ్యడం, నాటకాల్లో వేషాలు వెయ్యడం. కటిక పేదవాడిగా నిజంగా నువ్వు వేషం వేసి ఆ పాత్ర లో జీవించావనుకో, మళ్ళీ ధనవంతుడిగా ఒక వేషం వేసి అందులో జీవించావనుకో, రెండూ అశాశ్వతం అని నీకు తెలిసిపోతుంది. ఇట్లా వంద పాత్రలు వైవిధ్యమైనవి నువ్వు వేసి, అందులో నువ్వు జీవించగలిగితే, నీలో ఇవన్నీ జరిగి, ఇవన్నీ కాదు నేను ఒకడ్ని ఉన్నాననేది తెలుస్తుంది. నటనలో ఉండే వాడికి నటిస్తున్నాననేదొకటి జ్ఞాపకం ఉంటుంది. ఇది నిజం కాదు అనేది గుర్తుంటుంది కదా! అది తెలియడానికి నాటకం మనవాళ్ళు ప్రవేశపెట్టారు. నిజజీవితం కూడా ఒక నాటకం, అందులో నువ్వొక పాత్రధారివి, మనం మెదిలే ప్రదేశం అంతా నాటక

రంగం, మన పాత్ర పోషణ మనం ఇందులో చేయడం. ఇదంతా నాటకమే అని గుర్తు ఉండాలి అని చెప్పి, నాటకం అనే ఒక శాస్త్రాన్ని ప్రవేశపెట్టారు పెద్దవాళ్ళు. అందుకని ఆ విధంగా నాటకాలు వేస్తూ ఉంటే, అందులోంచి కూడా ఈ దృష్టి ఉన్నవాడు అత్యున్నతమైన స్థిరత్వంలోకి ప్రవేశించగలుగుతాడు. ఇంకో పద్ధతి ఏంటి? చలం లోంచి అచలం లోకి వెళ్ళడానికి, అచలమైన విషయములయందు ఆసక్తి కలిగి ఉన్నవాళ్ళు అచలమైన స్థితిలోకి వెళ్తారు. స్థిరమైన విషయములయందు ఆసక్తి పెంచుకున్నామనుకోండి, అది ధర్మం అంటారు. బ్రహ్మము, ధర్మము రెండు ఉన్నాయండీ! వేదంలో పూర్వభాగం అంతా కూడా ధర్మం గురించి చెప్తుంది. ఉత్తరభాగం అంతా బ్రహ్మం గురించి. ఈ రెండూ స్థిరమైనవి. అందుకని వేదం వేదం అని, వేదంలో ఏదో ఉంది అని మనం చాలా అనుకుని, ఏముందో తెలియదు, ఏదో ఉంది చాలా గొప్ప అనుకుంటూ ఉంటాం కదా! ఉన్నది ఈ రెండూ. అంటే broad categorization. అక్కడ సరస్వతీసూక్తం ఇచ్చారనుకోండి, it is a principle. It continues to work in creation. విష్ణుసూక్తం ఇచ్చారనుకోండి, విష్ణు అనే తత్త్వం సృష్టిలో శాశ్వతంగా పనిచేస్తూ ఉంటుంది. రుద్రసూక్తం ఇచ్చారనుకోండి, దానికి సంబంధించిన దేవతలు సృష్టిలో శాశ్వతంగా పనిచేస్తూ ఉంటారు. శాశ్వతమైన తత్త్వములు సృష్టిలో ఉన్నవన్నీ కూడా ధర్మములుగా వేదంలో ఇవ్వబడి ఉన్నాయి. అవి అట్లాగే పని చేస్తూ ఉంటాయి. అవే కాస్తో కూస్తో విభూతియోగంలో కూడా ఇచ్చారు. విభూతియోగంలో కొన్ని పడేసి, అన్నీ చెప్పనని చెప్పాడు. ఎందుకంటే time లేదు. అక్కడ war కదా! యుద్ధభూమిలో పోయి అర్జునుడు అడిగాడు నీ వైభవం చెప్పు నాకు అని. ఇతగాడేమో పని మానేసి, కూర్చుని అడుగుతున్నాడు. ఇతగాడికి తీరిక. అవతల పనుంది. అందుకని ఆయనేమన్నాడంటే అన్ని విభూతులు చెప్పలేను, కొన్ని చెప్తానంటాడు. అందులో చెప్పినవి చాలా, అతి ముఖ్యమైనవన్నీ కూడా ఈ విభూతి యోగంలో ఉన్నాయి. శాశ్వత ధర్మసూత్రములు చదువుకోండి. అట్లా ఉన్నవన్నీ కూడా మనకి వేదంలో పూర్ణంగా ఇచ్చారు. ఇవన్నీ ఎక్కడ నుండి పుట్టినాయో వాడున్నాడు కదా! వాడిని ఇచ్చారు. శూన్యం కాదు అని చెప్పి ఆయనలోంచి వచ్చేవన్నీ శాశ్వతమైన సత్యాలని చెప్పారు. ఇప్పుడు గురువున్నాడండీ! గురువు రూపం అశాశ్వతం. గురుతత్త్వం శాశ్వతం. ప్రతి దాంట్లోనూ ఇట్లా రెండు ఉంటాయి. ఒక శాశ్వత సూత్రానికి ఆధారంగా ఒక అశాశ్వతమైనది అక్కడ ఆట ఆడుతూ ఉంటుంది. దేని ఆధారంగా ఆడుతుందో దాన్ని పట్టుకోవాలి. ఒక వ్యక్తిలో గురువుగారి దర్శనం అంటే ఏమిటి? అది శరీరమా? ఉండదు. కదా! ఏమిటి ఆయనలో గురుత్త్వం? ఏది చూసి నువ్వు ఆయనలోకి ఆకర్షింపబడుతున్నావు? ఎప్పుడన్నా ఆలోచించావా? ఆలోచించవు. గురుతత్త్వం శాశ్వతం. గురురూపం శాశ్వతం కాదు. అందుకని మీరేం చెప్పినా

అందులో ఈ రెండు ఉంటాయండీ. అదే చలం-అచలం. శివుడు-పార్వతి. అర్ధనారీశ్వరతత్త్వం! ఆమె ఆడుతూ ఉంటుంది, ఆయన support ఇస్తూ ఉంటాడు. ఆమె అంటే చైతన్యము. ఆయన సత్యము. సత్యము ఆధారంగా చైతన్యము విపరీతమైన అల్లికలు చేస్తుంటుంది. చైతన్యము ఆధారంగా త్రిగుణాత్మకమైన శక్తులు పుడతాయి. అందులోంచి సృష్టి అంతా పుడుతుంది. ఇచ్ఛ, క్రియ, జ్ఞాన శక్తులు పుట్టి, చైతన్యంలోంచి మొత్తం నడుస్తుంది. మొత్తం కార్యక్రమం అంతా కూడా చైతన్యవంతులమవడమే! చైతన్యవంతులమైతే సత్యానికి దగ్గర అవుతూ ఉంటాం. అందుకని సృష్టిలో శాశ్వతమైన ధర్మములు, శాశ్వతమైన సత్యములు ఏవైతే ఉన్నాయో వాటిని నువ్వు ఆశ్రయించినట్లయితే, అందులో జీవిస్తూ, ఈ అశాశ్వతమైనది ఒక సినిమా లాగా నడిచిపోతుంటే చూసి ఆనందించగలవు. ఇంకో పద్ధతిలో ఏం వీలుపడదు. అశాశ్వతమైన దాంట్లో నువ్వు దిగావంటే కొట్టుకుపోతావు. ఇది మొత్తం కథ. దీని గురించి మనం ఎంతసేపు అయినా చెప్పుకోవచ్చు. సూత్రం ఇది. ఇది బాగా మననం చేయండి. ఏం చూసినా, అందులో శాశ్వతమైనది ఏమిటి? అశాశ్వతమైనది ఏమిటి? మనకి శాస్త్రాలన్నీ కూడా, 'నువ్వు ఏవైతే శాశ్వతం అని పట్టుకుని వేళ్ళాడుతున్నావో అవన్నీ అశాశ్వతం. నువ్వు ఏవి శాశ్వతమో వాటిని మర్చిపోయి, అశాశ్వతమైన వాటిని శాశ్వతమని భావించి వాటిని పట్టుకుని ఏడుస్తున్నావు, అందుకే ఇట్లా ఉంది నీ బతుకు' అని చెప్తూ ఉంటాయి. అందుకని మనం చేయవలసింది ఏమిటయ్యా అంటే శాశ్వతము నందు జీవిస్తూ, అశాశ్వతమును దర్శిస్తూ ఉండడం. అశాశ్వతమును నిరాకరించ వద్దు, నిరాదరణ చేయవద్దు, అది భగవంతుని యొక్క విభూతిగా తీసుకోవడమే!

## 775 అమానీ

తనకిగా తనకి ఏ రకమైన అభిమానమూ లేనివాడు. జ్ఞానవంతుడెవ్వడూ తనని తాను అభిమానించుకోడు. ఇతరులయందు అభిమానము కలిగి ఉంటాడు. గౌరవిస్తాడు. మన్నిస్తాడు. తన గురించిన భావన తన యందుండదు కాబట్టి తన గురించిన విషయము నందు గొప్ప భావములు ధరించుట అనేది అసలుండదు. పూర్ణముగా తెలిసినవాడు తన గురించి మట్లాడడు. తనుండక, అతనుంటాడు అని తెలిసి ఉండడం చేత, తన గురించి మాట్లాడుకోవడం సామాన్యంగా ఉండదు ఒకటీ, రెండవది తన మర్యాద కోసం ఎదురుచూడడు. మర్యాద ఇతరులకు తాను అందించడంలో నిమగ్నుడై ఉంటాడు తప్ప ఇతరులు తనకేం మర్యాద చేస్తారనే ఎదురు చూపుండదు. తన గురించి ప్రస్తావన ఉండదు. తనను అవతలవారు అవమానించినా కూడా మానమేలేనప్పుడు అవమానం కూడా లేదు. ఒకటి ఉంటె రెండోది ఉంటుంది. మానము గలవారికి అవమానము. ఇది భగవతత్త్వంలో ఒక ఉత్తమ గుణంగా మనం భావన చేస్తే, సాధక జనులు కూడా ఈ విషయమునందు కొంత శ్రద్ధ వహించి ఉండాలి. మనల్ని ఎవరు గౌరవించారు, ఎవరు గౌరవించలేదూ, మనకెవరూ పెద్దపీట వేశారూ, ఎవరు వేయలేదు, ఎవరు పలకరించారు, ఎవరు పలకరించలేదు ఇలా చూసుకుంటాం కదా! ఇదంతా కూడా మనమీద మనకున్న అభిమానమే! మనల్నెందుకు పలకరించాలి, మనమే ఎందుకు పలకరించకూడదూ? ఇంకొకళ్ళు మనల్ని పలకరించేంతవరకూ వేచి ఉండి, పలకరిస్తే పలకరిద్దాం అని చూడడం, పలకరించకపోతే ఈ మధ్య వీడికి చాలా పొగరెక్కింది అనుకోవడం కన్నా, తానే ముందు పలకరించడం, అది రాముని గుణాలలో ఒకటిగా చెప్తారు. ఎదుటి వ్యక్తి కన్నా ముందు తానే పలకరిస్తాడట. ఎదుటివారిని ముందు కుశలప్రశ్నలు వేయడం తప్ప, మూతి ముడుచుకు కూర్చోవడం అనేది ఉండదు. ఎదుటివాడ్ని తాను పలకరించాక, అంతకు మించిన సంభాషణ కూడా ఉండదు పెద్దవాళ్ళ దగ్గర. మిగతా అంతా ఇహవారే మాట్లాడతారు. తన్ను తాను మర్యాద చేసుకోవడం అనే పరిస్థితిలో, కలియుగంలో బోలెడు పెద్దవాళ్ళం అనుకునే వాళ్ళు, మర్యాదల కోసం సభలు ఏర్పాటి చేయించుకుంటున్నారు. వారి గురించి వారే ప్రచారం చేసుకుంటారు. వారి గురించి వారే సంభాషణ చేస్తుంటారు. తన గురించి సంభాషణ చేసేవారికి తన వ్యక్తిత్వం మీద దురభిమానం ఉన్నదని అర్థం. తాను భగవంతుని యందు నిండి ఉన్నట్లయితే, తన యందు భగవంతుడు నిండి ఉండడం చేత, తన గురించి మాట్లాడుకోవడానికి ఏమీ ఉండదు. వాని యందు మనసు లగ్నం చేస్తే వాని పరమైన మాట రావడం ఉంటుంది తప్ప, తన పరమైన మాట రాదు. తన గురించి

మాట్లాడుకుంటున్నాడు అంటే అహంకార పురుషుడు బాగా నిండి ఉన్నాడని అర్థం. తనయందు గాక ఎదుటివ్యక్తి వద్ద ఉన్న సద్గుణములను భగవత్పరంగా ప్రశంశిస్తున్నాడుట అంటే కేవలం అహంకారమునందు తను నిలబడక భగవతత్త్వము నందు నిలబడి ఉన్నట్లు. అప్పలాచార్యుల వారికి phone చేసి 'మీ గురించిన భావన వస్తున్నది, మీ వద్దకు వద్దాం అనుకుంటున్నాను చాల రోజుల నుంచి. మీ గురించిన భావము వస్తోంది' అని అంటే ఆయన 'నేనెంతో భాగ్యం చేసుకున్నాను, ఎంతో అదృష్టం చేసుకున్నాను, కాబట్టి మీ హృదయంలో నా గురించిన భావన ఏర్పడింది. నేను ధన్యుడ్ని' అన్నారు. మాలాంటి వాళ్ళకది రెండు లెంపకాయలు టపటప కొట్టినట్లుగా ఉంటుంది. ఆయనలో ఉండే దైవీ సంపత్తి కారణంగా ఆయన్ను గురించి మనం భావన చేసుకుంటున్నాం అని మనం అనుకుంటే, ఆయనేం చెప్పారూ? 'నేను ఏంతో అదృష్టం చేసుకోవడం వలన మీ హృదయంలో నేను మెదిలాను.' అని. అదా? అది లౌక్యం కాదు. ఆయనలో ఉండే దివ్యసంపత్తి అటువంటిది. కదిలిస్తే రాముడి గురించో, పరతత్త్వం గురించో మాట్లాడ్తారు తప్ప, ఆయన గురించి మాట్లాడరు, ఆయన్ని మీరు పొగడండీ, దాన్ని తిప్పితిప్పి మరో పది రెట్లు మిమ్మల్ని పొగిడి వదిలేస్తారు. ఎందుకంటే పొగడ్తలు ఆయనకిష్టం ఉండదు. తన గురించి తను వినడం కూడా ఇష్టం లేదు. అలాగే మస్టరుగారు కూడా తన గురించి మట్లాడుకోలేదు. అందుకే ఎవరికీ తెలియలేదు. చెప్పకుంటే గానీ తెలియని పరిస్థితి ఉన్నచోట, ఆయన గురించి అడిగితే, 'నా గురించి ఎందుకులేరా, ఏదన్నా పనిచేసుకుందాం.' అనేవారు. 'నేనెవరైతే నీకేం ఒరుగుతుంది. నేను ఫలానావాడిని అని చెప్తే అది నువ్వు కేవలం సమాచారంగా నువ్వు పదిమందికి చెప్పటానికి తప్ప ఏమన్నా పనికొస్తుందా? నేను నేనే. నువ్వు కూడా నేనే. నేను నేనుగా ఉండడం నేర్చుకో. నేను నాగురించి ఎప్పుడూ ఆలోచించను, నువ్వు అలాగే నీ గురించి ఆలోచించక, ఇతరుల శ్రేయస్సు గురించి ఆలోచించు' అని చెప్పేవారు. తన గురించి ఆలోచించే వాడికి మనావమానములుంటాయి. దుర్యోధనుడు తన గురించి చాలా ఎక్కువ ఆలోచిస్తాడు. కాబట్టి దురభిమాని. అది కారణం చేత అవమానాలు పొందడం ఉంటుంది. భక్తులకి అమానీ అనే గుణం చాలా అవసరమైనది. తన గురించి చెప్పక తను చేయవలసినది చేస్తుండడమే! ఏ భాగవతమూర్తిని చూసినా సరే, తను భగవంతుని యందుండడం చేత, భగవంతుడు తన నుండి జగత్కళ్యాణమైన కార్యములు నిర్వర్తిస్తూంటే, తాను సాక్షీభూతుడుగా ఉంటాడు తప్ప ఆయనతో పాటు తన చిత్రపటాన్ని promote చేసుకోడు. వృద్ధి పొందించడు. 'నేనెందుకు? ఆయన్ని పెట్టుకోండి. నీ హృదయములో ఆయనుండాలి తప్ప నేనుండడం కాదు. అందరిలో నేనుగా ఉన్నవాడి యందు ఎక్కువగా నిలబడి ఉండు' అని చెప్పేట్లుగా

ఉంటారు. అవమానములు వారికి అవమానములు కానేకావు. విష్ణుమూర్తి రకరకాల అవతారాలు ఎత్తాడు. పంది, చేప ఇలాంటి అవతారాలు, మనకి వీలు పడే విషయము కాదు. వామనుడు గా అడుక్కున్నాడుట, రాముడిగా ఎన్ని అవమానాలైనా స్వీకరించాడు. ఇంత చక్రవర్తి కుమారుణ్ణి, ఇలా నేను నేల మీద పడుకోవడం ఏమిటి? అనుకోలేదు. తన గురించిన భావన ఎప్పుడూ చెప్పనేలేదు. హనుమంతుడు రాముడి గురించి అడిగితే లక్ష్మణుడు చెప్తాడు తప్ప, రాముడు ఏమీ చెప్పడు. రాముడు తన గురించి మాట్లాడింది రామాయణంలో ఎక్కడా ఉండదు. నేనింతటివాడిని, నేనంతటివాడిని అని మాట్లాడేవారు, తెలిసినవారు కాదు. హనుమంతుడు తన గురించి తను ఎన్నడూ మాట్లాడడు. ఇట్లా తమ గురించి మాట్లాడక ఇతరుల శ్రేయస్సు గురించి భావన చేస్తుండేవారే మార్గంలో ఎక్కువగా ఉండే వీలు ఉంటుంది. మనం మామూలుగా సాధన చేస్తున్నప్పుడు, బస్కీలు తీసేవారు ఏ విధంగా కండలు పెరిగాయో లేదో చూసుకుంటారో అలాగ, మనం ఏ మాత్రం పెరిగిఉంటాం, మాస్టరుగారికి ఏమాత్రం దగ్గరయ్యి ఉంటాం, మన కెప్పుడు పరమగురువులు కనిపిస్తారు, విభూతులు ఎప్పుడు ? .... ఇలా అంతా మనం చుట్టూనే అల్లుకుంటూ ఉంటాం, మాట్లాడతాం. ఎవరితో అయినా మాట్లాడినప్పుడు గమనించండి, ఒక ఐదారుమాటలు అయిన తర్వాత తమ గురించి ఎక్కువ మాట్లాడటం మొదలు పెడ్తారు. అప్పుడు వారిని వదిలేసి వాసుదేవుణ్ణి వినడమే. లేదా వేరే పనుంది, వస్తామని చెప్పి వెళ్ళిపోవాలి. పనిలేదనుకోండి. ఇక వేరే సినిమా అక్కరలేదు మనకి, వీడే సినిమా మనకి. ఏదో మాట్లాడుతూ ఉంటాడు. వింటూ ఉండవచ్చు. ఈ లోపల మనకి కండూతి ఏమి వస్తుందంటే, మన గురించి కూడా మనం కొంచెం మాట్లాడుకుందాం అనిపిస్తుంది. వీడిన్ని చెప్తుంటే, మనం మాత్రం చెప్పకూడదా? మన పురాణం కూడా వినిపిద్దాం అనుకుంటాం. వాడి పురాణం మీద మనకి ఎలా శ్రద్ధలేదో, మన పురాణం మీద వాడికీ అలాగే శ్రద్ధ ఉండదు. నువ్వొకటి చెప్తే వాడు రెండు చెప్తాడు. లౌకిక ప్రపంచంలో పెద్ద కళ్యాణగుణంగా వృద్ధిపొందడానికి చెప్పదేమంటే, నిన్ను నువ్వు చెప్పకోకపోతే ఎవరూ నిన్ను గుర్తించరు అని. అమెరికా లో వాళ్ళు 'you have to sell yourself' అంటారు. నిన్ను అమ్ముకుంటే తప్ప నీకు రావలసింది రాదు. లౌకిక ప్రపంచంలో అది సత్యం. లౌకికమైన ప్రపంచములో నువ్వు మంచి చొక్కా లాగు వేసుకుని, చక్కగా సంస్కరించబడినట్టి శిరోజములు నుండి పాదములకు వేసుకున్న బూట్ల వరకు, వీటికే విలువ. వేషమునకే విలువ ఈ ప్రపంచములో. ప్రపంచంలో బ్రతుకుదాం అనుకున్నప్పుడు నువ్వు ఆ విలువలతో పెరగాలి. లేదా నిన్ను ఎవరూ గుర్తించరు. ఈశ్వర్ చంద్రవిద్యాసాగర్ అంతటి జ్ఞాని, తత్త్వవేత్త, సమస్తమూ తెలిసున్నవాడు, సాదా సీదా దుస్తులతో సభకి వెళ్తే ఎవరూ గుర్తించలేదు, లోపలకి

కూడా రానీయలేదు. సూటూ, బూటూ, hat, వేసుకుని వెళ్తే, ఇది కదా మనం గుర్తిస్తాము. అంతా మనం వేషానికే మోసపోతాం. కాషాయం వేసుకుంటే కొంత వ్యాపారం చేసుకోవచ్చు. కాషాయం వేసుకుని గెడ్డం పెంచుకుంటే! ఎక్కువమందికి నీ లోపల ఏముందో తెలీదు కాబట్టి, అదో మాదిరిగా పైకి దిక్కు లేని చూపులు చూస్తూ, ఆశీర్వదిస్తూ, మౌనంగా ఉంటే పక్కన ఒకడు కూర్చుని మౌనస్వామి, ఆయనేం మాట్లాడరు, అంటాడు. ఎందుకంటే ఆయనకేమీ తెలీదుగా. వచ్చినవాళ్ళకి జరిగేవి జరుగుతూ ఉంటాయి. ఆశీర్వదించి కుంకుమో, విభూదో ఇచ్చామనుకోండి. Law of Probability అని కొంతమందికి జరుగుతాయి, కొంతమందికి జరగదు. జరిగింది మన account లో పడిపోతూ ఉంటుంది, జరగనిది వాడి కర్మ account లో పడిపోతుంది. జరిగితే ఆయన అనుగ్రహం, జరగకపోతే మనం కర్మ అనుకుంటాము కదా. మౌనంగా ఉంటూనే ఓ 10 సంవత్సరాలలో ఓ పెద్ద సంస్థానాన్ని నిర్మాణం చేయవచ్చు. అది లౌక్యం. రూపం చెల్లుబాటు అవుతుంది. రూపం లోపల ఏముందో ఎవరికీ తెలియదు కదా! మేడిపండు చూడ మేలిమై ఉండును అన్నమాట. ఇహ మాటకారివి కూడా అయ్యావా? ఇంకా బలం వచ్చినట్లే! రూపవంతుడవై, మాటకారివై ఉంటే దాదాపు జయించేసినట్లే. ఆ పైన కాస్తో, కూస్తో, తెలివి ఉంటే బాగా అమ్ముడుపోవచ్చు. అమ్ముడుపోవడం వలన, చాలా సంపాదించవచ్చు. ఇది లౌకికం. ఆధ్యాత్మికం దీనికి తలక్రిందులుగా ఉంటుంది. తన గురించిన భావన తనకే ఉండకూడదుట. నీ గురించిన భావన నీకు ఉంటే నీవు astral plane లో ఉన్నావని చెప్తారు పెద్దవాళ్ళు, అంటే కామమయకోశములో అభిమానమయమైన భావము నీలో పెరిగి అహంకారాన్ని పెంచి, నువ్వు చాలా గొప్పవాడివనే భావనలో నిన్ను నువ్వు ఇముడ్చుకుని, ఎవరన్నా పొగడకపోతే బాధపడే పరిస్థితికి వస్తుంది. ప్రశంసలకీ, పాద నమస్కారాలకీ, పూలదండలకీ, పళ్ళకీ, డబ్బులకీ అలవాటు పడ్డవాడికి ఓ రోజు ఇవ్వకపోతే బాధగా ఉండదూ? రోజూ దండవేస్తున్నవారు ఓ రోజు వేయకపోతే కోపం రాకూడదు అనే పరిస్థితి ఏమీ లేదు. మానవమేధస్సులో ఎన్నెన్ని పొరలు, ఎన్నెన్ని బాధలు ఉంటాయో మనకి తెలీదు. పదిమంది దణ్ణం పెట్టి, ఒకడు దణ్ణం పెట్టకపోతే ఆ దణ్ణం పెట్టనివాడ్నే ఎక్కువ గుర్తు పెట్టుకుంటారు దణ్ణం పెట్టినవాడికన్నా. ఎందుకంటే వాడు పెట్టలేదు చూద్దాం అన్నట్టుగ. మన మనస్సు చాలా చిత్రమైనది. షిరిడీసాయి సినిమా చూశారు కదా! అందులో పిచ్చివాడుగా ఉండే నానావళి. షిరిడీసాయి మొట్టమొదట ఊళ్ళోకి వచ్చినప్పుడు ముందు అతనే గుర్తిస్తాడు . మహాత్ముడని వాళ్ళూ, వీళ్ళూ ఆయన్ని ఏదో చేయబోతే 'డొక్క చీరేస్తాను ఆయన్ని ముట్టుకుంటే' అని అంటాడు. ఆ తరువాత క్రమశః పామరజనులు షిరిడీసాయిలో భగవంతుడ్ని చూడడం మొదలు పెట్టారు. పనులు

అవుతుంటే మనం భగవంతుడ్ని చూస్తాం. పనులు కాకపోతే చూడము కదా! పనులు అవడంతో అంతకుముందు అసలు పట్టించుకోనివారు గురువుగారికి కుర్చీ వేసేవారు, కాళ్ళు కడిగేవారు, గంధం రాసేవారు, ధూపం వేసేవారు, హారతులిచ్చేవారు ఇలా తయరయ్యారు. మూడు నాలుగేళ్ళల్లో బాగా పెరిగిపోయారు. పెరిగిపోగానే ఇలా వీరంతా ఓ రోజున పెద్ద పెట్టున పూజా కార్యక్రమం పెట్టుకుంటే, నానావళి వచ్చి 'లేరా అక్కడి నుండి' అన్నాడు. భక్తులకది సహించరానిదిగా ఉంటుంది. షిరిడీ బాబా లేస్తాడు. ఈయన కోసం అలంకరించిన ఆసనం మీద ఆయన కూర్చుంటాడు. కాలుమీద కాలు వేసుకుని, అందరినీ చూసి 'ప్రపంచం ఎలా ఉంది' అని బాబాని అడుగుతాడు. షిరిడీ బాబా నవ్వి 'ఎప్పట్లాగానే ఉంది. గాలి వీస్తూనే ఉంది, నీరు దాహం తీరుస్తూనే ఉంది, అగ్ని తేజస్సు కలిగిస్తునే ఉంది. భూమి తిరుగుతూనే ఉంది. పంచభూతాలూ వాటి కార్యక్రమం అవి చేస్తున్నాయి. అప్పటికి, ఇప్పటికీ తేడా ఏముంది? ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది' అని చెప్పాడు. అప్పుడు నానావళి కుర్చీలోంచి లేచి, ఆయన్ని కూర్చోమని వెళ్ళిపోతాడు. భక్తులంతా ఈ నానావళి చాలా అపచారం చేశాడు. ఇలా ఊరుకోవడం బాగోలేదనీ, బాబాని, 'ఏంటిది? మీరిలాంటి nonsense ని ఎలా అంగీకరిస్తున్నారు' అని అడిగితే అంటే ఆయన నవ్వి nonsense కాదు చాలా sense ఉన్నది, నాలో మీరు చేసే ఈ పూజలకీ, దానికీ కాస్తో కూస్తో వ్యామోహమో, ఆసక్తో, అనురక్తో, నా గురించిన భావమో ఇలాటివాటి యందు పెరుగుదల ఎమన్నా కలిగిందేమో చూద్దాం అని వచ్చాడు. నేనెంతటి వాడినో అతడంతటి వాడు. అతడు దేనికీ లొంగడు. అతడి తత్త్వం అది. ఏదో నలుగురికి లొంగి మీరడిగితే చేయకుండా ఉండలేని స్థితి నాది. అతని పద్ధతి అది. నా పద్ధతి ఇది. అతన్ని తక్కువగా అంచనా వేయకండి అని చెప్తాడు. ఆయన గనక అలా చెప్పగలిగారు. అందరూ చెప్పలేరు కదా! మన గురువుగారికి సన్మానం జరుగుతుంటే గభాల్న ఎవరో వచ్చి ఇలా చేస్తే, మన గురువుగారికే ఇలా అయితే మనకి ఎలా ఉంటుంది చెప్పండి? ఎక్కడన్నా గురువు గారికి సన్మానం చేద్దామనుకుంటే ఇలా శిష్యుల సంగతలా ఉంచితే, గురువుగారి చేతన యందు ఏమన్నా తేడా పడుతుందా అని చూస్తే 100 కి 99 సన్నివేశాల్లో తేడా పడుతుంది. అంతవరకెందుకు? తమ బొంద తమ కేం తెలుసు అన్నారనుకోండి. అంటే అనచ్చు. మన వాసుదేవుడు ఎవరినైనా ఏడిపించగలడు. అలాంటప్పుడు 'అవును' అనగలిగి ఉండాలి. తనకిగా తనకి అభిమానం లేదు. సిగ్గు లేదు. ఎందుకు? తన గురించిన భావమే లేదు కనుక. వశిష్ఠుడలా ఉన్నాడు. విశ్వామిత్రుడు తెగబడి ఎలా పడితే అలా మాట్లాడుతుంటే వింటూ ఉన్నాడు. వాళ్ళలో ఉండే వాసుదేవుణ్ణి చూడటం తప్ప నేనెంతటివాడినో చూపిస్తాను, అని చెప్పి చేయడం ఉండదు. అభిమానం

ఉన్నవాళ్ళు అలా చేయలేరు. భగవంతుని యొక్క అత్యంత అద్భుతము, ఆశ్చర్యకరమైన ఒక కళ్యాణగుణం అమానీ! దులిపేసుకుని పోతాడు. కృష్ణుణ్ణి ఎంతోమంది ఎన్నో రకాలుగా అంటూండేవారు, నవ్వుతూండేవాడు వాళ్ళకేమీ తెలీదని. ఇది చాలా కష్టమైన సాధన. కానీ వినయం కావాలన్నా, నిరహంకారులం అవ్వాలన్నా ఇటువంటి సన్నివేశాలు కొన్ని జరగక తప్పదు. జరిగినప్పుడు మనయొక్క స్థితి మనకి తెలుస్తుంది. మనం అనుకుంటాం, మనం చాలా ఉత్తమంగా సాధన చేసుకుంటున్నాం, చాలా ముందుకు వెళ్ళిపోతున్నాం, రేపో మాపో పరమగురువులు కనిపిస్తారు అన్నట్లుంటుంది. పాపం మిగతావాళ్ళు చేసుకోలేకపోతున్నారు ఏం లాభం? అని మాట్లాడుకుంటామే, ఎవరో వచ్చి మనల్ని బండబూతులు తిట్టి వెళ్ళారనుకోండి. ఎలా ఉంటుందీ? మా అమ్మగారి నాన్నగారు, మూడు కోట్లు రామనామం రాశారు. ఒకావిడ ఒక్కోసారి వచ్చి అదేపనిగా తిట్టి వెళ్తుండేది, ఓ program గా. ఎవరూ అంటే ఆయన వదినగారు. విధవస్త్రీ. ఆమెకీ, ఆమె కుటుంబానికీ చేయవలసినదంతా చేశారు. తన కొడుకుని కూడా దత్తత ఇచ్చారు. అయినా ఆమెకి తిట్టడం ఒక సరదా. పైగా ఈ మరిదిని చూస్తే తిట్టడానికి ముచ్చటేస్తుంది. నాకు అప్పటికి 15, 16 సంవత్సరాలు. ఆయనకి 70 సంవత్సరాలు. కుర్చీలో కూర్చుని రామనామం రాసుకుంటూంటే, ఆవిడ బయట తలుపు కొట్టేది. తలుపు తీసేవారెవరో. లోపలికి వచ్చి తిట్టినతిట్టు తిట్టకుండా ఓ 45 నిమిషాలు తిట్టేది. ఈయన కళ్ళు మూసుకుని అన్నీ వినేవారు. రామ, రామ అనుకునేవారు. రాముడే తిడుతున్నాడు, ఏదో కొంత కర్మక్షాళనం అయిపోతోందిలే అని. ఏమిటి తాతయ్యా ఇది అంటే, ఇది నా జీవితంలో ఒక భాగం నాన్నా, అని చెప్పారు. అలాగే ఎవరో ఒకాయన వచ్చి జ్ఞానం గురించి మాట్లాడుతూంటే, నాకు తెలుసు అలా కాదు ఇలా ఉంటుందని చెప్పారీయన. మీకు చాలా పొగరు, అందుకే మీరు నేను చెప్పింది కాదన్నారు, అన్నాడాయన. అంతే ఈయన మౌనం. ఇలాంటివన్నీ రోషం ఉండేవాళ్ళకి చాలా కష్టం. రోషం లేకపోవడం ఒక కల్యాణ గుణంగా, దైవీగుణంగా చెప్తున్నారు. ఆయనకి అసలు లేదుట. మనకది ఎంత తక్కువ ఉంటే అంత మంచిది. మనం చేయవలసిన పని యందు మనకి శ్రద్ధతప్ప, ఇహ మిగతావాటియందు ఉండకూడదు. మనల్ని ఓ రోజు ఒకడి పొగిడే, రెండో రోజు ఇంకోడు తిడతాడని కూడ గుర్తుండాలి. పొగడ్త ఉన్నచోట నింద ఉంటుంది. పొగడ్తలు వినడానికి అలవాటు పడ్డవాడు. నిందలు వినడానికి కూడా అలవాటు పడాలి. పది మంది పొగిడితే, ఒకడు 'ఆ నాకు తెలుసులెండి, ఆయన గురించి' అంటాడు. అందుకనీ పొగడ్తలు గానీ, నిందలు గానీ రెండూ మనకి సంబంధించినవి కావు. అవమానములు కానీ ప్రశంసలు గానీ శరీరమునకే గానీ తనకు కాదనుకునే స్థితి ఒకటి ఉన్నది. మానావమానములు

శరీరమునకే గాని తనకు కాదనే ఒక వాక్యమున్నది. తాను ఎవరు? అతడి ప్రతినిధి, ప్రతీక. అంటే తన గురించిన భావాలన్నీ తను ఏర్పరచుకున్న అభిమాన కోశం. దాన్నే glamour అంటారు. తన గురించిన భావం తనలో ఎంత పెంపొందితే అంతవరకూ తనలో దేవుడు ఉండడానికి వీలు ఉండదు. ఇదొక రహస్యం. మన గురించి, ఇతరుల గురించి భావన చేస్తుంటే, దేవుడి గురించిన భావం ఏముంది? దైవం గురించి భావం చేస్తున్నప్పుడు దైవంతో ఉండడం వేరు. ఏ భావం లేనప్పుడు ఇతరుల గురించో, తమ గురించో భావన వస్తే కాలం వృథా అయినట్లు. ఆ సమయములో దైవమునందే ఉండవచ్చు కదా! ఉంటే ప్రపంచంతో నైనా లేదా దైవంతోటైనా ఉండాలి. ఈ మధ్యలో నీ గురించి నువ్వు ఆలోచించుకుంటూ కూర్చుంటే లుంగలు చుట్టుకుపోయి ఇహ బయటికి రాలేవు. People who always think about themselves, depression లోకి వెళ్తుంటారు. వాళ్ళకి జరిగిన చెడూ, అపాయాలూ, వైఫల్యాలూ ఇలా తన గురించిన భావాలతో depression లోకి వెళ్ళిపోతుంటారు. లేదూ తన గురించి, తను పొందిన సన్మానాలూ, కీర్తి, జయాలూ వీటి గురించి భావనలు చేసుకుంటూ పొగరుమోతుగా తయారైపోతారు. అందుకనీ భావాన్ని వినియోగించు కోవడంలో ఒక తెలివున్నది. అది వినియోగిస్తే ప్రపంచం కోసం వినియోగించు, లేదా దైవం యందు లగ్నం చేసి ఉంచు. మధ్యలో నీ గురించి పెట్టబోకు ఒక కొట్టు! నీకు చాతనైతే ఇతరులను గౌరవించు. నీవు గౌరవం కోరక. అదీ మానదో!

## 776 మానదో

భగవంతుడు మర్యాద చేసినట్లు ఎవ్వరూ చేయరుట. కృష్ణుడు కుచేలుడికి అలా మర్యాద చేశాడు. రాముడు అలా ఎంతమందికో మర్యాద చేశాడు. సౌశీల్యం రాముడికి ప్రథమ గుణంగా చెప్తారు. ఎందుకంటే తనకంటే తెలివి, బుద్ధి, సౌందర్యం, ధనము, పుట్టుక వేటిలోనూ ఆధిక్యత లేనివారిని, తనతో ఎందులోనూ పోల్చదగనివారినందరినీ కూడా, తన హృదయంతో ఆదరించి, ప్రేమించి తనతో సమానంగా చూసుకున్నాడు. తనకన్నా తక్కువవారిని తనతో సమానంగా చూసుకున్నాడు_ _ _ మానదో! అంటే మానదః! ఇతరులకు మానాన్ని ఇస్తాడుట. గుహుడ్ని కౌగలించుకొని, పెద్దవాడిని చేశాడు. గుహుడు ఎట్లా చూసినా రామునితో సరిపోలనివాడు. శబరిని మన్నించాడు. సుగ్రీవుడ్ని, విభీషణుడ్ని, జటాయువునీ మన్నించాడు. అసలు వీరంతా ఈయనకి ఆమడ దూరంలో ఉండాలి. ఈ విషయంలో నాకు మాస్టరుగారు బాగా గుర్తుకు వస్తారు. ఆయనకి ఒక 100 మైళ్ళదూరంలో ఉండవలసిన వాళ్ళని, నెత్తిమీద పెట్టుకున్నారు. వాళ్ళు ఎక్కి తెగ తొక్కారు. ఆయన ఏమిటో వాళ్ళకి తెలియలేదు. అదీ ఆయన సౌశీల్యం, తనకన్నా తక్కువ వారిని, తనతో సమానంగా ఆదరించి, ప్రేమించీ, వాళ్ళకి మర్యాద కలిగించి చూసేసరికి వారికి మదం ఎక్కింది. కృష్ణుడి విషయంలోనూ అలాగే జరిగింది. తనతో ఉన్నవారిని మన్నిస్తే, గురువుగారు తనని మన్నించారంటే అబ్బో, మనం ఎంతటివాళ్ళం అనుకుంటాం కదా! నెనెంతటివాడిని కాకపోతే మా ఇంట్లో గురువుగారు ఇన్నాళ్ళున్నారు అనుకోవడం ఉంటుందా? ఆయన అనుగ్రహం వలన ఆయన మా ఇంట్లో ఉన్నారనుకోవడం ఉంటుందా? మనకి భాగవతములో ఒక పద్యము ఉంటుంది.

నా యింటికి విచ్చేయుము, నీ యంఘ్రిసరోజ రేణునికరము సోకన్,
నా ఇల్లు పవిత్రం బగు శ్రీయుత నీ భటునిం బెద్దన్ చేయంగదే.

ఎందుకు రమ్మంటాడు అంటే తన ఇంటికీ, తన ఇల్లు పవిత్రము చేసేందుకు మరియు అతడిని పెద్ద వాడిని చేయడానికిట! భగవంతుడు ఎప్పుడు భగవత్భక్తులని పెద్ద వాళ్ళని చేస్తూ ఉంటాడట. పెద్దవాడ్ని చేసేకొద్దీ వీడు పెద్దవాడు కాకుండా ఉండాలి. అదీ సద్భక్తుని లక్షణం. పెరిగేకొద్దీ వినయం పెరగాలి. తన నుండీ విజయవంతమైన, శ్రేయోదాకమైన కార్యములు నిర్వర్తింపబడే కొలదీ తను ఎక్కువ వినయవంతుడవ్వాలి. విద్య వచ్చే కొద్దీ వినయం పెరగాలి. తననుండీ విజయవంతమైన శ్రేయోదాయకమైన కార్యములు నిర్వర్తింపబడే కొలదీ తను ఎక్కువ వినయవంతుడవ్వాలి. విద్య వచ్చే కొద్దీ వినయం పెరగాలి. తన యందు అభిరుచి ఉన్నవాడు, తన పరంగా కార్యాలు చేసేవాడు, తనకి సమర్పణ చెంది

జీవించేవాడు, అలాంటి వాళ్ళ యొక్క మానాన్ని విపరీతంగా పెంచుతుంటాడుట. పెంచేకొలదీ వాళ్ళు ఆయన యందు ఉండాలి. ఆయన వలె అమానీ గా ఉండాలి. అంతేగానీ పెంచేకొద్దీ ఉబ్బిపోయాము అనుకోండి, baloon కి సూదితో గుచ్చినట్లు అయిపోతుంది. మనం చాలా చిన్నవాళ్ళం అని గుర్తుపెట్టుకోవాలి. ఏదో పూర్వపుణ్యవశానో, భగవదనుగ్రమువలననో, గురువనుగ్రహం వలననో గురువు చెప్పిన మార్గంలో నడవడానికి వీలుపడ్డదనుకోవాలి. అంతేగానీ మన సమర్ధత వల్ల అనుకోకూడదు. నీ పురుషప్రయత్నం నువ్వు పై కొస్తున్నావని అటు ఆయనంటే, నాయనా మీ అనుగ్రహం వల్ల నేను పెరుగుతున్నాను అని నువ్వనాలి. అనడం లౌక్యంగా కాదు. అది సత్యం అని నమ్మాలి. లౌక్యంగా చుట్టూ బోలెడు అంటారు. నాకు phone లు వస్తుంటాయి. మీ పాదాలకు నమస్కరించి ఫలానా వాడిని మాట్లాడుతున్నానని. వీడు మన భక్తుడనుకోకూడదు. ఎక్కడికక్కడ వాసుదేవుని లీలలు చాలా అద్భుతంగా ఉంటాయి.

## ౭౭౭ మాన్యః

ఈ విషయంలో బాగా ఆలోచించాలి. మనం రాగానే తలుపు తీసి కారు ఎక్కించారనుకోండి. ముందు మనం ఇంకోడికి తలుపు తీయడానికి ప్రయత్నించాలి. మనం కారు దగ్గరకి వచ్చి నిల్చొని, అటు ఇటు చూసి, ఎవరైనా కారు door తీస్తారా అని చూస్తే, ఇవన్నీ చాల అభిమానికి ఉండే లక్షణాలు. నేను, మాస్టారు కలిసి ప్రయాణం చేసే రోజుల్లో, బండి ఆగగానే నా పెట్టె, ఆయన పెట్టె రెండూ ముందు ఆయనే పట్టుకునేవారు. మనం అయితే పెట్టె అక్కడుంది అంటాం, receive చేసుకోవడానికి వచ్చినవాళ్ళని. అప్పుడు ఏమిటి అవుతుందంటే, వాళ్ళని కూలీలుగా వాడుకోవడం అవుతుంది. నమ్రత ఉంటే 'కూలిని పెట్టుకుందాం' అని చెప్పాలి. నీ ప్రయత్నం నువ్వు సాగిస్తుండాలి. వాళ్ళ స్ఫూర్తితో వాళ్ళు చేస్తే చేయవచ్చు. నువ్వు దానికి అలవాటు పడకూడదు. పొగడ్తకు లొంగనివాడు ప్రపంచంలో ఎవరూ లేరండీ. Even Ceaser falls for flattery అని ఓ సామెత కూడ ఉన్నది. దేనికీ లొంగని రోమను చక్రవర్తి పొగడ్తకు లొంగుతాడట. మన దగ్గరకి వచ్చి పనులు చేయించుకునేవారంతా మనల్ని పొగిడి పనులు చేయించుకుంటారు. మనకన్నా వెర్రివాళ్ళు ఎవ్వరూ లేరు. ప్రతి వాళ్లకి ఇంకొకళ్ళు పొగిడినప్పుడు వాడు చాలా మంచివాడుగా వీడికి కన్పిస్తుంటుంది. వాడికి పనున్నంతకాలం పొగిడి ఆ పనైపోయాకా ఇంక పొగడడు. అది లోకరీతి. పనైపోయాకా కనపడతాడు అనుకోవడం నీ అవివేకం తప్ప పనికోసమే వాడు వస్తుంటాడు. నువ్వీలోగా వాడితో పొగిడించుకోవడానికి అలవాటు పడిపోతావు. ఈ పొగుడుతున్నవాడి రూపంలో భగవంతుడు పొగుడుతున్నాడు. అది కూడా మానదః అనే నామానికి అర్థం. ఈ పొగిడేవాడి రూపంలో వాడే ఉన్నాడని గుర్తుపెట్టుకో. వాడు పొగుడుతూ ఉంటాడు. మనం జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది, పొగిడితే వరాలు యిచ్చేస్తారు. ఇచ్చి ఇరుక్కుంటారు. ఎన్ని కథలు ఉన్నాయి మనకి ? అందుకని పొగడ్తల విషయంలో భగవంతుడి యొక్క తత్త్వం ఎలా ఉందో ఈ రెండునామాల్లో కనిపిస్తుంది. నిన్ను నువ్వు పొగుడుకోక. అది మొదటి విషయం. ఇంకొకడిని నింద చేయక, పొగుడు. ఆ పొగడ్తలో సత్యం ఉండాలి. ఊర్కే పొగడడం కాదు. పొగిడి, వాడిలో నువ్వు భగవంతుణ్ణి చూడు. నువ్వు ఇతరులలోని కళ్యాణగుణములను పొగుడుతూ ఉండు. నీకై పొగడ్తలకోసం, మర్యాదలకోసం, ఎదురుతెన్నులు చూడడం అనే ఒక అభ్యాసం స్వభావంలోంచి తీసెయ్యాలి. అంటే ఇతరులలోని కళ్యాణగుణాలు చూసి నిజంగా ప్రశంసించు. అలాగే నిన్నెవరైనా ప్రశంసిస్తూంటే మౌనం వహించాలి. నువ్వు కూడా ఇంక నాలుగు కలిపి చెప్పకోకూడదు. ఈ రెండూ చేసేవాడిని మాన్యః

గౌరవింపబడతాడు. భగవంతుడు గౌరవింపబడడానికి కారణాలు ఎన్నుంటాయియా? తన్ను తాను గౌరవించుకోడు. తాను ధర్మమునందు ప్రవర్తించేవారిని గౌరవిస్తూ ఉంటాడు. శ్రీకృష్ణుడు ధర్మాన్ని అనుసరించే ప్రతి బ్రాహ్మణుడి కాళ్ళు కడిగేవాడు. మీ కారణంగానే ధర్మం ఇంకా ఇలా నిలచి ఉంది, అని ఒక మాట కూడా అనేవాడు. అది సత్యం. సత్యం అయినా కడుగుతున్నవారిలో దేవుణ్ణి చూడాలి. 'నీలో దేవుణ్ణి చూసి వాడు దణ్ణం పెడుతూంటే దణ్ణం పెట్టేవాడిలో వాసుదేవుడ్ని నువ్వు చూడకపోతే నీ వీపు పెట్లిపోతుంది' అని చెప్పేవారు మాస్టరుగారు. నీలో దైవానికి వాడు దణ్ణం పెడుతున్నాడు. నీలో దైవాన్ని ఎలా చూస్తున్నాడో నువ్వు చేసే పనులను బట్టీ, చెప్పే మాటలను బట్టీ, నీలో దైవత్వం ఉన్నదని దణ్ణం పెడుతున్నాడు. కనక దణ్ణం ఎవరికి పెడుతున్నారు? నీలో ఉండే దైవానికి! పనికోసం దణ్ణం పెడితే నీలో పనిచేసిపెట్టే స్థోమత రూపంలో భగవంతుడున్నాడన్న మాట. Officer గా ఉన్నంతసేపే కదా దణ్ణం పెడతారు. Retire అయ్యాక పెడతారా? పెట్టరు కదా! అంటే దేనికి ఇన్నాళ్ళు దణ్ణం పెట్టారు? అతడికి ఉండే అధికారానికి! అధికారం అంటే విష్ణువే! 'నా విష్ణుః పృథ్వీ పతిః'. గుర్తు పెట్టుకోండి, రాజ్యాధికారం గానీ, ప్రభుత్వాధికారం కానీ, ఎవరిని వరించినా వారిలో ఆ అధికారంగా విష్ణువు అక్కడ నిలచి ఉన్నాడు. అందుకని విష్ణువుకి దణ్ణం పెట్టుకుంటున్నాం అనుకుంటూ, దణ్ణం పెట్టుకోవచ్చు. సృష్టిని పరిపాలించేవాడు విష్ణువే కాబట్టి, ఎక్కడ అధికారం ఉంటుందో అక్కడ అతని రూపంలో ఉన్నది కాబట్టి, అలా వాడికి దణ్ణం పెడితే వాడు ప్రసన్నుడు అవుతాడు. దైవము ఎట్లాగ ప్రసన్నుడు అవుతాడు, పూజారి అడ్డు పడకుండ ఉంటె వీలుబడుతుంది. ఇందులో ఎంత తత్త్వం ఉన్నదో అంత లౌక్యం కూడా ఉన్నది. అది త్రికరణ శుద్ధిగా చేస్తే అది చాలా ఆనందాన్ని, తృప్తినీ ఇస్తుంది. ఇలా తనని మన్నించుకొనక ఇతరులను సంపూర్ణంగా మన్నించేవారు ఎవరుంటారో వారు లోకముచే మన్నింపబడతారు. మాన్యులు అంటే వారు ! శ్రీకృష్ణుడు అట్లా అందరినీ మన్నించాడు. ధర్మరాజునీ, భీష్మణ్ణి, ద్రోణుణ్ణి, ధృతరాష్ట్రుడ్నీ ఇలా అందరి పెద్దవాళ్ళనీ మన్నించాడు. బ్రాహ్మణులను, ఋషులను మన్నించాడు. ఎంత మన్నించాడంటే వాళ్ళకి తిమ్మిరెక్కేంత మన్నించాడు. వాళ్ళకి తిమ్మిరెక్కితే అది వాళ్ళకి సంబంధించినది. ఈయనకి సంబంధించినది కాదు. అలాగే మనం కూడా ఎంత వీలుంటే అంత ఎదుటి వ్యక్తులను గౌరవించడానికి ప్రయత్నించాలి. మన్నన చేయడానికి ప్రయత్నించాలి. ప్రతివాడిలోనూ ఏదో ఒక సద్గుణం ఉంటుంది. ఏమీ లేకుండా ఉండదు. చీమ, దోమల్లో కూడా నువ్వు గమనించగలిగితే సద్గుణం ఉన్నది. Ceiling fan తిరుగుతూంటే ఆ గాలికి ఒక pattern of movement ఉంటుంది. ఆ movement ఏదో చూసుకుని ఆ movement లో పడకుండా ఇంకో దారి

వెతుక్కుని దోమ మన మీద land అయిపోతుంది. Americans తమ Satellite మన అణుపరీక్షా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూంటే వాటికి మనం దొరకకుండా మన శాస్త్రజ్ఞులు ఎంతో తెలివితో తప్పించి అణుపరీక్ష చేయించారు కదా! మొత్తం ప్రపంచం అంతా భారతీయ శాస్త్రవేత్తలని శ్లాఘించారు వారి ప్రజ్ఞకి. అటువంటి జ్ఞానం మనకి దోమల్లో కూడా కనిపిస్తోంది. Fan తిరుగుతున్నా మనమీద land అయ్యి కుట్టేస్తూ ఉంటుంది. అలా ప్రతిదాంట్లోనూ అలా చూడగలిగితే కౌశలం కనిపిస్తుంది. శ్లాఘించే విషయం ఉన్నది. వాడు తనని శ్లాఘించాడు అనుకుంటే వాడి స్థితి వాడిది ఇతరులలో ఉండే దివ్యగుణాలను చూసి శ్లాఘించడం అనేది ఒక కార్యక్రమంగా పెట్టుకోవాలి. ఈ గుణం మనకి మళ్ళా అప్పలాచార్యుల వారిలో కన్పిస్తుంది. ఆయన భలే చూస్తారు. చూసిన దానిని శ్లాఘిస్తారు. ఎందుకంటే అదే సత్యం. అందులో భగవంతుణ్ణి చూసి తద్వారా ఎదుటివ్యక్తిని అనుకూలంగా చేసుకుంటారు. ప్రతికూలమైన సన్నివేశాలు ఎన్ని ఉంటే అంత తెలివి తక్కువగా మనం ఉన్నాం అని అర్థం. సరియైన ప్రవర్తన ఉన్నవారు, ఆ ప్రతికూలమైన సన్నివేశాన్ని అనుకూలంగా మార్చుకుంటారు. ఇలా వాడిలో ఉండే దివ్యగుణాలని శ్లాఘించుతూ వెళితే, నీలోని ఉండే దివ్యగుణాలని కూడా సంఘం శ్లాఘిస్తూ ఉంటుంది. నువ్వు 'మాన్యుడవి' అవుతావు. భగవంతుడే అలా చేస్తున్నాడట. అదే కదా మనకు జయవిజయుల కథ. సనకసనందనాదులు ఏడు లోకాలూ దాటి చిట్టచివరకు ఇహ విష్ణుమూర్తి దర్శనం చేసుకోవడానికి అక్కడికి వెళ్తే జయవిజయులు అడ్డంగా ఈటెలు పెడతారు. వీరికి కోపం వస్తుంది. శపిస్తారు. బయటికి వచ్చి విష్ణుమూర్తి 'వీరినెందుకు అడ్డు పెట్టారు. అన్ని లోకాలలోనూ తాము చేస్తున్న ధర్మకార్యాల చేత పూజింపబడుతున్నారు. అంతేకాదు వీరి కారణంగా నేను పూజింపబడుతున్నాను. వీరిని నేను ప్రతినిత్యము కోటానుకోట్ల జీవుల రూపంలో పాదస్పర్శ చేసుకుంటాను. నేను రోజూ వీరి పాదస్పర్శ చేయడం చేత ఇంతటి వాడినయ్యాను.' అంటాడు. వీరు బ్రహ్మ మానస పుత్రులు. ఏడు లోకాలలోనూ ఎక్కడకు వెళ్ళినా వీరికి మర్యాదలు జరుగుతాయి. ఎందుకనీ? Grandsons of the Lord కదా! వీరు ఎల్లప్పుడూ భగవద్భక్తిలోనే నిండి ఉంటారు. నిండి ఉండడం నుండి, సమస్తములోను భగవంతుడ్ని దర్శిస్తూ ఉన్నవాళ్ళు, వైకుంఠం వరకూ వచ్చే సరికి, అమ్మయ్య! ఇహ దేవుణ్ణి చూస్తాం అనుకుంటూ జయవిజయుల రూపంలో ఉన్న దేవుణ్ణి చూడ్డం కొంత మరుస్తారు. మనం కూడా అంతే. మనం తిరుపతి వెళ్తే దేవుడు కనిపించే లోపల ముందుండే జయవిజయులూ, గరుత్మంతుడూ అసలు పట్టరు. మనకెంత సేపూ యావ అక్కడేదో చూసేద్దామని. మన ముందువాడు మనని ఏడిపిస్తూ ఉంటాడు. మనం తల తిప్పితే ఇటు, అటు తిప్పితే అటు తన తల తిప్పుతూ ఉంటాడు. మనకి దేవుడు కనిపించకుండా ఎంతసేపూ వాడి తలే

కనిపిస్తూ ఉంటుంది. కానీ అంతకు ముందు జయవిజయలలో భగవంతుడిని చూడము. భగవద్భక్తులలో భగవంతుడిని దర్శించకుండా, భగవంతుడ్ని చూడడం కొంత దుర్లభమైన విషయం. గరుత్మంతుడి అనుగ్రహం చేత విష్ణువుని చూడడం సులభం. నందీశ్వరుని అనుగ్రహం చేత శివుడిని చూడడం సులభం. ఇలా ఉంటుంది. Personal Secretaries తో కొంత favourism సంపాదించుకుంటే, boss ని చూడ్డం సులభం. వాడు చెప్తాడు, ఈయన ఏ time లో ఖాళీగా ఉన్నాడో phone చేసి మరీ. పెద్దవాడెప్పుడూ meeting లోనే ఉంటాడు. ఎవరో ఒకరు వస్తూనే ఉంటారు. నువ్వు మరి ఎట్లా కలవాలి? PS ని స్నేహం చేసుకుంటే, ప్రసన్నం చేసుకుంటే, వాడు వెంటనే phone చేసి మరీ చెప్తాడు. గురువుగారు ఖాళీగా ఉన్నారు రమ్మని. ఇది మామూలుగా లౌకికం. అక్కడ సనకసనందులు, జయవిజయులలో భగవంతుణ్ణి చూడలేదు. కాబట్టే అడ్డుపడతారు. అడ్డుపడితే మనం ఎక్కడ పప్పులో కాలేశాం అనుకోకుండా కోపం ఒకటి. మనకీ కోపం వస్తూంటుంది. మనకి లోపలున్న అధికారి బాగా తెలుసు. కానీ బయట ఉన్న వీడికి మనం తెలీదు. మనకి వాడు తెలీదు. ఉన్నారా అని అడిగి మనం వెళ్ళిపోబోతే వీల్లేదు వెళ్ళడానికి అంటాడు. వాడు నా స్నేహితుడయ్యా చిన్నప్పటి నుండీ అంటే, అయ్యి ఉండవచ్చు నాకు తెలీదు కదా! అంటాడు. లోపలున్నాయన వాడికి నాకు చెప్పకుండా ఎవరినైనా లోపలికి పంపితే చీరేస్తాను అని instruction యిచ్చి ఉంటాడు మరి. కనుక వీడు పంపించడు. తిరుపతిలో నీకు Joint Executive Officer తెలిసినా లోపల వెళ్ళడానికి ఇద్దరు secretaries అడ్డుపడతారు. నీకెంత బాగా ఆయన తెలిసినా వారికి సంబంధంలేదు. అట్నుంచి ఏమన్నా వస్తే తప్ప ఏమీ పలకరు. అలాగ సనకసనందనాదులకి కోపం వచ్చి శపించారు. శపిస్తే ఆయన బయటకి వచ్చారు. వీరు చాలా గొప్పవారురా! ఎందుకిలా అడ్డుపెట్టారు, అని లౌక్యంగా ద్వంద్వార్థం వచ్చేట్లుగా మాట్లాడతాడు. ఎలా మాట్లాడుతాడూ, రోజు వీరి పాదాలను నేనే పట్టుకుంటూ ఉంటానే, అని అనేసరికి వీరికి కనువిప్పు అవుతుంది. రోజూ ఇన్ని లోకాలలోనూ ఉండే జీవులు వీరి పాదాలకు నమస్కారం చేస్తుంటే వీళ్ళు blessings ఇస్తున్నారన్నమాట. కానీ, వీళ్ళు తమ పాదాలు పట్టుకునే వారి రూపంలో ఎవరున్నారో మర్చిపోయారు. అందుచేత కొద్దిగా కరడు కట్టింది. అది వారికి గుర్తు చేశాడు. దాంతో వారికి ఒళ్ళు ఝుల్లుమంది. చిన్న విద్యుత్ప్రవాహం తగిలితే మనకెలాంటి కంపనం కలుగుతుందీ? అలాగయ్యింది. అమ్మో కొట్టాడురా, అనుకున్నారు. ఒక్క మాటతో ఎక్కడ కొట్టాలో అక్కడ కొడతాడు విష్ణుమూర్తి. అంటే అతడు వీరిని జీవుల రూపంలో ఎంత మన్నిస్తున్నాడు! అది కదా వీరి మాన్యత! తాను మాన్యుడు. తాను ఇతరులకు ఆ మాన్యత పెంపొందించడం

వలన తాను మాన్యుడయ్యాడని ఈ నామం చూపిస్తోంది. తనకసలు ఏ మానమూ అక్కరలేదు. అక్కరలేకపోవడం వల్ల, అక్కరలేకపోయినా ఇతరులలో దానిని బాగా పెంపొందించడం వలన అత్యంత 'సిరి' తన వద్దకు వచ్చింది. వద్దంటే డబ్బులాగ. ధర్మకార్యాలకి వచ్చినదంతా వెదజల్లేవాడికి వద్దన్నా డబ్బు వస్తుంది. కావాలనుకున్నవాడికి రాదు. సృష్టిలో అదే తమాషా. కావాలనుకొన్నది తప్ప మిగతావన్నీ వస్తుంటాయి. కనక తను కావాలనుకున్నది కూడా త్రికరణశుద్ధిగా వద్దనుకోవడం. మొన్నెవరో ఒకాయన కనిపించి, '20 సం.లు కష్టపడ్డాను డబ్బు లేక. ఏదో గట్టెక్కించాను. ఇప్పుడొస్తోంది వద్దన్నా. ఏం చేసుకోను?' అని అంటే. 'ఇన్నాళ్ళూ నువ్వు కావాలనుకున్నావ్ రాలేదు. అదే నువ్వు ఇప్పుడు కావాలనుకోలేదు. అందుకే వస్తున్నాయి' అని చెప్పాను. అంటే మరేం చెయ్యాలి అంటే, సద్వినియోగం చేసుకో. ఇలా ఉంటాయి సృష్టిలోని కొన్ని కొన్ని అమరికలు. అందుకని అమానీ, మానదః, మాన్యః ఎంత మాన్యుడయ్యాడంటే లోకస్వామి అయ్యాడు.

# ౭౭౮ లోకస్వామి

ముల్లోకాలూ పూజింపబడే స్థితిలో భగవంతుడుండడం పెద్ద విషయమేమీ కాదు. అట్లా ఎదిగిన మహాత్ములు కూడా ఉన్నారు. ధ్రువుడు చిన్న పిల్లవాడైనా మూడులోకాలోనూ పూజింపబడేట్లుగా తయారయ్యాడు. ప్రహ్లాదుడూ అంతే. భగవంతుడు, భగవద్భక్తుల ప్రవర్తన మన సాధనకి దిక్సూచి. దైవములో ఉండే గుణములన్నీ భగవద్భక్తుడి యందు దర్శనం చేయవచ్చు. భగవద్భక్తుడి యందు కనిపించే ప్రవర్తన మనకి దిక్సూచిగ పని చేస్తుంది. అందుకే భగవద్భక్తుల జీవితములు చదువుకోవాలి. ఎవరైనా భగవద్భక్తులని తెలిస్తే కోరి తెలుసుకుని వెళ్ళి, కలిసి, పాదనమస్కారం చేసుకుని, వారి ప్రసన్నతను సంపాదించుకోవాలి. ఇది మార్గము. ఎన్ని లోకాలనుకుంటే అన్ని లోకాలలోనూ భగవంతుడు నిండి ఉన్నాడు. అంటే మూడు లోకాలూ, ఏడు లోకాలూ, 14 లోకాలు ఇలా మనం ఎన్ని లోకాలనుకుంటే అన్ని లోకాల లోనూ ఉన్నాడు. 49 లోకాలలోను ఉన్నాడు. విభజించి చూసుకుంటే ఎంతైనా కనిపిస్తుంది. మొత్తముగ చూసుకుంటే ఒకటిగా కనిపిస్తుంది. అలా లోకస్వామి అయ్యాడు.

# 771 త్రిలోకధృత్

మూడు లోకాలూ ధరించి ఉన్నాడు. మనం బనీను వేసుకుని, చొక్కా వేసుకుని చలికాలంలో దాని మీద sweater వేసుకున్నట్లు, అన్నీ అతడు ధరించి ఉండబట్టి ఉన్నాయి తప్ప అతడు లేకపోతే లేవు. మనల్ని కూడా అతడే ధరించి ఉన్నాడు. మన శరీరం పొద్దున్నే లేవడానికి గానీ, చేతులూ, కాళ్ళూ కదపడానికి గానీ కారణం అతడు మనల్ని ధరించి ఉండడమే! ఆయన ఏదైన భాగాన్ని ధరించి ఉండకపోతే అది పనిచేయడం మానేస్తూ ఉంటుంది. మనలోని ప్రజ్ఞ, శక్తి, పదార్థము, ఈ మూడింటినీ, ఆయన ధరించి ఉన్నాడు. మనం ఉండడం అంటే ఆయన ఉండడమే. మనయందు శక్తి పనిచేయడం అంటే ఆయన శక్తి పనిచేయడమే. మన శరీరం ఉన్నది అంటే, ఆయనదే మనదిగా ఉన్నది. మనది అని ఆయన అనుకోనిచ్చాడు. కాబట్టే అనుకుంటున్నాం. అద్దె ఇంట్లో ఉండి స్వంతం చేసుకునే type మనం. ఖాళీ చేయరు. వాళ్ళు పోలీసులని పంపి లాగేస్తారు. వారు యమకింకరులు. సొంత ఇల్లు లేదా అని ఒకాయన్ని అడిగితే, ఇదే అద్దెఇల్లు ( శరీరం) ఇంకా నాకు సొంత ఇల్లు ఎందుకు అన్నాడొకాయన. నువ్వే నాదనుకుంటున్నావ్. కానీ నువ్వు వాడివాడివి. వాడిది నీకిస్తే నువ్వొకడివి తయారయ్యావు, నీదని నువ్వనుకున్నావ్, వాడనుకోనిచ్చాడు. తండ్రి సొమ్ము కొడుక్కి అప్పజెప్పాడండీ! బుద్ధిమంతుడైన కొడుకు అసలు తన బ్రతుకే తండ్రిది కదా అని తెలిసి ఉంటాడు! మరి ఈ సొమ్ము ఆయనదే అని తెలిసి ఉంటాడు. తనకి జన్మ యిచ్చింది, సంపద యిచ్చిందీ ఆయనే! అటువంటి తండ్రి యందు ఎంతటి భక్తి, వినయవిధేయతలు కలిగి ఉండాలి, అలా చూడకుండా ఉంటే అహంకారం పెరిగి, ఇబ్బందులు పడతావు. మనలో మూడు లోకాలనూ ఆయన ధరించి ఉన్నాడు. నువ్వే నన్ను ధరించు, నీవే నాయందు శక్తిగా పనిచెయ్యి. నీవు ఈ శరీరాన్ని నీ పనికి వాడుకో, నేను నిమిత్తమాత్రుడుగా ఉంటాను. చూస్తూ ఉంటాను. చూస్తూ ఉండడం అంటే చేస్తూ, చూస్తూ ఉండడం. చేయకుండా చూస్తూ ఉండడం కాదు. అర్జునుడు రెండుచేతులతోనూ బాణం వేయగలడు. సమానమైన బలంతో, ధాటితో సవ్యసాచి. 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అని చెప్పాడాయన అంటే రెండు చేతులతో పనిచేసేవాడే నిమిత్తమాత్రుడైతే ఒక్క చేతితో పనిచేసే మనలాంటి వాళ్ళం--? నిమిత్తమాత్రం అన్నప్పుడు సవ్యసాచీ అని సంబోధించడం--! చాలా బుద్ధిశాలి కనుక అనగలడు అంటే రెండు చేతులతో వేయడం అనేది ఉంటుంది కదా! అలా ఈయనొక్కడే వేయగలడు అక్కడున్న వాళ్ళలో. అయినా 'నువ్వు నిమిత్తమాత్రుడివే' అంటాడు. అలా తట్టించడం కూడా వాడు తట్టించడమే. అదే గాయత్రి! పొద్దున్నే ఏడుపు ముఖంపెట్టి చేసుకుంటామే, కొంతనిద్ర, కొంత ఇంత

పొద్దున్నే చేయాల్సి వచ్చిందే అన్న బాధ పెట్టుకొనీ చేస్తుంటామే, దేనికీ అంటే బుద్ధి ప్రచోదనం చేయమని. ఆయన బుద్ధియే మన యందు పని చేయాలి. ఆయన శక్తియే మనయందు పనిచేయాలి. మనం ఉన్నది కూడా ఆయన పనికే. ఇది బాగా రోజూ పొద్దున్నే remind చేసుకుని copy రాసుకోవాలి. 'నేను నీవాడను. నా శక్తిసామర్థ్యములు నీవే, సంపదలు నీవే, శరీరము కూడా నీవే. మొత్తము నీవేగా ఉన్నావు. నేను నీ కొరకు ఉన్నాను. నేను నీ కొరకు పనిచేస్తాను. పని కూడా నువ్వే చేసుకో. నేను చేస్తూ చూస్తుంటాను'అని రాయాలి. గిన్నె తనంతట తాను పొయ్యికెక్కదు. మంట తనంతట తాను వెలగదు. దాంతోబాటు నువ్వు ఉడకనక్కరలేదు. పొయ్యిమీదకి గిన్నె ఎక్కించాలి, వేయాల్సిన పాలో, నీళ్ళో వేయాలి. మంట పెట్టాలి. మిగతాది వేచి ఉండడం నేర్చుకోవాలి. ఒక్కోసారి లేవలేం. నీ సేవకి నేను లేవలేని పరిస్థితిలో ఎందుకు పెట్టావ్? అని బాధపడాలి. అది కూడా పూజే, తపనే, ప్రార్థనే! నన్నిలా ఎందుకుంచావ్? రకరకాల పద్ధతులలో దేవుడితో మట్లాడుకుంటాం. ఊర్కే వాడెవడో చెప్పిన పద్ధతిలోనే చేయాలా? వారు ఒక ఒరవడి పెట్టారు. దేవుడితో నీ స్వంతంగా మాట్లాడుకోవచ్చు. స్వంతం ఏమీ లేదండీ. అది కదా గోవింద నామం. అందుకనే సమస్తమునకూ ఆయనే స్వామీ, సమస్తమునూ ఆయనే ధరించి ఉన్నాడు మనతో సహా. ఈ భావం మనలో బాగా స్థిరపడితే భయాలూ, ఆందోళనలూ, ఆత్ర పడడం అన్నీ పోతాయి. మనం చేయాల్సింది చేద్దాం. తర్వాత ఆయనే చూసుకుంటాడు అనుకోవాలి. మనం చేయాల్సింది చేయకుండా, చూసుకుంటాడు అనుకోవడం మనల్ని మనం మోసం చేసుకోవడం. నీ బుద్ధికి తోచినంత నువ్వు చేసి, ఆ పైన వేచి ఉండు.

## 780 సుమేధాః

సృజనాత్మక శక్తి, స్వంత తెలివి, మేధస్సు, అంటే తనకు తానుగా సృజనాత్మకంగ తట్టేటట్లుగా మన్లో ఉన్నాడు. ప్రతీవాడూ నా idea అంటాడు. నీ idea అయితే ఇంతకుముందు ఎందుకు రాలేదు? మనకి idea లు lateగా వస్తుంటాయి. ఇది గనక ముందే తెలిసి ఉంటే ఎంత బావుణ్ణనిపించే సన్నివేశాలు, మన జీవితాల్లో కోకొల్లలు లేవూ? అప్పుడెందుకు తెలియలేదు. ఇప్పుడెందుకు తెలిసింది? తెలియవలసిన సమయంలో తెలియవలసింది తెలియడం సృజన, సుమేధ! నిన్న చేయాల్సింది ఈ రోజు గుర్తొచ్చి, చేయలేకపోతినే అని మనం లుంగలు వేసుకుంటే, అప్పుడు సుమేధాలేదన్నమాట. బుర్రలో మేధస్సు లేదు. బాగా నెయ్యి తింటే మేధస్సు పెరుగుతుందని ఋషులు గమనించి మనకిచ్చారు. ఎందుకంటే ఆయనే నెయ్యి బాగా తింటాడుట. ఘృతాచీ అంటే నెయ్యి హరించేవాడని అర్థం. ఎవరది? అగ్నిదేవుడు! నెయ్యి వేసిన కొద్దీ అగ్ని బాగా ప్రజ్వలిస్తుంది కదా! అలాగే మనలో అగ్నిప్రజ్వలనానికి కూడా అగ్ని పనిచేస్తుంది. పనిచేసి మెదడులో brain cells తేజోవంతంగా తయారై, ఋగ్వేదంలో చెప్పినట్లుగా అన్ని ప్రక్కల నుండి అద్భుతమైన భావములు అందులో చొరబడతాయి. మట్టికుండయితే ఏమీ లేదుగా. Conductor గా ఉంటే అద్భుతమైన విషయాలు సమయానికి మన బుర్రలో మెరుపువలె మెరుస్తాయి. మెరిస్తే, సమయానికి అప్పుడు అక్కడ ఎట్లా నిర్వర్తించుకోవాలో అట్లా నిర్వర్తించుకుంటాం. మాస్టారు ఇది చెప్పారు. అది నేను తు.చ. తప్పకుండా పాటిస్తాను. నాకు నచ్చింది కనుక. అంటే ఏది సౌకర్యంగా ఉంటే అది తీసుకుంటాం. ఏది అసౌకర్యమో అది పాటించము. సౌకర్యమైన సలహా. ఆయనేం చెప్పారంటే 'ఈ భూ ప్రపంచము మీద ఎంతమంది doctors నెయ్యి మానెయ్యమని చెప్పినా నువ్వు మానెయ్యక. ఏవో రోగాలు వస్తాయని చెప్తారు మానక. అదొక్కటే మన మేధస్సు వృద్ధి చెందడానికి భగవంతుడు ఇచ్చిన, తినగలిగిన పదార్థం. నెయ్యి మానవద్దు అదే మేధస్సుకు కారణం' అని చెప్పారు. ఓ రోజు అందరం భోంచేస్తుంటే, కొంతమంది నెయ్యి మానేస్తున్నారు ఎదో మామూలుగ ధాటిగా నెయ్యి వేసుకునేవాళ్ళం, కొంచెం ఏడుస్తూ వేసుకుంటుంటే చూసి, 'ఎప్పుడూ నెయ్యి వేసుకోవడం మానవద్దూ, ఎంతమంది ఎన్ని చెప్పినా' అని చెప్పారు. దాంట్లోంచి అంత మనకి మేధస్సు అందుతుంది. సుమేధ అంటే గాయత్రి ! అంటే గాయత్రి అంటే నెయ్యి కాదు. గాయత్రి అంటే చక్కటి మేధస్సే! అంటే ఏపని, ఎప్పుడు చేయాలో దానికి సంబంధించిన భావం ప్రస్ఫుటంగా అప్పుడు కలిగితే అంతకన్నా పరిష్కారం ఏముంది? అప్పుడు తప్పులూ తక్కువ చేస్తాం కదా!

చేయవలసిన సమయంలో చేయలేకపోయినా consequences ఉంటాయి. చేయ వలసిన పని ఎక్కువ చేసినా దాని వలన consequences ఉంటాయి. ఇవన్నీ సరిగ్గా సమయానికి, ఆ భావం నీలో చొరబడాలంటే, నువ్వెంత భక్తుడవయినా, దైవం నీకెంత సాయం చేద్దామనుకున్నా, నీకు అందిస్తే అందుకోలేవే, బుర్ర బాగుండకపోతే. Antena లేదు. అక్కడ నుండీ వాడు ఎంత అరిస్తే ఏం లాభం? పైగా ఆయన చెప్పలేదూ, ఇంత ప్రార్థన చేసినా , ఒక్క విషయం కూడా నాకందడం లేదూ, అనుకుంటాం. ఎందుకు అందడం లేదూ? అది ధగధగా మెరవడం లేదు. దానిక్కావలసిన వేడి అందడం లేదు. అది కరగడం లేదు. చిన్నప్పుడు పాఠాలు చెప్పినప్పుడు వాడికెంత చెప్పినా అర్థం కాకపోతే 'నీ బుర్రలో మట్టి ఉందా' అంటాం కదా! మెదడు పదార్థం చాలా సున్నితమైనది. అది మొద్దుబారి పోతుంది,కొన్ని కొన్ని చేయకపోతే. అది అంత పదునుగా ఉన్నట్లయితే నీకు చోటు లోంచి భావాలు వినిపిస్తాయి. ఎవరైనా నువ్వు నమ్ముకున్న వాళ్ళు నీకు transmit చేస్తే , నీకు తెలుస్తాయి. లేకపోతే ఏమీ స్ఫురించవు. జడమల్లె ఉంటాం అంతే. మేధస్సు ఉండేవారిలో మేధస్సుగా భగవంతుడున్నాడని ఈ నామం చెప్తోంది. మేధస్సు పెంచమని హోమంలో మనం ఓ మంత్రం చదువుతాం. సుమేధా. పిచ్చి ఆలోచనలు కాక మంచి ఆలోచనలు సమయానికి స్ఫురించడం అనేది ఎవరియందుంటే వాడూ కదా genius! అదిగా, మనగా, వాడు మనయందున్నాడు. మెరుగుపెట్టుకుంటే వస్తాడు. బద్ధకస్తులకి ఏమీ రాదు. దానికి శరీరం బరువు ఎక్కించకుండ ఉంటే వస్తాడు. బరువు ఎక్కి ఉంటే కష్టం. మెదడు బాగా పదును ఎక్కాలంటే ఆహారంరూపంలో నెయ్యి యిచ్చారు. మంత్రరూపంలో గాయత్రి ఇచ్చారు. గాయత్రీమంత్రం బుద్ధిప్రచోదనం చేసేట్లుగా ఏ మంత్రమూ చేయదు. ప్రవర్తన రూపంలో ధర్మం ఇచ్చారు. ధ్యానం రూపంలో బ్రహ్మాన్నిచ్చారు.

## 781 మేధజః

మేధస్సు నుండీ పుట్టించింది ఏవరూ? భావంగా పుడితే 'నాభావం' అనుకోకూడదు. వాడిదే! భగవంతుడి భావం అలా భక్తుడిలోంచి పుట్టుకువచ్చి పనిచేస్తుంది. అదీ భగవద్భక్తుడు! Divine plan. దివ్యప్రణాళిక! సుమేధ ఉంటే దివ్యప్రణాళిక మన బుర్రలోంచి బయటకు వస్తుంది. వచ్చిన తర్వాత మనదనుకోవడం చాలా దౌర్భాగ్యం. నేనే ఇదంతా చేశాను. లేకపోతే ఏమైపోయేది, అనేట్లుగా ఉంటుంది. నీకు అలా కలిగించిన వాడెవడూ? నీలో ఆ భావంగా దిగివచ్చిన వాడెవడూ? అందుకనే సద్భావం మనలో కలిగితే, అది భగవంతుని అవతరణగా వెంటనే చేయ్యాలి. రావణుడంతటివాడు, లక్ష్మణుడికి ఈ మాట చెప్పాడు. మంచి భావం వస్తే వెంటనే ఆచరణలో పెట్టు. చెడ్డభావం వస్తే ఓ రెండున్నర రోజులు pending పెట్టు అని. ఎందుకనీ? రెండున్నర రోజులలో చంద్రుడు ఆ రాశి మారతాడు, అప్పుడా భావం ఉండదిక. మంచివిషయం అప్పటికప్పుడు ఆచరించకపోతే మళ్ళీ ఆచరించ బుద్ధి కాదుట. జేబులో డబ్బులుండీ, ఎవరో కష్టంలో ఉన్నారు ఇవ్వాలనిపిస్తే, రేపిద్దాం అనుకుంటే ఇంక రేపివ్వం. అప్పటికప్పుడు ఇచ్చేయడమే! ఏ సద్భావం కలిగినా దానికి వెంటనే కార్యాచరణం ఉండాలి. అలా చేస్తే జీవితం ధన్యం అవుతుంది. ఫలవంతం అవుతుంది. సమృద్ధి వస్తుంది. విజయవంతం అవుతుంది.

## 782 ధన్యః

ఇదంతా process గా కనిపిస్తుంది మనకి. అసలు ముందు సుమేధ ఉండాలి. TV receiving set బాగుంటే కదా బొమ్మ బాగా వస్తుంది. Radio reception బావుంటేనే చక్కగా పలుకుతుంది. అలాగ మెదడులో మొత్తం భూగోళమే కాదు, సమస్త లోకాల నుండీ కూడా సమాచారం అందుకునే శక్తి మెదడుకి ఉంది. దానికి పదును పెట్టుకోవడం అనేది ఒక కార్యక్రమం. అందుకే ఇవన్నీ గుర్తుపెట్టుకోవడం, వల్లించడం, చదవడం. ఓ వందపద్యాలు నేర్చుకున్నావనుకో. వెయ్యి పద్యాలు, రెండు వేల పద్యాలు నేర్చుకో. పురాణాలన్నీ బట్టి కొట్టు. ఇవన్నీ ఎక్కడ నుండి? మేధస్సు! నేనొక సభకి వెళ్ళాను. ఎంత ఆశ్చర్యపోయానో! కాళిదాసు చెప్పే ఒక శ్లోకం సభలో ఒకాయన కాగితం మీద రాసుకుని, చదవడానికి తిప్పలు పడుతున్నాడు. పడుతుంటే నాపక్కన కూర్చున్న అప్పలాచార్యుల వారు దాన్ని చదివేశారు. సముద్రమంత వాఙ్మయం ఉన్నది కదా! అదంతా నీకు గుర్తుండాలని ఎక్కడున్నదీ? తెలిసి ఉండవచ్చు కానీ ఎంత మేధస్సు ఉంటే గుర్తుంటుండీ? ఈయన గబగబా ఆ మూడు, నాలుగు శ్లోకాలు చదివేశారు. చాలా ఆశ్చర్యం వేసింది. వారింటికి వెళ్ళినప్పుడు ఏం చెప్పారు బయట దేశాల్లో, అని అడిగితే Alps పర్వతాల్లో ముండకోపనిషత్తు చెప్పాను, అన్నాను. గబగబా నాలుగు, ఐదు శ్లోకాలు చదివేశారు. చెప్పినవాడిని నాకు గుర్తులేవు. నాకంతగా సంస్కృతం రాదు. సంస్కృతం రానివాడికి మేధస్సు అంత పెరగదు. వీలుంటే నేర్చుకోండి. It is never late. సిగ్గు పడనక్కరలేదు. నాకు ఏ మాత్రం సమయమున్నా ఎవరివద్దయినా కూర్చొని నేర్చుకుందాం అనిపిస్తుంది. నిస్సందేహంగా ఆ భాషకి మేధస్సు పెంచగల శక్తి చాలా ఎక్కువ. Madam Blavatsky అంతటి ఆవిడ రాసింది 'సంస్కృతం రాని వాడికి పూర్ణజ్ఞానం రాదు' అని. ఎందుకంటే బుర్ర అందుకోగలిగిన స్తోమత సంపాదించుకోలేదు. ఇంకోచోట ధృవోపాఖ్యానం చెప్పానంటే ఆయన అందులో శ్లోకాలు చెప్పేశారు. దశమస్కంధం అంటే నాలుగు శ్లోకాలు గబగబా వల్లించారు. రామాయణంలో దిట్ట అని మనందరికీ తెలుసు. ఎంతసేపూ రామాయణంలోనే ఆయన దిట్ట అని అనుకుంటాం. అసలు ఆయన్ను ఏది అడిగినా అంతే. ఆయన ఆ వయసులో దాశరథీ శతకం గబగబా వల్లించేస్తారు. ఎంత ఆయన వయసు ఇప్పుడు? మన వయసు ఎంత? ఎంత అద్భుతమైన మనిషి! మేధస్సు! అలాంటి మేధస్సుకి ఏమైనా, ఎంతటి విషయం అయినా తడుతుంది. ఎందుకంటే అన్ని సంవత్సరములు వయసు శరీరానికి వచ్చినా, ఆ మేధస్సుకు ఆ పదును అలా ఉంచడం వలన, ఆ వయసులో ఆయనంత అద్భుతంగా రామాయణాన్ని రాసి ఇచ్చి, ధన్యులైనారు. కనుక మనలో

సుమేధగా భగవంతుని అస్తిత్వం అలా చూడండి. మేధజః అందులోంచి వచ్చే అద్భుతమైన దైవీసంపత్తితో కూడిన భావములు, వాటిని ఆచరించగలిగే శక్తి, తత్కారణంగా జీవితానికి ధన్యత్వం.

## 783 సత్యమేధః

మేధస్సు పదును పెట్టుకున్నాక రావణాసురుడు కూడా అవ్వచ్చు. హిరణ్యకశిపుడు కావచ్చు. అద్భుతమైన TV కొనుక్కుంటే మంచి కార్యక్రమాలూ చూడచ్చు. చెత్త సినిమాలు కూడా చూడచ్చు కదా! సత్యమేధస్సే ఆయన తప్ప, మిగతావి ఆయన కాదు సుమా అని చెప్తున్నాడు. చాలా మందికి చాలా మేధస్సు ఉంటుంది, కానీ కొంతమందిలో వికటిస్తుంది. తమయందు తమకు గౌరవం ఉన్నవాళ్ళకి వికటిస్తుంది. తమయందుకాక ఇతరుల యందు గౌరవం ఉన్నవాళ్ళకి అది పని చేస్తుంది. హనుమంతుడి మేధస్సు అలా పని చేసింది. హనుమంతుడు ఎంతటి వాడండీ! సుగ్రీవుడి దగ్గరుండడం ఏమిటీ, అని అనుకోలేదు. మిడిమిడి జ్ఞానం ఉన్నవాళ్ళం అలా అనుకుంటాం. సుగ్రీవుడు దగ్గర హనుమంతుడు పని చేయడము అంటే ఊహించండి. అంతకంటే ఇంకో ఉదాహరణ. కాశీలో, స్మశానంలో కాటికాపరికి assistant గా పనిచేస్తాడు హరిశ్చంద్రుడు. భగవద్భక్తి అంటే వీరే మనకి ideals. ఇవాళ మనం దాన్ని అందుకోలేం. కానీ దానిని లక్ష్యంగా పెట్టుకుని బయల్దేరాలి. లక్ష్యం అది. ఎక్కడున్నాం మనం? ఇప్పటికే తృప్తి పడిపోయి, మనల్ని మనం పొగిడేసుకుంటూ, ఊళ్ళోవాళ్ళ పొగడ్త ఇంకా చాల్లేదనుకుంటూ మనకి మనమే పొగుడుకుంటూ, ఇలా ఉంటాం మనం. సత్యమేధస్సు ఉంటుందక్కడ. అసలు ఆ కథలు చదువుతూంటేనే మనలో కొంచెం మలినం కరుగుతుందండి. కళ్ళ వెంబడి నీరు రాకుండా ఉండే వీలులేదు. నీళ్ళు వచ్చినప్పుడల్లా లోపల కొంత కరిగినట్లే. కరుళ్ళు కరిగి నీళ్ళుగా బయటకి వస్తాయి. తనకి అవమానం అని భావించకుండా సత్యాన్నే ఆరాధిస్తూ ఉంటే ఉన్నదాన్ని దర్శించడమే, మిగతావాటిని దర్శించకుండా, ఉన్నదదే! దాని చుట్టూ మిగతావి ఏర్పడ్డాయి. వాటితో మనకి సంబంధంలేదనీ, ఆ కాటికాపరిలో ఉండే చేతనయందు మనస్సు లగ్నం చేసి, తను కాటికాపరి అని గుర్తు పెట్టుకోకుండా జీవించాడు. మనం అయితే కాటి కాపరిని చూస్తాం. పైగా వాడు ‘ ఒరేయ్ పోయి కల్లుపట్టుకురా’ అని చెప్పేవాడు. సరిగ్గా ఆ శవం కాల్చలేదేం అని 2,3, బూతులు తిట్టేవాడు. ఈ శ్లోకం లో మానం గురించి ఉంది చూశారా, అక్కడ దంభము, అభిమానమూ ఉన్నవాడికి ఇంత మేదస్సూ వక్రిస్తుందని చెప్పడానికి చెప్పారు. వాలికీ, రావణుడికీ, కుంభకర్ణుడికీ దర్పం. చాలా ఎత్తు ఎదిగి పడిపోయేవాళ్ళంతా, ఈ దర్పం వల్లే పడిపోతారు. అందుకనే భగవంతుని యొక్క తత్త్వము సత్యమేధస్సుగా మాత్రమే ఉంటుంది సుమా, అని చెప్తుందీ నామం. భారతీయ విద్యలో వినయం ఉన్నది. అంతర్ముఖంగా వినయం ఉండాలి. బహిర్ముఖంగా ఈ రోజుల్లో కొంచెం కనబడేట్లుండాలి. లేకపోతే ఈ ప్రపంచం మనల్ని మింగేసేట్లుగా

తయారైంది. మనం ఊర్కే మోసపూరితమైన వినయం నటిస్తూంటాం. లోపల వినయం లేక బయటకి వినయం నటిస్తే ఆషాఢభూతి అవుతాం. వినయం అంటే ఎదుటి వ్యక్తిలోని సద్గుణాలను వెతుక్కుని, వాటిని మాత్రం గౌరవిస్తూ వాడితో కలిసి బతుకుతూంటాం. మిగతావి మనకి సంబంధం లేదు. ఆ రూపంలో భగవంతుడు అక్కడ ఉపస్థితుడై ఉన్నాడని తెలుసుకోవాలి. అటువంటి మార్గంలో ఉన్నవాళ్లకి సత్యమేధస్సు ఉంటుంది. దేనియందైనా సరే ఉన్నది కనిపిస్తుంది. అదీ సత్యమేధస్సుకు నిజమైన నిర్వచనం. ఆ మేధస్సు ఉన్నవి చూపించేస్తుంది. మహాత్ములు మనం చెప్పింది కాక మనలో ఏం ఉన్నదో చూసేస్తారు. మనం ఏం మాట్లాడుతున్నామో, దేనికోసం మాట్లాడుతున్నామో అది ముందు వాళ్ళందుకుని, ఇహ మనం కొట్టే మిగతా ఊకదంపుడికి ఊ, ఊ అంటుంటారు. ఎందుకోసం వచ్చాడో తెలిసిపోతుంది. ఎందుకూ? అక్కడ ఏం ఉన్నదో అది చూడగల మేధస్సు ఇక్కడ ఉంటుంది. అదీ సత్యమేధస్సు! ఎదుటివాడు మాట్లాడుతూంటే కృష్ణుడెట్లా పట్టేసేవాడు. ఎదుటివాడు మాట్లాడ్తూంటే మహాత్ములు ఏ విధంగా అసలు విషయం పట్టేస్తారు? మనం ఎంత డొంక తిరుగుడుగా వచ్చినా, రకరకాల పాచికలు వేసుకు వచ్చినా పడిపోడు. ఎందుకనీ? ఉన్నది దర్శిస్తాడు. అది చాలా పెద్ద ఆస్తి! అసలు సమస్తంగా నిండి ఉన్నదాన్ని కూడా దీంతోనే దర్శించవచ్చు. మేధస్సు లేనివాడికి ఆత్మదర్శనం లేదు. ఈ సాధన మేధస్సుని పెంచాలి కానీ, మూర్ఖుడవడానికి కాదు. ప్రపంచానికి మూర్ఖుడిగా కనిపించీ, అత్యంతపదును గల మేధస్సు కలవాడై ఉంటాడు భగవద్భక్తుడు. ఎందులోనైనా సరే ఆయన మేధస్సు పనిచేసినంతగా ఇతరుల మేధస్సు పనిచేయదు. ఏ విద్యలోనైనా అలా ఉంటాడు. ముట్టుకుంటే ఆ విద్యలోని కీలక సూత్రాలన్నీ తెలిసిపోతాయి. బండగా ఇన్ని పేజీల పుస్తకం చదివేవాళ్ళూ ఉంటారు. కానీ అలా అలా పేజీలు తిప్పేసి, అందులో ఉన్న కీలకమైనవి తనలోకి తీసుకునే పద్ధతి ఉన్నది, మేధస్సు పెరిగితే, అంటే essentials లోకి వెళ్ళిపోతుంది ఎక్కడికి అక్కడ, non-essentials అసలు పట్టించుకోదు. ఉన్నది దర్శనం చేస్తుంటుంది. Late అయిపోయిందనుకోకండి. ఇప్పట్నుండయినా ప్రయత్నం చేసుకోవచ్చు. గాయత్రిని బాగా చేసుకోండి. నెయ్యి వేసుకుని తినండి.

## 784 ధరాధరః

అంటే ధరను ధరించినవాడు. భూమిని ధరించినవాడు. అన్నీ ధరించినవాడు భూమిని ధరించడానికి ఏం? ఎందుకు దీన్ని ప్రత్యేకంగా చెప్పారంటే, ఇది అన్నిటినీ కప్పేస్తుంది. భౌతికలోకం పెద్ద మోసం. పూర్తిగా కప్పేస్తుంది. ఏముందో తెలియదు. ఈ భూమి ఎలా నిలబడి ఉన్నాదనేది ప్రతినిత్యం ఆశ్చర్యం కలిగించాలి. మనం ఆలోచించనే ఆలోచించం. మనం నిలబడ్డమే కష్టంగా ఉంది. ఇహ భూమి గురించేంటిలెండి, అనుకుంటాం. అలా నిలబడి ఉంది. అంతేకాదు కొన్ని కోట్ల సంవత్సరాల నుండీ తన చుట్టూ తాను అలా తిరుగుతోంది. సూర్యుడి చుట్టూ కూడా, అదే వేగంతో తిరుగుతోంది. ఇంతకన్నా ఏం కావాలండీ, ఇంకోటేదో ఉందని తెలియడానికి. అలాగే శరీరం వేసుకుని మనం కూడా తిరుగుతున్నాం. మనల్ని, మన శరీరాలనీ ధరించినవాడూ వాడే. అది మనకి తెలీదు. ఎందుకంటే మనం శరీరాలనే చుస్తాం. వాడ్ని చూడం. కొంత సూక్ష్మంగా, transparency ఉంటే కొద్దిగా అవగాహన ఉండవచ్చు. ఇట్లా బండగా, భౌతికంగా ఉంటే బాగా మరుగున పడిపోతాడు. కాబట్టే ప్రత్యేకంగా దానికో నామం వేసి చెప్పాలి. బాగా చీకటిగా ఉన్నప్పుడు చిన్నదీపం చాలు అన్నట్లు, ఆ విధంగా ధరను ధరించినవాడు. ధరా అంటే ధరింపబడినది. ధర అంటే ధరించినది. ఏదైతే ధరింపబడుతున్నదో దాన్ని ధరించాడన్నమాట. ఇప్పుడు ఈ చెట్టుని చూస్తే వాడు ధరించాడనుకోవాలి. అసలు కనపడేదంతా వాడే ధరించాడనుకోవాలి. అది ధరింపబడినది. సమస్తమూ అంతే. అదొక సాధన. అలా చేసుకుంటూ పోవాలి. ఇవన్నీ ఆ భావనలో ఉండడానికి పనికి వస్తాయి. ఏం చూసినా అదే గుర్తుకురావాలి. అదే దీనికి ఫలశృతి. ఇన్ని రకాలుగా చూస్తున్నాం అంటే ఇన్నిరకాలుగా చూపిస్తున్నాడన్నమాట. వాడు ఎవడో తెలివైనవాడు అంటూ వాడ్ని పొగడకా, వాడిలో తెలివి వీడే అని చెప్తున్నారు. ఎవరిలోనైనా ఓ అద్భుత మైన భావన వచ్చింది, దాని వల్ల పెద్ద పరిష్కారం వచ్చింది. ఆ పుట్టిన భావం భగవతత్త్వమే! అలాగే ఉన్నదున్నట్లుగా చూసే మేధస్సు భగవతత్త్వమే! నీలో సృజనాత్మకశక్తి ఎంత ఎక్కువగా ఉంటే అంత నువ్వు ధన్యుడవే! అంతగా నీ జీవితం ఫలవంతం అవుతుంది. అది కూడా సత్యమేధ అయితేనే! లేకపోతే పెరిగిన తర్వాత దెబ్బ తినవచ్చు. వీటన్నిటికీ ముందు, basis ఏం ఇచ్చారంటే వినయం కావాలీ, నిగర్వి అయి ఉండాలీ అని చెప్పాడు. అది ప్రాతిపదికగా ఇవన్నీ తెలుసుకోమని చెప్పాడు. 'విద్యయొసగును వినయంబు' కదా! విద్య వల్ల వినయం రావాలి బానే ఉంది. కానీ వినయం లేకపోతే విద్య రాదు. రెండూ ఒకదానికొకటి పోషింప చేసుకుంటూ పోతాయి, లేదా రెండూ ఒకదానికొకటి నశింపజేసుకుంటూ

ఉంటాయి. వినయం లేక విద్య వస్తే వాణ్ణి నాశనం చేస్తుంది. అంతంతమాత్రంగానే విద్య వస్తుంది. అటువంటి విద్య వినయాన్ని తగ్గిస్తూంటుంది. అందుకనీ వినయంతో విద్య నేర్చుకోవడం, విద్య వల్ల ఇంకొంత వినయవంతుడవడం ఇట్లా రెండుపాయలుగా ఈ శ్లోకంలోని రెండూపాదాలూ అర్థం చేసుకోవచ్చు.

## 785 తేజః

తేజ స్వరూపుడు. 'తత్' తేజస్వరూపుడు. సత్యసాధకుడు తేజస్వరూపుడు అవ్వాలి. తేజస్సుకు ఏమిటయ్యా అడ్డం వస్తూ వుంటాయి అంటే, విద్వేషములు అడ్డం వస్తూంటాయ్. తేజస్సునకు విద్వేషము అవరోధమని పెద్దలు చెప్తారు. మనలో విద్వేషము, అది కారణంగా అసూయ, ఈర్ష్య ఇటువంటివన్నీ చేరినపుడు మనలో వుండే తేజస్సు సన్నగిల్లుతుంది. ఇతరములైనవి చోటుచేసుకుంటాయి. అది కారణంగా తేజస్సు మరుగునపడుతుంది. ప్రతి ఉదయం గాయత్రీధ్యానంద్వారా, లేక వెలుగు ధ్యానం ద్వారా, లేక చైతన్యమునందు మనసు లగ్నం చేయడం ద్వారా, లేక జ్యోతి ధ్యానం ద్వారా, ఏదో రకంగా మనలో వుండే ఓజస్సూ, తేజస్సూ మనం బాగా గుర్తించాలి. ఎందుకంటే మన సహజమైన స్వరూపం తేజస్సు! ఇది మనముండే భావమయ ప్రపంచాన్ని బట్టి బాగా వెలగడమో, తక్కువగా వెలగడమో, అసలు వెలగక మిణుకు మిణుకు మంటూనో వుంటుంది. కాబట్టి ఎక్కువగా మనకుండే భావమయ పరిధిని బట్టి వెలుగు వృద్ధి చెందడం, చెందకపోవడం వుంటుంది. భగవద్భక్తునియందు అది ఎప్పుడూ ప్రకాశిస్తూ వుంటుంది. భగవంతుడు స్వయం ప్రకాశకుడు. కాబట్టి అతడి వెలుగే మనయందు మన వలె వున్నప్పుడు మనం దానిని ప్రతినిత్యం గుర్తు తెచ్చుకుంటూ వుండాలి. ఆ విధంగా చేయడం కోసమే రోజూ ఉదయం ధ్యానం. తను చైతన్యవంతుడని, చైతన్యవంతుడిగా తేజస్వరూపుడని, తనకుండే ఇతర భావములను కూడా ఆ తేజస్సునందు దగ్ధము చేసికుని, తాను ప్రకాశిస్తున్న పద్ధతిలో వుండాలి. ప్రకాశమునకు అవరోధములైన భావములను నిరోధించాలి, లేక అధిగమించాలి. అది ఒక ప్రయత్నంగా సాగాలి! కాంతిమయమైన లోకము, ఈ భౌతిమైన లోకానికి లోపల యిమిడి వున్నది. అది ప్రస్తుతం అదృశ్యముగా వుంటుంది. మనం భావములలో ఎక్కువ వెలుగు పొందినపుడు, వెలుగుమయ లోకాలు దర్శనం అవుతుంటాయి. ఇదే లోకంలో వుండే వెలుగుమయ లోకాలు దర్శనం చేయడమే, వైకుంఠ దర్శనంగా భాగవతం చెబుతుంది. కాబట్టి కేవలం భావములచేత ఈ తేజస్సు పెంచుకోవడం కానీ, తగ్గించుకోవడం కానీ జరుగుతూ వుంటుంది. మనకు కలిగే భావములను మనం పరిశీలించి ప్రతినిత్యం వాటిని ధర్మపరంగాను, దైవపరంగానూ, దైవము అంటే దివి అనే వెలుగు, ఆ వెలుగుపరంగాను మార్చుకుంటూ పోవడం అనేది సాధన. ఈ సాధనకి కావలసినది నిరంతరత్వం! ఏదో ఒక రోజు బావుంటుంది, ఒకరోజు బావుండదు. ఒక్కోరోజు భావాలు బావుంటాయి, ఒక్కోరోజు భావాలు బావుండవు. ఒక్కోరోజు తేలికగా వుంటుంది. ఒక్కోరోజు బరువుగా వుంటుంది. ఇలా వుండకుండా వుండే స్థితికి మనం

పెరగాలంటే చేసే సాధన చిన్నదైనా శ్రద్ధగా, భక్తిగా, అనుస్యూతం అంటే నిరంతరం జరుగుతూ వుండాలి. ఆ విధంగా జరుగుతూ వుంటే నెమ్మదిగా విసురుకునే కుంపట్లో చిన్నరవ్వ మొత్తం కుంపటినంతా ఏ విధంగా వెలుగుతో నింపుతుందో, ఆవిధంగా నింపడానికి వీలు పడుతుంది. మనకి మామూలుగా సాధనలో ముందు ఆసక్తి ఎక్కువగా వుండి, తలకి మించినన్ని విషయములు యెక్కించుకుని, అవి నిర్వర్తించలేక ఒకప్రక్క బాధపడుతూ, రెండోప్రక్క శ్రద్ధలో ఎక్కువ తక్కువలుండటం చేత, క్రమమైన అభివృద్ధిలేక తికమకలు పడుతూంటాము. అందుకనే సాధ్యపడేంతవరకే కొన్నివిషయములను తనకుగా తాను నిర్ణయము చేసుకుని, వాటియందు దీక్షవహించి, నిష్ఠతో వాటిని నిర్వర్తించుకుంటు వుంటే ఈ తేజస్సు పెరుగుతుంది. ఈ తేజస్సు పెరిగి ఉన్న వారిని మనం సందర్శించడంవల్ల, వారితో కలిసి మెలిసి వుండడంవల్ల, వారి యొక్క అనుగ్రహంవల్ల కూడా తేజస్సు పెరుగుతుంది. సద్గ్రంథపఠనం వలన తేజస్సు పెరుగుతుంది. అందుకని మనస్సు పరిపరి విధముల పోకుండా వుండడానికి ఈ మహాత్ముల దర్శనం, పుణ్యక్షేత్రముల దర్శనం, గ్రంథముల యొక్క పఠనం. ఇవి దైనందినచర్యలో భాగంగా ఏర్పరచుకోవాలి. మిగతా భావములు రాకుండా చూసుకోవడానికి ఇందులో మనల్ని మనము కట్టుబాటు చేసుకుంటున్నాము. అనగా మనల్ని మనం నియమించుకుంటున్నాము. మరోరకంగా అయితే మనకు నియమం ఉండదు. ఎందుకంటే పాత అభ్యాసములు, పూర్వ వాసనలూ మనల్ని ఎలాగో మళ్ళీ వెలుగు లోకానికి దూరం చేస్తూంటాయి కాబట్టి, అందులో నుండి దూరం కాకుండా వుండడం కోసం మనకిగా మనం ఓ కట్టుబాటు పెట్టుకోవాలి. ఏదో ఒక గ్రంథ పఠనం అనుస్యూతంగా జరుగుతూండాలి. కొంత జీవులకు సేవ జరుగుతూ వుండాలి. దైనందిన చర్య ఆ విధంగా మలచుకోవాలి. ధ్యానమో, మంత్రజపమో, స్తోత్రమో ఏదోవొకటి జరుగుతూండాలి. ఇలా కొన్నాళ్లపాటు బాగా జరుగుతూ వున్నట్లయితే మన నిజస్వరూపం బయట పడడానికి అవకాశం ఏర్పడుతుంది. స్వభావము నందు మార్పు రాకుండా తేజస్సును దర్శించడమనేది వీలుపడే విషయం కాదు. అది మన సహజ స్వరూపం. కేవలం భావనలను మనం బాగా పరిశీలనం చేయడం ద్వారా కూడా మలినమైన భావములను మనం నిర్మూలించుకుంటూ వెళ్ళే వొక పద్ధతి ఉన్నది. అలా కాకుండా అత్యంత పవిత్రమైన భావములు మనకి స్తోత్రరూపంలోనూ, దైవంయొక్క ప్రశంసరూపంలోనూ లేకపోతే గ్రంథరూపంలోనూ ఉన్న దాన్ని ఆశ్రయించినా కూడా క్రమశః ఈ మార్పులు వస్తాయి. మనలోని మనోమయ కోశములోను, కామమయ కోశములోనూ, అన్నమయ కోశములోనూ మార్పులు వచ్చేంతవరకూ ఓర్పుతో దీన్ని నిర్వర్తించుకుంటే మనయందు ఒక చక్కని ఉత్సాహం వస్తుంది. అది

ఎందువలన వస్తుందంటే చైతన్యవంతులం అయ్యేకొలదీ ఉత్సాహవంతులమవుతాము. ఆ ఉత్సాహంతో కూడి ఇంకొంచెం సాధన చేసికుని అలా మనల్ని మనం వెలుగుగా దర్శించుకునేంతవరకూ కూడా సాధన ఉన్నది. భగవంతుడు తేజస్వరూపుడు కాబట్టి మనలో ధ్యానము చేసుకునేటప్పుడు కూడా హృదయమునందు, భ్రూమధ్యమునందు వీలున్నంత తేజస్సును మనం ఊహించుకోవాలి. ఊహించుకుని దర్శనం చేస్తూ వుండాలి. అందుకనే సుర్యోదయ సమయంలో ఉండే ఆకాశాన్ని దర్శనం చేసి, కనులు మూసుకుని ఆ ఆకాశాన్ని హృదయంలో దర్శనం చేయమని కూడా చెప్తారు. హృదయమునందు కూడా అదే ఆకాశము అంత వెలుగుతోనూ వుంది. 'కాశ్' అంటే 'వెలుగు'! ఆకాశము అంటే అంతులేని వెలుగు! ఆ వెలుగుని హృదయంలో ఉన్నట్టుగా భావన చేసుకోవడం కోసం తూర్పునకు తిరిగి వందనం చేసి, ధ్యానం చేసుకునే ఒక పద్ధతి మనకి పెద్దలు ఇచ్చారు. ఆ పద్ధతిలో మనం చేసుకుంటే వెలుగు పెరుగుతుంది. సుర్యోదయం కనిపించడానికి వీలులేకుండా వుండే నగరంలో మనం జీవిస్తున్నపుడు, ఇంట్లోనే ఒక దీపం పెట్టుకుని బాగా వెలుగుగా ఉండేట్లుగా ఆ వెలుగుని ఒకసారి దర్శించి, లోపల ఆ వెలుగుని దర్శించడానికి ప్రయత్నం చేయాలి. ఈ వెలుగుని పెంచుకోవడం కోసం ప్రాణాయామం బాగా చేయాలి. ఎందుకంటే వాయువు తోడైతే అగ్ని ప్రజ్వలితం అవుతుంది కాబట్టి, వాయువుతో అనుసంధానం చేసుకుంటూ తేజస్సు యొక్క దర్శనం చేసుకునే సాధన చాలా ఉత్తమమైన సాధనగా చెప్తారు. అందుకని ప్రాణాయామం నిర్వర్తించుకుంటూ తద్వారా హృదయమునందు వెలుగును బాగా దర్శించడం అనే కార్యక్రమం చేస్తూంటే, లోపల దైవం యొక్క వెలుగే పెరుగుతున్నదనుకుంటే చిట్టచివరి దశలలో ఈ వెలుగు దైవముగా, దైవమనే వెలుగు మనలో మనలాగా ఉన్నట్లుగా దర్శనమిస్తుంది. ఈ విధంగా భగవంతుడు తేజోవంతుడు. ఎక్కడ కాంతి కనిపించినా అదే అని భావన చేయాలి. సూర్యునిలోని కాంతి అదే! చంద్రునిలోని కాంతి అదే! అగ్నిలోని కాంతి అదే! మిణుగురుపురుగులోని కాంతి అదే! నక్షత్రములలోని కాంతి అదే! ఎక్కడ కాంతి కనిపిస్తే అక్కడ, అది అతని యొక్క ప్రస్ఫుటమైన రూపంగా మనం భావన చేసుకోవడం ఇందులో భాగంగా జరుగుతూ ఉంటుంది.

## 786 వృషః

'వృషః' అంటే సూక్ష్మము నుండి స్థూలమునకు దిగి వచ్చే ప్రజ్ఞ. వర్షము కూడ ఈ శబ్దములోంచే పుట్టింది. సూక్ష్మము నుండి, అదృశ్యమైన లోకాలనుండి దృశ్యమానమైన జగత్తులోకి దిగి వచ్చే వెలుగుని 'వృషః' అంటారు. అందుకని ఇక్కడ తేజస్సు దిగివస్తూ ఉంటుంది. సూర్యుని నుండి ఆ విధంగా వెలుగు దిగి రావడం వలన, మనం ఆకాశం నుండి గమనించినట్లైతే భూమికూడా వెలుగు ముద్దగా ఉంటుంది చంద్రునివలె! చంద్రుడు ఆ విధంగానే వెలుగుతున్నాడు. అన్నిటికీ వెలుగు ఒక కేంద్రం నుండి వస్తున్నది. అది వేదపరంగా మనకి సవితృ మండలం నుండి వస్తున్నట్లు చెప్పారు. సూర్యునిలో ఉన్న వెలుగు సవితృమండలం నుండి వస్తున్నట్లుగా పెద్దలు చెప్పారు. ఈ సమస్తమూ వెలిగింపబడేది ఏదైతే ఉన్నదో, మన కన్నులలోని వెలుగుతో సహా సమస్తమూ కూడా దిగివచ్చిన వెలుగు అని చెప్పడానికి 'వృషః' అని చెప్పారు. వృషభము ద్వారా సమస్త సృష్టి కార్యము జరుగుతోంది. సృష్టి బీజమును వృషభముగా చెప్తారు. వృషః అంటే దిగివచ్చిన వెలుగు స్థితి బేధము చెంది, రకరకములైన లోకములుగా తయారైన వెలుగు. మొదటి వెలుగుని వేదంలో 'అదితి' అన్నారు. అక్కడనుండి రకరకములైన లోకములు ఏర్పడడం జరిగింది. మనలో కూడా ఇన్ని లోకములూ ఉన్నాయి. కన్నులలో ఉండే వెలుగు వేరు. ముఖంలో ఉన్న వెలుగు వేరు. పాదంలో ఉండే వెలుగు వేరు. ఒక్కొక్క కేంద్రంలో ఒక్కొక్క విధంగా భాసిస్తూ ఉంటుంది. ఆజ్ఞలో ఉండే వెలుగుకన్నా మూలాధారంలో ఉండే వెలుగు ఆరు రెట్లు తక్కువ వెలుగుతుంది. పదార్థములయొక్క సాంద్రత పెరిగే కొలదీ వెలుగు తగ్గుతూ వుంటుంది. వెలుగు తగ్గడం అంటే వెలుగు, పదార్థంచే కప్పబడి ఉండడం తప్ప తగ్గడం కాదు. కప్పబడి ఉండడం వల్ల మనకు తగ్గడంగా కనిపిస్తుంది. కనుక సమస్తమునందు ఈ వెలుగు ఉన్నది. అంటే వెలుగులేనట్టు కనిపించే పదార్థంలో కూడా ఈ వెలుగు ఇమిడి ఉన్నది అనే భావం మనం తెలుసుకోవాలి. ఈ 'వృషః' అనే పదం ద్వారా దిగివచ్చిన భగవత్తత్త్వము వెలుగై దిగివస్తున్న సందర్భంలో వృషః అనే పదం వస్తుంది.

# 787 ద్యుతిధరః

అంటే వెలుగుని ధరించినవాడు. వెలుగూ అతడే. వెలుగును ధరించినవాడు కూడా అతడే. తన నుండి సంకల్పం పుడితే, ఆ సంకల్పంలో తాను నిండితే, అక్కడ నుండి తర్వాత స్థితులు ఏర్పడుతూ వచ్చాయి కాబట్టి, ఏది ధరిస్తుందో, ఆ ధరించే తత్త్వం కూడా తన నుండే దిగి వస్తుంది. కాబట్టి దాన్ని వేరుగా చూడకుండా, ఆ భగవత్సమానంగానో, భగవత్స్వరూపంగానో, భగవంతునిచే ఒకస్థితి బేధం చెందిన పరిస్థితిగా దాన్ని గమనించాలనేది ఈ నామంలో గోచరిస్తుంది. ధరించేది, ధరింపబబడినది, ఈ రెండూ కూడా క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము అనే అధ్యాయంలో, భగవద్గీతలో చాలా విపులంగా ఇచ్చారు. క్షేత్రజ్ఞుడు నేనే, క్షేత్రమూ నేనే! అంటాడు. క్షేత్రజ్ఞుడి నుండి క్షేత్రము వ్యక్తమై అందులోనే మళ్ళీ క్షేత్రజ్ఞుడు ఉండడం జరుగుతోంది. మనలోంచి వ్యక్తమైనదాంట్లో మనం వుంటాం. మనలోంచి ఓ భావం వ్యక్తమైతే, ఆ భావంలో మనం జీవిస్తూ ఉంటాం. ఉద్యోగం అనే భావంలో జీవిస్తూంటాం. కుటుంబం అనే భావనలో, ఆరాధన అనే భావనలో ఇలా-- జీవిస్తూంటాం. ఇవన్నీ మన లోంచి పుట్టిన భావనలే. మన భావములలో మనం ఏ విధంగా జీవిస్తున్నామో అలాగే వెలుగులోంచి పుట్టిన సమస్తమును తాను ధరించి వున్నాడు. ఇప్పుడు మన భావం మనమే ధరించి వున్నాం. మన భావం పై భావం మనల్ని ధరించి వున్నది. ఇలా అవగాహన చేసుకోవాలి. ఇల్లు కడదాం అనే భావన మనలోంచి వచ్చి, ఇల్లులా ఏర్పడితే, ఆ ఇంట్లో మళ్ళీ మనం వుంటూవుంటాం. దాన్ని 'పురుషః' అనే నామంగా చెప్పకున్నాం. పురములను ఏర్పరచి అందులో నివసించేవాడు. 'ద్యుతిధరః' ద్యుతిని అంటే వెలుగుని ధరించిన వాడు. ధరించే పాత్ర ఏదైతే వున్నదో అది ప్రకృతి. అది కూడా భగవత్పరంగానే దర్శనం చేయాలి. మొట్ట మొదటి నామంలోనే మనకి దీన్ని గురించి చక్కని వివరణ వచ్చింది. ఏమిటయ్యా అంటే విశ్వం యొక్క రూపమంతా కూడా భగవంతునిరూపంగా భావన చేయమని చెప్తుంది. సృష్టిని సృష్టి గా చూడడం కాకుండా భగవంతుని యొక్క వ్యక్తరూపంగా చూడండి. అలాగా భగవంతుని యొక్క ధారణ శక్తి చేత ఈ సమస్తమైన జగత్తు ఏర్పడి వున్నది. కనబడుతున్నదాన్ని భగవంతుని రూపముగా ముందు చూస్తే, అందులో భగవంతుని యొక్క ప్రజ్ఞ ఏ విధంగా పనిచేస్తుందో అని తెలియడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకనే ద్యుతిధరుడు భగవంతుడు. మనం జీవుడి రూపంలో దైవమును పొంది వున్నాము. అంటే దైవమును ధరించి వున్నాము. దైవము మనని ధరించి వున్నాడు. ఎవరు ఎవర్ని ధరించి వున్నాడంటే ఒకదానికొకటి ఆసరాగా ఆ విధంగా కనిపిస్తాయి. మొత్తానికి దైవమే ఆధారమైనప్పటికీ కూడా, తన నుండి

వ్యక్తమైన దానిలో తాను మళ్ళీ నివసిస్తున్నప్పుడు వ్యక్తం అయినది, ఎవరు వ్యక్తం చేశారో వారిని ధరించి వున్నట్లుగా గోచరిస్తుంది. ఒక పాత్రలో మంచినీరు ఉందనుకోండి. నీరే మంచు అయి, మంచు పాత్ర అయి, పాత్రలో మంచినీరు వున్నది. ఆ విధంగానే సృష్టి సమస్తమూ కూడా అతని నుండి వ్యక్తమైనది స్థితిబేధం చెందినప్పటికీ, మళ్ళీ అందులో నుండి సూక్ష్మత్వం నివసించి వుంటుందని చెప్పడానికి మనకి ద్యుతిధరుడు. ఇప్పుడు ఈ మామిడిచెట్టు చూస్తే ద్యుతిధరుడు. మామిడిచెట్టు చూస్తే వెలుగు గుర్తురాదు. కానీ ధరించి వున్నాడు. అలాగే సూర్యుడ్ని చూస్తే సూర్యుడిని ధరించి వున్నాడు. ధరించి వుండబట్టే ఆకాశంలో నిలబడి వున్నాడు. భూమిని ధరించి వున్నాడు. గోళములన్నింటినీ ధరించి వున్నాడు. అతడు ధరించి వుండడం చేత అవి వేరే బలం, వేరే ఆధారం లేకుండా, అదే ఆధారంగా, ఆ వెలుగే ఆధారంగా అట్లా నిశీధిలో వున్నాయి. దేని మీద ఆధారపడివున్నవి అన్నది మనం చెప్పడానికి కనబడదు. కానీ అన్నీ అలా వ్రేలాడుతున్నట్లుగా వున్నాయి. Suspend అయ్యి ఉన్నాయి. ఆవిధంగా ఎలా వుండగలిగినాయి అని భావన చేస్తే, కేవలం ఆ వెలుగుతత్త్వం బలం చేత ఆ విధంగా అంతరిక్షంలో నిలబడి వున్నాయి.

## 788, 789 సర్వశస్త్రభృతాం, వరః

శస్త్రములు ధరించినవారందరిలో కూడా చాల గొప్పవాడు భగవంతుడు. ఇది శ్రీకృష్ణుడికి ఆపాదించి మనం చెప్పకొనవచ్చు. అన్నిటికన్నా పెద్ద శస్త్రం ఏమిటయ్యా అంటే 'కాల చక్రము' లేక 'సుదర్శనము'. దానిని ధరించ గలిగిన వాడు, దాని చేత సమస్తమునూ నియమించగలిగిన వాడు. సమస్తమూ కాలము చేత నియమిస్తున్నవాడు. కాబట్టి శస్త్రములన్నిటిలోకి కూడా శ్రేష్టమైన శస్త్రములు ధరించినవాడుగా భగవంతుని ప్రార్ధన జరుగుతున్నది. శస్త్రములను ధరించినవాడిని ప్రార్ధన చేద్దాం అనుకుంటే చక్రము ధరించిన విష్ణుమూర్తిని, సుదర్శన చక్రము ధరించిన శ్రీకృష్ణుని భావన చేసుకోవడం ద్వారా రక్షణ కూడా బాగా జరుగుతుందని చెప్తారు. ఎందుకంటే సృష్టి మొత్తమూ కాలాధీనమై నడుస్తున్నది. 24 తత్త్వములు సృష్టి నిర్మాణమునకై పని చేస్తుంటే ఈ 24నీ నియమించే 25 వ తత్త్వముగా కాలమున్నది. కాలమనే చక్రానికి పైన దైవమనేది వున్నది. దైవము కాలము రూపంలో కార్యం నిర్వర్తిస్తూ వుంటాడు. అందుకనే దైవాన్ని కాలము రూపంలో జరిగే సన్నివేశంలా గుర్తించడమే తప్ప, ఇంకోరకంగా గుర్తించడానికి అవకాశంలేదు. మనం ఒక విధంగా చేద్దాం అనుకుంటే మరో విధంగా జరుగుతూ ఉంటుంది కదా! మనం కొన్ని చేద్దాం అని అనుకోకపోయినా జరుగుతుంటాయి కదా! కొన్ని అకస్మాత్తుగా కలసి వస్తుంటాయి. కొన్ని సన్నివేశాలలో వున్నవి పోతూంటాయి. మనయొక్క ప్రయత్నము, సంకల్పము, వీటికతీతంగా ఒకటి పనిచేస్తూ వుంటుంది. ఆ పని చేసే దాన్ని 'దైవము' అన్నారు. అది కాలం రూపంలో వ్యక్తం అవుతూ ఉంటుంది కాబట్టి, ఆ కాలం రూపంలో వ్యక్తం అయ్యే దైవాన్ని మనము అనుసరించడమే తప్ప మరియొక మార్గం లేదు అనేది పెద్దలు చెప్పే విషయం. శ్రీరాముడు ఈ విషయాన్నే లక్ష్మణుడుకి బోధ చేస్తాడు. కైకేయి వరములు కోరిన సందర్భంలో! రాముడు అంగీకరించి అరణ్యానికి వెళ్దాం అనేటి నిర్ణయం చేసుకుంటే, లక్ష్మణుడు అంటాడూ 'పురుష ప్రయత్నం చేత వీరందరినీ మనము నిర్జించి, సింహాసనం నువ్వు ఆక్రమించు, నేను నీకు తోడుగా వుంటాను. ఎవరొస్తారో చూద్దాం.' అని అంటాడు. అంటే అప్పుడు రాముడు చెప్తాడు 'నిన్నటి వరకూ నా తల్లికన్నా నన్ను ఎక్కువగా ప్రేమించిన కైకేయి ఈరోజు నన్ను అరణ్యములకు వెళ్ళమని చెప్పిందంటే అది కేవలం దైవము చేసిన కార్యం తప్ప ఇంకో విధంగా భావించడానికి వీలుకాదు. అనుకున్నది అనుకున్నట్లుగా జరగడం కాక, మరో విధంగా జరగడమే దైవం. తండ్రికి నేను అరణ్యాలకు వెళ్లటం ఇష్టం లేదు. తల్లి నిన్నటి వరకూ నా కన్నతల్లి కన్నా నన్ను ఎక్కువ ప్రేమానురాగాలు చూపించినది. ఆమె యందు ఆకస్మికంగా కలిగిన ఈ మార్పు దైవమే తప్ప

ఇంకోటిగా అనుకోకూడదు. నిమిత్త కారణాలు చూచి, వారిని చూసి ద్వేషించడంకన్నా దాని వెనకాల ఉన్న దైవమును మనము గమనించి, మన కర్తవ్యాన్ని అందులో మనము పూర్తిగా అవగాహన చేసుకుని, తగుమాత్రంగా మనం నిర్వర్తించడం తప్ప మరో మార్గంలేదు.' అంటే లక్ష్మణుడు అంటాడూ 'దైవమైనా సరే మనం పోరాడుదాం పురుష యత్నంగా.'అని. అంటాడు. అంటే రాముడంటాడు 'దైవం కనబడేది కాదు. ఇప్పుడు ఇందులో ఎవరితో పోట్లాడుతావు? నీ తండ్రితో పోట్లాడతావా? అది ధర్మం కాదు. నీ తల్లితో పోట్లాడతావా? ఆమె, ఆయనిచ్చిన వరాల్నే ఇప్పుడు కోరింది. ఇప్పుడు కోరడం ఆమెకివ్వబడ్డ హక్కు తప్ప, ఇప్పుడెందుకు కోరిందనే ప్రశ్నకు సమాధానం లేదు. మొత్తం అంతా ధర్మపరంగానే జరుగుతోంది. ఇందులో మనకిది రాసిపెట్టి వుంది. కాబట్టి దీన్ని మనం అంగీకరించడం తప్ప, ఇందులో నీవు యెవరితో పోట్లాడుతావు?' అంటాడు. అప్పుడప్పుడు ఒక్కోసారి మనకి కూడా అనుకోని కష్టాలు వస్తూంటాయి. మరి వాళ్ళో వీళ్ళో పడేస్తే కాలు విరిగిందనుకోండి? విరిగితే వాడు తోశాడని మనం పడిపోయామని యేడవడం బానే వుంది. కానీ మనమే కాలు జారి పడ్డాం అనుకోండి. ఇంకోడుతోస్తే పడ్డా, మనం పడ్డా విరిగినపుడు తెలిసేదేమిటయ్యా అంటే దైవమే! అలా దైవం కాలం రూపంలో ఒక్కొక్కప్పుడు వ్యక్తమవుతూంటాడు. కాబట్టి కాలాన్ని దాటి ఎవరూ ఏమీ చేయగలిగింది లేదు. ఆ కాలచక్రము ఆయన చేతిలో సుదర్శన చక్రంగా వున్నది. అది తీసుకునే భీష్ముడి మీదకు లంఘిస్తాడు కదా! లంఘించినపుడు భీష్ముడు లొంగిపోతాడు. అందుకని శస్త్రములన్నిటిలోకీ శ్రేష్ఠమైన శస్త్రం ధరించిన శ్రీకృష్ణుడ్ని భీష్ముడు స్తుతి చేస్తున్నాడు. 'సర్వ శస్త్ర భృతాంవర:'అని. కానీ యింకో విశేషం యేమిటంటే మిగతా వారంతా శస్త్రములు ధరించినట్లు కనిపిస్తారు. అమ్ములపొది, విల్లు, రథం నిండా గదలు, కత్తులు, కఠార్లూ, శూలాలు అన్నీ వేసుకొస్తారు. ఈయన ఆయుధం పిలిస్తే వస్తుంది. మోసుకు తిరగనఖ్ఖరలేదు. ఆ విధంగా చూసినా కూడా శస్త్రములు ధరించిన వారిలో శ్రేష్ఠుడు! ఎందుకంటే luggage లేదు. దానినెప్పుడూ వేలుకి తగిలించుకుని, లేదా దాన్ని ఒక సంచీలో వేసుకు భుజాన వేసుకు తిరగనఖ్ఖరలేదు. పిలిస్తే వచ్చే శస్త్రం ఆయన దగ్గర మాత్రమే వున్నది. మిగతా వాళ్ళకి అలా లేదు. మొత్తం యుద్ధం చేసేవారందరూ కూడా ఏవేవో శస్త్రములు పట్టుకొచ్చారు. కానీ ఈయన ఒక్కడే ఏ శస్త్రములూ లేకుండా వచ్చాడు. పిలిస్తే వచ్చే శస్త్రం కలిగిన వాడు ఈయన. మిగతా వాళ్ళంతా మోసుకు తిరగాలి. ఎప్పుడు బాణాలు అయిపోతే పోయి బాణాలు తెచ్చుకోవాలి. పిలిస్తే రావు కదా! ఈయనకు ఎప్పుడు ఎక్కడ పిలిస్తే అక్కడ శస్త్రం ప్రత్యక్షమవడమే కాదు దానికెదురులేదు కూడా. అటువంటి శస్త్రము ఎవరి అధీనంలో వున్నదయ్యా అంటే భగవంతుని అధీనములో ఉన్నది.

కాలచక్రమే సుదర్శన చక్రము. సుదర్శనచక్రం అంటే కాలం యొక్క తీరుతెన్నులు తెలిసిన వారికి సమస్తమూ సుదర్శనమే. కాలజ్ఞానం కలిగిందనుకోండి, సుదర్శనమే కదా! కాబట్టి  అది అస్త్రంగా కలిగినవాడు.

# 790, 791, 792 793 ప్రగ్రహః, నిగ్రహః, వ్యగ్రః, నైకశృంగః

ఇవన్నీ ఒకే తత్త్వానికి సంబంధించిన నామాలు.
ప్రగ్రహో :-- కళ్ళెములు చక్కగా పట్టుకున్న వాడు.
నిగ్రహో :-- కళ్ళెములచేత సమస్తమునూ నియమించిన వాడు.
వ్యగ్రో :-- -- అప్రమత్తుడై వాటిని నిర్వర్తించే వాడు.
నైకశృంగో :-- అనేకములైన ఆధారములుగా ఏర్పడినవాడు.
ధృవములుగా ఏర్పడినవాడు.

శృంగము అంటే ధృవము అని కూడా అర్థం వున్నది. ఏమిటదీ అంటే మనకు భారత యుద్ధంలో కళ్ళాలు పట్టుకున్నట్టుగా కనిపిస్తాడు. చక్కగా, అప్రమత్తగా పట్టుకున్నట్లుగా కనిపిస్తాడు. గుఱ్ఱములను చక్కగా నియమించి నడిపించినట్లుగా కనిపిస్తాడు. అదలా వుండగా భగవత్తత్త్వము ఆయన యొక్క అదృశ్యమైన కళ్ళెములతో సమస్తమైన గోళములనూ, గోళములోని జీవులనూ ఆ విధంగా నియమించి వుంచాడు. అందరికీ సంబంధించిన సూత్రములు ఆయన వద్ద వున్నాయని చెప్తుంది ఈ 'ప్రగ్రహ' అనే నామం. మనలోంచి యిన్ని నాడులలో నుండి, యిన్ని కేంద్రముల నుండి వ్యక్తం అవుతున్న చైతన్యమూ, ప్రాణమూ వున్నది. అది ఆయన అధీనంలో వున్నది. అక్కడ నుండి నియమింపబడుతున్నాయి. ఆరు కేంద్రములూ అక్కడ నుండే నియమింపబడుతున్నాయి. అది కారణంగా పంచభూతములు, మనస్సు కూడా నియమింపబడుతూ వున్నాయి. అంతేకాదు జీవులే కాదు, గోళములు కూడా అలాగే నియమింపబడుతున్నాయి. అదృశ్యమైన కళ్ళెముల చేత ఈ గోళములన్నీ కూడా నడపబడుతున్నాయి. అవన్నీ ఒక విధానం ప్రకారం నడవడం, సంచారం చేయడం, సూర్యుని చుట్టూ తిరగడం. వీటన్నిటికీ ఏదో ఒక నియమించు శక్తి లేకపోతే అదే విధంగా కోట్లాది సంవత్సరాలు, ఆ గోళములు ఆ విధంగా సంచరించడానికి వేరే బలం యేమిటి? అని ఆలోచిస్తే ఏమీ దొరకదు. కానీ అంత శాస్త్రీయంగా, మనం అందరం వూహించడానికి వీలైన పద్ధతులలో బృహస్పతి యిన్ని సంవత్సరములకు రాశిచక్రమును ఒకసారి, శనిగ్రహము కొన్ని సంవత్సరాలు, కుజుడు, బుధుడు, శుక్రుడు ఎవరెవరి వేగముల ప్రకారము వారు సూర్యుని చుట్టూ తిరగడం అనే నియమం ఎక్కడ నుండి యేర్పడుతుంది? వీటన్నింటికీ ధ్రువములు ఎక్కడ నుండి ఏర్పడినాయి? అనేక ధ్రువములు/ శృంగములు 'నైకశృంగ' అంటే. అనేక శృంగములు అంటే కొమ్ములూ లేక ధ్రువములు. భూమియొక్క ధృవము ఏవిధంగా ఏర్పడిందో చెప్పడానికి మనకి ధ్రువోపాఖ్యానం చెప్పారు. అలాగే ప్రతి గోళానికీ ఒక ధృవము వుండడంచేత, అది ఆధారంగా అది తిరుగుతూ వుంటుంది. ధృవముగా తానుండి

దాన్ని తిప్పుతూఉంటాడు. కనక మనలో కూడా ధృవము అనేది ఒకటి వున్నది. ఆ ధృవము మనకి సహస్రారము నుండి మూలాధారము వరకు వెన్నెముకలో వున్న సుషుమ్న నాడిలో వున్న తత్త్వమే! అది వున్నంతసేపు యిది తిరుగుతూ వుంటుంది. అది లేక పోతే యిది తిరగదు. కాబట్టి ఆ శృంగమును ఆధారంగా చేసుకుని, పగ్గములను యేర్పరచి, పగ్గములంటే అక్కడ నుండి వచ్చే చైతన్యవంతములైన కిరణములు, వెన్నెముకలో వుండే ఆ తత్త్వాన్ని ఆధారం చేసుకుని మనలో వుండే షట్చక్రముల యొక్క కార్యక్రమములు నిర్వర్తింపబడుతూ వుంటాయి. అందులో నుండే మనస్సు, పంచభూతములు నియమింపబడుతూ వుంటాయి. అది కారణంగా సమస్తమైన కార్యక్రమాలు శరీరంలో నిర్వర్తింపబడుతూ వున్నాయి. అదేవిధముగా సృష్టిలో మనకు షట్చక్రములు యెట్లాగో, సూర్యుని చుట్టూ యేర్పడ్డ గోళములు ఆ విధంగా తిరుగుతూ ఉంటాయి. వాటిని నియమిస్తున్నాడు. సూర్యుడ్నీ నియమిస్తూ వున్నాడు. సమస్తమునూ నియమిస్తున్నాడు. అన్నిటియొక్క కళ్ళెములూ తన చేతిలో వున్నాయి. తాళం చెవి ఆయన దగ్గర పెట్టుకుని సమస్తాన్ని ఆయన నిర్వర్తిస్తున్నాడు అని చెప్పడానికి ఈ నామాలు చెప్పారు. ప్రగ్రహా, వ్యగ్రహా, నిగ్రహా అని చెప్పారు. 'నిగ్రహా' అంటే నియమించేవాడు. సమస్తమునూ నియమిస్తాడు. కాలచక్రం చేత యెన్నిన్ని నియమిస్తున్నాడో మనకుగా మనకు తెలియదు. ప్రతిజీవి యెంతటివాడైనా, వాడియొక్క మితి, కాలమే యేర్పరుస్తుంది. పెరిగీ, పెరిగీ,పెరిగీ అక్కడ నుండి అహంకరించి, అక్కడ నుండి ఏవో పిచ్చి పిచ్చి పనులు చేసికోవడం ద్వారా తనకి తానే నియమించుకుంటాడు. తనకి తానే పరిమితులు ఏర్పరచుకుంటాడు. ఆ విధంగా సమస్త జీవకోటిని కూడా తన కళ్ళెములతో కాలం రూపంలో నడిపిస్తూ, వాటిని నియమిస్తూ, ఆ విషయమునందు అప్రమత్తుడై, యెవరెవరు చేసిన పనులకు వారికి చక్కటి కర్మ, ఏమాత్రమూ యేమరుపాటు లేకుండా అందిస్తాడు కదా! మనం కొన్ని కొన్ని యెవరూ చూడటం లేదని చేసే వాటిలో కూడా సమస్తమూ ఆయన గమనించి, కాలం రూపంలో వాటికి ఫలితాలు అందిస్తూ వుంటాడు. ఏ ఒక్కటి కూడా ఏమరుపాటు లేక పోవడం అంటే అలా వుంటుంది. ఎంత చిన్న విషయం నుండి యెంత పెద్ద విషయం వరకు సమస్తానికీ చక్కటి account book ఒకటి maintain చేసి అందులో మనం వేసుకునే entry ల ప్రకారం, మనకి చక్కగా వాటి ఫలితాలను అందించే పద్ధతి అప్రమత్తత! ఏదీ పొల్లుపోకుండా జరిగి పోతూ వుంటుంది. అందుకనే మనకు ఈరోజు జరిగేవంతా కూడా యిదివరకు మనం చేసిన వాటి మీద ఆధారపడి వుంటుంది. ముందు బాగుండాలంటే యిప్పుడు మంచి పనులు చేసుకోవాలి. మనం ఎప్పుడూ, ఇప్పుడు బావుండాలనుకుంటూ, బాగాలేదే అని బాధ పడుతూంటే రేపు కూడా యిలాగే వుంటుంది. అందుకని ముందు

బావుండాలంటే, 'భావి' బావుండాలంటే యిప్పుడు చేసుకోవాలి. ఇప్పుడు బాగాలేదు కదా అంటే, యిప్పుడు బాగుండడం, బాగాలేక పోవడం యిక నీచేతులలో లేదు. దానికి సంభందించినది అయిపోయింది. దాని వంట ఇప్పుడు తింటున్నాం. అప్పుడు చేసినది ఇప్పుడు తింటున్నాం. ఇప్పుడు తినేది రుచిగా లేకపోతే, ముందుకు రుచిగా వుండాలనుకుంటే, యిప్పుడు అంతకన్నా బాగా వండుకోవాలి. అందుకు ప్రయత్నం చేయాలి, నేర్చుకోవాలి. కారణాలు యింకొకరి మీద పెట్టకూడదు. సమస్తమూ నిమిత్తకారణమే! ఎవరిది వారికందిస్తాడు. మంచైనా, చెడైనా, సుఖమైనా, దు:ఖమైనా, సౌకర్యమైనా, అసౌకర్యమైనా. సౌకర్యంగా వున్నప్పుడు అన్నీ మరచి జీవిస్తే, ముందు సౌకర్యాలకి యేర్పాటు చేసుకోలేదని అర్థం! అందుకనే శరీరానికి బాగా సంపదలు వచ్చిన సందర్భంలో, సౌకర్యములు బాగా అలవాటు చేస్తే, ఆ తరువాత సంపదలు యెట్లా వస్తాయో అలా వెళ్ళి పోతాయి. చెప్పలేం. ఎప్పుడేం వుంటాయో మనకేం తెలుసు. చెప్పారు

సిరి తా వచ్చిన వచ్చును సలలితముగ నారికేళ సలిలముభంగిన్,
సిరి తాపోయిన పోవును కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ

పోయినప్పుడు సౌకర్యములు మాత్రము శరీరానికి అలవాటైపోయి చాలా కష్టంగా వుంటుంది. ఎండాకాలంలో ఎప్పుడూ మామూలుగా యింట్లో వుండేవాడు యెక్కువ బాధపడడు. కానీ మధ్యలో కొంచెం AC లోకి వెళ్ళి వస్తే యెక్కువ బాధ పడతాడు. ఎప్పుడూ నడచి వెళ్ళేవాడు scooter మీద తిరుగుతూ వుంటే, scooter లేకపోతే నడచి వెళ్ళడానికి బాధగా వుంటుంది. Car ఉన్నవాడికి car లేకపోతే బాధగా వుంటుంది. ఉండకూడదు సాధనలో వున్నప్పుడు. నీపైన నీవు ఆధారపడాలే తప్ప నీనుండి వ్యక్తమైన వాటిమీద నువ్వు ఆధారపడకూడదు. ఆధారపడితే అందులోంచి మనకి బాధలు వస్తాయి. బాగున్నప్పుడు యెక్కువ జాగ్రత్తగా వుండాలి. బాగులేనప్పుడు యెట్లాగూ వుంటాం. తప్పదుకదా. Alternative లేదు. మాస్టరు గారి భాషలో చెప్పాలంటే గతిలేదు. గతిలేక గంజి నీళ్ళు తాగుతున్న వాళ్ళం, బాగా వచ్చినపుడు అడ్డగోలుగా బ్రతికామనుకోండి, దాని వల్ల ఏంజరుగుతుందంటే మళ్ళీ గంజినీళ్ళు తాగలి. అందుకని శుక మహర్షి పరీక్షిత్ మహారాజు దగ్గరకు వచ్చి భాగవతం చెప్తూంటే, గురువు గారు భాగవతం చెప్తున్నారు అని, మంచి పరుపులూ, అవీ అన్నీ సమకూరిస్తే, ఆయన పడుకోడు. 'ఈ ఏడురోజులూ నువ్వు పరుపులు వేస్తావు ! ఆ తరువాత నేనెక్కడ పడుకోవాలి? వెళ్ళిన చోటల్లా పరుపులుండవు కదా!' 'కమనీయంబగు భూమి భాగమ్ములు లేకున్నవే, పడియుండుటకు దూది పరుపులేల?' అని చెప్తాడు. రాజయోగి ఎలా ఉంటాడు అంటే దూదిపరుపు వేస్తే దూదిపరుపు మీద పడుకుంటాడు. దూది పరుపు లేకపోతే ఎలా అని ఆలోచించడు. నేల మీద పడుకుంటాడు. దూదిపరుపు లేకపోతే

నవారు మంచం, నవారు మంచం లేకపోతే నేల. నేల లేకపోవడం వుండదు కదా! కాబట్టి ఏవైతే మనం శరీరానికి అలవాటు చేస్తున్నామో, వాటన్నిటికీ ఎక్కువ అలవాటుపడ్డప్పుడు ఏం జరుగుతోందంటే కష్టం పెరుగుతూ వుంటుంది. అందుకనే మనకు ఆయుర్వేదంలో ఏం చెప్తారంటే 42 ఏళ్ళు వచ్చాక అసలు శరీరానికి సౌకర్యములు అలవాటు చెయ్యొద్దని చెప్తారు. ఒంటి పూట భోజనం చేయి. నేల మీద పడుకో. చన్నీళ్ళు స్నానం చేయి. ఇటువంటివన్నీ ఎందుకు అంటే సౌకర్యాలు పెరుగుతున్న కొలదీ శరీరానికి పదును తగ్గుతుంది. శరీరానికి పదును రావాలని అంటే హింసపెట్టమని కాదు. మామూలుగా ప్రకృతి సిద్ధంగా శరీరానికి ఏది ఇస్తే దాంతో బ్రతకగలదో అది మాత్రమే ఇచ్చి ఊరుకోవడం. శరీరం మీద మనం ఆధార పడుతున్నామా, మనమీద శరీరం ఆధారపడి ఉన్నదా? సత్యమేమంటే మనమీద శరీరం ఆధారపడి వున్నది తప్ప శరీరం మీద మనం ఆధారపడి లేము. కానీ మన అవగాహన తలక్రిందులుగా ఉండడంచేత శరీరానికి బాగున్నకొద్దీ మనకి బాగుంటుందని అనుకుంటాం. శరీరానికి బాగుండడం కోసం మనం చేసే ప్రయత్నంలో అది గయ్యాళి పెళ్ళాం వలే అది నాకింకా అదికావాలి, ఇది కావాలి అని అడుగుతుంది తప్ప ఎప్పటికీ ఒక సుఖాన్నివ్వదు. ఇవ్వక మనల్ని అంతకంతకీ అంతకంతకీ నాసిగా తయారు చేస్తుంది. అందుకే యోగ సాధకులకు ముందుగా చెప్పేది యేమిటంటే 'నీ మీద నీవు ఆధారపడు దేనిమీదా ఆధారపడకు' అనే నియమం. మాస్టారు మంచి ఉదాహరణ. ఆయన నడచి వెళ్ళినపుడు, నడచి వెళ్ళారు, cycle మీద వున్నప్పుడు cycle మీద వెళ్ళారు. ఎవరన్నా scooter తీసుకొస్తే scooter మీద, car తీసుకొస్తే car మీద వెళ్ళారు. అంతే కానీ car లేదు కదా, scooter లేదు కదా ఎలా వెళ్ళాడం అని అనుకోలేదు. అలా పనివుంటే అయన నడచి వెళ్ళిపోయేవారు. 'మాస్టారూ, నేను వస్తున్నానండీ' అంటే 'అలాగే' అనేవారు.అంతేగానీ ఎవరొస్తారా అని చూస్తూ కూర్చునేవారు కాదు. ఎవరైనా వస్తారా, బాగుండునని అనుకుంటే అది యోగ సాధనకి పనికి రాదు. ఎందుకు చెప్తున్నానంటే బాగున్నప్పుడు నేర్చుకున్నవన్నీ, బాగులేనప్పుడు ఇబ్బందిపెడతాయి. బాగుండడం, బాగులేకపోవడం కాలం రూపంలో వస్తూ పోతూంటాయి. బాగున్నపుడు అనుభవించు కానీ తద్వారా బంధింపబడక. బాగులేనపుడు నీవు బంధింపబడకపోవడం వల్ల నీకు సుళువు తెలుస్తుంది. అందుకని అప్రమత్తుడుగా, ముందుచూపు కలిగి, ముందు బాగుండాలంటే, ప్రస్తుతం బాగాచేసుకోవాలి. ప్రస్తుతం బాగా లేదు కదా ఏం బాగు చేసుకుంటాం అంటే, బాగాలేక పోయినా బాగుచేసుకోవడం ఉన్నది.

ధర్మరాజుకి బాగా లేదు అరణ్యంలో బ్రాహ్మణులు చెప్పారు 'ఇట్లా చింతిస్తూ కూర్చుంటే ఏమీ లాభంలేదు. ముందుకు బాగుండాలంటే పుణ్యక్షేత్ర దర్శనం చేద్దాం'

అని. అరణ్య వాసంలో రాముడూ, ధర్మరాజూ ఏం చేశారు? మనంకూడా అదే చేయాలి. కష్టం వచ్చిననాడు మనం కష్టం గురించి ఆలోచిస్తూ కూర్చుంటే ప్రస్తుతానికి బాగాలేకపోవడమే కాకుండా, కష్టం బాధ బరువెక్కడమే కాకుండా, ముందుకి కూడా continue అవుతుంది. అందుకని ముందు పునాదులు మంచికి మనం వేసుకుంటే ముందుకి పనికి వస్తుంది. రామలక్ష్మణులంతటివారు 14 ఏళ్ళపాటు ముని ఆశ్రమాలన్నీ దర్శనం చేశారు. ఎంతమందిని చూశారో వారికే గుర్తులేనంత మందిని చూశారట. అంతమందిని దర్శనం చేశారు. అంతమందితో సంభాషించారు. చక్కని విషయములు వారితో చర్చించుకున్నారు. అరణ్యంలో వున్నామనే మర్చిపోయారు. 13 ఏళ్ళు అయ్యాక లక్ష్మణుడు 'అన్నా! ఎంతమందిని చూశాం. పేర్లు గుర్తు లేవు, ఊర్లు గుర్తు లేవు, ఏం మాట్లాడామో కూడా గుర్తు లేదు' అంటే 'ఏమీ గుర్తుండనక్ఖర లేదు. ఒకటే వెలుగు. ఆ వెలుగుకి విభిన్నమైనవి రుచులు అంటే కళలు. వాటన్నింటినీ అనుభూతి చెందాం. వాటికి సంబంధించినవి హృదయంలో స్థిరపడ్డవి. మనకు తెలియకుండానే యిన్నేళ్ళు గడిచిపోయినాయి' అని చెప్తాడు రాముడు. ఆ విధంగా చేసుకోవడం వల్ల అది బలం కలిగిస్తుంది. ధర్మరాజుకదే బలం కలిగించింది. ఎందుకిది చెప్తున్నానంటే అప్రమత్తుడుగా వుండడం అన్నది మనం నేర్చుకున్నట్లయితే కాలం రూపంలో వచ్చేవాటిని అందుకోవడానికి సమర్థులుగా వుంటాం. అందించేవాడు కాలం రూపంలో రకరకాలుగా అందిస్తాడు. ఏం అందిస్తాడో మనకి తెలీదు. ఏమి అందించినా పుచ్చుకోవడమే తప్ప నిరాకరించడానికి అవకాశంలేకుండా అందిస్తాడు. నీదైనవి నీకట్లా అందిస్తాడు. అది ఆనందదాయకమైనా, దుఃఖదాయకమైనా రెండూ నీ నుండే వుద్భవించినవే. కాబట్టి వాటిని నువ్వు యేమాత్రం complaints లేకుండా, నీకు వచ్చింది అందుకుని, నీవు చేయవలసినది చేస్తూ వుండు. భగవంతుడే అట్లా నిర్వర్తిస్తూంటాడు. కాబట్టి మనం కూడా ఆయన వద్దనుండి నేర్చుకోవలసినది అదే! ఆ విధంగా అంతర్ముఖులమై సుషుమ్నలో వుండే తత్త్వమునందు మనం ఆశ్రయం తీసుకుంటే, అక్కడ నుండి సమస్తమూ నిర్వర్తింపబడుతుంది కాబట్టి, అది తప్ప యింక దేని మీదా ఆధారపడని ఒక స్థిరత్వం భక్తుడికి రావాలి. సాధకుడికి రావాలి. ఏదొచ్చినా అందులోకి పోతాము. పరీక్షిన్మహారాజు చూడండి, శాపం యిచ్చాడని తెలియగానే ఒంటి స్తంభం మేడలోకి వెళ్ళిపోయాడు కదా! ఒంటి స్తంభం మేడ అంటే వెన్నెముకలోని చిత్రిణిలో వుండే సుషుమ్న అనే నాడి. అందులో ఉన్న తత్త్వం. అంతర్ముఖుడవడానికి ఒంటి స్తంభం మేడలోకి వెళ్ళాడు. అంతేకాని పాము కాటేస్తుందేమోనని భయపడి ఒంటిస్తంభం మేడ కట్టించుకుని జీవించిన వాడు కాడు పరీక్షిత్తు. ఇంక యెలాగూ చేయవలసిన కర్తవ్యాలన్నీ అయిపోయినాయి. ఇంక మనం దేహత్యాగం చేయాలి. దానికి కాలం నిర్ణయం అయ్యింది. ఈలోగా

మనం అందులో వుండాలి. ఎప్పుడైనా ఏమిటి మనకు బలమంటే, చిన్నప్పుడు శ్రీకృష్ణశతకంలో

బలమెవ్వడు కరి బ్రోవను, బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్

అని చెప్తారు. అన్నిటికీ బలం లోపల వున్నది. ఆ బలాన్ని నమ్ముకుంటే, అక్కడ నుండి మనం చేయవలసినది కూడా మనకి ప్రస్ఫుటంగా తెలుస్తుంది. అది మౌనంగా చేస్తూండడమే. చేస్తూ, కాలం రూపంలో వచ్చే వాటి మీద ఓర్పు వహించి వుండాలి. అందుకనే భగవద్భక్తులకి సాధనలో మొట్టమొదట చెప్పేది ఓర్పు! ఓర్పు లేకపోతే ఏమీ జరగదు. ఓర్పు వహించి చేయవలసినది చాలా కాలం అలా చేస్తూ వుంటే తద్వారా ముందు బావుంటుంది. ముందు బావుంటుందని యెదురు చూస్తూ చేయడం కాదు. అసలు చేస్తుంటేనే రుచిగా వుంటుంది. కష్టం తెలియదు. ఇంట్లో కష్టం వచ్చినపుడు ఓ రామాయణమో, ఓ భారతమో, ఓ భాగవతమో చదువుకుంటే కష్టం మీద నుండి మనస్సు గ్రంథం మీదకు మళ్ళి, జీవుడికి ఆనందాన్ని కలగచేస్తుంది. ఎందుకంటే సమస్తానికీ యేది ఆధారభూతమో దాని గురించి భావన చేయడం చేత, మిగతా కష్టములు తేలికగా కనిపిస్తాయి. కష్టం గురించి చర్చించడం వలన తెలియదు. దానివలన విచారించడం వలన కూడా తెలియదు. అందుకని తాను సమస్తమూ నియమించే వాడు కాబట్టి, మనని కూడా నియమించేవాడు కాబట్టి, సమస్తమునకూ సంబంధించిన తాళం చెవులు ఆయన చేతిలో వున్నాయి. కాబట్టి, మన సమస్యల పరిష్కారం కూడా ఆయన వద్దే వుందనుకోవాలి. కాబట్టి ఆయనని శరణు వేడడం, ఆశ్రయించడం, ఆయనను ఆశ్రయించడం వలన మనలో కలిగిన బుద్ధిప్రచోదనం వలన, మనకి తోచిన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ వుండాలి. ఆయనచే నియమింపబడిన వాళ్ళం అవ్వాలి. అప్రమత్తులమై ఉండాలి. భగవంతుడు అప్రమత్తుడుగా ఉన్నదనేది నిస్సందేహం. లేకపోతే కోట్లాది సంవత్సరాలు ఈ భూగోళం ఇలా 24 గంటలూ తిరిగి, మళ్ళీ మనకి సూర్యుడ్ని చూపించదు కదా! ఈ గుణములు భగవద్భక్తులలో కనిపిస్తాయి. ఆ గుణములు భగవత్సాధనలో వుండేవాళ్ళు అందుకోవాలి. అప్రమత్తులుగా వుండడం, తనని తాను నియమించుకోవడం. ఇతరులని నియమించుకోవడంలో ఆసక్తి ఉంటుంది మనకి. తనకు తాను నియమించుకోవడం అన్నది ఆత్మసాధకుడు చేయవలసిన పని. ఆయన పట్టుకున్నట్లే కళ్ళేలు పట్టుకోవాలి. దేనివి? మనస్సు, ఇంద్రియములు, శరీరము. మన మనస్సు యెటు పోతోందో రోజూ చూసుకోవాలి. ఏటో పోతూ వుంటుంది. చూసుకోవడంవల్ల యిలా పోతుందని తెలుస్తుంది. లేకపోతే ఇట్లా పోతున్నాం అని కూడా తెలియదు. అందుకనే daily reflections వుండాలి. ఎటు పోతోంది మనస్సు? అటు పోవడం వల్ల నీకు బాగానే వుందా? అసలు నువ్వు అటు పోదామనే అనుకుంటున్నావా, దానికి నచ్చినట్లు? నువ్వు

గమనించకపోవడం వల్ల అట్లా పోతోందా? ఇంద్రియములు యెటువంటి యింద్రియార్థముల వైపు నిన్ను మళ్ళిస్తున్నాయి? శరీరం నీదగ్గర నుండి యేం కోరుతోంది? వీటికేమన్నా కళ్లేలు వున్నాయా లేదా? నీలో నీవుగా నీ మనసుకు, ఇంద్రియములకు, శరీరమునకు సంబంధించిన కళ్లెములు ఏమాత్రం నియమింపబడి వున్నాయి? నియమింపబడ లేదనుకోండి, గట్టిగా దండంపెట్టుకోండి 'బాగా నియమించవయ్యా బాబూ! నాకు చాతకావడం లేదు' అని. అర్జునుడు అలాగ అప్పచెప్పేశాడు. ఇవన్నీ మనం కాస్త నెమరు వేసుకోవాలంటే ప్రపంచం నిద్రలేవడానికి కాస్త ముందుగానే నిద్రలేచి చేసుకోవాలి. మంచం మీదయినా ఫర్వాలేదు. ఈ ఆత్మపరిశీలన లేకపోతే మనకి స్వామిత్వం పోతుంది. నియమించుకోవడం అనే శక్తి కూడా మరుగునపడిపోతుంది. తాను శృంగమునందుండీ, లేక తాను తానుగా వుండీ, అంటే తనకు తానుగా భగవంతుని యొక్క ప్రతినిధి గా, భగవంతుని యొక్క వ్యక్తస్వరూపంగా వున్నాను అనే భావన చేసుకోవడం చేత జీవుడు తన నిజ స్థితిలో వుంటాడు. 'తాను భగవంతుని ప్రతినిధి, వ్యక్తరూపము. మనస్సు, ఇంద్రియములు, శరీరము భగవంతునిచే తనకు ఇవ్వబడినవి. ఈ ఇవ్వబడిన వాటిని వినియోగించుకోడానికి నేను ఈ రోజు నిద్ర లేచాను. వాటిని సద్వినియోగం చేయడానికి ప్రయత్నం చేస్తాను. ఇందుకు నీ సహాయంకావాలి. నువ్వు నడిపించు, నేను నడుస్తాను'. ఇలా చెప్పకుంటుంటే రోజూ మన అధీనంలో మనస్సు, ఇంద్రియములు, శరీరము అంతగా పనిచేయకపోవచ్చును కానీ, భగవంతుని అధీనంలో బాగా పనిచేస్తాయి. కృష్ణుడి చేతిలో గుర్రాలు బాగా పని చేశాయి. రథం బాగా పని చేసింది. చక్కగా కళ్ళాలు పట్టుకున్నాడు. రథాన్ని చక్కగా నియమించాడు. అతడే నియమిస్తాడు. నువ్వాతనిని శరణువేడి, ఈ రథాన్ని నిర్వర్తించుకుంటూ వుండు. అలా వుండాలంటే నువ్వు నీ నిజ స్థితిలోకి ప్రవేశించాలి ప్రతి ఉదయం. ప్రవేశించడం కోసం నీ యందు అతడొక శృంగముగా వున్నాడు.

నైకశృంగః అంటే అనేకములైన అధారములుగా వున్నాడు. నీలో కూడా అలాగ ఉత్తర- దక్షిణ ధృవములుగా యేర్పడి వున్నాడు. అందు తానుంటాడు. అక్కడ నుండి మనం మేలుకున్నపుడు, తాను ఈ జీవుడిగా వ్యక్తమవుతాడు. వ్యక్తమయ్యాక భావాలలోనికి దిగుతాం. భావాలలోకి దిగి పనులు చేసుకుంటూ వుంటాం. కనుక మాటి మాటికీ ఆ స్వస్థానంలోకి పోవడానికి ప్రయత్నం చేయాలి. అక్కడికి వెళ్తే మనమూ, అతడే వుంటాము. తిరిగి వచ్చేటప్పుడు 'నాతోపాటు నువ్వు కూడా రా' అని చెప్పాలి. బాగా వృద్ధిచెందిన సాధకుడైతే అతడే తానుగా వచ్చినట్లు భావన చేస్తాడు. లేకపోతే తనతోబాటూ అతడూ వస్తున్నట్లుగా భావన చేసుకోవచ్చు. అతడే తానుగా వ్యక్తం అవుతున్నాడనేది 'పరిపూర్ణమైన భావన'.

అతడూ, తానూ కలిసి పనిచేస్తున్నారనేది ఒక చక్కటి 'భక్తి భావన'. అతన్ని వదిలేసి మనం పనిచేసుకోవడం మొదలుపెడితే ఈ కళ్యాలు అంత బాగా పనిచేయవు. నియమించడం అంత బాగా వుండదు. ఇంకో రకంగా అయిపోతాం. అందుకని ఈ నామాల్లో 'నైక శృంగో' ముందు తీసుకుని అక్కడ నుండి ప్రగ్రహ, నిగ్రహ, వ్యగ్రహ తీసుకోవాలి. అందుకనే ప్రతి ఉదయం ఈ ప్రశ్న వేసుకోవాలి. మర్చిపోతూ ఉంటాము కాబట్టి మళ్ళీమళ్ళీ అదే గుర్తు చేసుకోవాలి. మరేమి దారి లేదు. ఇంకేం చేసినా అన్యదేవతారాధన అవుతుందంటాడు శ్రీకృష్ణుడు. 'నీకన్నా నన్ను వేరుగా చూసి నన్ను ధ్యానం చేయవద్దు. నీలో నీవుగా నేను వున్నాను కాబట్టి నీలో నన్ను 'నేను'గా దర్శనం చెయ్. నేను సముద్రం అయితే నీవు అలవు. 'నా' నుండి నువ్వు వ్యక్తం అవుతున్నావు. నావాడిగా నువ్వు బ్రతుకు ఈ ప్రపంచంలో, నీకే ఘర్షణలూ వుండవు, సమస్యలూ వుండవు. నన్ను వదలి నువ్వు బ్రతకడానికి ప్రయత్నిస్తే నువ్వు పరిమితుడివి అయిపోతావు' అంటాడు శ్రీకృష్ణుడు. కాబట్టి ప్రతి ఉదయం మనం చేయవలసినది ఒకటే. 'అతడే నేనుగా వున్నాను.' నువ్వు ఏదైతే దైవంగా అనుకుంటావో ఆ దైవమే నీయందు నీవుగా వుందనుకోవాలి. ఇదే 'సోహమస్మి'. ఇది బాగా గుర్తుచేసుకోవాలి. గుర్తుచేసుకుని దాని ప్రకారం నడవడానికి ప్రయత్నం చేయాలి. 'అందర్నీ చూసినపుడు కూడా అతడే వీళ్లందరి రూపంలో వున్నాడు' అనేది గుర్తుకు వస్తుంది. మనం అదే అని గుర్తుంచుకుంటే మిగతావాళ్ళు కూడా అదే అని గుర్తుకు వస్తారు. అది concurrent, సమకాలికంగా జరుగుతాయి. ఆ విధంగా రాజవిద్యారాజగుహ్యంలో భగవంతుడు ధ్యానం ఇచ్చాడు. ముందు అతనితో అనుసంధానం చేసుకోవడం మన శృంగమునందు మనం నిలబడ్డట్లు అవుతుంది. మనం axis అంటామే, మన ధృవములయందు మనం నిలబడవచ్చు. అక్కడ అతడూ, మనమూ ఒక్కటే! అక్కడ నుండి మనం వ్యక్తం అయి వస్తున్నాం. వస్తుంటే, అతనితో కలసి పనిచేసుకోవడంగా భావన చేసికున్నప్పుడు, అన్ని నియమాలు పనిచేస్తాయి. ఇంద్రియములు నియమింపబడతాయి, మనస్సు నియమింపబడుతుంది, శరీరము నియమింపబడుతుంది, అన్నీ నియమింపబడతాయి. అది కారణంగా కార్యములు నిర్వర్తించుకోవచ్చు.

# 794 గదాగ్రజః

గదాగ్రజుడంటే ఒక అర్థం ఏమిటంటే, ఆ రోజులలో కృష్ణుడి సోదరులలో గదుడు అనేవాడు ఒకడుండేవాడు. వసుదేవునికి 8 మంది భార్యలు. మనకి ప్రధానమైన కథే. గ్రంథస్తం ఔతుంది తప్ప ఇంక ఆ చుట్టుపక్కల పుట్టినవాళ్ల గురించి ఎక్కువగా చర్చింపబడదు. గదుడు అనేవాడికి అన్నయ్య అని చెప్పడం ఒకటి. ఇంకొక అర్ధం గదే శత్రుఘ్నుడిగా జన్మించింది. భగవంతుడు రామావతారం ఎత్తిన సందర్భంలో, గద శత్రుఘ్నుడుగా, పుట్టుకొచ్చింది. కాబట్టి ఆయనకి అగ్రజుడు అనే నామంగా కూడా మనం తీసుకోవచ్చు. గదను పెద్దలు మన శిరస్సు, వెన్నెముకగా వర్ణిస్తారు. వెన్నెముక, గదకు ఉండే కాడ లాంటిది. గదకుండే తల మన తల. అంటే cerebrospinal system ని గదగా చెప్తారు. అదొక వేదపరమైన సంకేతం. అది ఎవరి నుండి వ్యక్తం అయ్యిందో, దానికన్నా పైన ఉన్నవాడని అర్థం. ప్రతివారూ ఒక్కొక్క గదే! ఎందుకంటే వెన్నెముకేమో కాడ, బుఱ్ఱ/తల గద యొక్క తల. దాని అగ్రము నందు ఉన్నవాడు లేక దాని ముందు నుండి ఉన్నవాడు. అగ్రజుడంటే ముందు పుట్టినవాడు అని. పుట్టడానికి ఏముంది అసలు, పుట్టుకా, చావు లేనివాడు, ఎప్పుడూ ఉండేవాడు, వాడిలోంచి పుట్టాయి ఇవన్నీ. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క గద. హిందీలో 'గధా' అయిపోయాం మనం. ఈ గద విష్ణుమూర్తి యొక్క గద, చిత్రపటంలో ఎట్లా చూపిస్తారంటే, తలకాయ క్రిందకి గాను, వెన్నెముక పైకి గాను ఉంటుంది. దాన్నుండి మనకు సందేశం ఏమంటే తలకిందులుగా వున్నావు చూసుకో, అని చెప్తుందట. అదొక భావం వున్నది. అందుకని మళ్ళీ మన భావములను సరిచేసుకోవాలి. 'ఏమిటి తలకిందలు' అంటే మనం 'భౌతికం సత్యం' అనుకుంటూ ఉంటాం. స్థూలమైనదంతా సత్యంగా కనిపిస్తుంది. దాని మీదే మొత్తం మన భావముల అల్లికంతా ఉంటుంది. కానీ ఈ స్థూలమైన విషయాలకి సూక్ష్మలోకాల్లో పరిష్కారాలున్నాయి. సూక్ష్మాతి సూక్ష్మమైనది భగవత్ తత్త్వం. అంతకన్నా కాస్త తక్కువ సూక్ష్మమైనది కాలం. దానికన్నా కాస్త తక్కువ సూక్ష్మం అయినవాడు జీవుడు. కాబట్టి నీకన్నా గొప్పవి కాదు నీ సమస్యలు, నీ సంపదలు. కాబట్టి 'నీవు' ప్రధానము. 'నీవు' ఆధారంగా ఇవన్నీ ఏర్పడి వున్నాయి కాబట్టి, నిన్ను నీవు కనుక నియమించుకోగలిగితే, నీ చుట్టూ ఉన్నవి కూడా నియమింపబడతాయి. అందుకనే ఆధ్యాత్మిక సాధనలో 'self rule' అని చెప్తారు. శ్రావణమాసం యొక్క ప్రత్యేకమైన భావం ఏమిటంటే నిన్ను నియమించుకో, ఇతరులను, వారిని వారిని నియమించుకోనీ. ఎందుకంటే మనం రెండు చేస్తాం. మనల్ని మనము నియమించుకోము, ఇతరులను నియమిస్తాము. కదా. హృదయంలోకి ప్రవేశించడం సింహరాశి యొక్క ముఖ్య లక్ష్యం. ఆ లక్ష్యంలోకి

నీవు ప్రవేశించాలంటే నీమీద నువ్వు నియమాలు ఎన్ని అన్నా పెట్టుకో. ఇతరులని మాత్రం నియమించక. English లో ఏమి చెప్తారంటే, 'I rule myself, I let others rule themselves.' అందుకనే మహాత్ములు ఎవరూ కూడా, ఇతరుల జీవితాలని నియమించరు. అడిగితే సలహా చెప్తారు. అడక్కపోతే చెప్పరు. మనం ఎంతో మందిని చూస్తున్నాం. వారంతా మనం కోరి అడిగితే ఏదన్నా చెప్తారు ఇట్లా చేసుకోండని. చేసుకోవడం నీ వంతే. వాళ్ళని వాళ్ళు నియమించుకుంటూ ఉంటారు ఎప్పుడూ. 'Self-rule, Self-regulation.' ఆ విధంగా మనల్ని మనం నియమించుకుంటూ, ఇతరులని నువ్వు అట్లా ఉండాలి, ఇట్లా ఉండాల్సింది, అని మనం అనకుండా నీ దారిన నువ్వు, ఈవిధంగా నియమించుకుంటూ, నీ నిజస్థితిలోకి నువ్వు ప్రవేశించినట్లైతే, ఈ గద మళ్ళీ దాని యొక్క అసలు స్థితిలోకి వస్తుంది. వస్తే ఇంక నీకు మిగిలేది అగ్రజుడుగా ఆయనొక్కడే. అందుకనే భగవద్భక్తులు అయనొక్కరిని తప్ప ఇంకెవర్నీ మన్నించరు. అది అహంకారం కాదు. ఇంకొక భగవద్భక్తుని మన్నిస్తాడు, ఒక పామరుడిని మన్నిస్తాడు. ఒక అహంకారిని మన్నించడు. ఎందుకు మన్నించడు అంటే, తన మీద అధికారం చూపించేవాడిని తను మన్నించడు. కారణం ఏమిటంటే అందరికీ అధికారి ఒకడున్నాడు. అతనికి లోబడి తను ఉన్నాడు. అది కారణం చేతనే పోతన, ఇటువంటి వారందరూ కూడా 'గ్రంథాలు మాకు ఇచ్చేసేయ్, మాకు అంకితం చేయి' అంటే 'చేయనని' చెప్పారు. కారణమేమిటంటే, ఎక్కడ మదం ఉంటుందో, ఎక్కడ గర్వం ఉంటుందో, ఎక్కడ అహంకారం ఉంటుందో, అక్కడ సమర్పణ చేయడానికి, సత్త్వగుణం ఒప్పుకోదు. సత్త్వ గుణం, చూడడానికి మెత్తగా ఉంటుంది కానీ లోపల చాలా గట్టిది. అది కారణం చేత వాళ్ళు ఒప్పుకోరు. అందుకని గదాగ్రజుడు భగవంతుడు. గద మనం. ఈ గద ఎలా వాడుకోవాలి అంటే, ఒక్కటే. Depend upon yourself and become dependable to others if possible, if not possible you need not. Don't develop dependency. అది ఎంత develop చేస్తే అంత మనం, తలక్రిందులు అయిపోతూ ఉంటాం. ఎంత self-rule ఉంటే, అంత మళ్ళీ మనం సరైన స్థితికి వస్తూ ఉంటాం. అందుకని నీ మీద నువ్వు ఆధారపడి, నీ కర్తవ్యాలను నువ్వు నిర్వర్తిస్తూ ఉంటే, నీకు సహాయ పడే వాడు వస్తే సహాయపడినంతవరకూ సహాయం అందుకో తప్ప, సహాయం ఆశించక! ఇదొక పెద్ద నియమం. ఎన్నాళ్ళు సహాయపడతారో మనకు తెలియదు. మాస్టరుగారే ఉదాహరణ. ఇద్దరం కలిసి ప్రయాణం చేస్తూ ఉంటే, నా పెట్టె, ఆయన పెట్టె ఆయన పట్టుకునేవారు. నేను మళ్ళీ ఆయన చేతులోంచి తీసుకొనేవాడ్ని. ఇలా చాలారోజులు జరిగిన తరువాత 'నేనెలాగూ పట్టుకుంటాను కదా, మీరు ఎందుకు ముందు ఇలా పట్టుకుంటారు?' అంటే 'ఏమో' అన్నారు. 'నా ప్రయత్నం మీద నేనుండాలి. నా పెట్టె నువ్వు

పట్టుకుంటావని నేను ఆశించకూడదు. నా పెట్టె నేను పట్టుకోవాలి, అంతే కాదు, if possible, try to be dependable అన్నారు కదా, అందుకని నీ పెట్టె కూడా పట్టుకుంటున్నాను' అన్నారు. 'నువ్వు పట్టుకుంటావు, ఇచ్చేస్తాను. నువ్వు పట్టుకోలేదు, నాకు నిరాశ ఉండదు కదా'! రోజూ మన పెట్టె పట్టుకుంటున్నాడనుకోండి ఎవడన్నా ఒకడు. ఒక రోజు పట్టుకోకపోతే వాడిమీద కోపం కూడా వస్తుంది. ఆయన ఏమనేవారంటే 'ఎప్పుడూ గుర్తుంచుకో, నీ పని నువ్వు చేసుకోవడానికి సిద్ధపడు. నీతో కలిసి ఎవరన్నా పనిచేస్తే చేయనీ. కానీ ఎప్పుడూ చేస్తారని ఆశించక, వదిలేయచ్చు.'అని. నది బయలుదేరినప్పుడు చాలా పిల్ల కాలువలు వచ్చి అందులో చేరడం వల్ల అది మహానది అవుతుంది. సముద్రం చేరే లోపల, కొన్ని వచ్చి కలుస్తాయి, కొన్నేమో విడిపోతాయి. కొన్ని సంయోగం చెందుతాయి, కొన్ని వియోగం చెందుతాయి. మనక్కూడా జీవితంలో చాలా మంది కలుస్తారు. కొంతమంది విడిపోతూంటారు. అయినా మన జీవితం అనే నది ప్రవహిస్తూ వెళ్తూనే ఉంటుంది కదా! చిట్టచివరి వరకు ఉంటారా? ఒక్కొక్క సన్నివేశంలో, ఒక్కొక్క ఆశ్రమంలో మనం ఉన్నపుడు అంటే, బాల, ప్రౌఢ, గృహస్తు, వృద్ధాప్యం ఇటువంటి ఆశ్రమాలు ఉన్నాయి కదా! ఒక్కొక్కప్పుడున్నవాళ్లు ఒక్కొక్కళ్ళు ఉన్నారా? ఎప్పుడూ ఉంటారా? నీ ప్రయాణం నీది కదా, నీ బరువు నీది కదా. పెద్ద ప్రయాణం చేస్తున్నప్పుడు దారిలో ఎవరో ఒకాయన వచ్చాడండీ. పక్కన కూర్చున్నాడు, సాయం చేశాడు. ఆయన ఎప్పుడూ మనతో చివరివరకూ వుంటాడని ఏముందీ? తునిలో Tiffin తెచ్చి పెట్టాడు. బెజవాడ వచ్చినపుడు ఇంకొకడు ఎవడన్నా ఎక్కి తెచ్చిపెడితే బాగుండనిపిస్తుంది. మనస్సు సౌకర్యానికి చాలా తొందరగా అలవాటుపడిపోతుంది. అందుకని, నీదైన ప్రయాణం, నీ బాధ్యత నీవు వహిస్తూ, ఇతరుల బాధ్యతలు కూడా నీకు ఓపిక ఉంటే వహించు. ముందు, నీ luggage నువ్వు మోసుకుంటూ వెళ్ళు. ఎవరైనా మోసేవాడు వస్తాడూ, అందుకుంటాడూ, అందుకోనీ. అందుకోరూ; ఆశించక. మరి, ఈ చిన్న ఉదాహరణ నుండి మనకి తెలిసింది. ఆయన ఎన్ని సార్లైనా సరే అట్లాగే పట్టుకునేవారు. అంతే కాదు, ఆయన దారిన ఆయన బయటకు వెళ్ళాలంటే, వెళ్ళి పోయేవారు. ఎవరన్నా scooter ఎక్కించుకుంటే ఎక్కుతారు. లేకపోతే అట్లా వెళ్లిపోవడమే! గరుత్మంతుడికోసం విష్ణుమూర్తి వేచి వుంటే కుదరదు కదండీ! తీరా మనం బయటకి వచ్చేసరికి మన car, driver లేరనుకోండి. మనమైతే చతికిల పడిపోతాం. వాడివాళ రాలేదురా? అని చెప్తాం. కానీ చేయాల్సిన పని చేయము కదా. మరి ఆయన అలాకాదు. ఇవన్నీ examples. అంటే Self reliance is the fundamental quality of spirtuality . మీరు ఇవాళ వెళ్ళి చూస్తే, అక్కడ శివానందమూర్తిగారు ఉన్నారు. ఆయనే మందు prescribe చేసి, ఆయనే

మందుకట్టి, ఆయన చేతులతో ఆయనే యిస్తారు. కట్టి యివ్వడానికి మనుషులుండవచ్చు, కానీ అదొక regulation. మనం అయితే మందు చెప్పేసి కట్టివ్వండి అని చెప్తాం. పైన ఉంది తెచ్చుకోండి అని చెప్తాం. అంటే మనం ఎక్కడ? వ్యత్యాసం చూసుకుంటే చాలా వుంటుంది. అందుకే మనకి కావలసింది ఏంటయ్యా అంటే, 'To Be' . దీనినే 'నిరాలంబయోగం' అంటారు. 'నీ భావముల పై కూడా నీవు ఆధారపడకు' అని చెప్తారు ఉన్నత స్థితిలో, ఇంకా ముందుకెళ్లిన స్థితిలో. ఒక్కొక్క భావానికి ఒక్కొక్కడు అమ్ముడుపోతూ ఉంటాడు. నీ నుండి పుట్టింది కదా నీ భావం, దానికి నువ్వు అమ్ముడు పోక. నువ్వే స్వామిగా ఉండు నీ భావానికి కూడా. అప్పుడు ఏ భావమూ నిన్ను బంధించదు. ఏ భావమూ నిన్ను ఇరుకున పెట్టదు. నీవు నియమించినట్లుగానే భావములు నిర్వర్తింపబడుతూ ఉంటాయి. లేకపోతే ఏం జరుగుతుంది, అట్లా railway platform లాగా బుర్ర మీద అన్ని వచ్చిపోతూ ఉంటాయి. Railway platform మీద పళ్ళు అమ్ముకునేవాడి దగ్గర నుండి ఉమ్ములు వేసేవారి వరకూ ఉంటారు. ఇవన్నీ మన మనస్సులో ఇంత range ఉంటుంది. ఎందుకుంటుందీ అంటే allow చేశాం కాబట్టి ఉంటుంది. అనుమతించాం కాబట్టి ఉంటుంది. అలా కాకుండా భావన ఆయనయందు ఉంచడమో, కర్తవ్యమునందు ఉంచడమో అయితే ఇవన్నీ ఉండవు. అలా నిర్వర్తించుకోవాలి. నిర్వర్తించుకుంటే మళ్ళీ మనం నిలబడిన గద వలె ఉంటాం. లేకపోతే తలక్రిందులైన గదవలె ఉంటాం. వీటన్నిటికీ మనకి మామూలుగా ప్రతిరోజూ కాస్తోకూస్తో మన భావములు మనం పరిశీలించుకోకపోతే తెలియదు. అందుకని రోజూ ఆత్మ పరిశీలనం కావాలి. ఆత్మశోధనం కావాలి. అది జరుగుతూ ఉంటే బండి పట్టాల మీద ఉంటుంది. లేకపోతే పక్కదారుల్లో వెళ్ళిపోతూ ఉంటుంది. బాగానే వెళ్తోందని మనం అనుకుంటూంటాం. ఎక్కడో ఆగిపోతుంది అది. ఎందుకిలా అయిందని చూసుకుంటే, పక్కదారి పట్టేసి ఉంటుంది. అందుకని daily introspection 'నేనెవరని ప్రశ్న వేసుకుని, నేనేం చేయాలి అని ప్రశ్న వేసుకోవాలి.' ఈ రెండూ మాత్రం ఖచ్చితంగా వేసుకుంటే, అక్కడ నుండి తేజస్సు నింపుకోవడం, తేజస్సు ధరించడం. తేజస్సు మనం ఎప్పుడైతే మనలోకి ఆవాహనం చేశామో తేజోవంతులం అవడానికి, అది మనలోకి దిగి వస్తుంది. 'అప్పుడు వృషః దిగి వస్తుంది, మనం దాన్ని అందుకుని దాన్ని పొంది వుందాము. 'ద్యుతిధరః'. ప్రగ్రహః, అది ఉండడం చేత మనస్సు, యింద్రియాలు శరీరాన్ని మనం నియమించి ఉంచవచ్చు. నిగ్రహః, 'వ్యగ్రః' అప్రమత్తతతో ఉండవచ్చు. పట్టుకుని ఉండవచ్చు. 'నైక శృంగః' ఈ నామానికి మీరు జ్ఞాన విజ్ఞాన యోగం, 7వ అధ్యాయం బాగా చదువుకోవాలి. అందులో చాలా బాగా యిచ్చారు. ప్రతిఒక్కడు కూడా మనం

పెట్టుకున్న సంబంధాలతో మనం చూస్తాం గానీ, అలా చూడకపోతే ప్రతివాడూ వ్యక్తిగా తానొక జీవుడు, జీవుడుగా దేవుని యొక్క వ్యక్త స్వరూపం. తాను ఆ మొత్తంలోంచి దిగి వచ్చినవాడు, ఈ పంచభూతాత్మకమైన సృష్టితో ప్రవర్తిస్తుండేవాడుగా అనుస్యూతం భావన చేసుకుంటూ ఉంటే, అటు దానితో ముడి వుండడంవలన జ్ఞానం, వీటితో పనిచేస్తున్నప్పుడు విజ్ఞానం. రెండూ ఉంటాయి. అదీ జ్ఞాన విజ్ఞాన యోగం. బహిరంగమునందు విజ్ఞానముతో కూడి పని చేస్తాడు, అంతరంగమునందు జ్ఞానముతో యోగము చెంది ఉంటాడు. జ్ఞానముతో యోగము చెంది ఉండడమువలన బహిః ప్రపంచములో విజ్ఞానపరంగా జీవించడానికి అవకాశం ఉన్నది. ఆ విధంగా జీవిస్తూ ఉండడమే!

## 795 చతుర్మూర్తిః

ఇది చాలా అత్యద్భుతమైనటువంటి శ్లోకము. ఇవి విజ్ఞానమయలోకానికి గానీ, ఆత్మసాధనమార్గానికి గానీ, అంటే జ్ఞానమయలోకానికి గానీ చక్కని ద్వారములు తెరిచే నామాలు ఇవి. అత్యంత విశేషమైనవి. వేదవ్యాసునికి ప్రత్యేకంగా అత్యంత ప్రీతికరమైన నామములు ఇవి. నాలుగు నాలుగు నాలుగుగా భగవంతుని యొక్క తత్త్వం సృష్టియందు, మనయందు ఏ విధంగా ఉన్నదో తెలిపే నామములు ఇవి.

చతుర్వర్గఫలం జ్ఞానం కాలావస్థా చతుర్యుగా
చతుర్వర్ణం మయోలోకః తత్తత్సర్వం చతుర్ముఖాత్

వేదవ్యాసుడు భారతంలో నిర్వచిస్తాడు. అలాగే మనకి వేద సూక్తములలో

చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణాయే మనీషిణః
గుహాత్రీణి నిహితా నేంగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి

అనేది మనకి సరస్వతీసూక్తములలో గోచరిస్తుంది. అలాగే మరియొక సూక్తమునందు

చత్వారి శృంగా త్రయోస్య పాదా ద్వే శీర్షే సప్తహస్తాసో అస్య
త్రిధాబద్ధో వృషభో రోర వీతి మహాదేవో మర్త్యాగ్ం అవివేశః

అనే శ్లోకం ఒకటి కనిపిస్తుంది. వీటన్నిటిలో కూడా నాలుగు అనే అంకెకు సంబంధించిన జ్ఞానం చాలా పరిపూర్ణంగా ఇవ్వబడి ఉన్నది. సృష్టిని చతుర్భుజుడుగా, చతుర్మూర్తిగా, చత్వారి వాక్కు అంటే నాలుగు రకాలుగా వ్యక్తమవుతున్న వాక్కుగా, నాలుగు కాలములుగా, నాలుగు వేదములుగా, ఇట్లా మనకి చాలా చక్కగా వివరించి ఇచ్చారు. ఇందులో మూడు కనపడనివి, ఒకటి కనపడేది. కనపడని మూడు గురించి తెలుసుకోవడానికి మనకి జ్ఞానమార్గమున్నది. మహాత్ములు నడిచిన మార్గమున్నది. సూక్ష్మము అయిన తత్త్వము మూడులోకములూ ఆవరించి ఉండగా, స్థూలమైనది కనపడే లోకంగా ఒకటి ఏర్పడి ఉన్నదని మనకి పురుషసూక్తం కూడా చెప్తుంది.

పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యా అమృతం దివి

అని. ఇది వేదఋషుల యొక్క తత్వజ్ఞానంలో చాలా కీలకమైన సూత్రం. ఇది మనకి మామూలుగా ఈ కనిపించేదే అంతా అనుకుంటూ ఉంటాం. కానీ ఈ కనిపించేదానికి కనిపించకుండా మూడు స్థితులలో తత్త్వము అస్తిత్వము చెంది ఉన్నది. ఈ కనపడేది ఆ మూడింటి యొక్క ఫలితమే! కాబట్టి మూడు స్థితులు దాటి నాలుగవ స్థితిలో కనిపించేదిగా ఏర్పడుతూ ఉంటుంది ఈ సృష్టి, మనం కూడా. మనలో కూడా నాలుగు స్థితులు ఉన్నాయి. సృష్టిలో కూడా నాలుగు స్థితులు

ఉన్నాయి. కాలంలో కూడా నాలుగు స్థితులు ఉన్నాయి. ఇట్లా అన్నీ నాలుగు నాలుగు నాలుగుగా ఉన్నాయి అబ్బాయ్, అందులో ఈ నాలుగోదిగా మనకి కనిపించేది మార్పు చెందాలంటే, ఇక్కడ మనం మార్పులు చేస్తే అవదు, సూక్ష్మలోకాల్లో మార్పులు చేస్తే, అవి భౌతికలోకంలో మనయందు చక్కని మార్పులుగా గమనింపబడతాయి, గుర్తింపబడతాయి, వ్యక్తం అవుతాయి అని చెప్పే సూత్రం ఇది. అందుకని చాలాచోట్ల ఈ సూత్రం వస్తుంది. Madam Blavatsky ఆమె నేర్చుకున్న సమస్తమైన విజ్ఞానానికి ముందు ఈ శ్లోకం మీద ఎక్కువ అంటే ఈ నాలుగు అనే దానిమీద ఆమె చేత చాలా సాధన చేయిస్తారు. మాస్టరుగారి గ్రంథాలు మనం బాగా తరచి చూస్తే ఈ సూత్రం మీద ఆధారపడి ఎన్నో వివరణలు మాస్టరుగారు ఇచ్చినవి ఉంటాయి. పురుషోత్తమప్రాప్తియోగం అంతా దీని గురించి చెప్పేదే. దీని యొక్క ప్రాముఖ్యం గురించి చెప్పడానికి ఈ విషయాలన్నీ చెప్తున్నాను. కనపడుతున్న దానికి వెనకాల కనపడనివి మూడు ఉన్నాయి. కనపడనివి, సూక్ష్మమైన వాటిల్లో మార్పులు తీసుకువస్తే, కనపడే దాంట్లో మార్పు వస్తుంది. మనం కనపడే దాంట్లో మార్పు చేద్దాం అనుకుంటాం. అందుకని మార్పులు రావు. మన జీవితంలో మంచి మార్పులు రావాలంటే మనం సూక్ష్మలోకంలో మన యొక్క అస్తిత్వమునందు మార్పులు తెచ్చుకోవాలి అంతర్లోకములయందు మార్పులు తెచ్చుకోవాలి. తెచ్చుకుంటే అవి బహిర్లోకంలోకి మార్పులుగా వ్యక్తం అవుతాయి. దానికి చాలా చక్కని ఉదాహరణలు కూడా మనకి పెద్దవాళ్ళు ఇచ్చి ఉన్నారు. అందులో ఒకటి ఏమిటంటే మీరు నీరుని మంచుగడ్డ చేసిన సందర్భంలో మంచుగడ్డలో ఏవో నలకలు కనపడ్డాయనుకోండి, ఆ నలకలు తీయాలంటే మంచుగడ్డలోంచి చాలా కష్టం అవుతుంది కదా! దానికి మనం లోపల ఎన్ని నలకలని ఏర్తాం? తీస్తే మంచుగడ్డ పగిలిపోతుంది. దానికి మనం ఏం చేయాలంటే, దాన్ని ముందు స్థితి అయిన నీటి స్థితిలోకి తీసుకువెళ్ళి అక్కడ ఏరుకోవచ్చు. అదొక పద్ధతి. అంతకన్నా ముందు స్థితిలో ఉండే ఆవిరిగా దాన్ని మార్చుకుని, దానికి distillation process చేసుకుని, మళ్ళీ మంచి నీటిగా దాన్ని తెచ్చుకుని, ఆ మంచినీటిని మళ్ళీ నలకలు లేని మంచుగడ్డగా తెచ్చుకోవచ్చు. అలాగే మనం మంచి చక్కటి స్ఫటికంగా కనిపించే మంచు గడ్డ తయారు చేద్దాం అనుకున్నప్పుడు నీళ్ళల్లో ఒక బొట్టు సిరా పడ్డదనుకోండి, మంచు గడ్డ అంతా కూడా నీలంగా తయారైపోతుంది. నీలంగా మనకి మంచుగడ్డ వద్దు అని మనం అనుకున్నాం అనుకోండి. నీలంగా మంచుగడ్డ మనకి వద్దు అనుకుంటే ఇంక మీరు దాన్నెంత చితక్కొట్టినా అందులో ఉండేటువంటి నీలం అసలు బయటికి తీయలేం కదా! తీయాలంటే ఒకటే మార్గం. ఈ మంచుగడ్డ అంతకు ముందు స్థితులలోకి వెళ్ళాలి. అంటే నీరై, ఆవిరి అయి, మళ్ళీ ఆవిరిని చక్కగా మనం collect చేసుకుని,

మళ్ళీ నీటిగా, స్వచ్ఛమైన నీటిగానూ, మళ్ళీ మంచుగడ్డగానూ చేసుకోవచ్చు. ఇది యోగమార్గము! అంటే ఏమిటి? మార్పులు సూక్ష్మలోకముల్లో జరగాలి తప్ప, స్థూలమైన లోకంలో చేయడానికి అవకాశం ఏర్పడదు. ఈ ప్రపంచం మారాలి మారాలి మారాలి, అని అనుకునే వాళ్ళందరూ కూడా ముందు భావమయలోకాల్లో చాలా మార్చుకోవాలి. భావమయలోకాల్లో మార్చుకోవాలి అంటే తమయందు చైతన్యం బాగా పెంచుకోవాలి. అంటే బుద్ధి పెంచుకోవాలి. వికాసం పెంచుకోవాలి. వెలుగు పెంచుకోవాలి. అది కారణం చేత భావములయందు మార్పు రావాలి. మనం ఎన్ని పనులు చేస్తున్నా భావముల రీతి ఒకే రకంగా ఉంటుంది కదా! మనకొచ్చే ఈర్ష్యగానీ, అసూయగానీ, రాగద్వేషాలుగానీ, కామక్రోధాలుగానీ, దుఃఖములుగానీ, ఆత్రుతలుగానీ, ఆదుర్దాలుగానీ, భయములుగానీ ఇవన్నీ మారవు, ఎన్నాళ్ళు పోయినా! ఎందుకు మారవు? స్థూలం నుండి సూక్ష్మంలోకి ప్రవేశించకపోవడం వలన మారవు. సూక్ష్మంలోకి ప్రవేశించడం కోసమే దైవ ప్రార్థనలు, ధ్యానములు అవన్నీ ఇచ్చారు. అవి చేసుకోవలసిన రీతిలో చేసుకున్నట్లయితే మార్పులు సహజంగా వస్తాయి. అలా కానప్పుడు మార్పులు రావు. అందుకని Pythagoras అనే మహాశయుడు కూడా ఈ విద్యనే 'The triangle within the square' అని ఇచ్చాడు. Tetractys అంటారు. లేకపోతే Tetragrammaton అంటారు. భౌతికమైనది నాలుగవ స్థితి, దానికి ముందు మూడు స్థితులు అదృశ్యంగా అందులోనే ఇమిడి ఉన్నాయి, ఆ మూడిటిలో వచ్చే మార్పులు ఈ నాలుగవ స్థితిలో మనకి చక్కటి మార్పుగా గానీ, మరొక రకంగా గానీ ఏర్పడుతుందని చెప్తారు. అదే విషయాన్ని మనకి భగవద్గీతలో సృష్టి త్రిగుణాత్మకము, త్రిగుణముల యొక్క సమ్మేళనం బట్టి ఏర్పడే సృష్టి ఉంటుంది అని చెప్తారు. మనలో రజోగుణం ఎక్కువగా ఉంటే దానికి సంబంధించి -సృష్టి- ఆ విధంగా వాడి జీవితం అట్లా నడుస్తూ ఉంటుంది ఎప్పడు ఉరుకులూ పరుగులుగా. దేనికీ తీరిక ఉండదు. ఏం చేస్తున్నావ్ అంటే ఏం ఉండదు. మాస్టరుగారు చెప్పినట్లుగా జాకీ పైకెత్తేసి నాలుగు చక్రాల మీద car speed గా తిరుగుతూ ఉంటే చక్రాలు తిరుగుతూ ఉంటాయి కానీ మన దూరం cover అవదు. అట్లా రజోగుణ సంపన్నుడు విపరీతంగా కార్యాలు చేస్తూ ఉంటాడు. అందులో tangible గా తను పొందేది ఏమీ ఉండదు. తమోగుణం ఎక్కువగా ఉంటే అట్లా స్థబ్దల్లే పడి ఉంటాడు. తద్వారా ఇబ్బందులు వస్తూ ఉంటాయి. సత్త్వగుణము, తమోగుణము, రజోగుణము ఉండవలసిన రీతిలో ఉండి, ఉండవలసిన సమయములలో ఉండి, ఉండవలసిన కార్యములలో ఉన్నట్లయితే జీవితంలో చక్కటి అనుభూతి వస్తుంది. రాత్రిపూట నిద్ర రావాలి. పగలు నిద్ర రాకూడదు. ఆవిధంగా తమోగుణం రాత్రికి పని చేయాలి. పగలుకు పనిచేయకూడదు. పగలు

తమోగుణం, రాత్రి రజోగుణం ఉందనుకోండి, రాత్రి 12 అయినా నిద్ర పట్టదు. తెల్లవారుజామున లేవలేం. ఇటువంటివన్నీ ఉంటాయి. కాబట్టి మూడు గుణముల యొక్క కలయిక చేత ఈ సృష్టి నిర్మాణం జరుగుతోందబ్బాయ్, ఈ మూడు గుణములు అదృశ్యంగా ఉన్నాయి నీయందు. వాటిని నువ్వు పునర్నిర్మాణం చేసుకున్నట్లయితే నీ జీవితం చక్కగా నిర్మించబడుతుంది. అందుకని సమస్తమూ నాలుగు స్థితులలో ఉన్నవి. నాలుగో స్థితిలో కుస్తీ పట్టక, ఏం పని కాదు. అంతకుముందు ఉండే సూక్ష్మమైన స్థితుల్లో మార్పులు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేసుకో. నీ భావములయందు మార్పులు తెచ్చుకో. నీ అవగాహన యందు మార్పు తెచ్చుకో. నీ బుద్ధికి పదును పెట్టు. నీవు చైతన్యవంతుడిగా ఏ విధంగా ఉన్నావో తెలుసుకో. ఈ మొత్తం ఏ విధంగా ఉందో తెలుసుకో. అందులో నీ వంతు కర్తవ్యం ఏమిటో నువ్వుగా నువ్వు తెలుసుకో. తద్వారా దాన్ని నిర్వర్తించడానికి కావలసిన బలాన్ని కూడా బుద్ధిలోకాల నుండి అందుకో. అందుకుని జీవితాన్ని నిర్వర్తించుకో. నిర్వర్తించుకుంటే 10,12 సంవత్సరముల్లో అంతకు ముందు జీవితం వేరు, ఇప్పుడు జీవితం వేరుగా మారుతుంది. కాబట్టి యోగసాధకునకి తన జీవితాన్ని దివ్యంగా మార్చుకోవడానికి కావలసినదంతా కూడా అంతర్ముఖ సాధనే తప్ప బహిర్ముఖము కాదు, అని తెలుపుతుంది ఈ నామం. అందుకని ఆ మూడు కనపడకుండా ఉంటాయి కాబట్టి మనకవి ఎంతసేపూ భౌతికలోకమే సత్యం అని నమ్మేవాళ్ళకి, ఎప్పుడు అప్పులిచ్చుకుంటూ ఉంటాం మనం తెచ్చుకోలేమనుకోండి తిరిగి, అంటే మనం అప్పులిచ్చే పద్ధతిలో తేడా ఉంటుంది. ఎప్పుడూ ఏవో ఒకటి తింటూ ఉంటాం, కడుపునొప్పి తెచ్చుకుంటున్నామనుకోండి. మనం తినే పద్ధతిలో తేడా ఉంది. ఎప్పుడూ ఏవో మాటలు మాట్లాడి వాటి ,వల్ల మనం సమస్యలు తెచ్చుకుంటున్నామనుకోండి. మనం మాట్లాడే మాటల విధానంలో తేడా ఉంది. కాబట్టి ప్రపంచం మన్ని ఎందుకిట్లా అన్యాయం చేసేస్తోంది అని అనుకోకుండా, తనలో ఉండే వీటిని గమనించి వీటిని మార్పు తెచ్చుకుంటే, చక్కగా నిర్వర్తించుకోవచ్చు. చక్కగా మాట్లాడేవాడు ప్రపంచాన్ని జయిస్తాడు. వాక్కు చాలు ప్రపంచాన్ని జయించడానికి. జీవితాన్ని పాడు చేసుకోవడానికి కూడా అదొక్కటి చాలు. కొంతమంది మాట్లాడితే శని మాట్లాడినట్లుంటుంది. కొంతమంది మాట్లాడితే బృహస్పతి మాట్లాడినట్లుంటుంది. ఉత్తమాట మాట్లాడి, ఏమీ కదలకుండా, ఒళ్ళు కూడా అలవకుండా ప్రపంచం చేత పని చేయించుకున్న వాళ్ళు బోల్డుమంది ఉన్నారు. మరి వాక్కులో అంత ఉన్నది. ప్రతి విషయంలో కూడా మనకి సరిగ్గా జరగట్లేదు అంటే దానికి సంబంధించింది మనలో సరి అయిన అవగాహనము, విధానము లేదు అని అవగాహన చేసుకోవాలి. దానికి మార్పులు పెద్దల యొక్క guidance లో, సలహా సంపత్తులతో, నిర్దేశకత్వంలో, మార్పులు

చేసుకోవడానికి ప్రయత్నం చేయాలి. అందుకని సూక్ష్మలోకముల్లో చేసుకుంటే మార్పులు, బయటలోకంలో అవన్నీ మనకి అట్లా వ్యక్తం అవుతాయి. చాలామంది జీవితాల్లో, అంతకు ముందు ఆయన అలా ఉండేవారండీ. అప్పుడు వేరు. ఇప్పుడు వేరు. కదా! అంటూ ఉంటారు. ఎలా మారిపోయాడు? ఊరికే overnight ఎవరూ మారిపోరు. ఎంతో లోపల జరిగితే బయటికి మారుతుంది. ఓ మంచి జామపండు ఉన్నది. బాగా పండింది. బాగా పండడం లోపల నుండి బయటికా? బయట నుండి లోపలికా? ఎన్ని మార్పులు లోపల జరక్కపోతే అది పండయ్యింది? ఎన్ని మార్పులు చెట్టులో అంతర్లీనంగా జరక్కపోతే బయటికొక పండొచ్చింది? ఎన్ని మార్పులు అలా అదృశ్యలోకములలో జరుగుతూ ఉండడం వలన ఈ బయట మార్పులు కనిపిస్తున్నాయి? నీలో కూడా నువ్వు సరి అయిన మార్పులను తెచ్చుకోగలిగినట్లయితే, నీకావిధంగా బయట సృష్టిలో నీకు, సృష్టిలో ఏం తేడా లేదు, మనలో తేడా వలన మనకి సృష్టి తేడాగా కనిపిస్తూ ఉంటుంది. అందుకని ఆత్మబలంగా సాధన చేసుకుంటూ ఉండేవాడు, తనలో త్రిగుణముల యొక్క కలయిక ఏ విధంగా ఉన్నదో, blend ఏ విధంగా ఉన్నదో చూసుకోవాలి. మిశ్రమము ఏ విధంగా ఉన్నదో చూసుకోవాలి. అంతర్ముఖంగా అది సత్యం. బహిర్ముఖంగా అది సత్యం. ఇప్పుడు ఈ నామంలో మనకి  చతుర్మూర్తిః అని వస్తుంది. చతుర్మూర్తి అంటే నాలుగు మూర్తులు ఉన్నాయని. ఏమిటి నాలుగు మూర్తులు అంటే అతడే సత్యముగా ఉన్నాడు. అతడే చైతన్యవంతుడవుతున్నాడు. చైతన్యవంతుడు అయినప్పుడు తనయందు బుద్ధి ప్రకాశం జరిగి తద్వారా, భావనలు వస్తున్నాయి. అది కార్యాచరణంగా జరుగుతోంది. సృష్టికైనా అంతే మనకైనా అంతే! భగవత్తత్త్వం అయినా అంతే, మనం అయినా అంతే! మనం ఉదయం నిద్ర లేవకముందు ఉన్నాం. లేచినప్పుడు చైతన్యవంతులం అయ్యాం. చైతన్యవంతులం అయిన తరువాత మనకు భావనలు వచ్చానాయి. భావనలు ఆధారంగా పనులు జరుగుతున్నాయి. కానీ జరిగింతర్వాత చేయగలిగిందేం లేదు. పని జరక్కముందు ఎన్ని మార్పులన్నా చేసుకోవచ్చు భావమయలోకంలో. బాగా ఎవరినన్నా తిడదాం అనిపించిందనుకోండి, తిట్టేసిం తర్వాత ఇంక చేయగలిగిందేం లేదు. దాని యొక్క ఫలితాలు అనుభవించాలి. తిట్టకముందు భావమయలోకంలో, కాస్త బుద్ధియోగం చేత దాన్ని దాటగలిగితే, దాని ఫలితాలు మనకి తగలకుండా ఉంటాయి. కాబట్టి మనలో నాలుగు స్థితులు ఉన్నాయి. ఏది? సత్యము, చైతన్యవంతము, భావమయము, వాఙ్మయము లేక చేసేపని చతుర్మూర్తిః.

## 796 చతుర్బాహుః

అలాగే మనకి నాలుగు బహువులున్నాయన్నారు. నాలుగు బహువులు మనకి కాలం రూపంలో కనిపిస్తాయి. ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, రాత్రి. అలాగే శిశువుస్థితి, యువకునిస్థితి, మధ్యవయస్కుడు, వృద్ధాప్యము నాలుగు కనిపిస్తాయి. ప్రతిరోజుకి వృద్ధాప్యము వచ్చేస్తూ ఉంటుంది. అంతమాత్రం చేత అయిపోయిందా? మళ్ళీ శిశుస్థితి ఉన్నది కదా! మళ్ళీ ఉదయం వస్తోందంటే మళ్ళీ శిశుస్థితి ఉన్నదని అర్థం. కాబట్టి నాలుగు బాహువులుగా మనకి రోజులో నాలుగు బహువులు కనిపిస్తాయి. నెలలో నాలుగు బహువులు అమావాస్య, శుక్లాష్టమి, పౌర్ణమి, కృష్ణాష్టమి మళ్ళీ అమావాస్య ఇట్లా నాలుగుగా మనకి గోచరిస్తుంది. అలాగే సంవత్సరంలో కూడా నాలుగు మనకి ఉత్తరాయణం తరువాత దక్షిణాయణం, మధ్యలో పగలు రాత్రి సమానంగా ఉండే రెండు రోజులు, చాలాసార్లు చెప్పుకున్నాం Equinoxes అంటాం. Equinoxes and Solstices నాలుగు. ఈ విధంగా నాలుగు బహువులుగా మనకి భగవంతుని యొక్క సృష్టి దర్శనం అవుతూ ఉంటుంది. మనలో కూడా దర్శనం అవుతుంది. మనం ఉన్న స్థితి నుండి మేల్కొంచిన స్థితి, అక్కడ నుంచి భావమయమైన స్థితి, అక్కడ నుండి మాటా, చేతా. నాలుగు స్థితులు! అదేవిధంగా మనం నాలుగు యుగములు కూడా చూసుకోవచ్చు. కృత, త్రేతా, ద్వాపర, కలి నాలుగు యుగములు. ఇట్లా నాలుగు నాలుగు నాలుగు నాలుగుగా కాలము యొక్క చక్రములు మీకు రోజు నుండి యుగం వరకు ఉన్నాయి. మహాయుగాల వరకూ ఉన్నాయి. అలాగే బ్రహ్మకి ఎన్ని తలకాయలని చెప్పారు? నాలుగు తలకాయలు. మూడు చెప్పచ్చుగా! నాలుగు ఎందుకు చెప్పారంటే నాలుగు స్థితులలో ఉందని చెప్పడం కోసం నాలుగు తలకాయలు ఉన్న బ్రహ్మ చతుర్ముఖుడు.

# ౭౯౭ చతుర్వ్యూహః

చతుర్వ్యూహములు ఏమిటి? అసలు ఉండడం అనే ఒక వ్యూహము ఉన్నది. వాసుదేవవ్యూహము! అది అవతరించడంగా ఉంటుంది. అప్పుడు మనం ఉన్నాం అనిపిస్తుంది మనకి. మొత్తం చైతన్యమే మొత్తం ప్రజ్ఞయే మనయందు ఉన్నప్పుడు మనం ఉన్నామని మనం అనుకుంటాం కానీ, మొత్తం ప్రజ్ఞ ఉండడమే మనంగా ఉంది తప్ప మనం వేరుగాలేము. కానీ మనం ఉన్నాం అనుకుంటాం. సముద్రమే అలగా ఉన్నప్పటికీ కూడా, అల తానొకటి ఉన్నట్లుగా మనకి గోచరించినట్లు, మొత్తం ఉన్నది ఒకటే అయినప్పటికీ ఎవరికి వారుగా ఉన్నాం అని అనుకుంటున్నామే అది ఇంకొక వ్యూహం. అసలు వ్యూహములో అందరూ కలిసి ఒకటిగానే ఉన్నారు-అది వాసుదేవవ్యూహము! అక్కడ నుండి నేనొకణ్ని ఉన్నాననే వ్యూహం, సంకర్షణవ్యూహం! అక్కడి నుండి ఎవడి తెలివి వాడిది, అది ప్రద్యుమ్నవ్యూహం! ఆ తెలివి కారణంగా వాడు ఇంద్రియాల్ని పట్టుకుని పనిచేస్తూ ఉంటాడు, అది అనిరుద్ధవ్యూహం! ఇలా నాలుగు వ్యూహాలు. ఈ నాలుగు వ్యూహాలు మనకి కపిలుడు దేవహూతికి చెప్పిన విషయాలు. వాసుదేవుడిలో మనం సంకర్షణులమై ఉండి మననుండి వ్యక్తమవుతున్న బుద్ధి ప్రకారం మనం పని చేస్తూ ఉంటాం. అంతే కదా! 'బుద్ధిఃకర్మానుసారిణి' అని మనం చెప్పకుంటూ ఉంటాం కదా! కాబట్టి ఎవరు ఏం చేస్తున్నా వాళ్ళ బుద్ధికి తోచిందే చేస్తున్నారు. వాళ్ళ బుద్ధికి తోచింది చేయడానికి కారణం ఏమిటంటే, వాళ్ళొకళ్ళు ఉన్నాం అనుకోవడం వలన. భగవంతుడి బుద్ధి పనిచేయాలనుకోండి, నాలుగు వ్యూహాల్లోనూ ఆయనవీ ఉన్నాయి, మనవీ ఉన్నాయి. ఆయన బుద్ధి పనిచేయాలనుకోండి, మనం ఏం చేయాలంటే, సంకర్షణవ్యూహం అనే కొట్టు మూసేసి, వాసుదేవవ్యూహంలో భాగంగా జీవించాలి. సమస్తమునందూ నిండి ఉన్న ప్రజ్ఞయే నాయందు కూడా నావలెనే ఉన్నది అని గుర్తున్న వాడు వాసుదేవవ్యూహంతో జోడింపబడతాడు లేక యోగము చెందుతాడు. అదే యోగం అంటే. ఇంక మరేం లేవు యోగాలు. వ్యక్తిగత ప్రజ్ఞను, విశ్వాత్మ ప్రజ్ఞతో unitary conscious ని universal conscious తో జోడించడం చేత దానికి ఉన్న తెలివి నీయందు భాసిస్తుంది. అదే మహాత్ముల యొక్క ప్రత్యేకత. వారు తామొకరు వేరుగా ఉన్నాం అనుకోకుండా మొత్తమే తనయందు తాము వలె భాసిస్తోంది తప్ప, ఉన్నది 'మొత్తం' తప్ప తాము కాదని, ఆ మొత్తంలోనే మిగతా వాళ్ళు కూడా వ్యక్తం అవుతున్నారనీ, అక్కడ కూడా అదే ఉందని గుర్తించి ఉంటారు. నేనూ, వీడూ అని ఉండదు. అదే చెప్తాడు శ్రీకృష్ణుడు అర్జునుడికి. నీకూ నాకూ ఒకటే చోట తేడా ఉంది, నాకు సమస్తమూ 'నేను' గానే దర్శనం ఇస్తూ ఉంటుంది. నీకు నువ్వు, ఇంకోళ్ళుగా దర్శనం ఇస్తూ ఉంటుంది, అందుచేత నీకు ఈ

జ్ఞానం అవగాహన అవడం లేదు కానీ, లేకపోతే నువ్వు కూడా తెలిసిన వాడివే అంటాడు. మహాత్ములందరూ ఒకటే అనుకుంటారు, అందరూ అదే ప్రజ్ఞలోంచి దిగివచ్చిన వాళ్ళు కాబట్టి తమతో సమానులే, కాకపోతే వారికి ఒక అజ్ఞానపు పొర, ఒక అవిద్య అనే పొర ఆవరించి ఉన్నది, ఆ పొర తీసేసుకోవడం కోసం అసలు గుర్తు తన గురించి ఏమిటో చెప్పడానికి దిగి వస్తాడు. అందుకని వాసుదేవవ్యూహమునందు జీవించి ఉండే వాడు తాను సంకర్షణవ్యూహం అని ప్రత్యేకంగా పెట్టుకోడు కాబట్టి, అంటే తానొకడు ఉన్నాడు, మిగతాదంతా వేరుగా ఉన్నది అనే భావన లేనివాడికి మొత్తము తనలోంచి పనిచేస్తూ ఉండడం చేత, మొత్తమునకు ఉన్న తెలివి అతని యందు భాసిస్తూ ఉంటుంది. ఆ విధంగా మహాత్ముల యొక్క బుద్ధి పనిచేస్తూ ఉంటుంది. దైవము యొక్క తెలివియే అతని తెలివిగా పనిచేస్తుంది. కార్యములు కూడా అట్లాగే నిర్వర్తింపబడతాయి. చతుర్మూర్తిః, చతుర్భుజః, చతుర్వ్యూహః, చతుర్గతిః. ఇవన్నీ ముందు మీకు పరిచయం చేస్తాను. తరువాత వివరణ చేసుకుందాం. ఎందుకంటే అసలు మొత్తం సాధన అంతా దాంట్లోనే ఉంది. ఇంకేం లేదు. ఇదొక పెద్ద తాళంచెవి. ఏ మహాత్ముడైనా ఈ తాళంచెవి విప్పుకుంటేనే సమస్తం వాడికి అవగాహన అవుతుంది గోళాల యొక్క నిర్మాణం రహస్యం కూడా ఇందులోనే ఉన్నది. అటువంటి విషయం ఇది.

## 798 చతుర్గతిః

నాలుగు గతులుగా జీవుడు తనని చేరుకోవడం కోసం నాలుగు మార్గాలు ఏర్పరచాడటండీ! నాలుగు మార్గాలుగా తానున్నాడుట. అందులో ఈ నాలుగుకీ ఉన్న జ్ఞానం ఏదైతే ఉందో దాన్ని 'సాంఖ్యము' అన్నారు. కపిలుడు దేవహూతికి అందించిన మొత్తం సాధన విధానం, అంతా కూడా ఈ నాలుగూ కలిపిన విషయం. భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములు ఎక్కడ ఉంటాయో అక్కడ మనిషి పూర్ణమైన ప్రజ్ఞగా ఏర్పడతాడనీ, మొదట భక్తి గురించి, తర్వాత యోగము, తర్వాత జ్ఞానము, తద్వారా వైరాగ్యమూ నాలుగూ ఆయన వివరించి తల్లికి ఇస్తాడు. ఈ నాలుగూ నాలుగు గతులుగా చెప్పారు. భక్తి ఒక మార్గం. ఇందులో ఏ ఒక్కటి కూడా మిగతా మూడిటినీ నేర్పుతాయి. భక్తి భక్తిగా అట్లా ఉండిపోవడమనేది వికాసం లేనప్పుడు జరుగుతుంది. భక్తి అంటే 'అసలు వారితో అనుసంధానం చెందడమే భక్తి' అని చెప్పారు. లేకపోతే అది విభక్తి అవుతుంది. తాను వేరు, సమస్తము మిగతాదంతా వేరుగా ఉన్నదనుకునే వాడు భక్తుడు కాడు. అసలు భక్తి, యోగము అంటే ఇందాక చెప్పినట్టుగా వ్యక్తిగతప్రజ్ఞని దైవప్రజ్ఞతో జోడించడం. అదెట్లా జోడించాలి? దానికి పద్ధతి ఉన్నది. దానికి సంబంధించిన యోగమూ ఉన్నది. అష్టాంగయోగము! క్రమమైన పద్ధతిలో తన్ను తాను ఉద్ధరించుకునే మార్గము అది. ఇది క్రమశః తనలో వృద్ధి పొందుతూ ఉంటే సహజంగా తనకి అబ్బేది వైరాగ్యం. వైరాగ్యము ఏర్పడుతుంది తన యందు ఇవి వృద్ధి పొందుతున్నకొద్దీ. వైరాగ్యం పేరున అవీ ఇవీ వదిలెయ్యటం కాదు. అవి మన్ని వదిలెయ్యాలి తప్ప మనం వాటిని వదిలెయ్యడం వైరాగ్యం అవదు. చాలా మంచి వాక్యం మాస్టరు గారు మనకిచ్చింది ఉన్నది. 'సన్యాసం వచ్చేది తప్ప పుచ్చుకునేది కాదు' అని చెప్పారు. పుచ్చుకునే సన్యాసులు సన్యాసుల్లాగా జీవిస్తారు. సన్యాసం వచ్చినవాడు ఉంటాడు వాడు చక్రవర్తిలాగా జీవిస్తాడు. వాడు యోగి. నీ చుట్టూ ఉండేవాళ్ళు అందరూ నిన్ను వదిలేసి పోవాలని నువ్వు అనుకోకూడదు. వారియందు నీ కర్తవ్యాలు నిర్వర్తిస్తుంటే, ఆ బాధ్యతలు నిర్వర్తింపబడడం ద్వారా నీవు మోక్షస్థితిని పొందడానికి నీకు అవకాశం ఏర్పడుతుంది. వైరాగ్యం వచ్చేది తప్ప పుచ్చుకునేది కాదు. సన్యాసం వచ్చేది తప్ప పుచ్చుకునేది కాదు. దానికి చేయవలసినది భగవంతునితో భావము నందు జోడింపబడి ఉండుట, అది యోగము! వికాసమునకై గ్రంథ పఠనము, పుణ్యక్షేత్ర దర్శనము, సత్పురుష సందర్శనము ఇటువంటివన్నీ కూడా చేసుకుంటూ ముందుకు సాగి వెళ్ళడం. నాలుగు రకాలుగా మనం ప్రయత్నం చేయాలని చెప్తాడు కపిలుడు. ఎందుకంటే భక్తి పేరున ఏదో మనకి తెలిసిందే సమస్తం అనుకుని, అట్లా మూఢత్వంలో జీవించడం ఒకటి

ఉంటుంది. ఏమాత్రం వైరాగ్యం ఉండదు. భక్తి పేరున మనకి కనిపించేది ఏమిటయ్యా అంటే మన పనులు చేసుకోవడానికి భగవంతుని పెట్టుబడిగా పెట్టుకోవడం అనేది ఒకటి ఏర్పడుతుంది. ఎన్నాళ్ళు పోయినా అంతే అది. ఓ పని అయిన తర్వాత ఇంకోటి ఉంటుంది, అది అయిన తర్వాత ఇంకోటి ఉంటుంది, అది అయిన తర్వాత ఇంకోటి ఉంటుంది. కోరికలున్నంతకాలం నీవు భక్తుడివి కాదు. కోరికల యందు నీకు భక్తి. అది కారణం చేత నువ్వు భగవంతుడిని ఆశ్రయించావు. నీకు పని ఉన్నది కాబట్టి ఆశ్రయించావు కానీ, పని లేక ఆశ్రయించావా? అందుకని భగవంతుడు అంటే ఏమిటయ్యా అంటే మన కోరికలకు అదొక magic lamp అనమాట. 'అల్లావుద్దీన్ అద్భుతదీపం' లాగా. మూడుసార్లు తోమితే వాడు ప్రత్యక్షమై ఏదో ఇస్తాడు కదా! అట్లాగే మనం 'నమస్కారం మాస్టర్ CVV' అని మూడుసార్లు అంటే ఆయన ఏదో మనకి ఇస్తాడని. ఆయన 'అట్లా నేను ఇవ్వను. వాటి కోసం అయితే ఇక్కడికి రాక. ఇంక ఎక్కడికన్నా వెళ్ళు. ఇక్కడ మాత్రం అది లేదు' అని చెప్పారు. 'నిన్ను నేను తోముదాం అనుకుంటున్నాను, నువ్వు నన్ను తోమక' అంటాడు ఆయన. కోరికలు లేని స్థితి- వాడు రాజు కన్నా ధనవంతుడు. కదా! రాజుకు కోరికలు ఉంటాయి. తీర్చుకోవడానికి కావలసిన సంపత్తి ఉన్నది. మంది మార్బలం అన్నీ ఉన్నాయి కదా! తీర్చుకుంటాడు. అన్నీ తీరకపోవచ్చు. తీరినా ఒకదాని తర్వాత ఒకటి, ఒకదాని తర్వాత ఒకటి సతాయిస్తూనే ఉంటాయి కదా! కోరిక లేని స్థితో? వాడూ చక్రవర్తి! ఎందుకంటే తనకేమీ అవసరం లేదనుకునే స్థితికి చేరిన వాడికి ఈ ప్రపంచంలో దేనికీ లొంగవలసిన అవసరం ఉండదు. రాజువలె జీవించవచ్చు. అందుకని భక్తి అనే నామాన్ని కొంత మనం సరిగ్గా అవగాహన చేసుకోలేదేమో ఈ కాలంలో అనిపిస్తూ ఉంటుంది. కానీ అది కూడా పర్వాలేదంటాడు భగవంతుడు. 'చతుర్విధ భక్తులున్నాయోయ్ ఎక్కడో అక్కడ మొదలుపెట్టనీ' అంటాడు. ఆర్తి కారణం చేత, ఏదో తీరని జబ్బు, ఏదో గురువుగారినో, గుడినో, గోపురాన్నో, మంత్రాన్నో నమ్ముకుంటే అవేవో బయట పడతాయనే నమ్మకం, అక్కడ నుండి అది బయటపడితే అందులోంచి విశ్వాసం, అక్కడ నుండి నెమ్మదిగా కోరికలు కోరుతున్నప్పటికీ జరక్కపోయినా ఆరాధన చేసే పద్ధతిలోకి వచ్చేస్తాడు. మనం అడిగినవన్నీ జరుగుతున్నాయా? కొన్ని జరుగుతాయి. కొన్ని జరగవు. జరగడం, జరక్కపోవడం నువ్వు చేసే ప్రార్థన బట్టి కాదు. కాలం బట్టి నువ్వు ఇదివరకు చేసినవి నీకు అందింపబడుతూ ఉంటాయి అనేది తెలుస్తుంది. వికాసం వస్తుంది. వికాసం రావాలంటే గ్రంథములు చదవాలి. మహాత్ముల యొక్క సంభాషణలు వినాలి. బోధనలు వినాలి. అందులోంచి వికాసం వస్తుంది. భగవంతుడనే ఒక దివ్యమైన శక్తి ఉన్నది, మనల్ని కాపాడుతుంది, మనకి కావాల్సింది చేసి పెడుతుంది అని అనుకోవడంలో తప్పులేదు. అది ముందు మనకి

తాయిలం లాగా పనిచేస్తుంది. Homework చేస్తే Chocolate ఇస్తా అన్నట్టుగా ఉంటుంది. Homework అలవాటు అయిపోయిన తర్వాత Chocolate ఇవ్వకపోయినా homework చేసుకుంటూ ఉంటాడు కదా! అట్లానే ఉద్ధరించుకుంటాను, నాలుగు రకాలుగా వస్తారు నా దగ్గరికి అని చెప్పాడు. ఏదైనా పరవాలేదు కానీ వికాసము చెందుతున్నామా లేదా అనేది ఇందులో ముఖ్యం. మనం ఏదో ఒక రకమైన పుస్తకాలు చదువుకుని ఇదే maximum ఇదే highest ఇంతకన్నా ఇంకేం లేదు అనే భావంలో ఉంటే, నీ బావిలో నువ్వు ఉండి కప్ప వలె అక్కడ నుండి ఆకాశం చూసి నీ బావియొక్క చట్రం ప్రకారం అంతే ఉంది ఆకాశం ఇంతకన్నా ఆకాశం లేదనుకుంటే ఎంత జ్ఞానమో, ఇదీ అంతే! అందుకని జ్ఞానానికి అంతులేదు. అది ఒక పక్కన అర్జించుకుంటూ ఉండాలి. అందుకని ఆర్యుడు అయిన వాడు దినచర్యలో భాగంగా స్వాధ్యాయం చెయ్యాలి అని చెప్పారు.

తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్:
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్ముని పుంగవమ్

మనకి రామాయణం మొదటే అసలు దానితో మొదలైంది. అంటే భగవంతుని యొక్క ఆరాధనతో పాటు స్వాధ్యాయం చేస్తుంటే వికాసం వస్తుంది బుద్ధికి. వికాసం రాకపోతే నీవు అట్లా మూఢుడివలె మిగిలిపోతావు. వికాసం వస్తున్న కొద్దీ పాత నమ్మకాలు జారిపోయి కొత్త నమ్మకాలు వస్తూ ఉంటాయి. అవి ఎట్లా ఉంటాయంటే ఒక కొమ్మ పట్టుకుని, ఆ కొమ్మ మీద కాలు పెట్టి పై కొమ్మ మీద చేయి పెడతాం, చేయి పెట్టిన తరువాత నెమ్మదిగా పై కొమ్మకి పాకిన తరువాత, కింద కొమ్మ మీంచి వదిలేశావా, వదిలేసి చేతులు ఎక్కడికి వెళతాయి? అంతకన్నా పైకొమ్మ మీదకి వెళతాయి. అంతేనా? ఈ కొమ్ము మీదనే ఉంటాయా? ఉంటే పైకెళ్ళిందేం లేదు కదా! కొబ్బరిచెట్టు ఎక్కడం, మామిడిచెట్టు ఎక్కడం, అసలు చెట్లెక్కడం, నిచ్చెనెక్కడం ఎక్కాలి కదా! నీకు ఉండే భావాల్లో నీకే పరిణితి చెందుతూ ఉండాలి. పాత నమ్మకాలు పోతూ ఉంటాయి. కొత్త నమ్మకాలు ఏర్పడుతూ ఉంటాయి. భగవంతుని యొక్క తత్త్వం ఎక్కువ తెలుస్తుంటుంది. దేనివలన? మహాత్ముల యొక్క బోధనలు వినడం వలన, లేక వారి నుంచి రచింపబడిన గ్రంథములు పఠిస్తుండడం వలన! అది దినచర్యలో ఒక భాగంగా చేసుకోమని చెప్పారు.

స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం

అన్నది తైత్తరీయోపనిషత్తు. నీకు తెలిసిందే నీ చుట్టూ ఉండేవాళ్ళు, నీ కుటుంబ సభ్యులు వాళ్ళుంటారే వాళ్ళకి చెప్పుకుంటూ ఉండమని చెప్పారు. ఎందుకో తెలుసా? వాళ్ళని ఉద్ధరించమని కాదు. నీకు తెలిసింది నీకు బాగా తెలియాలంటే నువ్వు చెప్పాలి. Teaching is a better way of learning అన్నారు. Through

teaching you learn. విష్ణుసహస్రనామం మనం వివరణ చేసుకుంటున్నాం అనుకోండి! చెప్పేవాడికి చాలా తెలుస్తూ ఉంటుంది. ఎందుకనీ? ఆ భావంలో ఓ గంట బతుకుతున్నాం కాబట్టి, నాలుగు నామాల గురించి మనం రకరకాలుగా అందులోంచి, దూదిలోంచి తకిలీ పెట్టి దారం తీసినట్లుగా వస్తూ ఉంటుంది. చెప్పకుంటూ ఉంటాం. ఈ  చెప్పేవాడు కూడా వినేవాడుగా ఉంటాడు. లేకపోతే తెలియదు. అందుకని నేర్చుకున్నది పాఠంగా చెప్తే చెప్పిన వాడికి పాఠం బాగా వాడి యందు స్థిరపడుతుంది. Demonstration is a better way of teaching అంటారు. Teaching is a process of learning అంటారు. చెప్పేవాడికి ఇట్లా చెప్పాలిగా, అందుకని ఏం చేశారంటే పెద్దలు తాము చదువుకున్నది తమ ఇంట్లో ఉండే సభ్యులకి, ఇట్లా ఉన్నది ఈ విషయం, చాలా అద్భుతంగా ఉన్నది, ఇలా ఇలా ఉంది అని వివరించుకుంటూ ఉంటే, వివరిస్తున్నప్పుడు వీడికి ఎక్కువ అర్థం అవుతుంది. అందుకని ప్రతిరోజూ కాస్తో కూస్తో ఏదో భగవద్గీత చదివేశాం అనుకోవద్దు, రామాయణం చదివేశాం అనుకోవద్దు, భాగవతం, భారతాది గ్రంథాలు చదివేయడం ఉండదు. చదువుతూ ఉండాలి. నీలో వికాసం పెరుగుతున్నకొద్దీ నీకు అందులో ఎక్కువ విషయాలు తెలుస్తూ ఉంటాయి అదే వాక్యంలో. అలా ఇందులో మనం నేర్చుకోవడం మొదలు పెడితే వికాసం వస్తుంది. Pythagorus అంతటివాడు మొట్టమొదట ఆయనకున్న విజ్ఞానం ఇక్కడే, కాశీ, పాటలీపుత్రం, తక్షశిల లో నేర్చుకుని, తిరిగి వెళ్ళిన తర్వాత ఇవంతా మన వాళ్ళకు చెప్పాలి, చెప్పడం వలన తనలో బలపడుతుందని కూడా ఒక నమ్మకం. ఎందుకంటే మరి ఇక్కడ తైత్తరీయోపనిషత్తు నేర్చుకున్నప్పుడు వాళ్ళు చెప్తారు కదా!

స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం

అని చెప్దామంటే ఒక్కడూ వినడు. ఊళ్ళోవాళ్ళెవరికీ దీని మీద శ్రద్ధ లేదు. ఒరేయ్ బోలెడు తెలుసుకొచ్చానురా, రండిరా చెప్తాను అంటే పోపోయస్ అంటారు వాళ్ళు. అప్పుడేం చేశాడంటే ఊళ్ళో గోళీకాయలు ఆడుకునే వాళ్ళని ఓ పదిమందిని, ఒరేయ్ మీకు రోజూ నేను ఓ గంటసేపు పాఠం చెప్తాను, రోజు పాఠం వింటే విన్నవాడికి పది రూపాయలు ఇస్తాను, గంటసేపు వింటే. అది చూడండి అట్లా ఎవ్వరూ చేయలేదు. ఇది ఒకటే మనకి ఒకే ఒక కథ ఉన్నది ఇట్లా చేసినవాడు. ఎంత మహాత్ముడు కాకపోతే అట్లా చేశాడు. పది రూపాయలు ఇస్తాడు కదా ఏదో ఒకటి చెప్తాడట పిచ్చోడు, వినేసి పది రూపాయలతో తరువాత మనం ఏదన్నా పని చేసుకోవచ్చు, కొనుక్కుతినొచ్చు అని పిల్లలు చేరతారు. పదిమంది పిల్లలు రోజూ పది రూపాయలు పెట్టుబడి. 100 రూపాయలు ఇచ్చి class చెప్పకునేవాడు ఆయన. చెప్తుంటే వాళ్ళు ఓ రెండు వారాలకి కొంచెం ఇదేదో బానే ఉంది ఈయన చెప్పేది అని వినడం మొదలుపెట్టారు. వినడం మొదలుపెడితే ఆయనేం చేశాడంటే ఓ

నెలరోజులు అయిన తరువాత ఒరేయ్ ఇవాళ నా దగ్గర 90 రూపాయలే ఉన్నాయి, మీ అందరికీ తొమ్మిది తొమ్మిది ఇస్తాను మరి అన్నాడు. పరవాలేదు సార్ అన్నారు. సర్దుకుంటాం తొమ్మిది ఇవ్వండి. తొమ్మిది చేశాడు. ఎనిమిది చేశాడు. ఏడు చేశాడు. సంవత్సరం అయ్యేసరికి నా దగ్గర డబ్బులు లేవు. మీకు ఇది విందామనిపిస్తే రండి. లేకపోతే లేదు. అంటే అలాగే అన్నారు. వాళ్ళు వచ్చి వినడం మొదలుపెట్టారు. వినడం మొదలు పెడితే, 'నా దగ్గర డబ్బులు లేవని చెప్పాను కదా! మీరందరూ రోజూ ఒక రూపాయి ఇస్తే చెప్తా' అన్నారు అంటే పెట్టుబడి పెట్టింది అంతా కూడా మళ్ళీ ఆ విధంగా recover చేసేశాడు ఆయన. అంటే ఆయనకి దీని మీద నమ్మకం అది. ఇది వింటే తప్పక జీవుడికి రుచి కలుగుతుంది ఇంక వాడెక్కడికి పోతాడు అని. అలా నేర్పాడాయన జ్ఞానం. ఆ తర్వాత చాలా మహాత్ముడు అయ్యాడు. ఎంత మహాత్ముడయ్యాడంటే దేశపురాజు తనకి సలహాదారుగా ఉండమని, తను చెప్పినట్టు వినమని నిర్బంధిస్తే, వినకపోవడం వలన చివరికి ఆయన, ఆయన శిష్యులు ఉండే ఇంటికి నిప్పంటించేశారు. నిప్పంటించేస్తే ఈయన ఏమయ్యాడో తెలియలేదు ఆ తరువాత. అదొక కథ. ఎందుకు చెప్తున్నాను ? అంటే ఎంతటి మహాత్ముడైనా సరే ప్రవచనం అనేది రోజూ చేసుకుంటూ ఉంటాడు. మాస్టరుగారు 30 సంవత్సరాలు రామాయణం, భారతం, భాగవతం ఇద్దరు వచ్చినా ముగ్గురు వచ్చినా కూడా చెప్పకుంటూండేవారు. నాకోసం చెప్పకుంటున్నాను మీకోసం కాదు అన్నారు. మీ చెవుల్లోంచి ఇటు దూరి అటు వెళ్ళిపోయినా పర్వాలేదు నేను చెప్పకోవలసిన నియమం నాకోటి ఉంది కాబట్టి చెప్పకుంటున్నాను అని 30 సంవత్సరాలు చెప్పారాయన. ఎందుకు చెప్పారంటే ఇందుకు చెప్పారు. ఎందుకంటే, లేకపోతే మనలో కూడా అవి ఇగిరిపోతాయి. ఎందుకు చెప్తున్నాను ఇదంతా? మనం దినచర్యలో భాగంగా ఆరాధన ఎంత చేస్తున్నామో అంతమాత్రంగానూ గ్రంథపఠనం చేయాలి. వివిధములైన వ్యాఖ్యానములు కూడా చదువుకోవచ్చు. రామాయణం చాలామంది రాశారు. ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క దర్శనం చేశారు. ఏదో ఒక దర్శనమే పట్టుకుని ఇదే సత్యం అనకూడదు. సత్యం వేయి రకాలుగా వ్యక్తమవుతూ ఉంటుంది. చదువుకోవడానికి పుస్తకాలకేమీ తక్కువ లేవు. ప్రపంచం నిండా ఉన్నాయి. ఒక్క భారతీయమే అనుకోనక్కర్లేదు. మరి ఇన్ని రకాలుగా సత్యం నిర్వర్తింపబడుతున్నప్పుడు దానికి సంబంధించిన మార్గములు, సాధనలు, అవి చేసిన వారి జీవితములు మనకి వివరింపబడుతున్నప్పుడు వాటియందు మనం నివసిస్తూ ఉండడం చేత, పఠనం ద్వారా మనలో వికాసం చాలా పెరుగుతుంది. వికాసం లేని భక్తుడు మూర్ఖుడై ఉండిపోతాడు. అందులో భాగంగా మనకి ఆరాధన బాగా పెరిగి, ఈ విధమైన వికాసం పెరిగి, ఏదో ఓ మార్గంలో మనం ప్రవేశించి, నన్ను నేను తెలుసుకోవాలనే

తపన పెరిగితే మార్గమును ఇచ్చే గురువు వస్తాడు. ఇచ్చే మార్గాన్ని 'యోగము' అంటారు. తన్ను తాను తెలుసుకోవడానికి ఈ మార్గం ఒకటి ఉన్నది. ఆ మార్గాన్ని అంతకు ముందు నడిచిన వాడు మనకి ఇస్తాడు. వాడే గురువు. ఈ మూడూ దగ్గర పెట్టుకుని మనం జీవితాన్ని నిర్వర్తించుకుంటూ ఉంటే, క్రమశః మనలో వైరాగ్యం రావాలి. మనకుండే పట్లు తగ్గాలి. పదేళ్ళు చేసినా, పాతికేళ్ళు చేసినా మన బట్టల మీద, మన పెట్టెల మీద, మన సామాన్ల మీద, మన తప్పేళాల మీద కూడా మనకి మోహం పోలేదనుకోండి! పోదు కదా! ఇంట్లో వుండే పాతవి బయట పారేయమంటే బయట పారేయగలిగిన వాళ్ళం ఎంతమందిమి ఉన్నాం? పనికిరానివైనా పాతిపెట్టి ఉంచుకుంటాం కదా! కొత్త చొక్కా కొనుక్కున్నప్పుడు పాత చొక్కా ఒకటి ఎవరికైనా ఇచ్చెయ్యగలవా? ఏమీ చేయలేం. ఎందుకంటే వైరాగ్యమనేది రాలేదుట అంటే, ఈ మూడిట్లో వృద్ధి లేదుట అని అర్థం. సహజంగా వస్తుంది అది. ఎందుకంటే నీకు సమస్తమూ అదే నిండి ఉన్నప్పుడు, దాని నుండే నీకు సమస్తం అందుతున్నప్పుడు, నీ దగ్గర ఉన్నది నలుగురికి పంచితే నీకు ఇంకా పెరుగుతుందనే సత్యము దర్శనం అవుతుంది. ఇస్తే వస్తుందని, ఒక వాక్యం ఒకటి ఉంది. నిర్వర్తించినవాడికి అది సత్యం. నిర్వర్తించనివాడికి అది అసత్యం. ఇస్తే వస్తుందన్నారు, ఇస్తే రాదేమో అని ఇస్తే రాకపోవచ్చు. ధైర్యంగా ఇచ్చెయ్యాలి. వస్తుందని ఆలోచించకుండా ఇచ్చేవాడికి వస్తుంది. అలా ఎన్నో కథలున్నాయి. చతుర్గతిః-నాలుగు గతులున్నాయి భగవంతుడిని చేరడానికి. ఈ నాలుగూ అలా ఒక పిరమిడ్ లాగా తయారై నిన్ను ఆత్మదర్శనానికి చేరువచేస్తాయి. మనకి మమకారాలు పోలేదుట అంటే మనం యోగంలో ముందుకి వెళ్ళాం అనుకోవడానికి వీల్లేదు. మమకారాలు పోలేదుట అంటే జ్ఞానం కలిగిందనుకోవడానికి వీల్లేదు. భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యములు కదా! అందుకని 'నేను నాలుగుగా ఉన్నాను, ఈ నాలుగుగా నన్ను నువ్వు అవగాహన చేసుకో. నీ యందు ఈ నాలుగూ ఉన్నాయి. అసలు నువ్వు ఏం పట్టుకుని వచ్చావని? నీ శరీరం కూడా వాడెవడో ఇస్తే వచ్చింది. ఆ తర్వాత నువ్వు సంపాదించుకున్నవన్నీ నీకు లేవు మొదట్లో. నువ్వు ఏర్పరచుకున్న కుటుంబం కూడా నీకు పాతికేళ్ళ తర్వాత వచ్చిందే కదా! ఏమిటో అలా మన చుట్టూ చేరుతూ ఉంటే వాటియందు మనం శాశ్వతత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేస్తుంటాం. అంతకుముందు ఏవి? అంతకుముందు లేనివి, మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళిపోతాయి. ప్రయాణం అంతే కదా! Godavari express ఇక్కడ ఎక్కాం అనుకోండి, అది ఇంకా ఆ shedలో ఉండగానే మనం compartment లో ఎక్కి కూర్చున్నాం అనుకోండి, ఎవరు ఉండరు మనమే. అంతే మనం బయటికొచ్చినప్పుడు కదా! నెమ్మదిగా అన్నదమ్ములని, స్నేహితులని, బంధువులని, ఆ తరువాత భార్య అని, పిల్లలు అని

ఇట్లా వస్తాయి కదా! వస్తూ ఉంటే నీకు నీ అసలు స్థితి ఏమిటి? వచ్చినప్పుడు ఎట్లా వచ్చావు? వెళ్ళేప్పుడు ఎట్లా వెళ్తావు? మధ్యలో వచ్చినవి మధ్యలో వెళ్ళిపోవా? వాటితోపాటు వెళ్తావా? అట్లా ఎవరైనా వెళ్ళారా? అనకాపల్లిలో ఎవడో ఎక్కాడు కదా! వాడు తునిలో దిగిపోతానంటే బాబ్బాబూ దిగబోక అంటే ఎట్లా? వాడు తునిలో దిగిపోవడం వాడి programme. అట్లా కాదు మనం కలిశాం కదా తునిలో దిగిపోతే ఎట్లా అంటే? అనంతమైన కాలంలో కొంతమంది కలుస్తూ వుంటారు, కొంతమంది విడిపోతూ ఉంటారు. ఎప్పుడు కలుస్తారు? ఎందుకు కలుస్తారు? ఎంతవరకు ఉంటారు? ఏం చెప్పలేం కదా!

వాయువశంబులై యెగసి, వాయుధరంబులు మింటను గూడుచుం
బాయుచు నుండు కైవడి భంగి, బ్రపంచము సర్వము గాలతంత్రమై
పాయుచు గూడుచుండు నొకభంగి జరింపదు కాలమన్నియుం
జేయుచు నుండు గాలము విచిత్రము దుస్తరమెట్టివారికిన్

అన్నాడు భీష్ముడు. ఎందుకంటే యుద్ధంలో, మొత్తం ఉన్న వాళ్ళంతా ఆయన తర్వాత పుట్టిన వాళ్ళే. ఆయన కళ్ళముందే చాలా మంది వెళ్ళిపోయారు. ఎందుకు కలుపుతుందో, ఎందుకు విడదీస్తుందో నీకేం తెలుసు? నీ పని నువ్వు చేయాలి తప్ప. ఇదే మనకి. మనం రైలులో వెళుతుంటే మనతో చేరిన ప్రయాణికులు మనతోపాటు చివరిదాకా రావాలనుకుంటే? వచ్చారు. Madras వరకు వెళ్తావు, Madras లో దిగిన తర్వాత వాడింటికి వాడు పోతాడా? నీ ఇంటికి వస్తాడా? నువ్వే ఎవళ్ళింటికో వెళుతున్నావు. వాడిని కూడా తీసుకెళ్ళలేవు కదా! వాడు ఎవళ్ళింటికో వెళ్ళడానికి వచ్చాడు. ఎక్కడ? ఎక్కడో అక్కడ విడిపడాలా? ఇక అంతేనా అది ముడి పడితే మరి విడిపడదా? మరది లేనప్పుడు ఏం లేదు. అందుకని వీటన్నిటికీ ఎక్కడంటే తూకం, వైరాగ్యం దగ్గర తూకం ఉంది. అన్నిటికన్నా మించిన పూర్ణ వైరాగ్య స్థితి ఏమిటయ్యా అంటే శరీరాన్ని వదిలెయ్యడానికి ఎప్పుడన్నా సిద్ధంగా ఉండటం. అంటే వాడికి, దేనిమీదా మోహం లేనివాడే. ఇంకా బతకాలి, బతక్కపోతే ఎట్లా? ఇట్లా అనుకోడు. బతకాలి అంటే అసలు బతకడం నువ్వు నిర్ణయం చేసుకు రాలేదు కదా! నువ్వు నిర్ణయం చేసుకొచ్చావా? నీకిచ్చారు. ఇచ్చింది ఎప్పుడైనా పట్టుకెళ్ళచ్చు. ఇచ్చింది ఇచ్చినంత కాలం దాన్ని సద్వినియోగం చేయడం తప్ప ఇంకోరకం లేదు కదా! ఈ లోపల నువ్వు జ్ఞాన సంపన్నుడవై, యోగమార్గంలో నీ స్థితి నువ్వు తెలుసుకున్నావనుకో, అప్పుడింక నీకు పుట్టుక, చావు లేకుండా చిరంజీవిగా, ముక్తుడవై జీవించే మార్గం ఒకటి ఉంది. ఇవన్నీ నాలుగు గతుల గురించి. భక్తి ఉంటుంది. జ్ఞానం ఉంటుంది. వైరాగ్యం ఉంటుంది, ఈ భక్తిలో భక్తి అంటే ఎక్కువ అర్థం శ్రద్ధ అని వస్తుంది. భక్తి పేరున మనకు ముందు భగవంతుడి గురించి ఉండే అభిప్రాయాలన్నీ మార్పు చెందుతాయి. నువ్వు

పరిణామ దశలో ముందుకు వెళుతున్న కొద్దీ మన definition of God ఒకటి ఉందే, నిర్వచనం, అదే శ్రీకృష్ణుడు భగవద్గీతలో అన్యదేవతారాధన చేసే వాళ్ళందరూ కూడా అనన్యస్థితికి చేరుకున్నప్పుడు భక్తి సిద్ధిస్తుంది అని చెప్తాడు. 'అనన్యాశ్చింతయంతోమాం' మనం రకరకాలుగా దేవుళ్ళని పెట్టుకుని ప్రార్థనలు చేసుకుంటున్నాం అనుకోండి! అది సత్యమే కొంతవరకు. పూర్ణసత్యం కాదు. ఎందుకంటే వాళ్ళు కూడా అందులోంచి వచ్చిన వాళ్ళే. వాళ్ళకీ పరిమితులు ఉన్నాయి. కాలపరిమితులూ ఉన్నాయి. కాలాన్ని అధిగమించి ఒకే ఒక తత్త్వం ఉన్నది. అక్కడ నుండి సమస్తమూ దిగి వచ్చింది కాబట్టి, నువ్వూ అక్కడ నుండే దిగి వచ్చావు కాబట్టి, నువ్వు వాడితో జోడించుకో. వాడితో యోగం చెందు. ఉంటే, నీకు ఇన్ని లోకాల్లో ఉండే వాళ్ళు సహకరిస్తారు. ముందు చతుర్మూర్తి-సత్యము, చైతన్యము, దాని వెలుగు, క్రియ. క్రియలో మాట కూడా ఒక క్రియే. చతుర్బాహు- నాలుగు కాలములుగా ఏర్పడినవాడు. చతుర్వ్యూహ, చతుర్గతిః

## 799 చతురాత్మా

ఈ మొత్తం ఏర్పడిన దానికన్నా ముందు ఉన్నదాని నుండి ఈ తత్త్వం అంతా ఏర్పడింది. దాన్ని పరమాత్మ అంటాం. అంటే సృష్టికి అవతల ఉన్న భగవంతుడు-ఆయన లోపలా ఉంటాడు, బయటా ఉంటాడట. సృష్టి లేనప్పుడు కూడా ఉంటాడట-ఆయన పరమాత్మ! సృష్టిలో ఉంటాడట-ఆయన విశ్వాత్మ! అక్కడ నుండి ఒక్కొక్కడిగా ఉంటాడట-వాడు ప్రత్యేకాత్మ! ఎంతమంది అయ్యారు? ముగ్గురయ్యారు అప్పటికి. పరమాత్మ, విశ్వాత్మ, ప్రత్యేకాత్మ. అక్కడ నుండి మనం అది కూడా మర్చిపోయి ఉంటాం చూశారా- క్షరపురుషుడనే వాడు. నలుగురు. నాలుగ్గా వాడే ఉన్నాడు.

## 800 చతుర్భావః

చతుర్భావములు. నాలుగు భావములు. నాలుగు భావములూ మన గురించి మనం చేసుకునే భావములే. మనలో ఈ నాలుగు భావములూ ఉన్నాయి. భావన చేత నాలుగు స్థితుల్లో కూడా మనం జీవించవచ్చు.

## 801 చతుర్వేదవిత్

నాలుగు వేదములు తెలిసినవాడు. నాలుగు వేదాలు మనలో కూడా ఉన్నాయి. ఎట్లా ఉన్నాయి నాలుగు వేదములు? మనలోంచి పుట్టిన సంకల్పము-ఋగ్వేదం. రకరకాలుగా సంకల్పాలు పుడుతుంటాయి కదా! ఇది చేద్దాం, అది చేద్దాం, అక్కడికెళ్దాం, ఇక్కడికెళ్దాం, వీడితో మాట్లాడదాం, వాడితో పోట్లాడదాం ఇటువంటివన్నీ వస్తూ ఉంటాయి కదా! లేకపోతే గుడికెళ్దాం, మంచిపని చేద్దాం, ఒక్కోసారి ఏదన్నా మంచి దీక్షపుచ్చుకుందాం అని వస్తుంటాయిగా? ఏదయినా సంకల్పం రావడమే కదా మంచికయినా చెడుకయినా. అది రాకపోతే పనిలేదు కదా! ఏ పనీ లేదు. అసలు సంకల్పమే మనలోంచి రాలేదనుకోండి! చేసేదేం ఉండదు. జడమల్లే ఉంటాం. దాన్ని ఋగ్వేదము అన్నారు. సృష్టి అట్లాగే వచ్చిందిట ఆయన సంకల్పంగా. లోపల నడుస్తుంటే అది కారణంగా అన్ని ఆవరణల్లోనూ ప్రాణప్రవృత్తులు పనిచేస్తూ ఉంటాయి. మనం భగవత్తత్త్వమే నేనున్నాను అనేటువంటి ఓ ప్రజ్ఞగా ఏర్పడి అక్కడ నుండి దానికో బుద్ధి, దానికి ఒక మనసు,

దానికి ఐదు ఇంద్రియములు మొత్తం ఎనిమిదిగా ఏర్పడిపోతాం తొమ్మిదిగా ఉన్నవి. మొత్తం పది అండీ! ఒక్కసారి గుర్తుపెట్టుకోండి. ఏమిటా పది అంటే? ఆ పదినే ఋగ్వేదంలో 'మండలము' అన్నారు. గుండ్రం గుండ్రంగా గీసి యంత్రాలు వాటితో ధ్యానాలు చేసుకోవడం అనే పద్ధతి ఉన్నది. అది మండలం అంటారు. ఆ మండల స్థితి ఏమిటయ్యా అంటే సృష్టికవ్వల ఉన్న ప్రజ్ఞ/ పరమాత్మ ఏదైతే అనిర్వచనీయము, అప్రతర్క్యము, అలక్ష్యము, దేని గురించి అయితే మనం మాట్లాడలేమో, ఎందులోంచి ఈ మొత్తం అంతా వచ్చింది? ఇట్లా చాలాసార్లు చెప్పకుంటూ ఉంటాం కదా! 'అది' అంటుంది ఉపనిషత్తు. 'తత్' అంటుంది. అదొకటి. దాన్నుండి సంకల్పం వ్యక్తం అయితే మళ్ళీ సంకల్పం లోకి అది దిగివస్తుంది అంటే సృష్టిలో ఉన్నది ఒకటి. దాన్నే దేవుడు అంటాం మనం. సృష్టికి అవతల ఉండే దేవుడితో పనేంలేదు మనకి. ఆయన అన్నిటిలోనూ ఉంటాడు. సృష్టిలో దేవుడుతోనే మనకి పని. ఎందుకంటే అన్నీ ఆయన అధీనంలో ఉంటాయి కాబట్టి, ఏదో కాస్త ఆయన్ని మనం మంచి చేసుకుందామని తాపత్రయం భక్తులకి. అది పది అయితే ఇది తొమ్మిది. అందరికీ తొమ్మిది అంకె కావాలి కదా Car number కి. ఎందుకని? సృష్టి మీద స్వామిత్వం ఉన్న ప్రజ్ఞ విశ్వాత్మ లేక సృష్టిలో భగవంతుడు లేక వెలుగు. అంతకుముందు వెలుగు ఎక్కడ నుండి వచ్చిందంటే అవ్యక్తంలోంచి వచ్చింది. వెలుగుకి ఆధారమైంది పది. వెలుగుగా వచ్చింది తొమ్మిది. అందులోంచి నువ్వొచ్చావు. నువ్వు అహంకారప్రజ్ఞ యనిమిద్ది. నీకో బుద్ధి-అది ఏడవది. ఇవన్నీ ఆవరణలే. నువ్వే అసలు ఒక ఆవరణ. విశ్వాత్మ చేతనానికి నువ్వొక ఆవరణ. మళ్ళీ నీకో బుద్ధి ఒక ఆవరణ-ఏడు. ఆరు-మనస్సు. ఐదు-నీలో ఉండే ఆకాశతత్త్వం. నాలుగు -నీలో ఉండే వాయుతత్త్వం. మూడు-నీలో ఉండే అగ్నితత్త్వం. రెండు-నీలో ఉండే జలతత్త్వం. ఒకటి-నీలో ఉండే పృథ్వీతత్త్వం. ఇవన్నీ ఆవరణలు. దేనికి? తొమ్మిదికి. తొమ్మిదికి ఎనిమిది ఆవరణలున్నాయి. ఈ ఎనిమిదిని 'అష్టప్రకృతులు' అన్నారు. ఈ మొత్తంలోనూ నీవున్నావు. ఎలా ఉన్నావంటే నాదస్వరూపంగా ఉన్నావు. దాన్నే 'ప్రణవం' అంటారు. నాదం ఉండడం చేత/ ఆ ప్రణవంలోంచి ప్రాణం ఉత్పత్తి జరిగి, ఈ మొత్తం ఎనిమిది ఆవరణలనీ నడిపిస్తోంది. అది లేకపోతే మొత్తంలోకి వెళ్ళిపోతుంది ఇది. సామవేదం ఆ విధంగా మనలో పనిచేస్తూ ఉంటుంది. సామవేదం మనలో ఉండే ఇన్ని ఆవరణలనూ కలిపి ఉంచి, నిర్వర్తిస్తోంది. అంటే విష్ణుచక్రం మనల్ని తిప్పతుందండీ! భూచక్రాలు, విష్ణుచక్రాలు కాలుస్తూ ఉంటాం కదా దీపావళికి. అది ఎన్ని చుట్టాలుంటాయి? అట్లాగే సూక్ష్మం నుండి స్థూలానికి చుట్టలు చుట్టలు చుట్టలుగా మనం ఉన్నదాంట్లో ఒక సూత్రం ఉన్నది. అదే ప్రాణం! అది ఎలా ఉంది నీలో అంటే ప్రణవముగా ఉన్నది. దాన్ని విన్నవాడు ఆ నిచ్చెన

పట్టుకుని ఎక్కి పోగలడు. ఆ తాడు పట్టుకుని పైకి ఎగపాకగలడు. అందుకే ఓంకారానికి ఆ విధమైన ప్రాముఖ్యత ఉంది. ఆ ఓంకారమే నీ స్పందనం ద్వారా మొత్తం అంతా నిర్వర్తిస్తోంది. ప్రాణప్రవృత్తులన్నిట్లో. అది మనలో సామవేదం. ఏదైనా ఒక సంకల్పం వచ్చినప్పుడు దాన్ని నిర్వర్తించడానికి ముందు, సంకల్పం రావాలన్నా ప్రాణం ఉండాలి కదా! అందుకని సంకల్పం ముందా? ప్రాణం ముందా? సామవేదం ముందా! ఋగ్వేదం ముందా? కొంతమంది సామవేదం ముందు, నువ్వుండబట్టి కదా నీకు సంకల్పం వచ్చింది, అంటారు. కొంతమంది అంటారు ఋగ్వేదం ముందు, నువ్వుండడం కూడా ఎవరో నిన్ను ఉచ్చరింపబడడం కదా! నువ్వు వచ్చావు, అంటారు. వీళ్ళిద్దరిలో ఎవరు ముందో తెలియదు. దాని గురించి చివరికి వాళ్ళేం నిర్ణయం చేశారంటే ఈ ఇద్దరిలో ఎవరు ముందో చర్చించుకోవడం అవివేకం, అని చెప్పారు. ఇది లేకపోతే అది లేదు. అది లేకపోతే ఇది లేదు. ప్రకృతి పురుషుడు, మిత్రా వరుణులు, విష్ణువు గరుత్మంతుడు ఇట్లా చెప్తారు. వాహనం లేకపోతే ఎక్కడికి వెళ్ళలేడు విష్ణుమూర్తి. విష్ణుమూర్తి లేకపోతే వాహనానికి పనిలేదు. ఇట్లా గరుత్మంతుడి గురించి మీరొక్కసారి భారతంలో మళ్ళీ ఓక్కసారి చదువుకోండి. గరుత్మంతుని కథ ఆదిపర్వంలో వస్తుంది. చాలా అద్భుతంగా ఉంటుంది. అమ్మో! గరుత్మంతుడు విష్ణుమూర్తి కన్నా గొప్పవాడేమో అనిపించేట్టుగా ఉంటుంది. గొప్పా కాదు, తక్కువా కాదు, సమానుడు. రాముడు-హనుమంతుడు. భక్తుడుగా ఆయన ఉన్నాడు తప్ప, చేసి పెట్టింది ఆయనకే ఈయన అంతా. రాముడికి హనుమంతుడి వల్ల పనిబడ్డది తప్ప, హనుమంతుడికి రాముడి వల్ల పనేం పడలేదు. మరి ఎవరు గొప్ప? ఎవరు తక్కువ? శివ-కేశవులు. అలా సామవేదము ఋగ్వేదము రెండూ మనలో పని చేస్తున్నాయి. సంకల్పాలు, దాన్ని నిర్వర్తించడానికి కావాల్సిన ప్రాణము. మూడవది యజుర్వేదము. ఏమిటది? ఒక సంకల్పం వస్తే ఆ సంకల్పాన్ని ఏ విధంగా నిర్వర్తించాలో దానికి కావలసిన ఒక స్పష్టమైన ప్రణాళిక వేయగలిగిన మేధస్సు. 'మేధాంమే ఇంద్రో దదాతు' అంటూ ఉంటాం కదా! అయన్నే ఇంద్రుడు అంటారు వేదంలో. ఇంద్రుడు సరిగ్గా లేకపోతే నీకెంత బ్రహ్మాండమైన ఆలోచన వచ్చినా నువ్వు దాన్ని నిర్వర్తించలేవు. గారెల కథ ఉంది కదా! గారెలు వండుకుంటే బావుంటుందనిపించిందిట ఆవిడకి. ఎట్లా వండుకోవాలో తెలియదు. కాబట్టి నువ్వు ఉన్నావు, నీకు గారెలు సంకల్పం వచ్చింది, అవి వండి తినాలి కదా! వండడానికి కావలసిన మేధస్సు ఉండాలి కదా! నీలో వచ్చిన సంకల్పానికి మేధస్సు ఏర్పరిచే దాన్ని 'యజుర్వేదము' అన్నారు. ఏదన్నా పని చేద్దాం అనుకుంటే ఎట్లా చేయాలని ఆలోచిస్తాం కదా! ఉద్యోగం కావాలి. ఎవరి కాళ్ళు పట్టుకోవాలి? అది కదా ఆలోచన. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుంటే దాంతో అయిపోయింది అది. ఆ route లో మనకి

కుదరలేదు. మనకి ఇంకో route ఉంటుంది. ఎవడ్ని పట్టుకోవాలి, ఎవరి చేత చెప్పించుకోవాలి, ఏదో ఒకటి మొత్తానికి ఆలోచించి ఒక ప్రణాళిక వేసి దాన్ని ఫలవంతం చేసుకోవడానికి కావలసిన మేధస్సు ఉన్నదే, అది నీలో యజుర్వేదంగా పనిచేస్తుంది. యజుర్వేదం బాగా పఠనం చేస్తే మేధస్సు ఆ విధంగా పెరుగుతుంది. ఋగ్వేదం బాగా పఠనం చేసుకుంటుంటే కొన్ని సూక్తాలు నీలో సంకల్పాలు మంచివి కలుగుతాయి, నిన్ను పాడు చేసేవి కలగకుండా. సామవేదం నీలో ప్రాణప్రవృత్తిని చక్కగా వృద్ధిపొందిస్తుంది. కొన్ని కొన్ని సూక్తాలు ప్రాణానికి మంచి శక్తినిచ్చి, స్వస్థతను చేకూర్చేవి ఉంటాయి. కొన్ని కొన్ని మేధస్సును పెంచేవి ఉంటాయి. కొన్ని కొన్ని సద్బుద్ధి ప్రసాదించేవి ఉంటాయి. ఇట్లా రకరకాలుగా ఉన్నాయి. అన్నీ ఒకటే అనుకోకూడదు. ఈ మూడు పెట్టుకుని ఏం చేస్తావు? ఏదో ఒకటి అక్కడ ఏర్పాటు చేస్తావు కదా! ఇల్లు కట్టుకోవాలండీ! ఆలోచన వచ్చింది. నువ్వున్నావు కాబట్టి వచ్చింది ఆలోచన. ఆ తరువాత దానికి గీతలు గీస్తావు. మన గీతలు బాలేవులే, ఏదన్నా మంచి Architect నో Engineer నో అడుగుదాం అనుకుంటాం కదా! అంతవరకు అయిందప్పటికి. ఏమయింది? ఇల్లు వచ్చిందా? ఈ మూడూ కనపడ్డవి కాదు కదా! లోపల జరిగేవే. ఇల్లు కదా కనపడేది. నాలుగవ స్థితిలో అది బయటపడుతుంది. అంటే నాలుగూ వేరు. అన్నీ నాలుగు నాలుగు నాలుగు. ఆ నాలుగవ దాన్ని అధర్వ అన్నారు. అధర్వ అంటే 'కిందిది' అని అర్థం. వేటికి కిందిది? ఈ మూడింటికీ కిందిది. ఆ మూడూ బావుంటే ఈ నాలుగవది automatic. ఆ మూడూ బావుండకపోతే ఈ నాలుగవది నాసిగా ఉంటుంది. అందుకని అధర్వణవేదానికి తెలిసినవాళ్ళు ఎక్కువ importance ఇవ్వరు. మీరు పురుషమేధం చదువుకుంటే అందులో విశ్వామిత్రుడు అధర్వణ వేదంలో ఉండే ఋక్కులు కొన్ని చదివి, ఇదంతా మనం బాగుచేద్దాం అంటే, ఋషులు నవ్వుతారు. అధర్వణవేదాన్ని ఆశ్రయించరు. ఎందుకనంటే జ్ఞానమార్గంలో, యోగమార్గంలో, సత్యమార్గంలో వెళ్ళేవాళ్ళందరూ కూడా సూక్ష్మమైనవాటిలో మార్పులు తెచ్చుకోవడం వల్ల భౌతికం బావుంటుంది. నీ ఆలోచనలు బావుంటే దానికి తగ్గట్టుగా అమరిక చేసుకోవచ్చు. అలా కాకపోతే అది కొంచెం తక్కువ తెలివి పనిగా చెప్తారు. అందుకని మనకి ఈ సమస్తంలో కనిపించేవి మొత్తం అంతా కూడా మూడు కనబడనవిగా ఉండి, ఒకటి కనిపించేదిగా ఉంటుంది. ఈ గోళాలు కూడా అట్లాగే ఉంటాయి. ఈ కనిపించే గోళానికి కనిపించని స్థితిలో ఒక గోళం తయారవుతూ ఉంటుంది. అంటే ఇంకా blueprint state లో ఉంటుంది. Blueprint కన్నా ముందు స్థితి ఏమిటి? భావమయలోకం. కదా! ఆలోచించిన తర్వాత కదా house plan మనం గీస్తాం కాగితం మీద. ఆలోచన లోకంలో ఒకటి ఉంటుందిట. అంతకు ముందు కేవలం అప్పడే పుట్టిన ఒక సంకల్పం. ఇంకా

ఆలోచన కూడా కాలా. అట్లా ఒకటి ఉంటుందిట. నాలుగవ స్థితిలో ఈ భూమి మీకు కనిపిస్తోంది. దీనికి ముందు మూడు స్థితులు ఉన్నాయి. అలాగే మళ్ళీ ఈ గోళం గనక దీని తర్వాత మళ్ళీ, అంతకుముందు స్థితిలోకి ఇది వెళుతుంది. ఇది చాలా, గోళముల విజ్ఞానం ఈ విధంగా మన వాఙ్మయంలో ఉన్నది Madam Blavatsky, Secret Doctrine లో చాలా చక్కగా వివరించి ఇచ్చింది. ఈ మన్వంతరాల కథలన్నీ కూడా ఈ గోళాలు ఏర్పడడం-గోళాలు మళ్ళీ కలిసిపోవడం. సూర్య మండలాలు ఏర్పడడం-కలిసి పోవడం. ఒకటి అయిపోతే అక్కడికి ఇంకోటి వస్తుంది. ఈ గోళం మళ్ళీ blueprint state లోకి వచ్చేసరికి, దీని ముందు blueprint లో ఉన్నది ఇక్కడ గోళంగా వస్తుంది. అంటే ఒకడు ఇల్లు ఖాళీ చేయగానే ఇంకోడు రావట్లా? శ్రాద్ధములు పెట్టే వాళ్ళకి బాగా తెలుస్తుంది. మూడు పిండాలు పెడతాం కదా! వసులోకం, రుద్రలోకం, ఆదిత్యలోకం మూడు లోకాలన్నూ, మన నాన్న, తాతయ్య, ముత్తాత ఉన్నారు. మనం నాలుగో వాళ్ళం. మనం ఇక్కడ కనబడుతున్నాం, వీళ్ళ ముగ్గురు అదృశ్యంగా ఉన్నారు అన్న భావన కలగచేయడానికి. ఆ పేర్లతో లేరు. ఆ జీవులు ఉన్నారు. కానీ మనం చేసే శ్రాద్ధకర్మ అంతా కూడా వసులోకప్రార్థన, రుద్రలోకప్రార్థన, ఆదిత్యలోకప్రార్థన ఇట్లా జరుగుతాయి. అలాగే నీకూ? నీకో కొడుకు, వాడికి కొడుకు, వాడికి కొడుకు కదా! మొత్తం ఎంతమంది అయ్యారు? ఏడు. నీకు ముందు ముగ్గురు, నీ తర్వాత ముగ్గురు, మధ్యలో నువ్వు. ఇప్పుడు నువ్వు పెట్టే మూడు పిండాల్లో ఓరోజు నువ్వు అందులో మొదటి పిండం అవుతావు. అంతేగా. నీ కొడుకు పిండాలు పెట్టేప్పుడు నువ్వు మొదటి పిండం అవుతావు. నీ మనవడు పిండం పెట్టేప్పుడు నువ్వు రెండవ పిండం అవుతావు. నీ మునిమనవడు పెడితే మూడవ పిండం అవుతావు. అక్కడినుంచి కలిసిపోతావు అట్లా. ఎందుకొచ్చాయి ఇవి? Three States before, Three states after, in between you are, that is the fourth state . అందుకనే మునిమనవడిని చూస్తే ఎన్నో వాడయ్యాడు వీడు? వాడి నుండి వీడు నాలుగవ వాడయ్యాడు. అంటే నువ్వు ఉదయంగా మొదలు పెట్టావు. నువ్వు మధ్యాహ్నం అయ్యే సరికి ఇంకోచోట ఉదయం వచ్చింది కదా! నువ్వు సాయంత్రం అయ్యేసరికి ఇంకోచోట ఉదయం, మధ్యాహ్నం వస్తాయి. నువ్వు అర్ధరాత్రి అయ్యేసరికి ఆ మూడు ఉంటాయి. అట్లాగే నువ్వు పెరుగుతున్నకొద్దీ నీ స్థానంలోకి ఇంకోడు వస్తూ ఉంటాడు. అది సృష్టిరహస్యం. అనుస్యూతం అంటారు. Continuity అంటారు. అట్లా అణువుల దగ్గర నుండి అటువంటి continuity ఉంది సృష్టిలో అని చెప్తారు. ఉండడం చేత నువ్వు తప్పకుంటే నీ చోట్లోకి నీ కొడుకు వచ్చాడు. నువ్వు retire అయిపోయి నీ కుర్చీలోకి ఇంకోడు వచ్చాడు. మనం దేనికో ఒక ఉద్యోగం చేస్తున్నామనుకోండీ! ఏదో MD దేనికో. MD గా retire

అయ్యారండి అంటారా? అయితే ఏమైంది ఆ కుర్చీ? ఇంకో MD వస్తాడు. కుర్చీ ఎప్పుడూ ఉంటుంది. MD కుర్చీ. ఎంతకాలం? ఆ company ఉన్నంతకాలం. సృష్టి Company ఉన్నంతకాలం కూడా అంతే. గోళాలు ఎప్పుడూ ఉంటాయి. గోళం మారితే గోళం వస్తుంది. గోళం మారితే మళ్ళీ గోళం వచ్చే లోపల ఆ గోళం మీద ఉండే జీవులు ఏమైపోవాలండీ? ఈ ఊళ్ళో మనుషులు ఉన్నారండీ! ఊరంతా ఖాళీ చేయండి మళ్ళీ ఈ రోడ్లన్నీ బాగా వేసి మీకు శుభ్రంగా ఇల్లు కట్టించి మళ్ళీ చేర్పిస్తాం అన్నారనుకోండి! ఈ లోపల ఈ మనుషులు ఎక్కడ ఉండాలి? మనకి అట్లా గోళం కథ ఒకటి, గోళం నుంచి మన్ని మార్పు చేసిన కథ ఒకటి ఉన్నది. ఒక గోళం నుండి ఈ గోళానికి రవాణా చేశారు. రవాణా చేసిన కథే మనకి వైవస్వతమనువు కథ. మనువుల కథలన్నీ కూడా సృష్టిలో జరిగిన మార్పులకి వాళ్ళు చేసిన, ఏర్పరిచిన నిచ్చెనలుగా కనిపిస్తాయి. ఏడుగురు మనువులు కదా మనకి. పద్నాలుగురు మనువులు. అందులో వాళ్ళు they are pairs of seven. ఏడే! ఏడు వారాలు. ఏడు లోకాలు. ఏడులో నాలుగు మనది. ఎన్ని ఉన్నాయి జాతులు మనకి చూసుకుంటే, ఎన్ని సామ్రాజ్యాలు ఉన్నాయి?

1- ఖనిజాలు ఉన్నాయి, 2- వృక్షాలు ఉన్నాయి, 3-జంతువులు ఉన్నాయి, మనం ఉన్నాం, నాలుగో వాళ్ళం. మనకే ఇదంతా. 5-వసువులు, 6-రుద్రులు, 7- ఆదిత్యులు. మనకి పైన మూడు ఉన్నాయి. మనకి కింద మూడు ఉన్నాయి. మనం మధ్యలో ఉన్నాం. మధ్యలో ఉన్నాం అని అనుకుంటున్నాం. కొంచెం కిందగానే ఉన్నామేమో. పశుప్రవృత్తి ఉండి మానవ శరీరంలో ఉన్నాం అనుకోండి. అదే కథని వాళ్ళు Bible లో Noah's Ark కథగా చెప్పారు. వాడు boat లో అందర్నీ ఎక్కించుకుని మగా, ఆడా, ఒక్కొక్క species ని తీసుకుని, అందులో పెట్టుకుని, 40 రోజులు పాటు ఏదో సముద్రంలో అట్లా వేళాడుతుంటే మళ్ళీ భూమి కనిపిస్తే మళ్ళీ చేరారంటారే, ఆ Noah's Ark కథ, మన వైవస్వతమనవు కథ, జీవుల మార్పిడి కథ. గుడారం ఎత్తేస్తున్నాం, ఇంకో గుడారంలో చేర్చేంతవరకు వీళ్ళని పట్టి ఉంచారన్నమాట. అవే జీవులు అక్కడ నుండి ఇక్కడికి వస్తున్నాయి. ఇక్కడ కొన్ని తరించిపోతూ ఉంటాయి. ఎన్ని తరాల జీవరాసులు ఇక్కడ తరించి వెళ్ళినాయో! ఏడు రకాల జాతులు తరించి వెళ్తూ ఉంటాయి. ఏడు క్లాసుల school అల్లే run అవుతూ ఉంటుంది మొత్తం. ఏడవ class అయిపోయిన వాడు వెళ్ళిపోతాడు. అంత మాత్రం చేత ఏమైంది? ఆరవ class లో వాళ్ళు ఏడవ class లోకి వచ్చి, ఐదు వాళ్ళు ఆరు లోకి వచ్చి, నాలుగు ఐదు లోకి వచ్చి, మూడు నాలుగులోకి వచ్చి, రెండు మూడు లోకి వచ్చి, ఒకటి రెండు లోకి వస్తే, ఒకటి లోకి ఎవరు వచ్చారూ? అంతకన్నా కింద వాళ్ళు వస్తారు. అట్లా జంతువులు మనుషుల్లోకి రావడం. ఇట్లా కథ నడుస్తూ ఉంటే, ఈ కథలో నీకన్నా ముందు ముగ్గురు ఉన్నారు. నీ తరువాత

ముగ్గురు ఉన్నారు. కాబట్టి నువ్వు ఆ సాంప్రదాయాలూ, ఆ సంస్కారాలు ఏవైతే నీకు నీ వాళ్ళు అందించారో అది నీ వాళ్ళకి నువ్వు అందించకుండా వెళ్తే నిన్ను దొంగ కింద లెక్క కడతారు అని చెప్తుంది మన వాఙ్మయం. నీ తండ్రి నీకు అప్ప చెప్పింది, నీ కొడుక్కు నువ్వు అప్ప చెప్పాలి. ఏమిటి? ఎక్కువగా ఏమనుకుంటాం అంటే ఆస్తి అనుకుంటాం. కాదు అందించాల్సింది, సంస్కారములు! సంస్కారములు అందించకుండా ఆస్తి అందిస్తే పాడైపోతారు తరువాత తరంలో. సందేహం లేదు. రూపాయి బిళ్ళ మీద మాస్టారు చెప్పిన పద్ధతిలో సంతకం పెట్టి రాసిస్తాను. సంస్కారములు లేక సంపద ఉంటే నాశనం. సంస్కారములు ఉండి సంపద లేకపోయినా అదే వస్తుంది. అందుకని నువ్వు ఏవేవైతే అందుకున్నావో అవి అన్నీ అందించి పోవాలనేది మన ఆర్యుల ధర్మంలో చాలా ముఖ్యమైన ధర్మం. 'ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః' అని ఒకటుంది. తంతు తెగ్గొట్టకురా, అందించి వెళ్ళు. నువ్వు office లో పని చేసేది office లో ఇంకోడికి నేర్పి వెళ్ళు. అంటే, ఎట్లా లంచాలు తీసుకోవాలని కాదు. Transfer అయిన officers పాపం మాట్లాడుకుంటారు వీడితో జాగ్రత్తగా ఉండు, వీడు కొంచెం litigant అని. మనం ఉద్యోగం చేసే చోట మనకి తెలిసిన విలువలు ఇంకోడికి నేర్పకుండా వెళితే, కాలం ద్వారా నేర్చుకున్న జ్ఞానం ఇంకోళ్ళకి అప్పచెప్పకుండా వెళ్ళావు కాబట్టి నువ్వు దొంగవి. మీ నాన్న నీకు చెప్పింది నీ కొడుక్కు నువ్వు చెప్పకపోతే నువ్వు దొంగవి. సంఘంలో నువ్వు చేసే పనులకి నీ తర్వాత ఇంకోడు చేయడానికి మనిషిని నువ్వు ఏర్పరచకుండా వెళ్ళిపోతే నువ్వు దొంగవి. నువ్వు continuity పెట్టలేదు కాబట్టి మళ్ళీ తిరిగి రావాలి. అదీ మనవాళ్ళు చెప్పింది. పుత్రుడు మంచివాడైతే తండ్రి ఉత్తమ లోకంలోకి వెళ్తాడని. శిష్యుడు శుభ్రమైన వాడైతే గురువుకి ఉత్తరగతులుంటాయి. కొడుకు మంచివాడైతే తండ్రికి ఉత్తరగతులుంటాయి. గురువుగారు శరీరం వదిలేశారనుకోండి! ఆయన తరువాత సన్యాసులు ఉన్నారనుకోండి అందులో శిష్యులు, వాళ్ళని అడుగుతారట, అక్కడ పనులు సరిగా జరగట్లేదు కదా! నువ్వెళ్ళి చూసుకుని ఎవరికన్నా సరిగ్గా అప్పచెప్పిరా అంటారు. Handing over లేకుండా వెళ్ళడానికి వీల్లేదు. ఉద్యోగం చేసేవాడు, ఎవరికో hand over చేసి, వాడు take over చేశాక, అప్పుడు వాడు అక్కడ నుండి వెళ్ళచ్చు. ఇక్కడ కూడా అంతే. నిజానికి ఇక్కడ అంతే కాబట్టి అవన్నీ వచ్చినాయి దీంట్లోంచి. ఇవే సూత్రాలు. అందుకని సూక్ష్మము నుంచి స్థూలానికి, స్థూలం నుంచి సూక్ష్మానికి మనం వెళుతూ ఉంటాం. అసలు సూక్ష్మంలోకి పోదామనుకుంటే స్థూలంలో ఇంకమరి మనమేమీ ముళ్ళుపడనివన్నీ చేసుకుంటూ వెళ్ళాలి మళ్ళీ. ఇట్లా మనకి ఈ గోళముల కథలు నాలుగుగా కనిపిస్తాయి. తరముల కథలు ఇట్లా మొత్తం ఏడులో నాలుగోవాడు, నాలుగు తరాలు అయ్యేసరికి ఏమవుతుందంటే నువ్వు మిట్టమధ్యాహ్నంగా

ఉన్నావనుకో మళ్ళీ మిట్టమధ్యాహ్నం రావాలంటే మూడు cover చేసుకుని రావాలి అక్కడికి. ఓ సాయంత్రం, ఒక అర్ధరాత్రి, ఒక ఉదయం. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే ఈ ఉదయం బావుండాలనుకోండి! ఈ ఉదయం బాగుండాలంటే రాత్రి ఎట్లా పడుకున్నాం అనేదాన్ని బట్టి ఉంటుంది. ఈ రాత్రి ఎట్లా పడుకున్నాం అనేదానికి కారణం ఏంటంటే అంతకుముందు సాయంత్రం ఏం చేశాం? ఏం తిన్నాం? దాన్ని బట్టి కదా రాత్రి నిద్ర. సాయంత్రం బావుండాలంటే అంతకు ముందు మధ్యాహ్నం ఏం చేశాం? ఇట్లా వెనక నుండి. అందుకని పాతది బావుండకపోతే ప్రస్తుతం బావుండదు. అంతమాత్రం చేత వదిలేస్తే ముందు కూడా బావుండదు. అక్కడ మన వాళ్ళు ఏం చెప్పారంటే, పాతది బావుండలేదనుకో చేసింది, అది ప్రస్తుతంలో బాగలేని స్థితిగా ఏర్పడుతుంది. అంత మాత్రం చేత నిస్పృహ చెందక, ప్రస్తుతంలో కొంత మంచి కూడా పెంపొందించుకుంటూ ఉండు. అది ముందుకు మంచిగా నీకు తారసిల్లుతుంది. If you want to have a better tomorrow, you try to make good today. ఇది చేసుకునే వాళ్ళందరికీ ముందు బావుంటుంది. మనం చూడండి ఎంతసేపూ వాడికి పూర్వజన్మ సుకృతం అంటూ ఉంటాం. పూర్వజన్మ సుకృతం అంటే? వచ్చే జన్మకి ఈ జన్మలో మంచి చేసుకుంటే పూర్వజన్మ సుకృతం అయింది కదా ఆ జన్మకి ఇది. హా.. వాడికి పూర్వజన్మ సుకృతం, అందుకని వాడికి అట్లా జరుగుతుంది, వాడి గొప్పేం లేదు అనిపిస్తుంది. గొప్ప లేకపోవడమేమిటి? నువ్వే చెప్తున్నావు కదా ముందు జన్మలోనే చేసేశాడు వాడు అని. నువ్వు ఈ జన్మలో కూడా చేయంది, వాడు ముందు జన్మలో చేశాడని నువ్వు తెలియకుండా ఒప్పుకుంటున్నావు కదా! అందుకని మనకేం చెప్పారంటే పురుషకారము అనేది అక్కడ వస్తుంది. అక్కడ 'విధి'కి వదిలేసిన వాడు చక్రంలో అట్లా నలుగుతూనే ఉంటాడు. పురుష ప్రయత్నం ఎక్కడయ్యా అంటే నీకు బావుండకపోయినా, నువ్వు ఇప్పుడు చేసేవి బావుంటే ముందు బావుంటుంది. బావుండనప్పుడు ఇంకా పాడు పనులు చేశామనుకోండి ఇంకా ,బావుండదు. మధ్యాహ్నం బాగా తిన్నాను 12 గారెలు. ఇప్పుడు బాలేదు. ఇప్పుడేం చేయాలి? ఈ పూటకి ఇంకేం మరి నోరు తెరవకూడదు దేనికీనూ. ఇప్పుడు మళ్ళీ ఇంకో 15 గారెలు వేసేశాను అనుకోండి! రేపు పొద్దున బావుంటుందా? బావుండదుగా! మనం చేసింది అదే! అంతా మన చేతుల్లో ఏం లేదండీ! మనం గారెలు తింటూనే ఉంటాం, ఆ కడుపునొప్పి అట్లా వస్తూనే ఉంటుంది, కర్మ అండీ దాన్ని మనం మార్చలేము, ఇంతకన్నా దరిద్రపు సిద్ధాంతం ఎక్కడా లేదు భూమ్మీద. అంటే కర్మ సిద్ధాంతాన్ని ఎంత బాగా తెలిసిన జాతో ఇది, అంత వక్రగతిని పట్టించిన జాతి కూడా ఇక్కడే ఉంది. అదే తమాషా ఇప్పుడు! వెలుగు కిందే ఉంటుంది చీకటి. ఎక్కడా ఉండదు కదా! దీపం కిందే చీకటి ఉంటుందిట. కలియుగంలో వెలుగు

కోసం ఎక్కడ వెతుకుతాడంటే, ఆ దీపం కిందే వెతుకుతాడట. ఇంకెక్కడ వెతికినా కనిపిస్తుంది వెలుగు, అక్కడే ఉండదు. కానీ అక్కడే వెతుకుతూ ఉంటాడుట. అదిట కలియుగం special. మనం కూడా అంతే. అందుకని ఇప్పుడు బాలేదు, బాగుండకపోతే? ముందు బావుండాలంటే ఏం చేయాలి? కడుపునొప్పి కడుపునొప్పిగానే ఉంది, నువ్వు తినే గారెలు తింటూనే ఉంటావు. అక్కడ పురుష ప్రయత్నం ఉన్నది. పురుష ప్రయత్నం కూడా అదే నిర్ణయం చేస్తుంది కదండీ, అంటాడు. చేయదు. ఎందుకంటే, 1/4 is conditioned. 3/4 is liberated. నీలో, నాలుగు భాగాలు చేసుకోండి తల, మొండెం, ఏదో ఆ మోకాళ్ళు, ఆ కిందభాగం అంతా నాలుగోది అనుకోండి, మోకాళ్ళ వరకు concrete వేసేశారనుకోండి మనకి, 1/4 conditioned, 3/4 freewill. దాన్ని నువ్వు నీ సంకల్ప బలాన్ని వినియోగం చేసుకోవడం బట్టి, ఈ పావలాకి లొంగిపోతావా? ఇంకా ముప్పావలా లొంగని స్థితి నీలో ఉంది కదా! దాన్ని వాడతావా? దాన్ని వాడాలంటే ఏం చేయాలి? అదే మనకు ఇచ్చిన సమస్తమైన జ్ఞానం. అందుకని మాస్టారు లాంటివాళ్ళు వచ్చినప్పుడు బాగా చీరేస్తారు కర్మ సిద్ధాంతాన్ని. ఎందుకంటే జాతి నిర్వీర్యం అయిపోయింది ఈ సిద్ధాంతంతో. పురుష ప్రయత్నమా? దైవానుగ్రహమా? రెండూ ఎవరియందు సమన్వయం చెందుతాయో అక్కడ సత్యం గోచరిస్తుంది. రూపాయి బిళ్ళ బొరుసా, బొమ్మా? నీ ప్రయత్నం నువ్వు చేసి, ఎంత బాగా చేయమన్నాడంటే బుద్ధుడు, అతి కాముకుడు ఒక ప్రేయసి కోసం ఎన్ని రకాలుగా భావించి ప్రయత్నం చేస్తాడో అట్లా చెయ్యమన్నాడు, కామం వద్దన్నాడు. అంటే అహర్నిశలూ కృషి చెయ్యమన్నాడు నిన్ను నువ్వు మెరుగుపరుచుకోవడం కోసం. చేస్తే ఏమవుతుందంటే పాతది నిన్ను తింటున్నా పావలాయే కదా తింటోంది. ఇంకో ముప్పావలా ఉన్నావుగా. ఈ ముప్పావలాతో బాగుచేసుకో. 'ప్రస్తుతమెప్పుడూ భూతములోకి జారిపోతోంది కదా' అని చెప్తాడు శ్రీకృష్ణుడు. ఉన్నది జారిపోతూ ఉంటుంది నువ్వేం చెయ్యకపోతే. అయిపోతుంది. శంకరాచార్యుల వారు చెప్తారు

బాలాస్తావతీ క్రీడాసక్తః తరుణస్తావత్తరుణీసక్తః
వృద్ధస్తావాచ్చింతాసక్తఃపరమే బ్రహ్మణి కో పి సక్తః

అప్పుడు కూడా ఏం చేయలేడు పాపం. ఎందుకంటే చెయ్యగలిగిన time లో ఏం చేయలేదు, చాలామంది retire అయిన తర్వాత పుస్తకాలు చదువుకుందాం అనుకుంటారు. Retire అయిన తర్వాత పుస్తకాలు చదువుకుంటే ఏడుపొస్తుంది. ఎందుకో తెలుసా? చిన్నప్పటి నుండి ఏం చెయ్యాల్సిందో చెప్తారు అందులో. ఇప్పుడు ఏం చేస్తాడు? చిన్నప్పటి నుండీ ఏం చేయాలో చెప్పిందంతా ఇప్పుడు చదువుకుంటే ఏడుపొస్తుంది ఎందుకంటే, వచ్చే జన్మకి గుర్తుండదు

ఎట్లాగూ. ఇప్పుడు చదువుకుంటే ఏమిటి అవుతాయి? ఇవన్నీ డబ్బులు పెట్టి కొన్నవే. చాలామంది పుస్తకాలు కొనుక్కోవాలని వస్తూ ఉంటారు. ప్రస్తుతానికి library లో పెడతానండీ, retire అయ్యాక చదువుకుంటా అంటే, ఆ పని చేయకండి, ఇప్పుడు చదువుకునేటట్టయితే కొనుక్కోండి అని చెప్తా. ఏం? అంటే retire అయిన తర్వాత చదువుకుంటే కళ్ళంబడి నీళ్ళొస్తాయి, ఏడవ సంవత్సరం నుండి ఉంది కార్యక్రమం, నువ్వు 70 వ సంవత్సరంలో మొదలుపెడతానంటే తెమలదు. అదే పాపం ఆయన చెప్పాడు. వృద్ధాప్యం వచ్చిన తర్వాత మిగిలేది చింతే తప్ప నీకిది దొరకదురా, ఎప్పుడూ నీకు దొరకదు, చిన్నప్పుడేమో ఆ.. చిన్నతనం కదా, యుక్తవయసులో చెప్తూ ఉండేవారు, ఈ వయసులో ఇప్పటి నుండీ వద్దమ్మా, అంటూ ఉంటారు. అంటే వాడెక్కడ బాగుపడిపోతాడో అని వాళ్ళ భయం. వాడు బాగా ముదిరి ఇక వాడికేమీ ఎక్కదు చూశారా, ఇహ అప్పుడు తోముతారు, అది చేస్తే బావుంటుంది కదా! రామాయణం చదవకూడదా అంటే, 40 ఏళ్ళు అడ్డగోలగా తిరిగిన వాడికి పుస్తకం చూస్తేనే డోకు వస్తుంది. చదవలేరు. అది ఉండాలి మొదట్నుంచీ. భూతము, భవిష్యత్తు, వర్తమానము మూడు కాలాలుగా దాంట్లో నుండి నీకు వచ్చేదంతా వస్తూ ఉంటుంది. ఈ మూడిటినీ నువ్వు ఇక్కడ arrest చేసి, ప్రస్తుతంలో you take a different route. దానికి నాకు బలం లేదు అని అనుకున్నావనుకో, బలం ఉన్నవాడి దగ్గర చేరు. 'సత్సంగత్వే నిస్సంగత్వం' అట్లా చేస్తున్న వాడి దగ్గర చేరితే అట్లా అవుతావు. చీట్లపేక ఆడే వాడి దగ్గర చేరితే, చీట్లపేకే ఆడదాం అనిపిస్తుంది కదా! ఇంకొంచెం ముదురువి వుంటాయి అక్కడి నుండి. ఎవరితో చేరితే వాడిలాగా అయిపోతావు. బలహీనుడయినవాడి చుట్టుపక్కల వాళ్ళు ఎట్లా వుంటే వాడితోపాటు అట్లా వుంటాడు. మంచి సంగంలో కూడా అట్లా అయిపోతావు కదా! ఎట్లాగో మనది వంచితే వంగే తత్త్వం. ఇట్లా వంగిపో. అందుకనే ఆయన చెప్పాడు. సత్సంగత్వం వల్ల నిస్సంగత్వం వస్తుంది తప్ప, నీకుగా నీకు నిస్సంగత్వం రాదు, ఎందుకంటే సంగంతో ఉన్న వాళ్ళందరితో తిరుగుతూ 'నిస్సంగత్వం నిస్సంగత్వం' అంటే వస్తుందా? చెప్పేది వైరాగ్యం, ఉన్నదంతా మమకారాలండీ! ఎక్కడ వస్తుంది నిస్సంగత్వం? ఇవన్నీ ఏవీ కాదన్నట్టుగా ఉండే వాడితో కలిసి జీవించావంటే వస్తుంది. అప్పుడు గానీ మోహం దిగదు. అప్పుడు గానీ తత్త్వం, నీలో ఉండే ప్రజ్ఞ నిశ్చలం అవదు. మనకి రోజుకోరకంగా ఉంటుంది కదా! ఎందుకుంటుందీ? నిశ్చలత్వం లేకేగా? కళాకళలు కదా మనవి. ఎందుకిన్ని కళలొస్తున్నాయి? నిశ్చలత్వం లేదు. నిశ్చలత్వం ఎందుకు లేదు? మోహం ఉంది. మోహం ఎందుకుంది? సంగం ఉంది. సంగం ఎందుకుంది? సత్సంగం లేదు. ఎన్నో చెప్పక్కర్లా. ఆయన పాపం నాలుగు ముక్కల్లో చెప్పారు. సత్సంగత్వం వల్ల నిస్సంగత్వం, నిస్సంగత్వం వల్ల నిర్మోహత్వం, నిర్మోహత్వం వల్ల నిశ్చలతత్త్వం.

నాలుగు. తెలిసినవాళ్ళని ఇట్లా నాలుగులో పెడతారండీ! Four steps to yoga అని ఒక కాగితం మీద రాసి ఇచ్చేయచ్చు. నువ్వేది కోరుకుంటున్నావో దాంట్లో నీకన్నా దిట్టగా ఉన్న వాడి దగ్గర నువ్వు combined study చేయి. మంచి మార్కులు వచ్చిన వాళ్ళతో కలిసి combined study చేస్తే మనకి కూడా వస్తాయి. వాడికేమవుతుందో తెలియదు. వాడు మనలోకొస్తాడో, మనం వాడిలోకెళ్తామో, వాడికెలాగూ మంచి మార్కులు రావడం రూఢిగా ఎప్పుడూ జరుగుతూ ఉందనుకోండి నిశ్చలంగా, మనం కూడా అక్కడ చేరితే మనకి ఏవో ఇంకో పది మార్కులు ఎక్కువ వస్తాయి. చక్కగా పఠనం చేసేవాడున్నాడనుకోండి, వాడి దగ్గర చేరి నేర్చుకో. శ్రద్ధగా పనిచేసే వాళ్ళు కొంతమంది ఉంటారు మనకన్నా. వాళ్ళ దగ్గరికెళ్తే నీకు కొంత శ్రద్ధ వస్తుంది. నీకు ఏది కావాలనుకుంటున్నావో అది నీకన్నా ఎక్కువగా ఉన్న వాడి దగ్గర చేరాలండీ! అస్సలు బొత్తిగా అదృష్టం లేదనుకోండి, మాష్టారు ఏం చేసేవారంటే చాలా అదృష్టం ఉన్న వాడితోటి కలిపేవారు వాడిని తీసుకెళ్ళి. ఏదన్నా కాస్త రాసుకుని పూసుకుని చేస్తే కాస్త అంటుతుందని. ఖచ్చితంగా అంటుతుంది. అంటుకట్టట్లా? కడుతున్నామా? అంటుకడితే వస్తోందిగా ఇంకోటి అందులోంచి. ఇది కూడా అంటుకట్టడమే! ఇప్పుడు ఇక్కడ కట్టుకోవాల్సిన అంటు ఏమిటయ్యా అంటే, భౌతికమే సత్యం అనుకునేవాళ్ళతో కలిసి బతికినంతకాలం జోగీ జోగీ తెగ రాసుకున్నట్టు ఉంటుంది. వాడి దగ్గరేం లేదు. వీడి దగ్గరేం లేదు. వీడు వాడు తెగ పూసుకుంటున్నారు. ఏమైందిరా అంటే ఏం కాలేదు, అంటారు. ఎందుకు పూసుకుంటున్నారురా అంటే ఏదో అట్టా పూసుకుంటున్నాం ఏమన్నా అవుతుందేమో అని. ఎప్పటికీ అవదు అది. ఎప్పుడవుతుందంటే అక్కడే పురుషోత్తమప్రాప్తి. ధర్మములు సూక్ష్మములుగా ఉంటాయి కాబట్టి, సూక్ష్మమైన ధర్మములు సృష్టిలో పని చేస్తున్న రీతి తెలిసిన వాడితో కలిసి జీవిస్తూ ఉంటే, వాడి యొక్క కనుసన్నలలో పెరుగుతూ ఉంటే, మనలో కూడా ఆ మార్పులు లోపల జరగడం వలన, బయట జీవితం క్రమశః మారుతుంది. లేకపోతే మారదు. అట్టాగే ఉంటుంది.

## 802 ఏకపాత్

One fourth గా కనిపిస్తున్నాడు. పాదము అంటే పావలా అని అర్థం సంస్కృతంలో. నాలుగు పాదాలు కదా గోవుకి. ఒక పాదం మీద నిలబడి ఉంటుంది కలియుగం అంతానూ. మిగతా మూడు పాదాలు లేవు పాపం గోవుకి. కత్తిరించేశాం. అది ఎలా నిలబడుతుందీ? అలాగే నిలబడిందిట ఏదో అట్టా అట్టా. దాన్ని కూడా పడేద్దాం అనే వాళ్ళు ఉన్నారు. ఏకపాత్ గా కనిపిస్తున్నది. అంటే కనబడుతున్నది ఒకటే పాదం, ఉన్నవి నాలుగు పాదాలు. ఎక్కడున్నాయి? ఇందులోనే ఇమిడియున్నాయి. నువ్వు దర్శనం చేస్తే, సూక్ష్మదర్శనాలు నీకు జరుగుతాయి. లేకపోతే నీకు లేదు. దేవతలు కొంతమందికున్నారు. ఎవరికీ? సూక్ష్మదర్శనం చేయగలిగిన వాళ్ళకి. లేనివాళ్ళకి లేరు. అసలు సూక్ష్మం ఉందా, లేదా? ఉన్నదని ఖచ్చితంగా రుజువు చేయచ్చు. ఎట్లా రుజువు చేయవచ్చు? నువ్వొక శుక్రకణంగా బయలుదేరినవాడివి ఇంత అయ్యావే! ఎట్లా అయ్యావు? సూక్ష్మం నుండి స్థూలంగా ఇది రాకపోతే ఇంత ఎద్దు స్వరూపం రాదు కదా! వస్తోందా? ఎద్దు శుక్రకణమైనా, మన శుక్రకణం అయినా అది శుక్రకణంగా ఉన్నప్పుడు మనకి తెలియదు అది దానిదో, దీనిదో కదా! రెండూ కణాలుగా ఉన్నప్పుడేం తెలీదు. విచ్చుకున్నప్పుడు? విత్తనాలు? విత్తనాలన్నీ ఒకటిగానే కనిపిస్తాయి. వేస్తే, అది అనుకున్నానమ్మా ఈ చెట్టు వచ్చింది అన్నట్టుగా ఉండదూ? సూక్ష్మం నుండి స్థూలం ఏర్పడుతుందని చెప్పడానికి పెద్ద విద్యేం కావాలండీ? నీలో, మాట్లాడక ముందు భావం ఉన్నదా? పరా, పశ్యంతి, మధ్యమా, వైఖరి. మన వైఖరికి ముందు మనలో భావం ఉంది. వైఖరి అంటే బయటికి మాట్లాడిన మాట. గొంతులోంచి వచ్చింది. గొంతులోంచి రాకముందు మాట ఉందా లేదా నీ దగ్గర? ఉండబట్టేగా వచ్చింది. లేకపోతే ఏం వస్తుంది? గాలి వస్తుంది. మరి భావం రాకముందు? ఇప్పుడే వచ్చింది idea అంటాడు కదా! ఒక సంకల్పం పుట్టి, సంకల్పానికి నువ్వు భాష ఏర్పరచి, భాష ద్వారా మాట్లాడుతున్నావు. సంకల్పం రాకముందు ఎక్కడుందది? నీలో నీలాగా ఉన్నది. నీలో నీలాగా ఉన్నది, నీలో ఇమిడి ఉన్నది, నీలోంచి వ్యక్తమై, అది భాష అందుకుని బయటికి వచ్చేసిందండీ! ఇది నాలుగు స్థితులు. మాట్లాడక పోయినంతమాత్రాన కొంతమందికి తెలుస్తుంది మొహం చూడంగానే, అమ్మా! వీడు మాట్లాడుతున్నది ఒకటి, వీడి భావం లోపలున్నది ఒకటి. చల్లకొొచ్చి ముంత దాచారంటారు చూశారా! మాట్లాడకుండానే మనం మాట్లాడుతున్నదేమిటో తెలుసుకునే వాళ్ళు, మనం మాట్లాడినా మనం మాట్లాడుతున్నది ఇది కానీ, వీడికి అసలు భావం ఇంకోటి అని తెలుసుకునేవాళ్ళు లేరా! ఉన్నారా? నీకింకా భావంగా పుట్టంది కూడా తెలుసుకునే

వాళ్ళున్నారు. నీలో ఇమిడి ఉన్నది చెప్తాడు. ఇలా ఉన్నావు కానీ 15 ఏళ్ళ తర్వాత నువ్వు ఇవన్నీ ఏం పట్టించుకోవు వదిలేస్తావు, అని చెప్తాడు వాడు. అప్పుడు మనం చచ్చినా ఒప్పకోం. కానీ వదిలేస్తావు ఆ time కి. వాడికెట్లా తెలిసిందీ? ఏది చూశాడు వాడు? సూక్ష్మాన్ని చూశాడు. నువ్వు స్థూలాన్ని చూసి 'ఇదీ' అనుకుంటున్నావు. ఈ స్థూలానికి ఆ సూక్ష్మం ఆధారంగా ఉన్నది. ఆవిరి నీరై, నీరు మంచు గడ్డ అవుతోంది కదా! ఇంతకన్నా ఏం కావాలి? అసలు నువ్వు ఎట్లా వచ్చావు ఇంత స్థూలంగా? అంతకుముందు ఎట్లా ఉన్నావు? అట్లా వెనక్కి వెనక్కి వెనక్కి వెళ్తే సూక్ష్మంలోకి వెళ్తావు. అందుకని శ్రీకృష్ణుడు 15వ అధ్యాయంలో చెప్పారు. పెద్దలందరూ కూడా, చాలా ముఖ్యమైన అధ్యాయం అని చెప్తాడు. ఏమిటి? 'ఈ కనబడుతున్న సృష్టికి వేళ్ళు పైన ఉన్నాయి. శాఖలు, రెమ్మలు, కొమ్మలు, ఆకులు ఇవన్నీ కిందకి వేళ్ళాడుతున్నాయి. అవీ ఇవీ జమిలిగా కలిసిపోయినాయి. నీకు కనపడవు సరిగా అర్థం చేసుకోకపోతే, సూక్ష్మంలోకి వెళ్ళాలి' అంటాడు. 'ఎక్కడుంటే అక్కడ నుండి సూక్ష్మంలోకి వెళ్ళిపొమ్మని చెప్తాడు అసంగం అనే అస్త్రంతో. అసంగం అనే అస్త్రం వాడుకుని ఈ స్థూలంలోంచి సూక్ష్మంలోకి వెళ్ళిపో, ఇవన్నీ నీకు అప్పుడు తెగిపోతాయి.' ఎట్లా తెగిపోతాయి? వీటన్నిటినీ తెంపుకోవడం కాదు. తెంపుకుంటే తెగిపోతాయి, అని చెప్పేవాడు వేదాంతి. అంటే ఆచరణలేని పండితుడు. ఇవన్నీ మనం తెంపుకోవాలండీ! అసంగం అనే అస్త్రం చెప్పాడు కృష్ణుడు, అది పెట్టి ఖండించుకుంటూ వెళ్ళిపోవాలి, అంటాడు. అసంగం అంటే రహస్యార్థం ఒకటి ఉన్నది. 'అ' తో సంగం చెయ్యమని. 'అ' తో సంగం చేస్తే అంతా 'అ' అయిపోతుంది. మిగతావి కనపడవు. 'అ' అంటే ఏమిటి? అంతకు ముందు దాంట్లో చెప్పాడు విభూతియోగంలో. అక్షరాల్లో 'అ' నేను అన్నాడు. నేను అనే అంతర్యామి ప్రజ్ఞ. దాంతో నువ్వు సంగం చేస్తే, సమస్తము ఆ ప్రజ్ఞగానే కనిపిస్తుంది. నీ కొడుకు, నీ కూతురు, నీ మొగుడు ఇట్లా కనిపించదు. అంతర్యామి ప్రజ్ఞయే నీమొగుడుగా కనిపిస్తున్నాడు. అంతర్యామి ప్రజ్ఞయే నీ కొడుకుగా కనిపిస్తున్నాడు. అంతర్యామి ప్రజ్ఞయే నీ కూతురుగా కనిపిస్తోంది. అంతర్యామి ప్రజ్ఞయే నీకు ఇష్టం లేనివాడుగా కూడా ఉన్నాడు. అదీ తమాషా. అదే అంటూ ఉండేవారు మాస్టర్ గారు. Problem ఏంటంటే మనకు ఇష్టం లేని వాడి రూపంలో కూడా వాడే ఉన్నాడని. కాబట్టి దాన్ని చూసి, నువ్వు దాంతో సంగమం చెందుతూ ఉంటే నీకు ఇది ఉండదు. అదే కదా నారదుడికి చరమ సందేశం, ఉపదేశం. తల్లిని చూడక, తల్లి రూపంలో ఉండే దేవుడిని చూడమని చెప్తారు గురువులు. అప్పుడు తల్లి బాధ అతనికి ఉండదు. ఎందుకుండదు? తల్లి గురించి నీకున్న అభిప్రాయములే నిన్ను బాధ పెడుతూ ఉంటాయి. శత్రువు గురించి నీకున్న అభిప్రాయం నిన్ను బాధ పెడుతూ ఉంటుంది. వాడెక్కడో ఉంటాడు పాపం. రోజా

నిన్నేం వేధించట్లేదు. ఎదురుగుండా కనబడట్లేదు. అయినప్పటికీ బాధపడ్డావే! దుర్యోధనుడు ఎంత బాధపడిపోయాడు? వాడెక్కడో అరణ్యంలో ఆకులు అలములు తింటుంటే వీడికి ఎందుకు వాడి గురించి బాధ. అంటే నీ అభిప్రాయమేగా నిన్ను బాధ పెడుతోంది. కాబట్టి నీకు, ఇతరులతో నువ్వు ఏర్పరచుకున్న ఇహలోక సంబంధమైన అభిప్రాయములు ఉంటాయే అవికాక, దాని వెనకాల ప్రజ్ఞగా భగవంతుడున్నాడు అనే భావన నీకు స్థిరపడ్డదనుకోండి అది అసంగం. అది ఉండడం చేత అక్కడ కూడా వాడే ఉన్నాడు కదా, వాడే చూసుకుంటాడు, ఇక్కడా వాడే ఉన్నాడు అక్కడా వాడే ఉన్నాడు. అదీ ధర్మరాజు! అందుకనే దుర్యోధనుడ్ని చూసినా వీడికి కోపం రాదు, blood pressure పెరగదు. ఎందుకు పెరగలేదంటే అసంగము. సంగము మనం అనుకున్న అభిప్రాయాలతో లేదు, దేనితో ఉందయ్యా అంటే అంతర్యామి ప్రజ్ఞతో ఉంది. అట్లా సమస్తమునందూ మనకిష్టం లేనివీ, మనకి కష్టంగా ఉన్నవీ, వాటిల్లో కూడా అదే ఉందని భావన చేసుకుంటూ వెళుతూ ఉంటే, నీకు అసంగము అనేది ప్రాప్తిస్తుంది. అసంగము అంటే 'అ' తో సంగమం. అన్నీ విరగ్గొట్టుకుంటే ఏం లేదండీ! ఉన్నదాంట్లో దాన్ని చూస్తూ ఉంటే మీ అభిప్రాయం మారుతుంది. భార్యగా చూడవు. భార్యగా చూస్తే ఏం చేశారు ఎక్కువ భారతీయులు? చీపురుకట్టగా వాడిన సన్నివేశాలు కూడా ఉన్నాయి. అప్పుడప్పుడు పాశ్చాత్య దేశాల్లో అంటూ ఉంటారు, ఈ liberation movements వచ్చినాయి కదా ఆడవాళ్ళకు అక్కడ. Indian women ఇంకా ఇవాల్టి వరకు కూడా doormat గానే ఉన్నారా అని అడుగుతారు. Doormat అంటే ఏమిటి? అంటే వచ్చేముందు కాళ్ళు రాసుకుని లోపలికొస్తాం కదా! భార్య అంటే ఏమిటి? భార్య రూపంలో ఉన్న ప్రజ్ఞ. కొడుకు రూపంలో ఉన్న ప్రజ్ఞ, తండ్రి రూపంలో, ఇట్లా చూడడం అనేది సూక్ష్మదర్శనం. మనం పెట్టుకున్న frame లో చూసినప్పుడు, దేవుడా దేవుడా అనుకోవడం, మిగతా అప్పుడు అంతా వదిలేయడం కాదు. అంతకన్నా సజీవమైన మూర్తులూ ఉన్నాయి కదా! మాస్టరుగారి పెద్ద ఉపదేశం అదే మనకి. సజీవమైన మూర్తులను ఆరాధించకుండా బొమ్మలు పెట్టుకుని, పటాలు పెట్టుకుని, విగ్రహాలు పెట్టుకుని ఏడ్చే వాళ్ళకి గతిలేదు అని చెప్పారు. చేసుకోండి అవి, కానీ ఇక్కడ మరిచి అక్కడ చేస్తే అక్కడేం పలకదు. విగ్రహం పలకదు. ఇక్కడ చేసి అక్కడ చేయండి పలుకుతుంది. ఇక్కడే పలుకుతుంది. ఇక్కడ చేసిందే. అక్కడ చేయకపోయినా పర్వాలేదు అని చెప్పారు. అది నిజమైన ఋషిప్రోక్తమైన మార్గము. నిజానికి మనకి మనుషులలో ఈర్ష్య, అసూయలు పెరిగిన తర్వాత విగ్రహారాధన వచ్చింది. అంతకు ముందు లేదు. అందరిలో దైవాన్ని చూస్తే మళ్ళీ ఇంకో బొమ్మ ఎందుకండీ దేవుడిది? ఈ బొమ్మలతో బతకలేక ఆ బొమ్మల్ని పెట్టుకుంటాం. ఎందుకంటే అదేం మాట్లాడదుగా! మనం చెప్పినవన్నీ వింటూ ఉంటుంది. అని అనుకుంటాం.

వింటుందో? లేదో? విన్నా వినకపోయినా మనం అనుకోవడమేగా! ఇవ్వో? ఈ బొమ్మలు. మనం ఒకటి చెప్తే అవి పది చెప్తాయి. మరి అక్కడుంది సాధన. అందుకని మాస్టరుగారు prayer కన్నా పదిమందికి సేవ చేయడం మంచిది అంటూండేవారు. సేవ చేయడం అంటే, సేవ చేస్తున్నాం అని గర్వంతో చేయడం కాదు. వాళ్ళలో భగవంతుడ్ని చూడడం. ఆయనెప్పుడూ అదే చూస్తుండేవారు. అసలు అదే భాగవతమార్గం. ఇది ఎందుకు చెప్తున్నానూ? సూక్ష్మలోకములలో ఆరాధన ఉండాలి. అన్నిటికన్నా సూక్ష్మమైనది, సూక్ష్మమైనవాటికి కూడా ఆధారభూతమైనది అంతర్యామితత్త్వం. దాని దర్శనం నుండి మిగతా మూడూ వస్తున్నాయి. దానియందు మనం ఆసక్తి చూపించినట్లయితే అన్ని విషయాల్లో కూడా మనలో మార్పులు రావడానికి వీలుంటుంది. అలాగే మనకు దేవతారాధనలు ఉన్నాయి. వెలుగులోకాలు ఉన్నాయి. అక్కడ నుండీ శబ్దలోకములు ఉన్నాయి. అక్కడ నుండి తత్త్వం ఉంది. ఈ కనబడుతున్నది అంతా కూడా 'light and sound show' అంటారు. శబ్దము, వెలుగు. కాబట్టి దీనికన్నా ముందుండే లోకంలో మీకు దేవతలు అన్నారు. దేవతలు అంటే ఏమిటి? దివి, అంటే వెలుగు. వెలుగు రూపములు. వెలుగులే రూపముగా ఏర్పడిన వాళ్ళు. ఈ కనబడుతున్న స్థూలమైన సృష్టి వెనకాల వెలుగు రూపాలున్నాయి. వెలుగు వెనకాల నాదరూపాలున్నాయి. వాళ్ళే గంధర్వులు! నారదుడు అది తెలిసినవాడు. గంధర్వగానం అంటే అది. ఏదీ? వెలుగు అయితే ఏదో చూస్తాం. వెలుగు రూపాలు. ఇక్కడ వినడమే ఉంటుంది. అందుకని ఈ formation కి ముందు వెలుగు రూపాలు, వెలుగు రూపాలకు ముందు శబ్దము, శబ్దానికి ముందు వీటన్నిటికీ పుట్టుక కలిగించినది. దానికేం పేరు పెట్టడానికి లేదు. అందుకని మనకు పూజల్లో వెలుగు, శబ్దము రెండూ ఇచ్చారు. శబ్దం చేస్తూ ఉంటాం కదా! శబ్దం అంటే సుశబ్దములు. స్తోత్రములన్నీ అవే. వెలుగు దీపాలు పెట్టుకుంటాం, కళగా అలంకారం చేసుకుంటాం, వెలుగు దర్శనం కోసం. వెలుగుతోనూ, శబ్దంతోనూ మనం బాగా అనుసంధానం పెంచుకుంటున్న కొద్దీ మన లోపలి శబ్దము, అంటే ప్రణవము అని చెప్పానే, అది బాగా బలం చేకూరి ప్రాణప్రవృత్తులు పెంచుతుంది. బాగా తయారు చేస్తుంది. స్వస్థత చేకూరుతుంది. సామవేదం బాగా పనిచేస్తూ ఉంటుంది. వెలుగులు బాగా పెరుగుతూ ఉంటే బుద్ధి ప్రచోదనం బాగా జరుగుతుంది. తద్వారా అవగాహన బాగా పెరుగుతూ ఉంటుంది. అక్కడ మార్పులు జరిగితే, ఇదే తోలుతిత్తి నుండి ఇంతకన్నా బాగా చేస్తాం. అక్కడ మార్పులు జరగక్కపోతే తోలుతిత్తి ఎంత బావున్నా ఉపయోగం లేదు. Car ఎంత బాగా ఉంటే ఏంటి? Driver ని బట్టి కదా car. అందుకని తోలేవాడివి నువ్వుగా ఉన్నప్పుడు, నీకు అసలు knowledge ఉంటే బాగా తోల్తావు. అట్లాగే ఈ శబ్దము,

వెలుగు. వీటిలోకి మనం పెరగాలి. ఊరికే ఈ కనబడే వాటిని గురించి ఎక్కువ తాపత్రయ పడవద్దు. ఈ కనపడే వాటికి ఆధారంగా ఉండే సూక్ష్మమైనవాటియందు ఎక్కువ లగ్నం చేసి, వాటిని మన యందు బాగా నింపుకుని ఉంటూ ఉంటే తద్వారా నీలో వచ్చిన మార్పు కారణంగా నువ్వు ముందుకు పోవడానికి వీలు పడుతుంది. ఆ మూడిటినీ స్థిరపరచుకో, ఈ నాలుగవది దాని ప్రకారం మారుతుంది. ఆ మూడు మార్చకుండా ఈ నాలుగు ఎంత మార్చినా ఉపయోగం లేదు. శరీరతత్త్వం మారాలన్నా కూడా ప్రవర్తన మారాలి. అప్పుడే శరీరతత్త్వం మారుతుంది. మనం ప్రవర్తన అంటే భావమయలోకంలోనూ, కోరికల రూపంలోనూ అక్కడ మార్పులు చేసుకోకుండా మనకిది మారాలంటే మారదు. ఇట్టాగే ఉంటుంది అది. మీరు ఈ దృష్టితో మాస్టరుగారి పుస్తకాలు చూసుకుంటే ఆయన ప్రతిచోటా వాటికి ప్రాధాన్యత ఇస్తారు. దీనికివ్వరు ప్రాధాన్యత. అందుకని చాలామంది మాస్టారూ ఒళ్ళుగా ఉందంటే, ఉంటే ఉందిలే, ఏం తింటున్నావు? అని అడిగేవారు ఆయన. తిండిలో కూడా ఆయనేం మార్పు చేసేవారంటే పెద్ద చేసేవారు కాదు. భావాల్లోకి వెళ్ళేవారు. అది తినడం మానేసి, ఇది తినడం మానేస్తే మొహం పీక్కుపోయి ఉంటుంది. ఆయన ఏం చేసేవారంటే సరే నువ్వు తినేవి మార్చక, శరీరం లావుగా ఉందని బాధపడక, నేను కొన్ని పనులు చెప్తాను అవి చెయ్యి, అనేవారు. సత్కార్యముల ద్వారా సద్భావనలు ఏర్పడి, అక్కడి నుండి శరీరంలో మార్పులు వచ్చిన సన్నివేశాలు ఉన్నాయి.

★★★★★★

# విష్ణు సహస్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు ‘భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట’ అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్ధ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్